# నార్ల వెంకటేశ్వరరావు సమగ్ర సాహిత్యం

(డిసెంబర్ 1, 1908 – 16 ఫిబ్రవరి )

## భాగం – 4



1. వేమన (మోనగ్రాఫ్) - 13 వ్యాసాలు
2. వేమన – పాశ్చాత్యులు – గ్రంథపరిచయం
3. వీరేశలింగం (మోనగ్రాఫ్) - 15 వ్యాసాలు
4. గురజాడ (మోనగ్రాఫ్) - 15 వ్యాసాలు
5. నవయుగాల బాట - 800 పైగా పద్యాలు
6. జగన్నాటకం( గీతాలు: గేయాలు)
7. మా ఊరు (కవితలు)

## విషయ సూచి

# వేమన



వి. ఆర్. నార్ల
అనువాదం : జి. లలిత

సమర్పితం
పండిత ప్రకాండుడు, ఉత్తమ రచయిత అపూర్వ స్నేహశీలి అయిన పండిత శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారికి.

## అనువాదాన్ని గూర్చి

నార్లవారు ఇంగ్లీషులో రచించిన వేమన ప్రతి ఇప్పటికి మూడు మారులు ముద్రితం. 1969వ సంవత్సరంలోని ప్రథమ ముద్రణమే ఈ అనువాదానికి ఆధారం. ప్రథమ ముద్రణకు, మలిముద్రణకు చిరుమార్పులుండడంచేత ఈ విషయాన్ని పేర్కొనవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

నార్లవారు ఇంగ్లీషులో తాము ఉదాహరించిన వేమన పద్యాలకు ఆకరాల్ని చూపలేదు. పరిశోధక విద్యార్థులకు, జిజ్ఞాసువులకు అది అవసరం గనుక, అనువాదంలో ఆకరాలు చూపపడ్డాయి.

వేమన పద్యసంకలనాలు అనేకమున్నా, వేమన పద్యాల్ని సమకూర్చి తొట్ట తొలుత అచ్చులో ఆవిష్కరించ మహనీయుడు సి.పి. బ్రౌన్. కనుక ఈ పుస్తకంలో ఉద్ధరింపబడిన వేమన పద్యాలకు ఆకరాలు సాధ్యమైనంతవరకు 1839 వ. సంకలనం నుండి చూపబడ్డాయి. అందులో లేని వానిని మాత్రమే, వావిళ్ళ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రతుల నుండి, ఒకటి రెండు పద్యాలు "వేమన్న వేదం" నుండి గ్రహింపబడ్డాయి. సి.పి. బ్రౌన్ 1839 నాటి సంకలనంలోని పద్యాలలో సవరణలు తక్కువ, యథాతథంగ గ్రహింపబడ్డాయి. అవే పద్యాలు వావిళ్ళ ప్రతిలో సవరింపబడిన పాఠాలతో ఉన్నవని గమనించాలి.

సంకేత వివరణ

1 వేమన పద్యాలు సి.పి. బ్రౌన్ 1839 నాటి సంకలనం... బ్రౌన్ 1839. పుట సంఖ్య. పద్య సంఖ్య.
2 వేమన పద్యాలు వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్స్ వారిచే ప్రకటితము... వావిళ్ళ ప్రతి. పుట సంఖ్య.
3 Verses of Vemana. A.P. Sahitya Akademi ... అకాడమీ ప్రతి. పద్య సంఖ్య.
4 వేమన్న వేదం: ఆరుద్ర ... వే. వే.

## ముందు మాట

సాహిత్య అకాడమీ వారికి వేమన జీవిత సంగ్రహాన్ని వ్రాసివ్వడానికి ఒప్పుకున్న తరువాత ఈ రచన కష్టసాధ్యమన్న విషయాన్ని గ్రహించాను. నా భీతి నిజమని నిరూపితమైంది. తెలుగులో వేమనకు సంబంధించిన పుస్తకాలు కొన్ని ఉన్నవనడం వాస్తవమే అయితే వాటిలో నమ్మరాని కట్టుకథలనేకం. నిరాధారాలైన జనశ్రుతుల్నే అవి యథార్థాలుగా చిత్రించాయి. ఇంగ్లీషులో కాని, ఇంకే ఇతర భాషలలో కాని వేమన జీవిత చరిత్రలేదు. వేమనను గూర్చి తెలుగులో ఒకే ఒక్క విమర్శనాత్మక జీవిత చరిత్ర వున్నది. అది కూడ సంతృప్తికరంగలేదు. ఆ గ్రంథకర్త తన అభిప్రాయాల కనుగుణమైన ఆధారాలను వెదకి ఆ పుస్తకంలో చొప్పించాడు. అందులో మరికొన్ని లోపాలు కూడా వున్నాయి. ఆ గ్రంథకర్త, పోయిన తరంలో సుప్రసిద్ధ రచయితయైన చిలకమర్తి లక్ష్మీనరసింహం వేమనను గూర్చి ఒక పుస్తకం రచించినట్లు తన ఆకరాలలో పేర్కొన్నాడు. అదొక గ్రంథమనుకొని, దానిని సంపాదించడానికి నానా అవస్థలు పడ్డాను. చివరకది పుస్తకం కాదని, చిలకమర్తివారు రచించింది ఒకానొక గాథల పుస్తకంలో చిన్న ప్రకరణం మాత్రమేనని తెలిసింది. మరొక విషయంలో కూడ ఆ గ్రంథకర్త సూచన నన్ను చాల ఇబ్బంది పెట్టింది. ఆ పుస్తకం ఒక సందర్భంలో మెక్లీన్ (Mr Maclean) అనే ఆయన చెప్పిన మాటల్ని పేర్కొన్నాడు. ఈ రచయిత ప్రస్తావించిన మెక్లీన్ అనే వ్యక్తి ఎవరో కారు. వేమనను గూర్చి 1866 వ సంవత్సరంలో ఒక వ్యాసాన్ని ప్రచురించిన మేజర్ ఆర్.యం. మ్యాక్ డొనాల్డ్ గారే (R.M. Macdonald) అని తెలుసుకోడానికి నాకు చాల నెలలు పట్టింది.

చరిత్రకారుణ్ణి అని చెప్పుకున్న మరొక తెలుగు రచయిత కూడ పెదదారినే పట్టించాడు. కొన్ని నెలల క్రితం ఆయన ప్రచురించిన ఒక పుస్తకంలో సర్ విలియం జోన్స్ వేమనను "భారతదేశపు ప్లేట్" (The Plato of India) అని ప్రశంసించినట్లు వ్రాశాడు. ఢిల్లీలోని లోక్ సభ గ్రంథాలయంలో ఈ వాక్యం కోసం జోన్స్ రచనలనన్నింటిని ఒక వారం రోజులు వెదికాను. ఫలితం శూన్యం. జోన్స్ గ్రంథావళికి విషయసూచిక లేనందు వలన ఎంతో శ్రమపడి వెదక వలసి వచ్చింది. ఆ తరువాత కలకత్తాలోని జాతీయ గ్రంథాలయాధికారులకు, ఏషియాటిక్ సొసైటీ వారికి ఈ విషయాన్ని గురించి వాకబు చేస్తూ వ్రాశాను. వెంటనే వారు వ్రాసిన ప్రత్యుత్తరాన్ని బట్టి సర్ విలియమ్స్ ప్లేటో అని పేర్కొన్నది వ్యాసుని గాని వేమనను కాదని తేలింది.

ఇలా వేమనకు సంబంధించిన పుస్తకాలు అంత ప్రామాణికాలు కావు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి వేమన ఉపన్యాసాలు మాత్రం దీనికి అపవాదు. అయితే రాళ్ళపల్లివారి వ్యాసాలు ఇప్పటికి నలభై ఏళ్ళ క్రితం ప్రకటింపబడినవి. అటు తరువాత పేర్కొనదగిన పుస్తకాలేమీ రాలేదు. ఇంగ్లీషులో కొన్ని మంచి రచనలున్నాయి. కాని అవి అందరికీ అందుబాటులో లేవు. ఉదాహరణకి: వేమనను గూర్చిన సర్.సి.ఆర్. రెడ్డిగారి రేడియో ప్రసంగం టేపు రూపంలోనే దొరుకుతుంది, ఆకాశవాణి కేంద్రంలో ఉద్యోగం చేస్తున్న నా మిత్రుడు శ్రీ దాశరథి సహాయంతోనే ఆ ప్రసంగపు టేపు ప్రతిని సంపాదించగలిగాను.
వేమనను గూర్చిన విషయ సేకరణ పూర్తిచేసిన తరువాత అదొక పరస్పర వ్యాఘాత విషయావృత కీకారణ్యంలా తోచింది. అందులో నుండి బయట పడటమన్నది మరీ దుర్భరమనిపించింది. వేమన జీవితానికి సంబంధించినంతవరకు నిశ్చయంగా తెలిసింది, తెలుసుకోగలది ఏమీ లేదని ఒప్పుకోక తప్పదు. వేమనను గూర్చిన అనేకాంశాలు వివాదగ్రస్త మైనవి. ఆయన శతకంలో ఉపయోగించిన "విశ్వదాభిరామ వినురవేమ" అన్న మకుటార్థం కూడ వివాదాస్పదమే. "విశ్వానికి అభిరాముడవైన వేమా! విను" అన్న అర్థాన్ని సామాన్యంగా అందరూ అంగీకరించినా పండితుల్లో అనేకులు తమ అభిమతానికి అనుగుణంగ ఆ మకుటాన్ని విశ్లేషించి వివిధంగా వ్యాఖ్యానిస్తారు. నేను సాధ్యమైనంతవరకు నిష్పాక్షికంగ వాస్తవాన్ని చెప్పడానికే ప్రయత్నించాను. ఈ రచన చేయడంలో నేనెంతవరకు సమదృష్టిని పాటించి సఫలీకృతుడనయ్యానో పాఠకులే నిర్ణయించాలి. విషయ సేకరణలో మిత్రులు శ్రీ దాశరథిగారి సాహాయ్యాన్ని ముందే పేర్కొన్నాను. ఇంకెందరో మిత్రులు కూడ నాకు తోడ్పడ్డారు. మదరాసులో "వాణి" ఉప సంపాదకులు శ్రీ డి.ఆంజనేయులుగారికి, యు.యస్.ఐ.యస్. లోని శ్రీ బి.యస్. ఆర్. కృష్ణగారికి, ఫ్రీడం ప్రెస్ అధినేతలు శ్రీ బాలసుందరంగారికి, నూజివీడులో శ్రీ యం. ఆర్. అప్పారావు యం.ఎల్.ఏ. గారికి, వేటపాలెంలోని సారస్వత నికేతన నిర్వాహకులు శ్రీ ఏ. శ్రీనివాసరావుగారికి, హైదరాబాదులోని ప్రొఫెసర్ నిడుదవోలు వేంకటరావుగారికి, ఘంటసాలలోని జి.వి. సుబ్బయ్య పండితులుగారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

వేమనను గూర్చిన విలీయం హోవార్డ్ క్యాంబెల్ (William Howard Campbell) వ్యాసప్రతిని సంపాదించి పెట్టడమే కాకుండ శ్రీ ఆంజనేయలుగారు నా వ్రాత ప్రతిలోని మొదటి నాలుగు ప్రకరణాలను చదివి, ఉపయుక్తమైన సూచనలనిచ్చారు. తిరుపతిలోని శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, శ్రీ ఆచంట జానకి రాంగారు కూడ వ్రాతప్రతిని చదివి సముచిత సలహాలనిచ్చారు. నా మిత్రుడు, సహోద్యోగి ఆంధ్రజ్యోతి ఉపసంపాదకులు అయిన శ్రీ నండూరి రామమోహనరావుగారు ఈ రచనలో నాకు అడుగడుగున తోడ్పడ్డారు ఆంధ్రజ్యోతి పత్రికా కార్యాలయంలోని శ్రీ యం.వి. సుబ్బారావుగారికి కూడ నేను కృతజ్ఞుణ్ణి, వీరందరికి నా హార్దికాభివందనాలు.

చివరిమాటగా వేమనకు నేనెంత ఋణపడివున్నానో చెప్పుకోవాలి. వేమన వలన ప్రభావితుడనైన నేను ఆయన పరిపూర్ణంగా రూపుదిద్దిన ఆటవెలది ఛందస్సులో ఇప్పటికి ఆరువందల పద్యాలను రచించాను. వేమన ఋణాన్ని ఈ పుస్తకరూపంలో లేశమాత్రం తీర్చగలుగుతున్నాను.

*వి.ఆర్. నార్ల*

## గిట్టడానికి పుట్టలేదు
## నీవు చావడానికే పుట్టలేదు - కీట్స్

ఏ ప్రమాణాలతో పరిశీలించినా వేమన మహాకవి అన్నది పరమ సత్యం. ప్రజాభిమానాన్ని, ప్రసిద్ధిని బట్టి చూచినపుడు ప్రాచీనాధునికాంధ్ర కవులందరిలో వేమనను మించిన మేటికవి లేడు. వేమనకున్న ప్రసిద్ధి ప్రచారాలలో సగం కూడ మధుర కవియైన పోతనకు లేవు. ప్రజల్లో పట్టంలేని ప్రభువు వేమన. అసంఖ్యాక ప్రజానీకంతో, ప్రజలభాషలో మాట్లాడిన ప్రజాకవి వేమన. కనుకనే సామాన్య ప్రజ తమ హృదయాలను వేమనకు అర్పించారు. అప్పుడప్పుడు వేమన వాక్పారుష్యాన్ని తట్టుకోలేకపోయినా, అతని చిత్తశుద్ధివారికి తెలుసు. కాబట్టి వేమనను అధికంగ అభిమానించారు. వేమనను కవిగా అభిమానించడమేగాక ఒక దార్శనికునిగ, వేదాంతిగ కూడ గౌరవించారు. ఒక నీతిని నొక్కి చెప్పడానికో, ఒక సత్యాన్ని విశదీకరించడానికో, లేదా ఒక విషయాన్ని బలపరచడానికో వేమన వాక్కుల్ని తరచూ ఉదాహరిస్తుంటారు. భారతీయ భాషా సాహిత్యాల అధ్యయనానికి తన జీవితాన్నంతా వెచ్చించిన విదేశీ విద్వాంసుడైన జి.వి. గ్రియర్సన్ వేమనను గూర్చి: “నేటి తెలుగు కవులందరిలో అత్యంత ప్రసిద్ధిని పొందిన కవి వేమన. వేమనకు ఆపాదింపబడని సామెతగాని, సూక్తిగాని ఉండడం చాల అరుదు” అని అభిప్రాయపడడంలో ఆశ్చర్యం లేదు.

వేమన కీర్తి ప్రాభవాలు కేవలం ఆంధ్రదేశంలోని ప్రజాసామాన్యానికి మాత్రమే పరిమితం కాదు. ఇరుగు పొరుగు ప్రాంతాలకు కూడ అతని కీర్తి వ్యాపించింది. చాల కాలం క్రితమే వేమన పద్యాలు తమిళ కర్ణాటక భాషల్లోకి అనువదింపబడ్డాయి. ఇతర భాషల్లోకి అనువదింపబడిన తెలుగు కవితలలో వేమన కవిత ప్రథమం కాకపోవచ్చు. కాని బహుభాషలలోకి అనువదింపబడిన కవిత గల తెలుగు కవులలో వేమనను మించిన కవి లేడు.
అయినప్పటికి ఆంధ్ర పండిత లోకం వేమనను ఒక ప్రామాణిక కవిగ శతాబ్దపు తొలి పాదం వరకు గుర్తించలేదు. అంతవరకు ఏ ఆంధ్ర కవిగాని పండితుడుగాని, వాఙ్మయచరిత్రకారుడుగాని వేమనను గూర్చి ప్రస్తావించలేదు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రకారులలో ప్రథములైన గురజాడ శ్రీ రామమూర్తి, కందుకూరి వీరేశలింగం తమ వాఙ్మయ చరిత్ర గ్రంథాలలో వేమనను పేర్కొనకపోవడమే సముచితమని భావించారు. శ్రీరామమూర్తి గ్రంథంకన్న వీరేశలింగంగారు 1899వ సంవత్సరంలో ప్రచురించిన ఆంధ్ర కవుల చరిత్ర కొంత వరకు సమగ్రమైనది. అందులో వేమనకు స్థానం లేదు. ఆ గ్రంథానికి 1917 వ సంవత్సరంలో వెలువడిన ద్వితీయ ముద్రణలో మొత్తం 220 మంది కవుల వేమనకు మాత్రం ప్రయత్నపూర్వకంగానే స్థానం కల్పింపబడలేదు.

శ్రీ రామమూర్తి, వీరేశలింగాలకన్న పూర్వమే 1829వ సంవత్సరంలో కావలి వేంకటరామస్వామి (Biographical Sketches of the Deccan Poets) అన్న పుస్తకాన్ని ప్రకటించాడు. తన పుస్తకాన్ని గూర్చి వేంకటరామస్వామి: "దక్షిణ భారతదేశంలో వివిధ ప్రాంతాలలో ఆయా కాలాలలో వర్ధిల్లిన ప్రాచీనార్వాచీన ప్రసిద్ధ కవుల జీవిత చరిత్రలు ప్రామాణికమైన ఆధారాలతో రచింపబడిన గ్రంథమిది" అని చాటాడు. ఆంధ్రుడైన ఒక రచయిత ఇంగ్లీషు భాషలో రచించిన ఈ గ్రంథంలో ఆంధ్ర కవులపట్ల పక్షపాతం చూపడం సహజమే. ఈ గ్రంథంలో మొత్తం నూటఎనిమిదిమంది చరిత్రలున్నవి. అందులో నలభై ఏడుగురు తెలుగు కవులు.

ఈ నలభై ఏడుగురిలో వేమన మాత్రం లేడు. వేమన భాష నిర్జీవమైనదై. శైలి నారికేళపాకమై, భావాలు కాలదోషానికి పాల్పడి వున్నట్లయితే విస్మరించడంలో అర్థమున్నది. కాని వాస్తవం తద్భిన్నగ ఉన్నది. వేమన భాష స్వచ్ఛమైనది; వాడి గలది; శైలి సరళం, సాటిలేనిది; ఆయన ఉపమలు, పోలికలు సహజంగ, సరిక్రొత్తగ, గంభీరంగా, వియత్తలాన్నంతా

వెలిగించే మెరుపు తీగల్లాగ ఉంటాయి. కొన్ని విషయాలను గూర్చి ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు అతని కాలాన్నే కాక ఆధునిక కాలాన్ని కూడ అధిగమించి ఉన్నాయి. ఉత్తమ కవిత్వముండవలసినట్లే వేమన కవిత ప్రతిభాన్వితం; ఉటంకింపదగినది. జేమ్స్ ప్రభువు కాలంలో అనువదింపబడిన బైబిలు, షేక్స్ పియర్ రచించిన నాటకాలు ఇంగ్లీషు భాషను అపూర్వంగా సహస్రాధిక జాతీయాలతో, పదబంధాలతో సుసంపన్నం చేశాయి. అలాగే తెలుగు భాష కూడ వేమనకెంతో ఋణపడి ఉన్నది. తెలుగు భాషకొక కొత్త వాడిని, శక్తిని వేమన ప్రసాదించాడు. అటువంటప్పుడు ఆంధ్ర సాహిత్య వేత్తలెందుకు ఇన్నితరాలుగ వేమనపట్ల వైముఖ్యాన్ని, ఉదాసీనతను, మౌనాన్ని పంతంపట్టినట్లు ప్రదర్శించారు? ఇదొక సూటి ప్రశ్న. సూటి ప్రశ్నకు సమాధానం కూడ సూటిగా, నిర్మొహమాటంగా ఉండాలి.

ఇందుకు మొదటి కారణం: వేదాలను, వేదాలు ప్రబోధించే కర్మకాండను, పురాణాలను, పురాణపురుషుల్ని, ధర్మశాస్త్రాలను, వాటిలోని అసమానమైన సామాజిక న్యాయాలను మొత్తం మీద దైవ ప్రేరితం, నిత్యసత్యవచో భరితం అనబడే మతగ్రంథాలనన్నింటిని వేమన విమర్శించాడు. విగ్రహారాధనను పూర్తిగా ఖండించాడు. విగ్రహారాధనను సమర్థించే వారిపట్ల అసహనాన్ని వెల్లడించాడు. వేమన సాంఘిక విప్లవకారుడు. వర్ణవ్యవస్థవాదులతో నిరంతర పోరాటాన్ని కొనసాగించాడు. సమాజంలో సాటి మానవుని అంటరానివానిగా చూడడం ఘోరాపరాధమని, అంటరానితనాన్ని వేమన తీవ్రంగ ప్రతిఘటించాడు. ఈ కారణాలవల్ల సనాతనుల దృష్టిలో వేమన ఒక పాషండుడు; నాస్తికుడు, మత భ్రష్టుడు. అట్టి వ్యక్తి నామాన్ని ఉచ్చరించడమే వారికి మహాపాతకం.

రెండవ కారణం: వేమన శైవుడయినప్పటికీ లింగధారణ, ఉపవాసాలు, జాగరణలు, యాత్రలు మొదలైన బాహ్యాచారాలను పరిహసించాడు. ఇట్టి బాహ్యాచారాల్ని వేమన ఎంతో తీవ్రంగ నిరసించడానికి లింగధారుల్ని కపటవేషధారులని బాహాటంగా తూలనాడడం ఒక నిదర్శనం. అందువల్ల శైవులైన గొప్ప రచయితలు వేమన మీద ఆగ్రహాన్ని ప్రదర్శించడం సహజమే. కాబట్టి శైవులు కూడ శైవేతరులతోపాటు వేమన పేరును విస్మరించారు.

మూడవ కారణం: వేమన శూద్రుడు. తెలుగు ఛందఃకర్తలలో ప్రామాణికుడైన అప్పకవి అంతటివాడే శూద్రకవుల కవిత పఠనయోగ్యం కాదని శాసించాడు. కులీనులైన కవులకు శూద్రకవులంటే అంతటి నిరసన వుండేది. కనుకనే 1829వ సం|| కాలేజి బోర్డు వారికోసం ప్రభుత్వోద్యోగియైన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ప్రకటించిన వేమన పద్యాల (The Verses of Vemana, Moral, Religious and Satarical) 500 ప్రతుల్లో 40 అకస్మాత్తుగా అదృశ్యమయ్యాయి. సంపాదకుడిగ బ్రౌనుకు బహూకరించిన 50 ప్రతులు మాత్రం మిగిలాయి. అగ్రకులజులైన పండితులు కుట్రపన్ని కాలేజి లైబ్రరీలో ఒక చెత్తగదిలో ఆ 450 ప్రతుల్ని చెత్తకాగితాల కట్టలాగకట్టి పడవేశారు. ఈ విషయం బ్రౌనుకు పదేండ్ల తరువాత తెలిసింది. వేమన పైగల ద్వేషభావం మిక్కిలి మూర్ఖంగ ఉండటంచేతనే 1866వ సంవత్సరంలో Madras Science అన్న పత్రికలో మేజర్ ఆర్.ఎం. మ్యాక్ డొనాల్డ్ Journal of Literature and (R.M. Macdonald) వ్రాస్తూ కొంత వివరంగ వ్యాఖ్యానించాడు. ఆ వ్యాఖ్యానాన్ని ఇక్కడ పూర్తిగ ఉద్ధరించడం అవసరం:

"తెలుగు ప్రజలు వేమన కవిత్వాన్ని అధికంగ అభిమానిస్తారని" డా. పోప్ పేర్కొన్నారు. శూద్రులలోనే వేమనకు ఎక్కువ ప్రచారం ఉన్నదని నా అభిప్రాయం. శూద్రులలో కూడ వైదిక దృష్టిగల వాళ్ళు వేమనను నిరాకరిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొన్నింటిలో వేమన పద్యాలను పాఠ్యభాగాలుగ పెట్టినపుడు ఈ సంగతి స్పష్టంగ తెలియవచ్చింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడ వేమన పాఠ్యభాగాల విషయంలో ప్రభుత్వపు ఉత్తర్వులను కూడ ఉల్లంఘించడానికి బహువిధాల ప్రయత్నించారు. కొన్ని పాఠశాలల్లో కుంటిసాకులు చెప్పి వేమన పద్యాల్ని బోధించడానికి ఆలస్యం చేస్తూ

వచ్చారు. మరి కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే పద్యాలలో హిందూ మతాచారాలను విమర్శించే వాటిని వదలి పెట్టి పాఠం చెప్పారు. ముఖ్యంగా బ్రాహ్మణులు వేమనను నిరసించారు; దూషించారు. వేమన భాషగ్రామ్యమని, వేమన బోధనలు నీతిబాహ్యాలని ప్రకటించారు."

ముప్పయి యేండ్ల తరువాత కూడ ఈ పరిస్థితి మారలేదు. క్రైస్తవ మత ప్రచారకుడైన విలియం హొవర్డ్ క్యాంబెల్ (William Howard Campbell) మద్రాసు క్రిస్టియన్ కాలేజి పత్రికలో 1898వ సంవత్సరంలో ఇలా వ్రాశాడు: "బ్రాహ్మణులు వేమన ఉపదేశాల్ని ఎప్పుడూ ప్రతిఘటిస్తూ ఉంటారు. ఇప్పటికీ అతని కవితను పరిహసిస్తూ ఉన్నారు."

ముందే చెప్పినట్లు నాలుగవ కారణం: వేమన వాస్తవానికి విద్వాంసుడు కాడు. ప్రజావ్యవహారంలోని తెలుగు భాషలో ఆయన ఉద్దండుడు. తెలుగు పదాల అర్థాలలోని సూక్ష్మ భేదాలను చక్కగా తెలిసినవాడు. పాతపదాలను వినూత్నమైన అర్థాలతో ప్రయోగించగలడు. భాషాగర్భం నుండి పదరత్నాలను వెలికితీసి పదునైన పదబంధాలను, నూతనమైన నుడికారాలను, స్వచ్ఛమైన సామెతలను, చేవగల జాతీయాలను కల్పించే సహజ ప్రజ్ఞ వేమనకున్నది. వేమన శైలి సరళంగ, చమత్కారంగ ఉంటుంది. ఒక్కొక్కపుడు సూక్తుల్ని, సుభాషితాల్ని, నీతుల్ని, ధర్మసూత్రాల్ని, లోకోక్తుల్ని వరసగా గుప్పిస్తాడు. కేవలం పండితులకు, ఛాందస్సులకిది చాలదు. వారి దృష్టిలో అమరకోశం వంటి సంస్కృత నిఘంటువుల్ని ధారణ చేసిన వారు. ఛందో వ్యాకరణ నియమావళికి దాసులై కవిత్వం వ్రాసేవారు, సుదీర్ఘ సంస్కృత సమాసాల కూర్పులో నిపుణులైన వారు, అలంకారశాస్త్ర విధేయంగ కవిత చెప్పగలవారు, పాతవడ్డ ఉపమానోపమేయాలనే ఆదరించేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే - సంప్రదాయ పాండిత్యాన్ని సాధించి, సంప్రదాయ వస్తువును స్వీకరించి, సంప్రదాయ శైలిలో కవిత చెప్పగలవారు మాత్రమే కవులుగా పరిగణింపబడతారు. తదితరులు జాతీయ నుడికార ప్రయోగంలో దిట్టలైనా, భాషనలో గొప్ప ఉపజ్ఞులైనా, లోకజ్ఞులైనా వారిని పండితమ్మన్యులుగ తిరస్కరించే వారు.

చివరి కారణం: వేమన రాజులనుగాని, రాజాస్థానాలనుగాని, ఆస్థాన పండితులనుగాని లక్ష్యపెట్టకపోవడం. ఒక పోషకుని ఆశ్రయించి అతని తృప్తి కోసరం అతడిచ్చే తృణమొ పణమొ ఆశించి కవిత్వం చెప్పడమన్నది కవికులాన్ని అప్రతిష్ఠ పాలు చేయడమే అని వేమన అభిప్రాయం. ఆత్మస్థైర్యంతో, స్వతంత్రుడై చిత్తశుద్ధి గలవాడే నిజమైన కవి అని, అతడే పదికాలాలపాటు నిలిచే సందేశాన్నీయగలడని వేమన విశ్వాసం. జనన మరణాల పరమావధిని దర్శించడానికి, మానవ సేవకు ఉపయోగపడని విద్యాపాండిత్యాలు నిష్ప్రయోజనమైన అలంకారాలని వేమన దృఢాభిప్రాయం. ఇటీవలి కాలం వరకు కవులందరు రాజాశ్రయాల్ని లేదా అధికారుల శ్రీమంతుల కొలువును, ప్రాపును అభిలషించి జీవించినవారే. అందువల్ల వేమన యొక్క స్వతంత్ర ప్రవృత్తిని అహంకారంగా చిత్రించి ద్వేషించారు. పైగా కవులు తమ సాహిత్య తూణీరంలో బలీయమైన మౌనతిరస్కారమనే బాణంతో వేమనను రూపుమాపడానికి ప్రయత్నించారు. అయితే మతసాంఘికరంగాలలో ఒక గొప్ప సంస్కర్తగ పేరు గడించిన వీరేశలింగం వేమన విషయంలో ఎందుకు ఆ కుత్సితుల గుంపులో చేరాడు? శుద్ధ నైతికవాది అయిన వీరేశలింగానికి వేమన పద్యాలలో పరకర్తృకాలై, ప్రక్షిప్తాలుగా వున్న అశ్లీల పద్యాలు కొన్ని ఏవగింపు కలిగించి వుండవచ్చు.

తెలుగు సాహిత్య పరిషత్తు నుండి వేమన వెలివేయబడినా అతని కవిత్వాన్ని కొద్దీ గొప్పో చవిచూచిన ప్రతి విదేశీయుని మీద అది చెరగని ముద్రవేసింది. అట్టి విదేశీయుల్లో అబె జె.ఏ. దుబాయ్ (Abbe J.A. Dubai) అనే ఫ్రెంచ్ రచయిత ప్రధముడు. ఇతడు హైందవుల ఆచారాలు, సంప్రదాయాలు, పూజా పురస్కారాలకు సంబంధించిన "Hindu Manners, Customs and Ceremonies" అనే గ్రంథాన్ని ఫ్రెంచి భాషలో రచించాడు. దానికి ఆంగ్లానువాదం

1871వ సంవత్సరంలో మొదట ప్రచురింపబడింది. ఆ గ్రంథంలో “దార్శనికత ధ్వనించే రచనలు" చేసిన భారతీయ కవులను పేర్కొంటూ దుబాయ్: “సుప్రసిద్ధులైన అట్టి కవుల్లో వేమన ఒకడు. ఈ వేదాంతి కడపమండలంలో రెడ్డికులంలో పుట్టి 17వ శతాబ్దాంతంలో మరణించినట్లు జనశ్రుతి. నేను పరిశీలించిన వేమన పద్యాలు చాల ఆసక్తిదాయకంగ వున్నాయి. ఆయన కవిత వివేచన ప్రధానంగా, స్వతంత్ర భావాలతో విశిష్టంగ ఉంటుంది” అని ప్రశంసించాడు.
ఇంతకు ముందు పేర్కొన్న మద్రాసు సివిల్ సర్వీసు ఉద్యోగి అయిన చార్లెస్ ఫిలిప్ బ్రౌనక్కు వేమన కవితతో సన్నిహిత పరిచయమున్నది. అయితే బ్రౌన్ మహామేధావికాక భాషాశాస్త్రజ్ఞుడు కావడం చేత వేమన కవితను అతడు భాషా దృష్టితో పరిశీలించాడు.

“తెలుగుభాషను అభ్యసించదలచుకొన్నవారికి ఉపయోగకరంగ సరళమైన శైలిలో, విషయ వైవిధ్యంతో కూడిన కవితను చెప్పిన కవులెవరని” బ్రౌన్ అన్వేషిస్తున్నపుడు అతని కంటబడిన వాడు వేమన. ఇట్టి పరిమిత పరిధిలో వేమనతో సరితూగగలవాడు యూరోపియన్ కవుల్లో గ్రీసు దేశస్థుడైన లూసియన్ (Lucian) ఒక్కడే తనకు కనిపిస్తున్నట్లు బ్రౌన్ పేర్కొన్నాడు “గ్రీకు వాఙ్మయంలో లూసియన్ కవివలె తెలుగు సాహిత్యంలో వేమన తెలుగు భాషా సాహిత్య ప్రారంభకులకు ఉపయోగకారి” అని బ్రౌన్ అభిప్రాయం. అంటే వేమన రచనలు తెలుగులో ప్రాథమిక వాచకాలకు తుల్యాలు; అట్టి వాచకాల ప్రయోజనాన్ని వేమన రచనలు నిర్వహించగలవని బ్రౌన్ కు తోచింది. ఇటువంటి అభిప్రాయాన్ని వ్యక్తపరచినందుకు మనం బ్రౌనను నిందించనక్కరలేదు. ప్రప్రథమంగ వేమన పద్యాలను సేకరించి, పరిష్కరించి తన సంపాదకత్వంలో వాటిని ముద్రించి, ప్రచురించిన మహనీయుడు బ్రౌన్ దొర. వేమన పద్యాలను ఇంగ్లీషు, లాటిను భాషల్లోకి మొట్టమొదట అనువదించిన వాడు కూడ బ్రౌన్.
వేమన పట్ల బ్రౌన్ చూపిన శ్రద్ధాసక్తుల వల్లనే తెలుగు సాహిత్యవేత్తలు చిట్ట చివరకు వేమనను గుర్తించడం జరిగింది.
బ్రౌన్ "The Verses of Vemana: Moral, Religious, and Satirical" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. అందలి పీఠికలో వేమన పద్య సేకరణలో తాను పడిన పాట్లను బ్రౌన్ ఇలా వివరించాడు:

“ఒక భాషను నేర్చుకోడానికి పూనుకొన్నప్పుడు విదేశీయుడు సాధారణంగా దేశీయులలో బాగా ప్రచారంలో వున్న పుస్తకాలను, ముఖ్యంగా సులభ శైలిలో గల వాటిని గురించి అడిగి తెలుసుకోవడం సహజం. అట్టి పుస్తకాలను గురించి 1824వ సంవత్సరంలో వాకబు చేసినపుడు ఇందులో సమకూర్చిన పద్యాలతో పరిచయం ఏర్పడింది. వేమ, వేమన అనే రెండు పేర్లతో వున్న అనేక తాళపత్ర ప్రతులు నాకు లభించాయి. నా ఉద్యోగ బాధ్యతల మధ్య లభించిన తీరిక వేళల్లో వాటిని చదివి కొన్ని పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించాను. మూలంలో అనేక దోషాలు-శబ్దదోషాలు లేఖన దోషాలు, ఛందోభంగాలు మొదలైనవి-కొల్లలుగా కనిపించాయి. ఏ రెండు ప్రతుల్ని పోల్చి చూచినా పాఠభేదాలుండేవి. రెండు వందల నుండి ఎనిమిది వందల పద్యాలవరకు పాఠక్రమాల్లో వైవిధ్యం కనిపించింది. అపుడు నేను మచిలీ పట్టణంలో వున్నాను. స్థానికంగా లభించిన ప్రతుల్ని సేకరించిన తరువాత విశాఖపట్టణం నెల్లూరు, గుంటూరు, కడప, మదరాసులలో లభించిన ప్రతుల్ని కూడ సంపాదించాను. నేను సేకరించిన ప్రతులలో సమానంగా ఉన్న పద్యాలను గుర్తించడానికి తొమ్మిది ప్రతులకు సంబంధించి తొమ్మిది విభాగాలు గల ఒక పద్య సూచికను తయారు చేయించాను. నాకు లభించిన పద్యాలు మొత్తం 2,500; వీటిని పోల్చినపుడు సమానమయిన పద్యాలు మొత్తం రెండు వేలకు కొంచెం మించి వున్నట్లు తేలింది.

ఆ తరువాత ఈ పద్యాలను ఒక క్రమంలో విభజించి కూర్చవలసి వచ్చింది. నేను నియమించిన లేఖకులు తమ యిష్టాయిష్టాల్ని బట్టి పద్యాలను వర్గీకరించారు. వాటిలో ఏక్రమమూ కన్పించలేదు. చివరకు నేనే ఒక విధంగ మొత్తం పద్యాలను అయిదు వర్గాలుగ మతం, నీతి, వ్యంగ్యం, తాత్త్వికం, ప్రకీర్ణం-అని వర్గీకరించాను."

బ్రౌన్ తరువాత డా॥ జి.యు. పోప్ (Dr. G.U. Pope) మేజర్ ఆర్.ఎం. మెక్ డోనల్డు (Major R.M. Macdonald) వేమనను ముఖ్యంగా అభిమానించిన పాశ్చాత్యులు. అబే దుబాయ్ (Abbe' Dubois) రచించిన Hindu Manners' Customs and Ceremonies అన్న గ్రంథానికి సంపాదకీయాన్ని వ్రాసిన పోప్ దొర: “వేమన పద్యాల మాధుర్యాన్ని అనుప్రాస యమకాల లయని మించిన మరో కవితలేదు.” అని ప్రకటించాడు.

వేమన కవిత్వాన్ని గూర్చి మ్యాక్ డోనాల్డ్ అభిప్రాయమిది. “వేమన రచనలు విదేశీయుల్ని ఆకర్షించినంత గొప్పగా తెలుగు సాహిత్య మంతటిలో మరొక కవి రచనలు ఆకర్షించలేదని చెప్పవచ్చు."

వేమన పద్యాలను అంగీకరించిన ద్వితీయుడు కూడ ఒక చార్లెస్. అతని పూర్తి పేరు చార్లెస్ ఇ గోవర్ (Charles E. Gover) నిజానికి ఇతణ్ని అనువాదకుడనడం సమంజసం కాదేమో! ఎందుచేతనంటే చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ చేసిన వచన రూప అనువాదమే తన పద్యరచనకు ఆధారమని గోవరే తెలిపాడు. వేమన సంపూర్ణ హేతువాదిగ, స్థిరమైన ఏకేశ్వరోపాసకుడిగ, మొరటుగ, మాటల ప్రయోగంలో నేర్పరిగ వుండడమే గోవరును అధికంగ ఆకట్టుకున్నది. నైతికంగ వేమన తిరువళ్ళువరుకన్నా చాలా తక్కువని, కవిత్వంలో ఇంకా తక్కువ స్థాయిలో ఉంటాడని గోవర్ అభిప్రాయం. ఈ అంచనా సరియైనదో కాదో కాని విన్సెంట్ ఎ. స్మిత్ (Vincent A. Smith) తన Oxford History of India అన్న గ్రంథంలో కులవ్యవస్థను తీవ్రంగా ఖండించిన ఒక భారతీయ రచయిత వాక్యాల్ని ఉద్ధరించడానికి 1871వ సంవత్సరంలో ప్రచురితమైన The Folk Songs of Southern India అన్న గోవర్ పుస్తకంలో వేమన పద్యాలలో నాలుగింటిని ఎన్నుకోవలసి వచ్చింది.
బ్రౌన్, గోవరుల కన్నా వేమనను చక్కగా అవగాహన చేసుకొన్న పాశ్చాత్యుడు క్యాంబెల్ (Campbell) మద్రాసు క్రిస్టియన్ కాలేజి పత్రికలో ఇతర విషయాలతోపాటు ఆయన ఇలా వ్రాశాడు: “నిశ్చయంగ వేమన ప్రజల కవి. ఆయన వ్రాసింది పండితులకు కాదు. నిరక్షరకుక్షులైన గ్రామీణ ప్రజలకు. వేమన ప్రసిద్ధి ప్రచారాలకు కారణం ఆయన ప్రబోధాలే కాకుండా, సరళమూ, శక్తిమంతమూ అయిన ఆయన కవితాశైలి కూడ కారణమే. వేమన పండిత ప్రశంసలను, పేరు ప్రతిష్ఠలను కోరలేదు. కనుకనే సంప్రదాయ కవితా నియమాలను ఉల్లంఘించాడు. ఈ నియమోల్లంఘనలోనే వేమన తన విజ్ఞతను ప్రకటించాడు. గ్రంథరూపమైన సంప్రదాయ కవిత్వం భారతదేశంలో సామాన్య ప్రజానీకానికి అవగాహన కాదు. అది యెప్పటికి నిరక్షరాస్యులైన ప్రజల ఆదరణను పొందదు... వ్యంగ్యసూక్తి వైచిత్రి వల్లనే వేమన ప్రజాదరణను పొందగలిగాడు. మానవ స్వభావంలోని లోటు పాట్లను, ప్రవర్తనలోని పొరపాట్లను సూక్ష్మంగ పరిశీలించి, వాటిని వేమన పరిహాస పూర్వకంగా విమర్శించి ప్రదర్శించాడు... వేమన ప్రధానంగ వ్యంగ్య పరిహాసకుడు మాత్రమే కాదు. తోటి ప్రజలకు సేవ చేయాలన్న తీవ్ర కాంక్ష గల ఒక సంస్కర్త కూడ. ఈ లక్ష్యసాధనకు అతనికి ఏదీ అడ్డుగా కన్పించలేదు. ఈ విశ్వాన్ని గురించిన వేమన సిద్ధాంతం అనేక భారతీయ దార్శనికులలో కనబడే బహుదైవ భావం కాదు. అది ప్రధానంగా ఆస్తిక భావం. సర్వేశ్వరునికి వ్యక్తికి మధ్య గల అంతరాన్ని వేమన గుర్తించాడు. మానవశక్తికొక స్థానాన్ని, ప్రాధాన్యతని వేమన ఆపాదించడం వల్లనే ఆ సర్వేశ్వరుని హస్తాల్లో మానవులు కేవలం కీలుబొమ్మల్లాంటి వారనే వాదాన్ని వేమన నిరాకరించాడు. సన్యాసుల కాముకత్వాన్ని, కఠిన నియమాలని తీవ్రంగ ఖండించడంలో లూథర్, విక్లి (Luther, Wycliffe) వంటి మత సంస్కర్తలు కూడ వేమనకు సాటిరారు.

క్రమంగా ప్రజాదరణను పొందుతున్న వేమన కవిత్వ మొక ప్రక్క భారతదేశంలో మత సాంఘిక నైతిక రంగాలలో ఏర్పడుతున్న మార్పులు మరొక వంక, అప్పటి వరకు తెలుగు సాహిత్యవేత్తలు వేమన పట్ల చూపుతూ వచ్చిన తిరస్కార భావం, ఉదాసీనత తొలగడానికి కారణాలయ్యాయి. అంత కన్నా ముఖ్యంగ పేర్కొ దగ్గ విషయం 1914వ సంవత్సరంలో వెలువడ్డ డా॥ సి.ఆర్. రెడ్డిగారి కవిత్వతత్వ విచారం అనే అపూర్వ సాహిత్య విమర్శగ్రంథం. ఈ గ్రంథమొక ఫిరంగిలాగ అప్పటి వరకు అభేద్యంగ వున్న సాంప్రదాయక సాహిత్య విమర్శకుల కోట గోడల్ని కొంత కూల్చింది. డా॥ రెడ్డిగారికి

కౌమారదశలోనే భారతేతి హోస కావ్యాలనన్నింటిని వారి తండ్రిగారు పరిచయం చేశారు. ఆ తరువాత మదరాసులోను, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోను విద్యనభ్యసించిన రెడ్డిగారు పాశ్చాత్య సాహిత్య తత్వాన్ని చక్కగా ఆకళించుకొన్నారు. నిశితమైన ఆలోచన, సున్నితమైన హాస్యం ఆయనకు స్వాభావికంగ సిద్ధించిన లక్షణాలు. ప్రవృత్తి చేత, శిక్షణ చేత రెడ్డిగారు ఆధునిక దృక్పథం కలవారు. ఆయన తన సాహిత్య విమర్శ గ్రంథంలో తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించాడు. ఈ గ్రంథమొక మహా ప్రభంజనంలా వీచి అప్పటి వరకు తెలుగు సాహిత్యరంగంలో పాతుకొని వున్న సంకుచితాభిప్రాయాల మహా వృక్షాన్ని కూకటి వేళ్ళతో కూల్చివేసింది. ఇప్పటికీ తెలుగు సాహిత్య విమర్శలో రెడ్డిగారి గ్రంథానికి అగ్రస్థానం కద్దు. ఒక నూతన విమర్శకశకాన్ని సృష్టించిన ఈ పుస్తకంలో సి. ఆర్. రెడ్డిగారు ప్రముఖులైన తెలుగు కవుల్లో వేమన ఒకడని చాటారు. సృజనాత్మక శక్తికి, సునిశిత హాస్యానికి వ్యంగ్యానికి, స్వాభావికతకు, నిస్సంకోచమైన భావప్రకటనకు, మూఢవిశ్వాసాలఖండనకు, కాపట్య నిరసనకు తెలుగు వాఙ్మయంలో వేమనను మించిన కవి లేడని రెడ్డిగారి అభిప్రాయం. తమ అభిప్రాయాలు, సిద్ధాంతాలు నిరాధారమైనవని గ్రహించిన పండితులు, విద్వాంసులు వేమనను, వేమన కవిత్వాన్ని ప్రశంసించడం ప్రారంభించారు. సహజం సజీవం. శక్తిమంతం అయిన వేమన కవితను ఎవ్వరూ రూపుమాపలేరు. స్వమాతాభి మానంతో, కులగర్వంతో శుష్కమైన విమర్శతో మన ప్రాచీనులు అంధఃప్రాయులు కాకుండ ఉండినట్లయితే వేమనను ఒక మహాకవిగా ఏనాడో గుర్తించి వుండేవారు. శక్తిమంతమయిన వాక్కు బలీయమైన వ్యక్తిత్వం వల్ల వేమన తన జీవితకాలంలోనే మహిమాన్వితుడైన ఒక మహాపురుషుడుగా పరిగణింపబడ్డాడు.

## వేమనను గురించిన గాథలు

### ప్రాచీన గాథల ఒడిలో ప్రగాఢ నిద్ర - కీట్స్

తన జీవితకాలంలోనే ఒక దివ్య పురుషుడుగా కీర్తికెక్కిన వేమనను గూర్చి జీవితాంతర కాలంలో కుప్పతిప్పలుగ గాథలుప్పతిల్లడంలో ఆశ్చర్యం లేదు. అనేక విషయాలలో వేమన విలక్షణమైన వ్యక్తి. ప్రవర్తనలో, వేషధారణలో, దిగంబరత్వంలో, ప్రవృత్తిలో, ప్రబోధంలో ఇంకా అనేక విషయాలలో ఆయన విశిష్టుడు. వేమన విశిష్టత ఎటువంటిదంటే అనేకులు అతణ్ణి మహాత్ముడని భావించి పూజిస్తే, మరికొందరాయన్ను పిచ్చివాడిగ, కపటసన్యాసిగా పరిహసించారు. అటువంటి వ్యక్తిని గురించిన గాథలు ఏకాలంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా, అతి వేగంగా వ్యాపిస్తాయి. దేనినయినా గ్రుడ్డిగ నమ్మే సమాజంలో, వార్తా ప్రచార సౌకర్యాలు అతి తక్కువగనున్న కాలంలో వేమన జీవించాడు. కాబట్టి విపరీతమైన, అత్యద్భుతమైన విచిత్రమైన అనేక గాథలకు ఆయన పాత్రుడయ్యాడు.

వేమన అనుయాయులు ఆయన్ను దైవంగ, గురువుగ పూజించేవారు. ఆ పుక్కిటి పురాణాలను, విపరీత గాథలను, వాస్తవాలని ప్రగాఢంగ విశ్వసించారు. ఆ గాథలలో చిత్రింపబడిన వేమనే వారి దృష్టికి హిమవత్పర్వతం వంటి వాస్తవ పురుషుడు. పరమ పవిత్రుడు. కల్పిత గాథల తెరను తొలగించి చారిత్రక పురుషుడుగ వేమనను ఆవిష్కరించే యే ప్రయత్నమైనా వేమన భక్తుల దృష్టిలో మహాపచారమే. ఇట్టి భావం వేమన భక్తులకే కాక సామాన్యేతరుల్లో కూడ వేలకొలది మందికి వున్నది.

వేమన జీవితాన్ని గురించిన సవిమర్శక గ్రంథం తెలుగులో ఒక్కటే ఉండగా, ఆద్యంతం వింత గాథలతో నిండిన వేమన జీవిత చరిత్రలు దశాధికంగ లోకంలో ప్రచారంలో ఉండడం ఇట్టి భ్రమకు దారి తీసింది. ఇంగ్లీషులో వున్న వేమన జీవిత చరిత్ర కూడ ఒక్కటే. ఆ గ్రంథకర్త సి. రామకృష్ణారావు. ఈ గ్రంథం కూడ పుక్కిటి పురాణాల పుట్ట. వేమన జీవిత చరిత్రను

రచించిన తొలి రచయితలలో మచిలీపట్టణానికి చెందిన ఆర్. పూర్ణమాచార్యులు ఒకరు. ఆయన జిల్లా పోలీసు ఆఫీసులో ఒక గుమస్తా. అతనికి చదువు, సంపద అంతంత మాత్రమే. అయినా వేమనపట్ల అతనికి గల భక్తి శ్రద్ధలు అపారం. బ్రౌన్ దొరప్రారంభించిన తాళపత్ర గ్రంథ సేకరణ కార్యక్రమాన్ని కొనసాగించాలన్న పట్టుదలతో వేమన పద్యతాళపత్ర ప్రతుల నిమిత్తం దేశం నాలుగు చెరగుల గాలించాడు. ముఖ్యంగ ప్రచారంలో ఉన్న వందలాది వేమన పద్యాలను వ్రాసుకొన్నాడు. లోకులు తెలిపిన వేమన కవిజీవిత విశేషాలను సేకరించాడు. బహుకాల పరిశ్రమ ఫలితంగా 1913వ సంవత్సరంలో వేమన పద్యాల సంకలనాన్ని ప్రచురించాడు ఇందులో మొత్తం 4305 పద్యాలున్నాయి. ఇది అంతకు పూర్వమున్న వేమన పద్య సంకలనాలన్నింటికన్న పెద్దది. కట్టుకథలు గల "వేమన యోగీంద్ర చరిత్రము" అన్న పేరుతో ఒక గ్రంథాన్ని కూడ పూర్ణమాచార్యులు రచించి ప్రకటించాడు. అతని దృష్టిలో వేమన-వ్యాసమహర్షికి ప్రియమైన ఉపమానంలో చెప్పాలంటే ఒక పురుష వృషభుడు.

హేతువాదాన్ని త్రోసి పుచ్చి, పురాణ ప్రపంచపు సంధ్య వెలుగులో విహరించదలచుకుంటే పూర్ణయాచార్యుల "వేమన యోగీంద్రుని చరిత్రము" కూడ చదవడానికి ఆసక్తిదాయకంగ ఉంటుంది. వేమన శిష్యులు, ఆరాధకులు చూచినట్లే మనమూ వేమనను దర్శించాలనుకుంటే ఆ గాథా ప్రపంచంలోకి ప్రవేశించవచ్చు. ఆ అద్భుత ప్రపంచంలో సుదూరం ప్రయాణిస్తే తప్ప, ఈ గాథల వెనుక అదృశ్యంగా వున్న వేమనగారి వాస్తవరూపాన్ని సందర్శించలేమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.
అనగా అనగా ఒకాయన దేశసంచారానికి బయలుదేరాడు. ఆయన పేరు వేమన. ఆయన వైశ్యుడు. అంటే కోమటి. శ్రీశైల క్షేత్ర దర్శనార్థం ప్రయాణమయ్యాడు. కర్నూలు జిల్లాలో ముండ్లతుప్పలతో నిండిన కొండల్లో వున్న క్షేత్రమది. ఆ కొండ చరియలు కృష్ణానదీ తీరం వైపుకు ఏటవాలుగ వున్నాయి, ఆ పర్వత శిఖరాన వున్న ప్రాచీన శివాలయంలో వెలసిన దైవం మల్లికార్జునస్వామి, ప్రతియేట శివరాత్రి పర్వదినాన వేలాది శివభక్తులు శ్రీశైలానికి వస్తారు. వారు పగలంతా ఉపవసించి, రాత్రంతా జాగరణ చేస్తారు. కృష్ణానదిలో స్నానమాడి, నొసటికి భుజదండాలకు విభూది రేఖలు దిద్దుకొని, శంఖాలను పూరిస్తూ, తాళాలు తప్పెట్లను వాయిస్తూ ఆడుతూ, పాడుతూ దైవారాధన చేస్తారు. 13వ శతాబ్దాంతంలో అట్టి శ్రీశైల యాత్రికుల్లో మన కోమటి వేమన ఒకడు.

శివరాత్రికి వచ్చిన యాత్రికులందరూ మరునాడు గృహోన్ముఖులై వెళ్ళిపోయారు. వేమన మాత్రం వెళ్ళలేదు. దేవాలయ ప్రాంగణంలోనే వేమన తచ్చాడుతుంటే, అక్కడ నుండి వెళ్ళిపొమ్మని పూజారులతనిని ఆజ్ఞాపించారు. "నన్నెందుకు తరుముతున్నారు? నేనొక శివభక్తుణ్ణి శివుడను గ్రహించి, దర్శనమిచ్చేవరకు పూజలు చేయ నిర్ణయించుకున్నాను." అని వారితో మనవి చేసుకున్నాడు. అర్చకులు అనుమతించారు. అయితే దేవాలయానికి ఉత్తరాన వున్న పొదల వైపు మాత్రం పోవద్దని ఆదేశించారు."ఆ పొదలలో సర్పాలున్నాయి. క్రూరమృగాలు అటువైపు తిరుగుతుంటాయి." అని హెచ్చరించారు. వారి హెచ్చరిక వేమనకు సూచనగా పరిణమించింది. పూజారులు ఆదమరచి వున్నపుడు వేమన ఆ నిషిద్ధ ప్రదేశంలో ప్రవేశించాడు. తిరిగి వచ్చేటప్పుడు త్రోవ తప్పిపోకుండా రావడానికి ఆవగింజల్ని వంకరటింకరగా వున్న దారి పొడుగున చల్లుతూ దట్టమైన చెట్ల మధ్యకు వెళ్ళాడు. ఎన్నో ప్రయాసలకులోనై, ఎంతో నిశితంగ పరిశీలించిన తరువాత వేమన "పరుసవేది" కొలనును సమీపించాడు. నిజానికి వేమన శ్రీ శైలయాత్ర పరుసవేది అన్వేషణార్థమే. తాను కనుగొన్న కొలను పరుసవేదియేనా అని నిర్ణయించుకోడానికి ఆ పుష్కరిణి జలాలలో ఒక ఇనుప కడ్డీని ముంచాడు. ఆశ్చర్యం! అది బంగారు కడ్డీగ మారింది. పట్టరాని ఆనందంతో ఆ పుష్కరిణి జలాలను రెండు కడవల్లో నింపుకొని ఆవగింజల ఆచూకితో వేగంగ దేవాలయ పరిసరాలను సమీపించాడు.

పూజారుల కంటబడకుండ తప్పించుకొని చుట్టుమార్గంలో వేమన అనుమకొండను చేరుకొన్నాడు అప్పటికి సూర్యాస్తమయమయినది సంధ్య చీకట్లు ముసురుకొంటున్నవి. దొంటి అళియరెడ్డి (కొన్ని ప్రతులలో దొంటి అల్లాడరెడ్డి) అనే కాపు ఇంటిలో ఆ రాత్రికి ఆశ్రయమిమ్మని వేమన వేడుకొన్నాడు. ఆ కాపు తమ పశువుల కొట్టంలో ఉండమని అనుమతించాడు. వేమన పుష్కరణి నీళ్ళకడవలను కొట్టంలోని నాగళ్ళ వెనుక దాచి, భోజనం నిమిత్తం వైశ్యుల ఇండ్లకు వెళ్ళాడు. వేమన భోజనార్థం వెళ్ళిన ఆ సమయంలో అళియరెడ్డి పశువులకు గ్రాసం పెట్టను కొట్టంలోకి వెళ్ళాడు. అక్కడ బంగారంలా తళతళ మెరుస్తున్న వస్తువుని చూచి ఆశ్చర్యపోయాడు. తన నాగలొకటి బంగారంగ మారింది. ఆ మార్పుకు కారణాన్ని అతడు పరిశీలించినపుడు పరుసవేది స్పర్శ వలన ఇనుము సువర్ణంగ మారినట్లు కనుగొన్నాడు. అళియరెడ్డికి మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. వెంటనే ఆ రెండు కడవల్ని తన ఇంట్లోకి చేర్చి పలుగులకు కట్టిన పశువుల్ని విప్పి బయటకు తోలి, కొట్టపు ఎండు గడ్డి చూరుకు నిప్పంటించాడు. అగ్ని జ్వాలలు పైకెగసి నింగి ఎర్రబడుతుండగా వేమన పరుగు పరుగున వచ్చాడు. కడవల్ని కాపాడుకోవాలన్న ఆతురతతో మంటల్లోకి దూకి అగ్నికి ఆహుతయిపోయాడు వేమన. అళియరెడ్డి అప్రమత్తుడు, వివేకి. వెంటనే శ్రీమంతుడు కావడానికి అవసరపడలేదు. ఆలోచించి సమయానుకూలంగా పరుసవేదిని విడతల వారిగ ఉపయోగించి అంచెలంచెలుగా ఇండ్లను, పొలాలను, పశువులను సంపాదించాడు. అయితే ఆయన ఆస్తితో పాటు ఆవేదన కూడ పెరగసాగింది. కోమటి వేమన భూతంగా మారి తన ప్రతీకారాన్ని తీర్చుకున్నాడు. అళియరెడ్డికి అనేక కీడుల్ని, ఆపదల్ని కలిగించాడు. అళియరెడ్డి కుమారులు ఒక్కరొక్కరే రోగపీడితులై మరణించారు. ఈ కారణంగా అళియరెడ్డిది తీరని దుఃఖం, ఆరని ఆవేదన అయింది. అతని పుత్రుల్లో ఒక్క ప్రోలయ మాత్రమే ఈతి బాధలను తప్పించుకొని బ్రతికి బట్ట కట్టాడు. అతడు కూడ మిత్తివాతబడితే కుటుంబ సంపదకు వారసుడుగాని, పితృదేవతలకు తర్పణలిచ్చేవాడు గాని ఎవడూ వుండడు. అళియరెడ్డి తన మనస్సులోని భీతిని మింగలేడు కక్కలేడు. ఇవి కొని తెచ్చుకొన్న కష్టాలని ఇతరులతో చెప్పుకోలేదు. అందుకే అతని ఆవేదన భరింపరానిదయింది. తాను చేసిన పాపకార్యానికి ఫలితాన్ని త్వరలో అనుభవించాలి అన్న భీతితో అళియరెడ్డి ఒక రాత్రి పడుకున్నాడు. అతనిది కలతనిద్ర. ఆ కలత నిద్రలో ఒక కలగన్నాడు. ఆ కలలో రౌద్రాకారంతో వేమన కనిపించాడు. అళియరెడ్డి కన్నీరు కారుస్తూ వేమన పాదాలపై పడి తన్ను క్షమించమని ప్రాధేయపడ్డాడు. “మిమ్మును శాంతింపచేయ నేనేమి పరిహారం చెల్లించాలో దయతో సెలవిప్పించండి” అని బ్రతిమలాడాడు. కోమటి వేమన చిట్ట చివరకు కనికరించి అళియరెడ్డిని క్షమించడానికి రెండు షరతులు పెట్టాడు. మొదటిది: అళియరెడ్డి కోమటి వేమన సువర్ణప్రతిమను ప్రతిష్టించి, ప్రతి రోజు దాన్ని తన కులదైవంగా పూజించాలి. రెండవది: అతని వంశంలో ఇప్పుడున్న మగబిడ్డకు ఇక ముందు కలుగబోయే మగసంతతికి కోమటి వేముని పేరు పెట్టాలి. ఈ నిబంధనద్వయాన్ని ఏమరకుండ అమలుపరిచితే అళియరెడ్డి వంశం తామరతంపరగ వృద్ధి చెంది శ్రీమంతమవుతుంది. అళియరెడ్డి వంశీయులు అనతి కాలంలోనే రాజ్యపాలకులై ఒక శతాబ్దిపాటు యధేచ్ఛగా పరిపాలిస్తారు. ఈ రెండు ఒప్పందాలకు కట్టుపడి వుండడానికి అయరెడ్డి ఆనందంతో వెంటనే అంగీకరించాడు. మరునాడే వేముని బంగారు ప్రతిమ చేయడానికి సువర్ణకారుల్ని నియమించాడు. ఒక మంచి రోజు చూచి పూజాపునస్కారాలతో, కర్మకాండను జరిగించి తన ఇలవేల్పుగా పూజాగృహంలో ప్రతిష్ఠించాడు. తన కొడుకు ప్రోలయరెడ్డి పేరును ప్రోలయవేమారెడ్డిగా మార్చాడు.

ఆనాటి నుండి కోమటి వేముని భూతం అళియరెడ్డిని పీడించడం మానుకున్నది. అతనికి మరిద్దరు కుమారులు కలిగారు. వారికి అనపోతవేమారెడ్డి, అనవేమారెడ్డి అని నామకరణం చేశాడు. అతని యింట మరల సుఖసంతోషాలు నెలకొన్నాయి. అళియరెడ్డి ఈ విషాద సంఘటనల్ని గుర్తుచేసే ఆ పాత పరిసరాల్ని విడిచిపెట్టి కొత్త ప్రదేశానికి నివాసాన్ని మార్చడం సముచితంగా తోచింది. సకుటుంబంగ అమూల్యమైన పరుసవేది కడవలను తీసికొని అళియరెడ్డి 1323వ సంవత్సరం గుంటూరు జిల్లాలోని కొండవీడనే కుగ్రామానికి తరలి వెళ్ళాడు.

కొండవీటిలో స్థిరపడిన ఒకటి, రెండేళ్ళలోనే అళియరెడ్డి గతించాడు. అతడు మరణించడానికి పూర్వం తన కుమారుడు ప్రోలయవేముడు రాజ్యాభిషిక్తుడు కావటం చూచి ఆనందించాడు. ప్రోలయ పరుసవేది సహాయంతో బంగారాన్ని అధికంగ తయారుచేసి కొండవీటిని బలమైన దుర్గంగ నిర్మించి, సైన్యాన్ని సేకరించి, ఇరుగు పొరుగు రాజ్యాలను ఆక్రమించు కున్నాడు. కాకతీయ సామ్రాజ్యపతనానంతరం బలవంతుడైన రాజులేని కారణంగా ప్రోలయ 1328వ సంవత్సరం స్వతంత్ర రాజ్యాన్ని ప్రకటించాడు.

పన్నెండేండ్ల పాలనానంతరం ప్రోలయ వేమన మరణించాడు. అతని తదనంతరం అనవోతవేమారెడ్డి సింహాసనాన్ని అధిష్టించాడు. అనవోతునికి ధైర్యసాహసాలు, వీరశౌర్యాలు మెండు. అనేక యుద్ధాలుచేసి తన రాజ్యాన్ని రెండింతలుగ విస్తరింపచేశాడు. అయితే అతని నిర్విరామ దండయాత్రల వలన ఖజానా ఖాళీ అయినది. అన్నగారయిన ప్రోలయ వేమునిలా పరుసవేదిని ఉపయోగించి బంగారం చేయడానికి ఇంకా ఆ అద్భుత బలం మిగలలేదు. అయినప్పటికి అనవోతుని అదృష్టం వీడలేదు.

ఒక రహస్య ప్రదేశంలో తాంత్రిక యోగి ఒకడు యజ్ఞంచేయ ప్రారంభించాడు. ఆ యజ్ఞం సఫలం కావడానికి నరబలి అవసరం. ఆ యోగి ఒక పేద గొల్లవానికి ధనాశ చూపి యజ్ఞ వాటికకు పిలుచుకవచ్చాడు.
యజ్ఞగుండంలో మండుతున్న మంటల్లో ఆ గొల్లవానిని త్రోయడానికి ప్రయత్నించాడు. కాని ఆ గొల్లవాడు ప్రాణసంరక్షణార్థం పెనుగులాడాడు. కుమ్ములాటలో గొల్లవాడు తప్పించుకుని ఆ సిద్ధుడే యజ్ఞగుండంలో పడ్డాడు. ఈ ఆకస్మిక సంభవానికి బెదరిపోయిన గొల్లవాడు తన కాళ్ళ సత్తువ కొలది పరుగెత్తి తన పూరిగుడిసెను చేరుకున్నాడు. మరు ఉదయం తనకు వెంట్రుక వాసిలో గండం తప్పిన ఆ చోటికి, యోగి ఏమయ్యాడో తెలుసుకోవాలన్న కుతూహలంతో వెళ్ళాడు. అదురుతూ అతడా స్థలాన్ని సమీపించి నపుడు నిలువెత్తు రెండు బంగారు విగ్రహాలు ఆ యజ్ఞ గుండంలో నిలిచి వుండడం చూచి ఆశ్చర్యపోయాడు. అతడు అసహనంతో చీకటి పడేవరకు వేచి వుండి, తన భార్యబిడ్డల సాహాయ్యంతో ఆ సువర్ణ విగ్రహాలను తన గుడిసెకు చేర్చాడు. ఆ గొల్లవాడు ఆ విగ్రహాలను చెక్కి చిన్న చిన్న బంగారు తునకల్ని గ్రహించాడు. వాటిని అమ్మి ఆ డబ్బుతో తన పశువుల మందల్ని పెంపొందించుకోవడమేకాక, ఇతరత్ర కూడ సంపన్నుడయ్యాడు. ఈ పశువుల కాపరిని అదృష్టదేవత వరించిన వార్తలు కొన్నాళ్ళకు అనవోతునికి అందాయి. అతడు తన భటుల్ని పశువుల కాపరి పూరిగుడిసెను శోధింప పంపాడు. వారు బంగారు విగ్రహాలను కనుగొని రాజు స్వాధీనం చేశారు. దానితో అనవోతుని ఆర్థికస్థితి మెరుగుపడి లేమిచే కలిగిన చింత తీరింది.

ముప్పయి ఏండ్ల మహోజ్వల పరిపాలనానంతరం 1370వ సంవత్సరం అనవోతుడు మరణించాడు. అనవోతుని పుత్రుడు కుమారగిరి వేముడు అప్పటికింకా యుక్తవయస్కుడు కానందున అనవోతుని సోదరుడైన అనవేముడు రాజ్యభారాన్ని వహించాడు. అటు తరువాత కుమారగిరి వేముడు సింహాసనాన్ని అధిష్టించాడు. ఈ కుమారగిరి వేముడు కవి వేమన తండ్రి కావడమే ఆయన విశిష్టత.

మల్లమ్మ కుమారగిరి దంపతులకు కుమారులు ముగ్గురు. వారిలో కడపటివాడే వేమన. రెండవ అనవోతుడు లేక పెదకోమటి వేముడు జ్యేష్టుడు. రాచవే: రెండవ వాడు. వేమన సోదరులిద్దరు 1396వ సంవత్సరం నుండి ఒకరు 1424వ సంవత్సరం నుండి మరొకరు రాజ్యాన్ని పాలించారు. రాచవేముని సైన్యాధిపతుల్లో ఒకరు అతన్ని చంపారు. అంతటితో ఆ వంశం అంతరించింది. కోమటి వేముని భూతం ప్రవచించినట్లే అళియరెడ్డి వంశం నూరేండ్లు మాత్రమే, అంటే 1328 నుండి 1428 వరకు - రాజ్యాధికారం నిర్వహించింది.

కుమారగిరి ముగ్గురు సంతానంలో వేమన చివరివాడు, చురుకైనవాడు కావడంచేత తల్లిదండ్రులు అతిగారాబంచేసి వేమనను చెడగొట్టారు. వేమనకు చిన్నప్పటి నుండి మొండితనం, సొంత పోకళ్ళు ఉండేవి. యుక్తవయస్సులో విలాసాలకు, భోగాలకు బానిస అయ్యాడు. వివాహబంధం వేమన విశృంఖల విహారాన్ని అరికట్టగలదనే ఆశతో తల్లిదండ్రులు అతనిని పెండ్లి చేసుకోమని కోరారు. వేమన కుంటిసాకులు చెప్పి వారు తెచ్చిన సంబంధాలనన్నిటిని తిరస్కరించాడు. వేమన ప్రవర్తన వారి వార్ధక్యంలో తీరని వ్యధను కలిగించింది. వారి మరణంతో వేమనకుండిన ఆ కొద్దిపాటి అడ్డంకులు కూడపోయాయి. వేమన తన ఇరువురు సోదరులలో ఎవరి మాటను కూడ లక్ష్య పెట్టేవాడు కాడు. రాచవేముని సతి రాణి నరసమాంబ. వదినెగారి మాటను మాత్రమే వేమన గౌరవించేవాడు. ఆమె ఆదరాభిమానాలే కాముకుడైన వేమనను తాత్త్విక కవిగ తీర్చిదిద్దాయి. ఆమె ప్రభావంవల్లనే భోగియైన వేమన యోగిగ మారాడు. వేమనలో ఈ పరివర్తన రాకపూర్వం అతడొక దేవదాసితో నివసిస్తుండే వాడు. ఆ వేశ్య అతనిని నిలువునా దోచుకొంటూ వుండేది. ఆమె వంచనలకు అంధుడైన వేమన ఆమె ప్రీత్యర్థం ఏమి చేయడానికైనా వెనుకాడే వాడుకాడు. అయితే ఒక రోజు ఆ గణికురాలు రాణి నరసమాంబ భూషణాలన్నింటిని తానలంకరించుకోడానికి తెచ్చి యీయమని కోరింది. అప్పుడు వేమన స్థితి అడ్డకత్తెరలో పడ్డ పోక చెక్కలాగయినది. దేవదాసికి "లేదు" అని చెప్పగల ధైర్యం లేదు. వదినె గారిని ఈ నీచమైన కోర్కెను కోరలేదు. కనుక అంతఃపురంలో అన్నపానాలు పుచ్చుకోకుండ చిరచిరలాడుతూ రెండు రోజులు గడిపాడు.

నరసమాంబ ఎంతో వేడుకొనగా చిట్టచివరకు వేమన తన మనోవేదనను తెలిపాడు. నరసమాంబ ఒక్క ముక్కరను తప్ప తక్కిన రాజాభరణాలన్నింటిని అతనికి అందించింది. వేమన వెంటనే వాటిని తన ప్రియురాలికి అందచేశాడు. ఆ వెలయాలు నగలనన్నింటిని పరీక్షించి, అందులో లేని ముక్కరను తీసుకొని రమ్మని వేమనను తిరిగి పంపించింది. తిరిగి వచ్చిన వేమనకు నరసమాంబ కొన్ని నిబంధనలను విధించి, ముక్కు పుడకను ఇచ్చింది. ఆమె విధించిన నిబంధన ననుసరించి వేమన తన స్వహస్తాలతో ఆ ముక్కరను దేవదాసికి అందించకూడదు. కాని దానిని దేవదాసి పడక గది గుమ్మంపై పెట్టాలి. ఆమె దిగంబరిగ వెనకకు వంగి తన పెదవులతో ఆ ముక్కరను అందుకొని తీసుకోవాలి. ఈ భంగిమలో నగ్నంగా వున్న ఆమెను వేమన సునిశితంగ ఆపాదమస్తకం పరిశీలించాలి. నాట్యాభ్యాస సమయంలో దేవదాసీల పిల్లలు చాలమందీ నాట్యభంగిమను నేర్చుకుంటారు గనుక ఆ దేవదాసి ఈ గారడీని సులభంగనే చేయగలిగింది. అయితే వంకర తిరిగిన ఆమె నగ్నదేహాన్ని చూచిన వేమనకు ఎంతో ఏవగింపు కలిగింది. ఆ క్షణం నుండి సంబంధాలను యావజ్జీవితం పరిత్యజించడానికి సంకల్పించుకొన్నాడు.

ఈ హఠాత్పరిణామం వేమనను స్తబునిగ చేసింది. కొంత కాలం విచారంతో చురుకుదనాన్ని కోల్పోయాడు. వేమనకొక వ్యాపకాన్ని కల్పించితే ఉత్సాహంగ ఉంటాడని నరసమాంబ ఆశించింది. రాజభూషణాలు చేసే స్వర్ణకారులపై పర్యవేక్షకునిగ వేమనను నియమించింది. వదినెగారి పై గల గౌరవంతో వేమన యీ నూతన బాధ్యతలను ప్రీతితో స్వీకరించాడు. అభిరాముడనే కంసాలి ప్రతిదినం పనిలోకి ఆలస్యంగ వస్తున్నట్లు అనతికాలంలోనే కనిపెట్టాడు. వేమన యెన్ని హెచ్చరికలు చేసినా అభిరాముడు వాటిని లక్ష్యపెట్టలేదు. అతని ఆలస్యానికి కారణం చెప్పమని వేమన నిర్బంధించాడు. అభిరాముడు తనకు పూజాపునస్కారాలు అతి ముఖ్యమని పనికి ఆలస్యంగ రావడాన్ని అన్ని రోజులు కాకపోయినా మరికొన్నాళ్ళపాటైనా అనుమతించాలని కోరాడు. కేవలం ఒక జీతగాడు వినమ్రంగనే అడిగినప్పటికి అధికారాన్ని ఇంత ఖచ్చితంగ ధిక్కరించడం వేమనలో కుతూహలాన్ని రేకెత్తించిది. వేమన అభిరాముని జాడలు తెలుసుకోవాలని సంకల్పించాడు. మరునాటి ఉదయం వేమన అభిరాముని రహస్యంగా వెంబడించాడు.

ఒక చెట్టు అభిరాముడు ఒక గుహాంతర్భాగంలోనికి పాలుపండ్లతో వెళ్ళడం చూచాడు. చాటునుండి అభిరాముని చర్యలను గమనింపసాగాడు. అభిరాముడాపాలను, పండ్లను ఒక యోగి పాదాల చెంత పెట్టాడు. ఆతురతతో ఊపిరి బిగబట్టి చూస్తున్న వేమనకు చాల సమయం గడచినట్లు తోచింది. ఆ యోగి పేరు లంబిక శివయోగి. భక్తి ప్రవత్తులతో వేచివున్న అభిరాముని ఆ యోగి కండ్లు తెరచి చూచి ఇలా చెప్పాడు: "వత్సా! నీ త్రికరణ శుద్ధితోడి భక్తిని నేను మెచ్చాను. రేపు నేనీ ప్రదేశాన్ని విడిచిపోతున్నాను. రేపు సూర్యోదయాత్పూర్వమే నా దగ్గరకు రా. నేను నీకు మంత్రోపదేశం చేస్తాను. అంతేకాకుండ నీకు కొన్ని అమానుష శక్తుల్ని కూడ ప్రసాదిస్తాను." యోగి మాటల్ని వేమన పొంచి విన్నాడు. ఆ యోగి అనుగ్రహించే దివ్యశక్తుల్ని అభిరామునికి మారు తానే పొందాలన్న దృఢ నిశ్చయంతో రాజభవనానికి తిరిగి వచ్చాడు. అంతఃపురానికి వచ్చిన వేమన నరసమాంబను సమీపించాడు. రాణిగారు కోరిన ఒక నగను అత్యవసరంగ చేసి ముగించేవరకు ఆ రాత్రంతా అభిరాముడు రాజభవనపు కార్యానాలోనే ఉండేలాగ రాజు అజ్ఞాపించాలని అందుకు కారణం మాత్రం అడగవద్దని వేమన నరసమాంబను ప్రాధేయపడ్డాడు. వేమన కోరిక మేరకు రాజాజ్ఞ జారీ చేయబడింది. జారీ చేయబడింది. అలా అభిరాముడు యోగి దర్శనార్థం వెళ్ళకుండ నిర్బంధింపబడ్డాడు. నిర్ణీతకాలానికి అభిరామునికి బదులు వేమన ఆ యోగిని సందర్శించడానికి వెళ్ళాడు. వేమన రాకకు యోగి ఆశ్చర్యచకితుడయ్యాడు. యోగికి సాష్టాంగ ప్రమాణం చేసి వేమన ఇలా అన్నాడు: "అభిరాముడు తాను స్వయంగ రాలేని కారణం చేత మీ ఆశీర్వాదాలు అందుకోడానికి తన ప్రతినిధిగ నన్ను పంపాడు."

పాదాలకు ప్రణమిల్లి వున్న ఆ యువకుని రాజసం, మనఃపూర్వక విన్నపం ఆ యోగిని ఆకర్షించాయి. కనుక తన దక్షిణహస్తాన్ని ఎత్తి ఇలా ఆశీర్వదించాడు: "పాపమా పేదవాడు జీవితంలో తన అదృష్టాన్ని కోల్పోయాడు. నీవు ధన్యుడవు. లేచి మంత్రోపదేశాన్ని పొందునాయనా!."

ఒక్క తృటిలో వేమన మహాయోగిగా మారి ఆ గుహ నుండి బయటపడ్డాడు. నేరుగ అభిరాముని దగ్గరకు వెళ్ళి ప్రణమిల్లి అతని క్షమాభిక్షను వేడాడు. పశ్చాత్తాపంతో కన్నీరు కారుస్తూ, "నేను నీకు చేసిన ఈ మహాపరాధానికి ప్రాయశ్చిత్తంగ నీ పేరును ఆ చంద్రార్కంగ నిలుపుతాను." అని ప్రతిజ్ఞ చేశాడు. ఈ వాగ్దానాన్ని నిలపడానికే వేమన తన పద్యాల మకుటంలో "అభిరాము"ని పేరును పొందుపరిచాడు.

యోగి వేమన అద్భుతశక్తుల్ని ప్రదర్శించాడు. పుచ్చకాయల్ని పండించి శిష్యులకు దానం చేశాడు. అతడు బహూకరించిన ప్రతిపుచ్చకాయలోను బంగారు గింజలుండేవి. అతని తోట నుండి దొంగిలించిన పుచ్చకాయలన్నింటిలో నిండుగ పురుగులుండేవి. కొన్ని సమయాలలో వేమన తన కాతిథ్యమిచ్చే గృహస్థుల ఇండ్లలోనే మలాన్ని విసర్జించేవాడు. వారేవగించుకొని ఆయనను గృహం నుండి బహిష్కరించితే ఆ మలం శాశ్వతంగ ఆ ప్రదేశాన్ని మైలపరచేది. అలా కాకుండ ఇదొక బాల్యచేష్ట అని, యోగి తమ్మును గౌరవించాడని వారు భావిస్తే ఆ మలం బంగారంగ మారేది. భక్తితో ఆయన మూత్రాన్ని స్వీకరించినా అది సువర్ణజలంగా మారేది. హేతువాదులెవ్వరూ ఈ మలమూత్రాల పరివర్తనాన్ని నమ్మరు. వాటి దుర్గంధాన్ని నిద్రలో కూడ సహింపలేరు. కనుక మనమింతటితో ఈ పుక్కిటి పురాణాలను కట్టి పెడితే బాగుంటుంది.

## మసక వెలుగు

### నేడు చీకటిని గుడ్డి దీపాలు వెలుగిస్తున్నాయి.- ఏ.జి. గార్డినర్

కట్టుకథలోని కల్పనను చరిత్ర అనే ముసుగుతో కప్పుతుంటారు. కాని ఆ ముసుగు చాలా పలచనిది గనుక ఆ కల్పన కనిపిస్తూనే ఉంటుంది. వేమనను గూర్చిన గాథలే ఇందుకు నిదర్శనం. ఆ గాథలు ఒక వంశాన్ని ఆధారంగా గ్రహించి తేదీలు వారిగ కూర్చబడ్డాయి. అయినా అవి నిశిత పరిశీలనకు ఒక్క క్షణం కూడ నిలువలేవు.

రెడ్లలో ఈ నాటికీ "వేమ" "వేమన" అన్న పేర్లు ప్రచురంగ లేవు. కాని ఆంధ్రదేశపు కోస్తాతీరంలోని అధిక భాగాన్ని ఒక శతాబ్దికి పైగా పరిపాలించిన రెడ్డి వంశీయులలో అనేకుల పేర్లు "వేమ" అనే ఉన్నది. మన కవి పేరు కూడ వేమనే. కనుక కవి యీ రాజ వంశానికి చెంది వుండాలి. స్వయంగా రాజవంశీయుడు కాకున్నా ఆ వంశంతో సంబంధాన్ని కల్పించడం చేత అతనికి రాజపురుష గౌరవం ఆపాదింపబడుతుంది. ఆ రాజవంశీయుల పేరే కవికి ఉండటం చేత ఈ కట్టుకథకి చరిత్రాత్మకత, సంభావ్యత సిద్ధిస్తున్నాయి. అంతే కాకుండ రెడ్డిరాజులు కొందరు సుప్రసిద్ధ కవులు, పండితులు, వ్యాఖ్యాతలు కావటం ఈ సంబంధాన్ని మరింత పటిష్ఠం చేస్తున్నది.

అయితే ఈ రెడ్డి రాజుల పేరులలో "కోమటి" అన్న పదం ఎలా చోటు చేసుకున్నది? చాతుర్వర్ణక్రమంలో మూడవదైన వైశ్యకులానికి పర్యాయపదం "కోమటి" నాల్గవదియైన శూద్రకులానికి చెందిన వారు రెడ్లు. ఒక రెడ్డి కులజుడు వైశ్యుడు కావడం అసంభావ్యం. ఈ అసంభావ్యతని వివరించడం ఎలా? ఒక మారుమూల పేదరికంతో వ్యవసాయం చేసుకుంటున్న ఒకానొక రెడ్డి కుటుంబం ఆకస్మికంగా, అతి వేగంగా సుసంపన్నమై రాచరికాన్ని ఎలా చేపట్టింది? కట్టుకథలలో కోమటి వేమనను రెండు పరుసవేది కడవలను కల్పించి, పై రెండు ప్రశ్నలకు చక్కని సమాధానాలను సమకూర్చినట్లు సంతసించారు.

ఇటీవల చారిత్రక పరిశోధనలు, సాహిత్య పరిశీలనలు పై కట్టుకథలు అసత్యాలని నిరూపించి, క్రింది సత్యాలను వెల్లడించాయి. ఈ రెడ్డిరాజుల ఇంటి పేరు "దాసటి" కాని "ఏంటి" కాదు. ప్రోలయవేమునికి ముఖ్య పట్టణం కొండవీడు కాదుగాని అద్దంకి నుండి కొండవీటికి మార్చాడు. కట్టుకథలలో చెప్పబడినట్లు అనవోతుడు ప్రోలయవేముని సోదరుడు కాదు. కుమారుడు. కుమారగిరి వేముని తరువాత రాజ్యాన్ని పాలించిన పెదకోమటి వేముడు అతని పుత్రుడు కాడు. అతని పెత్తండ్రి కుమారుడు. ఈ వంశంలో కడపటి రాజైన రాచవేముడు పెదకోమటి సోదరుడు కాదు. అతని కుమారుడు. ఈ చారిత్రకాంశాలన్నీ కవి వేమన రాజవంశీయుడు కాదన్న విషయాన్ని ఎలా నిరూపిస్తున్నవని ప్రశ్నించవచ్చు. దీనికి సమాధానం చాలా సులభం. కుమారగిరి వేముని కనిష్ట పుత్రుడు వేమన అని కట్టుకథలు పేర్కొంటున్నాయి కాని కుమారగిరికి కట్టుకథలలో చెప్పబడినట్లు ముగ్గురు కొడుకులు లేరు. అతని ఏకైక పుత్రుడు బాల్యంలోనే మరణించాడు.

కట్టుకథల్ని, పుక్కిటి పురాణాల్ని అసత్యాలుగ కొట్టి వేయడం చాలా తేలిక. వేమన జీవిత చరిత్రకు సంబంధించిన సత్యాలను సేకరించడం అసాధ్యం కాక పోయినా, కష్టసాధ్యమని మాత్రం చెప్పక తప్పదు. వేమన జీవిత విశేషాలను సేకరించడానికి ప్రయత్నించిన ప్రథమ వ్యక్తి సి.పి. బ్రౌన్. మనకన్నా బ్రౌన్ వేమనకు సమీప కాలంలో జీవించినవాడు. ఇప్పటికి ఒకటిన్నర శతాబ్దం పూర్వమే పరిశోధన ప్రారంభించాడు. ఇప్పటికన్నా వేమనకు సమీపకాలం వాడైన బ్రౌన్ విషయ సేకరణ చేయడానికి పరిస్థితులు అనుకూలంగ ఉండినవి. బ్రౌన్ ఎంతో శ్రద్ధతో ప్రయత్నించి కూడ సేకరించినది చాలా స్వల్పం. బ్రౌన్ తాను ఇంగ్లీషులోనికి అనువదించిన వేమన పద్యాలను టుప్పికతో 1829వ సంవత్సరం మొట్టమొదటిసారిగా ప్రచురించాడు. ఆ పుస్తకపు మున్నుడిలో బ్రౌన్ ఇలా పేర్కొన్నాడు.

“వేమన కాపుకులజుడు, కందనూలు (కర్నూలు) నాడులో రాజుగ ఉండిన అనవేమారెడ్డి వంశజుడని కొందరి గట్టి నమ్మిక. గండికోట దుర్గాన్ని వేమన సోదరుడు పాలించినట్లు ప్రతీతి. కందనూలులోని క్రిష్టిపాడు అతని స్వగ్రామమని కొందరి విశ్వాసం. మరికొందరు గుంటూరు మండలంలోని వినుకొండ వేమన స్వగ్రామమంటారు. కడపజిల్లాలోని చిట్వేలులో వేమన జన్మించినట్లు కూడ జనశ్రుతి. ఈ ప్రాంతాలన్నింటిలో వేమనను గూర్చి వాకబు చేసే అవకాశం నాకుండినది. అయినప్పటికి ఈ లోక వృత్తాంతాలను బలపరిచే ఆధారాలుగాని, వివరాలు గాని నాకు లభించలేదు. వేమన పద్యాలలోని కొన్ని మాండలికాలను పరిశీలిస్తే ఆయన తెలంగాణా ఈశాన్య ప్రాంతపు వాడనిపిస్తుంది. పైన పేర్కొన్న ఊళ్ళు ఈ ప్రాంతానికి చెందినవే. వేమన 17వ శతాబ్దారంభంలో జీవించి ఉన్నట్లు ప్రజాభిప్రాయం.”

ఈ ప్రచురణకు పూర్వం అనువదించి ప్రకటింపని పెద్ద సంపుటంలో *(ఈ సంపుటాన్ని 1967వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు వారు ప్రచురించారు. దీనిలో 1215 పద్యాలు, వాటి ఇంగ్లీషు అనువాదాలు వున్నాయి.)* (బహుశః బ్రౌన్ కు తన అనువాదపు తీరు సంతృప్తికరంగా ఉండి ఉండక పోవచ్చు.) ఇంతకన్నా నిర్దిష్టమైన అభిప్రాయాలను వెలిబుచ్చాడు. గండికోట సమీప ప్రాంతంలో వేమన జన్మించి ఉండవచ్చు అన్న అభిప్రాయంతో తానేకీభవిస్తున్నట్లు వ్యక్తం చేశాడు. వేమన పద్యాలలోని అంతస్సాక్ష్యాన్ని బట్టి వేమన 17వ శతాబ్దపు ఉత్తరార్థంలో పద్యరచనను కొనసాగించి 18వ శతాబ్దారంభం వరకు జీవించి వున్నట్లు సహేతుకంగ నిర్ణయింపవచ్చునని పేర్కొన్నాడు. వేమన 17వ శతాబ్ది పూర్వార్థంలో కాకుండ ఉత్తరార్థంలో జీవించినట్లు బ్రౌన్ అభిప్రాయమని దీనిని బట్టి వ్యక్తమవుతున్నది.

కాని బ్రౌన్ కు మరల వేమన కాలాన్ని గురించి సందేహం కలిగి వేమన 15వ శతాబ్దానికి చెందిన వాడని తెలిపాడు. బ్రౌన్ అనువదించిన వేమన పద్యాల ద్వితీయ ముద్రణ 1839వ సంవత్సరంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని గ్రంథాలయాలలో గాని, పండితుల వద్దగాని యీ ద్వితీయ ముద్రణ ప్రతులు లభించలేదు. మేజర్ మ్యాక్ డొనాల్డ్ (Major Macdonald) ఈ ద్వితీయ ముద్రణను గూర్చిన కొన్ని వివరాలు తెలిపాడు. “ఈ ప్రతిలో ఆంగ్లానువాదం టు టీకల్లేవు. వాటిని తీసివేశారు. మత, నైతిక విభాగాలలో అనేక క్రొత్త పద్యాలు సమకూర్చబడ్డాయి. ప్రథమ ముద్రణలో 693 పద్యాలు మాత్రమే ఉండగా, ఈ ద్వితీయ ముద్రణలో 1163 పద్యాలున్నాయి." ఈ ద్వితీయ ముద్రణలోని యీ క్రింది విషయాలను కూడ మ్యాక్ డొనాల్డ్ ఉద్ధరించాడు: “వేమన రచనలు ఇప్పటికి సంపూర్ణంగ నాలుగు వందల ఏండ్లు ప్రాచీనమైనవని ప్రజల ప్రగాఢ విశ్వాసం. తెలుగు బసవ పురాణ కర్తకు వేమన సమకాలికుడని జంగముల పరిగణన. వారి అంచనా సరి అయితే వేమన పూర్వుడవుతాడు. బ్రౌన్ ప్రథమ నిర్ణయం ప్రకారం ఆంగ్లకవులైన బేకన్ (Bacon) ) షేక్స్పియరులకు, ద్వితీయ నిర్ణయం చొప్పున చాసర్ (Chaucer) మహాకవికి సమకాలీనుడవుతాడు.” మ్యాక్ డొనాల్డ్ బ్రౌన్ అభిప్రాయాలతో ఏకీభవించలేదు. స్వయంగ తానే కొంత పరిశోధించి విషయసేకరణ చేసి, తదాధారంగ 17వ శతాబ్దపు మధ్యకాలంలో వేమన జన్మించినట్లు నిర్ధారించాడు.

వేమన కాలాన్ని గూర్చి గోవర్ (Gover) కూడ తన అభిప్రాయాన్ని తెలిపాడు. “మహమ్మదీయ మతం, ముస్లిముల పరిపాలనను గూర్చిన ప్రస్తావనలు వేమన పద్యాలలో కనిపించకపోవడం; 10వ శతాబ్దానికి తత్సమీప కాలానికి చెందిన తమిళ కవుల శైలిని పోలిన శైలి వేమన కవితకుండడం వలన వేమన కాలం 12వ శతాబ్దాంతంగ ఉండవచ్చు” అని గోవర్ సూచించాడు.

బ్రౌన్ వేమన పద్యాల ద్వితీయ ముద్రణను గోవర్ చూచి ఉన్నట్లయితే తన అభిప్రాయానికి ఉపబలకంగా బ్రౌన్ అభిప్రాయాలను గ్రహించి వుండే వాడే. మహమ్మదీయ మతాన్ని గాని, ముస్లిముల పరిపాలనను గాని వేమన ప్రస్తావించలేదని గోవరనడం పొరపాటు. వేమన పద్యాలలో కనీసం మూడు పర్యాయాలైనా ముస్లిముల ప్రస్తావన ఉన్నది. క్యాంబెల్ (Campbell) గోవర్ కాక కొంత వరకు మ్యాక్ డొనాల్డ్ అభిప్రాయాలతో ఏకీభవించాడు. అయినా ఆయన అభిప్రాయాలతో కొంత అనిశ్చయత గోచరమవుతుంది. వేమన 16వ శతాబ్దపు మధ్యకాలానికి చెందిన వాడని క్యాంబెల్ నిర్ణయించాడు. "వేమన ఇప్పటికి 250 ఏండ్ల క్రితం జీవించినట్లు సామాన్య జనాభిప్రాయం." అని తెలిపాడు. వేమన జన్మస్థలాన్ని గూర్చి కూడ క్యాంబెల్ కు నిశ్చితాభిప్రాయం లేదు. క్యాంబెల్ ఇలా వ్రాశాడు.

"అనేక ప్రదేశాలను వేమన జన్మస్థలంగ పేర్కొంటారు. మద్రాసుకు వాయవ్య దిక్కులో రెండు వందల మైళ్ళ దూరంలో కడపజిల్లాలోని కొండ ప్రదేశంలో వేమన జన్మించి ఉండవచ్చునని మాత్రమే చెప్పగలను గాని అంతకన్నా నిర్దిష్టమైన అభిప్రాయాన్ని వెల్లడించలేను. కొంచెం ఉత్తర దిక్కుగ వున్న కడప, కర్నూలు పట్టణాలలో నిస్సందేహంగ వేమన సంచరించాడు. కడప జిల్లాకు నైరుతిగ ఉన్న కటారిపల్లె అన్న గ్రామం వేమన నివాసస్థలం అని జనశ్రుతి. ఇప్పటికీ ఆ గ్రామంలో ఒక కుటుంబీకులు తాము వేమన వంశీయులమని చెప్పుకుంటున్న వారు వున్నారు. వేమన సమాధిని సందర్శింప వచ్చిన వారు యిచ్చే కానుకల్ని స్వీకరిస్తుంటారు. క్యాంబెల్ శ్రమించే పరిశోధకుడు. వేమన తన జీవిత చరమదశ లో కటారిపల్లెలో గడిపి, అక్కడే అంతిమశ్వాసను విడిచాడన్న జనశ్రుతి నాధారంగ చేసికొని క్యాంబెల్ ఆ పల్లెను దర్శించాడు. అక్కడ వేమన సమాధిని సందర్శించాడు. వేమన వంశస్థుడనని చెప్పుకుంటూ ఆ సమాధిని పరిరక్షిస్తున్న ఒక వ్యక్తిని కలసుకున్నాడు.
ఆ సమాధి సమీపంలో వికారమైన వేమన దారు శిల్పమున్న ఒక గుడిని చూచాడు "మేము వేమనను తప్ప వేరే దైవాన్ని పూజింపం. వేమనే మా ఇలవేల్పు" అని చెప్పుకునే కొందరు ప్రజలను కూడ క్యాంబెల్ కలుసుకున్నాడు. ఆ గ్రామం నుండి తిరిగి వచ్చిన తరువాత తాను కనిన వినిన విశేషాలనన్నింటిని గ్రంథస్థం చేశాడు.

కటారిపల్లెలో వేమన తమ పూర్వీకుడు అని చెప్పుకునే కుటుంబస్థుల దగ్గర "వేమన చరిత్రము" అన్న తాళపత్ర గ్రంథమున్న విషయం క్యాంబెల్ దృష్టికి ఎవరూ తేలేదు. అదొక శిథిలమైన తాళపత్ర ప్రతి. దీనికి ఒకే ఒక మారుప్రతి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి సేకరణలో ఉన్నది. ఈ ప్రతులను పరిశీలించితే "వేమన చరిత్రము" 1835వ సంవత్సరానికి చెందినదని తేలింది. "వేమన యోగీంద్ర చరిత్రము" అన్న గ్రంథంలో సంకలితమైన వాటిని మించిన అద్భుత, అర్థరహిత కట్టుకథల సంకలన ఈ వేమన చరిత్రము. అంతేకాకుండ ఇందులో కొన్ని వివరాలు ఈ వేమన యోగి జీవిత చరిత్రకు సంబంధించినవి కాక తుంగ వేముడన్న మరొక వ్యక్తికి చెందినవి. తుంగ వేమన రచించిన శతాధిక పద్యాలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

పై విదేశీయ విద్వాంసుల తరువాత వేమనను గురించి రచించిన గ్రియర్సన్ (Grierson) వేమన 16వ శతాబ్దంలో జీవించినట్లు అభిప్రాయపడ్డాడు. గ్రియర్సన్ కూడ జనుల్లో వ్యాప్తిలో వున్న కథల్ని ఆధారంగ గ్రహించే ఈ నిర్ణయాన్ని చేశాడు.

వేమనను గురించి పరిశోధనకు పూనుకొన్న ప్రథమాంధ్రుడు కె.వి. లక్ష్మణరావు. ఆంధ్రదేశంలో చారిత్రక, సాహిత్య పరిశోధనలకు కూడ లక్ష్మణరావే మార్గదర్శకుడు. లక్ష్మణరావును అనుసరించి అనేకులు వేమనపై శ్రద్ధచూప ప్రారంభించారు. వారిలో వంగూరి సుబ్బారావు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, శేషాద్రి రమణ కవుల జంట, వేటూరి

ప్రభాకరశాస్త్రి, బండారు తమ్మయ్య. చాగంటి శేషయ్య, వేదం వేంకట కృష్ణశర్మ ప్రసిద్ధులు. వీరందరు వేమనను గురించి తమకు సాధ్యమైనంత కృషిని చేశారు కాని వేమన చరిత్ర చుట్టూ ముసిరిన చీకట్లను వీరు వెలిగించిన చిరుదివ్వెల మసక వెలుగు పారద్రోల లేకపోయింది. వీరు ఎవరికి తోచినట్లు వారు ఆంధ్రదేశంలోని వివిధ ప్రదేశాలను వేమన జన్మస్థలంగ నిర్ణయించారు. 15వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం వరకు ఒక్కొక్క శతాబ్ది వేమన కాలంగ వెల్లడించారు.

వేమనను గురించి వ్రాసిన తెలుగు రచయితల్లో వంగూరి సుబ్బారావు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు మాత్రమే విపులంగా, సహేతుకంగ చర్చించి గ్రంథ రచన చేసిన వారు. 1922వ సంవత్సరం వంగూరి సుబ్బారావు విమర్శనాత్మకమైన వేమన జీవితచరిత్రను ప్రకటించారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1928వ సంవత్సరం వాల్తేరు ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి "సర్, రఘుపతి వేంకటరత్నం" ధర్మనిధి ఉపన్యాసాల అంశంగ వేమనను ఎంచుకొని ప్రసంగించారు. వేమనను గురించి రచించిన రచయితలందరిలో ఈ ఇద్దరు వేమనకు సంబంధించిన అనేకాంశాలలో ముఖ్యంగ వేమన కాలాన్ని గురించి వ్యతిరేకిస్తారు.

వంగూరి సుబ్బారావుగారు వేమన 15వ శతాబ్ది పూర్వార్ధంలో జన్మించి వుంటాడని, శ్రీనాధునికి కనిష్ఠ వయస్కులైన సమకాలికులలో ఒకడై ఉంటాడని అభిప్రాయపడ్డారు. తన నిర్ణయాలన్నింటికి కొమర్రాజు లక్ష్మణరావుగారి అభిప్రాయాలను ఆధారంగ చూపారు. అంతే కాకుండ కొందరు మధ్యయుగపు కవులు "వేమ" అని ప్రస్తావించిన సందర్భాలను ఆయన ప్రబలాధారాలుగా పేర్కొన్నారు. కాని యీ ఆధారం పూర్వపక్షానికి నిలువగలిగినంత బలమైనది కాదు.
ముందు పేర్కొన్నట్లు 20వ శతాబ్దపు ద్వితీయ దశకం మధ్య నుండే ఆంధ్ర పండిత లోకం వేమనను గుర్తించటం మొదలు పెట్టింది. అంతకు పూర్వమున్న వారు వేమనను నిర్లక్ష్యం చేశారు వేమనను కవిగనే పరిగణించలేదు. వాస్తవమిది. కనుక ప్రాచీన కవులెవ్వరూ, ముఖ్యంగ విద్వత్కవులైన తురగా రామకవిగాని, ఎడపాటి ఎర్లాప్రగడ కాని వేమనను కవిగ స్మరించి వుండరు. "వేమ" అన్న పేరు గల రెడ్డిరాజులు కొండవీటిని, రాజమండ్రిని పాలించారు. వారు ఉదారులైన సాహిత్య పోషకులు. వారిలో కొందరు స్వయంగ కవులు, విద్వాంసులు కూడ. మధ్యయుగపు కవుల పూర్వ కవిస్తుతిలో "వేమ" అన్న పేరు ఉండినట్లయితే అది యీ రెడ్డిరాజులనుద్దేశించినదై వుంటుంది, కాని వేమనయోగి ప్రస్తావన కాదు.

వేమన కాలాన్ని సాధ్యమైనంత వెనక్కు నెట్టి ప్రాచీనంగ చూపాలని వంగూరి ప్రయాసపడితే, రాళ్ళపల్లి ఆ కాలాన్ని ముందుకు త్రోసి అర్వాచీనంగ చూప ఆరాటపడ్డారు. 18వ శతాబ్దపు పూర్వార్ధంలో వేమన జీవించినట్లు రాళ్ళపల్లివారి అభిప్రాయం. ఖచ్చితమైన ఆధారాలు లేనపుడు మొండిగ వితర్కించడం తొందరపాటవుతుంది. కాని బ్రౌన్ తన తొలి రచనల్లో వేమన జనన (1652) మరణాలకు (18వ శతాబ్దపు తొలి శతాబ్దాలు) సంబంధించి సూచించిన తేదీలు బహుశా సరియైనవి కావచ్చు.

వేమన పద్యాలాధారంగ అతని జన్మస్థలం కొండవీడని వంగూరి వారు నిర్ధారించారు. ఇతరాధారాలు లభించే వరకు కొండవీటినే వేమన జన్మస్థలంగ పరిగణింప వచ్చునని రాళ్ళపల్లివారు అంగీకరించారు. ఈ ఒక్క విషయంలోనే వారిద్దరకు భేదాభిప్రాయాలు లేకుండ ఏకవాక్యత కుదిరింది. వేమన కొండవీటిలో తన బాల్యాన్ని గడిపినాడనడంలో సందేహం లేకున్నా, అతని పుట్టుక మాత్రం మూగచింతపల్లెలో అని కొందరి విజ్ఞుల భావన. వేమన బాల్యదశలో అతని తల్లిదండ్రులు కొండవీటికి వలసపోయి వుంటారని వారి వాదన. రాళ్ళపల్లివారే వాదాన్ని పెంచక, వేమన జన్మ స్థలమేదైనా; ఆయన జీవితంలో అధిక భాగాన్ని ఇప్పటి రాయలసీమైన కడప, కర్నూలు జిల్లాలలో గడిపాడని నిర్ధారించారు.

వేమన కులాన్ని గురించి కూడ వాదోపవాదాలున్నాయి. వేమన కాపుకులజుడని రాళ్ళపల్లివారి భావన. వంగూరి, తదితరులు వేమనది రెడ్డికులమని సూచించారు. ఇరువురూ వేమన పద్యాలను తమ కాధారంగ చూపారు. వేమన పద్యాలీ అభిప్రాయ ద్వయాన్ని బలపరుస్తున్నవి. తాను కాపుకులజుడనని ఒక స్థలంలో, రెడ్డివంశజుడనని మరొక స్థలంలో వేమన పేర్కొంటాడు. వేమన పేర్కొన్న దానిలో వ్యంగ్యం లేదు. వేమన తాను కాపునని, రెడ్డినని కూడ తెలపడం వాస్తవమే. ఇటీవలి కాలం వరకు "కాపు" "రెడ్డి" పదాలు సమానార్థకాలుగ వాడబడేవి. 1909వ సంవత్సరంలో ప్రచురితమైన ఎడ్గర్ తర్ (Edgar Thurston) రచించిన "దక్షిణ భారతములోని కులాలు, తెగలు" (Castes and Tribes of India) అన్న గ్రంథంలో "రెడ్డి" అన్నది ఒక ప్రత్యేక కులంగ ప్రదర్శింపబడలేదు. "కాపు" అన్న శీర్షిక క్రిందనే రెడ్ల ఆచార వ్యవహారాలను గురించిన సుదీర్ఘ వ్యాసమున్నది. ఆ వ్యాసంలో "కాపు" "రెడ్డి" అన్న పదాలు ఆ " పర్యాయ పదాలుగ ఉపయుక్తమయ్యాయి.' *కాపు, రెడ్డి, పదాలు పర్యాయ పదాలుగ 16, 17వ శతాబ్దాలలో ప్రయుక్తమనడానికి అనువాదకురాలు పాండురంగ లోని నిగమశర్మోపాఖ్యానం నుండి చూచిన ఆకరాలు: (i) క. కాపు కొడుకొక్కరుండు...*

*i) క. కాపు కొడుకొక్కరుండు... పాం. రం మా. 3: 55. ii) సీ.తే. ఎవ్వడా రెడ్డి యింటికి నెగ్గు చాలఁజేయు..." 3: 68. iii) క. ఎడ్డ తనపుఁ గయిసే తల, రడ్డులు నడచిరి..." 3: 75, iv) తే. కాపుఁగేడలు కంచంత కాఁపురంబు... గాడ్పురచి యుడికె" 3: 81.*


బ్రౌన్ "తెలుగు - ఇంగ్లీషు" నిఘంటువులో ఈ పదానికి ఈయబడిన అర్థాలు: "A tenant, a farmer, a cultivator. A rustic or Country man, a subject and a dweller".
ఇన్ని అర్థాలలో "రైతు" అన్నదే ప్రహతంగ వ్యవహారక్షుణ్ణమైనది. "కర్షకుడు" అన్న సంస్కృత పదానికి సమానార్థకంగ తెలుగులో వాడబడుతున్న 'రైతు" అన్న పదం నిజానికి తెలుగు పదం కాదు. 'రైత" అన్నది ఉర్దూ పదం. దాన్ని ఉకారాంతంచేసి తెలుగులో 'గ్రహించారు. ఇటీవలనే "కాపు" అన్న పదం పరిమితార్థంలో కాకపోయినా, కొంతవరకు కులవాచిగా వ్యవహార రూఢమైనది. కనుక వేమన కాపు-రెడ్డి-ఉభయ వర్ణాలకు చెందినవాడని చెప్పవచ్చు. నిర్దుష్టంగ చెప్పాలన్న నిర్బంధం ఉన్నట్లయితే వేమన రెడ్డికాపు. అంటే రెడ్డి కులానికి చెందిన కాపు. స్పష్టంగ వివరించాలంటే కులం చేత రెడ్డి వృత్తి చేతకాపు.

వేమన మరణకాలాన్ని గురించి కూడ వంగూరి వారికి, రాళ్ళపల్లి వారికి ఏకవాక్యత కుదరలేదు. వేమన తన చరమదశను కటారిపల్లెలో గడిపి మరణించినట్లు వంగూరి వారు భావిస్తున్నారు. స్పష్టంగా వ్యక్తం చేయకపోయినా కటారిపల్లెలోని సమాధి వేమన సమాధిగ వారు అంగీకరిస్తున్నట్లు తోస్తుంది. ఈ విషయంలో రాళ్ళపల్లి వారికి అనేక సందేహాలున్నాయి. క్యాంబెల్ దొరగారి వలె రాళ్ళపల్లి వారు కూడ స్వయంగ కటారిపల్లెను సందర్శించారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ధర్మనిధి ఉపన్యాసాలకై విషయాన్ని సేకరిస్తున్న సందర్భంలో ఇప్పటికి 40 ఏండ్ల క్రితం రాళ్ళపల్లి వారు అక్కడికి వెళ్ళారు. కటారిపల్లెలో ఆ సమయంలో వున్న పూజారి వేమన కవిగ చెలామణి అవుతున్న ఆ గుడి, ఆ సమాధి వాస్తవానికి వేమనవి కావని రాళ్ళపల్లి వారితో చెప్పాడట. కనుక వేమన కటారిపల్లెలో సమాధి పొందలేదు గాని రాయలసీమలో మరెచటనైనా నిర్యాణాన్ని పొంది వుండ వచ్చునన్నది రాళ్ళపల్లివారి సిద్ధాంతం. వేటూరి ప్రభాకరశాస్త్రి తమకు తెలిసిన సంప్రదాయ ప్రకారం ఆదిశంకరాచార్యులకు వలె వేమన ఒక గుహలో ప్రవేశించి తనువు చాలించి వుంటాడని రాళ్ళపల్లివారి సూచన. వేమన నిర్యాణం పొందిన గుహ కడప జిల్లాలోని పామూరు గ్రామసీమలో వున్నట్లు వేమన శిష్యపరంపరలో కొందరి నమ్మిక.

వేమన జీవితానికి సంబంధించిన ఈ విషయాలన్నీ ఇంకా వివాదగ్రస్తమైనవే, వీటన్నింటిని గురించి ఇంకా తీవ్రమైన వాదోపవాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. పండితులు, పరిశోధకులు తమ వాదాల వలయాలను వదలకుండా వాదించినంతకాలం ఈ వివాదానికి అంతు చిక్కదు.

## అతడు మానవుడు

అతడు మానవుడు, అన్ని విధాల మానవునిగనే స్వీకరించండి.
అతని వంటి వానిని మరలా నేను సందర్శించబోను.- షేక్ స్పియర్



సామాన్యంగ ఒక జీవిత చరిత్రకారునికి అవసరమైన జననకాలం, జన్మ స్థలం, తల్లిదండ్రుల పేర్లు ఇత్యాది వివరాలను మినహాయిస్తే వేమన పద్యాలాధారంగా, అంతస్సాక్షాన్ని బట్టి అతని జీవితాన్ని పునర్నిర్మించవచ్చు. వేమన జీవిత తాత్త్విక కవి. జీవితమంటే ఏమిటో అనుభవపూర్వకంగ తెలిసికొన్నాడు. జీవితంలో పడరానిపాట్లు పడ్డాడు. జీవితపోరాటంలో కొన్ని మారులు విజయాన్ని, కొన్నిసార్లు పరాజయాన్ని పొందాడు. అన్నివేళలా, ప్రతి సన్నివేశంలో అధిగమించాడు. వేమనకు జీవితమంటే సత్యశోధన; అన్వేషణార్థమైన ఒక సాహస యాత్ర. జీవితంలో నిమగ్నుడై, జీవితంతో బహువిధాల సన్నిహితత్వాన్ని నెరపిన వేమన తన జీవితాన్నేగాక లోకజీవితాన్ని కూడ తన కవితలో ప్రతిఫలించాడు. అక్కడక్కడ తన కవితలో వ్యక్తం చేసిన ఒకానొక భావనలోనో, ఉపమలోనో, విలక్షణమైన నుడిలోనో వేమన వ్యక్తిగత జీవితాన్ని లీలగ తిలకింపవచ్చు. వేమన ఏవగించుకునే వాటిలోను, అభిమానించే వాటిలోను, వేమన జీవితాన్ని సందర్శించవచ్చు. ఆయన అభిమానించే, ద్వేషించే ఆవేదన చెందే వాటి నన్నింటిని సమీకరించడం వలన వేమన జీవితాన్ని సంగ్రహించవచ్చు. నిశితబుద్ధితో వేమన వాక్కుల్ని గ్రహింపగలిగిన వారికి వేమన ఆత్మీయత, వ్యక్తిత్వం ఆయన కవితలో గోచరమవుతుంది. అది చేయగలిగితే కవితలో ఆత్మీయతను ప్రదర్శించిన కవులలో వేమనను మించిన వాడు లేదని తెలిసికొంటారు.

వేమన పద్యాలలో ప్రతిఫలించే ఆయన జీవితాన్ని పరిశీలించితె ఆయన రాజవంశీయుడు కాదని తెలుస్తుంది. రాజాంతఃపురం కాదుగాని సాగుభూమి వేమన జీవిత నేపథ్యంగ దర్శనమిస్తుంది. అదొక పెద్ద కమతం కాదుగాని ఒక కుటుంబ సుఖ జీవనానికి సరిపడేంత సాగుభూమి మాత్రమే. వేమనది వానాకాలం చదువు. చదువుకు స్వస్తి చెప్పిన వెంటనే తండ్రికి వ్యవసాయంలో తోడ్పడసాగాడు. ప్రతి ఉదయం పశువుల్ని పచ్చిక బయళ్ళకు తోలుకు వెళ్ళి సాయంకాలానికి ఇంటికి తోలుక వచ్చేవాడు. పొలం దున్నటంలో, నారు నాటడంలో, కలుపు తీయడంలో తోడ్పడేవాడు. మంచె మీద నిలిచి వడిసెలతో గింజలు తినే పిట్టల్ని అదల్చేవాడు. కోత కోయడంలో, పంట నూర్చడంలో, తూర్పారపట్టడంలో చేయూత నిచ్చేవాడు. ఎడ్ల బండి మీద ధాన్యపు బస్తాల్ని ఎక్కించుకొని, ఎడ్లని అదల్చి తోలుతూ, గర్వంగ పంటని ఇల్లు చేర్చేవాడు. ఏ పనినైనా ఆనందంగ చేసేవాడు. పనిచేస్తూ కూనిరాగాలు తీసేవాడు. పల్లెపదాల్ని సర్వాతిశయంగ పాడేవాడు. గ్రామ దేవాలయం ముంగిట ప్రదర్శించే వీధి నాటకాల్ని తోలుబొమ్మలాటల్ని చూడకుండ, భారత రామాయణ పారాయణాన్ని వినకుండ ఉండేవాడుకాదు. ఈ మహాకావ్యేతిహాసాల కొన్ని భాగాలను యథాతథంగ ధారణ చేసేవాడు.

వీటన్నింటికన్న సంపన్న సమవయస్కుల స్నేహం వేమనకు అమితానందాన్ని, సంతృప్తిని కలిగించేది. వారి సరదాలు తీర్చడానికి పల్లెచెరువులో ఈతలాడడానికి, సమీప కొండకోనల్లో విహారాల్ని ఏర్పాటుచేయడానికి వేమన కొన్ని మారులు పొలం పనులు మానుకునే వాడు. అగ్రవర్ణాల వారి ఆచారాలను ద్వేషించి అందరితో కలసిమెలసి తిరిగేవాడు. వేమనకు పశుపక్ష్యాదులంటే అభిమానం. పక్షుల్లో కాకి, గుడ్లగూబ; జంతువుల్లో కుక్క పంది, గాడిదలను అసహ్యించుకునే వాడు. వేమనవి నిర్మొహమాటమైన మాటలు, శీఘ్ర నిర్ణయాలు, సాహస కృత్యాలు. ఆయన నూటికి నూరుపాళ్ళు బహిర్ముఖ స్వభావుడు. వ్యక్తిగత దూషణనుగాని, సామాజిక అన్యాయాన్ని కాని సహించే వాడుకాడు. తరచూ గ్రామంలోని దుండగులతో ఘర్షణ పడేవాడు. తాను ఏది చేపట్టినా దాని అంతు చూచేవాడు. వేమనలో ఉరకలు వేసే ఉత్సాహావేశాలను ఆయన తండ్రి అనాగరికతగ అపార్థం చేసుకున్నాడు.

వేమన తన తల్లిదండ్రులను ప్రేమించి గౌరవించాడు. తల్లికి గారాబు పట్టి వేమన. ఆమె ముద్దుచేసి అతనిని కొంత చెడగొట్టింది. వేమనకు షడ్రసోపేతమైన భోజనమంటే ఇష్టమని ఆమెకు తెలుసు. అందుకే పాలు, పెరుగు, నెయ్యి ఆయనకు ధారాళంగ వడ్డించేది. తండ్రి అతని దుడుకుతనానికి కోపగించితే, తల్లి సర్ది చెప్పి సమర్ధించేది. అయితే ఊరి తగవుల్లో తల దూర్చవద్దని తండ్రి చాటుగ బ్రతిమాలేది. నూనూగ మీసాల నూతన యౌవనం వరకు వేమన జీవితం నిశ్చింతగ, ఆనందంగా గడిచింది. ఆ ఈడులో తల్లి ఆకస్మిక మరణం వేమనను దుః ఖసాగరంలో ముంచింది. అంతా అంధకారం. వేమన ఒంటరితనంలో అనాథవలె బాధ పడతాడు.

ఈ దుఃఖం నుండి వేమన పూర్తిగ కోలుకోకముందే తండ్రి ద్వితీయ వివాహం చేసుకుంటాడు. ఆ సంఘటన వేమనకు వజ్రఘాతమై గుండెను ముక్కలు చేస్తుంది. తన తండ్రి మారు మనువు చేసుకోకూడదని వేమన అభిమతం కాదు. “ఎందుకింత తొందర? మా అమ్మపై నిజమైన ప్రేమ లేదా? మరొక యువతిని చేపట్టడానికి ఆమె మరణానికి నిరీక్షించాడా?” అని తనలో తాను మథనపడే వాడు. తండ్రిని గూర్చిన ఇటువంటి ఆలోచనలు నిర్దాక్షిణ్యమైనవని, తన్ను అధికంగ కలత పెట్టే ఈ తలంపులకు దూరంగ ఉండడానికి వేమన ప్రయత్నిస్తాడు కాని అవి అతనిని నీడలా వెంటాడి అంధకారంలోనికి దారి తీసేవి.

వేమన కళాహీనుడై ఎవరితోను కలసి మసలకుండా, అంటీ అంటనట్లుండడం చూచి సవతి తల్లి వేమనకు తనపై ద్వేషమని భావిస్తుంది. నూతన వధువుగా, ఆనందంగ ఆ ఇంట కాలు పెట్టిన ఆమె వేమన చెన్ను తరిగిన ముఖాన్ని చూచి విసుక్కుంటుంది. ఆమె విసుగు అనతికాలంలోనే అతనిపై తిరస్కారంగ, కోపంగ మారుతుంది. భర్తకు తెలియకుండ చాటుగ ఆమె వేమనను వేధింప ప్రారంభించింది. క్రమంగ భర్త భీతిపోయి బహిరంగంగానే సదా వేమనను పీడించేది. అతడేమి చేసినా, చెప్పినా తప్పు పట్టి తిట్టేది. చలిది అన్నాన్ని పెట్టేది. గోరంతల్ని కొండంతలు చేసి భర్తకు ఫిర్యాదు చేసేది. తండ్రి వేమనను చావబాదినపుడు ఆమె లోలోన మురిసిపోయేది. ఆమెకు ప్రథమ సంతానం కలిగినపుడు వేమన పరిస్థితి ఇంకా దుర్భరమైంది. ఆత్మాభిమానియైన వేమన ఆవేశంతో ఈ చర్యల్ని ప్రతిఘటించేవాడే కాని మరణించిన తన మాతృమూర్తి పట్లగల ప్రేమాభిమానాలు అడ్డు పడేవి. అందుచేత తన తండ్రి జీవితంలో తల్లి స్థానాన్ని ఆక్రమించిన ఈవిడ పెట్టే అవమానాలను తిరస్కారాలను మౌనంగా సహించేవాడు.

వేమన ఇప్పుడు నిండు జవ్వనాన్ని సంతరించుకున్నాడు. ఇంటిలోని అశాంతిని, అసంతృప్తిని తప్పించుకోడానికి వేమన దేవదాసీలను ఆశ్రయిస్తాడు. దేనినైనా అరగొరగ చేసే ప్రవృత్తి కాదు వేమనది. కనుక ఈ విషయంలోను అతిగ ప్రవర్తించి వేశ్యాలోలుడుగ, విటుడుగ మారి అసంఖ్యాకమైన వేశ్యలతో సంచరిస్తాడు. తుదకొక వేశ్య అతన్ని ఆకర్షిస్తుంది. ఆమె

అందగత్తె, యుక్త వయస్కురాలు నెరజాణ. శ్రావ్యమైన కంఠం. ముఖ్యంగా తోడిరాగాన్ని మృదుమధురంగ ఆలపిస్తుంది. వీణను వాయిస్తుంది. ఈ గణికురాలు అనాగరికుడు, మొరటువాడైన వేమన పట్ల ప్రేమాభిమానాలను పెంచుకుంటుంది. వేమనను మృదు స్వభావునిగ, నాగరికునిగ మార్చ ప్రయత్నిస్తుంది. శ్రీమంతుడు కాని వేమన ఒక్కనితోనే తన పుత్రిక స్నేహాన్ని పెంపొందించుకోవడం వేశ్యమాత అభీష్టం కాదు. వేమన అప్పుడప్పుడు కొంత ముట్ట చెప్పినా అది చెప్పుకో తగ్గ పెద్ద మొత్తం కాదు. పైగా క్రమంగ కూడ ఇచ్చేవాడు కాడు. కొంతకాలానికి ఆ చిన్న మొత్తం కూడ ఈయడం మానుకున్నాడు. వెంటనే ఆ వేశ్యమాత వేమన తమ ఇంటి గడప తొక్కకూడదని ఆంక్ష విధించింది. ఆ వృద్ధురాలి కన్నుగప్పి తన ప్రియురాలిని కలసికొన వేమన చేసిన ప్రయత్నం విఫలమవుతుంది. ఆ ముసలి దయ్యం వేమనను పట్టుకుంటుంది. గుండె బరువుతో వేమన క్రుంగిపోతాడు. దురాశతో తనకు అడ్డు నిలిచిన ఆ వృద్ధురాలిని హత్యచేయ నిర్ణయించుకుంటారు. ఇంతలో వేమన ప్రియురాలు మరొక విటుని చేరదీస్తుంది. దీనితో వేమన సంపూర్తిగ నిరాశా నిస్పృహలకు లోనవుతాడు.

వేమన వేశ్యల వ్యామోహంలో నుండి బయట పడడం చూచి వేమన తండ్రి అతన్ని వివాహబంధంతో బంధిస్తాడు. ఆదిలో సంసారం ఆదర్శప్రాయంగ సాఫీగ కొన్నేండ్లు సాగింది. వేమన కిరువురు సంతానం కలిగారు. సుఖసంతోషాల జీవితాన్ని గూర్చి రంగు రంగుల కలలు కంటాడు. అయితే ఈ కమ్మని కల కరిగిపోతుంది. అత్తాకోడండ్ల మధ్య నిరంతరపోరాటం. ఒక్క రోజు కాదు కదా, కనీసం ఒక గంటయినా వారిద్దరు ఘర్షణ పడకుండ గడిచేది కాదు. ఈ ఉమ్మడి కుటుంబంలో ఇమడడం అసాధ్యమని వేమన వేరు కాపురం పెడతాడు. ఆ తరువాత కూడ వేమన కష్టాలు కడతేరలేదు. అవి రెండింతలైనాయి. వేమన గృహిణి సంసారాన్ని చక్కగ నిర్వహించేది కాదు. ఆమె సోమరి. డబ్బును విచ్చలవిడిగ ఖర్చు చేసేది. పొదుపుగ సంసారాన్ని చక్కబెట్టేది కాదు. అతని రుచులకు అనుగుణమైన వంట చేసేది కాదు. ఆ వండిన పదార్థాలనైనా సరిగా వడ్డించేది కాదు. నిరంతరం అతన్ని విసిగించేది. అతని పైనున్న కోపాన్ని పిల్లలపై చూపేది. వారిని తరచు కొడుతుండేది. సరియైన పెంపకం లేని ఆయన బిడ్డలు వేమన ఆవేదనకు కారకులయ్యారు.

ఉమ్మడి కుటుంబం నుండి విడిపోయిన తరువాత వేమన తన భాగానికి వచ్చిన పొలాన్ని శ్రద్ధగ సాగుబడి చేసేవాడు. చెరకు, నువ్వుల్ని పండించేవాడు. కాని ఇల్లాలి పోరు, ఇంటిలో అసంతృప్తి వలన వేమన క్రమంగ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసేవాడు. తత్ఫలితంగ పంట నానాటికి క్షీణించింది. సంతానం పెరగడం రాబడి తరగడం వలన ఇల్లు గడవడం కష్టమయ్యేది. అప్పుచేసి కొన్నాళ్ళు గడిపే వాడు. ఇంతలో పొలంలోని చెరకుకు తెగులు సోకి పంట సర్వనాశనమవుతుంది. పంట పూర్తిగా పాడయి, పెట్టిన పెట్టుబడి నేలపాలవుతుంది. బాకీ తీర్చమని ఋణదాతలు ఆయనను చుట్టుముట్టి ప్రాణం తీస్తారు. తమ బాకీ చెల్లు క్రింద ఇంటిని, పొలాన్ని వేలం వేస్తామని బెదిరిస్తారు.

ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో వేమన స్వర్ణయోగ విద్యచేత ఆకర్షితుడవుతాడు. రాగి, ఇనుము వంటి క్షుద్రలోహాలను బంగారంగ మార్చే విద్య తెలుసుననే వారి వెంట పడేవాడు. మోసగాండ్లు ఒక్కొక్కరే వేమనను వంచిస్తారు. ఈ అన్వేషణలో క్షుద్రమానవ స్వభావాన్ని మేలిమి బంగారు కంటె కూడ విలువైన దానిగ ప్రయోగకరమైనదిగ మార్చగల మార్గాన్ని చూపే గురువును కనుగొంటాడు.

ఇంత వరకు చెప్పినది ఊహాకల్పితమైన వేమన జీవిత గాథా? లేక సహేతుకమైన, సాధ్యమైన నవీన కల్పనా? అవును, కాదు అన్న రెండు సమాధానాలు చెప్పవచ్చు. ఈ కథనంలోని ప్రతి సంఘటనకు వేమన కవితలో ఒక ఆధారాన్ని చూపవచ్చు. భూమి సాగుబడిని గూర్చిన పరిజ్ఞానం, భోజనంలోని రుచులు, కొన్ని పశుపక్ష్యాదుల పట్ల ప్రీతి, మరి కొన్నింటిపట్ల అయిష్టం, సంగీతం పట్ల, అందునా తోడిరాగం పట్ల అభిమానం, తదితర స్వల్ప విషయాలను గూర్చిన ఇష్టా నిష్టాలకు వేమన కవితలో అనేక స్పష్టమైన ఆధారాలు లభిస్తాయి. బాల్యంలోనే తల్లిని కోల్పోవడం, సవతి తల్లి హింసలు,

దేవదాసి వ్యామోహం, దుఃఖభాజనమైన గృహ జీవితం ఆర్థిక ఇబ్బందులు, స్వర్ణయోగ విద్యాసక్తి వంటి ప్రధాన సంఘటనలకు ఆధారం అవసరం. వీటిలో ఒక్కొక్కదాన్ని ప్రత్యేకంగ పరిశీలింపవచ్చు.
వేమన ప్రబోధాల్లో మాతృ ప్రేమాభిమానాలు మౌలికమైన అంశాలు. "తల్లి నెరుగువాఁడు దైవంబు నెరుగును" అని

1. తల్లి నెరుగువాడు దైవంబు నెరుగును
   మన్ను నెరుగువాడు మిన్ను నెరుగు
   మిన్ను మన్నెరిగిన తన్నుదా నెరుగురా. .విశ్వ. (ఆం. ప్ర. అకాడమి ప్రతి ప. 336).

ప్రకటించాడు. దీనిని సాధారణమైన ఉపదేశంగ గ్రహింపవచ్చు. కాని దీని తరువాతి పద్యంలో ఒక స్వీయానుభవాన్ని పేర్కొంటాడు:

ఆ. తల్లియున్నయపుడె తనదు గారాబము
లామెపోవఁ దన్ను నరయరెవరు
మంచికాలమపుడె మర్యాద నార్జింపు. విశ్వ. (వావిళ్ళ. పుట. 11)

తల్లి మరణానంతరం నిర్లక్ష్యానికి క్రూర హింసలకు, కఠినానుభవాలకు లోనై నట్లు భావించి ఉండనిచో వేమన యీ పద్యాన్ని చెప్పగలిగే వాడా? తల్లి జీవించి వున్నపుడు సత్పుత్రుడుగ నిరూపించుకోలేదన్న వ్యథ, దీర్ఘ నిట్టూరీ పద్యంలో ధ్వనించడం లేదా?

ఆ. సవతితల్లిఁ జూడసాకుల నెరపును
సొంత తల్లివలెను సైఁపఁ దెపుడు
వింతలడచిలోని విజ్ఞానమందరా..విశ్వ. (వావిళ్ళ పుట. 176)

అన్న పద్యం కూడ గణనీయమైనది. దీర్ఘకాలం తల్లిలేని బిడ్డగ, సవతి తల్లి ఆరళ్ళను అనుభవించిన వ్యక్తి తప్ప స్వానుభవంలేని వాడిటువంటి పద్యాన్ని రచింపలేడు.
దేవదాసీ వాగురులలో చిక్కుకున్నాడన్న ఉదంతానికి నిదర్శనం:

ఆ. లంజ లంజకాని లాగెల్ల గొనియాడు
లంజ తల్లివాని లజ్జ గడుగు
తల్లి గలుగు లంజ తగులాట దోషంబు. .విశ్వ. (బ్రౌన్ - 1839.97-239)

ఆ తరువాత కథానికకు ఈ క్రింది పద్యం ఆధారం:

ఆ. విటుఁడు తగిలి రోసి విడిచి పెట్టు వెనుక
పిదప నొకఁడు తగిలి ప్రియము సేయు
కుడిచి వైచు పుల్లె కుక్కలు నాకవా. .విశ్వ. (అకాడమీ ప్రతి పు. 796)

దేవదాసితోడి అనుబంధాన్ని తెగతెంపులు చేసుకొన్నట్లే పద్యంలో ధ్వనిస్తుంది కదా! దెబ్బ తిన్న స్వాభిమానానికి ఊరటగ వేమన చెప్పుకొన్న స్వాంతన పద్యంగ దీన్ని భావించడం దోషమా?

"అప్పులేనివాడె యధిక సంపన్నుండు" (వావిళ్ళ. పుట. 55)

అని వేమన ఋణ బాధలకు లోను కాకూడదన్న హెచ్చరిక ఆయన ఆర్థిక ఇబ్బందులను ఎత్తి చూపుతున్నది.
వేమన దాంపత్య జీవితం, సంసారం వేదనా పూరితాలనడానికి సాక్ష్యాధారాలైన అనేక పద్యాలను చూడవచ్చు. ప్రయత్నలోపంవల్ల వేమన సంసారం దుఃఖమయం కాలేదు. వేమన తన బాల్యంలోనే కాక, దైవాన్వేషణ నిమిత్తం తల్లిదండ్రులను, భార్యబిడ్డలను, సర్వాన్ని పరిత్యజించాలన్న నిర్ణయానికి వచ్చే వరకు వైవాహిక జీవితాన్ని గూర్చి చాల ఉన్నతంగ తలంచేవాడు. అందువల్లనే:

ఆ. సుగుణవంతురాలు సుదతియైయుండిన
బుద్ధిమంతు లగుచుఁ బుత్రులొప్ప
స్వర్గమేటి కయ్య సంసారి కింకను. .విశ్వ. (వావిళ్ళ. పుట. 459)

అని ప్రశ్నించాడు. ఇట్టి సదభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వాడే తరువాత గయ్యాళులను, కలహకారిణులను దూయబడుతూ, కొరగాని పిల్లలను నిందిస్తూ, జీవితాన్ని ద్వేషించడానికి కారణం దుఃఖభాజనమైన సంసారం తప్పవేరే ఏముంటుంది!

అనువాదకురాలు చూసిన ఆకరం:

ఆ॥భార్య తనదుపాలి భారపు సంకెల్
చిన్న చిన్న శిశువు జింజరీలు
అరయగ చెరసాల యగును సంసారము .విశ్వ. (వావిళ్ళ. పుట. 475)

గయ్యాళి భార్యను చెప్పులోని రాయి, చెవిలో జోరీగ, కంటిలో నలుసు, కాలిలో ముల్లుతో పోల్చిన వేమన పద్యం ప్రజల నాలుకలపై నిత్యం నర్తిస్తూనే వున్నది.

ఈ విధంగ పునర్నిర్మించిన వేమన జీవితంలో ఆయనకు పరుసవేది పైగల మక్కువను నిరూపించడమొక్కటే మిగిలింది. ఈ విషయాన్ని నిరూపించే దశాధిక పద్యాలున్నాయి. ఆయన అనుయాయులలో కొందరు ఇప్పటికీ వేమన పద్యాలలో పరుసవేది సూత్రంకొరకు అన్వేషిస్తూనే ఉన్నారు.

వేమన జీవితం పూలబాటకాదు. మిట్టపల్లాలతో అనేక అపాయకరమైన మలుపులతో కూడిన బాట అది. ఎదురురాళ్ళు తట్టుకొని వేమన అనేక మారులు క్రిందపడినా, లేచి నిలదొక్కుకొని ముందుకు కొనసాగిపోయాడు. సగటు మానవుని కన్న అధికమైన శ్రమల్ని, శోధనల్ని, కన్నీళ్ళని వేమన అనుభవించాడు. అవి వేమనను రాటుదేల్చాయి; సంస్కరించాయి; విశాల దృక్పథాన్ని ప్రసాదించాయి; నిర్భీతితో గర్జించే శక్తినిచ్చాయి; సాహసోపేతమైన, సంప్రదాయాతీతమైన తత్త్వాన్ని కలిగిన విశిష్ట వ్యక్తిగ రూపొందించాయి.

## చిమ్మ చీకటి

### కారుచీకట్ల, నీలినీడల కాళరాత్రి - మిల్టన్

ఒక సంపూర్ణవ్యక్తిగా, దార్శనికునిగా, కవిగా వేమనను అవగాహన చేసుకోవడానికి వేమన జీవితం, ఆలోచనాసరళి, కళాదృష్టి వేళ్ళూనిన ఆనాటి సమకాలీన సమాజాన్ని తెలుసుకోవడం అవసరం. అసంగతంగ తోచినప్పటికి సమకాలంలో పాతుకొని, అందుండి జీవాన్ని, జవాన్ని పుంజుకోగలిగిన మేధావియే కాలాతీతుడై, అమరత్వాన్ని అందుకోగలడు. అస్తిత్వంలేని వ్యక్తియెంత ప్రతిభావంతుడైనా, ఆధారరహితంగా గాలిలో కొట్టుమిట్టాడుతూ, చివరకు మటుమాయమవుతాడు.

సమకాల సమాజంలో దృఢంగా పాతుకుపోయిన ఒక వ్యక్తిలాగ వేమన; “కవిత్వం అన్నది కేవలం ఒక కసరతు కాదు; అది నిజ జీవిత ప్రతిబింబం. భవిషత్కాలంలో, భావితరంలో రానున్న ఆదర్శాల ప్రశంస కూడా కవితకాదు. ఒకనికి తాను పీల్చే శ్వాస, తన జన్మభూమి ఎంత సన్నిహితమైనవో కవిత కూడా అంత సన్నిహితమైనదే” అని గ్రహించాడు. (ఈ

మాటల్ని తామస్ గ్రేని గురించి రాబర్ట్ లిండ్ చెప్పాడు) కనుకనే వేమన కవిత సమకాలీన జీవితానికి చక్కని దర్పణం పట్టింది. వేమన కవితను విశ్లేషించి పరిశీలించడం వల్ల ఆయన జీవిత గాథను పునర్నిర్మించవచ్చునని ముందే గ్రహించాం. అలాగే వేమన కవితలల్లుతూ, ప్రబోధాలుచేస్తూ ఆయన జీవించిన యుగపు వాస్తవిక చిత్రాలనుకూడా ఆయన కవితలో దర్శింపవచ్చు. దారిద్ర్యం, అనాగరికత, అవినీతి నిండిపోయిన క్షీణ యుగమది. ఐహికాముష్మిక విషయాలలో దారిద్ర్యం; ఆలోచనల్లో, మాటల్లో అనాగరికత; అన్నింటిలో అసభ్యత వెల్లివిరిసిన కాలమది. భారతదేశంలోని ఇతర ప్రాంతాల లాగ ఆంధ్రదేశంలో కూడా అది మధ్యయుగపు చరమదశ. నిజంగానే అది "కారు చీకట్ల నీలినీడల కాళరాత్రి."

వేమన కవితలో స్థూలంగా ప్రతిబింబించే ఆనాటి మతపరిస్థితిని చూద్దాం: వేమన స్వీకరించిన వీరశైవమతం తన విప్లవ ధోరణిని, సంస్కారశీలతను కోల్పోయి అప్పటికే చెప్పబడింది. వేమన కాలంలోని వీరశైవమతంలో విప్లవ భావాలు కాని, సంస్కార చర్యలు కాని లేవు. 12వ శతాబ్దిలో కర్ణాటక దేశస్థుడైన బసవన ప్రబోధించిన వీరశైవం బహుభార్యాత్వాన్ని నిషేధిస్తుంది. వేదాలు విధించిన కర్మకాండను ప్రతిఘటిస్తుంది; పూజారుల దురాగతాలను నిరసిస్తుంది; వర్ణబేధాలను దూషిస్తుంది. స్త్రీ పురుషుల మధ్య అసమానతలు పరిహరిస్తుంది. అంటరానితనాన్ని ఖండిస్తుంది. కఠోర నియమాలను నిరసిస్తుంది. వీరశైవమతంలోని బోధనలన్నీ నిషేధాలు మాత్రమే కావు అందులోను అభ్యుదయ భావాలున్నవి. అనుభవ పూర్వకమైన జ్ఞానం, అనుభూతితో కూడిన విశ్వాసం. వర్ణాంతర వివాహాల వల్ల రూపొందే సమసమాజం, నిష్కల్మషమైన కుటుంబ జీవనం, శ్రామిక జీవనం పట్ల గౌరవం, నైతిక విలువల అభివృద్ధి యందాసక్తి మానవతా భావాలు కలిగి సర్వమానవ సౌభ్రాతృత్వానికి పాటు పడుతుంది. బసవన ప్రబోధించిన వీరశైవమతాన్ని ఆంధ్రదేశంలో శ్రీపతి పండితుడు మొదట ప్రచారం చేశాడు. మల్లికార్జునుడు, పాల్కురికి సోమన ప్రభృతులు దాని వ్యాప్తికి కారకులు. ఈ మతం ఆంధ్రదేశంలో అతి వేగంగా వ్యాపించింది. సమాజంలో అట్టడుగున వున్న అంటరాని వారు, అగ్రస్థానంలో వున్న బ్రాహ్మణులు అన్ని వర్ణాలవారు ఈ మతాన్ని స్వీకరించారు. అదొక నవోదయం. అభ్యుదయ భావాల కేంద్రమై ప్రబలమైన సంఘ సంస్కరణోద్యమ వ్యాప్తికి కారణమైంది.

కాలక్రమంలో వీరశైవమతం తొలి ఆదర్శాలను కోల్పోయింది. వేమన కాలానికి దాని నిజస్వరూపం అంతరించింది. దాని వికృత రూపం మాత్రమే మిగిలింది. సమాజంలో తరతమ విభేదాలను రూపుమాపాలన్న లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయింది. అప్పటికే శాఖోపశాఖలుగ చీలి వున్న హిందూ సమాజంలో వీరశైవమన్న మరొక శాఖను సృష్టించింది. ఈ వీరశైవం వలన అదనంగా మరో రెండు శాఖలు ఏర్పడ్డాయి. వీరశైవుల్లో బ్రాహ్మణులు ఆరాధ్యశైవులుగా, బ్రాహ్మణేతరులు జంగమశైవులుగా విడిపోయారు. అంతే కాకుండ దీని వల్ల కొత్త కొత్త ఆచారాలు, అప్రస్తుతమైన గాథలు, పురాణాలు, మరికొన్ని మూఢాచారాలు పుట్టుకొచ్చాయి. నూతనంగా మరొక పూజారుల వర్గం ఏర్పడింది. ఈ మతంలో పరమార్థం కన్నా బాహ్యాచారాలకే ప్రాధాన్యం కలిగింది. లింగధారణ చేసి, విభూదిని ధరించి, ప్రతి రోజు నియమిత సమయాలలో శివనామాన్ని స్మరించి పర్వదినాలలో ఉపవాసముండి, పుణ్య క్షేత్రాలను సందర్శించితే భక్తుడు తన విధ్యుక్తకర్మని చక్కగా నిర్వహించినట్లు పరిగణింపబడేది. దీన్ని బట్టి మతం అంటే వ్యవస్థీకరింపబడిన వేషధారణ అని ఒక్క మాటలో నిర్వచింపవచ్చు. ఇలా దిగజారిన పరిస్థితుల్ని సహించని వేమన:

ఆ. ఆత్మ శుద్ధిలేని యాచారమదియేల
భాండశుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజలేలరా .విశ్వ. (బ్రౌన్ 1839, 1-3)

అంటూ సర్వమత సహనాన్ని, అందరి నమ్మకాల, విశ్వాసాల పట్ల సమభావాన్ని ప్రబోధించాడు.

ఆ. కుండకుంభమన్న కొండపర్వతమన్న
నుప్పులవణమన్న నొకటిగాదె

భాషలిట్లివేరు పరతత్త్వమొక్కటే .విశ్వ. (బ్రౌన్. 1839, 59-392)

వేమన ఉగ్రుడై ఇలా తోటి వీరశైవులు తన విజ్ఞాపనల్ని పెడచెవిని పెట్టినట్లు గ్రహించిన అన్నాడు.

ఆ॥ అణుమతములందు నధికమైన
మతంబు లింగమతము కన్న లేదు భువిని
లింగధార్ల కన్న దొంగలు లేరయా .విశ్వ. (వావిళ్ళ. పుట. 22).

వైష్ణవమని వ్యవహరింపబడే శాఖ కూడా మౌలికమైన మార్పులతో ఉన్నత ఆదర్శాలతోనే ప్రారంభింపబడిన ఉద్యమమే. అయితే వేమన కాలానికి అది కూడా తన ప్రాథమిక ప్రభావాన్ని కోల్పోయింది. దానిలోనే అంతశ్శాఖలు ప్రబలి దాని పతనానికి దారి తీశాయి. తెంగలులు, వడగలులు విష్ణుభక్తులే అయినా ఒకరి నొకరు బద్ధశత్రువులుగా భావించి ద్వేషించుకొనడమే దీనికి నిదర్శనం. వేమన కాలంలో లేదు కాని ఆ తరువాతి కాలంలో ఈ రెండు శాఖల మధ్య వివాదానికి కారణం నొసటను ధరించే నామమని బ్రౌన్ వ్రాతలను బట్టి వ్యక్తమవుతున్నది. వైష్ణవ మతంలో శాఖాభేదాల్ని సూచించే ఈ నామం ఏ రూపంలో ఉండాలని వాదోపవాదాలు జరిగాయి. ఈ వివాదాలు విద్వేషంగా మారి "అల్లర్లు చెలరేగి ప్రాణనష్టం కలిగి" నట్లు బ్రౌన్ పేర్కొన్నాడు.

శైవ వైష్ణవుల మధ్య చెలరేగిన మత కలహాలు ఇంకా ఘోరమైనవి. కొన్ని కొన్ని సందర్భాలలో శైవులకు వైష్ణవులకు మధ్య యుద్ధాలు కూడా సంక్రమించి మానవ మారణ హోమానికి దారి తీసాయి. ఈ యుద్ధాలు లేని సమయాలు ఉద్రేక పూరితంగా వుండేవి. వాస్తవానికవి తాత్కాలిక యుద్ధ విరమణ కాలాలు మాత్రమే. ఒక వైష్ణవుడు ఒక శైవుని తాకితే వెంటనే శుచిస్నానం చేయాలన్నది నమ్మశక్యం కానిదే అయినా అది పరమసత్యం. అలాగే వైష్ణవుని స్పర్శ శైవుని అపవిత్రం చేస్తుంది. ఈ మూర్ఖత్వానికి విస్తుపోయిన వేమన:

ఆ. విష్ణుభక్తులెల్ల వెలిబూదిపాలైరి
వాదమేల? మత విభేదమేల?
తెలియ లింగధరులు తిరుమణిపాలైరి .విశ్వ.(బ్రౌన్ 1839. 128-451)

అని ప్రశ్నిస్తాడు. ఇంకొక అడుగు ముందుకు వెళ్ళి ఇలా అంటాడు:

ఆ. మతము లెన్నియైన సతముగా నుండవు
సతముగాను యుండు జగతి నొకటి యంత
మదము విడిచి నా బ్రహ్మమరయుట .విశ్వ॥ (బ్రౌన్. 1839. 115-359)

మతోన్మాదులతో వాదించడం నిష్ఫలమని భావించిన వేమన దొంగ భక్తుల బారి నుండి తప్పించుకోమని ప్రజల్ని హెచ్చరించాడు.

ఆ. మతపు వేషధార్లు మరిమహిమీఁదఁ
బదివేలు మూఢజనులఁ గలపమూగుచుంద్రు
కొంగలు గుమిగూడి కొరకవా బోదెలు .విశ్వ. (వావిళ్ళ. పు. 32).

శైవ, వైష్ణవ మతాల ప్రాబల్యం తగ్గిపోగానే, మరల వైదిక కర్మకాండ, బలులు, సమాజంలో చోటు చేసుకున్నాయి. పూర్వం లాగ విరివిగా కాకపోయినా తరచు బలులర్పించడం జరిగేది. సమాజంలో ప్రబలుతున్న యీ ఆచారాన్ని గర్హిస్తూ వేమన నిర్మొహమాటంగా ప్రశ్నించాడు:

సోమయాజి ననుచు సొంపుతో వేషంబు
గట్టి మాంసమెల్లగాల్చి తినును,
ద్విజుడనేనగ నధికమేమి తన వల్ల . విశ్వ.

అంతటితో తృప్తిపడక మరల ఇలా విమర్శించాడు:

పేరు సోమయాజి పెనుసింహబలుడాయె
మేఁకపోతుఁ బట్టి మెడను విరవఁ
గాక క్రతువు వలనఁ గలుగునా మోక్షంబు .విశ్వ. (బ్రౌన్. 1839. 125-428)

మరొక చోట "ఒక సత్కార్యం నిమిత్తం స్వార్థత్యాగం కన్నా ఉత్తమమైన బలిదానం ఏమున్నది?" అని నిలదీస్తాడు. యజ్ఞయాగాదుల ఫలం స్వర్గంలో రంభాది అప్సరసల పొత్తు అని ప్రజల నమ్మిక.

ఆ. సోమయాజి బట్టి సొడ్ల వేసెను రంభ
యొందె సోమయాజి నొంగబెట్టి
క్రతువు జేయు ఫలము కల్గేరా చేజేత . విశ్వ. (బ్రౌన్. 1839. 2-256)

ఈ మూఢ నమ్మకాన్ని వేమన ఇలా విమర్శించాడు. తండ్రి కొడుకు లిద్దరు బలినర్పిస్తే, ఇద్దరూ స్వర్గానికి వెళ్తారు. ఇద్దరికి రంభ సంపర్కం లభిస్తుంది. అప్పుడు వాళ్ళిద్దరూ వావివరసలు తప్పి పాపం చేయడం లేదా?

ఆ. తల్లితో రమించె తండ్రి యజ్ఞము చేసి
తనయుడధ్ రంభ దనరగూడె
తల్లిని రమియింత్రు దబ్బర విప్రులు .విశ్వ. (వే.వే. 63)

అని ఎత్తి పొడిచాడు. ఇలా అనేక ఆచారాల్ని, నమ్మకాల్ని వేమన తరచూ దూయబట్టడం చూస్తే, ఈ మత మౌఢ్యం వేమన కాలంలో ఎంతగా దిగజారిపోయిందో తెలుస్తుంది.

ఆ నాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులు కూడా అధ్వాన్నంగానే ఉండినాయి - కేంద్రీకృతమైన రాజ్యాధికారం లేదు. పిల్ల జమీందారీలు, పిల్ల పెత్తనదారులు. ఈ పాలకులు బలహీనులు. ఏ ఆకతాయి వాడయినా వారిని ఎదిరించి, శిక్షింప సమర్థుడని వేమన పేర్కొన్నాడు. శక్తిహీనులైన రాజులలాగా ఈ పిల్ల జమీందారులు కూడ చపలచిత్తులు. చీటికి మాటికి చిరాకు పడేవారు.

భట్రాజులు వారిని పరివేష్టించి వుండేవారు. ముఖస్తుతికి ఉప్పొంగేవారు. పొగడ్తలతో పొట్ట నింపుకునేవారు. సుఖభోగాలతో తేలియాడేవారు. ప్రజలు తమపై తిరుగుబాటు చేయరన్న ధీమాతో వారిని పీడించేవారు. అటువంటి ఒక రాజును గూర్చి వేమన ఇలా ప్రస్తావించాడు.

ఆ॥ దుండగీఁడు కొడుకు కొండీఁడు చెలికాడు
బండరాజునకును బడుగుమంత్రి
కొండముచ్చునకును గోఁతియె సరియగు .విశ్వ. (బ్రౌన్. 1839. 152-149)

మరొక పద్యం చిత్తగించండి:

ఆ. అల్పబుద్ధి వాని కధికార మిచ్చిన
దొడ్డవారి నెల్లఁ దొలఁగఁగొట్టు
చెప్పుఁదినెడు కుక్క చెరకు తీపెఱుఁగునా .విశ్వ. (బ్రౌన్. 1839. 64-8)

పైగా రాజులతోడి స్నేహం త్రాచుపాముతోడి చెలిమివంటిదని కూడా హెచ్చరిస్తాడు:

ఆ॥ ఎంత సేవఁజేసి యేపాటు పడినను
రాచమూక నమ్మరాదురన్న
పాముతోడి పొందు పదివేలకైనను .విశ్వ. (బ్రౌన్. 1839. 74-82)

ఇటువంటి అసమర్థులు, దుర్మార్గులైన పాలకుల దుష్పాలనలో ప్రాణాలకు ఆస్తులకు భద్రత ఉండదు. దోపిడీదారులు దేశాన్ని కొల్లగొడతారు. వారి నుద్దేశించి వేమన ఇలా అన్నాడు:

ఆ. పెక్కు జనులఁ గొట్టి పేదల వధియించి
డొక్క కొరకు నూళ్ళ దొంగిలించి
యెక్కడి కరిగిన నెటింగి యముఁడు చంపు .విశ్వ.(బ్రౌన్. 1839. 86-161)

కఠినాత్ములు, కర్కశులు, అయిన నేరస్థులు ప్రళయం, యమదండన వంటి వాటికి బెదిరి తమ దొంగతనాలను, దోపిడీలను మానరు, వారానందంతో ప్రజలను పీడించి హాని కలిగిస్తుంటారు. అరాజకం పెచ్చురేగి శాంతి భద్రతలు సన్నగిల్లినపుడు తటస్థించే అన్ని విపత్తులతో పాటు తరచు కరవు కాటకాలు, అంటురోగాలు సంక్రమించి ప్రజాజీవనం దుర్భరమవుతుంది. కళలు, పరిశ్రమలే కాక, విద్యకూడా సన్నగిల్లుతుంది. అందుకే వేమన అన్నాడు:

ఆ. గ్రాసమింతలేక కడుగష్టపడుచున్న
విద్యయేల నిలచు వెడలుగాక
పచ్చికుండ నీళ్ళు పట్టిన నిలుచునా, .విశ్వ. (వావిళ్ళ. పుట. 9)

అటువంటి అంధకారమైన క్షీణయుగంలో జన్మించి, ఆ కాలపు దుర్నీతిని ఏకాకిగ ఎదిరించాడు వేమన. ఇది వేమన సంస్కరణ నిరతికి నిదర్శనం. వేమన స్వరం కఠినంగ, వాక్కుపరుషంగ, విమర్శ కర్కశంగ ఉన్నందున అతడు కఠిన స్వభావుడని అపార్థం చేసుకోకూడదు. వేమన సాధుస్వభావుడు; అనురాగపూరితుడు; సహనశీలి. పిచ్చివాడు, వేషధారి అన్న అవహేళనలను లక్ష్యపెట్టని వేమన సున్నిత హృదయం ఆక్రోశించి తన సమకాలీన సమాజంలోని కుళ్ళను ఎత్తిచూపింది. దూషణల్ని భూషణాలుగ స్వీకరించి ముందు చూపుతో, ప్రగతి పథంలో నడిచాడు. భారతదేశపు మధ్యయుగాలకు చెందిన దార్శనిక కవులలో బహుశః వేమనే కట్టకడపటివాడు కావచ్చు. అయితే వేమన నిశ్చయంగా వారందరిలో ఒక గొప్ప కవి.

## వేమన కవి ఉవాచ

**తళుక్కున తట్టిన తలపును, చటుక్కున చెప్పాడు కవి. - ఎమెర్సన్**

ఇప్పటికి తెలుగు కవి సమ్రాట్టులు వేమనను ఒక కవిగ అంగీకరించారు; కాని మహాకవిగా మాత్రంకాదు. వారు వేమనను ఒక శతక కవిగా మాత్రమే గుర్తించారు. వేమన పద్యాలు శతక ప్రక్రియకు చెందినవన్నది వాస్తవమే. ఆ పద్యాలన్నింటికి మకుటం ఒక్కటే. కొన్ని పద్యాలలో మకుటం మారినా ఆ మార్పు చాల స్వల్పమైనది. పద్యస్వరూపాన్ని కాకుండ అందలి భావాన్ని గ్రహించినట్లయితే హంసకు, కొంగలకు ఉన్నంత భేదం వేమనకు, శతక కవులకు ఉన్నది. శతక కవులు శతాధికంగ ఉన్నారు. వారిలో అధిక సంఖ్యాకులు స్తోత్రపాఠకులు. తమ ఇష్టదైవాన్ని గూర్చో, అభిమాన కృతిభర్తను గూర్చోస్తోత్రాలు చేశారు. నీత్యుపదేశాలతో కూడిన వారి శతకాలలోని నీతులు కాపీ పుస్తకాలలోని నీతులస్థాయిని అధిగమించవు. వారి భావాలు గంభీరమైనవి కావు. అవి నిస్సారమైనవి. వారి శైలి సామాన్యమైనది. వారి కవిత శుష్కమైనది. వేమనవి స్వతంత్ర భావాలు. వేమన సునిశితమైన ప్రకృతి పరిశీలకుడు. సహజంగ తీవ్రభావావేశపరుడు. మనస్సుకు హత్తుకునే ఆలోచనలు కలవాడు. చెప్పదలంచిన దానిని నిస్సంకోచంగ చెప్పుతాడు. అట్టి వేమనను శతక కవిగ పరిగణించడం అన్యాయం. పి. చెంచయ్య, రాజా యం. భుజంగరావు ఇంగ్లీషులో వ్రాసిన ఆంధ్రవాఙ్మయ చరిత్రలో వేమనను "శతక కవిరాజు" అని ప్రశంసించడం కూడ వేమనకు న్యాయాన్ని చేకూర్చదు. ఈ గ్రంథానికే మున్నడి వ్రాసిన

డా. సి.ఆర్. రెడ్డి, వేమనను "తారకలలో ధ్రువతార"గ పేర్కొనడం చాల సముచితం. పురాణాలను ప్రబంధాలను రచించకపోయినా.

వేమనను సాంప్రదాయిక కవిగ పరిగణింపవచ్చు. అతని కవిత సాంప్రదాయికమైనది. "A History of English Literature" అన్న గ్రంథాన్ని రచించిన జంట రచయితల్లో ఒకరైన కజమిన్ (Cazamin) ఒకచోట రాబర్ట్ బర్న్ (Robert Burns) గురించి పేర్కొన్న మాటల్ని అన్వయించుకుంటే "అత్యుత్తమ సాంప్రదాయికతను" వేమన సాధించాడని చెప్పవచ్చు, కజమిన్, బర్న్స్ గురించి ఇలా అన్నాడు: "సహృదయతతో పరిశీలించితే బర్న్ కృతి ఉత్తమ సాంప్రదాయిక కోవకు చెందుతుంది. భావనలో, సిద్ధాంతంలో ఈ సంప్రదాయం స్వతంత్రమైనది; స్వయం సమృద్ధమైనది." బలా వేమనకూడ గ్రామీణుడు. ఆ ఆంగ్లేయ కవిలా ప్రతిభావ్యుత్పత్తులు కలిగి తన సొంత "స్వయం సమృద్ధమైన ఉదాత్త సంప్రదాయాల్ని సృష్టించాడు.

వేమన గంటంపుచ్చుకొని తాటాకులమీద కవితను వ్రాయలేదు. ఆశువుగ చెప్పాడు. వర్డ్స్‌వర్త్ (Wordsworth) కవిత్వంలాగ వేమన కవిత్వం ప్రశాంత వాతావరణంలో నెమరువేసుకున్న భావాలుకావు. భావోద్వేగం పొంగి పొరలిన గడియలలో అవిర్భవించిన కవిత వేమనది. విశ్వాసాలకు అంకితమైనవాడు కనుక వేమన తన భావావేశాన్ని అణగారనిచ్చేవాడుకాదు. కర్తవ్య నిర్వహణలో తన పాత్ర కవి పాత్ర కాదని, ఒక దార్శనికుని పాత్ర అని వేమన నిర్ణయించుకున్నాడు. అందువల్ల వేమన కవిత్వ లక్షణాలకు ప్రాధాన్యత నీయలేదు. రస సిద్ధాంతంలో ప్రసిద్ధులైన భరతుడు, దండి, అభినవగుప్తుడు, హేమచంద్రుడు, భోజుడు మున్నగు వారిని గురించి వేమన కనీసం వినికూడ ఉండడు. అయినా వేమన తన హృదయాన్ని కలచే భావాలను కవితారూపంలో వెల్లడించకుండా ఉండలేకపోయాడు. కారణం అతడు పుట్టుకవి: వేమనది ఉదాత్త కవిత్వం. అందుచేత వేమన కవిత్వం ఒకప్పుడు వరదలా ఉప్పొంగుతుంది; అగ్నిపర్వతంలా బలవుతుంది; తుఫానులా సముద్రాలను సుళ్ళుతిప్పుతుంది; మరొకప్పుడు మండువేసవి తరువాతి చల్లనిజల్లులా, మలయ మారుతంలా, ఉషోదయపు పక్షుల కలకూజితంలా అతిత్వరితగతిని మారుతుంటుంది.

1950వ సంవత్సరం ఆకాశవాణి మదరాసు కేంద్రం నుండి ప్రసారమైన ఆంగ్ల ప్రసంగంలో డా. కట్టమంచి రామలింగారెడ్డిగారు వేమనను గురించి ఇలా ప్రస్తావించారు: "వేమన ప్రకృతి కవి. సహజకవికూడ" అని చాటారు. వారి ప్రసంగంనుండి మరికొన్ని వాక్యాలను అనువదించి ఉటంకించవచ్చు: "వేమన విద్యాధికుడు, పండితుడూకాదు. కాని జీవితాన్ని, ఆధ్యాత్మిక, భౌతిక సమస్యల్ని తరచిచూచి అందలి సత్యాలను పునరాలోచించే మహామనీషి. ఆయన కవిత్వం స్వచ్ఛమైన చలమ, శైలిలో, భావనలో స్వతంత్రమైనది. అప్రయత్నంగా పెల్లుబికేది. పాదత్రయంలోనే పద్యసారాన్నంతా ఇముడ్చుతాడు. సంక్షిప్తత వ్యంగ్యానికి హృదయమయితే ప్రపంచంలో ఇంతకు మించిన వ్యంగ్యం లేదు. అతని ఉత్ప్రేక్షలు ఉపమానాలు అన్నీ పల్లెదృశ్యాలనుండి, గ్రామీణ వాతావరణంనుండి, పొలాలనుండి, వనాలనుండి గ్రహింపబడ్డాయి. వేమన ప్రకృతి కవి; సహజకవికూడ."

వేమన భావాలను ఏవగించుకునే వారు సహితం అతని విశిష్ట కవితా మాధుర్యానికి ముగ్ధులు కాక తప్పదు. వేమన కవిత సరళంగ వున్నా నీరసమైనది కాదు. మధురంగ వున్నా వెగటు కలిగించదు. ప్రజారంజకమైన ఉపన్యాసాలలోని ప్రౌఢిమ వైవిధ్యం దానికున్నాయి. ప్రథమ ప్రకరణంలో పేర్కొన్నట్లు ఇట్టి కవితలో వేమన సిద్ధహస్తుడు. వేమన కవితలో కొంత అస్పష్టత లేకపోలేదు. అయితే ఆయన తాత్త్వికానుభవాల్ని చిత్రించేటప్పుడు మాత్రమే యీ అస్పష్టత ద్యోతకమవుతుంది. వాటి స్వరూప స్వభావాల్ని బట్టి చూస్తే యీ దార్శనికానుభవాలు వ్యక్తిగతమైనవి. కొందరి అనుభవాలను నమ్ముతారు; కొందరు నమ్మరు. విశ్వసించేవారికవి పరమ సత్యాలు. వారికి వాటి వివరణ అనవసరము. నమ్మని వారికవి అవాస్తవాలు,

ఊహాతీతాలు. హిందువులైనా, క్రైస్తవులైనా, సూఫీలయినా ఎవరైనప్పటికి దార్శనికులందరు ప్రతీకాల సాయం లేకుండా తమ తాత్త్వికానుభవాల నిజస్వరూపాన్ని ఇతరులకు వివరించలేదు. ఇతర దార్శనికుల్లాగ వేమన కూడ తన సొంత ప్రతీకల్ని ఉపయోగిస్తాడు. "నిద్రానంతర నిద్ర; జ్ఞానాతీతజ్ఞానం; స్థలాంతరస్థలం: దృశ్యంలోని దృశ్యం; తెరమరుగున జ్యోతి, దేహంలోని ఆత్మ, ఆత్మలోని దేహం." వంటివి వేమన ప్రయోగించిన ప్రతీకల్లో కొన్ని, వేమన తత్త్వాలు సామాన్యుల కగమ్య గోచరంగ, గూఢంగ, గుప్తంగ తోచవచ్చు. కాని సర్రియలిజం సమ్మిళితమైన కవితకన్న, అమూర్తమైన ఆధునిక చిత్రకళకన్న అది గూఢమేమీ కాదు. కొన్ని అంశాలు సూచింపదగినవే కాని వివరింపదగినవి కావు. ఈ సత్యాన్ని గ్రహింపని కొందరు వేమన అనుయాయులు వివరింపలేని వాటిని వివరింప ప్రయత్నించి నవ్వుల పాలవుతారు.

వేమన ఆటవెలది ఛందస్సును తన కవితా వాహికగా ఎంచుకున్నాడు. ఆయన మేధకు ఆటవెలదికి చక్కని పొంతన కుదిరింది. ఈ ఆటవెలది వేమన కల్పితం కాదు. అది చాల ప్రాచీనమైన దేశిచ్ఛందస్సు. ఆటవెలది అన్న పదానికి అర్థం "ఆడునటువంటి ఆడది". నన్నయ నుండి శతాధిక కవులు ఆటవెలదిని ఉపయోగించారు. కాని వేమన ఘంటంలో అద్వితీయంగ అది ఒదిగిపోయినట్లు మరింకెవ్వరి గంటంలోను కుదురుకోలేదు. కాళిదాసునికి మందాక్రాంతలాగ, భవభూతికి శిఖరిణిలాగ, తిక్కనకు కందపద్యంలాగ, శ్రీనాథునికి సీసంలాగ వేమనకు ఆటవెలది అనుకూలమైంది. ఆంగ్ల వాఙ్మయం నుండి కూడ రెండు సాదృశ్యాలను చూపవచ్చు. పోప్ కవి హిరోయిక్ (Heroic) ద్విపద తో, షేక్స్ ఫియర్ బ్లాంక్ వర్స్ తో చేసినట్లు వేమన ఆటవెలదులతో పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేశాడు. హీరోయిక్ కప్లెట్ ఛందస్సును గురించి ప్రస్తావిస్తూ లిట్టన్ స్ట్రచే (Lytton Strachey) ఇలా అన్నాడు: "ఈ ఛందస్సుకు పోప్ హస్తాలలో పరిపూర్ణత సిద్ధించింది." అలాగే వేమన చేతుల్లో ఆటవెలది సర్వాంగ సుందరంగ రూపొందింది. వేమనకు పూర్వం ఏ తెలుగు కవి కూడ ఆటవెలదిలోని సరళతనుగాని, లయనుగాని సంపూర్ణంగ గుర్తించి సద్వినియోగపరచలేదు.

వేమన పద్యసంకలనాలలో ఆటవెలదులే కాక తదితర ఛందస్సుల్లో సంతరించిన వృత్తాలు కూడ వున్నాయి. అయితే అవి పరిగణించదగిన సంఖ్యలో లేవు. వేమన కవితా సహజలక్షణాలైన, సరళత, సూటిదనం వ్యంగ్యం ఆ పద్యాలలో లోపించింది. ఆ వృత్తాలు ప్రక్షిప్తాలన్న రాళ్ళపల్లివారి అభిప్రాయం సరియైనదే.

వేమన ఆటవెలదిని మలచిన తీరును డా. టి.వి. కృష్ణరావు చాలా చక్కగ సమన్వయించి చెప్పారు. "సామాన్యంగ ఆటవెలదిలోని మొదటి రెండు పాదాలలో వేమన తాను చెప్పదలచిన విషయాన్ని కుదిస్తాడు. ఆ విషయం మనస్సుకు హత్తుకునేలా మూడవ పాదంలో ఒక అత్యద్భుత సామ్యాన్నో, ఉపమానో జోడిస్తాడు. చతుర్థపాదం ఆలంకారికమైన మకుటం మాత్రమే. ఈ వివరణను బట్టి వేమన ఆటవెలది అందమంతా ఆ తృతీయపాదంలోని ఉపమపై ఆధారపడి వున్నదన్నది సువిదితం. గురి చూచేవాడు అప్పుడప్పుడు గురి తప్పవచ్చు. కాని వేమన మాత్రం తన ఉపమలో తప్పడు. వేమన కవితా నైపుణ్యం, వైభవం చాలవరకీ సామ్యాల ప్రయోగంపై ఆధారపడి వున్నది. ఈ ఉపమలు వేమన హస్తాలలో నవ్యతను, నాణ్యతను సంతరించుకొన్నాయి. తరచు ఈ ఉపమలు, సూక్తుల రూపంలో వుండి పాఠకుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి, ఉపమలకు కాళిదాసు ప్రసిద్ధుడయితే, సామ్యాలకు వేమన సుప్రసిద్ధుడు." *డాక్టర్ జి.వి. కృష్ణరావుగారి అభిప్రాయల్ని ఉద్ధతించడంలో చిరుమార్పులు చేయబడ్డాయి. అయితే అవి మూలంలోని అర్థానికి భంగం కలిగించటం లేదు - గ్రంథకర్త.*

వేమన తన ప్రతి పద్యంలోను నియతంగ ఒక సామ్యాన్నో, సూక్తినో చెప్పకపోయినా నిశ్చయంగ అనేక పద్యాలలో చెప్పాడనడంలో విప్రతిపత్తిలేదు. ఈ అభిప్రాయంతో డా. జి.వి. కృష్ణరావు కూడ ఏకీభవిస్తున్నారు. అయితే వేమన పద్య

పరిశీలన వలన పదిహేను శాతం పద్యాలలో మాత్రమే సామ్యాలున్నట్లు లెక్కలు తేలాయి. వీటిలో కూడ కొన్ని చిరుమార్పులతోటి పునరుక్తులు. మరి కొన్ని యే మార్పులు లేకుండానే పునరుక్తులు. వేమన ఏవగించుకొనే కుక్క గాడిద యీ సామ్యాలలో అధిక భాగం చోటు చేసుకున్నాయి. వేమన యీ సామ్యాలను ఎంతో అద్భుతంగ, అతికినట్లు ఉపయోగించడం వల్ల వాటిని ఆయన ప్రతి పద్యంలో ప్రయోగించాడన్న భావన కలుగుతుంది. వేమన పద్య రచనా ప్రణాళికను గురించి మరొక మాట కూడ చెప్పవచ్చు. ప్రబోధాత్మక పద్ధతిలో వేమన సిద్ధహస్తుడనడం వాస్తవం. ఇంచుమించు వేమన పద్యాలన్నింటిలో ప్రథమ పాదంలో ఒక సిద్ధాంత ప్రతి పాదన, ద్వితీయ పాదంలో తద్భిన్నమైన వ్యతిరేక ప్రతిపాదన, తృతీయ పాదంలో ఈ విరుద్ధ విషయ సమ్మేళనం వుంటుందన్న కొందరి అభిప్రాయం సరికాదు. ఈ పద్ధతిని అనుసరించిన పద్యాలు నూటికన్న తక్కువ వుంటవి.

వేమన పద్యాలలో తృతీయపాదం ప్రశ్నరూపంలో ఉన్న వానిని కొన్నింటి నిక్కడ ఉద్ధరిస్తాను:

చెంత దీపమిడక చీకటి వాయునా?(వావిళ్ళ. పుట. 54)
కుక్కతోక బట్టి గోదావరీదునా? (బ్రౌన్ 1839.82-133)
ఏనుఁగు పడియున్న ఎత్తునా మశకంబు?
బొగ్గుపాలఁగడుగఁ బోవునా నైల్యంబు? (వావిళ్ళ. పుట. 89)
కొలఁకు లెండినంతఁ గొక్కెరలుండునా? ( ” 164)
కొలన టెండిపోవ గొక్కెరలుండునా? ( ” 67)
పిన్నచేతి దివ్వె పెద్దగా వెలుఁగదా?( ” 15)
దూడ వగచునె భువి తోడేలు సచ్చిన? ( " 79)
కొంకి నక్క జావ గొర్రెలేమిటి కేడ్చు?
కుక్క తోఁక గట్ట గుదురునా చక్కగా? (బ్రౌన్ 1839. 106-303)
కొయ్యబొమ్మ దెబ్బ కొట్టితే గుణి'నె?
పరిమళముల గర్దభము మోయ ఘనమౌనె? (బ్రౌన్. 1839. 78-107)
మొదల విడిచి గోడతుది బెట్ట గల్గునా? (75-88)
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా? (5-30)
కొండ యద్దమందు కొంచెమైయుండదా? (4-21)
కుక్క సింహమగునె గోదావరికి బోవ? (167-253)
పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా?
ఎనుము గొప్పదైన నేనుఁగుఁ బోలునా? (81-131)
సతులు జపతపములు సల్పఁగ సాగినఁ
బురుషులేల నిఁకను బుడమిలోన? (వావిళ్ళ. పుట. 36)
అమృతపు రుచులను హస్తమెట్లెఱుఁగును?
విత్తనంబు మట్టివృక్షంబునకు నెంత?(బ్రౌన్.1839.11-67)
తలలు బోడులైన తలఁపులు బోడులా?

ఇవి, ఇంకా ఇటువంటి వేమన పద్యాలలోని తృతీయపాదసామ్యాలు తెలుగు సామెతలుగ చెలామణి అవుతున్నాయి.

వేమన కవితకు పుష్టిని కలిగించిన లక్షణాలలో పుష్కలమైన హాస్యమొకటి. గాంధీగా రొకమారిలా అన్నారు: "నాలో హాస్య దృక్పథమే లేకపోతే నేనేనాడో ఆత్మహత్య చేసుకొని ఉండేవాడిని" ఈ మాటలనే వేమన కూడ చెప్పివుండేవాడు. పరిహసించి, నవ్వేశక్తే వేమనకు లేకపోయినట్లయితే, ఉన్నత లక్ష్యాన్ని సాధించడంలో నిమగ్నుడైన ఆయన కూడ ఆత్మహత్యకు పాల్పడే వాడే. ఈ హాస్యరసం వేమన కవితకు మరొక కోణాన్ని సమకూర్చింది. వేమన పరిహాసానికి గురి అయిన వారిలో లోభులు ప్రథములు: .

ఆ॥ లోభి వాని జంపలోకంబు లోపల
మందు వేఱు వలదు మతమె గలదు
పైకమడుగ నతఁడు భగ్గురుమని చచ్చు. . విశ్వ.(బ్రౌన్ 1839. 6-36)

మరొక చోటిలా ఎత్తి పొడిచాడు:

ఆ॥ పిసిని వాని యింట బీనుఁగు వెడలిన
గట్టి కోలలకును గాసులిచ్చి
వెచ్చమాయెనంచు వెక్కి వెక్కి మతేడ్చు. .విశ్వ. (బ్రౌన్. 1839. 6-34)

ఇంకొక పద్యంలో వారినిలా పరిహసించాడు:

ఆ. గొడ్డుటావుఁ బిదుకఁ గుండఁ జేకొని పోవ
పండులూడఁ దన్ను బాలనీదు
లోభివాని నడుగ లాభంబు లేదయా. .విశ్వ.(బ్రౌన్. 1839. 83-141)

ఏకాంత ప్రదేశాలలోనే నిజమైన దైవభక్తుల్ని సంధింపవచ్చునని, ఆధ్యాత్మిక గురువులను దర్శింపవచ్చుననే వారిని పరిహసిస్తూ:

ఆ. గుహల లోనఁజొచ్చి గురువుల వెదకంగఁ
గ్రూరమృగమొకండు తారసిలిన
ముక్తిదారి యదియె ముందుగాఁ జూపురా. .విశ్వ.(వావిళ్ళ. పుట. 234)

చార్లెస్ డికెన్సను గూర్చి చెప్పిన యీ మాటలు వేమనకు కూడ అన్వయిస్తవి: "అతని పరిహాసం కొంతవరకు ఉపదేశాత్మకమైనది." కేవలం నవ్వుపుట్టించడానికి మాత్రమే హాస్యోక్తుల్ని చెప్పక, అవి ఒక ప్రయోజనాన్ని ఆశించి చెప్పబడ్డాయి.

వేమన కవితా తూణీరంలో వ్యంగ్య పరిహాసం, వ్యాజస్తుతి అన్న మరి రెండు వాడియైన బాణాలున్నాయి. డా. సి.ఆర్. రెడ్డి ఇలా పేర్కొన్నారు: "హేతువుకు లొంగని మూఢవిశ్వాసాలను గురించి వాదించడం నిష్ప్రయోజనం అన్నది వాల్టేర్ సూక్తి. వేమనకు కూడ ఇట్టి భావనలో పరిపూర్ణ విశ్వాసమున్నది. కనుక వేమన వాదించడుగాని, గాయమయ్యేలా దెబ్బతీసి ఆ బూటకాల్ని పరిహాసపాత్రం చేస్తాడు." వేమన వ్యాజస్తుతికి, వ్యంగ్య పరిహాసానికి శతాధిక ఉదాహరణలను చూపవచ్చు. బాహ్యాచారాలను ఆచరిస్తూ, ఆంతరంగిక పారిశుద్ధ్యం లేని వారిని విమర్శిస్తూ: .

ఆ॥ భూతి దేహమందుఁ బూసిన నయ్యేనా
నిష్ఠ శివుని యందు నిలుపవలయు గాక
బూడ్దె యందు గాడిద పొరలదా? .విశ్వ.(బ్రౌన్. 1839. 156-172)

ఆ. నీళ్ళ మునుగువాఁడు నిర్మలాత్ముఁడు గాఁడు
పూర్ణమైన ముక్తిఁ బొంద లేఁడు
నీరుకోడి యెపుడు నీళ్ళను మున్గదా..విశ్వ.(వావిళ్ళ. పుట. 215)

ఆ॥ ఆకులెల్ల దిన్న మేఁకపోతులకేల

కాకపోయెనయ్య కాయసిద్ధి
లోకులెల్ల వెట్టి పోకళ్ళఁ బోదురు. .విశ్వ. (బ్రౌన్. 1839. 156-173)

వేమన బాహ్యాచారాలను చాల కటువుగ విమర్శించాడు:

ఆ. సకల తీర్థములను సకల యజ్ఞంబుల
తలలుఁ గొరుగకున్న ఫలము గలదె
మంత్ర జలము కంటె మంగలి జలమెచ్చు. .విశ్వ. (వావిళ్ళ పుట. 36)

కుల విభేదాలలోని అర్థరాహిత్యాన్ని ఎత్తి పొడుస్తూ ఇలా ప్రశ్నించాడు:
శూద్ర యువతి కొడుకు నిశ్చయంగ శూద్రుడే అయితే మరి వశిష్ఠుని సద్బ్రాహ్మణునిగ ఎలా పూజిస్తారు? ఊర్వశి అప్సరసే అయినా శూద్ర స్త్రీ. ఆమె పుత్రుడే కదా వశిష్ఠుడు?

తల్లి యూర్వశి లంజె తన యాలుమాదిగ
తాను బ్రాహ్మణుడనగ తగునె జగతి
వాసిష్ఠ కులమతి వసుధలో నెరుగరా..విశ్వ. (ఆరుద్ర: మన వేమన, పుట. 148)

అంటరాని దాని మగడు కూడ అంటరాని వాడే అయితే వశిష్ఠుని చూచి ఎలా గర్వించగలరు? వశిష్ఠుని భార్య అంటరానిదైన అరుంధతి కాదా?

ఆ. మాదిగ యనఁగనె మరి తక్కువందురు
మాదిగ యిల సురల మామగాదె
మాదిగకును బిడ్డ మన యరుంధతిగదా. విశ్వ. (వావిళ్ళ. పుట. 408)

హైందవులకు పరమ పవిత్రమైన పౌరాణికగాథలు కూడ వేమన విమర్శకు, అవహేళనకు గురి అయినాయి:

ఆ. పాల సంద్రమందు పవ్వళించిన వాఁడు
గొల్లపల్లె పాలు కోరనేల
యెదుటి వారి సొమ్ము ఎంత తీపో కాని .విశ్వ. (వావిళ్ళ. పుట. 71)

కనక మృగము భువిని కద్దు లేదనలేక
తరుణి విడిచిపోడె దాశరథియు
దైవమైన ధనము దలఁచుచుండెను గాదె. .విశ్వ. (వావిళ్ళ. పుట. 60)

ఆ. అగ్ని బాణమేసి యంబుధి నింకించి
రాముఁడ వలికే గరాక నిలిచి
చెట్లగిరుల దెచ్చి సేతువు గట్టఁడా. .విశ్వ (వావిళ్ళ. పుట. 312)

ఆ. విత్తమొకరికిచ్చి వితరణ గుణమునఁ
జిత్తమొకరికిచ్చి చెరచినాఁడు
బ్రహ్మచేఁత లన్ని పాడైన చేఁతలు. .విశ్వ (వావిళ్ళ. పుట. 126)

ఎట్టి దైవదుర్లలిత క్రీడ!
కట్టమంచి వారన్నట్లు వేమనశైలి "చురుక్కుమనిపించే వాడిదనం నుండి మృదువైన పరిహాసంగ, సరళమైన వ్యంగ్యంగ, తియ్యని హాస్యంగ దశల వారిగ మారుతుంటుంది". వేమన చర్చించిన విషయాలు అనేకానేకం. మానవునికి, మానవ సంక్షేమానికి సంబంధించినది ఏది కూడ ఆయనకు అల్పమైనది కాదు. గెతే (Goethel) ను ఉద్దేశించి మ్యాథ్యూ ఆర్నోల్డ్ (Mathew Arnold) ఇలా అన్నాడు: "బాధిత ప్రజానీకానికై పాటుపడ్డాడు; వారి ప్రతి గాయాన్నీ, ప్రతి బలహీనతను పరిశీలించాడు.

ఆ గాయాన్ని స్పృశించాడు.

“ఇక్కడ ఇక్కడే నీకు బాధ” అని ఆక్రోశించాడు. వేమన కూడ గెతేలాగే ఆవేదన పడ్డాడు. వేమన మానవాళి వ్యథల్ని గుర్తించటమే కాక వాటికి పరిష్కారాన్ని కూడ సూచించాడు. మానవ సేవకు ఆయన సర్వదా సంసిద్ధుడు. ఆయన ఇంటింటికి, వాడవాడకు, పల్లె పల్లెకు తిరిగాడు. ప్రతి చోట తటస్థపడిన ప్రతి వ్యక్తిని పలకరించాడు. సంధించిన వ్యక్తులకు ఆశువులుగ పద్యాలు వినిపించాడు. శాశ్వతంగ గ్రంథస్థం కావాలన్న ఉద్దేశంతో పద్యాలు చెప్పలేదు గనుక వేమన తన పద్యాలను పుస్తక రూపంలో పదిల పరచటానికి ప్రయత్నించలేదు. వేమనంటే అభిమానం, గౌరవం ఉన్న శిష్యులు కొందరు వాటిని వ్రాసి భద్రపరిచారు. వారు విద్యాధికులు కానందున తాళపత్రాలపై వారు వ్రాసిన వ్రాతల్లో కొన్ని దోషాలు దొరిలాయి. మూలప్రతిని చూచి మరికొన్ని ప్రతులను వ్రాసినపుడు మరికొన్ని తప్పులు చేరాయి. కొందరు లేఖకులు ఒక పదమో, పాదమో అస్పష్టంగ వున్నప్పుడు తమ కవితతో ఆ పదాన్నో పాదాన్నో పూరించడం వలన వేమన కవితా రూపం ఇంక కొంత మారింది. ఇది చాలనట్లు ఆయన అభిమానులు, దురభిమానులు కూడ ప్రక్షిప్తాలను చేర్చారు.

బ్రౌన్ కాలం నుండి ఇప్పటి వరకు సామాన్య ప్రజానీకంలో ముఖ్యంగ ప్రచారంలో వున్నవి, కొత్తగ కనుగొన్న తాళపత్ర ప్రతులలోనివి అన్నీ కలిపి మూడు వేల వరకు వేమన పద్యాలు సేకరింపబడ్డాయి. వీటిలో ఎన్ని వేమన స్వయంగ చెప్పినవి అన్నది సందేహాస్పదం. బ్రౌన్ సేకరణలోనివి కూడ చాల వరకు ప్రక్షిప్తాలే. ఇప్పటి వరకు వేమన పద్యాలను గుర్తించి, వాటిని ఒక సంకలనంగ ప్రచురించే ప్రయత్నం జరగలేదు. బ్రౌన్ ప్రచురించిన సంకలనంలో మార్పు చేర్పులను మాత్రమే తరువాత ప్రచురణ కర్తలు చేశారు.

ఈ విషయ పరిస్థితిని చక్కబెట్ట వలసిన సమయం ఆసన్నమైంది. వేమన కృతాలుగతోచే ఆటవెలది, కందపద్యాలను మినహాయించి, తదితర వృత్తాలను పరిహరించి, వాటిలో కూడ పునరుక్తులలో మంచి వాటిని గ్రహించి, వేమన సిద్ధాంతాలకు వ్యతిరిక్తమైన వాటిని ప్రక్షిప్తాలుగ త్రోసి వేస్తే, శేషించిన పద్యాలు బహుశా రెండు వేలకు మించక పోవచ్చు. ఈ పద్యాలను ఒకటిగ సంకలనం చేసేటప్పుడు వేమన కవితను, వ్రాతను సవరింప ఎటువంటి ప్రయత్నం చేయకూడదు. వేమన ప్రజాకవి. ప్రజల భాషలో ప్రజలతో మాట్లాడాడు. ఆయన కవితలోని మాండలికతా మాధుర్యాన్ని సంరక్షించాలి. ఛందోవ్యాకరణాల కన్న వేమన సంక్షిప్తతకు, దురాచార ఖండనకు ప్రాధాన్యతను యిచ్చాడు. లక్షణం తన లక్ష్యానికి అడ్డుగున్నపుడు దానిని నిర్లక్ష్యం చేయడానికి ఆయన ఎంత మాత్రం వెనుకాడలేదు. లక్షణ విరుద్ధ ప్రయోగాలను వేమన బుద్ధి పూర్వకంగ చేశాడు. గనుక వాటిని సవరించకూడదు. సలక్షణంగ వ్రాయాలనే దుగ్ధగల ఎవరో ఒకరు వేమనను తప్పు బట్టి వుంటారు. లేకపోతే వేమన ఇలా ఎత్తి పొడిచి ఉండదు:

ఆ. ఆది నెఱుగవలెను యల్పుండు తామరి
చెప్పలేదు గాని తప్పుబట్టు;
తోయనేర్చు కుక్క దొంతల జేర్చునా. విశ్వ. (అకాడమీ.ప. 560).

కనుక వేమన పద్యాలను లక్షణ సమ్మతంగ చేయడం కాదు గాని, ఆధునిక శాస్త్రీయ పద్ధతికి అనుగుణంగ ఒక సంశోధిత సంకలనాన్ని సిద్ధంచేయటం అవసరం.

కొన్ని తాళపత్ర ప్రతుల్లో అసభ్యమైన పద్యాలున్నాయి. కొన్ని సందర్భాలలో వేమన విమర్శ వాడిగ, వేడిగ, కటువుగ ఉంటుంది. వేమన అసభ్యాన్ని ప్రోత్సహించి వుండడు. ఒక పద్యంలో ప్రత్యేకంగా కామవాంఛతో మసలే వారిని దూయబట్టాడు. అట్టివారు ముష్కరులని, బురదలో పొరిలే పందులని పేర్కొన్నాడు. కనుక ఈ సంశోధిత సంకలనంలో ఇటువంటి అసభ్య పద్యాలనన్నింటిని తొలగించాలి.

కాదు. స్వర్ణయోగ విద్యకు సంబంధించిన పద్యాలను కూడ తొలగించి, వేమనకు న్యాయం చేకూర్చాలి. ఆ అజ్ఞానాంధకార కాలంలో అదృష్టాన్ని అందుకోడానికి పరుసవేది సులభమైన మార్గమని వేమన విశ్వసించి వుండవచ్చు. అయితే ఆయన అనతి కాలంలోనే ఆ భ్రమకు స్వస్తి చెప్పి ఉండకపోతే ప్రతి మూఢాచారాన్ని, అంధవిశ్వాసాన్ని ఖండించే గొప్ప ఆచార్యుడై వుండేవాడు అందుచేత స్వర్ణయోగ విద్యకు సంబంధించిన పద్యాలు ప్రక్షిప్తాలుగ మనం పరిగణింపవచ్చు. ఒకవేళ అవి వాస్తవంగనే వేమన కృతాలే అయితే, వాటిని స్వర్ణయోగ విద్యారహస్యాన్ని తమకు చెప్పమని వేమనను పీడించిన మూర్ఖుల్ని, దురాశాపరుల్ని పరిహసించడానికి చెప్పినవై వుండాలి. ఏది ఏమైనా అర్థరహితమైన ఇటువంటి పద్యాలను తొలగించాలి.

ఇలా అనవసరమైన పద్యాల నన్నింటిని తొలగించిన తదుపరి కూడ వేమన కవిత్వమనే అపరంజిలో ఇంకా కొంత కలీ శేషించి వుంటుంది. ఉత్తమ సత్కవులకు కూడ అది తప్పదు. తటిల్లతలాగ మెరసిన భావాలను ఆశురూపంగా వెలువరించే ఆశుకవుల కవిత ఆద్యంతం సమానంగ వుండదు. అసమానంగనే వుంటుంది. అంతే కాకుండ ముందే పేర్కొన్నట్లు వేమనకు సాహిత్యం పట్ల కన్న జీవితం మీదనే అక్కర, శ్రద్ధ. వేమన పదాలను కళాకారులలాగ సుకుమారంగ ఉపయోగించడు గాని, శూరునిలా విసరుతాడు. వేమన కవిత విమర్శనాత్మకంగ లేనపుడు ప్రబోధాత్మకంగ వుంటుంది. ఆయన కవిత ఆద్యంతం ఒక్క రూపుగ వుండకపోవడానికి ఇది కూడ ఒక కారణమే. కవులను గురించి, కవిత్వాన్ని గురించి ప్రస్తావిస్తూ, పేర్కొన దగిన ఒక్క ఉత్తమ పద్యాన్ని రచించినా అతన్ని కవిగనే పరిగణించాలన్నది వేమన అభిప్రాయం:

ఆ. నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తళుకు, బెళుకు రాళ్ళు తట్టదేల
చదువ పద్యమరయ చాలదా యొక్కటి .విశ్వ..(బ్రౌన్. 1839. 2-4)

ఒక్కటి కాదుగాని, వేమన ప్రపంచానికి వందలకొలది నిక్కమైన మంచి నీలాలను ప్రసాదించాడు.

## ప్రకృతి దార్శనికుడు

'సహజహాస్య చతురుడైన గ్రామీణుడు ప్రకృతి దార్శనికుల్లో ఒకడు' - హురెస్ (Horace)

భగవద్గీత వేమన విద్వాంసుడు కాకపోయినా, ప్రస్థానత్రయాన్ని గురించి (ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, - హైందవ తత్త్వప్రామాణిక గ్రంథాలు) తెలియకపోయినా, నిస్సందేహంగ ఒక దార్శనికుడు. ఈ ప్రకరణారంభంలో శీర్షికగ పేర్కొన్న హోరెస్ మాటల్లో పేర్కొనాలంటే వేమన "ప్రకృతి దార్శనికుడు." ఆయనకున్న సహజ అంతర్దృష్టి, పండిన జీవితానుభవం ఆయనను ఏకైక తత్త్వాన్ని కాక, మత సాంఘిక, నైతిక తత్త్వత్రయాన్ని ప్రబోధింప చేసింది. వీటిలో ఏ ఒక్కదానిని వేమన క్రమపద్ధతిలో విస్తరింపచేయలేదన్నది వాస్తవమే. విశృంఖలమైన ఆయన మేధస్సు, ఆవేశ పూరితమైన ఆయన స్వభావం క్రమపద్ధతిని పాటించ లేకపోయాయి. స్వవచో వ్యాఘాతాలను సహితం సవరించడానికి ఆయన ప్రయత్నించలేదు. ఒకవేళ ఆయన వాటిని గుర్తించి వుంటే వాల్ట్ విట్ మన్ (Walt Whitman) అన్నట్లు అని వుండే వాడే:

"నా వచనాలకే నేను వ్యాఘాతం కలిగిస్తున్నానా?
అట్లయితే మంచిదే నన్ను నేను వ్యతిరేకిస్తున్నాను.
నేను విస్తారమైన వాణ్ణి నాలో సమస్తమూ ఇమిడి వున్నాయి.

సాంఘిక, దార్శనికుడిగ వేమన మానవుల్లో సమానత్వాన్ని ప్రబోధించాడు. వర్ణవ్యవస్థ, ఆ వ్యవస్థ లోని తరతమ భేదాలు, హెచ్చుతగ్గులు, విధి నిషేధాలు సంపూర్ణంగ రూపుమాయనంతవరకూ మానవ సమానత్వం అన్నది దుస్సాధ్యమని వేమన

ప్రగాఢ విశ్వాసం. వర్ణవ్యవస్థను నిర్మూలించాలనడానికి వేమన స్థూలంగ చూపిన కారణాలివి: శూద్రులకువలె స్త్రీలు కూడ వేదపఠనం చేయకూడదని నిషేధించితే స్త్రీలస్థాయి కూడ శూద్రుల స్థాయిలాగ ఉంటుంది. అది పెరగదు. అటువంటి స్త్రీ యొక్క పుత్రుడో, భర్తో, శూద్రుడే అవుతాడు కాని మరొకడు కావడానికి అవకాశం లేదు. అంతేకాక ప్రతివాడు పుట్టుకతో శూద్రుడనే చెప్పబడింది. అటువంటప్పుడు పవిత్రమనబడే జందెం ధరించినంత మాత్రాన మానవుడు స్థాయి అధికం అవుతుందని ఎలా అనగలం? నిజంగా వ్యక్తికి కులం కాదు గాని గుణం ప్రధానం. "కులము లెక్క యేమి గుణమే ప్రధానంబు" (వావిళ్ళ. పుట. 49)

ఆ॥ మాలవాని నేల మరిమరి నిందింప
ఒడలనున్న మాంస మొకటిగాదె
వానిలోన వెలుగువాని కులంబేది. .విశ్వ. (బ్రౌన్. 1839. 129-455)

ఆ. మాలమాలగాడు మహిమీదనే ప్రొద్దు
మాట తిరుగువాడు మాలగాక
వాని మాలయన్న వాడెపో పెనుమాల .విశ్వ. (బ్రౌన్. 1839. 82-135)

ఆ॥ మాలమేలు గుణము మంచిది కలిగిన
మాలకూడుఁ గుడుచు మనుజు కంటె
గుణమె మేలు కాని కులమేమి మేలురా? .విశ్వ.(వావిళ్ళ. పుట. 32)

ఆ. జాతి భేదమెంచి జన్మముల్ తెలియక
ముక్తి గానలేరు మూర్ఖజనులు
జాతులెంచనేల జన్మంబు తెలియుము. .విశ్వ. (వావిళ్ళ. పుట. 202)

ఒకడు తన కులీనతను గురించి ప్రగల్భాలు పలకడమెందుకు? మరొకని కులాన్ని నీచమని నిందించడమెందుకు? అందరు భగవంతుని బిడ్డలుకారా? సర్వ మానవాళి జన్మక్రమము, మరణపు తీరు ఒక్కటే కదా! కులభేదాన్ని పరిత్యజించిన వాడే నిక్కమైన భగవంతుని భక్తుడు.

వర్ణవిభేదమేకాక ఆర్థిక స్తోమత కూడ సమాజంలోని అసమానతకు కారణమన్న విషయాన్ని వేమన గుర్తింపకపోలేదు. వర్ణ భేదంకన్న ఆర్థికమైన వర్గభేదమే వ్యక్తికి వ్యక్తికి మధ్య పెద్ద అగాధాన్ని సృష్టిస్తుందన్నది వాస్తవానికి వేమన విశ్వాసం.

ఆ॥ అధముఁడైన మనుజుఁ డర్థవంతుండైన
నతని మాట నడచు నవనిలోన
గజపతింటనున్న గవ్వలు చెల్లవా? .విశ్వ.(వావిళ్ళ. పుట. 55)

ఆ॥ కులము లేనివాఁడు కలిమిచే వెలయును
కలిమి లేనివాని కులము దిగును
కులము కన్ననెన్న, గలిమి ప్రధానంబు. .విశ్వ. (బ్రౌన్. 1839. 83-142)

ఆ. కులము గలుగువారు గోత్రంబు గలవారు
విద్యచేత విర్రవీగువారు
పసిడిగల్గువాని బానిస కొడుకులు .విశ్వ. (వావిళ్ళ. పుట. 82-137).

ఆ. కనకమున్నవాడు కాముడు భీముడు
మిగులఁదేజమంది మెలఁగుచుండ
విత్తహీనుఁడైన వెబ్బులలోనేటు .విశ్వ. (వావిళ్ళ, పుట. 60)

ఇలా అంతిమ జాతివాడయినా వాడు సంపన్నుడయితే అధికుడు, కులీనుడు పేదవాడయితే వాడిని లక్ష్య పెట్టరు. అగ్రకులజుల్లో, విద్యాధికుల్లో కూడ డబ్బున్న వారికి దాసోహమనే బుద్ధిహీనులున్నారు. శ్రీమంతునిలో అన్ని సుగుణాలు, నైపుణ్యాలు, ఉన్నట్లు చూస్తారు. లేదా నటిస్తారు సౌందర్యంలో మన్మధుడని, బలంలో భీముడని అతణ్ణి పొగడ్తారు. డబ్బుకు దాసోహమనే ఇటువంటి మూర్ఖుల్ని వేమన అసహ్యించుకొన్నా, ధనబలాన్ని మాత్రం త్రోసిపుచ్చలేదు. ఇతర కవిభక్తాగ్రేసరులైన అనేకుల వలె కాక వేమన కలిమి కన్న లేమి అధిక అనర్థదాయకమన్న అభిప్రాయం కలవాడు.

తల్లి బిడ్డలకును దగవు పుట్టించెడు
ధనము సుఖము, గూర్పదని వచింత్రు
కాని గడనలేక గడచుటయెట్లురా? .విశ్వ. (వావిళ్ళ. పుట. 389)

ఒకడు పేదరికాన్ని స్వయంగ కోరుకుంటే అది అతన్ని ఉన్నతుని చేస్తుంది. కాని అతడెంత కష్టపడినా ధనాన్ని సంపాదించలేక దరిద్రుడుగ వుండిపోతే నైతికంగా భౌతికంగా ద్వివిధాలా దిగజారిపోతాడు:

ఆ. ధనము లేమి సుతులు తప్పుల నిడుదురు
ధనము లేమి పత్నిఁదాఁకరాదు
ధనము లేమెవనికి తాళిక నీయదు .విశ్వ. (బ్రౌన్. 1839. 148-117)

వేమన దృష్టిలో స్వకుటుంబానికి కొన్ని సౌఖ్యాలు, భద్రతలు చేకూర్చలేని మానవుడు సానుభూతికి అనర్హుడు. ఏవగించుకొనదగినవాడు. వేమన ఇలా హెచ్చరించాడు:

ఆ॥ ధనము లేమి యనెడు దావానలంబును
తన్ను జెరుచును దరిదాపు జెరుచు
ధనము లేమి చూడదలచనే పాపంబు .విశ్వ. (బ్రౌన్ 1839. 140-65)

వేమనకు పేదరికం పట్లగల భీతి, “దారిద్ర్యం అత్యంత హానికరమైనది. అతినీచమైన నేరం దారిద్ర్యమే” అని ప్రకటించిన జార్జ్ బెర్నాడ్ షా పలుకులలోని దారిద్ర్య నిరసనతో సమానమైనది.

అయితే షా చెప్పినట్లు కాక, వేమన యీ దారిద్ర్య నివారణ కొరక సామాజిక పరిష్కారాన్ని చూపలేకపోయాడు. వేమన ఎంతటి దూరదృష్టి కలవాడైనా, అజ్ఞానాంధకారపూరితమైన మధ్య యుగాలకు చెందినవాడు కాబట్టి అంతటి ప్రగతిని వేమనలో ఎదురు చూడలేము. సమాజంలోని బీదరికానికి మూల కారణాల్ని కనుగొనలేని వేమన శ్రీమంతుల్ని వారి సంపదల్ని పేదవారితో పంచుకోమని వేడుకున్నాడు. యాచన అన్నది ఆత్మాభిమానాన్ని కోల్పోవడమని వేమన గుర్తించాడు. యాచించే వాడు నీచుడని పేర్కొన్నా వెంటనే వేమన ఆర్థికి గింజరాల్చనివాడు అంతకన్నా అధముడని పాత నమ్మికనే వెలిబుచ్చాడు:

తే. పుట్టినప్పుడు తెచ్చెనే పుడమి విడచి
గిట్టునప్పుడు గొనునొకో యట్టి ధనము
నడుమ నీయాజ్ఞవచ్చెఁనదియనుచు
నర్థికిని నీయఁడేమందువ్యర్థువేమ! (వావిళ్ళ పుట. 306)

తాము గడన సేయు ధనము తమదియని
నమ్మియుంద్రు వెర్రి నరులు భువిని
తాము నొకరి కిచ్చు ధనమింతియే కాక
కడమది తమకేల కలుగు వేమ! (బ్రౌన్. 1839. 134-22)

బసవనవలె వేమన కూడ కాయకష్టంలోని గౌరవాన్ని గుర్తించాడు. ప్రతి వ్యక్తి ఒక న్యాయమైన వృత్తిని గాని, మరేదైన ఉపాధిని గాని చేపట్టాలని కోరాడు. పౌరోహిత్యం మీద ఆయనకు గౌరవంలేదు. వర్తక వ్యాపారాల మీద కూడ వేమన కంత అభిమానం లేదు. మధ్యవర్తిత్వాన్ని దళారితనాన్ని ప్రోత్సహించి, ఎదుటి వాణ్ణి కొల్లగొట్టే యే వృత్తి అయినా వేమనకు అసహ్యం. "నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు" అన్న బైబిల్లోని దైవవాక్కు (ఆదికాండం. 3:19) పట్ల సంపూర్ణ విశ్వాసాన్ని ప్రదర్శించిన గాంధీ, టాల్ స్టాయిలతో వేమన ఏకీభవిస్తాడు. వేమన పద్యాలలో ఒకటి ఇదే సూత్రాన్ని, ఇంచుమించు ఇదే మాటల్లో వ్యక్తం చేస్తుంది. చేసే పని దైవారాధనతో సమానమని వేమన భావం. కాయకష్టమయితే ఇంకా మంచిది. చాకలి వానిని యితరులు చిన్న చూపు చూడవచ్చు. కాని వేమన దృష్టిలో రజకుడు సమాజానికి సేవచేసే ఉత్తములలో ఒకడు. ప్రాథమికావసర వస్తువుల్ని వుత్పత్తి చేసే వారంటే వేమనకు అభిమానం. అందులోను కర్షకులంటే అధికాభిమానం. వేమన ఒక సందర్భంలో తాను "కాపు" అని సగర్వంగ చెప్పుకొన్న దానిని ఆధారంగ చేసుకొని కొందరు వేమన కూడ వర్ణవిభేదానికి అతీతుడు కాడన్న నిర్ణయానికి వచ్చారు. వేమన సోత్కర్షగ పేర్కొన్నది కులాన్ని కాదుగాని తన వృత్తియైన వ్యవసాయాన్ని, నైతిక ప్రబోధకుడు కాక పూర్వం వేమన ఒక కర్షకుడు. స్వవర్ణమైన రెడ్డిజాతిని గురించి ప్రస్తావించిన ఒకటి, రెండు సందర్భాలలో ఆ కులాన్ని గురించి వేమన ప్రశంసించలేదు.

స్థూలంగా చూస్తే వేమన సామాజిక తత్త్వం ఇటువంటిది. మధ్య యుగాలకు చెందిన భారతదేశపు భక్తులు, ఆచార్యులు, తాత్త్వికులైన బసవన, జ్ఞానదేవుడు, నమ్ దేవ్, తుకారాం, రామానంద, కబీర్, డాదు, నానక్, లాల్ దాస్, రాయిదాస్, చైతన్యల సామాజిక తత్త్వంలో ఇంచు మించు సమానమైనవే వేమన తత్త్వంలోని మౌలికాంశాలు. ఈ భక్తాగ్రేసరులు, ప్రబోధకులు కలసి గొప్ప విప్లవాన్నే తెచ్చారు. ఎందుకు? "Modern Indian Culture" (ఆధునిక భారతీయ సంస్కృతి) అన్న తన ఉద్ధంథంలో ధూర్జటి ప్రసాద్ ముఖర్జీ దీన్ని "తాత్త్విక విప్లవం" (The Mystic Revolution) అని పేర్కొనడం చాలా సమంజసం. "భారతీయ సమాజ ఆర్థిక స్థితిలో మౌలికమైన మార్పులు లేకుండా తెచ్చిన యీ తాత్త్విక విప్లవం మిథ్యా విప్లవంగా మిగిలింది.

ఇక వేమన నైతిక తత్త్వాన్ని పరిశీలించామంటే, అందులో రెండంతస్తులు వున్నట్లు కనుగొంటాం. వేమన ఆదర్శవాది అయినా మానవ స్వభావ పరిమితులు తెలిసినవాడు. అందరూ యోగులు కాలేరని ఆయనకు తెలుసు, యోగి కుండవలసిన లక్షణాలు లేకున్నా యోగ మార్గాన్ని చేపట్టి మూరుడైన కపట సన్యాసికన్న సత్యవంతుడు, నీతిపరుడైన గృహస్థు ఎంతో మేలని వేమనకు తెలుసు. అందుచేత వేమన ప్రజాసామాన్యానికి అనుగుణమైన నైతిక సూత్రాలను చెప్పాడు. యోగి ఆచరింపవలసిన కఠిన నియమాలను అనుసరింపగల దృఢచిత్తులకు తద్భిన్నమైన సూత్రాలను ప్రబోధించాడు. ఆయన యీ యిరుతెగలకు చెందిన శ్రోతల నుద్దేశించి చెప్పడమే వేమనలో కనుపించే భావవైరుధ్యానికి, ద్వంద్వాభిప్రాయాలకు కారణం.

యోగమార్గాన్ని కోరుకొనే వ్యక్తికి వేమన సలహా ఏమంటే సంసారమొక బంధం, అదొక ఉచ్చు. మరణించినపుడు భార్య బిడ్డలు వెంట రారు; లైంగిక సుఖం చాల నీచమైనది, అసహ్యమైనది; సంపద బుద్బుదప్రాయం; ఆత్మావగాహన అన్న ఏకైక లక్ష్యసాధనకై సర్వస్వాన్ని త్యాగం చేయాలి. "అందరూ సిద్ధులు కాలేరు కాని నిశ్చయంగ నీవు ఉత్తమ వ్యక్తిగ, మంచి పౌరునిగ వుండవచ్చు. బాల్యదశలో విధేయుడైన పుత్రునిగ ఆసక్తిగల విద్యార్థిగ వుండు. న్యాయమైన వృత్తిని చేపట్టి శిక్షణను పొందు. యుక్తవయస్కులైనపుడు పేదవారింటి బిడ్డ అయినప్పటికీ, అందమైన సాధుశీల అయిన కన్యను వివాహమాడు. అనురాగవతి, అనుకూలవతి అయిన అర్ధాంగి లభించడం అరుదైనప్పటికి, అటువంటి భార్యను పొందగలిగితే నీ ఆనందానికి అవధులుండవు. ఆ గృహలక్ష్మి తన గృహానికి నీవే ప్రభువన్న భావనను కలిగిస్తుంది. అనుకూలురైన సంతానం కలిగితే నీవు స్వర్గసుఖాలనే అనుభవిస్తావు. నీ సంసారానికి కొదవలేకుండ అన్ని అవసరాలను తీర్చడానికి, నిర్విరామంగా చెమటోడ్చి శ్రమించు. కష్ట ఫలి. శ్రమించకుండ ఏదీ జీవితంలో సిద్ధించదు. "నీరు పోయకుండా మల్లిపూయునా?"

నిరంతరం దయామయుడవై, దాన తత్పరుడవై వుండు. ఇంటి వాకిటికి వచ్చి అర్థించే పేదల్ని నిర్దాక్షిణ్యంగ తరిమి వేయవద్దు. సత్కార్యాలకు సద్వినియోగ పరచకుండ తన సంపదను సమకూర్చుకునేవాడు పొలంలోని దిష్టిబొమ్మ వంటివాడు. తల్లిదండ్రుల్ని సన్మానించు. నీవెంత పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించి శ్రీమంతుడవైనా, ఏ కారణం చేత కూడ నీ తండ్రిని చిన్న చూపు చూడకూడదు. సత్యాన్వేషకులు వేషభాషల్లో వింతగా కనుపించవచ్చు. కాని వారిని పరిహసించకు. గర్వించకు. డంబాలు పలుకకు. అహంకారియైన మూర్ఖుడు అందరికన్న పనికిమాలినవాడు. విశాల దృక్పథంలో, మంచి మాటలతో దానధర్మాలు చేస్తూ ఉన్నట్లయితే గృహస్థుడవైనప్పటికీ ఆత్మసంతృప్తిని, జీవిత సార్థకతను పొందగలవు. "సతిని బెనగువాడు సంసారయోగిరా."

కామవాంఛ అణచరానిదని స్వానుభవంలో తెలిసినవాడు గనుక వేమన ఇలా చెప్పాడు: "ఆడవారి అందచందాలకు మగవారు బానిసలు కావడం నిజమే. అత్యంత సౌందర్యవతియైన స్త్రీ సమక్షంలో సదామనోనైర్మల్యంతో వుండే యోగి కూడ వికల మనస్కుడౌతాడు అయినప్పటికి గృహస్థుగ నీవు నీ భార్యపట్ల త్రికరణ శుద్ధితో యధార్థంగ వుండాలి. పరసతిని కోరడమే కాదు; పరస్త్రీని మోహపుచూపులో చూడడం కూడ పాతకమే. నీకు డబ్బు వున్నా దేవదాసీలకు దూరంగ వుండు. దేవదాసీలను చేరదీయకు. వాళ్ళెంత ఆకర్షణీయంగ, అందంగా వున్నా, వాళ్ళు నీచురాండ్రు, చంచల స్వభావులు, దురాశాపీడితులు, కఠిన హృదయులు. పిండి పారవేసే నిమ్మతొక్కలాగ నిన్ను దోచుకొని తరిమివేస్తారు. ఒకవేళ దేవదాసిని వుంచుకొని తీరాలన్న నిర్బంధమే ఏర్పడితే - ఇక్కడ వేమనలోని సహజ ప్రవృత్తి బహిర్గతమవుతున్నది - సంగీత నాట్యాది కళల్లో ప్రవీణయై, సంస్కారవతియై, ఒంపు సొంపు లొలికే చూడచక్కని పడుచును ఎన్నుకో.

ఆమె పొందును కోరడానికి ముందు ఆమె తల్లి సజీవురాలుగా లేదని నిర్ధారించుకో. (ఒక యోగి ఇటువంటి సలహాను ఎలా ఇవ్వగలడని ఆశ్చర్యపడేవారు, 19వ శతాబ్దాంతం వరకు దేవదాసీని వుంచుకొనడం హైందవ సమాజంలో మగసిరికి, గౌరవానికి చిహ్నంగ వుండేదన్న విషయాన్ని విస్మరించకూడదు.) వేమన చెప్పినట్టి ఇతరమైన నీత్యుపదేశాలనీ క్రింద విధంగ క్రోడీకరించవచ్చు.

"అన్ని పరిస్థితుల్లోను మీరు నమ్మిన సిద్ధాంతాలకు త్రికరణ శుద్ధిగ అంకితంకండి. స్థయిర్యంగ నిలబడండి. సింహం బలహీనంగ రోగంతో వున్నపుడు కుక్క కూడ నిర్భయంగ ఎదిరిస్తుంది. అలాగని దుర్బలుల మీద మీ బలప్రదర్శనం చేయకూడదు. బలవంతుడు మౌనంగ వుంటాడు; అయితే అతడు దుర్నిరీక్షుడు కూడ. హింసను పరిహరించాలి. ప్రాణహింస చేయకుండా వుండడం ఒక మతసిద్ధాంతంగా ఆచరించాలి. కొందరు అవివేకులు మహాభారతాన్ని పంచమ వేదంగ పేర్కొంటారు. రణరంగంలో సహోదరుల రక్తం చిందించడం వారికి ప్రియమని భావించాలా?

ఆ॥ చంపదగిన యట్టి శత్రుడు తనచేత
జిక్కెనేని కీడు సేయరాదు
పొసగ మేలుజేసి పొమ్మనుటే చావు .విశ్వ. (బ్రౌన్. 1839. 4-23)

జంతువుల్ని చంపడం కూడ హింసయే అవుతుంది. జంతువుల ప్రాణాల్ని ఎందుకు చులకనగ చూడాలి? మూర్ఖుని కన్న అది హీనం కాదు గదా!

ఆ. చంపఁగూడబెట్టి జంతువునైనను
చంపవలయులోన శత్రుగుణముఁ
దేలుగొండి గొట్టఁదేలేమి చేయురా? .విశ్వ. (వావిళ్ళ. పుట. 81)

జీవకారుణ్యంతో మెలకువగ జీవిస్తూ వృద్ధుడవు కావాలి. వార్ధక్యమంటే బలహీనత కాదుగాని సుజ్ఞానం కలిగివుండాలి. జ్ఞానం కేవలం వయోవృద్ధుల సొత్తని భ్రమింపరాదు. జ్ఞానవంతులైన కొందరు యువకులు కూడ నీ బాటను వెలిగించగలరు. “పిన్నచేతి దివ్వె పెద్దగా వెలుగదా?” పరిగను తినేవాడికి మధుర ఫలాల రుచి తెలియదు, అలాగే చిన్న కళల్లో నైపుణ్యాన్ని సంపాదించిన వాడీ గొప్ప జీవిత కళను మెచ్చుకోలేడు. నిజానికి కళలన్నింటిలో జీవిత కళే అత్యద్భుతమైనది. వేమన స్త్రీల విషయంలో మాత్రం అంధుడే. అందుచే వేమన సార్థకం కాగల నిండు జీవితపు ప్రణాళికలో స్త్రీకి గౌరవ హీనమైన అథమస్థానాన్ని సూచించాడు. వేమన దృష్టిలో స్త్రీ సకలానర్థాలకు మూలం. అన్ని పాపాలకు పుట్ట. మానవాళి పతనానికి స్త్రీయే కారణభూతురాలు. స్త్రీకి దూరంగ ఉండడం ఉత్తమం. అలా చేయలేనపుడు ఆమెను సంపూర్ణంగ అదుపులో ఉంచాలి. ఆమెను గృహం వరకే పరిమితం చేసి సాధ్యమైనన్ని విధాల లొంగదీసుకోవాలి. స్త్రీల నిజాయితీని, విశ్వాసాన్ని నమ్మడం బుద్ధిహీనత. “సముద్రంలో ఓడ నడచుజాడ, అంతరిక్షంలో పక్షిరాజు జాడ వంటిది స్త్రీజాడ.”

మగని కలిమి బలిమి మగువకును బలంబు
కలిమి లేని మగడు కాసుగాడు
పనికిరాని మగని పాటించి చూడరు .విశ్వ. (వావిళ్ళ. పుట. 72)

మాతృమూర్తిని గౌరవించాలి. నిజానికామెను దేవతగ పూజించాలని ప్రబోధించిన వేమన నోట స్త్రీలను గురించి యిటువంటి అభిప్రాయాలు వెలువడడం వింత. స్త్రీలను తూలనాడినప్పుడు, ముఖ్యంగా భార్యల పై విద్వేషాన్ని ప్రకటించినపుడు వేమన ఒక స్త్రీ ముందు మగనాలు కాకుండ మాతకాలేదన్న సత్యాన్ని విస్మరిస్తున్నాడు. ఏమైనా స్త్రీల విషయంలో వేమనవి విప్లవాత్మకమైన అభిప్రాయాలు కావు. సంకుచితమైన పూర్వాచారబద్ధమైనవి. వేమనకు గల ఈ సంకుచిత దృష్టికి క్యాంబెల్ ఒక కారణాన్ని చూపి సమర్థిస్తున్నాడు:

“భారతదేశంలో స్త్రీలే సంస్కరణకు బద్ధశత్రువులు. సాంప్రదాయికమైన అభిప్రాయాలను, ఆచారాలను గుడ్డిగా నమ్మే స్త్రీ సముదాయం తన సంస్కరణల ప్రభావాన్ని బలహీనపరచి సంకుచిత బుద్ధితో తన ప్రయత్నాలను వమ్ము చేయవచ్చునని వేమన భావించి వుండవచ్చు.” క్యాంబెల్ అభిప్రాయంలో నిజం లేకపోలేదు. కాని భారతదేశంలో స్త్రీలు వెనుకబడటానికి పురుషులే కదా కారణం?

యుగాల తరబడి వారు స్త్రీలకు స్వాతంత్ర్యాన్ని, విద్యను, ప్రగతిని తిరస్కరించలేదా? సగభాగం స్వతంత్రంగా మరొక సగభాగం బానిసగా, సగభాగం విద్యావంతులుగా మరొక సగం నిరక్షరాస్యులుగ, కొందరు పురోగాములుగ అనేకులు తిరోగాములుగ వున్న ఏ సమాజమైనా ప్రగతి పొందగలదా? అటువంటి సమాజంతో రెండవ సగం బరువుగ, భారంగ ఉంటే దానికి కారణమా మొదటి సగానిదే అని చెప్పక తప్పదు.

వేమన వేదాలను తిరస్కరించినా వేమన మతతత్త్వంలో ఆయనొక వేదాంతి.

ఆ. వేద విద్యలెల్ల వేశ్యలవంటివి
భ్రమలఁబెట్ట తేటపడగనీవు
గుప్తవిద్య యొకటి కులకాంత వంటిది.విశ్వ.బ్రౌన్. 1839. 158-187)

అర్థం తెలియకుండ వేదాలను వల్లించే వారంటే వేమనకు గౌరవం లేదు. అట్టి వారిని “మొరిగే కుక్కలు”గా పోల్చాడు. వారి వేద పారాయణం వలన గాత్ర శిక్షణే గాని మరొక ప్రయోజనం పూజ్యమంటాడు. వేదాలలోని కర్మలు కూడ నిష్ప్రయోజనాలు. పురాణాలు "కల్లకథలగంప" పురాణాలు విగ్రహారాధనను ప్రోత్సహించి, విగ్రహారాధికులు పరతత్త్వాన్ని తెలుసుకోకుండ గుడ్డివారిని చేస్తున్నవి. చెక్కిన రాతి ప్రతిమలందు విశ్వాసముంచువారు, “అజ్ఞానులు,” “బుద్ధిహీనులు”,

"తెలివిమాలినవారు" "పిచ్చివారు". మనోజ్ఞమైన దేవాలయాలను నిర్మించి వానిలో విగ్రహాలను ప్రతిష్టించిన రాజులు రణరంగంలో అపజయాన్ని పొంది హతులయ్యారు; విగ్రహాలను పడగొట్టి ఆలయాలను శిథిలం చేసినవారు రాజ్యాలను పాలిస్తున్నారు. ఆలయాల్లోని దేవతా విగ్రహాలు వాటిని ఆరాధించే వారినెందుకు రక్షింపలేదు?" ధర్మశాస్త్ర గ్రంథాలు న్యాయాన్ని ప్రతిపాదించకుండా అన్యాయాన్ని ప్రబోధిస్తున్నవి. పుస్తకాల్ని, పుస్తక పరిజ్ఞానాన్ని ఆధారం చేసికొనడం నిష్ప్రయోజనం. సర్వేశ్వరునితో ప్రత్యక్షంగా స్వానుభవంతో ఏర్పడిన అనుబంధం అటువంటి ప్రత్యక్ష సన్నిహిత ఆత్మానుభవాన్ని సాధింపగలిగితే వారు ధన్యులే. ముక్తికి యేకైక మార్గం ప్రత్యక్షానుభూతి ఒక్కటే. సూక్ష్మ వివరాలను పరిగణింపకుండ వేమన మత సిద్ధాంతాన్ని అద్వైతమతమని స్థూలంగ చెప్పవచ్చు. కేవలం వేదాల, ధర్మశాస్త్రాల ప్రామాణికతను తిరస్కరించడంలోనే కాక, పరమాత్మకన్న వ్యక్తిగత ఆత్మల ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పడంచేత వేమన తదితర అద్వైతవాదులతో ఏకీభవించకుండ వ్యతిరేకిస్తున్నాడు.

ఆ. బ్రహ్మ జంపి విష్ణు భాగంబులో గల్పి
విష్ణు జంపి శివుని వెలయ గల్పి
శివుని జంపి తాను శివయోగి గావలె .విశ్వ. (బ్రౌన్. 1839. 59-396).

ఏ హైందవుడిలా యోచింప సాహసిస్తాడు? డా. జి.వి. కృష్ణ రావుగారు వేమన తాత్త్విక తత్త్వాన్నిలా వివరించారు:
"మానవుని హృదయంలో నివసించే భగవంతుడు సంపూర్ణంగ మానవునికన్న భిన్నుడుకాడు. తన అహంభావాన్ని, కోరికల్ని విసర్జించి తన వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగ విస్మరించి, పరమాత్మునిలో లీనమై తనలోని భగవంతుని దర్శింప గలిగినప్పుడు జీవి పరమాత్మునితో ఏకమవుతున్నాడు. కాదు; అతడే భగవంతుడు. ఈ సత్యాన్ని గ్రహించలేని మానవులు భగవంతుని దేవాలయాలలో, తదితర పుణ్యప్రదేశాలలో వెదకుతారు... మరికొందరు లోకాన్ని త్యజించి, మరొక లోకంలో మరణానంతరం ఆయన్ను కనుగొనగలమన్న నిరీక్షణతో తపస్సు చేస్తారు. ఇదొక గొప్ప భ్రమ. ఇందులో సత్యం ఎంతమాత్రం లేదు.

ఆ. ఇహమునందు సుఖము లీడేరఁ గాలేదు
పరము నందునెట్లు పడయవచ్చు
మొదల లేనిచేఁత తుది యెట్లు వచ్చురా? .విశ్వ.(వావిళ్ళ. పు. 22)

కనుక ఇంద్రియ గోచరమయ్యే యీ బ్రహ్మాండానికి ఆవల మానవుని అందుబాటుకు సుదూరంగ ఎక్కడో సర్వాంతర్యామి ఉన్నాడనడం తప్పు. ఇక్కడే మానవునిలో, మానవుని పరివేష్టించి పరమాత్మ ఉన్నాడు. మానవుడి సత్యాన్ని గుర్తించి అంతర్ముఖుడై తనలో భగవంతుని వెదకాలి.

ఆ॥ ఊరు విడువకుండు నుత్తమ శివయోగి
పోరి చూచు మదిని బూర్ణసుఖము
దారిలోని నక్క తలపెట్ట బోవునే .విశ్వ.(వావిళ్ళ. పుట. 40)

సమస్త విషయాలలో మానవునికి ప్రాధాన్యతనిచ్చి, మానవుని కేంద్రంగ నిలిపే వేమన తత్త్వం ప్రధానంగా మానవతా వాదం. Saint Vemana: His Philosophy (వేమన యోగి: ఆయన - తత్త్వము) అన్న పుస్తకంలో, ఆ గ్రంథకర్త అయిన డా. ఈశ్వర తోపా (Dr. Iswara Topa) ఈ విషయాన్నే ఉద్ఘాటించారు. వ్యక్తికి స్వీయ సంస్కారాన్ని వేమన ప్రబోధించినట్లయన పేర్కొన్నారు. తోపాగారిలా వివరించారు. "మానవతా సిద్ధాంతాలను పునాదులుగ చేసి వేమన తన ఆదర్శ సంస్కరణల భవనాన్ని నిర్మించాడు. ఆత్మ శుద్ధీకరణకు మానవుడు తానే స్వయంగ పాటుపడాలి. మానవునిలో అంతర్గతమైన ఆంతరంగిక శక్తుల్ని వెలికి తీయడంలో ఏ మానవాతీతశక్తి కూడ అతనికి తోడ్పడదు. అయితే సర్వమానవ సంక్షేమార్థం మానవశక్తుల్ని ఉదాత్తంగా సంస్కరించడం చాల ముఖ్యం అన్న గ్రహింపు అవసరం." మానవ ప్రవృత్తిని, మానవేచ్ఛలను అణచడం కాదుగాని, వాటిని సంస్కరించాలన్నది వేమన సిద్ధాంతాలకు మూలాధారం. మానసిక

విశ్లేషణకు మూల పురుషుడైన ఫ్రాయిడ్ (Freud) కన్న ముందే వేమన మానవ స్వభావాన్ని ఉత్తేజపరిచే ప్రధానమైన భౌతికశక్తులలో ఒకటి లైంగిక ప్రవృత్తి అన్నది స్పష్టంగ సూచించాడు.

ఆ॥ పడుచు నూరకేలఁ బాఱు చూచెదరొక్కొ
యెంత వారలైన భ్రాంతి సెంది లోన
మీఱు కాము లొంగఁ జేయఁగ లేక. .విశ్వ.(వావిళ్ళ. పు. 395)

ఒకనిలో కలిగిన ఐహి కేచ్ఛల్ని ఆముష్మిక వాంఛలుగ మార్చాలని వేమన ప్రబోధము. జీవి యోగసాధనవలన పరమాత్మతో సమైక్యతను పొందటాన్ని వేమన స్త్రీపురుష సంయోగంతో పోల్చుతాడు. ఈ భావాన్నే వేమన మరొక విధంగ వివరించాడు, “కామిగాని వాడు మోక్షకామి కాఁడు.” ఈ భావాన్ని ఊర్జితం చేయడానికే "సతిని పతికాంక్షతో సమీపించేలా యోగి భగవంతుని సాన్నిధ్యాన్ని కోరాలి” అని ఉద్ఘాటిస్తాడు.

నాగార్జున, శంకరాచార్యులవలె మహామేధావి, మహాపండితుడు కానందువల్ల వేమన తాత్త్వికుడిగ, దార్శనికుడిగ ప్రసిద్ధిని పొందలేదు. వేమన ఉపదేశాలు కూడ క్రమబద్ధంగ లేవు. అయినా ప్రతి మానవుని స్పృశించే మానవ జీవితంలోని ప్రతి అంశాన్ని విశ్లేషించే వేమనది అనదగిన ఒక వ్యక్తిగత తత్త్వం ఉన్నది. సామాన్య విషయాల నుండి ఆధ్యాత్మిక విషయాల వరకు ఆ తత్త్వంలో తర్కింపబడ్డాయి. వేమన తత్త్వం ఎంత ఆదర్శప్రాయమో, అంత ఆచరణ యోగ్యం కూడ. "The Heart of India, Vemana" అన్న తన చిన్న పుస్తకంలో డా. ఎల్.డి. బార్నెట్ (Dr. L. D. Barnett) “వేమన మానవులకు సంబంధించిన దేనినీ నిర్లక్ష్యంగ చూడలేదు.” అని చక్కగా పేర్కొన్నారు. వేమనను గూర్చి, ఆయన మానవతా వాదాన్ని గూర్చి బార్నెట్ ప్రశంస అట్టిది. బార్నెట్ యొక్క మానవతా భావన ఆయన్ను వేమనను గూర్చి ఇంకా ఇలా చెప్పేలా ప్రేరేపించింది:

> *మానవాళికి బోధించిన బోధకులను, ఆచార్యులను హృదయశోధకుడైన భగవంతుడు తన త్రాసులో తూచినపుడు, ఉద్ధతులు, మహాత్ములైన అనేకులు తెలంగాణాకు చెందిన ఈ అనాగరికునికన్న తక్కువ తూగుతారు.*

## అపురూపమైన మహామేధావి

కవులలో ప్రతిభాశాలులు ఎంతో అరుదు., విమర్శకులలో మంచి అభిరుచి కలవారూ అంతే అరుదు. -పోప్

ఏ కోణం నుండి పరిశీలించినా వేమన మేధావి, అరుదైన మహామేధావి అనడంలో సందేహం లేదు. ఒక మారుమూల కుగ్రామంలో పుట్టి పెరిగిన వేమన ప్రపంచాన్నంతటిని తన స్వగ్రామంగ పరిగణించాడు. వేమన కొంత కాలం నైతికంగ పతితుడై నీచజీవితాన్ని గడిపినా, తరువాత తన్ను తాను తెలుసుకొని, ఆత్మసంయమనంతో మహాత్ముడయ్యాడు. గురూపదేశం లేకుండ భాషా శాండీర్యాన్ని సంతరించుకొని కొత్త అందాలు చిందే వాడియైన భాషను వాడటం ప్రారంభించాడు. సాహిత్య శిఖరాగ్రాన్ని అధిష్ఠించాలి అన్న ఆశయం లేకుండానే, సమకాలంలోనే యుగయుగాల గొప్పకవి అయ్యాడు. విదేశీయ తాత్విక బోధనతో పరిచయంలేని వేమన స్వదేశపు తాత్త్విక చింతనతో మానవతను సూచించే ఆధునిక తత్వాన్ని ప్రబోధించాడు. అది సర్వగ్రాహకమైనది; సాహసోపేతమైనది. విభిన్న సైద్ధాంతిక రంగాలలో ఏకాకిగ యుద్ధాన్ని ప్రకటించాడు. సత్యస్థాపనార్థం మూఢాచారాలనే విగ్రహాలను విచ్ఛిన్నం చేశాడు. మానవుని మౌఢ్యశృంఖలాల నుండి విడిపించే నిమిత్తం అనేక మూఢనమ్మకాలను ఛిన్నాభిన్నం చేశాడు. మహా ప్రభంజనమై హానికరమైన సమస్తాన్ని సమూలంగ తుడిచిపెట్టాడు. శక్తిమంతమైన సందేశాలను వ్యంగ్యంతో చైతన్యవంతం చేసి బరువైన ఉపదేశాలను

హాస్యంతో తేలికచేసి, తన తాత్త్వికతను చమత్కరించి అనేకులను ఆకట్టుకున్నాడు. మత సిద్ధాంతాలను పరనయోగ్యంగ మార్చాడు, నీత్యుపదేశాన్ని గంభీరంగ, ఆకర్షణీయంగ రూపొందించాడు.

ప్రపంచంలో వేమన వంటి వాడు ఒక్కడే వుండగలడు. ఎందుకంటే ఆయన మేధస్సు అయనను ఏకైక విశిష్టవ్యక్తిగ మలచింది. అయినప్పటికి కొందరు ప్రపంచ విఖ్యాతులైన వ్యక్తులతో వేమనకు కొన్ని విషయాలలో సాదృశ్యమున్నది. లార్డ్ చా ర్ (Lord Chancellor) బేకన్లో కనబడే అవినీతికాక ఆయన వాక్యాలలోని సూక్తిప్రాయమైన సంక్షిప్తత, సముజ్వలత, పోప్ కవిలో కనబడే చిరచిరలాటలేని లాఘవం; ధారాళత, నిరాశావాదియైన డీన్ స్విఫ్టులోని మానవ విద్వేషం లేకుండా ఆయన రచనల్లో విరిసే వ్యంగ్య మర్యాద; రూసోలో కనబడే ప్రభుత్వాలను కూలదోయాలన్న ఆసక్తి లేకుండా ఆయన పంక్తుల్లో మెరిసే ప్రజ్వలవీరావేశం, ఆ వేగం; వాల్టేరుకున్నకుయుక్తి లేదు కాని ఆ విద్వాంసుని రచనల్లో గోచరించే సాహసం, వ్యాజస్తుతి; బెర్నార్డ్ షాకున్న చమత్కారం, చాపల్యం స్పష్టతా; టాల్ స్టాయికున్న సార్వకాలికమైన నైతిక అభినివేశం వేమనలో ఉన్నాయి. చారిత్రక వ్యక్తులనుకాక కల్పిత పాత్రయైన డాన్ క్విక్ సెటో (Don Quixote) ను వేమన తలపిస్తాడని అతని విమర్శకులు అనవచ్చు. ఇటువంటి అభిప్రాయం కలిగిందని ఎవరూ కోపగించుకోనక్కరలేదు. The Concise Oxford నిఘంటువు ప్రకారం Quixote అంటే “కేవలం ఉత్సాహవంతుడు, ఆదరించటానికి వీలుకాని ఉదాత్తమైన ఆశయాలు కలవాడు; గౌరవం కొరకు నిష్ఠకొరకు తన ఐహిక భోగ భాగ్యలను నిర్లక్ష్యం చేసేవాడు, వింత స్వభావం కలవాడు.” ఈ గుణాలలో కొన్ని వేమనకు అన్వయిస్తాయి. అలా కాకపోతే వేమన ఏకైక విశిష్ట వ్యక్తిగ ప్రకాశించేవాడు కాడు. ఒక్కొక్కమారు వేమన తన ఆదర్శాన్ని హేతువాదాన్ని దృఢత్వాన్ని అతిగా సాగదీ సేవాడు. తన చుట్టూ ఉన్న బూటకపు వ్యక్తులు విభిన్న మత శాఖలకు చెందిన వస్త్రాల్ని ధరించి ఆచార్యులుగ చెలామణి కావటాన్ని చూచిన వేమన తన జీవిత చరమదశలో బట్టలను త్యజించి దిగంబరుడయ్యాడు. వేమన అంటాడు:

ఆ. తల్లి గర్భమందు తాఁబుట్టినప్పుడు
మొదల బట్టలేదు తుదనులేదు
నడుమ బట్టగట్టనగు బాటుగా దోకో .విశ్వ.(బ్రౌన్. 1839. 99-252)

వేమనలోని విలక్షణతకు మరొక కారణం అతనికి స్త్రీలపట్లగల రాగద్వేషాలు. ఇటువంటి దౌర్బల్యాలు, బలహీనతలు వాటిని ఆ పేరుతో పేర్కొన వచ్చునంట - అవే వేమన వ్యక్తిత్వాన్ని దేదీప్యమానంగ ఇంపుసొంపులతో నింపుతాయి. భారతదేశపు కవులలో కన్నడ సర్వజ్ఞుడు, హిందీ కబీరు, తమిళ తిరువళ్ళువర్ కవుల అభిప్రాయాలతో వేమన అభిప్రాయాలు ఏకీభవిస్తాయి. తిరువళ్ళువరును డాక్టర్ జె.యు. పోప్ యిలా ప్రశంసించాడు: “విశ్వమానవుని గూర్చి గానం చేసిన కవి గాయకుడు.” వేమన కూడ ఒక కవిగాయకుడే. కాలాన్ని బట్టి చూస్తే ఈ కవులిద్దరికి మధ్య సుమారు పదిహేనువందల యేండ్ల తేడా ఉన్నది. ఇద్దరూ విభిన్న ప్రాంతీయులు. బహుశా ఇరువురిది భిన్నమతాలు కావచ్చు. భిన్నమైన రెండు భాషలలో రచించారు; అయినప్పటికి వారి సందేశం మాత్రం ఒక్కటే మానవ సమత. “జన్మతః మానవులందరూ సమానులు” అని తిరువళ్ళువరు పేర్కొన్నాడు. ఆ తదుపరి మానవులు భేదించడానికి వారి మతం, కులం కారణం కాదుగాని, స్వభావం, నడవడికలచేత వారు భిన్నమవుతున్నారు.” తిరువళ్ళువరు ఇంకా ఇలా పేర్కొన్నాడు: “పుట్టుకతో కులీనులైనా వారు గుణవిహీనులైతే వారు అధములే. కడజాతిలో పుట్టినా గొప్ప ఆదర్శాలను వెన్నాడే వారు గొప్పవారు” ఈ సత్యాలనే వేమన కూడ ఇంకా గట్టిగ నొక్కి చెప్పినట్లు ముందే పరిశీలించాం. మానవ సమతను గురించిన వేమన భావాలు మనోజ్ఞాలు, మహోన్నతాలు. సర్వుల్ని సమకట్టుకునేవి గనుక వేమన ఇలా అన్నాడు:

ఉర్వివారికెల్ల నొక్క కంచము బెట్టి
పొత్తు గుడిపి కులము పొలయజేసి
తలను చెయ్యిబెట్టి తగనమ్మ జెప్పరా..విశ్వ.(బ్రౌన్. 1839. 165-227)

కబీరువలె వేమన ఏకేశ్వరోపాసకుడు. భగవంతుడొకడే అని నొక్కి చెప్పాడు. కబీరుకు “రాముడు, అల్లా ఇరువురూ ఒక్కరే." వేమన కూడ “అన్నిట పరిపూర్ణుడల్లా మహమ్మదు” అని అన్నాడు. వేమనకు శివుడు, అల్లా ఇరువురూ ఒక్కరే,

ఏకేశ్వర సిద్ధాంతం ఒకే మతాన్ని సహ జీవనాన్ని ప్రబోధిస్తుంది. కబీరుకు వలె వేమన కూడ ఈ సత్యాలనే ప్రత్యేకంగ నొక్కి వక్కాణించాడు:

"పసుల వన్నె వేరె పాలేకవర్ణమౌ
పుష్పజాతి వేరె పూజ యొకటి
దర్శనములు వేరె దైవంబదొక్కటే. .విశ్వ. (బ్రౌన్.1839.28.189)
తే॥ జాతి నీతి వేరు జన్మం బదొక్కటి
అరయదిండ్లు వేరె ఆకలొకటి.
భాషలెన్నిటి లోనైన భావమొకటి .విశ్వ. (వావిళ్ళ. పుట.364)

భూషణాల ఆకారాలు భిన్నమైనా అవి చేయబడిన సువర్ణం మాత్రం ఒక్కటే." ఇలా వేమన సమతా భావం ఎంతో సువిశాలమైనది. చేతనాచేతనా లన్నింటిని మిళితం చేసి విభేదాన్ని విస్మరించినట్టిది.

విగ్రహారాధనను నిరసించడంలో వేమన మరల కబీరుతో ఏకీభవిస్తాడు. "ఒక రాత్రిని పూజించటం వల్ల భగవంతుని కనుగొనగలిగితే నేనొక పర్వతాన్నే పూజిస్తాను" అంటాడు కబీరు.

రాతి బొమ్మకేల రంగైన వలువలు
గుళ్లు గోపురములు కుంభములును
కూడు గుడ్డతాను కోరునా దేవుడు. .విశ్వ.(వే.వే. పుట. 26)

అని ప్రశ్నిస్తాడు వేమన. శైవుల్ని ప్రత్యేకించి ఇలా ప్రశ్నించాడు:

రాతి బసవని రంగుగా మ్రొక్కుచు
గునుక బసవని గని గ్రుద్దుచుండ్రు
బసవ భక్తులెల్ల పాపులు తలపోయ..విశ్వ. (బ్రౌన్. 1839. 165-240)
రాతి ప్రతిమదెచ్చి రాజసంబున నుంచి
పూజ సేయు నరుడు బుద్ధిమాలి
భావమందు పరము భావించనేరడో .విశ్వ.. (బ్రౌన్. 1839. 157-182)

మతపరమైన బాహ్యాచారాలను పరిహసించడంలో వేమన కబీరున కెంత మాత్రం తీసిపోడు. "నీటిలో మునిగినంత మాత్రాన మోక్షప్రాప్తి గలిగితే కప్పలు కూడ నీళ్ళలోనే జీవిస్తున్నవి కదా!" అంటాడు కబీరు. వేమన కూడ ఇట్టి భావాలను వ్యక్తపరచినట్లు ముందే సువిదితం. కబీరు, వేమన లిద్దరు పరస్పరం అపరిచితులైనా వితాన్ని, జీవిత సమస్యల్ని సమానంగ సందర్శించారు గనుకనే సమాన సత్యాలను ప్రబోధించారు.

తిరువళ్ళువరు, కబీరు కన్న భావనలో, భావవ్యక్తీకరణలో, స్వభావంలో వేమన సర్వజ్ఞునికి సన్నిహితుడు. వారిద్దరికున్న సమానమైన పూర్వరంగమే వారినంత సన్నిహితుల్ని చేసింది. యువకులుగ వారిద్దరు స్త్రీలోలురు. ఇద్దరూ మొదట దేవదాసీల వలయంలో పరిభ్రమించి ఆ తరువాత వారిని ఏవగించుకొన్నవారే. ఇద్దరూ ఆకస్మికంగా భోగాల పట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించి, ఆధ్యాత్మిక చింతన వైపు మొగ్గును చూపారు. అయినా దేవదాసీలను గూర్చిన తలంపులు వారిని ఎంతగ వెన్నంటి నవంటే క్రూరమైన సామాజిక వ్యవస్థకు బలియైన ఆ దురదృష్టవంతురాండ్రను అవకాశం దొరికినపుడెల్లా శపింపకుండ విడువలేదు. వారిద్దరు స్త్రీ విషయంలో దుర్బలులు అని కూడ చెప్పాలి. వేమన సర్వజులలో ఎవరు పూర్వకాలికులు అన్న ప్రశ్న వివాద గ్రస్తమైనా, వారిద్దరిని గురించి పరిశోధించిన రాళ్ళపల్లివారు, వేమన వల్లనే సర్వజ్ఞుడు ప్రభావితుడై యుంటాడని భావించడానికి అధికమైన ఆధారాలున్నవని అభిప్రాయపడ్డారు. ఏమైనా వారిద్దరిలో అనేకమైన సామ్యాలున్నప్పటికి:  వేమన సర్వజ్ఞులు పరస్పరం ప్రతిబింబాలో లేదా ప్రతిధ్వనులో కారు. సర్వజ్ఞుడు వేమన కన్న అధిక

లౌకికజ్ఞానంతో వాస్తవిక దృక్పథం కలవాడు. కొన్ని మౌలిక ఆదర్శాలకు, అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వటంలో ఇద్దరు భేదిస్తున్నారు.

ఆధునిక బెంగాలీ మేధావులలో ఒకరైన ఆచార్య బినోయ్ కుమార్ సర్కార్ "The Positive Background of Hindu Sociology" అన్న తన గ్రంథంలో ఇలా పేర్కొన్నారు: "తమిళ కురళ్ లో ప్రబోధింపబడిన భక్తితత్త్వంలోని సర్వ మానవ సమతా సిద్ధాంతం వేమన పద్యాలలో పురోగమించి సమాజ విప్లవానికి బాటలు వేసింది. భౌతికమైన ఆస్తిపాస్తుల అసమానతలను ఎత్తిపోవడంలో వేమన ఎంత సహజ వ్యంగ్యాన్ని ప్రదర్శించాడో వర్గ విభేదాల వలన కలిగే ప్రతిబంధకాల్ని నిందించడంలోను అంతే తీవ్రతను కనపరిచాడు. హైందవ మతాన్ని దృఢపరచడంలో వేమన స్థానం కబీరు, చైతన్య ప్రభృతులకన్న అధికం కాకపోయినా, సమానమని నిశ్చయంగ చెప్పవచ్చు."

తిరువళ్ళువరు, కబీరు, చైతన్యలకున్నంత ప్రసిద్ధి ప్రచారాలు వేమనకు లేవు. తెలుగు వాఙ్మయకారులు వేమనను నిర్లక్ష్యం చేయడమే దీనికి ప్రధాన కారణం. వేమన వెలుగులోకి రాకుండ చేయడంలో వారు విఫలులు కావడానికి కారణం వారి ప్రయత్న లోపం కాదుగాని, దుబాయ్, బ్రౌన్, మ్యాక్ డొనాల్డ్, గోవర్, క్యాంబెల్, గ్రియర్సన్ వంటి విదేశీ విద్వాంసులు వారి దురాలోచనను ప్రతిఘటించడమే. కబీరు గ్రంథాన్ని రబీంద్రనాథ ఠాగూర్, తిరుకురళ్ ను రాజాజీ అనువదించినట్లు వేమన పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించిన వారు ఇప్పటికీ లేకపోవడం శోచనీయం. ఎంతో పట్టుదల గల బ్రౌన్ వేమనకు న్యాయాన్ని చేకూర్చలేకపోయాడు. బ్రౌన్ విదేశీయుడు. క్రైస్తవుడు.
ఇటువంటి విదేశీ నేపధ్యంతో బ్రౌన్ వేమన కవితా హృదయాన్ని గాని, అతని భావాలను గాని సంపూర్ణంగా అవగాహన చేసుకోలేక పోయాడు. ఉదాహరణకు బ్రౌన్ అనువదించిన ఒక వేమన పద్యం:

> పుణ్యము గలవాని పుష్టంబు పుండైతె
> వసుధలోన చాల వార్తకెక్కు
> పేదవాని యింట పెండ్లైన నెరుగరు..విశ్వ. (అకా.ప. 667)

If even a boil rise on the back of a man of virtue, it will become notorious. But if even a marriage happen in the house of a poor man, no one hears of it.

ఇంగ్లీషు అనువాదంలో కొన్ని అనౌచిత్యాలు దొరలడమేకాక బ్రౌన్ ఒక నీతిమంతుని ఒక పేదవానితో వేమన పోల్చినట్లు తప్పు అభిప్రాయాన్ని కలిగించి, వేమనకు అన్యాయాన్ని చేశాడు. వేమన అటువంటి బుద్ధిహీనమైన భావాలు లేని సుకవి. "పుణ్యము గలవాడు" అని వేమన రచించిన దానికి "Man of Virtue" అన్నది సరియైన అక్షరానువాదం, పూర్వజన్మ సుకృతంవల్లనే ఈ జన్మలో సంపన్నులవుతారన్న నమ్మికగల హిందువులకు, ఆ సందర్భంలో ఆ పదం ఒక శ్రీమంతుడని అర్థం అవుతుంది. ముందే పేర్కొన్నట్లు ఎంతో వ్యయప్రయాసల కోర్చి వేమనను ఉద్ధరించిన బ్రౌన్ ను తప్పుపట్టడం సంస్కారహీనత అవుతుంది. అయినా రబీంద్రనాథ, రాజాజీల వంటి వారు వేమనను ఈ విశాల విశ్వానికి ఇంగ్లీషులో సక్రమంగ ప్రదర్శించాలని కోరకుండ ఉండలేము. "The Musings of a Mystic" (ఒక తాత్త్వికుని చింతనలు) అన్న శీర్షికతో ఇటీవల మీర్ మహమ్మద్ ఖాన్ వేమన పద్యాలను కొన్నింటిని ఎన్నుకొని ఇంగ్లీషులోనికి అనువదించారు. అవి బ్రౌన్ అనువాదానికన్న కొంత మెరుగుగ ఉన్నాయి. అయినా ఖాన్ గారే ఇలా ఒప్పుకున్నారు. "నాకు తెలుగు భాషలో తగినంత పాటవం లేనందువల్ల వేమన కవితా సొబగులోని సూక్ష్మతను ఆకళించుకోలేక పోయాను."

వేమన కవితను సక్రమంగ అనువదించడానికి ఒక రాజాజీయో లేక ఒక రబీంద్రనాథో కావలసి వచ్చినట్లే వేమనను చిత్రింప ఒక రఫేల్ (Raphael) లేదా రెంబ్రాట్ (Rembrandt) వంటి చిత్రకారులు కావాలి. ఆ అంతస్థుకు చెందిన ఉత్తమ చిత్రకారుడు మాత్రమే కండ్లలోని కాంతిని; అధరాల పైని వక్రదరహాసాన్ని, నడకలోని చురుకుదనాన్ని ప్రతిబింబించగలడు. ఉత్తమ చిత్రకారుడు కూడ ఒక చిత్రాన్ని చిత్రించితే చాలదు. వేమన వ్యక్తిత్వంలోని విభిన్న కోణాల్ని ప్రదర్శించడానికి చిత్రపరంపరను చిత్రించాలి. ఒక క్షణంలో మృదువుగ, మరుక్షణంలో కటువుగ మరొక క్షణంలో చీకాకుగ దర్శనమిస్తాడు వేమన. క్షణక్షణం మారే ఈ భావాలతో కేవలం ముఖకవళికలు మారడమే కాదు గాని, అతనిలోని ప్రతికండరమూ మార్పు చెందుతుంది. సామాన్య కవి లక్షణాలు వేమనకు వర్తించవు. ప్రతిపదాన్ని ఆచి తూచి నగిషీలు చెక్కి ఒక ఉదాత్త ధ్వనిని కల్పిస్తాడు వేమన. అలాగే అనేక తత్త్వవేత్తల, ప్రవక్తలకన్న భిన్నమైన వాడు వేమన. గజదంతపు గోపురాలను ఉన్నత పీఠాలను ఎన్నడూ వేమన కోరలేదు. తన సందేశాన్ని ప్రకటించడానికి వేమన రాస్తా కూడలిలో నిలుచోని నిర్మొహమాటంగ, నిర్భయంగ మాట్లాడవచ్చు.

అతని ప్రబోధాలను వ్యతిరేకిస్తూ రాళ్లు విసరినా కుక్కలను అతని పైకి ఉసికొలిపినా వేమనకు లక్ష్యం లేదు. వేమన కవిత్వంలో తరచు కుక్కల ప్రస్తావన ఉండటంచేత, బహుశా అతని పైకి కుక్కల్ని తోలి ఉండవచ్చని అనిపిస్తుంది. క్రీస్తు, సోక్రటీసులను గురించి వేమన విని ఉండడు. కాని ప్రవక్త తన స్వజనులలో, స్వస్థలంలో, సమకాలంలో గౌరవింపబడడన్న సత్యాన్ని మాత్రం వేమన ఎరుగును. పెరటి చెట్టు మందుకు పనికిరానట్లే, యోగిని స్వజనులు గౌరవించరని ఒక పద్యంలో చెప్పాడు.
కవి, తాత్త్వికుడు, దార్శనికుడు, అనేక విధాల ఉదాత్తుడైన వేమన సర్వజాతులకు, సర్వకాలాలకు వర్తింపగల సందేశాన్ని యిచ్చాడు. నైతిక పతనంతో నిరాధారంగ ఎటుపోవటానికి దిక్కుతోచకున్న నేటి ప్రపంచానికి వేమన సందేశం చాల సముచితమైనది. మానవులు మానవులుగ జీవించితే ఈ భువియే దివిగ వుంటుందని వేమన పేర్కొలేదా? మనం నివసిస్తున్న ఈ వాస్తవ ప్రపంచాన్ని కాదని మిథ్యా స్వర్గానికై తాపత్రయ పడడం బుద్ధిహీనతని చెప్పలేదా? మనం నిలిచిన ప్రదేశమే పవిత్రమైన పుణ్యస్థలమని చాటలేదా? వేమన మతం మానవతావాదం. వేమన సందేశం ప్రేమ, మానవాళిలో పరస్పరావగాహన, స్నేహభావం. అతని లక్ష్యం సర్వమానవ సౌభ్రాతృత్వస్థాపన, నిరీశ్వర వాదికి, చార్వాకునికి కూడ ఇలా వేమన ఒక సందేశాన్ని అందించాడు. పరుల బాధను తన బాధగా భావించేవాడే మానవుడు, అన్నది వేమన సందేశ సారాంశం.

అన్యులకు వచ్చు నాపద తనదిగా
నున్నవాడు భువిని మన్నవాడు
మన్నవారిలోన మహిపరంబును లెస్స
కన్నవాడు మిగుల ఘనుడు వేమ.(అకా. ప. 615)

## వేమన పద్యరత్నాలు

వేమన కవితామాధుర్యాన్ని, పదాల కూర్పులోని పొందికని, ధ్వనుల్లోని ఇంపుసొంపుల్ని ప్రదర్శించి, చవిచూప క్రింద కొన్ని పద్యాలు ఉదహరింపబడ్డాయి:

### కుహనాభక్తి

ఎంత చదువు జదివి నెన్ని విన్ననుగాని,
హీను డవగుణంబు మానలేడు;
బొగ్గుపాల గడుగ బోవునా మలినంబు .విశ్వ. (బ్రౌన్. 1839. 70-52)

సకల శాస్త్రములను జదివియు వ్రాసియు
తెలియగలరు చావు దెలియలేరు
చావు దెలియలేని చదువులవేలరా .విశ్వ (బ్రౌన్. 1839. 89-188).

మతము లెన్నియైన సతముగా నుండవు
సతముగాను యుండు జగతి నొకటి
యంత మదము విడిచి నా బ్రహ్మమరయుట .విశ్వ. (బ్రౌన్. 1839. 115-359)

ఒడల బూది పూసి జడలు ధరించిన
నొడయ డగును ముక్తి బడయలేడు
తడక బిఙ్జు వెట్ట దలపుతో సరియౌనె? .విశ్వ (బ్రౌన్. 1839. 123-416)

“ముట్టు ముట్ట" నుచును "ముట్టరాదందురు
ముట్టుకు దరియేమి మూలమేమి?
నవ బిలముల మురికి నరుల కందరకును
పుట్టగానె పుట్టు ముట్టు వేమ. .విశ్వ. (బ్రౌన్. 1839. 147-111)

### విగ్రహారాధన

రాళ్ళు దెచ్చి నరులు రమ్యమౌ గుడిగట్టి
రాతిప్రతిమ చేసి ఖ్యాతిగాను
దేవుడనుచు యొక్క దీవించి పల్కునా .విశ్వ.(వే. వే. 25-19)

పడిపడి మొక్కగ నేటికి గుడిలోపల
కఠినశిలల గుణములు చెడునా?
గుడి దేహ మాత్మ దేవుడు
చెడురాళ్ళకు వట్టిపూజ సేతురు వేమా! .విశ్వ. (బ్రౌన్. 1839. 160-201)

మన్ను మెత్తి కరిగి మరి రూపుగావించి,
గుంటనిండ బూడ్చి గురుతు నిల్పి

మనుజులెల్ల గూడి మరిదేవుడందురు .విశ్వ. (బ్రౌన్. 1839. 164-241)

గట్టురాళ్ళ దెచ్చి కాళ్ళచేతుల దొక్కి
కాసె యులులచేత రాసి జేసి
మొరపరాళ్ళ కెరగు మొప్పెల నేమందు .విశ్వ. (బ్రౌన్. 1839. 165-238)

రాతిబసువని గని రంగుగా మ్రొక్కుచు,
గునుక బసువని గని గ్రుద్దుచుంద్రు,
బసువ భక్తులెల్ల పాపులు తలపోయ .విశ్వ. (బ్రౌన్. 1839. 165-240)

తోలు కడుపులోన దొడ్డవాడుండగ
రాతి గుళ్ళలోన రాశిబోయ
రాళ్ళు దేవులైన రాసులు మ్రింగునా? .విశ్వ (బ్రౌన్. 1839. 165-239).

## కులము

పరగబొమ్మ గుడ్డు బరికించి చూచిన
కులము లన్నియందు గూడ బుట్టె
నందరొకట గలియ నన్నదమ్ములెకదా? .విశ్వ. (బ్రౌన్. 1839. 162-217)

కూడదేమిజేసె కులమేమి చేసెను
భూమి యేమిజేసె బొందికట్టె
నరుదు బడెడు పాట్లు నగుబాట్లు చూడగా .విశ్వ. (బ్రౌన్. 1839. 162-218)

శూద్రులనుచు భువిని శూద్రుల బోనాడు
మాలకన్న చెడుగు మహిని లేదు,
నరకమునకు నేగు నష్టమైన వెనుక .విశ్వ. (బ్రౌన్. 1839. 163-223)

కులము హెచ్చు తగ్గు గొడవలు పనిలేదు
సానుజాతమయ్యె సకల కులము
హెచ్చు తగ్గు మాట లెట్లైరుంగగవచ్చు .విశ్వ. (బ్రౌన్. 1839. 163-225)

మాలవాని నేల మహిమీద నిందింప
నొడల రక్తమాంస మొకటి కాదె
వానిలోన మెలగు వాని కులంబేది? .విశ్వ. (వావిళ్ళ. పుట 510)

## మరణము

ఇనుము విరిగెనేని యిరుమారు ముమ్మారు
కాచి యతకనేర్చు కమ్మరీడు;
మనసు విరిగెనేని మరి యంటనేర్చునా? .విశ్వ. (బ్రౌన్. 1839. 8-50)

కుండ పగిలెనేని కొత్తది గొనవచ్చు
భూతలంబు నందు పొందుగాను
కూలబడిన నరుడు కుదురట యరుదయా! .విశ్వ (బ్రౌన్. 1839. 13-82)

తనువు విడిచి తాను తగ్గిపోయెడువేళ,
తనదు భార్య సుతులు తగినవార లొక్కరైన
నేగరుసురు మాత్రమెకాని,
తనదు మంచితోడు తనకు వేమ. .విశ్వ. (బ్రౌన్. 1839. 80-120)

ఎవ్వ రెరుగకుండ నెప్పుడు పోవునో?
పోవు జీవమట్ల బొంది విడిచి,
యంతమాత్రమునకు నపకీర్తి నెరుగక,
విరగబడును నరుడు వెర్రి వేమ! .విశ్వ. (బ్రౌన్. 1839. 80-119).

వెళ్ళివచ్చునాడు మళ్ళీ పోయ్యేనాడు;
వెంటరాదు ధనము కొంచబోడు,
తాను యేడబోనొ ధనమేడబోవునో? .విశ్వ. (బ్రౌన్. 1839. 8-47)

## సత్సంతులు

గుణవతి యగు యువతి గృహము చక్కగనుండు
చీకటింట దివ్వె చెలగురీతి;
దేవి యున్న యిల్లు దేవార్చన గృహంబు. విశ్వ. .(బ్రౌన్. 1839. 11-71)

ఇచ్చి పుచ్చుకొన్న హితమైన మనుములు
తగ్గులేక నర్లు తామరవలె;
కాచి పూచి పండి కడు రమ్యమైయుండు .విశ్వ॥ (బ్రౌన్. 1839. 91-201)

సతికి పతికినైన సంపద సంపదే?
పుత్ర సంపదలును భువిని మేలు
సరిగ ముదిసి బ్రతుకు సంపద సంపద. .విశ్వ. (బ్రౌన్. 1839. 91-202)

పనస తొనలకన్న పంచదారల కన్న

జుంటి తేనెకన్న జున్ను కన్న
చెరుకు రసము కన్న చెలి మాట తీపిరా .విశ్వ. .(బ్రౌన్. 1839. 67-30)

అదనెరిగిన మగువ యనువర్గు చనువెర్గు
ముదముతోడ మగని మోహమెరుగు,
విభుని శ్రేష్ఠగుణము వేశ్యతా నెర్గునా? .విశ్వ. (బ్రౌన్. 1839. 90-195)

## దుష్టసతులు

నీళ్ళమీద జూడు నెరయ నోడలపర్వు;
బయిలు మీద జూడు పక్షపర్వు
నాడు వారి గమన మాలాగునుండురా .విశ్వ. .(బ్రౌన్. 1839. 73–70)

కలిమినాడు మగని కామిని సూచును,
లేమి జిక్కునాడు లేవకుండు
మనిన మగనినైన మడియంగ జూచును .విశ్వ. (బ్రౌన్. 1839. 73–73)

ఆలు పతి సౌఖ్యములకి (ల)
నాలాయంబైన దాని యాలన వచ్చున్
ఆలాగున గాకుండిన
కాలుని పెనుదూతగదర కదియగ వేమా, .విశ్వ.(బ్రౌన్. 1839. 92-209).

ఆలు మగని మాట కడ్డంబు వచ్చె నా
యాలు గాదది మరణాలు గాని,
యట్టి యాలి విడిచి యడవి నుండుట మేలు .విశ్వ. .(బ్రౌన్. 1839. 65-15)
మాట వినని యాలు మగనికి మృతియౌను
యోర పడగ సర్పమొంటి గ్రహము
తనకు గాని యాలు దానవురాలయా .విశ్వ.(బ్రౌన్. 1839. 65-16)

## ద్విజన్ముడు

శూద్రులందు బుట్టి శూద్రుల దూషించి,
ద్విజుల మనెడు పేరు నిజము జేసి,
మనసునిల్పకున్న మరి శూద్రుడధముండు .విశ్వ. (బ్రౌన్. 1839. 154-162)

వేష మొనర గట్టి వెలయ శూద్రత్వంబు
తనకు లేదనుకొను ధరణి ద్విజుడు
అరిది గిట్టు వేళనడగు ద్విజత్వంబు .విశ్వ (బ్రౌన్. 1839. 155-167)

ఇల్లు నాలు విడిచి యినుప కచ్చల గట్టి

వంటకంబు నీరు వాంఛలుడిగి
వంటినున్న యంతవచ్చునా తత్త్వంబు? .విశ్వ (బ్రౌన్. 1839. 157-179)

మాదిగె చెయివులను మనసులో బెట్టుక
మాదిగెలను దెగడు మాదిగెపుడు
మంచి గుణములేక మరి ద్విజుడెట్లగు .విశ్వ (బ్రౌన్. 1839. 154-164)

విప్రవరుల మనుచు వేదంబు జదువుచు,
ప్రాకృతులను జూచి పరిహసించు ధరణి
సురలకన్న దాసరి మతమెచ్చు .విశ్వ. (బ్రౌన్. 1839. 155-166)

## జ్ఞాన వివేచన

తామసించి సేయ తగదెట్టి కార్యంబు;
వేగిరింప నదియు విషమమగును
పచ్చికాయ దెచ్చి పడవేయ ఫలమౌనె .విశ్వ. (బ్రౌన్. 1839. 4-24)

నీళ్ళలోన వోడ నిగిడి తిన్నగ బ్రాకు,
బైట మూరెడైన బ్రాకలేదు;
నెలవు దప్పుచోట నేర్పరి కొరగాడు .విశ్వ. (బ్రౌన్. 1839. 5-25).

నీళ్ళలోన మొసలి నిగిడి యేనుగు బట్టు,
బైట కుక్కచేత భంగపడును;
స్థానబలిమి గాని తన బల్మి కాదయా .విశ్వ.(బ్రౌన్. 1839. 5-26)
పంది పిల్లలీను పదియునైదింటిని;
కుంజరంబు యీను కొదమ నొకటి.
యుత్తమ పురుషుండు యొక్కడె జాలడా? .విశ్వ. (బ్రౌన్. 1839. 5-28)

ఎరుగు వాని దెలుప నెవ్వడైనను జాలు;
నొరుల వశము గాదు వోగుదెల్ప;
యేటి వంక దీర్ప నెవ్వరి తరమయా? . విశ్వ . (బ్రౌన్. 1839. 5-29)

అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను;
సజ్జనుండు బలుకు చల్లగాను
కంచు మోగినట్లు కనకంబు మోగునా .విశ్వ. (బ్రౌన్. 1839. 5-30)

గంగపారుచుండు కదలని గతితోడ;
మురికి కాల్వపారు మ్రోతతోడ;

దాత యోర్చినట్లధము డోర్వగాలేడు. .విశ్వ. (బ్రౌన్. 1839. 6-32)

అరయ తరుచు కల్లలాడెడు వారిండ్ల
వెడల కేల లక్ష్మి విశ్రమించు?
ఓటికుండ నీరు పోసిన చందాన .విశ్వ (బ్రౌన్. 1839. 11-79)

## మానవుడు - దేవుడు

తాను సమస్తంబై తన
లోనసె సకలంబు దెలిసి లోనను దెలియన్
తానని మెలగగ నేర్చిన
మానవునకు ముక్తిగలదు మహిలో వేమా.(అకాడమి. ప్రతి. ప. 133)

విష్ణువునకు సొద్దు వృషభాంకునకు సొద్దు
బ్రహ్మకైన సొద్దు బలవుగాను
వేమన కొక సొద్దు వేసితినని చెప్పు .విశ్వ (అకాడమి. ప్రతి. ప. 271)

తల్లి నెరుగువాడు దైవంబు నెరుగును
మన్ను నెరుగువాడు నిన్ను నెరుగు
మిన్ను మన్నెరిగిన తన్ను దానెరుగురా .విశ్వ (అకాడమి. ప్రతి. ప. 336).

బ్రహ్మ యెవని కొడుకు పరికింపగా భువి
విష్ణువెవని కొడుకు వెలయజూడ
శివుడు యెవని కొడుకు సిగెరుగరు జనుల్ .విశ్వ! (అకాడమి. ప్రతి. ప. 416)
మతము లెన్నియైన సతముగా నుండవు
సతముగాను యుండు జగతి నొకటి
యంతమతము విడిచి నా బ్రహ్మమరయుట.విశ్వ. (అకాడమి. ప్రతి. ప. 686)

హింస జేయకుంటయే ముఖ్య ధర్మంబు
యనక హింస జేతు రవనిసురలు
చావుపసిని దినెడు చండాలుడే మేలు .విశ్వ॥ (అకాడమి. ప్రతి. ప. 856)

శిలలు జూచి నరులు శివుడని మెత్తురు
శిలలు శిలలు గాని శివుడుగాడు
తనదులోని శివుని దానేల తెలియడో .విశ్వ (అకాడమి. ప్రతి.ప.1192)

వెండి బంగరెన్న కొండలై యుండంగ
దేవుడేలపోయి తిరిపమెత్తే

యెదుటివారి సొమ్ము యెంతవారికి తీపి .విశ్వ (అకాడమి. ప్రతి. ప. 926)

ఏకతమున జూడ నెరుక యేకంబౌను
భువిని కాంత జేరు పురుషుమాడ్కి
లోక కాంతునివలె లోపల వెలుగును .విశ్వ (అకాడమి. ప్రతి. ప. 905)

మాయ జగమటంచు మరి బల్కుచుందురు
మాయగాదు బ్రహ్మమయము గాని
మాయమైన పరమ మరియేడనున్నది .విశ్వ. (అకాడమి. ప్రతి. ప. 939)

## సంప్రతించిన గ్రంథాలు

తెలుగులో వేమన జీవితచరిత్రలు అనేకం ఉన్నాయి. వేమన జీవితానికి సంబంధించిన ప్రసిద్ధ గాథలు మాత్రమే కొద్ది మార్పులతో వీటన్నింటిలో గ్రంథస్థం చేయబడ్డాయి. ఈ కారణం చేత ఈ రకమైన గ్రంథాలు ఒకటి, రెండు మాత్రమే ఈ పట్టికలో చేర్చబడ్డాయి. అలాగే వేమన పద్యాలకు వ్యాఖ్యలు కూడా అనేకం. అవి వేమన పద్యాల్లోని అంతరార్థాన్ని వివరించ ప్రయత్నించాయి కాని వాటి వివరణ చాలావరకు అర్థరహితమైంది. అందుచేత వాటిని గ్రహించలేదు. వేమన పద్యసంకలనాలు కూడా అసంఖ్యాకమే. ముఖ్యమైనవి మాత్రమే ఇక్కడ పేర్కొనబడ్డాయి. వేమనను గురించిన పుస్తకాలను వేమన రచించిన పుస్తకాలను మూడు విభాగాలుగా వర్గీకరించాను: (1) తెలుగు (2) తెలుగు-ఇంగ్లీషు (3) ఇంగ్లీషు. కనుక ప్రత్యేకంగా ఎంపికచేసిన పుస్తకాలు మాత్రమే ఇక్కడ గ్రహింపబడ్డాయి.

### తెలుగు


1 వేమన యోగీంద్ర చరిత్రము: ఆర్. పూర్ణమాచార్యులు, మచిలీపట్టణం. 1913.
2 వేమన సూక్తిరత్నాకరము (4,635 పద్యాలు): ఆర్. పూర్ణాయాచార్యులు, మచిలీపట్టణం. 1913.
3 శ్రీవేమనయోగి జీవితము: పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్, మదరాసు. 1917.
4 పోతన, వేమనల యుగము: దిగవల్లి వేంకటశివరావు, 1924.
5 మహాయోగి వేమనకవి: నేదునూరి గంగాధరం, సి.వి.కృష్ణా బుక్ డిపో, మదరాసు (తేదిలేదు).
6 వేమన (సర్.ఆర్. వేంకటరత్నం ధర్మనిధి ఉపన్యాసాలు): రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు. 1947 (పునర్ముద్రణ).
7 కవితత్త్వ విచారము: సి.ఆర్.రెడ్డి, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు. 1947 (పునర్ముద్రణ).
8 వేమన: వంగూరి సుబ్బారావు, కమలాకుటీర్, నర్సాపురం. 1951 (పునర్ముద్రణ)
9 శతక వాఙ్మయ సర్వస్వము, ప్ర.భా: వేదం వేంకటకృష్ణశర్మ, మదరాసు. 1954.
10 వేమన పద్యములు, పీఠికతో, (2,728): వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్, మదరాసు. 1955 (పునర్ముద్రణ)
11 శతక కవుల చరిత్రము: వంగూరి సుబ్బారావు, కమలా కుటీర్, నర్సాపురం. 1957 (పునర్ముద్రణం).
12 వేమన పద్యములు (5,010 పద్యాలు): సంకలన కర్త - నేదునూరి గంగాధరం, అద్దేపల్లి కంపెని, రాజమండ్రి. 1960.
13 వేమన నీతి పద్య రత్నావళి (1,116 పద్యాలు): పి.వి.కృష్ణా బుక్ డిపో, మదరాసు. 1961 (పునర్ముద్రణం).
14 ఆంధ్ర కవితరంగిణి, ఆరవభాగం: చాగంటి శేషయ్య, హిందూ గ్రంథశాస్త్ర గ్రంథ నిలయం, కపిలేశ్వరపురం. 1961 (పునర్ముద్రణం)
15 సమగ్రాంధ్ర సాహిత్యం, 12-వ సంపుటం: ఆరుద్ర, శేషాచలం కంపెనీ, మదరాసు. 1968.

తెలుగు - ఇంగ్లీషు

1 The Verses of Vemana (693 Verses):
2 Verses of Vemana (Telugu Original with English rendering,1,215 Verses) by C.P. Brown,
3 The Musings of a Mystic by Mahmood Ali khan, Hyderabad. 1966.

ENGLISH

1 Hindu Manners, Customs and Ceremonies by J.A. Dubois, Oxford. 1953 (Reprint).
2 "Vemana - A South Indian Poet" by William Howard Campbell, Madras Christian College, Magazine. 1898.
3 "Vemana" by R.M. Macdonald, Madras Journal of Literature and Science. 1866.
4 The Folk - Songs of Southern India by Charles E. Gover, Higginbotham & Co., Madras. 1871.
5 Some Milestones in Telugu Literature, Vol-II: The Age of Vemana by G.R. Subramiah Pantulu, B. Narasimheswara Gupta, Madras. 1915.
6 Telugu Literature by P.T. Raju, P.E.N., Bombay. 1944.
7 Telugu Literature by P. Chenchaiah and Raja M. Bhujanga Rao, Calcutta (Undated).
8 "On Vemana" by C.R. Reddy, Radio Talk, A.I.R., Madras. 1950.
9 Saint Vemana: His Philosophy by Ishwara Topa, Hyderabad Telugu Academy, Hyderabad. 1950.
10 "Vemana: His Poetry and Philosophy"by G.V. Krishna Rao (Published in Halfway, the Golden Book presented to V.R. Narla on his Fifty First birthday). 1958.
11 The Heart of India by L.D. Barnett, London. 1924. 12 Vemana through Western Eyes, Compiled and Edited by V.R. Narla, M. Seshachalam & Co., Madras. 1969.


## కొన్ని పదాల సంగ్రహ వివరణ

**అద్వైత వేదాంతం**: ఏకేశ్వర సిద్ధాంతాన్ని ప్రతిపాదించే మతం. భారతదేశంలో దీన్ని మొట్టమొదట రూపొందించినవాడు గౌడపాదుడు. శంకరాచార్యుడు దీని వ్యవస్థాపకుడు. ప్రచారకుడు.

**అనంతకృష్ణశర్మ రాళ్ళపల్లి**: ఆంధ్ర సాహిత్యాన్ని మధించిన విద్వాంసుడు. తెలుగు, తమిళ, కన్నడ, సంస్కృత, పాలీ భాషలలో పండితుడు. సంగీత కళా ప్రపూర్ణులు. వీరిది మత సామాజిక ఆచారాలలో సాంప్రదాయిక దృక్పథమైనా మత సహనం లేనివారు కారు. సూటిగా వాడిగా రచిస్తారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో వేమనను గురించి ఉపన్యసించారు. పాలీ భాష నుండి గాథాసప్తశతిని అనువదించారు. సరస విమర్శకులు. 1839వ సంవత్సరంలో జన్మించి, మైసూరు మహారాజా కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగ 1912 నుండి 1949 వరకు పని చేశారు.

**అభినవగుప్త** (సుమారు క్రీ.శ. 1000). తత్త్వవేత్త. అలంకారశాస్త్రంలో ప్రామాణికుడు

**అమరకోశము**.: వింటర్నిట్జ్, యం. (M. Winternitz) ప్రకారం క్రీ.శ. 6-8 శతాబ్దుల మధ్యకాలంలో జీవించిన బౌద్ధ మతస్థుడైన అమరసింహుడు సంతరించిన అతి ప్రఖ్యాతి కెక్కిన ప్రాచీన సంస్కృత నిఘంటువు. మూడు భాగాలుగా విభక్తమైన పర్యాయ పదాల నిఘంటువిది.

**అలంకారశాస్త్రాలు**: అలంకారాలను గురించిన శాస్త్రం. యం. వింటర్ నెట్ ఇలా పేర్కొన్నాడు, “అతి ప్రాచీన కాలం నుండి భారతదేశంలో అలంకారాలను ఒక శాస్త్రంగా రూపొందించారు”. అలంకార శాస్త్రం ఎంతగా అభివృద్ధి చెందిందంటే కవులకది సహాయకారిగా ఉండడానికి బదులు నిర్బంధంగా తయారైనది.

**ఆంధ్ర సాహిత్య పరిషత్**: సాహిత్య పరిశోధన కొనసాగించే సంస్థ. ఆదిలో 1911వ సంవత్సరంలో మద్రాసులో ఇది స్థాపింపబడ్డా, ఆ తరువాత దీని గ్రంథాలయం, కార్యాలయం కాకినాడకు మార్చబడ్డాయి. ఈ సంస్థ పోషకుల్లో మిక్కిలి వితరణశీలుడు పిఠాపురం మహారాజా అయిన కీ.శే. శ్రీరావు వేంకటకుమార మహీపతి సూర్యారావు గారు. ఈ గ్రంథాలయంలో సుమారు ఐదు వేల తాళపత్ర గ్రంథాలున్నాయి.

**ఉపనిషత్తులు**: ఇవి రెండు వందలకు మించిన తర్క గ్రంథాలు. పరిమాణంలోను విషయ స్థాయిలోను ఇవి పరస్పరం భేదిస్తవి. కొన్ని వచనంలోను, కొన్ని పద్యరూపంలోను ఉన్నాయి. వీటి రచనాకాలం బౌద్ధపూర్వ యుగం నుండి ఆధునిక కాలం వరకు కొనసాగుతుంది. అల్లోపనిషత్, కృష్ణోపనిషత్ అన్నవి కూడ వున్నాయి. సామాన్యాభిప్రాయానికి భిన్నంగా ఉపనిషత్తుల తత్త్వమంటూ ఒక క్రమబద్ధమైన, సమానమైన సిద్ధాంతం ఏదీ లేదు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారిలా అన్నారు: “తాత్త్విక సత్యాన్ని చేరుకోవడం ఉపనిషత్తుల లక్ష్యం కాదు.... వాటిలో పరస్పర విరుద్ధాలు, అశాస్త్రీయాలు అయిన విషయాలున్నాయి'. ఏ.బి.కీత్ (A.B. Keith) ఇంకా వివరంగా చెప్పారు, “ఉపనిషత్తుల్లోని సిద్ధాంతాలు చారిత్రకంగ ఆసక్తిదాయకాలు. తాత్త్వికంగ అవి ఒక్క క్షణమైనా ఆలోచనాస్త్రాలు కావు”.

**ఎఱ్ఱాప్రెగడ, ఎడపాటి**: తెలుగు కవి. 16వ శతాబ్ద ఉత్తరార్థంలో రచించి వుండవచ్చు. ఈయన ఇంటి పేరు ఎడపాటి కాదు కాని పెదపాటి అని కొందరు పండితుల అభిప్రాయం. వాఙ్మయ చరిత్రకారులకి ఆయన జన్మస్థలాన్ని గురించి ఏకాభిప్రాయం లేదు. మల్హణ చరిత్ర ఈ కవి రచించిన ప్రసిద్ధ గ్రంథం. విజయనగర సామ్రాజ్య ప్రభువైన శ్రీ కృష్ణదేవరాయలకీ గ్రంథాన్ని అంకిత మియ్యాలని ఆదిలో ఈ కవి సంకల్పించినా ఏ కారణాల చేతనో దీనిని ఆ కాలంలో రాజకీయ దక్షత గల కలయమంత్రికి అంకిత మిచ్చాడు. కొందరు ఛందఃకర్తలు ఈ కవి కృతంగ పేర్కొన్న కుమార నైషధం అలభ్యం.

**కందనోలు**: కర్నూలుకు ప్రాచీన నామం.

**కబీర్**: భారతదేశంలో మధ్య యుగాలకు చెందిన గొప్ప సిద్ధులలో ఒకడు. ఈతని కాలం వివాదాస్పదమైనది. ఇతని మరణ కాలాన్ని గురించి కూడ వాదోప వాదాలున్నాయి. ఈయన ఈతడు 15వ శతాబ్దపు వాడని అధిక సంఖ్యాకులు అంగీకరిస్తున్నారు. తల్లిదండ్రులను గూర్చి కూడ వివాదాలున్నాయి. ఇతని తల్లిదండ్రులు ముస్లిములైనా అయి వుండాలి. లేదా బ్రాహ్మణ విధవరాలు విడిచి పెట్టితే, మహమ్మదీయ దంపతులు పెంచి వుండాలి. వృత్తిచే సాలీడు. రామానందుని శిష్యుడుగ కబీరు స్వమత దురభిమానాన్ని ఖండించాడు. అల్లా లేక రాముడు అన్న నామాలతో నిమిత్తం లేకుండ ఏకేశ్వరుని ఉపాసించమని ప్రాధేయపడ్డాడు.

**కురళ్**: తమిళులు వేదంగా పరిగణించే "కురళ్” తమిళ సాహిత్యంలో మహాకావ్యం. ఇందులో నీతులు ఉపదేశింపబడ్డాయి. ఇందులో మూడు ప్రకరణాలున్నాయి. మొదటి దానిలో నీతిని గురించి, రెండవ దానిలో సంపదను గురించి మూడవ దానిలో ప్రేమను గురించిన వివరణమున్నది. మొత్తం 1,330 ద్విపదల కావ్యమిది. తిరువళ్ళువరు దీని కర్త.

**గండికోట**: కడప జిల్లాలో, ఒక శిథిల ప్రాకారం గల కుగ్రామం. వేమన అన్నగారి కోటకు కొంతకాలం ప్రభువుగా వున్నట్లు జనశ్రుతి. దీనికి ఆధారాలు లేవు.

**గ్రియర్సన్, సర్ జార్జి అబ్రహాం** (1851-1941): విద్యారంగంలో అనేక విశిష్టతల్ని పొందిన విద్వాంసుడు. ఈయన 1873వ సంవత్సరంలో ఇండియన్ సివిల్ సర్వీసులో ప్రవేశించి, 1903వ సంవత్సరం పదవీ విరమణం చేశాడు. హిందూస్థానీ, సంస్కృత భాషలతో సహా అనేక భారతీయ భాషల్లో నిష్ణాతుడైన ఈయన్ను భారతీయ భాషల పర్యవేక్షణ సంస్థలో సూపరింటెండెంటుగ నియమించారు. ఆ హోదాలో ఈయన భారతీయ భాషలకు అపారమైన, శాశ్వతమైన సేవను చేశాడు.

**జ్ఞానదేవ్** (1275-1296): మహారాష్ట్ర యోగివరేణ్యులలో ప్రప్రథముడు. అగ్రగణ్యుడు. బహుగ్రంథకర్త. వానిలో భగవద్గీత వ్యాఖ్యానమైన " జ్ఞానేశ్వరి" చాలా ప్రసిద్ధ గ్రంథం. చైతన్య (1486-1533): బెంగాలు భక్తులలో ప్రఖ్యాతుడు. తన జీవితం, ప్రబోధాల ద్వారా బెంగాలు, ఒరిస్సా, అస్సాం రాష్ట్రాలలోని కవులు అద్భుతమైన భక్తి గేయాల్ని రచించేలా ప్రేరేపించాడు. భార్య భర్తకు తన్ను సంపూర్ణంగ సమర్పించుకునేలాగ భక్తుడు భగవంతునికి సంపూర్ణ సమర్పణ చేసుకోవాలన్నది ఈయన ఉపదేశాల్లోని ముఖ్యాంశం. భారత దేశమంతటా చైతన్య మతానికి లక్షలాది అనుయాయులున్నారు.

**జోన్స్, సర్ విలియం** (Jones, Sir William) (1745-94): మేధావియైన బ్రిటీషు న్యాయవేత్త. 1783-వ సంవత్సరం కలకత్తా సుప్రీం కోర్టులో జడ్జిగ నియమితు డయ్యాడు. ఉద్యోగంలో ప్రవేశించిన మరు సంవత్సరమే, బెంగాల్ ఏషియాటిక్ సొసైటీని స్థాపించడంలో ముఖ్యపాత్రను వహించాడు. ఐరోపియను ఏషియను భాషలనేకం తెలసినవాడు గనుక భాషల తులనాత్మక పరిశోధనా శాస్త్రాన్ని ప్రారంభించాడు. "హిందూ-ముస్లిం లా" అన్న గ్రంథమేకాక కాళిదాసు నాటకాల్లో ఒకదాన్ని అనువదించాడు. బహుముఖ ప్రజ్ఞావంతుడైన యీయన భాషాశాస్త్ర దురదృష్టం కొద్ది పిన్నవయస్సులోనే మరణించాడు.

**టాకూర్, రబీంద్రనాథ్** (1861-1941): భారతీయ కవుల్లో భవభూతి, కాళిదాసుల తరువాత పేర్కొనదగిన మహాకవి. 1913-వ సంవత్సరంలో నోబెల్ బహుమతి గ్రహీత.

**తిరువళ్ళువర్**: జైనుడైనా కాకపోయినా "కురళ్' రచించిన కవి కడమజాతివాడు. మనకు తెలిసిన ఆయన పేరుకు (వాస్తవాని కది ఆయన అసలు పేరు కాదు). అర్థం "వళ్ళువర్ కులానికి చెందిన యోగి" అని మాత్రమే. వళ్ళువర్ కులస్తులు అగ్రవర్ణానికి చెందరు. ఈ కవికాలం తెలియదు. క్రీ.పూ. 1-వ శతాబ్దం నుండి, క్రీ.త. 3-వ శతాబ్దం వరకు, ఒక్కొక్క పరిశోధకుడు ఒక్కొక్క శతాబ్దంగ ఆయన కాలాన్ని నిర్ణయించారు.

**తుకారాం** (1598-1649): మహారాష్ట్రకుచెందిన భక్తకవి. ఒక చిన్న అంగడి పెట్టుకొని జీవనం కొనసాగించిన పేదవాడు. అయినప్పటికి మహారాష్ట్ర రాజైన శివాజీ పంపిన బహుమతుల్ని స్వీకరింప నిరాకరించాడు. పెక్కు కీర్తనల్ని రచించాడు. 4,600 అభంగాలకు (కీర్తనలకు) కర్త.

**దండి**: అలంకార శాస్త్ర రచయిత. ఈయన కాలాన్ని గురించి తీవ్రమైన వాదాలున్నాయి. బహుశా 7 వ శతాబ్ది ఉత్తరార్ధంలో జీవించివుండవచ్చు. అలంకారాల్ని గురించి ఆయన వ్రాసిన కావ్యాదర్శం కన్న, శృంగారాత్మక గద్యకావ్యమైన దశకుమార చరిత్ర బహుళ ప్రచారమున్న గ్రంథం.

**దాదు** (1554-1603): కవి భక్తాగ్రేసరుడు. ఇతని పేర ఒకమతం స్థాపింపబడింది. జన్మస్థలం అహమ్మదాబాదయినా రాజస్థాన్ లోనే ఈయన అధిక కాలం నివసించాడు. కొందరీయనను బ్రాహ్మణుడంటారు. మరికొందరీయన్ను బ్రాహ్మణేతరుడంటారు. ఈయన వృత్తి పత్తిని శుద్ధీకరించడం.

**దుబాయ్, జె.బి.**: దక్షిణ భారతదేశంలో క్రైస్తవ మిషనెరీగ ఇంచుమించు 31 సంవత్సరాలు పనిచేసిన ఒక ఫ్రెంచి మతాచార్యుడు (1770-వ సంవత్సరం ప్రాంతంలో జన్మించి వుంటాడు.) భారతదేశంలో తానున్న ప్రాంతపు ఆచారాల్ని, వస్త్రధారణని అనుసరించి సామాన్యుల మధ్య, వారిలో ఒకడుగ జీవించిన వ్యక్తి. Hindu Manners, Customs and Ceremonies అన్న ఆయన గ్రంథం 1792-1823 మధ్యకాలంలోని హిందూ సమాజపు యదార్థ చిత్రాన్ని ప్రతిబింబిస్తుంది.

**నామదేవ్** (1270-1350): ఇతడు మహారాష్ట్రీయుడు. వృత్తిచే దర్జీ. ఈయన కవి, భక్తుడు. పంజాబ్ లో ఒక దశాబ్దం నివసించాడు. సిక్కుల మత గ్రంథమైన "గ్రంథ్ సాహెబ్"లో ఈ కవి సంకీర్తనలు కొన్ని ఉన్నాయి.

**నాగార్జునుడు**: బౌద్ధమత దార్శనికుడు. మానవాళికి చెందిన తత్త్వవేత్తలలో మహనీయుడని Professor Th. Stcher atsky of the Academy of Sciences, USSR అభిప్రాయం. క్రీ.శ. 1-వ శతాబ్దంలోనే బౌద్ధతత్త్వంలో మాధ్యమిక సిద్ధాంతాన్ని పెంపొందిచాడు. ఇప్పుడు నాగార్జునకొండగ ప్రసిద్ధికెక్కిన ఆంధ్రరాష్ట్రంలోని శ్రీ పర్వతంలో ఇతడు తన చరమదశను గడిపాడు.

**నానక్** (1469-1536): సిక్కు మత స్థాపకుడు. సిక్కుల పదిమంది గురువులలో ప్రథముడు. ఇప్పటి పశ్చిమ పాకిస్తాన్లోవున్న "తల్వండి" గ్రామంలో జన్మించిన ఈ మహనీయుడు విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని, ప్రేమని ప్రబోధిస్తూ దేశమంతటా సంచరించాడు. పాషాండుడు: నాస్తికుడు, వేదాల ప్రామాణ్యాన్ని అంగీకరింపనివాడు.

**పోప్, డాక్టర్ జి. యు**: తమిళభాషలో గొప్ప పాండిత్యాన్ని సంపాదించిన క్రైస్తవ మిషనెరీ 1886-వ సంవత్సరం లండన్ పట్టణం నుండి తాను అనువదించిన "కురళ్" గ్రంథాన్ని ప్రకటించాడు. ఆ తరువాత "తిరువాసకమ్" అనే మరొక తమిళకావ్యాన్ని కూడా అనువదించాడు.

**బసవడు**: మానవుల్ని విడదీసే వర్ణ, వర్గ విభేదాల్ని, సమస్త కృత్రిమ అడ్డుల మీద తిరుగుబాటు చేసే విప్లవ మతోద్యమమైన వీరశైవ మత స్థాపకుడు. మైసూరు రాష్ట్రంలో బగెవాది అనే ఊరిలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో 12వ శతాబ్ది పూర్వార్ధంలో జన్మించిన బసవడు భారతదేశంలోని మత సాంఘిక సంస్కర్తల్లో గొప్పవాడుగా ప్రసిద్ధి కెక్కాడు.

**బ్రహ్మసూత్రాలు**: తాత్త్విక సూత్రాల గ్రంథం. దీని కర్తృత్వం వ్యాసునికి అంటగట్టబడినా, డాక్టర్ యస్.యన్. దశ గుప్త గారి ప్రకారం ఇది అతి ప్రాచీన గ్రంథం కాదు. "ఈ సూత్రాలలో ఇంచుమించు ప్రతి భారతీయ తాత్త్విక సిద్ధాంతం ప్రస్తావించబడడం చేత ఇవి ప్రాచీనకాలంలో వ్రాయబడివుండవు" అన్నది వారి అభిప్రాయం. క్రీ.పూ. 2-వ శతాబ్దంలో ఇవి రచింపబడి వుండవచ్చునన్నది ఆయన మతం. జాకోబి (Jacobi) అన్న అతను అవి ఇంకా తరువాతి కాలంలో రచింపబడి వుంటవని భావిస్తున్నాడు. ఆయన అవి క్రీ.శ. 200-450 మధ్యకాలానికి చెందినవిగ చెప్పుతున్నాడు. ఈ సూత్ర వ్యాఖ్యాతలలో ప్రసిద్ధులు శంకరాచార్యులు, రామానుజులు, మధ్వుడు. డాక్టర్ రాధాకృష్ణన్ ఆధునిక వ్యాఖ్యాత. కొన్ని వ్యాఖ్యానాలకు వ్యాఖ్యలు కూడా ఉన్నాయి.

**బ్రౌన్, చార్లెస్ ఫిలిప్** (1798-1884): మదరాసు సివిల్ సర్వీస్ ఉద్యోగి. తెలుగు ప్రజల్ని, తెలుగు భాషా సాహిత్యాల్ని బ్రౌన్ అత్యంతం ప్రేమించాడు. వారికి ఎనలేని స్వచ్ఛంద సేవను చేశాడు. తెలుగు వ్యాకరణాన్ని, తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువుల్ని సంతరించి ప్రచురించడమే కాకుండ, వందలాది తాళపత్ర ప్రతుల్ని సేకరించాడు. ప్రాచీన కావ్యాల ప్రతుల్ని సేకరించి, సవరించి, శుద్ధ ప్రతుల్ని తయారుచేసి ప్రకటించడానికి ప్రాంతీయ పండితుల్ని ప్రోత్సహించాడు. తన అకుంఠిత పరిశ్రమ వలన వేమన సాహిత్య యశస్సుకు పునాదులు వేశాడు.

**మల్లికార్జున పండితుడు**: కాకతీయ సామ్రాట్టయిన ద్వితీయ ప్రోలయ సమకాలికుడు. (1110-58 A.D.) మల్లికార్జునుడు మహాపండితుడు. ప్రజలను ఆకట్టుకునే వక్త. తన వాక్చాతుర్యంతో సమకాలిక బౌద్ధుల్ని బహిరంగ వాదాలలో ఓడించాడు. ఈయన శివతత్త్వసారం సాహిత్యపరంగ ఉత్తమగ్రంథమే కాక శైవసిద్ధాంతపరమైన సద్గ్రంథం.

**ముకర్జీ ధూర్జటి ప్రసాద్** (1894-1961): అంతర్జాతీయ ఖ్యాతిగల ప్రసిద్ధ సోషలిస్టు. లక్నో విశ్వవిద్యాలయంతో ఈయనకు సన్నిహిత సంబంధమున్నది. సునిశిత మేధ, సృజనాత్మకత, అరుదైన సామాజిక స్పృహ కలవాడు. వంగ, ఆంగ్ల భయభాషల్లో చక్కని రచనలు చేశాడు.

**మూగ చింతపల్లె**: వేమన జన్మస్థలమని చెప్పబడే పల్లె. ఇదే పేరుగల గ్రామాలు రెండు నెల్లూరు జిల్లాలో, గుంటూరు, కడప, చిత్తూరు జిల్లాలలో ఒక్కొక్కటి వున్నాయి. వీనిలో ఏది వేమన జన్మస్థలమన్నది పరిశోధకులు ఇంకా తేల్చని వివాదాంశం.

**రామకవి, తురగా**: రామకవి పండితుడు; విద్వాంసుడు. కోపం వస్తే తిట్టుకవి, 16-వ శతాబ్దపు ఉత్తరార్థంలో జీవించాడు.

**రామస్వామి, కావలి. వేంకట** (1765-1840): కావలి సోదరులలో ఒకడు. ఇంగ్లీషు భాషలో రచనలు చేసిన ఆదిమ రచయితలకు చెందినవాడు. కలకత్తాలోని Literary and Antiquarian Department లో రామస్వామిగారు ప్రధాన అనువాదకులుగ, పండితులుగ వుండేవారు. సంస్కృతంలో వేంకటాచారి రచించిన విశ్వగుణాదర్శాను వాదమే వారి ప్రథమ రచన. 1825లో ముద్రితం. Biographical Sketches of Deccan Poets అన్నది వారి స్వతంత్ర ద్వితీయ రచన. 1829లో ప్రచురితం ఆ కాలంలో ఆయన ప్రముఖుడుగా వుండి వుండాలి. ఎందుచేతనంటే ఆయన తన గ్రంథద్వయాన్ని కలకత్తా సుప్రీంకోర్టు జడ్జి అయిన సర్.ఎఫ్. డబ్ల్యు. మ్యాక్ నాటన్ (Sir F.W. Macnaughten) కు గవర్నర్ జనరల్ అయిన విలియం బెంటింగ్ ప్రభువునకు అంకితమిచ్చాడు.

**రామానంద**: రామానందుడు 1400-1470 మధ్యకాలంలో జీవించి వుంటాడన్నది ఎఫ్. ఇకే. (FE. Keay) గారి అభిప్రాయం. వారే ఇలా పేర్కొన్నారు "ఆత్మస్వరూపి, అదృశ్యుడైన ఏకేశ్వరునే విశ్వసించాలని విస్పష్టంగ ప్రబోధించాడు. ఆ ఏకేశ్వరుడే రాముడని చెప్పాడు. అయినా ప్రాచీన పురాణాల్ని గాని, హిందూ విగ్రహారాధననుగాని నిరసించలేదు". రామానంద వ్యక్తిత్వం ఎంత ఆకర్షణీయమైనదంటే ఆయన శిష్యవర్గంలో"ఒక శూద్రుడు, ఒక జాట్, ఒక అస్పృశ్యుడు, వుండటమే కాక, మహమ్మదీయ సాలీడు (కబీరు), ఒక స్త్రీ కూడా ఉన్నారు".

**రాయ్ దాస్**: వృత్తి చెప్పులు కుట్టడమే అయినా, రాయ్ దాస్ 15వ శతాబ్దంలో అధికంగ గౌరవింపబడిన భక్తశిఖామణి, కవి, చిటోడ్ యువరాజైన జాలీ ఇతని శిష్యగణంలో ఒకడు.

**లాల్ దాస్**: కబీరు ఉపదేశాలతో ప్రబోధితుడై లాలాదాస్ "లాల్ దాసీస్" అనే మతాన్ని స్థాపించాడు. ఇతని జన్మస్థలం ఆల్వార్, "మియోల్" అనే ఆటవిక జాతికి చెందినవారు. ఇతని జనన కాలం తెలియదు. క్రీ.శ. 1648వ సంవత్సరంలో మరణించాడు.

**వేంకటరత్నం, సర్ రఘుపతి** (1862-1939): గొప్ప విద్యావేత్త, సంఘ సంస్కర్త, ఆచార్యుడు, వీరేశలింగం సమకాలికుడే గాని, వయస్సులో పంతులుగారి కన్న చిన్నవాడు. సమాజంలోని అట్టడుగున ఉన్నవారి, అస్పృశ్యుల, దేవదాసీల సముద్ధరణకు ప్రత్యేకంగా పాటుపడ్డాడు. మదరాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల స్థాయికి ఎదిగాడు.

**సర్కార్, బినయ్ కుమార్** (1887-1949): వంగ భాషలోను, ఆంగ్లంలోను ప్రశస్తమైన అనేక గ్రంథాన్ని రచించిన బహుముఖ ప్రజ్ఞావంతుడు, ఆర్థిక సామాజిక రంగాలలో అంతర్జాతీయ ప్రఖ్యాతిని గడించిన వ్యక్తి. ఈయన గ్రంథాలు అనేక భాషల్లోనికి అనువదింపబడ్డాయి. అనేక దేశాల నుండి విద్యాపరమైన, తదితర సన్మాన, సత్కారాల్ని పొందాడు.

**సర్వజ్ఞుడు:** ఈయన నిజనామధేయం "పుష్పజ్ఞుడు". ఒక శూద్ర విధవరాలికి బ్రాహ్మణునికి పుట్టిన బిడ్డ. ఈయన ఉపదేశాలు కూడా ఇంచు మించు వేమన ప్రబోధాలకు సమానంగా వుంటాయి. సర్వజుని కాలం క్రీ.శ. 1600 అని ఇపి. రైస్ (E.P. Rice) అంచనా. కాని ఎవ్వరూ నిర్దుష్టంగ సర్వజ్ఞుని కాలాన్ని చెప్పలేకపోతున్నారు.

**స్మిత్, విన్ సెంట్. ఎ** (Smith, Vincent 1848-1920): భారతీయ సాంస్కృతిక చారిత్రక రంగాలలో ఇంచుమించు అర్థశతాబ్దం పరిశ్రమించిన భారతీయ ప్రభుత్వోద్యోగి. ఆయన చేసిన అనేక రచనల్లో అశోకుని జీవిత చరిత్ర. The Early History of India (1904), History of Art in India and Ceylon అన్న మూడు గ్రంథాలు తరువాతి వారికి మార్గదర్శకాలు. 1918లో ప్రచురితమైన The Oxford History of India అన్నది తుది రచన.

**హేమచంద్రుడు** (1088-1172 A.D.): బహు విద్యావిశారదుడైన జైన పండితుడు, కవి చరిత్రకారుడు, సంస్కృతంలోను, ప్రాకృతంలోను అలంకార శాస్త్రాన్ని గురించి, ఇంకా అనేక విషయాలను గురించి రచించిన బహుగ్రంథకర్త.

# వేమన - పాశ్చాత్యులు గ్రంథపరిచయం

నెల్లూరు వర్ధమాన సమాజము వారి ప్రచురణ. తృతీయపర్వము

నార్లవారి సంపాదకత్వంలో Vemana Through Western Eyes గ్రంథాన్ని చెన్నైలో ఎం. శేషాచలం & కం., 1969లో ప్రచురించారు. ఈ గ్రంథానికి నార్లవారు విపుల పరిచయం ఆంగ్లంలో రాశారు. మరుపూరు కోదండ రామరెడ్డి గారు ఈ గ్రంథాన్ని పూర్తిగా తెలుగులోకి అనువదించి నెల్లూరు, వర్ధమాన సమాజం ద్వారా 1971లో ప్రచురించారు. ఈ గ్రంథ పరిచయం తెలుగు అనువాదాన్ని ఈ దిగువ అందజేస్తున్నాం.

## ఆంధ్ర వాఙ్మయమున వేమన స్థానం

పాత తెనుగుకవులలో నేటి పరివ్యాప్త ప్రపంచానికి ఎరుక పరచుటకు అర్హతగలిగిన కవి ఎవడైనా ఉంటే, ఆయన ఒక్క వేమనే అని నా నమ్మకం. 'అవివేకము అపచారము సాహసము' - ఇవీ ఈ అభిప్రాయము రెచ్చగొట్టగల కొన్ని మృదుల ఉద్రేక వచనాలని నాకు బాగుగ తెలుసును. అయితే ఏమి? ఈ మాటమీద నేను గట్టిగా నిలబడుచున్నాను. అంటే నన్నయ తిక్కన ఎఱ్ఱన శ్రీనాథ పోతన పెద్దన సూరన మొదలగు మన ప్రాచీన ప్రబంధ మహాకవుల కావ్యములను నేను అభిమానించకపోవుట కానే కాదు. ముఖ్యంగా వారి భాషా విన్యాసము శబ్దసౌష్టవము కవిత్వములు మాత్రమే ప్రాచీన గౌరవములు కలిగినవిగాని, భావములకు ఆ యోగ్యత, ఆ స్థాయి లభించదు. దీనికిదోడు, చాలవరకు వారి రచనలు అనువాదములు, అనువదించుట కష్టమైనపని అనుట నిజమే! దానికి ఉభయభాషలందు సమాన పాండిత్యము తప్పనిసరియగుట నిర్వివాదాంశము. ఇంతేగాకుండ, అనువాదములు మూలమునకు పునఃసృష్టి వంటివి అయినప్పుడే ఈ రచనలు వన్నె కెక్కగలవు. వీటినంతా లేదనకపోయినప్పటికిని, అనువాదములు ఎంతటి శ్రేష్ఠతమములైనను స్వతంత్ర కావ్యము లనిపించుకొనుట దుర్లభము. మన ప్రబంధకవులు మూలము నతిక్రమించినారనునది నే నెరుగనిదికాదు. కాని, అట్టి వేర్పాట్లు ఎక్కడనో ఎప్పుడో సకృతుగా నున్నవి. అవిగూడ నాదృష్టిలో అప్రధానములు. ఎప్పుడైనా, అరుదుగా, వారు స్వకల్పితముగా మూలమును అల్లుటకు సాయశక్తులా ప్రయత్నించినను, ఆ ప్రోత్సాహము ఆ ఆవేశము, వారి అలవాటు ప్రకారం పురాణముల నుండియే ప్రభవించుచున్నవి. ఇంకనూ సూటిగా చెప్పవలెనంటే మన ప్రబంధకవుల భావనాసీమ చాలవరకు సంకుచితము. తమ సాంప్రదాయిక సాంఘిక మతవిశ్వాసములందే సంచరించుటకు వారు అలవాటు పడినారు. అవి పాతబడి తుప్పెక్కినను వారికి ఇష్టమేనని, దానికి కారణము వారి ప్రామాణిక ప్రాబల్యమని సవినయముగనే చెప్పవచ్చును. ఆ పురాతన మత విశ్వాసములు సనాతనములని పరిణామాతీతములని వారి గట్టినమ్మకము. ఇంతేగాకుండ, వారి పురాతనతమ సాంఘికవ్యవస్థ, దానికి అనుబంధములైన అగ్రవర్ణముల మధ్య, అధోవర్ణములు - బహిష్కృత జాతుల మధ్యగల అనివార్య తారతమ్యములు, ఆచార్యులు మతాధిపతుల యాజమాన్యము, పాలకులు పాలితులు రాజాశ్రితుల సంబంధము, ఆంక్షలు అవరోధములు, పిండోత్పత్తి మొదలు శ్మశాన దహనము వరకు

నెరపబడుచున్న సమస్తాచారములుగూడ ఉత్తమోత్తమ విధులని, అవి సర్వవిధములా కాపాడబడుచుండవలసిన ధర్మములని వారి దృఢవిశ్వాసము. ఈ నియమావళిని ఎచటనైనను ఏ కొద్దిగానైనను ఉల్లంఘించుట హీనాతి హీనాపరాధమని ధర్మదూషణమని వారి నమ్మకము. అంటే వారిభావములు కవిత్వములు సాంప్రదాయిక విధానాశ్రితములు - అనుట!

## వేమన - పూర్వాచారములు

మన పూర్వకవులందరి తెన్ను ఇట్టిదే! కాని వేమనమాత్రము సంప్రదాయములను పాతనిబంధనలను పాటించనివాడు. ప్రాచీన మతవిశ్వాసములన్నా, పాత సాంఘికాచారములు - ఆ వ్యవస్థ అన్నా ఆయనకు కేవలము అనాదరణము గర్హణము! అందుచేత, ఆ విశ్వాసములను తుత్తునియలు జేసి, ఆ సాంఘిక స్థితిగతులను తల్లక్రిందులు చేయుపట్ల ఆయనకు కలిగే ఆనందము, తృప్తి మరెప్పుడును కలుగవు.

'వేదములు అపౌరషేయములు గావా? అవి ప్రమాదాతీతములు గావా?" అనిన, కావు! జంతుహింసాత్మకమైన ఆ యాగాది విపుల కర్మకాండకంటె ఆధ్యాత్మిక జీవితోన్నతికి దూషితమార్గ మింకొకటి ఉండజాలదు. 'ధర్మశాస్త్రములు దైవోపదిష్ట నీతిసూత్రములు కావా? అనుల్లంఘనీయ పవిత్ర శాసనములు గావా?" అబ్బే! అవి స్వార్థాపేక్షతో మతాధిపతులు పురోహితులు కల్పించిన కృత్రిమ సూత్రములు, సాంఘిక విద్రోహ దుర్గంధదూషితములు! పురాణములు, ముఖ్యముగా రామాయణ భారత భాగవతాదులు ఉన్నతోన్నత నీతిసూత్రకోశములు గావా?' ఇది వెట్టివాగుడు. - ఇవి కల్పిత గాథలతో, ముసలమ్మకతలతో నిండిపోయి ఉన్నవి. జీవితపు విలువలను తారుమారుజేసి, అనృతరూపమును మన కట్టెదుట నిలబెట్టుచున్నవి. 'సాంఘికవ్యవస్థ అతిప్రాచీనమును న్యాయమును దైవపరికల్పితమును కాదా? దానిని మార్చినచో అధోగతిని వినాశములను తప్పించుకోగలమా?' అనుట, తెలివిమాలినమాట! అగ్రవర్ణములవారు, తమ విశేషాధికారములను, తమ సాంఘిక భద్రతను కాపాడుకొనుటకు బెదురు పెట్టను చెప్పినమాటే! ఇది - వేమన మన ప్రాచీనకవుల ప్రకారము పవిత్రము అప్రతిహతము అని ఎన్నబడే ప్రతిదానిని ఎదుర్కొని, విధ్వంసము చేయదలచుకొనిన విధానము.

## వేమన ధర్మనిష్ఠ

పై అంశములనుబట్టి వేమన మతభ్రష్టుడని నిర్ణయించుట మాత్రము పొరబాటు. ఇంతేకాదు, ఆయన ధర్మనిష్టగలవాడు. ఇతర ప్రాచీనకవులు చాలమందికంటే ఎక్కువ మతపరాయణుడనియే చెప్పవలెను. కాబట్టి ఆయన మతవిశ్వాసములు ఆలుబిడ్డలు, ఇల్లు వాకిలి, సిరిసంపదలు మొదలగు సర్వభౌతిక వాసనలనే త్యజింపజేసినవి. చివరకు, చరమార్పణ సూచికముగా కట్టుగుడ్డలనే వదలి నిండుబిత్తలి అయినాడు. నిజోపాసిత దైవాన్వేషణ తత్పరుడై దిసమొలతో ఒంటరిగా తిరుగాడినాడు. సాధారణముగా ఆయన అశుచిగా ఆకలికుట్టుతోనే ఉండి ఎప్పుడూ. పరిహాసభాజనుడగుచుండినాడు, అప్పుడప్పుడు గిట్టనివారు గుంపులుగూడి ఆయనకు శారీరక పీడను గూడ కల్గించను చూచేవారు. అట్టి వ్యక్తిని అంతమాత్రాన మతవ్రతదూరుడని ఎట్లనగలము? ఇంతకూ ఆయన మతము మూఢసంప్రదాయబద్ధము కాదు. అనేక దేవతారాధనమును అది అంగీకరించదు, విగ్రహారాధనమును గేలి పట్టించినది, శాస్త్రవిహిత బాహ్యానుష్ఠాన పరంపరను నిందించినది, పుణ్యక్షేత్ర తీర్థాభిగమనములను వలదనినది; దేవమానవుల మధ్య సంధానకర్తలమని చెప్పుకొనే పురోహితులను పీఠాధిపతులను పంపట్టించినది. ఈ భూతలమునకు మించి వేరుగా స్వర్గనరకములున్నవనే

అభిప్రాయమును వేమనమతము గురించినది; వర్ణాధిక్యమును వర్ణ ప్రత్యేకతను మానవ ధర్మవినాశకారియైన అంధ విశ్వాసోన్మాదమును నిందించి పారబట్టినది. ఇక వేమనమతమందలి దీపశుభాంశము లివి - మానవుని ఘనపరచి జగత్తులో ముఖ్యస్థానమున, ఒకే కేంద్రమున అతనిని ప్రతిష్ఠించినది. క్రైస్తవమత పరిభాషలో చెప్పవలెనంటే - దేవుని రాజ్యము నీయందే ఉన్నదని ఎలుగెత్తి చాటినది. మానవుడు దేవుని నుండి అవిభాజ్యుడని, ఇద్దరూ ఒకడేనని స్థిరీకరించినది వేమనమతము. ఇంతేగాదు, సంపూర్ణ ఆత్మసాక్షాత్కారము పొందిన సిద్ధమానవుడే పరబ్రహ్మమని మనమతము శంఖారావము గావించినది. ఇట్టి సిద్ధాంతములు హిందూ. వేదాంతమున కెట్లు భిన్నములు కాగలవు?

## వేమన మానవత, కవిత్వము

వేమనమతము, ఈ జగత్తులో మానవునికి ప్రధానస్థాన మొసగుటచే, ఆ మతముయొక్క ఆధ్యాత్మిక లక్షణములను లక్ష్యములను అంగీకరించలేకపోయినను, దాని స్వరూపము ముఖ్యముగా మానవజాతి శ్రేయోభిలాషాపూర్ణమని ఒప్పుకొనవలసియున్నది. ఆయనకుగల మానవ కల్యాణకాంక్ష, ఆయనకవిత్వము ఇతర ప్రాచీన తెలుగుకవుల కవిత్వముకంటె గుణమున భిన్నమై ఒక ప్రత్యేక స్వరూపమును దాల్చియున్నది. మాటల కొరకు మాటలను ఉపయోగించక, భావమునకే ప్రాధాన్యమిచ్చి, భూతకాలముకంటె వర్తమాన భవిష్యదృంశములనే చేబట్టి, రానున్న ఎప్పటి జీవితమునో గాక, ఇప్పటి ఇక్కడి జీవితమునే లెక్కబెట్టి ఆయన కవిత్వము సాగినది. - అది ఉపదేశాత్మకమైన నీతికవిత్వమా? అని అడిగితే అవుననియే చెప్పవలసియున్నది.

కాని, ఆ కారణము చేత అది క్షుద్ర రచన మెన్నటికిని కాజాలదు. వేమను ఋజువర్తనము, ఆయన సత్యవిషయోత్కటత, కపటసిద్ధాంతములపై ఆయనకు రేగిన ధార్మికకోపము, వంచనముపై కలుగు కోపము; సర్వ మానవాళిని కౌగలించుకొని ఆదరించుటకు బారలు చాచు ఆయన అపార ప్రేమ బుగ్గవలె పైకుబికి, ఆయన కవిత్వమునకు సహజసౌభాగ్యమును అబ్బజేసి ఘనపరచుచున్నది. ఆయన శైలి సరళ ప్రసన్నమయ్యు విషయపూర్ణము, ఆనందదాయకమయ్యు గంభీరము. ఆ కవిత్వ గతికి గల ఆరోహణ అవరోహణలు, తగ్గుమొగ్గలు, మనోజ్ఞలయ విన్యాసములు అద్వితీయములు. ఆయన పద్యపు ని మెరసి బుద్ధిని ఆకర్షించును. అందువల్లనే అవి చాలవరకు తెనుగు నుడికారములై నానుడులై సామెతలై సూత్రములై నీతులై ప్రజల నోట నానుచున్నవి.

## వేమనపట్ల నిరాదరణ ఒక మౌన కుతంత్రము

కవితాశిల్పమునగూడ వేమన మన పాతకవులకెవరికిగాని తీసిపోకపోయినను, ఆయనస్థానము, ఆంధ్రవాఙ్మయ ప్రపంచమున చాలక్రిందు చేయబడియున్నది. ఈ అధమ స్థానమైనను మొన్న మొన్న, కొన్ని దశాబ్దములకు ముందే ఒసగబడినది. 1914 వరకు ఆంధ్ర పండితలోకము. కావలెనని పట్టుదలతో వేమన పేరును అడుగునకు ద్రొక్కి అణచిపెట్టినది. అంతవరకు ఆంధ్రసాహిత్యరంగమున ఆయన ప్రస్తావనను తెగడుటైనను పొగడుటైనను ఏ విఖ్యాత పండితుడుగాని, ప్రసిద్ధకవిగాని, విమర్శకుడుగాని, భాషాచరిత్రకారుడు గాని ఎత్తియే ఎరుగడు. తెనుగులో మొదటి భాషాచరిత్రకారులైన గురజాడ శ్రీరామమూర్తి, కందుకూరి వీరేశలింగం పంతులు (1848-1919) ఈ ఇద్దరూ తమ రచనలలో వేమనను బుద్ధిపూర్వకముగనే చాల కడగా నుంచినారు. శ్రీరామమూర్తి కవుల చరిత్ర కంటే ఆంధ్రకవుల చరిత్రము (1899) విపులమును విస్తారమును అయిన సంకలనము. (కట్టమంచి వారన్నట్లు ఆంధ్రకవులందరి జాతక చక్రములను ఏర్పరచిపెట్టినారు) అందు చిల్లరమల్లర కవులకు, అనామకులకు ఎన్నో పొరటలు వినియోగింపబడియున్నవి;

కాని వేమన మాత్రం దిగవేయబడి ఉన్నాడు. 1917లో మరల పెంచబడి 220 మందికి పైబడిన కవుల చరిత్రను ప్రకాశింపజేసిన ద్వితీయ ముద్రణముగూడ, పట్టుబట్టినట్లు వేమనను వెలివేసినది.

ఈ రెంటికిముందు, ఎప్పుడో 1828లో ప్రచురింపబడిన కావలి వెంకటరామస్వామి 'దక్కను కవుల చరిత్రాంశములు' అను ఆంగ్లేయ గ్రంథముగూడ - బహుశః ఇది భారతీయుడు వ్రాసిన ప్రథమాంగ్ల గ్రంథమేమో! - ఆంధ్రకవులపట్ల వలపక్షమును నిరాదరణమును చూపినది. ఇందు వర్ణింపబడిన 108 మంది కవులలో 47 గురు తెలుగువారు. గ్రంథకర్తయే - దక్షిణాపథ వివిధ భాషా ప్రాంతాలలో వెలసిన అధునాతన పురాతన ప్రసిద్ధకవులు గాయకుల సంక్షిప్త జీవితములే తన గ్రంథ విషయమని చెప్పుకొనిగూడ, ఆ 47 గురిలో వేమనను చేర్చలేకపోయినాడు.

ఇట్టి మూగకుట్ర ఒక మహావ్యక్తి పేరైనను ఉచ్చరించక మరుగుపరచిన మౌన కుతంత్రము, -ప్రపంచ భాషాచరిత్రలందెచ్చటను కానము. ఇది ఒక పెద్ద విస్మయకారికి వేమనభాష పురాతనమై మృతప్రాయమై యుండిన, ఆయన శైలి క్లిష్టమైయుండిన, ఆయన భావపరంపర పాతదై బూజుపట్టి అకాలీనదోషగ్రస్తమైయుండిన, ఇట్లు ఆయన పేరును మాపివేయబడుటకు కారణములు ఊహించుకొని యుందుము. కాని ఉన్న నిజము కేవలము దీనికి భిన్నమైనది. ఇంతకు ముందే చెప్పియున్నాము: వేమన భాష స్వచ్ఛము, ప్రసన్నము, ఫక్కి మస్సృణము విశదము వినిర్మలము; ఆయన ఉపమానములు నవ్యములు యధార్థములు పరుషములు, అవి విద్యుల్లతా శోభలతో వాళ్ళయ వియత్తలమునంతా ప్రభాభాసితము చేసివేయును. కొన్ని సజీవ విషయ విపులీకరణ సందర్భములలో ఆయన భావసరణి, ఆయన కాలమునాటికేకాదు, నేటి ఆధునిక యుగమునకే పురోగామియై కొంగొత్తగనున్నది. వేమన మత మూఢాచారముల పైనను, సాంఘిక నిబంధనలపైనను తిరుగబడిన ఉదారాశయుడు.

తెనుగు వ్యావహారిక భాష వేమనకు ఎంతో ఋణపడియున్నది దానికి ఒక కొత్తవాదర, పదను, పరిమాణమును కల్పించినాడు కాని, పూర్వ సంప్రదాయముల ప్రామాణ్యమును అంగీకరించని ఉదారాశయుడైన హిందువు అయితేనే దప్ప, వేమన మత నైతిక సాంఘిక భావముల అంతరార్థమును సంపూర్ణముగ అవగాహనచేసి కొని హర్షింపజాలడు.

## వేమన ప్రామాణ్యవాదులు

వేమన ప్రామాణ్యవాదుల ఆమోదమును పొందనిదానికి కారణము లివి ఆయన శివభక్తుడయ్యు, ఆ మత బాహ్యడంబరములను, లింగధారణ విగ్రహారాధన ఉపవాసాది అనుష్ఠానక్రియలను అపహాస్యముచేసి క్రిందుచేసినాడు. దీనితో ఆచారపరాయణులైన ప్రాచీన శైవరచయితలు ఉగ్రులై, వేమన నామరూపాలను పొలకువ లేకుండా తుడిచివేయుటకు ఒక కుట్రలో చేరినారు. ఇందు ముఖ్యమైన కారణము ఇందు ముఖ్యమైన కారణము వేమన శూద్రుడు. అప్పకవిటోటి లక్షణికుడు (18-వ శతాబ్ది) శూద్రుని రచన ఎట్టిదైనా, తాకకుండానే దాని గుణావగుణములు లెక్కబెట్టకనే, దానిని దూరంగా విసరి పారవేయమనినాడు.

అందువల్ల, అదిలో ఉత్సాహపూరితులై వేమనను కొనియాడినవారు హిందూపండితులుగాక, క్రైస్తవ విద్వాంసులు - అందులోను ప్రొటెస్టెంటులే! (క్యాథలిక్కుల విగ్రహారాధన మొదలగు మూఢవిశ్వాసములపై తిరుగబడినవారు, ప్రొటెస్టుచేసినారు) ఇది కేవలము యాదృచ్ఛికముగ జరిగినదికాదు.

## పాశ్చాత్య పండితులే వేమన కీర్తిని ఉద్ధరించినవారు

ఈ నిషేధశక్తి పరోక్షముగా ఎంత పనిచేసిందో చూడండి: ఆంధ్ర భాషోద్ధారకుడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను, మదరాసు ప్రభుత్వ సివిల్ ఉద్యోగిగా నుండినప్పుడు, 1829లో వేమన పద్యములను కొన్నిటిని ఏరి, పాఠ్యగ్రంథముగా, కాలేజి బోర్డువారికిగా ముద్రించినాడు. అచ్చువేసిన 500 ప్రతులలో 450 ఎట్లనో, రహస్యముగా కనుమరిగి కనబడకుండా పోయినవి. మిగత 50 బ్రౌనుకు సంపాదక పారితోషికముగా ఒసంగబడినవి. ఇది జరిగిన పదేండ్లకు, కనుపించని ఆ పుస్తకములన్నీ పనికిరాని చెత్తకాగితములుగా చుట్టి కట్టబడి, కాలేజి గ్రంథాలయమున చెత్తవేదారపుకొట్టులో దురిగి వేయబడియుండుట బయటబడి, బ్రౌనుకు తెలియవచ్చినది. కాలేజి సభ్యులైన కొందరు అగ్రవర్ణ పండితుల కనుసన్నలతో, వారిమాట మరుగున ఈపని జరిగినట్లు తెలిసినది.

వేమన అనిన కలిగిన ఈ ఏవగింపు ఎంత గట్టిగా ఎక్కువగా ఉండినదో, దానిని వివరించుచు మదరాసు స్టాఫ్కర్కు చెందిన, మేజర్ ఆర్.ఎం. మ్యాక్డొనాల్డు 1866లో, 'మదరాసు జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్సు' అను పత్రికలో ఒక సుదీర్ఘ వ్యాసమును వ్రాసినాడు, అందలి భాగము:

డాక్టర్ పోప్ పరిశీలించి ఇట్లు వ్రాయుచున్నాడు: వేమన రచనలు తెలుగు ప్రజలలో అత్యంత ప్రచారములో నుండి, ఆదరింపబడుచున్నవి. కాని, ఈలోక ప్రియత కేవలము శూద్రులకే పరిమితమైయున్నదని నా విశ్వాసము. ఇంతేగాక వారిలోగూడ హిందూ మతాభిమానికి నచ్చనేలేదు. ఈ వ్యతిరేక భావము, మొట్టమొదట వేమన పద్యములు ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యగ్రంథముగా పెట్టినప్పుడు బాగా బయటబడినది. ఉపాధ్యాయులు విద్యార్థులు అందరూ కలిసి ఈ ప్రభుత్వాజ్ఞను ఉల్లంఘించి, ఆచరణలోనికి రాకుండా తప్పించివేయుటకు సర్వశక్తులా ప్రయత్నించినారు. కొందరు ఏదో ఒక సాకుతో తరగతి గదులలోనికే అవి ప్రవేశించకుండునట్లు చేయగలిగినారు. మరికొందరు అందలి పద్యములు కొన్నిటిలో, తమ మతనింద ఎక్కువగా నున్నదని, వాటిని గరపకుండా దిగవేసి దాటవేసినారు. ముఖ్యంగా బ్రాహ్మణులు ఈ గ్రంథకర్తను చాలాగట్టిగా ద్వేషించినారు. దీనికిగా, వారు వేమనశైలి అసభ్యమని, విషయము దురాచార ప్రేరకమని గొంతెత్తి చాటినారు. "

## క్యాంబెల్

ముప్పై యేండ్లు గడచిన తర్వాతగూడ, యీ 'పరిస్థితి ఏమంతగా మెరుగుకాలేదు. 'ఒక క్రైస్తవ మిషనరి - విలియం హోవర్డు క్యాంబెల్ 1898లో మదరాసు క్రిశ్చియన్ కాలేజి మ్యాగజీనులో వ్రాస్తూ 'బ్రాహ్మణులు ఎప్పుడూ వేమన బోధలను చాలా తీవ్రముగా ప్రతిఘటించుచునే ఆ ప్రస్తావన వచ్చినప్పుడంతా ఆ వ్రాతలను గూర్చి చాల నీచముగా ''మాట్లాడుచుందురు' అని వెల్లడించినాడు. మరికొందరు పాశ్చాత్య పండితులు వేమన కవిత్వముపై వ్యామోహితులై ఉగ్గడించి ఉన్నారు వారిలో.

## జె.ఎ. దుబాయ్



వేమనచే ఆకర్షింపబడిన మొట్టమొదటి పాశ్చాత్యుడు ఫ్రెంచి మతగురువు (Abbe) జె.ఎ. (J. A. Dubois) ఈయన వ్రాసిన 'హిందువుల ఆచారములు అలవాట్లు మతకర్మలు' (Hindu Manners, Customs, and Ceremonies: ఇది 1816లో ఫ్రెంచి నుండి ఆంగ్లమునకు అనువదింపబడినది) అను పుస్తకములో వేమన ప్రస్తావన రెండుమారులు చేయబడివున్నది. రెండవది పుష్ట ఆరోజ్ఞాపిక అయినను, చాల ప్రధానమైనది, దాని పూర్తి పాఠమిది:

'ఉదార వేదాంతవిషయములను వ్రాసిన హిందూ రచయితలలో, ముఖ్యముగ హిందూ మతాచారములను బహిరంగముగ విమర్శించినవారిలో, నాకు తెలిసినంతవరకు ఒక్కడూ బ్రాహ్మణుడు లేడు. నేను పరిశీలించిన యిట్టి విమర్శనాత్మక గ్రంథములన్నిటినీ బ్రాహ్మణేతర కవులే వ్రాసియున్నారు. 'తిరువళ్ళువరు ఒక పరయ, పట్టినత్తు పిళ్లై, ఆగస్త్యుడు ఇద్దరూ. వెళ్లాళకులజులు, వీరు తమిళ కవులు, కన్నడకవి సరోవిజ్ఞమూర్తి (సర్వవిజ్ఞానమూర్తి) ఒక లింగాయతుడు. ఇక అట్టివారిలో అత్యంత ప్రఖ్యాతకవి వేమన! ఈయన తెలుగులో వ్రాసినాడు. ఇప్పుడు ఈయన రచనలు అనేక యితర భాషలలోనికి అనువదింపబడియున్నవి. ఈ వేదాంతి. ఒక రెడ్డికులజుడని, కడపజిల్లాలో పదేడవ శతాబ్ద చరమభాగమున దివంగతుడైనాడని. చెప్పబడుచున్నది. ఆయన వ్రాతలను చాలావాటిని నేను పరిశీలించినాను. అవి చాల చిత్తాకర్షణీయముగనుండి, సూక్ష్మబుద్ధితో చేసిన విచారముగ, స్వతంత్ర భావోపేతముగ, ఒక ప్రత్యేకతతో కన్పించినవి. ఇందులో ఒక విశేషమేమన విప్లవ భావాత్మకములును నిందాగర్భములును అయిన యీ కృతులన్నీ యీ మధ్యకాలముననే పుట్టినవి. పూర్వము, ఎవడైనా ప్రబోధితుడై యిట్టి విమర్శక గ్రంథమును, ఒకవేళ వ్రాసి ప్రచురించియుండినచో, బ్రాహ్మణులు అత్యంత శ్రద్ధతో వాని పొలకువయే కన్పించకుండ చేసియుందురు. ఇక ఇప్పుడు వారు, పైన మనము పేర్కొనిన కవులపై విరుచుకొనిపడి, కోపావేశముతో ఆ రచనలను తుచ్ఛములని హీనపరచుచున్నారు.

అయితే, నిజానికి వాటిని వారిప్పుడు నాశము చేయలేరు, కాని అవి ప్రచారములోకి రాకుండా, ఎవరూ వాటిని చదువకుండా చేయుటకు మాత్రము. వారికున్న శక్తినంతా వినియోగము చేయుదురు.

## హెన్రీ బ్యూఛాంప్

హెన్రీ బ్యూఛాంప్ అనే ఆయన 1897లో యీ దూబాయ్ ఫ్రెంచి గ్రంథమునకు, మరియొక శ్రేష్ఠతమ విపులానువాదమును చేసి ప్రకటించచు, గ్రంథకర్త మొదటిమాటలను కొంతమార్చి, తన సొంతమాటలు నిట్లు చేర్చినాడు:

'ఈ మతగురువు వ్రాసిన చరమవాక్యము చాల అపోహలను కలిగించుచున్నవి, ఎందుకంటే - ఈ కవులను, బాగా చదువుకొని, సంస్కారము గలిగిన బ్రాహ్మణులు చాలమంది ఎక్కువగా గౌరవించి, ఆ రచనలను ఆసక్తితో చదువుచున్నారు. ఇట్టి వారిని పురోహిత వర్గమునకు, ఆచార్య పీఠములకు సంబంధించిన వారినుండి వేరుచేయవలెను ఈ తెగవారి అభిప్రాయము మాత్రము. ఈ వ్రాతలను ఎవరుగాని చదువకుండా ఉండవలయు ననుటయే. దుబాయ్ రెండవ ఉల్లేఖనము హిందూ మతముయొక్క ఆత్మవిమోచన విధానమును గురించినది. అర్థము చేసికొనిన వ్రాత.

అప్పటి బ్రిటీషు గవర్నర్ జనరల్ - విలియం బెన్ టిక్ ప్రభువు, దుబాయ్ గ్రంథపు వ్రాతప్రతిని జూచి - రాజకీయ దృక్పథముతో చూచిన, దూబాయ్ వ్రాతలు అందించిన విషయాలు. ప్రభుత్వోద్యోగులు దేశీయులతో వ్యవహరించునప్పుడు, వారి అలవాట్లు వారి మూఢవిశ్వాసములు చక్కగా తెలిసికొని, ఎక్కుడు సమైక్యభావముతో మెలగుటకు ఎంతోసహాయకారులు కాగలవు' అని భావించుటచేత, ఈస్ట్ ఇండియా కంపెనీవారిని యీ లిఖిత గ్రంథమును కొని, దాని ఇంగ్లీషు పాఠమును వెంటనే ప్రకటించమని కోరినాడు. దుబాయికి 2000 పెగోదాలు యిచ్చి. కంపెనీ ఆ పుస్తకమును కొనినది (పెగోదా అనగా ఇంచుమించు 4 రూపాయలు. దీనినే కరకు లేక పూలవరహా అనేవారు).

## చార్లెస్ ఫిలిప్ బ్రౌన్

ఈ దూబాయ్ ప్రచురణము, వెంటనే ఎక్కువగా సహాయపడినది, కంపెనీ అధికారులలో ఒకరైన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌనుగారికి, ఆ సమయమందు, ఆయన మదరాసు సివిల్ సర్వీసులో (ఐ.సి.ఎస్.) నుండినారు. 1824లో దానిని చదివినది మొదలు వేమనపట్ల అత్యంత శ్రద్ధాళువైనాడు. బ్రౌనుగారి ఆసక్తి వేదాంత విషయములకంటే, భాషావిషయములమీదనే ఎక్కుడు లగ్నమైనది. ఆయన వేమన భావసరణిలోని మౌలిక విషయములను మానవతా పరమార్థమును చూడలేకపోయినాడు. ఇంతేగాకుండా, వేమన వేదాంతము, అధునాతనాభి ప్రాయములకు పురోగామియైయుండిన సంగతిగూడ బ్రౌను గుర్తించలేక పోయినాడు. అయితేనేమి? ఒక్క విషయము మరువరానిది - తాటాకులమీద వ్రాసియున్న వేమన పద్యములను, పలు తావులనుండి సంగ్రహించి, అనుశీలన దృష్టితో సరిజేసి, చేర్చి ఒక క్రమములో ఒదిగించి, ముద్రణమునకు సిద్ధముచేసినవారిలో ఆయనే ప్రప్రథముడు, ఇంతేగాకుండ, వీటిలో 693 పద్యములను ఏరి, తన సొంత ఆంగ్లానువాదముతో, టిప్పణములతో ముద్రించిన మొదటి వాడుగూడ ఆయనే! ఇంతటి శ్రమతోపాటు, దీనికంతటికి ఆయన సొంతసొమ్మునే వెచ్చించుట కొనియాడదగినది. ఇది ప్రతిఫలాపేక్ష లేకుండా బ్రౌను చేసిన అన్యభాషాసేవ! అప్పుడు దీనికిగా ఆయన, వేమన దేశీయులనుండి ఒక్క కృతజ్ఞతా వచనమును గూడ కాంక్షించి ఆయుండలేదు, ఎందుకంటే, ఆనాటి ఆంధ్రసాహిత్య పీఠాధిపతులకు వేమన పేరంటేనే అసహ్యముగ ముండినదిగదా!

## ఆర్.ఎం. మ్యాక్డొనాల్డు

బ్రౌను దొర వేమన పద్యములను ఏరికూర్చి (అచ్చు వేసినది 1829లో, దానిపేరు Verses of Vemana - Moral Religious and Satirical నీతిమత విమర్శాగర్భములైన వేమన పద్యములు). 1839లో వీటికి ద్వితీయముద్రణము వెలువడినది. ఈ ప్రతి, దుర్లభముగనున్నది. కాని, మదరాసు స్టాఫ్ కోరుకు సంబంధించిన, మేజర్ ఆర్.ఎం. మ్యాక్డొనాలు, 1866 లో ప్రచురించిన విమర్శక వ్యాసములో ఇట్లా వ్రాసియున్నాడు 'ఈ ముద్రణములో ఇంగ్లీషు అనువాదము, టిప్పణి తీసివేయబడి ఉన్నది. కాని, మతనీతి విభాగములలో చాల ఎక్కువ పద్యములు చేర్చబడియున్నవి. మొదట బ్రౌను 1215 పద్యములను ఎన్నుకొని, వాటి ఇంగ్లీషు అనువాదమును, పెద్ద అవతారికను సంతనపరిచి యుండినారు. కాని, ఏ కారణమువల్లనో అది ఈ నడుమదాక ప్రచురింప బడలేదు.' 'అది మదరాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయములో శిథిలమైపోకుండ ఉద్ధరించి ప్రచురించిన కీర్తి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి చెందుచున్నది. (1967)

వేమనను గురించిన బ్రౌనుదొర వ్రాతలు.. 1) వేమన పద్యములను ముద్రించిన మూడు కూర్పులలో రెండింట చేర్చిన అవతారికలు, 2) 1840లో ప్రచురించిన Essay on Creed, Customs and Literature of the Jangams (జంగముల మతము ఆచారములు వాఙ్మయమును గూర్చిన వ్యాసము) లో వేమనను గూర్చిన అంశము, 3) 1869లో

ప్రచురించిన బ్రౌనుగారి స్వకీయచరిత్ర (Some Account of the Literary Life of Charles Philip Brown) లో వేమనను గూర్చిన ప్రస్తావనము.

బ్రౌను ప్రచురించిన వేమన పద్యముల ద్వితీయ ముద్రణమును గురించి ఇంతకుముందే కొంత ప్రస్తావించి యున్నాము. అది కేవలము ఒక గ్రంథ విమర్శనమేకాదు, అది ఒక సుదీర్ఘ ప్రత్యేక వ్యాసము, ఆ వ్రాత ఆయన తన పర్యటనలలో ప్రత్యేకముగా సేకరించిన అనేక విషయములపై ఆధారపడియున్నది. ఇది 1866లో Madras Journal of Literature and Science అనే పత్రికలో ప్రచురింపబడినది. అర్థపూర్ణమైన వాక్యములతో దానిని ఇట్లు ప్రారంభించు చున్నాడు: 'తెనుగు సమగ్ర వాఙ్మయములో, వేమన రచనలు ఐరోపీయులను ఆకర్షించి, వారిచే గుర్తింపబడినట్లు ఏ ఇతరకవి రచనలు గూడ గుర్తింపబడలేదు. క్రైస్తవ దార్శనికుడు యీ హిందూ నైతికవాది కల్పించిన శస్త్రములనే, క్రైస్తవ ధర్మేతర సిద్ధాంతములపై ప్రయోగించి మతయుద్ధము సాగించుచున్నాడు' సరే! ఇట్లే వేమన శాస్త్ర సంపద నుండియే హేతువాది, మానవతావాది గూడ కొన్ని దారుణాస్త్రములను చేబట్టి ఇతర మతముల పైగూడ ప్రయోగించ గలుగుచున్నాడు గదా!

## ఛార్లెస్. ఇ. గోవెర్

దీనితర్వాత, వేమనను గురించి వ్రాసిన పరమటి పండితుడు:  ఛార్లెస్. ఇ. గోవర్, తమిళ మహాకవి తిరువళ్లువర్ అనిన ఇతనికి విశేష గౌరవము, ఆయన తర్వాత, గోవర్ వేమననే కొనియాడినాడు. వేమనయొక్క కేవల హేతువాదము, ఏకేశ్వరోపాసన, ఉత్కటమైన అసభ్యత, పదప్రయోగౌచిత్యములు' ఈ గోపరును ఎక్కువగా ఆకర్షించి ప్రశంసింపజేసినవి. 1871లో ఆయన వెలువరించిన "దక్షిణ భారత జానపద గేయములు" (Folk Songs of South (India) అనే పుస్తకములో, ఆంధ్ర విభాగమునంతా వేమనకే వినియోగించినాడు. అందలి పెద్ద పరిచయవ్యాసములో కొన్ని వేమన పద్యానువాదములు క్రోడీకరింపబడియున్నవి. బ్రౌన్ ఇంగ్లీషు వచనమునే గోవర్ ఛందోబద్ధము చేసినాడు గోవెర్ రచన చాల రసహీనమైనప్పటికిని, ఒక లిఖిత ప్రమాణముగా ఉండగలదు.

## విన్సెంట్ స్మిత్

మొదట మొదట భారతదేశ చరిత్రను వ్రాసిన వారిలో ఇంగ్లీషు చరిత్రకారుడు - విన్సెంట్. ఎ.స్మిత్ సుప్రసిద్ధుడు. ఈయన హిందూ దేశ చరిత్రను 1910 ప్రాంతాన ప్రచురించినాడు. ఈ చరిత్ర చదువుటకు ఆహ్లాదకారిగానుండును. ఈ గ్రంథములో 'వర్ణవ్యవస్థ దోషములు' అనే శీర్షిక క్రింద, ఆ వర్ణవిభేదములను గరించినవారిని గూర్చి వ్రాయుచు, వేమన పద్యములు నాల్గింటిని ఉదహరించినాడు. ఇవి గోవర్ ఆంగ్లానువాదములు...

## వేమన పద్య బహిష్కరణము

ఇంతకుముందే చెప్పినట్లు, మ్యాక్ డోనాల్డు వ్యాసము ప్రకారము, హిందూసంఘములో పూర్వాచార పరాయణులు, వేమన పద్యములను ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యభాగముగ చేర్చుటకు వ్యతిరేకత చూపక పోయినను, ఇష్టపడలేదని తెలుసుకోగలిగినాము. వేమన పద్యములు క్లాసురూములలో ప్రవేశించికుండా చేయను. పరోక్షముగ ప్రత్యక్షముగ ఎంత చేయవలయునో అంత చేసినారు. పోనుపోను ఈ ప్రతిరోధము ఎంత బలవత్తరమైనదంటే - ప్రభుత్వము దీనిని గుర్తించి, కూర్చుండి యోచించవలసి వచ్చినది. దీనికితోడు ఇట్టి సామాన్యాక్షేపణలే. మరికొన్ని పాఠ్యగ్రంధములపట్ల గూడ వెలువడినవి.

## పరిశీలన సంఘము

### పరిశీలన సంఘము వేమన పద్యములపై ఆంక్ష

అందుచేత ప్రభుత్వము మదరాసు రాజధానిలో ఇంగ్లీషు తెలుగు తమిళ పాఠ్యపుస్తకములను పరిశీలించి సవరించుటకు ఒక సంఘమును నియమింపవలసి వచ్చినది; దానికి మ్యాక్ డొనాల్డు అధ్యక్షుడుగా చేయబడినాడు.

ఈ సంఘము, తెనుగునాట ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్సు (పాఠశాలల పర్యవేక్షకుడు) గా పనిచేయుచుండిన హన్ బవర్సును, తెనుగు పాఠ్య గ్రంథములను గూర్చి ఒక నివేదికను సమర్పింపమని కోరినది. ఈ విషయమును 1874లో ప్రభుత్వ ముద్రణాలయము ప్రకటించిన నివేదిక పొందుపరచినది. వీనిని ఇ.కీస్ గారు ప్రచురించినారు. ఆ నివేదికలో, తెనుగు పాఠ్యపుస్తకముల నుండి వేమన పద్యములను బొత్తిగా తీసివేయమని బవర్సు గట్టిగా వాదించినాడు అయినా, ఆయన వేమనను గూర్చి ఇల్లనుచున్నాడు; - ఒక ఐరోపీయునికి వేమన తనకాలము నాటికంటే ఎంతోముందు అధిగమించిన వ్యక్తిగా కన్పించును. ఆయన భావములేగాక ఆ భావవ్యాపకమునకు ఆయన చూపిన ఆసక్తి సత్యనిరతి ఆవేశములు గూడ పాశ్చాత్యులకు ఎక్కువగా మనసుకెక్కును" అని బవర్సుగారే అంగీకరించుచున్నాడు. కాని, ప్రభుత్వము హిందూ విద్యార్థులను క్రైస్తవములోనికి కలుపుకొనే ప్రయత్నము ఇందుమూలకముగా చేయుచున్నదనే అపోహకు తావులేకుండా చేయుటే వివేకము అని అభిప్రాయపడినాడు.

దీనివల్ల, బవర్సు వేమనపట్ల వెలిబుచ్చిన ఈ అభిప్రాయము, మతవిషయమున ఆయనకు గల పూర్వశాస్త్రానుసరణ బుద్ధినిబట్టియే నియమితమై యున్నట్లు తెలియగలదు. ఇంతేగాక, ఇది తమ సామ్రాజ్యావసరములకు గూడ అనుగుణమైనదని సుస్పష్టముగా తేలినది.

## డాక్టర్ జె. ముర్డాక్

మ్యాక్ డొనాల్డు సంఘసభ్యుడుగా నుండిన డాక్టర్ జె. ముర్డాక్ తన అభిప్రాయము నిట్లు వెలిబుచ్చినాడు - "వేమన పద్యములను నిషేధించవలెనన్న అభిప్రాయముతో నేను పూర్తిగా వికీభవించుచున్నాను. ప్రభుత్వము ప్రచురించిన పాఠ్యగ్రంధములలో బైబిల్ దూషణ మెట్లుండరాదో, అట్లే వేదనిందగూడ ఉండకూడదు. ఇంతేగాకుండా, బ్రాహ్మణులపై అవహేళనపూర్ణ వాక్యములను ప్రవేశపెట్టి, అట్టి స్వజాతిదూషణములను ఆ బ్రాహ్మణులనే బోధించమనుట ఉచితము గాదు. ఉపాధ్యాయులు ఎక్కువమందివారే అగుటచే ఈ పని వారికి తప్పేది కాదు. వేమన చేసిన విగ్రహారాధన గర్హణములతో క్రైస్తవమతమునకు ఎట్టి సంబంధముగాని లేదు. వేమన హిందూ దేవతాగణమునెల్ల పూజించువాడు. ఈ గ్రంథము ఎప్పుడో ముక్కలు ముక్కలుగా జేసి రూపుమాపి వేయబడవలసినది. కాని, యీ కత్తి విద్యాశాఖలలో క్రైస్తవ గ్రంథములకొరకే ప్రత్యేకింపబడియున్నది."

## విలియం హోవర్డ్ క్యాంబెల్

వేమనపై వచ్చిన వ్యాసావళి మొత్తములో ఉత్తమమైనది - విలియం హోవర్డ్ క్యాంబెల్ గారి రచనయే! లండన్ క్రైస్తవ మిషనుకు సంబంధించిన ఈయన 1884 చివరన, మిషనరీగా భారతదేశమునకు పంపబడినాడు. గుత్తి తన కేంద్రముగా, రాయలసీమలో ఎచ్చుతక్కువ పదిహేడేండ్లు గడపినాడు. దానిచేత వేమన బోధనలను బాగా తెలుసుకొనేదానికి మంచి అవకాశము లభించినది. ఆయన ఆంధ్రభాషా పరిజ్ఞానము పైస్థాయిలో నుండినది. ఎం. వెంకటరత్నము, కందుకూరి వీరేశలింగం గారలతో కలిసి పనిచేసి, మొదటితడవగా 1903లో ముద్రింపబడిన సి.పి. బ్రౌన్ గారి "తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును సరిజేసి, ద్వితీయ ముద్రణమునకు సిద్ధము చేయుటకు తోడ్పడినాడు. వేమన సొంత వూరుగా ఉండవచ్చుననిన కటారపల్లెను (కడపజిల్లా) క్యాంబెల్ సందర్శించి, 1898లో వేమనపై ఒక వ్యాసమును, మదరాసు క్రిశ్చియన్ కాలేజి మ్యాగజీనులో ప్రచురించినాడు. ఇది పూర్వాపరములను సమగ్రముగ గుర్తించి, న్యాయదృష్టితో వ్రాసిన వాగ్వైభవరచనము. క్యాంబెల్ గారి యీ వ్యాసము సహానుభూతి. గలిగి భావనాపూర్ణముగ వేమన బాహ్యరూపమును అర్ధపూరోజుల వర్ణములతో చిత్రించినది. ఆయన కవిత్వము ఇందు, సాహిత్య నైతిక వేదాంత దృక్పథములతో చక్కగ విపులీకరింపబడి విమర్శింపబడినది.

## డాక్టర్ లాయనల్ డేవిడ్ బార్నెట్

క్యాంబెల్ తర్వాత సరీగా, పరేండ్లకు, 1908లో డాక్టర్ ఎల్ డి బార్నెట్, వేమనను ఉన్నతోన్నత ప్రశంసకు పాత్రీకరించినాడు. ఇంతటి ప్రశస్తి ఏ పాశ్చాత్య పండితుడు గూడ గావించియుండలేదు. "భారతదేశ హృదయము" (The Heart of India) అనే యీ చక్కటి చిన్నపుస్తకములో, యీ సహృదయుడు- "రక్తమాంసములు మానవశరీర రూపమును దాల్చి, వేమ, లేక వేమన అనే పేరుతో యీ భూతలమున అడుగిడి, నిజముగా దానిని పవిత్రము చేసియుండునా?" అని ఆశ్చర్య చకితుడైనాడు. "ఒక పద్యము ఆయన నిజముగా కృషికుడని సూచించుచున్నది. కాని, ఆయన ప్రథమ శ్రేణికి జెందిన గుణావగుణ వివేచకుడు. ఇది పైపైకి నిజముగా కాన్పించవచ్చునేగాని, నిలుచు విషయముకాదని యీ కృషీవలత్వమును నిరాకరించి, వేమన ఒక వెట్టి సన్నా అని ఒక "పూర్ రిచ్చర్డు - వెట్టివేమన - ఒక కల్పిత గ్రామీణ యోగి అని చెప్పుచు, ఎందరో జానపద కవుల పద్యములను ఎన్నిటినో యీయన నోట దురిగి ఒప్పు జెప్పించినారని కొందరు వాదించవచ్చును." అని బార్ నెట్ వ్రాస్తున్నాడు.

## సంశయగ్రస్తమైన జీవితాంశములు

దీనికంతటికి కారణము - వేమన జీవితాంశముల వివరము అస్ఫుటముగా వివాదగ్రస్తముగా నుండుటే! ఆయన ఎప్పుడు ఎక్కడ పుట్టినది, తలిదండ్రు లెవరైనది, ఆయన కోడె ప్రాయమును ఎట్లా గడపినది. ఆయన సంచారోపదేశకుడు ఎట్లయినది. ఆయన ఎప్పుడు ఎక్కడ సిద్ధి పొందినది. ఎవరుగాని ఇట్టిదని గట్టిగా నిరూపించి చెప్ప లేకున్నారు. బ్రౌన్, మ్యాస్డానాలు, గోవెర్, క్యాంబెల్ యీ విషయము లన్నిటిమీద కాకపోయినా, చాల వాటిపై పరస్పర భిన్నాభిప్రాయములు. కలిగియున్నారు. దీనికిదోడు, ఇటీవలి తెలుగు విద్వాంసుల పరిశోధనలు, వేమన జీవితాంశములలో ఒక్కదానినైనను సందేహఛాయాతీతముగ నిరూపించ లేకపోయినవి. ఇంతే గాక, వేమనవని చెప్పబడే 5000 లకు పైబడిన పద్యములలో సగానికి పైన - భాషాశైలినిబట్టి విషయమునుబట్టి వేమనవి కావని, ఎవరో ఇతరులు వ్రాసి వేమనవిగా ఇందు దూర్చినారని నిర్ణయించినారు. అయినప్పటికిని, వేమన మాత్రము ఊహాజన్యమైన యోగి మాత్రము గాదు. ఆయన కవిత్వము

బయటబెట్టిన ఆ వ్యక్తిత్వము సజీవమై, వీర్యవంతమై, చైతన్యశక్తోపాదకమై యున్నది కావలెననియే కండ్లు మూసికొంటేనే దప్పు, ఆ వాదమును నిలబెట్టుకోలేరు . ఆయన ఉనికి మనికి సందేహము లేనివి.

"మానవతకు సంబంధించినదానిని దేనినిగాని వేమన నిర్లక్ష్యము చేయడు" అని డాక్టర్ బార్నెట్ చెప్పినది అత్యంతము సత్యము ఆయన "మానవజాతిని ఉద్బోధించిన ప్రవక్తలు. ఉపదేశకుల ప్రథమ శ్రేణిలో వేమనను చేర్చుట, వాస్తవమును గుర్తించుటే అగుచున్నది. బార్నెట్ ప్రశంస ఎంతో ఉచితముగను, చారుతరముగను నున్నది. అందుచేత దానిని యధాతధముగ ఉదహరించుచున్నాము. "మానవ హృదయాంతరాళ పరీక్షకుడొకడు, లోకప్రవక్తల ఉపదేశముల విలువను గట్టను తూచిన ఎడల, ఎందరో ఉన్నతులు, ఎన్నియో మహిమోపేతాత్మలు ఈ తెలంగాణా వినీత వినమ్ర కృషికునికంటె ఎంతో తక్కువగా తూగినట్లు తెలిసికోగలదు.

## వేమన భావములపై అన్య ప్రభావములు

బలవత్తర ఏకేశ్వరోపాసనావాదము, నిశిత విగ్రహారాధన ఖండనమువలన వేమన భావములు ముస్లిములకే గాక, ప్రొటస్టెంటు క్రిశ్చియనులకు గూడ చాలా బాగా మనసుకెక్కి నిండా నచ్చినవి. కాని వేమన మతమునకు క్రైస్తవము గాని, ఇస్లాముగాని ప్రోద్బలకారులని అనుకొనుట. పెద్ద పొరబాటు, ఆయన పద్యములలో సూటిగా గాని మాటుగాగాని క్రైస్తవమును గూర్చిన ప్రసక్తియే కనుపించదు ఇంతేగాక, ఆ మతము పేరైనను వినియుండక పోవచ్చును. కాని ముస్లిములను గురించి మాత్రము మూడు తావులందు చెప్పియున్నాడు. మక్కా యాత్రవలన (హజ్) కలిగే ఆధ్యాత్మిక లాభమును గూర్చి సందేహించి విమర్శించినాడు. ఇది ధర్మనిరతులైన ముస్లిం భక్తుల మానసముల నొవ్వజేయవచ్చును. వేమనకు ఇస్లాం సంగతి బాగా తెలిసి యుండినప్పటికిని, దాని పలుకుబడి ఆయన భావములపై బడినదనుటకు ఆస్కారము లేదు; ఒక వేళ కలిగియుండినా, అది అంతగా గుర్తించ గలిగినట్లు లేదు. వేమన బసవేశ్వరుని వీరశైవమున బుట్టి, ఆ వాతావరణమునందే పెరిగి పెద్ద అయినాడు. వీరశైవము పరిభ్రంశము పొందుటకు ముందు, దాని పేరుకు తగినట్లే ఏకేశ్వరోపాసన విషయములో వీరత్వమునే జూపి, ఇతర మతములపై బడినది. విగ్రహారాధనమును ప్రతిఘటించినది, కులభేదమును గర్జించినది; ఇతర దురాచారములపై దండెత్తినది. ఈ ప్రత్యేక శైవశాఖకు సంబంధించిన ఉపదేశముల వ్యాపకమునకు వేమన అందరికంటే ఎక్కుడు సమరోత్సాహమును, ఉడుగని పట్టుదలను చూపినాడు. తన అనుమాయులైనను తప్పు జేసినప్పుడు, తేళ్లచే కుట్టించినట్లు, వారి వీపులపై కొరడా దెబ్బలు కొట్టినట్లు మందలించేవాడు.

## వేమన ముస్లిములు

ముస్లిములకు వేమన మతము నచ్చినందులకు మరికొంత: - బ్రౌను గోవెరు మొదలగు హిందూయేతరులు, వేమన పద్యములను ఇంగ్లీషులోనికి మార్చిన తర్వాత, అట్టి అనువాదము. చేసిన మరియొక వ్యక్తి ఒక ముస్లిం అగుట గమనార్హమైన విషయము. వీరి పేరు మీర్ మహమ్మూద్ ఖాన్. "ఒక మర్మయోగి అంతర్గత భావ శబలత (Musings of a Mystic) అను పేర వేమపద్యములు కొన్నింటిని ఇంగ్లీషు పద్యరూపకముగ వీరు రచించి ప్రకటించినారు.. (1966) భానుగారు వేమనకు ముస్లిం సూఫీ యోగులకు మధ్య గల సామరస్య సమభావములను చాల కనుగొనినారు. వీరు హైదరాబాదు వాసులు.

## వేమన వైశిష్ట్యము

ఇవన్నీ ఏమి నిరూపించుచున్నవి? ప్రాచీనాంధ్ర కవులలో హిందూయేతరు లగు అన్యమతావలంబకులకు, అనగా - విశాల ప్రపంచమునకు అనురక్తిని గూర్చినవాడు ఒక్క వేమనయోగి యనియే దృఢపడుచున్నది. ఇందు సందిగ్ధమే లేదు. ఇంతేగాక, సుస్థిర సప్రామాణిక మతమును అంటబెట్టుకొని యుండనివారికి, హేతువాదులకు, మానవతావాదులకు వేమన -మతము ఆకర్షణీయమైనది.

కవి, దార్శనికుడు, ప్రవక్త అయి, అనేక విషయములలో విశిష్ట స్థానము నాక్రమించుకొనిన వేమన సర్వకాలీనమైన ప్రబోధ సందేశమును సమస్తజాతులకు ఒసంగ గలిగియున్నాడు. నైతిక విపర్యయము, దేనియందును దృఢవిశ్వాసము లేకుండుట, పెద్ద చిన్న అను మర్యాద నశించుట మొదలగు విషయములతో సంకీర్ణమైయున్న నేటి ప్రపంచమునకు వేమన నీతులు ఎంతో ఆవశ్యకమై యున్నవి. మనుజుడు మానవత్వముతో నడచుకొనినచో యీ భూతలమే స్వర్గమని ఆయన చాటలేదా? పురాణములు కల్పించిన స్వర్గమును పట్టుకొని ప్రాకులాడుచు, యీ ప్రపంచమును గుర్తించుట అవివేక మనలేదా? "మనము నిలుచుండియున్న చోట్లన్నియు పునీత తీర్థములని ప్రకటించలేదా, యీ రాయలసీమ సేద్యగాని బిడ్డ? ఆయనమతము మానవమతము, ఆయన ధర్మము ప్రేమవ్యాపకము, సర్వమానవ సౌహార్దము, సర్వభావ సమన్వయము! కులమత వర్ణవ్యవస్థలచే ఛిన్నాభిన్నముకాని, సార్వజనీన సౌభ్రాతృత్వమును స్థాపించుటే ఆయన పరమలక్ష్యము. అందువల్లనే వేమన అటు నాస్తికునికి, ఇటు అజ్ఞేయవాదికి గూడ (Agnostics) ఉపదేశ మొసగ గలిగియున్నాడు. ఆయన వేదాంతమునంతా సూత్రప్రాయముగా చెప్పవలెనంటే - తోడి మానవుల దుఃఖములను తన దుఃఖములుగా భావించువాడే మానవుడనిపించుకొనుటకు అర్హుడని - అనవచ్చును. అందుచేతనే, ఆధునిక ప్రపంచమునకు వేమన సందేశము ఎంతో అవసరమని, ఒప్పి ఉన్నదని భావించి, ఈ వ్యాసములను ఆంధ్రప్రపంచమునకు సమర్పించుచున్నాము.

## వేమనమతము - కొందరు పాశ్చాత్యుల అపార్థము ప్రత్యుత్తరము

పాశ్చాత్య పండితులు కొందరు వేమనను గురించి వెల్లడించిన నిర్ణయములు చాలవరకు పొరపాట్లుగా నున్నవి.
మచ్చుకు: - బ్రౌను "వేమన వాడుకభాషలో వ్రాసినందున ఆయన రచనలకు ప్రామాణ్యముగాని కవిత్వగుణముగాని అబ్బలేదు" అన్నాడు. ఈ కొలమానముతో.. చూచినచో, చాలమంది గొప్ప ఆంగ్లేయకవులు లెక్కకు రాకుండా పోవలసియుందును ఇక మ్యానాలు బ్రౌనుతో ఏకీభవించక భిన్నాభిప్రాయము కలిగియున్నాడు. "వేమన కవి అనుటలో సందేహము లేదుగాని, అంత మంచి కవికాదు" అన్నాడు ఆయన. వేమనలో ఛలోక్తిగాని, హాస్యముగాని అవహేళనముగాని అంతగా లేవన్నాడు. ఇంకొకచోట ఆయనే వేమన యోగ్యతను క్రిందుచేయకనే "కవికంటె వేమన పెద్ద వేదాంతి అనవచ్చును" అన్నాడు. మ్యాక్ డొనాల్డు మాతృభాష తెలుగే అయియుండినచో, దీనికి కేవలము భిన్నమైన అభిప్రాయమునే వెలిబుచ్చి యుందురు.

ఏమైనా కానీయండి ఈ యిద్దరు దొరలకు ఇంకొకదొర - క్యాంబెల్ తగినరీతిననే ప్రత్యుత్తరమిచ్చినాడు. చూడండి "వేమన ప్రజాకవి లోకకవి అనుటలో సందేహ మేమీ లేదు. ఆయన విద్వాంసులకుగాక, నిరక్షరాస్యులైన గ్రామీణపాటక జనమునకు వ్రాసినాడు. ఆయన పొందిన ప్రజామోదమునకు లోకప్రియతకు, ఆయన భాషాసౌలభ్యము శక్తివంతమైన శైలియేగాక, ఆయన అందజేసిన సందేశ సౌభాగ్యముగూడ కారణమై యున్నది. కేవల సాహిత్యకీర్తికాంక్షను లెక్కబెట్టక, ప్రాచీన ప్రబంధకవిత్వ సూత్రములనే తృణీకరించినాడు. ఇదే ఆయన చూపిన వివేకము! భారత దేశంలో, పురాతన

ప్రబంధ ఫక్కికిచెందిన కవిత్వ మెప్పటికిని సామాన్య ప్రజలలో వ్యాపింపజాలదు. ఎందుకంటే అధిక సంఖ్యాకులకు అది అర్థము. కాదు. గ్రంధకర్తలు ఇది గుర్తించినప్పటికిని, తమ ధోరణితప్పని, దానికిగా బాధపడలేకున్నారు. వారి లక్ష్యమంతా తమ పాండిత్యప్రకర్షను ప్రదర్శించి, అసాధారణమైన మారుమూల మాటలను, కఠినపదములను ప్రయోగించి, చదువురాని సామాన్యునికి అర్థముగాని విధముగ, ఒక ప్రయత్న పూర్వకముగనే కృతులనల్లుటయే! ఇదొక ప్రీతిగా భావించినారు. దీనికిదోడు, సామాన్య ప్రజలభాషకు కొత్తలైన వ్యాకరణ సూత్రములనే వీరు చేపట్టుచున్నారు. ఇట్లా సామాన్యవ్యక్తి మాట్లాడే వ్యావహారికభాషకు ఈ గ్రంథభాష ఎంతో దూరమైపోయినది. అంతచేతనే, ఒక మాదిరి సాధారణజ్ఞానము కలిగినవారికి, ప్రబంధములలో ఒకటిరెండు పొరటలలో ఇక్కడొక పదము, అక్కడొక సమాసముదప్ప మిగతనంతా అర్థము చేసుకోలేకపోవుచున్నారు. వేమనకు యీపెద్ద ఆడంబరశైలి సాధ్యమైయుండికూడా, దానిని ప్రయోగించుటకు ప్రయత్నమే చేయలేదు. మాట్లాడుకొన్నది మాట్లాడుకొన్నట్లు, ముక్తసరిగా సరళమైన పదాలతో ధారాళముగ కవిత్వము చెప్పినాడు - వేమన. ఇదే ఎప్పుడూ అర్థమై సదా జీవశక్తిని కోల్పోక నిలిచి ఉండగలదు."

గోవెర్ గూడ వేమనపట్ల తగిన మర్యాద చూపలేదు. ఆయన నైతికావేశములో వేమనను తిరువళ్లువర్ కంటే చాల క్రిందిస్థానములో బెట్టి, కవితాశక్తిలో ఇంకా దూరముగా నెట్టివేసినాడు.

## వినయకుమార సర్కార్

ఈ గోవెర్ సిద్ధాంతమునకు కేవలము వ్యతిరేకముగా, "ఆచార్య వినయకుమార సర్కారుగారి బలవత్తరాభిప్రాయమిట్లున్నది (సర్కారు ఆధునిక ప్రజ్ఞశాలుర లో ఎన్నదగినవారు. "హిందూసమాజ శాస్త్రమునకు వాస్తవిక ప్రాతిపదకము"- The Positive Back-ground of Hindu Sociology అన్న పుస్తకములో చెప్పిన సంగతు లివి.)

ఈ భౌతిక "తమిళ కురళ్ నందలి భక్తిపారవశ్యము, సమతాభావములను వేమన తన పద్యములలో ప్రవహింపజేసి, సాహిత్యమును విప్లవ సీనూపరిసరములకు గొనిపోయినాడు. సంపత్స్వామ్యములు అసమతల పట్ల ఆయన పలికిన కుత్సవము, కులభేదములు పుట్టించిన వైకల్యమును దైన్యమును గర్హించుపట్ల గూడ తిరువళ్ళువరుకు వేమన తీసిపోలేదు. ఉదారాశయములందును, వాస్తవికదృష్టి యందును వెనుకపడలేదు...హిందువుల పరమసత్యస్వరూపమైన జ్ఞానవిషయములలో వేమన స్థానము కబీరు (15వ శతాబ్దము) వంగచైతన్య స్వామి (1486-1533) మొదలగు వారికంటే పైన కాకపోయినను సమపక్తిలో మాత్రము తప్పదు".

కొందరు పాశ్చాత్య పండితులు వెల్లడించిన అభిప్రాయాలు విలువల విషయములో, మనమంతగా అంగీకరించ లేకపోయినను, వారి అకుటిలతను సారళ్యమును మాత్రము సందేహించలేము. అంతేగాకుండ, వారు వేమనకు జేసిన సేవను విస్మరించలేము. వేమన అంటే తెలుగుపండితులు. అసహ్యించుకొనే ఆ దినాలలో, ఈ పరమటి దేవవిద్వాంసులు ఆయనయందు ఆయన కవిత్వమునందు తీవ్రాసక్తిని జూపి, ఆయన సందేశమును నిర్వచించి ప్రపంచమునకు దెలుప ప్రయత్నించినారు. నిజంగా వారిశ్రమయే లేకుండినచో, కష్టము మీదనైనా ఆంధ్రసారస్వత సంస్థలు, నేడు యీపాటిగానైనా వేమనను గుర్తించియుండవు.

## వేమనను గుర్తించిన ఆంధ్రులు

నిజనిశిత విమర్శక ప్రజ్ఞకు వేమనపట్ల వినియోగించిన ప్రప్రథమ పరిశోధకుడు కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావు (1877-1923) ఆంధ్రదేశమున సాహిత్య చారిత్రక పరిశోధనలకు మార్గదర్శకుడైన వారు నిజంగా లక్ష్మణరావుగారే! ఆయనను అనుసరించి మరికొందరు వేమనపట్ల శ్రద్ధ చూపినారు. వీరిలో విశ్రుతులు: వంగూరు సుబ్బరావు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, శేషాద్రి రమణ కవులు, వేటూరు ప్రభాకరశాస్త్రి (1888-1950) బండారు తమ్మయ్య, చాగంటి శేషయ్య (ఆంధ్ర కవి తరంగిణి, 44వ సంపుటము), వేదం వేంకటకృష్ణశర్మ, (శతక వాఙ్మయ సర్వస్వము, 1954) మొదలగువారు. వీరందరు తమతమ శక్తికొలది కృషి చేసినారుగాని, వేమన జీవితమును క్రమ్మియుండిన చిమ్మచీకటిని పారద్రోల కలిగినంత కాంతిశక్తి వారు వెలిగించిన తిళ్ళికలకు లేకపోయినది.

వంగూరు సుబ్బరావు 1922లో సవిమర్శకముగ వేమన జీవితమును వ్రాసినాడు. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారు. 1928లో, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు యాజమాన్యమున, రఘుపతి వెంకటరత్నం నాయుడి ధర్మనిధి సహాయమున సాగించబడిన ఉపన్యాసములలో వేమన ఉదంతమును విపులముగ చర్చించినారు. పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి వేమనయోగి. చరిత్రమును వావిళ్లవారు 1917లో ప్రకటించినారు నేదునూరి గంగాధరం (ఈ మధ్యనే మరణించిన నిరుపేద అయిన సాహిత్యోపాసకుడు; రాజమండ్రి, చాకలి కులస్థుడగుటచే ఆయన విద్యావ్యాసంగములు అమూల్యములు - పవిత్రములు) గారి "మహాయోగి వేమనకవి" మొదలగు పుస్తకములు గూడ లెక్కించవలసినవే! గంగాధరం 5010 వేమన పద్యములను 1960లో ప్రకటించినారు.

సి. రామకృష్ణరావు ఇంగ్లీషులో వేమనచరిత్ర వ్రాసియున్నారు. ఇది పుక్కిటి పురాణములతో నిండియున్నది. డాక్టర్ జి.వి. కృష్ణరావుగారు (ఆకాశవాణి, విజయవాడ) "వేమన, ఆయన కవిత్వము - వేదాంతము" అను ఆంగ్ల గ్రంథమును 1958లో వెలువరించినారు.

## పూర్ణయాచార్యులు

వేమన చరిత్ర మొట్టమొదట 1913లో తెలుగులో వ్రాసినది - మచిలీపట్టణ వాస్తవ్యులు - ఆర్. పూర్ణయాచార్యులు వీరు జిల్లా పోలీసు ఆఫీసులో గుమస్తాగా పనిచేయుచుండినారు. ఈయన ఆర్థికముగా దరిద్రుడైనను, ఎక్కువ చదువు లేకున్నను, వేమన భక్తిలో మాత్రము పూర్ణైశ్వర్యవంతుడు. నోట పల్లింపబడుచుండిన పద్యములనెల్ల ఎత్తి వ్రాసికొని, వేమన పద్యముల తాళపత్ర గ్రంథమునుగూడ ఒక దానిని సంపాదించినాడు. దీనితో బ్రౌను ప్రారంభించిన కృషిని ముందుకు సాగించదలచుకొనినాడు. "వేమనయోగీంద్ర చరిత్రము" "వేమన సూక్తి రత్నాకరము" అను ఈ రెండు సంకలనములలో 4035 పద్యము లుండినవి. ఇందు వేమన జీవితమును గూడ పొందుపరచినాడు. కాని, అవి చాలవరకు ఊహాచిత్రములు. ఇవి గాక ఇంగ్లీషులో వేమనను గూర్చిన చాలపుస్తకములు వెలువడియున్నవి.

## కట్టమంచివారి బాంబు

క్రమేణా వేమన సారస్వత ఖ్యాతి వ్యాపింపజొచ్చినది. దీనికి తోడుగా, భారతదేశములో మారుచూ వచ్చిన సాంఘిక మత నైతిక వాతావరణము వలన ఆంధ్ర పండితలోకము వేమనపట్ల ఉద్దేశ పూర్వకముగా ప్రదర్శించిన ఉపేక్ష నీరవగర్షణము ఇక ఏమాత్రము గాని నిలచి మనుటను సాధ్యము కాకపోయినది. వీటి అన్నిటికంటే డాక్టర్ కట్టమంచి రామలింగా రెడ్డిగారి కవిత్వతత్త్వ విచారము" అను ప్రధమ ఆంధ్రసాహిత్య విమర్శక గ్రంధము (ప్రేలుడు కోపులతో నిండియుడినది. " 14 దాని ప్రయోగముతో అభేద్య మనుకొనుచుండిన సాంప్రదాయక సాహిత్య దుర్గభిత్తికలలో మొబైలుపడినవి. ఇది 1914 నాటి ఉదంతము.

డాక్టర్ సి.ఆర్. రెడ్డి తమ తండ్రి " సుబ్రహ్మణ్య రెడ్డిగారి వద్దనే, చిన్న నాటనే ప్రబంధములు బాగా చదివినాఁడు. ఆ తర్వాత, మదరాసు కేంబ్రిడ్జిలయందు, సాగించిన ఉన్నత విద్యాభ్యాసము, పాశ్చాత్య వాఙ్మయము నందలి శ్రేష్టతమ విషయములను ఆయనకు గరపినది. నిశితప్రజ్ఞ ప్రభాభాసితమైన స్వరణ, చతురోక్తి ఆయన పుట్టుకతోనే ఒంటబుట్టినవి స్వభావముచేత శిక్షణము ఆయన దృక్పధము అధునాతనమైనది. దైవదత్తమైన ఈ గుణ పుంజము నంత ఈ విమర్శక గ్రంధమున క్రుమ్మరించినాడు. అది ఒక బాంబువలె సాహిత్యరంగమున పడి, ప్రేలి పాత అపోహలను మూఢవిశ్వాసములను తునాతునుకలుజేసి, చాలవరకు నిర్మూలించినది. ఇప్పటికిని ఆంధ్రసాహిత్య విమర్శకరంగమున అదియే తలమానికము ఒక యుగాంతరమును సృష్టించిన యీ గ్రంధమున - ఆంధ్రదేశమున ఉద్భవించిన మహాకవులలో వేమన అవతంసమని, నిర్మాణాత్మకశక్తి గలవాడని, వైతాళిక గీతము నాలపించినాడు- డాక్టర్ సి ఆర్ రెడ్డి ఫలప్రదమైన . భావనాశక్తియందును భావప్రకటన గాంభీర్యమునందును మూఢాచారముల కృత్రిమాచ్ఛాదనమును ఎగురగొట్టి వేయుటయందును కపటనటనలను బయటపెట్టి పరిహసించుటయందును, ఆంధ్రవాఙ్మయమున వేమన ఉన్నతోన్నతుడని రామలింగా రెడ్డిగారు. తమ "కవిత్వ తత్త్వవిచార" మందు ప్రతిపాదించినారు.

ఇక, పాతపండితులు వేమన వాణినిని, కవిత్వమును శిరసా వహింపక తప్పినదిగాదు. ఆయన వ్యక్తిత్వము అప్రతిహత శక్తితో సంఘమును కంపింపజేసి, అజేయముగ వెలిగిపోయినది. అసూయ, ఆచారమౌఢ్యములే అడ్డు రాకుండినచో వేమన ఎప్పుడో అనురుడైపోయి. యుండెడివాడు. ఆయన కాలములోనే ఆయన ఒక పురాణ పురుషుడై పోయినాడు.

కడపటిమాట వేమనను బయటి ప్రపంచమునకు, ఇంకను ఎక్కుడుగ - తిరువళ్లువరు మొదలగు వారివలె ఎరుకపరచవలెనని మా అభిమతము. ఆ తమిళ మహాకవి వలెనే వేమనగూడ విశ్వకవి!

## సర్ జి.వి. గ్రీర్సన్

వేమన ఆంధ్రప్రజాబాహుళ్యమున ఎంత సంస్తవనీయుడై గౌరవింపబడినాడో "సర్. జార్జి అబ్రహాం గ్రీర్సన్ మాటలే సాక్షీభూతములు "వేమన నేటి తెలుగు కవు లందరిలోను ఎక్కువ ప్రజాభిమానమును పొందిన వాడు. ఇప్పుడు వాడుకలో నున్న ఏ చాటువుకు గాని, సామెతకుగాని, అర్ధపూర్ణమైన నీతిసూత్రమునకుగాని, వేమన కర్తృత్వము అంటకట్టబడనిది లేదు." ఈ వాక్యములు, "భారతసామ్రాజ్యమున దేశభాషాసాహిత్యము" అను గ్రంథభాగమున, (Vernacular Literatures in the Indian Empire) వ్రాయబడియున్నవి. ఈ పుస్తకము "ఇంపీరియల్ గజేటీర్ ఆఫ్ ఇండియా" అను బృహద్గ్రంధమునకు అవతారిక భాగము. సరియైన విధమున వేమన గుణవిశేషములను చిత్రించినచో, ఆయన, కవితాసౌభాగ్యము రచనాశక్తులవల్లనేగాక, మానవాళిపై ఆయన చల్లిన ప్రేమరసమువల్లను సర్వప్రపంచహృదయమును

లోబరచుకోగలదు. ఆయన కోసము నింద అవహేళనము, అసూయా ప్రేరకములు గావు. పొరపాటుబడుచున్న మానవుల ధోరణిపట్ల ఆయనకు కలిగిన ఆవేదనమే. ఈ రూపమున బయటపడినది. మానవుడు ఈ లోపముల నన్నిటిని పోకార్చుకొనవలెననియే ఆయన స్వచ్ఛకాంక్ష మానవుడు సగౌరవముగా, ఈ భూమిలో తల ఎత్తుకొని తిరిగి స్వతంత్రముగ మనవలయుననియే ఆయన వాంఛ. మానవస్వాతంత్ర్యము సమానత్వము ప్రతిష్టను ఆకాంక్షించే ప్రపంచ దార్శనిక మహాకవులలో వేమన సర్వోత్తముడు.

ఇంతటి మహాపురుషుని జీవితవిశేషములు పురాణగాథల అంకమున నిదురించుచుండుట విచారకరము. చరిత్ర రచయితలు ఒకరు చెప్పినది ఇంకొకరు చెప్పక విషయమును గచ్చపొదచేసి యున్నారు. అయినప్పటికిని వేమన శాశ్వత చారిత్రక మహాపురుషుడు.

## NOTES AND REFERENCES

- ❖ 1 ఎం. శేషాచలం కంపెనీవారు ప్రచురించిన గ్రంథములోని పీఠిక భాగములను కొన్నిటిని, శ్రీ నార్లగారి సౌజన్యముతో ఇందు పొందుపరచుచున్నాను.
- ❖ 2. గ్రీకు వేదాంతి సోక్రటీస్ ఇదే భావమును వెలిబుచ్చినాడు చూడుడు - కట్టమంచి వారి వ్యాసమున సోక్రటీసును గూర్చిన పుట్టి నోటు. ఇట్లే వివేకానందస్వాములవారు విమర్శించి, పురాణములను వాటి కవితాశిల్పమునకే చదువవలెననరి సుడిచినారు.
- ❖ 3. ఈ కావలి సోదరులు నలుగురు వీరందరికి చరిత్రలో స్థానముగలదు. ఇందు వెంకట రామస్వామి ఒకరు. (1765-1840) వీరు బ్రాహ్మణులు కలకత్తాలో "లిటరరీ ఆన్లిక్వేరియన్ డిపార్టుమెంటు" (ప్రాచీన భాషాశోధకశాఖ) లో అనువాదకుడుగా పండితుడుగా రామస్వామి పనిచేసినాడు. "విశ్వగుణాదర్శము" అనే సంస్కృత గ్రంధమును ఇంతకుముందే ఇంగ్లీషులో వ్రాసియున్నాడు. గవర్నర్ జనరల్ విలియం బెన్టిటిక్ ప్రభువుకు ఈ దక్కను కవుల చరిత్రను అంకితమిచ్చినాడు. ఈయనకు అప్పటి ప్రభుత్వ ప్రాంగణములలో మంచి పలుకుబడి కలిగియుండినట్లున్నది. ఈయనే రామరాజభూషణుని వసుచరిత్రను గూడ ఇంగ్లీషులోనికి అనువదించినాడు. ఈ ఆంధ్ర ప్రబంధము తమిళము సంస్కృతములలోనికి గూడ మార్చబడియున్నది ఇట్టి గౌరవము ఏ యితర ఆంధ్ర గ్రంథమునకుగాని కలుగలేదు.

కావలి సోదరులలో మిగత ముగ్గురు వెంకటబోరయ్య (బొజ్జయ్య?) వెంకటలక్ష్మయ్య, వెంకటనారాయణస్వామి, కర్నల్ మెకంజీ, దక్షిణభారతములో వివిధ స్థానిక చారిత్రక విషయములకు (కైఫీయత్తులు) సేకరించుటలో ఈ సోదరులు తోడ్పడి ప్రధానపాత్ర వహించినారు. వీరు ఆ దొరను అత్యంతము గౌరవించి, తిరిగి ఆయనచే గౌరవింపబడినారు.

మొదట, బోరయ్యకు మెకంజీ పరిచయము, సోదరుడు నారాయణస్వామిద్వారా హైదరాబాదులో కలిగినది. బోరయ్య తెలివితేటలను శక్తిసామర్థ్యములను గ్రహించిన మెకంజీ వెంటనే ఆయనను హెడ్ క్లర్కుగాను దుబాసి గాను (ద్విభాషి) నియమించినాడు. మెకంజీ సేనాధిపతిగా, టిప్పుసుల్తాన్ మైసూరు రాజ్యముపై దండెత్తి, శ్రీరంగపట్టణమును ముట్టడించినప్పుడు, ఆయనవెంట బోదయ్య పోయి, ఆదొర విజయమును కీర్తించుచు ఒక తెనుగు కావ్యమును వ్రాసినాడు. ఈయన తెలుగు కన్నడ శాసనములను చదివిచెప్పి దొరకు చాల సహాయము చేసినాడు. దీనికై ఎంతో ప్రశంసల బొందినాడు **బోరయ్య.**

చిన్న వయసులో బోరయ్య చనిపోగా, ఇంతటి వివేకవంతుడే అయిన, ఆయన సోదరుడు - లక్ష్మయ్యను. మెకంజీ దొర, ముఖ్య అనువాదకుడుగా నియమించినారు. దొర మరణానంతరము ఆయన ఆస్తిలో 10వ శాతం లక్ష్మయ్యకు చెందవలెనని మరణశాసనం (విల్, 3-6-18117 వ్రాసినాడు. లక్ష్మయ్య అంటే మెకంజీ ఎంతో అభిమానం.

❖ 4 అప్పకవి అనుశాసనమిది

తే. ఉపమగలిగిన శయ్యల నొప్పియున్న
సంఘీభవుని కావ్యంబు గ్రాహ్యంబుగాదు;
పాయసంబైన, సంస్కార పక్వమైన
కాక జుంబు పావ్యంబు గానియట్లు!

❖ 5 క్యాంబెల్ 1770 సంవత్సర ప్రాంతాన జన్మించినవాడు క్రైస్తవ మిషనరీగా భారతదేశమున, ఉరామరికిగా 31 ఏండ్లు ఉండినాడు. దేశీయదుస్తులు తొడిగి ప్రజల ఆచార వ్యవహారములను అవలంబించి, వారి మధ్యనే నివసించుచుండినాడు. 1792-1823 సంవత్సరముల మధ్య వెలసియుండిన హిందూ సంఘస్థితిని చక్కగా, ఉన్నది ఉన్నట్లుగా ఈయన పుస్తకము వర్ణించుచున్నది.

❖ 6. తిరువళ్ళువరు తిరుకురళ్ అను తమిళ నీతిగీతమంజరిని వ్రాసిన ఈ మహాకవి వెళ్ళాళ (కృషికజాతి) అని కొందరు అందురు. భగవాన్ అను బ్రాహ్మణునికి ఇది అనుపరయ (చండాల) స్త్రీకిని బుట్టినవాడని. మరికొందరి వాదము. ఎట్లనైతేనేమి అగ్రవర్ణమునాడు మాత్రము కాదు ఈయన కాలమును గూర్చి మతభేదములున్నవిగాని, క్రీస్తుశక ప్రథమశతాబ్దము వాడనే వారే ఎక్కువ ఈయన ధర్మార్థకామములను (అర, పొరుల్, జబం) మూడింటినే వర్ణించి మోక్షమును వదలివేసినాడు. ఈయన నివాసము మదరాసు తిరువత్తియూ రందురు. ఈయనకే నేడు ద్రావిడ మున్నేట్రకషగంవారు బ్రహ్మరథము పట్టేది.

❖ 7. ఈ మతగురువు-దూబాయ్ అన్నివిధములా ఒక అసామాన్యవ్యక్తి. ఈయన ఎత్రాగెరెసెన్స్ మఠాలయమునకు సంబంధించిన మిషనరి పరాసు విప్లవము రేగుటకు రెండేండ్లు ముందుగా భారతదేశమునకు వచ్చి, దక్షిణమున ముప్పై యేండ్లుండినాడు. ఎక్కువ కాలము తమిళనాడులోనే నివసించినాడు. హిందుసంఘ మర్యాదల లోతుపాతులను చక్కగా ఎరుగుటకు ఆయనే చెప్పుకొనినట్లు - "ఆ దేశ ఆచార వ్యవహారములను అలవరచుకొని, చాల విషయాలలో దేశీయుల మూఢభావములనే స్వీకరించి, వారివలెనే జీవితము సాగించి, హిందూ మతమును స్వీకరించుటదప్ప మిగత వాటినన్నిటిని పాటించినాడు" హిందువుల జీవితము తోడి యీ సంపూర్ణతాదాత్మ్యమువలన, దూబాయ్ హిందువులలో వ్యాపించియున్న ఆచార వ్యవహారములను, మతవ్రతనిష్ఠలను, యధార్ధస్థితిలో వర్ణించుటకును, హిందువుల మనస్తత్వమును బాగుగ విశదీకరించి విమర్శించుటకును యీ పరాసువిజ్ఞానికి తోడ్పడినది.

❖ 8 1911కు ముందే వావిళ్ళవారు బ్రౌనుగారి 693 పద్యములను మూడు భాగములుగా, ఇంగ్లీషు టీకతో, అకారాది పద్యసూచికతో ముద్రించియున్నారు. 1911లో రెండవ కూర్పు వచ్చినది. 1955లో తృతీయ ముద్రణము వెలువడినది.

❖ 9 స్మిత్ విషయము నేను చేర్చినది. అనువాదకుడు..

- ❖ 10 ఈ గ్రౌణ్యమును ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు, ఉన్నది ఉన్నట్లుగా, కొత్త ముద్రణమును వెలువరించగా, ప్రతులు చాలా తొందరగా అమ్ముడుపోయినవి. దీని పునర్ముద్రణమునకు ప్రయత్నములు జరుగుచున్నవి. ఈ లోపల బ్రౌను ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ ముద్రణమును గూడ ప్రారంభించియున్నారు.

- ❖ 11. (పూర్ రిచ్చర్డు) విషయమై డాక్టర్ బార్నెట్రి "ఉపదేశకుడు ప్రవక్ష" అనే వ్యాసము Poor Richard నందలి పుట్ నోటు దయచేసి చూడండి.

- ❖ 12. భారతముగూడ అట్లే చెప్పుచున్నది.

నగములెల్ల పుణ్యనగములు, నదులెల్లం.
బుణ్యనదులు, వినుము భూసురాగ్ర
గణ యకలుషం అర్థము మనంబాలు
నాత్మతీర్థమెఱుఁగ నకలుషునకు (అంతి 5:236)

- ❖ 13 విజయకుమార్ సర్కార్ (1887-1949) మహత్తర ఉపజ్ఞాశోభితుడు బెంగాలీ యందును ఇంగ్లీషునందును మనోజ్ఞమైన శైలిలో ధారావాహికముగ అనేక గ్రంథములు వ్రాసియున్నారు. సమాజశాస్త్ర నిపుణుడుగా, ఆర్థికశాస్త్ర విశేష్యుడుగా అంతర్జాతీయఖ్యాతిని గడించినారు ఈ విజ్ఞానానికి అనేక దేశములు ఈయనను సమ్మానించినవి. ఈయన పుస్తకములు చాల భాషలలోనికి అనువదింపబడి ఆమోదింపబడియున్నవి.

- ❖ 14 రామలింగారెడ్డిగారు. తమ "కవిత్వ తత్త్వవిచారము"న వేమనను గూర్చి ప్రస్తావించిన భాగమిది - "జన్మముచేతన కవిగా వలయుఁగాని, పఠనము అభ్యాసము - నివి యుండిన మాత్రము చాలదు. తోడంబుట్టిన చాతుర్యముండినచో నివి సహాయభూతములై వృద్ధిని వికాసమును కల్పింపవచ్చును. స్వాధీనంబగు మనోగాంభీర్య సలపడియుండదేని, కృషిచేయుట విత్తునాటక యెరువు పఱచినట్లు, కొన్ని పురుగులు మాత్రము సృష్టికి వచ్చేనేమో!

*"ఈ తత్వమునకుఁ బ్రమాణమైనవాఁడు వేమన ఇతనికి పుస్తకజ్ఞానము ఇంచుమించు సున్న వ్యాకరణము ఛందస్సు అలంకారశాస్త్రము మొదలగు వానిలో నీతనికాసక్తి ఎంత తక్కువో భక్తియు సంత తక్కువ అట్లుండినను వేమనను మహాకవులలోఁ జేరినవాడఁని చెప్పుటకయి. సామాన్యముగ శుష్క పండితులుదప్ప నింకెవరును సందియంబదరు. కుటిల కులాచారములు మూఢభక్తి వేషధారితనము మొదలగువాటిని దూలనాడుటయం దీతం దద్వితీయుఁడు, గొప్ప రహస్యములను బోధించినవాఁడైనను, తనకుం గల నైజబుద్ధివేకాని, పలుదెఱంగుల విపరీత వ్యాఖ్యానములకు బాలగు శాస్త్రముల నాశ్రయింపలేదు. అనేకులు, సిద్ధాంతముల కాధారములు ప్రాచీన సూత్రములని నమ్మి, వానిని వల్లించుటకై జ్ఞాపకశక్తిని వృద్ధిజేయుచు మనశక్తిని గోల్పోయెదరు. ఇక వేమనయన్నను కారణ విమర్శకశక్తికిఁ బట్టాభిషేకముంజేసిన మహాత్ముఁడు. ఇతని పద్యములన్నియు లోకోక్తులు. అనఁగా - బలికిన వాంగీతందయ్య, బలుకఁ బడినమాటలు లోకమువారి హృదయములలో బూరమే యుండినట్టివియో, లేక అతనిచే నచలముగ నాటఁబడినట్టివియో యైనవనుట. ఇతని పద్యములలో పరిహాసము చట్టము, మఱుగు మరియాదలులేని మోటు విధముగఁ దిట్టుఁడు, నొప్పిఁజెందువాఁడు సైతము ఇతరులతోఁ గలసి నవ్వునట్లు చేయఁగల సమర్థుఁడు గాయము కనుపించకయు నెత్తురు కాజకయు నుండునట్లు శరీరమును ఛేదింపఁజాలినంత మిగుల వాడిగల కత్తినొకదానిని, పూర్వము విశ్వకర్మ పన్ని శిల్పియొకండు నిర్మించెనని గాథయొకండు కలదు. ఆ కత్తితో ముత్ప్రేక్ష్యములు నుపమేయములుడైన యవి, యాంధ్రదేశమున నిమ్మహనీయుని పద్యములే గాని, వేరెవ్వియులేవు. "అరిది విలుకాని*

*యుజ్జల తరమునకును" అల్ట్ గుల్ పదను పాతమును రావు నిదర్శనములం జూపుటలో నితఁ చర్చితీయుఁడు. మరి యవి. యెవ్వియు గూఢములుగావు, స్పష్టములు నేసన స్థాపింపబబడిన సామ్యములట్లు దిక్కు వర్ధమును లేనివిగావు. వైశర్యమనుగులు మితని యందు ప్రబలము మనము ప్రతిదినమందును జూచుచు నితేకదా!! యని యాదరము నవధానము నుంచపోవు విషయములనే ఈతఁడు గ్రహించి, భావనాశక్తిచేఁ గాంతి రూపము ప్రాణము నా వహించండి. మనయెదుట నిలువఁగా, నుపుడు గుర్తుతెలియక పూర్వము మనచే గరింపఁబడిన వైయ్యును నివియే అమానుష విగ్రహములని విస్మయముఁజెంది గౌరవింతుము. ఈ గారడీవిద్యలో రెనుఁగున నితలయ ప్రధముందు. సామాన్యవస్తువుల కేడ నౌక కామరూపమునిచ్చి వెలయించుట ఈతని మాహాత్యములలో మొదలింటిది. ప్రకృతి స్వరూపములను ఎంత చక్కంగా దన సృష్టిభావములతోఁజూచి, యొకడు, రెండుమాటతోనే యచ్చుటచ్చుట వానిని సాక్షాత్కరింపఁ జేసియున్నాడనుట, వేరు నేనొత్తి చెప్పవలయునా? ప్రకృతియనఁగ మనవారిలో ననేకులకు నిఘంటువులలో నుండు ప్రకృతియేగాని మూడింటికి బయటనున్న ప్రకృతి యెట్టిదో తమ సొంత కనులతోఁ జూచిన పాపమునబోరు. అట్టివారికి వేమన యనుసరణీయమగు త్రోవజూపించి నాఁడనుటలో నించుకయు గుణాధిక్య స్తుతిలేదు. '*

- 15 రామలింగారెడ్డిగారి తండ్రి సుబ్రహ్మణ్యరెడ్డిగారు చక్కటి ఆంధ్ర పండితుడు "భారత సార రత్నావళి - "భాగవత సార ముక్తావళి" అను రెండు సంకలన కావ్యములను ప్రచురించి, ఆ రెండు ఇతిహాసములయందలి రసవత్తర పద్యములపట్ల ఆంధ్రులకు అనురక్తిని కలిగించినారు.
- 16. సర్ గ్రీరసన్ (1851-1941) వివిధ సాహిత్యశాఖలలో బహుముఖపాండిత్యము విశేష ప్రజ్ఞ గలవాడు. ఈయన 1873లో ఇండియన్ సివిల్ సర్వీసు (ఉద్యోగము) లో చేరి, 1903 ఉద్యోగవి రమణమును గావించినాడు. అనేక భారతీయ భాషల పరిజ్ఞానము కలిగిన యీయన భారతదేశభాషాసమగ్ర సమీక్ష కార్యమున (Linguistic Survey of India) నియమితుడై, స్థిర స్థాయియైన పనిచేసి పేరొందినాడు. వీరి యాజమాన్యమున సేకరింపబడి రచింపబడి ముద్రింపబడిన పెద్దపుస్తకములు, భారతదేశభాషా విషయికమైన విపుల విషయకోశములు.

**- అను: మరుపూరు కోదండరామరెడ్డి**


**మనవి**

శ్రీ కందుకూరి వీరేశలింగం, శ్రీ గురజాడ అప్పారావు తదితర తెలుగు ప్రముఖులపై పరిచయాల సంపాదకీయాలు నార్ల రచనలు ఏడవ సంపుటంలో ఉన్నాయి. చూడండి.

భారతీయ సాహిత్య నిర్మాతలు

# వీరేశలింగం

**అనువాదం: జి. లలిత**



## ఉపోద్ఘాతం

ఆధునిక భారతీయ పునరుజ్జీవనపు తొలికిరణాల కాంతిరేఖలు 18వ శతాబ్దం చివరిపాదంలో పొడసూపినట్లు గుర్తించవచ్చు. అయితే ఆ నూతనోత్తేజం పందొమ్మిదో శతాబ్దపు ప్రథమపాదంలోనే జవాన్నీ, వేగాన్నీ పుంజుకున్నది. ఆ నూతనోజ్జీవనానికి మార్గగామి వంగరాష్ట్రం భారతదేశంలో శక్తివంతమైన పాశ్చాత్య విద్య సంస్కారాల ప్రభావానికిలోనై నిర్జీవమైన గతకాలపు బంధాలను విడిపించుకొన్నట్టి ప్రథమరాష్ట్రం వంగరాష్ట్రమే. ఉపనిషత్తులయుగాన్ని, బౌద్ధయుగారంభాన్ని తలపించే స్వతంత్రాలోచనాసరళితో బెంగాలీ . మేధావులు ప్రతిసిద్ధాంతాన్ని ప్రశ్నించారు.
ప్రతి విశ్వాసాన్ని పరీక్షించారు. ప్రతి ఆచారాన్నీ, సంప్రదాయాన్నీ శోధించారు. భారతీయ సంప్రదాయంలో అర్ధరహితమై, ప్రగతి నిరోధకమై క్షీణించివున్నట్టి ప్రతి అంశాన్ని ధైర్యంతో నిరాకరించి, పాశ్చాత్య ప్రపంచంనుండి సహేతుకమై, శాస్త్రీయమై, స్వతంత్రమై ప్రగతిశీలమైనవాటిని ఆదరంతో ఆహ్వానించారు. పాశ్చాత్య వ్యామోహంలో కొందరు తాగుబోతులయ్యారు. మరికొందరు పూర్వాచార పరాయణులైన హిందువుల ఇండ్లలోకి గొడ్డు మాంసాన్ని విసరివేయడం వంటి వెర్రి పనుల్ని కూడా చేశారు. వారి ప్రవర్తన అస్తవ్యస్తంగా కనిపించినా వారే నవోదయ వైతాళికులు.

ఈ నూతన పునరుజ్జీవం బెంగాలునుండి ఆంధ్రదేశానికి ప్రయాణం చేయడానికి చాలకాలమే పట్టింది. 19వ శతాబ్దపు తుదిపాదంలో ఆంధ్రదేశంలో ప్రవేశించిన ఈ ఉద్యమానికి కందుకూరి వీరేశలింగం అజేయుడైన ఆశ్రయదాతగా నిలిచాడు. ఈ పునరుజ్జీవనోద్యమం ఆంధ్రదేశానికి ఆలస్యంగా వచ్చినందువల్ల వంగరాష్ట్రంలో రాజా రామ్మోహన్ రాయ్ నిర్వహించినటువంటి కార్యభారాన్నే కాకుండా, మతసంస్కర్తలైన దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశబ్ చంద్రసేన్, శివనాథ శాస్త్రి వంటివారి కృషిని కూడా వీరేశలింగమే చేపట్టవలసివచ్చింది. అంతేకాకుండా సాంఘిక విద్యారంగాలలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ తలపెట్టినట్టి సంస్కరణల్ని ప్రవేశపెట్టడానికి కూడా వీరేశలింగమే పాటుపడవలసి వచ్చింది.

బెంగాలీభాషలో రామమోహన్ రాయ్, విద్యాసాగరులు స్థాపించిన నూతన వచన రచనల స్వరూపం తనకు తెలియకపోయినా, నూతన భావాలను ప్రచారం చేయడానికి తెలుగులో నవీన రచనాశైలిని వీరేశలింగమే రూపొందించ వలసి వచ్చింది. అలాగే బంకించంద్ర ప్రభావం ఏమాత్రం సోకకుండానే వీరేశలింగం స్వయంగా తెలుగులో ఒక నూతన సాహిత్య ప్రక్రియకి శ్రీకారం చుట్టగలిగాడు. ఇవన్నీ మానవశక్తికి అతీతమైన కార్యాలే. ఇట్టి బహుముఖమైన కార్య నిర్వహణలో ఆయన వెనకాడలేదు. బెదరలేదు. సర్. రఘుపతి వేంకటరత్నంగారి మాటల్లో చెప్పాలంటే వీరేశలింగం "బహుమేధావుల సమైక్యమూర్తి". కాబట్టే మానవాతీతమైన అనేక కార్యాలను సర్వసాధారణమైనవిగా గ్రహించి సునాయాసంగా నిర్వహించాడు. తుదకు తాను ఏ ప్రజలమధ్య పుట్టాడో వారి జీవితాలపై ప్రబలమైన తన వ్యక్తిత్వపు ముద్రను వేశాడు. వారిని మధ్యయుగాల మొద్దునిద్రనుండి మేల్కొలిపాడు, వారి అజ్ఞానాన్ని చురకలతో విడిపించాడు. అనేక మూఢనమ్మకాల్ని తొలగించాడు. వారి జీవితాల్లో ఆధునికమూ, ప్రగతి పదమూ, మానవతాశీలమూ అయిన నూతన దృక్పథాన్ని కల్పించాడు.

రాజాజీ అన్నట్లు: "వీరేశలింగమే అవతరించి ఆంధ్రజాతిని చైతన్యవంతం చేయకపోతే ఆంధ్రదేశం, ఆంధ్రప్రజలు ఈనాడున్న స్థితిలో ఉండేవారు కారు క్రియాశీలత, మహాసాహసం, దూరదృష్టిగల భారతీయ మహనీయుల్లో ఆయన ఒకడు, అసత్యాన్ని ధైర్యంగా ఎదుర్కొవడంలో అభ్యుదయమార్గంలో వీరాధివీరునివలె సాహసాన్ని ప్రదర్శించాడు."

పై వాక్యాల్లో రాజాజీ ఆంధ్రదేశం అని పేర్కొన్న ప్రదేశం వీరేశలింగం జీవితకాలంలో మద్రాసు సమైక్యరాష్ట్రంలో ఒక భాగం మాత్రమే. తమిళనాడు యావత్తూ, మైసూరు, కేరళలో కొన్ని భాగాలు అప్పట్లో మద్రాసు రాష్ట్రపు పరిధిలోనే వుండేవి. వీరేశలింగం పంతులు కొన్ని సంవత్సరాలు మద్రాసులో నివసించడంవల్ల, తరచూ బెంగుళూరుకు రాకపోకలు కొనసాగించడంవల్ల ఆయన ప్రభావం ఆంధ్రదేశంలో ప్రసరించినంత గాఢంగా కాకపోయినా కొంతవరకు దక్షిణాది అంతా వ్యాపించింది.

మహదేవ్ గోవింద రానడే చాటినట్లు వీరేశలింగం నిజంగానే "దక్షిణాది ఈశ్వరచంద్ర విద్యాసాగర్. ప్రవృత్తినిబట్టి, శిక్షణవల్ల వీరేశలింగం రచయిత. కాని ఆయన కేవలం సాహిత్యవ్యాసంగానికి మాత్రమే తన కృషిని పరిమితం చేసికొని వున్నట్లయితే, తన జీవితకాలంలో తాను సాధించిన మహత్తర సాంఘిక పరివర్తనలో రవ్వంత కూడా సాధ్యమయ్యేదికాదు ఉత్తమసాహిత్యం, అభ్యుదయ సాధనకు ఒక చక్కని ఉపకరణమన్న విషయం ఆయనకు బాగా తెలుసు. లేకపోతే ఆయన జీవితంలో అత్యధిక భాగాన్ని గ్రంథరచనకు వినియోగించి వుండేవాడుకాదు. తన కాలానికి ఒక గొప్ప విద్వాంసుడే కాక, ఒక గొప్ప కార్య సాధకుడైన వ్యక్తికూడా అవసరమని ఆయన గుర్తించాడు. తన దిన చర్యలో ఒకచోట ఇలా వ్రాసుకొన్నాడు.

"కేవలం పుస్తకాలు వ్రాసి ప్రచురించడంలో ప్రయోజనం లేదు. మనం నమ్మిన సత్యాన్ని లోకానికి చాటి కార్యరూపంలో చూపగల ధైర్యసాహసాల్ని ప్రదర్శించడం చాలా అవసరం.

మత సాంఘిక సంస్కరణలను అమలు జరుపగల ధైర్యం, ప్రగాఢ విశ్వాసంతో తాను చేపట్టిన కార్యసిద్ధికి నిర్విరామంగా క్రమపదేశక్తి ఆయనలో కొట్టవచ్చినట్లు కనిపించే గుణాలు. కార్యసాధనలో కుటిలపద్ధతిగాని రాజీపడే విధానంగాని ఆయనకు గిట్టదు. ప్రత్యర్థులనందరిని ప్రక్కకునెట్టి నిరాటంకంగా ముందుకు సాగిపోవడమే ఆయన పద్ధతి.. మత సాంఘిక విద్యావిషయిక సంస్కరణల్లో వీరేశలింగంగారి భావాలు ఎంతవరకు మౌలికమైనవి అని ఎవరైనా ప్రశ్నించవచ్చుకాని తన భావాల్ని కార్యరూపంలో పెట్టడంలో ఆయన చూపిన పట్టుదలకుమాత్రం ఎవరూ మెచ్చకుండా వుండరు.

సాంప్రదాయికమైన హైందవ ఆచారాల్లో ఎన్నింటినో విడిచిపెట్టిన రామమోహన్ రాయ్ గాని, దేవేంద్రనాథ్ ఠాగూర్ ని బ్రాహ్మణకుల చిహ్నమైన యజ్ఞోపవీతాన్ని మాత్రం విసర్జించలేదన్న విషయాన్ని గమనించాలి. ఈ సంగతి వారిని కించపరచడానికి చెప్పుతున్నదికాదు. వీరేశలింగం విషయం వేరు. 1919వ సంవత్సరంలో మరణించిన వీరేశలింగం అప్పటికి పదమూడు సంవత్సరాలకు ముందే తన కులాన్ని, దానితోపాటు పవిత్రమైన యజ్ఞోపవీతాన్ని పరిత్యజించాడు. ఈ పని ముందే చేసివుండేవాడు. కాని తాను ప్రారంభించిన విధవా పునర్వివాహాల ఉద్యమానికి అది ఆటంకం కాగలదన్న సంశయంతో చేయలేదు.

వీరేశలింగం పట్టుదలకు కార్యదీక్షకు మరో రెండు నిదర్శనాలను కూడ చూపవచ్చు. ప్రత్యర్థుల తీవ్ర ప్రతిఘటనకు, తన అనుయాయుల ఉదాసీనతకు నిరాశ చెందిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్, తన మరణానికి - అంటే 1891వ సంవత్సరానికి చాలా కాలం ముందే తాను ప్రారంభించిన విధవా పునర్వివాహాల సంస్కరణలో శ్రద్ధను కోల్పోయాడు. వీరేశలింగంకూడా అనుయాయులు ఉదాసీనతను, ప్రత్యర్థుల ప్రతిఘటల్ని ఎంతో ఎదుర్కోవలసివచ్చింది. అయినా నిస్సహాయులైన బాల వితంతువుల ఉద్ధరణకు దృఢ సంకల్పంతో జీవితాంతం పోరాడాడు. రానడే కన్న తాను ధైర్యశాలి అని వీరేశలింగం ఒక సందర్భంలో నిరూపించుకొన్నాడు. క్రైస్తవ మిషనరీల అల్పాహార విందులో పాల్గొన్నందుకు రావడేను వెలివేస్తామని స్వకులస్థులు బెదిరిస్తే ఆయన ప్రాయశ్చిత్తం చేసుకొన్నాడు. విరూపాక్ష పీఠాధిపతి శంకరాచార్యులు తన్ను వెలివేస్తూ పంపిన శ్రీ ముఖాన్ని వీరేశలింగం అదురు బెదురు లేకుండా తిరగ్గొట్టాడు. రామమోహన్ రాయ్, దేవేంద్రనాథ్, విద్యాసాగర్, రానడే వీరందరికన్న వీరేశలింగం గొప్పవాడని చెప్పడం నా అభిమతం కాదు. అటువంటి గౌరవాన్ని ఆయనకు ఎవరైనా ఆపాదించివున్నానిరసించివుండేవాడు. ఈ మహనీయులందరి అడుగుజాడల్లో నడిచే ఒక అనుయాయిగా మాత్రమే తన్ను తాను పరిగణించుకొన్నాడు. ప్రతిభావ్యుత్పత్తుల్లో ఈ మహానాయకులకు సమానుడు కాకపోయినా వీరేశలింగం నిరంతరం అన్ని సన్నివేశాల్లోను ఒకేరీతిగ ప్రవర్తించి వారికన్న మిన్నగా ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించాడు. రానడే తాను చేసిన చిన్న చిన్న పొరపాట్లను తన స్నేహితుడైన కె.టి. తెలాంగ్ (K.T. Telang) కు ఉత్తరం వ్రాస్తూ సమర్థించుకొన్నాడు. "కొన్ని విషయాల్ని మనం తప్పక ప్రతిఘటింపవలసిందే. అయితే అన్నింటిని తప్పక ఎదిరించాలని ఎదిరించడంలో అర్థం లేదు." చిన్నవాటిలోనైనాసరే, పెద్ద విషయాల్లోనయినా వీరేశలింగం మాత్రం రాజీపడలేదు. లొంగటంకన్న తొలగటం మేలని ఆయన భావన. శారీరకంగా ఆయన దుర్బలుడు వ్యాధిపీడితుడు అయినప్పటికి తాను విశ్వసించిన విషయాల్లో ఉక్కులాంటివాడు.

దక్షిణ భారతదేశంలో వీరేశలింగం ఒక అర్ధశతాబ్దకాలం విరాట్ రూపంతో ప్రకాశించి, ఆనాటి సామాజిక జీవితంమీద పెద్దరికం నిర్వహించాడు. అయినా ఆనాటి చరిత్రను తెలిపే పుస్తకాల్లో ఆయనకు ఇవ్వదగిన ప్రముఖస్థానం కనిపించదు. ఎస్. నటరాజన్ వ్రాసిన 'ఏ సెంచురీ ఆఫ్ సోషల్ రిఫార్మ్ ఇన్ ఇండియా" అన్న పుస్తకంలో ఆ రచయిత పంతులుగారిని రెండు స్థలాల్లో మాత్రమే పేర్కొన్నాడు. అది కూడ ఏదో మాట వరసకు చెప్పడమే. ఛార్లెస్ హెచ్ హీమ సత్ రచించిన ఇండియన్ నేషనలిజం అండ్ సోషల్ రిఫార్మ్" అన్న పుస్తకంలో పంతులుగారిని గూర్చి ఒకే ఒక వాక్యం మాత్రమే వున్నది. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్ర గ్రంథాలు కూడ వీరేశలింగానికి సముచితమైన న్యాయాన్ని చేకూర్చలేదు.

ఎందుకీ ఉపేక్ష? వీరేశలింగం రచనల్లో అధికభాగం ఆయన మాతృభాషయైన తెలుగులో ఉండటమే దీనికి కారణమా? మాతృభాషలో వ్రాయడమే కీర్తి ప్రతిష్టలు రాకపోవడానికి ఒక ఆటంకమనుకుంటే మరి వంగభాషలోనే అధిక భాగం వ్రాసిన విద్యాసాగర్ కీర్తిప్రతిష్ఠల వ్యాప్తికి ఎందుకు ఆటంకం కలగలేదు? ఈనాడు వీరేశలింగాన్ని ఒక సాహిత్య స్రష్టగా పరిగణించడమే అందుకు కారణమా? అలా అయితే ఎందరు సాహిత్య పురోగాములిట్టి దుస్థితిని తప్పించుకోగలరు?

ఏ సంస్కరణల కోసం వీరేశలింగం పాటుపడ్డాడో అవి నేడు జీవన సమస్యలుకావు కనుక ఆయన కీర్తి కుంటుపడ్డాడా? అదే వాస్తవమైతే ఇతర సంస్కర్తలెందుకు ఉపేక్షింపబడలేదు? కాబట్టి దీనికి సరియైన కారణాల్ని మనం ఇతరత్రా వెదకాలి.

నిజానికి ఆంధ్రసోదరుల కృతఘ్నతే ఈ నిర్లక్ష్యానికి కారణం. "వీరేశలింగమే వచ్చి వారిని చైతన్యవంతుల్నిగా చేయకుండినట్లయితే వారి స్థితిలో వుండేవారు కారు అయినప్పటికి ఆ మహనీయునికి వారెంత ఋణపడి వున్నారో ప్రపంచానికి చాటి చెప్పడంలో తెలుగువారు ఉదాసీనత వహించారు. ఇతర భాషలమాట అలావుంచినా, వీరేశలింగం జీవితచరిత్రను నిర్దుష్టంగా ఇంకా తెలుగులోనే వ్రాయవలసి వున్నది ఆయన జీవిత చరిత్రలు తెలుగులో ప్రస్తుతం మూడున్నాయి. నిజంగా అవి జీవిత చరిత్రలు అని చెప్పలేం. మొదటిది ఒక మారుమూల పల్లెలో బడిపంతులుగా పనిచేసిన తోలేటి వెంకటసుబ్బారావుగారు వ్రాసింది. ఇది 1894లో ముద్రితమై తరువాత 1910లో మరికొన్ని మార్పు చేర్పులతో పునర్ముద్రణ పొందింది. ఇది సామాన్యమైన రచన. చెప్పుకోదగ్గ గొప్ప రచన కాదు రెండవరి కె. శరగోపాచార్యులు వ్రాసిన గ్రంథం. ఇది కూడా ప్రాచీనమే, బాగులేదు. మూడవది పద్యరూప రచన. మొదటి రెంటికన్న అధ్వాన్నమైన రచన ఈ పద్యకృతిని రచించింది వీరేశలింగం. శిష్యురాలు అనుయాయి అయిన కె. సీతమ్మ. ఈమెకు వీరేశలింగం మీద భక్తి గౌరవాలున్నంతగా రచనకు తగిన శక్తి సామర్థ్యాలు లేనందువల్ల సజీవ పాత్రచిత్రణ చేయలేకపోయింది. 1. గురునాథం ఇంగ్లీషులో రచించిన వీరేశలింగం జీవిత చరిత్రను గురించి (ఇది 1911లో రాజమండ్రిలో ప్రచురింపబడింది) ఎంత తక్కువ చెప్పితే అంత మంచిది. వీరేశలింగంతో కలిసి పనిచేసిన రాయసం వెంకటశివుడు తన గతానుభవాల జ్ఞాపకాలతో ఒక చిన్న పుస్తకం వ్రాశాడు ఇందులో పొగడ్త కన్న తెగడ్త ఎక్కువ, పంతులుగారు చాల మంచివారు. త్రికరణ శుద్ధిగలవారు అయినప్పటికి ముక్కోపి, సందేహప్రాణి కావడంచేత తాను ఆయనతో కలిసి ఎలా పనిచేయలేకపోయాడో అందులో వివరించాడు. వంతులుగారి ఉన్నత ప్రమాణాలను అందుకోలేని అనేకులు ఆయన్ను తొందరపాటుతో కోప్పడే ముసలాయన అని సణుక్కొనేవారు. మనం ఏమి చేయలేకపోయినా, కనీసం వీరేశలింగం స్వీయచరిత్ర' నయినా వీలై నన్ని భాషల్లోకి అనువదించి ఉండవలసింది తెలుగు వాఙ్మయంలో స్వీయచరిత్ర రచనకది నాంది కావడమే దాని విశిష్టత కాదు. ఏ ప్రమాణాన్ని బట్టి చూసినా ఇదొక గొప్ప స్వీయచరిత్ర చదివేకొద్దీ పాఠకుల్లో ఆసక్తిని కలిగించే రచన యిది. ఇందులో కొంత భాగాన్ని మాత్రమే ఎస్.సి. నరసింహాచార్యులు ఇంగ్లీషులోనికి అనువరించారు.
ఇది కొన్ని దశాబ్దాల క్రితం బొంబాయిలో ముద్రితమైంది. దాని ప్రతిలిప్పుడు అలభ్యం ఇటీవల వీరేశలింగం గురించి ప్రకటింపబడ్డ గ్రంథాల్లో రెండే రెండు పేర్కోదగ్గవి. అవి - ఇంగ్లీషులోనూ తెలుగులోనూ వెలువడ్డ స్మారక సంచికలు ఈ రెండింటికి సంపాదకులు న్యాయమూర్తి ఆవుల సాంబశివరావుగారు.. సామాన్యంగా సంచికల్లో వెలువడే వ్యాసాల్లాగే ఈ స్మారకసంచికల్లో కూడా అన్ని వ్యాసాలూ ఉన్నతస్థాయిలో లేవు. పునరుక్తాలున్నాయి. అయినప్పటికీ అవి చదవదగిన వ్యాసాలు.

సాహిత్య అకాడెమీ ఆదేశం మేరకు నేను ఈ చిన్న పుస్తకంలో వీరేశలింగాన్ని భారతీయ -సాహిత్య నిర్మాతగా మాత్రమే ప్రదర్శిస్తున్నాను. ఈ పరిమిత పరిధిలో వీరేశలింగం విశిష్ట వ్యక్తిత్వాన్ని సమగ్రంగా, సాధికారంగా ప్రదర్శింపగలిగితే నా క్రమకు తగిన ఫలితం లభించినట్లు భావిస్తాను.

## బాల్య జీవితం - ఇక్కట్లు

వీరేశలింగం స్వీయచరిత్ర రెండు సంపుటాల ఉద్గ్రంథం ఒక్కొక్క సంపుటంలో ఇంచుమించు అయిదువందల పుటలున్నాయి. ఆయన జీవితంలో ఎదుర్కొన్న అనేక ఒడుదుడుకుల్ని ఈ స్వీయచరిత్ర వివరిస్తుంది. ఇందులో 1913వ సంవత్సరం వరకు అంటే ఆయన మరణానికి ముందు ఆరేండ్లవరకు ఆయన జీవిత గాథ తెలుస్తుంది.
ఇందలి విషయాన్ని స్థూలంగా, పైపైగా చెప్పాలన్నా ఎంతో గ్రంథమవుతుంది. కాబట్టి ఆయన జీవిత ప్రారంభ దశలోని ప్రధానఘట్టాల్ని, ఆయన పడ్డ ఇక్కట్లని మాత్రమే కొంతవరకు సూచించడం ప్రస్తుతం సాధ్యమవుతుంది.

వీరేశలింగం జననం 1848వ సంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన రాజమండ్రి - సరిగా చెప్పాలంటే రాజమహేంద్రవరం - ఆయన జన్మస్థలం. తండ్రి సుబ్బారాయుడు, పేద శైవబ్రాహ్మణుడు, తల్లి పున్నమ్మ ఆ కాలంలోని స్త్రీలందరిలాగ ఆమె కూడా చదువుకోలేదు. ఆమె జీవితంలో అధికభాగం మూఢనమ్మకాలతో, అనారోగ్యంతో గడచింది. తల్లి అనారోగ్యం ఏకైక పుత్రుడైన వీరేశలింగానికి సంక్రమించింది. ఆమెకు ఉండిన భూతప్రేత పిశాచాల భీతి మాత్రం ఆయనకు రాలేదు. పుట్టుకతోనే ఆయనకు అజీర్ణవ్యాధి, ఎప్పుడూ జలుబుతో బాధపడేవాడు. జీవితమంతా ఆయనను పీడించిన ఉబ్బసరోగం బాల్యంలోనే ప్రారంభమైంది. ఆరు నెలల పసికందుగా వున్నప్పుడే మశూచి సోకింది. తీవ్రంగా సోకిన మశూచినుండి తమ బిడ్డ బ్రతుకుతాడని. తల్లిదండ్రులు అనుకోలేదు. సుమారు 1870వ సంవత్సరం వరకు ప్రతి ఏడు ఏదో ఒక తీవ్రమైన రోగానికి లోనవుతూ వచ్చాడు ఈ దశలోనే నీటిలో మునిగి మరణించే పరిస్థితి. మూడుసార్లు సంభవించింది. ఈ గండాలన్నింటినీ గడచి ఆయన బ్రతికి బట్టకట్టడం నిజంగా ఒక అద్భుతమే!

వీరేశలింగం పుట్టేనాటికి తండ్రి సుబ్బారాయుడు పేదవాడే అయినా వారికి అంతకుముందు. బాగా బ్రతికిన కుటుంబం. ఆనాటి జీవిత ప్రమాణాల్నిబట్టి ఆయన పూర్వీకులు సంపన్నులు. వారిలో కొందరు జమీందారులదగ్గర దివానులుగా పని చేశారు. వారికి జాగీర్లుండేవి. వారు కళల్ని, సాహిత్యాన్ని పోషించిన సంస్కారవంతులు, తమ తండ్రిగారి అపాత్రదానాలు, స్తోమతకు మించిన దర్గాలు వృధాఖర్చులు, చివరికి సుబ్బారాయణి, అన్న అయిన వెంకటరత్నాన్ని పేదలుగా చేసినాయి. సోదరులిద్దరూ విద్యావంతులైనా, ఇంగ్లీషు భాషా పరిచయమున్నా కొన్ని సంవత్సరాలవరకు ఎటువంటి ఉద్యోగానికి ప్రయత్నించలేదు. పైగా జీవనోపాధికి పూర్వీకులు సంపాదించిన విస్తారమైన భూముల్ని కొంత కొంత అమ్ముతూ వచ్చారు. చివరకు అమ్మడానికి తామున్న పెద్ద భవంతి తప్ప ఇంకేమీ లేకపోగా ఇరుగు పొరుగు పట్టణాలకు ఉద్యోగాలకోసం వెదుకుతూ పోయారు. అదృష్టవశాత్తు సుబ్బారాయుడికి కాకినాడలో ఒక ప్రభుత్వ కార్యాలయంలో కొద్దిపాటి జీతానికి గుమస్తాపని దొరికింది. పనిలో చేరిన కొద్ది కాలానికే జబ్బుచేసి సుబ్బారాయడు అకాలమరణాన్ని చెందాడు. అప్పుడు వీరేశలింగానికి నాలుగేండ్లే. తండ్రి మరణం ఆ కుటుంబానికి పిడుగుపాటైంది.

భర్త ఆకస్మిక మరణం పున్నమ్మ జీవితాన్ని దుర్భరం చేసింది. బావగారయిన వేంకటరత్నం సానుభూతితో ఆమె దుఃఖాన్ని పంచుకొన్నాడు. కాని తన కొద్ది రాబడితో ఆమెకుగాని, ఆమె కొడుకు వీరేశలింగానికి గాని ఎక్కువ సహాయం చేయలేకపోయాడు. బిడ్డకు ఇంగ్లీషు చదువులు చెప్పించే స్తోమతలేని పున్నమ్మ రెండు వీధి బడుల్లో చదివించింది. మొదటిది ఒక తొర్రిపెదవుల ముసలాయన నడుపుతుండిన పాఠశాల, రెండవది ఒక వీధి అరుగుమీద గూని పంతులొకరు. పాఠాలు చెప్పే వీధి బడి. మొదటిదానికన్న రెండవది కొంత మెరుగు. ఆ గూనిపంతులు వీరేశలింగానికి తెలుగుభాషలో మంచి పునాది వేయడమే కాకుండా, ప్రసిద్ధ ఆంధ్రకావ్యాలను బోధించాడు. ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తిచేసిన వెంటనే పున్నమ్మ తన కొడుకు ఏదైనా ప్రభుత్వోద్యోగానికి అర్హత సంపాదించుకొనే సమయం ఆసన్నమయిందనుకొని, రెవిన్యూ

ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తున్న ఒక బంధువు దగ్గరకు తీసుకువెళ్లింది. ఆయన దగ్గర వీరేశలింగం ఒకటి రెండు సంవత్సరాలు పని చేశాడు. విరామమున్నపుడల్లా తన పెదతండ్రి దగ్గర ఇంగ్లీషు, లెక్కలు, తమ కుటుంబానికి సన్నిహితుడైన ఒక పండితుని దగ్గర సంస్కృతమూ నేర్చుకొనేవాడు.

వీరేశలింగం ఇలా అవస్థపడుతున్నపుడు 1860లో అదృష్టం అతన్ని వరించింది. తన కొడుకు వెంటనే సంపాదనపరుడై ఎంత అల్ప వేతనాన్నయినా అందుకోవాలన్న అభిప్రాయాన్ని మార్చుకొని, పున్నమ్మ అతన్ని పై చదువులకు ప్రభుత్వ జిల్లా పాఠశాలకు పంపింది. అదే వీరేశలింగం జీవితంలో ఒక మలుపుకు దారితీసింది.

ఎంత కఠినమైన పాఠాన్నయినా ఒకే ఒక మారు చదివి ధారణ చేయగల ఏక సంతాగ్రాహి. వీరేశలింగం. ఈ ఏక సంతాగ్రాహకత పట్ల, నిరంతర పరిశ్రమవల్ల వీరేశలింగం ప్రతి తరగతిలో ప్రథమస్థానాన్ని పొందేవాడు. అన్ని బహుమతుల్ని అందుకొని విద్యార్థి వేతనాన్ని కూడా పొంద గలిగాడు. ఆ పాఠశాల్లో అతణ్ణి ఒక అద్భుత విద్యార్థిగా అందరూ గుర్తించారు. చదువులో తెలివితేటలు గలవాడు మాత్రమే కాదు. ప్రవర్తనలోను ఆదర్శప్రాయుడు. ఒక మారు ఆ పాఠశాలని సందర్శించిన ఒక జిల్లా విద్యాధికారి ఆ పాఠశాలలోని ఉత్తమ విద్యార్థికి బహుమతి ఇస్తానని ప్రకటించినపుడు ఏకగ్రీవంగా అందరూ వీరేశలింగాన్నే ఎన్నుకొన్నారు. ఆ బహుమతి కూడ ఆయనకే లభించింది.

వీరేశలింగం కార్యసాధకుడు, ఎంతో పట్టుదల గలవాడు అనడానికి ఆయన బాల్యదశలోని ఒకటి రెండు సంఘటనల్ని నిదర్శనాలుగా చూపవచ్చు. ప్రసిద్ధమైన వసుచరిత్ర ప్రబంధాన్ని చదవాలన్న అభిలాషతో అటకమీదనున్న తాళపత్ర గ్రంధాలన్నింటిని గాలించి విఫలుడయ్యాడు. మనస్సులో ఎంతో మధనపడి చివరికి ఆ ప్రబంధాన్ని కొనిపెట్టమని తల్లిని కోరాడు. అది పాఠ్య గ్రంథంకాదని తెలుసుకొన్న పున్నమ్మ దాన్ని కొనివ్వడానికి ఖచ్చితంగా నిరాకరించింది. ఆ ప్రబంధాన్ని చదవాలన్న కోరికను అణచుకోలేని వీరేశలింగం ఒక ఉపాయం ఆలోచించాడు. తన సొంత ఖర్చుకని అమ్మ ఇచ్చిన డబ్బులో అతడొక అర్ధరూపాయను దాచుకొన్నాడు. బడి జీతం కట్టమని ఇచ్చిన ఇంకొక అర్ధరూపాయను చేర్చి ఒక పుస్తక విక్రేతకు ఆ రూపాయిని సంచకరువుగా ఇచ్చి మిగిలిన మూడు రూపాయల్ని ఆరునెలల్లో నెలకి అద్దరూపాయ చొప్పున పంతులవారీగా తీరుస్తానని ఒప్పందం చేసుకొన్నాడు. ఈ నిబంధనకు ఒప్పుకొన్న ఆ పుస్తకవిక్రేత అతి జాగ్రత్త మనిషి, డబ్బు పూర్తిగ చెల్లించేవరకు పుస్తకాన్ని ఇంటికి తీసుకెళ్ళకూడదని, తన కొట్టులోనే చదువుకోవలసిందని షరతు పెట్టాడు. ఈ చిన్న సహాయానికే ఉప్పొంగిపోయిన వీరేశలింగం బడి ఎగ్గొట్టి పుస్తకాల కొట్టులోనే వసుచరిత్ర ప్రబంధాధ్యయనంలో కాలాన్ని గడుపుతూ వచ్చాడు. ఒక నెలరోజుల తరువాత పున్నమ్మకు కొడుకు చేస్తున్న దగా తెలిసి, నిలదీసి అడిగింది. వెంటనే అతడు బోరున ఏడుస్తూ తన తప్పును ఒప్పుకొన్నాడు. ఇంత జరిగాక కావ్య పఠనలో తన బిడ్డకుగల ఆసక్తిని గుర్తించిన తల్లి తనకున్న కొద్దిపాటి డబ్బుతో వసుచరిత్ర పుస్తకం ఖరీదులో బాకీని చెల్లించి, పుస్తకాన్ని కొడుక్కు కొనిపెట్టింది.

మరొక సంఘటన దీనికన్న భిన్నమైనది. చాల ముఖ్యమైనది. తమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇంగ్లీషు పాఠాలను సరిగా చెప్పడానికి చేత కాక, విద్యార్థుల్ని నిష్కారణంగా దండిస్తున్నందుకు పన్నెండేండ్ల వీరేశలింగం అతన్ని బదిలీ చేయాలని ఒక మహజరును వ్రాసి ఒక సమ్మెను కూడ విజయవంతంగా నిర్వహించాడు. ఆ సమ్మె ఫలితంగ ఆ ప్రధానోపాధ్యాయుడు బదిలీ అయ్యాడు. అతని స్థానంలో సమర్థుడైన మరొక ఉపాధ్యాయుడు నియమింపబడ్డాడు. ఈ సంఘటనలద్వారా భవిష్యత్తులో అనేకమైన సాంఘిక అక్రమాలను దురన్యాయాలను ప్రతిఘటించి పోరాడనున్న వీరుని స్వరూపాన్ని బాల వీరేశలింగంలో స్పష్టంగా దర్శింపగలుగుతున్నాం.

వీరేశలింగం చిన్నప్పుడు దుష్ట సాంగత్యంవల్ల పేకాట ఆడడం అన్న ఒకే ఒక తప్పటడుగు వేశాడు. మొదట సరదాగా చింతగింజల్ని ఒట్టి అడడంతో ఆరంభమై క్రమంగా గవ్వలు, తర్వాత పైసాలు పెట్టి ఆడడం వరకు వచ్చింది. చిల్లగవ్వలు అప్పటికింకా నాణేలుగా ఉపయోగంలో ఉండేవి. పది గవ్వలోక పైసకు సమానం.
అనతి కాలంలోనే పేకాటలోని మెలకువలన్నీ వీరేశలింగం ఆకళించుకొన్నాడు రెండు, మూడు రూపాయలు కూడ సంపాదించాడు. విజయ గర్వంతో అతడొకనాడు తన స్నేహితులతో కలిసి ఒక వేశ్య యింట్లో ఆడటానికి ఒప్పుకొన్నాడు. రెండవరోజున వాళ్ళతో ఆ వేశ్య కూడ ఆడుతానన్నది ఇది. ఆయనకు భరించలేని అవమానంగా తోచింది ఇక ఎప్పుడూ చీట్లపేకను ముట్టనని వీరేశలింగం. ప్రతిజ్ఞ చేశాడు.

ఆనాటి ఆచారం ప్రకారం తల్లి, పెత్తండ్రి వీరేశలింగానికి పెండ్లి చేయ సంకల్పించి పిల్లను వెదకసాగారు. 1861లో ప్రక్క గ్రామంలోని ఒక అమ్మాయిని నిశ్చయించారు. ఆ కన్య అసలు పేరు బాపమ్మ కాని అతని తల్లి చెవికింపుగ 'రాజ్యలక్ష్మి అని మార్చింది. అప్పటికి వీరేశలింగానికి పదమూడేండ్లు నిండలేదు. ఆ అమ్మాయికి తొమ్మిదో ఏడు మొదలయింది. పెండ్లంటే ఏమిటో ఇద్దరికీ తెలియదు. వివాహమంటే విందులు, వినోదాలు, వేడుకలు అనుకొన్నారు. నిజానికి ఆ సమయం అటువంటిదే. అప్పుచేసి తెచ్చిన డబ్బుతో కొత్తబట్టలు, నగలు కొన్నారు. నవకాయ పిండివంటలతో భోజనాలు పెట్టారు. పల్లకీలో ఊరేగించారు. ఊరేగింపుకు ముందు ఆనాటి ఆచారం ప్రకారం భోగం వాళ్ళ నాట్యం పెట్టారు. వాస్తవానికి ఆ రోజుల్లో వధువు ఇంటివాళ్ళకటి, వరుని వర్గంవారు మరొకటి చొప్పున రెండు భోగం మేళాల్ని నియమించడం వాడుక.

పెండ్లయిన ఏడాదికి రాజ్యలక్ష్మికి అమ్మవారు పోసింది. ఆ మరుఏడాది వీరేశలింగానికి కూడ చాల జబ్బుచేసింది. ఈ కష్టాలు చాలనట్లు ఆయన తల్లికి, పెత్తల్లికి మధ్య కలహాలు శ్రుతిమించినాయి. తన తల్లిమీద ఎంతో మమకారమున్నా ఈ గృహకలహాల్లో తన తల్లిదే ఎక్కువ తప్పని వీరేశలింగం స్వీయచరిత్రలో చెప్పాడు తన తల్లి ముక్కోపి అని, వీటికి మాటికి నుండిపడేదని పేర్కొన్నాడు. ఆమె అభిమానవతి అత్యవసర పరిస్థితుల్లో కూడ ఇతరులనుండి సహాయం పొందడానికి నిరాకరించేది. తన భార్యకు, మరదలికి మధ్య ఎటువంటి పొత్తు కుదరదని తెలుసుకొన్న వెంకటరత్నం ఉమ్మడి కుటుంబం ఆస్తిని రెండుగ విభజించడం మంచిదనుకొన్నాడు. ఆయనకు సంతానం లేదు. వీరేశలింగాన్ని కన్నకొడుకులా ప్రేమించాడు.

ఇక అతనికి సంరక్షకుడుగా ఉండలేకపోతున్నందుకు విచారించాడు. ఆస్తి పంపకాలు, రాతకోతలు ముగిసిన వెంటనే వెంకటరత్నం నిరాశతో గుండె బరువుతో మరణించాడు. ఆ మరణంతో అయినా ఆ కుటుంబ కలహాలు అంతం కాలేదు. పిత్రార్జితంగ వచ్చిన ఇంటిలో తన భాగాన్ని వెంకటరత్నం భార్య అమ్ముకోవడం ఎంతవరకు చట్ట సమ్మతమన్న సమస్య తలెత్తింది. దీనికి సంబంధించిన కోర్టు వ్యవహారాన్ని పున్నమ్మే ప్రారంభించింది. క్రింది కోర్టులో ఫిర్యాదు వీగిపోయింది. ప్రతికూలమైన తీర్పుచెప్పారు. మరల హైకోర్టుకు అప్పీలుచేస్తే, ఆ కోర్టు ఖర్చులకుగాను రాజ్యలక్ష్మి నగలన్నీ హరించుకు పోయినాయి.

ఇంటిలో కొంత భాగాన్ని అద్దెకిచ్చినందువల్ల వచ్చే నాలుగు రూపాయలే అప్పట్లో వారి కుటుంబానికి ఆదాయం. ఆ రోజుల్లో నిత్యవసర వస్తువుల ధరలు చాల తక్కువ కాబట్టి తల్లి, కొడుకు, కోడలు ముగ్గురూ ఆ కొంచెం డబ్బుతోనే ఇల్లు గడుపుకోగలిగారు. మాటిమాటికి జబ్బు పడడంవల్ల వీరేశలింగం చదువుకు అంతరాయం కలిగేది. అయినా దృఢసంకల్పంతో చదువు సాగించాడు. చివరకు 1868లో మెట్రిక్యులేషన్ పరీక్షకు కూర్చోలేకపోయాడు. ఆ మరు సంవత్సరం పరీక్ష వ్రాసి కృతార్థుడయ్యాడు.

ఈ మధ్యకాలంలో వీరేశలింగానికి ఒక చిన్న పని దొరికింది. ప్రతిరోజు మూడుగంటలపాటు ఇంగ్లీషులో ఉత్తర ప్రత్యుత్తరాలు చూడడానికి ఆ ఊళ్ళో ఒక ప్లీడరుగారి దగ్గర కుదురుకొన్నాడు. జీతం నెలకు ముప్పై రూపాయలు. అయితే ఆ ప్లీడరు మహాశయుడు తన ఉంపుడుగత్తెతో బహిరంగంగానే సరసల్లాపాలాడడం వల్ల, ఆఫీసులో జరిగే కొన్ని అత్యాచారాలవల్ల నెల తిరిగేసరికి వీరేశలింగం ఆ ఉద్యోగానికి ఉద్వాసన చెప్పాడు. తరువాత నెలజీతం మీద ఒకరిద్దరు తెల్లదొరలకు తెలుగు బోధించడానికి ఒప్పుకొన్నాడు. ఈ పని ఆయనకు హాయిగా తోచింది.

వీరేశలింగం దగ్గర తెలుగు నేర్చుకొన్న ఇద్దరు విదేశీయుల్లో ఒకరు వీరేశలింగం చదువుకొన్న ప్రభుత్వజిల్లా హైస్కూలుకు హెడ్మాష్టరయిన బరోదొర (Mr. Barrow) ఆయన బోధనా సామర్థ్యానికి ముగ్ధుడైన బరోదొర మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడైన వీరేశలింగాన్ని వెంటనే నెలకు ఇరవై ఐదు రూపాయల వేతనంతో తన బడిలో ఉపాధ్యాయునిగా నియమించాడు. ఈ ఉద్యోగం తాత్కాలికమైనది. అందువల్ల ఒక సంవత్సరంపాటు మాత్రమే ఆ పాఠశాల్లో వీరేశలింగం పనిచేశాడు. అప్పట్లో వీరేశలింగం లక్ష్యం న్యాయవాది కావాలని ఆ ఆశయంతో ఆయన మొట్టమొదట 1871వ సంవత్సరం క్రిమినల్ హైయర్ గ్రేడ్ పరీక్షకు కట్టి కృతార్థుడయ్యాడు. ఆ తరువాత అనువాద పరీక్షలోను క్లుప్తరచన (precis writing) పరీక్షలోను. ఉత్తీర్ణుడయ్యాడు. నిజానికి ఇంక కొంత శ్రద్ధ చూపివుంటే, న్యాయవాదిగా చేరి, అటు తరువాత న్యాయాధిపతి కూడా కాగలిగేవాడు. అయితే న్యాయస్థానాల్లోని అవినీతి, న్యాయవాదుల అక్రమాలు ఆయనకు సరిపడలేదు. అసహ్యించుకొన్నాడు. కాబట్టే ఉపాధ్యాయవృత్తిలో స్థిరపడ్డాడు.

1872వ సంవత్సరంలో కోరంగిలోని ఇంగ్లీషు పాఠశాలలో హెడ్మాస్టరుగా చేరాడు. నెలకు ముప్పై రూపాయల జీతం. అనతికాలంలోనే ఆదర్శ ఉపాధ్యాయుడన్న పేరును సంపాదించాడు.. రెండుమూడు సంవత్సరాల్లోనే అంతకన్న పెద్దదైన ధవళేశ్వరంలోని ఆంగ్లో వెర్నాకులర్ పాఠశాల బాధ్యతలు నిర్వహించడానికి ఆహ్వానం వచ్చింది. అక్కడ ఆయన నెలజీతం 44 రూపాయలు ఈ క్రొత్త పదవిలో రెండేడ్లు ఉన్న తరువాత ప్రజాహిత కార్యక్రమాల్లో పూర్తిగా పాల్గొనే నిమిత్తం ఆ పదవికి రాజీనామా ఇచ్చాడు. మనస్సులో అనేక ప్రణాళికలు పెట్టుకొని రాజమండ్రికి తిరిగివచ్చాడు. ఆయన శ్రేయోభిలాషులు, మిత్రులు ఇచ్చిన సలహాల ననుసరించి రాజమండ్రిలోని గవర్నమెంటు అరు కాలేజిలో తెలుగు పండిత పదవిని స్వీకరించాడు. ఈ క్రొత్త ఉద్యోగానికి నెలజీతం 25 రూపాయలు మాత్రమే. ఇది మునుపటి జీతంకన్న తక్కువ. అయినా అనేక సంవత్సరాలు ఈ పదవిని అంటిపెట్టుకొని తద్వారా తన ఆదర్శాలకు అనుగుణమైన నూతన తరాన్ని తీర్చిదిద్దే అవకాశాన్ని సంపూర్ణంగ సద్వినియోగ పరచుకొన్నాడు వీరేశలింగం.

## తొలి రచనలు

ఆదికవి నన్నయభారతం మొదలు సూరన కృతుల వరకున్న తెలుగు కావ్యేతిహాస ప్రబంధాలను బాల్యదశలోనే క్షుణ్ణంగా చదువుకొన్న వీరేశలింగానికి తానుకూడ ఒక కవి కావాలన్న అభిలాష వుండేది. ఆ ఉద్దేశంతో ఛందస్సును శ్రద్ధగా నేర్చుకొన్నాడు. ఇరవై యేండ్లయ్యేటప్పటికి ఛందస్సులో ప్రావీణ్యాన్ని సంపాదించిన వీరేశలింగం మొదట రెండు శతకాల్ని రచించాడు. తెలుగులోలాగ శతకం ఇతరభాషల్లో ఒక సాహిత్య ప్రక్రియగ పెంపొంది ఉండకపోవచ్చు. కాని శతక రచన కేవలం తెలుగుభాషకే ప్రత్యేకమైంది కాదు. ఉదాహరణకు సంస్కృతంలో భర్తృహరి శతకాలున్నాయి. భర్తృహరి సుభాషితాలను గురించి కీత్ (Keith) ఇలా అన్నాడు.

"అవి మనకు మూడు సంపుటాలుగ సంక్రమించాయి. శృంగారం వైరాగ్యం, నీతికి సంబంధించి, ఛందో  వైవిధ్యం తో కూడినట్టి నూరేసి శ్లోకాలు వేర్వేరుగా ఈ మూడు సంపుటాల్లో సంతరింప బడ్డాయి. ''

తెలుగులోని శతకాల స్వరూపం కొంతవరకు భిన్నమైంది. తెలుగు శతకకర్తలు సాధారణంగా ఒకే ఛందస్సులోనే శతకరచన చేస్తారు.
నాలుగు పాదాలున్న పద్యాన్ని స్వీకరించి అందులో చివరిపాదాన్ని మకుటంగా నిర్ణయించుకోవడం పరిపాటి. ఈ మకుటం సామాన్యంగా ఇష్టదేవతా సంబోధనగనో, కృతి భర్త సంబోధనగనో లేదా ఆత్మ సంబోధనగనో వుంటుంది. మొత్తంమీద శతకం భక్తిప్రధానంగా లేదా నీత్యుపదేశంగా వుంటుంది.

తెలుగు వాఙ్మయంలో శతకరచన అతిప్రాచీనకాలంలోనే ప్రారంభమైంది. తెలుగు కావ్యరచనతో సమానంగానే 11, 12 శతాబ్దాలనుండి శతకరచన కూడా కొనసాగింది. ఇంతవరకు ఆరేదువందల ప్రాచీన శతకాల తాళపత్రప్రతులు లభించాయి. వాటిలో చాలవరకు ముద్రితమైనాయి. శతక రచయితల్లో వేమన అగ్రగణ్యుడు ఇతర శతకకవులవలెకాక వేమన ఇంచుమించు మూడువేల పద్యాలను కూర్చాడు. వేమన సాంఘిక విప్లవకారుడు. విగ్రహారాధనను, వర్ణవిభేదాల్ని తదితరమైన సమకాలపు సాంఘిక దురాచారాలను ఎదిరించినాడు. ఆధునిక కాలంలో అపరవేమన కాబోతున్న యువ వీరేశలింగం రచించిన ఆ రెండు శతకాలు శైలిలో భావంలో సాంప్రదాయికంగా ఉన్నాయి. భవిష్యత్తులో విగ్రహారాధనకు విరోధి కానున్న వీరేశలింగం తన శతకద్వయంలో స్వగ్రామంలో వెలసివున్నట్టి దేవతల్ని సంబోధిస్తూ రచించాడు. నీరసమైన ఆ శతకాల్లో మతసహనం ప్రతిపాదింపబడి వుండడం. మాత్రమే చెప్పుకోదగ్గగుణం. పుట్టుకతో శైవుడైన వీరేశలింగం తన రెండవశతకంలో విష్ణువును స్తుతించాడు. స్వీయ చరిత్రలో తన మతసహనాన్ని గూర్చి గొప్పగా చెప్పుకున్నాడు. ఈ రెండు వ్రాత ప్రతుల్ని ఆయన ఎక్కడో పెట్టి మరచినందువల్ల అవి మనకు దక్కలేదు. అందుకు చింతించనక్కరలేదు కూడ. యౌవనంలో తాను రచించిన కవితను చవిచూపడానికి స్వీయచరిత్రలో రెండుచోట్ల తనకు గుర్తున్న ఒక శతకంలోని రెండు పద్యాల్ని ఉద్ధరించాడు. రెండుమార్లు చవిచూపినా అవి పేలవంగానే వున్నాయి.

శతకరచన తరువాత వీరేశలింగం చేసిన సృజనాత్మక రచనలు కూడ అంత చెప్పుకోదగ్గవి. కావు. అప్పటికింకా ధైర్యంగా, స్వతంత్రంగా ఆలోచించలేని వీరేశలింగం భాషాపాండిత్యాన్నే కవిత్వంగాను, కృత్రిమత్వాన్నే కళగాను, కళాభిమానాన్నే జీవితాదర్శంగాను భ్రమపడ్డాడు. అయితే ఆయన సమకాలపు ప్రమాణాల్ని అప్పటికి తప్పనిసరిగా అనుసరించాడని చెప్పడమే న్యాయం.. ప్రాచీన తెలుగు కవుల్లో చివర వెలసిన మహాకవి పింగళి సూరన ప్రాచీన తెలుగు వాఙ్మయంలో సృజనాత్మక కవితాయుగం ఆయనతో ముగిసింది. నవీనమైన కళాపూర్ణోదయ కథను కావ్యరూపంలో పెట్టగలిగిన మౌలిక ప్రతిభగల సూరనకూడ పదప్రయోగ వైచిత్రికిదాసుడే ఆయన రచించిన రాఘవ పాండవీయ ద్వ్యర్థికావ్యాన్ని ఒక విధంగా

చదివితే రామకథ, మరొక విధంగా చదివితే పాండవులకథ స్ఫురిస్తుంది. ఈ విధంగా రెండర్థాలు వచ్చేటట్లు కావ్యరచన చేయడం ఆశ్చర్యకరమైన కవితాగారడీ కావచ్చునుగాని అది మాత్రం ఉత్తమ కవితా శిల్పంకాదు. సూరన్నను మించిపోవాలనుకొన్న మరికొందరు త్ర్యర్థికావ్యాలను వ్రాశారు. ఇంచుమించు 18వ శతాబ్దిమధ్య ప్రారంభమైన క్షీణయుగంలో ఈ అపమార్గాలు అధికమైనాయి. బంధగర్భకవిత్వాలమీద మోజు హెచ్చింది. ఒక పద్యంలోని అక్షరాన్ని వివిధ చిత్రాల్లో బంధించడం బంధకవిత్వం. ఒకే పద్యంలో మరికొన్ని పద్యాల్ని ఇమిడ్చివ్రాయడం గర్భకవిత్వం.. ఈ కవితల్లో భావానికిగాని అర్థానికిగాని ప్రాధాన్యం లేదు. ఛందస్సులో నైపుణ్యాన్ని, తమ పద పరిజ్ఞానాన్ని ప్రదర్శించాలనే కండూతి మాత్రమే ప్రధానం..

ఏకాక్షర ద్వ్యక్షర పద్యాల్ని వ్రాయడం, అచ్చ తెలుగులో వ్రాయడం, నిరోష్ఠ్యంగా వ్రాయడం వంటి గారడీలు కవిత్వంగా చెలామణి అయ్యాయి. సాహిత్యంలో వీటిని వికార చేష్టలుగా పరిగణించడం మంచిది..

తన కాలంలో ప్రచారంలోవున్న అటువంటి రచనా ప్రక్రియల ప్రభావానికిలోనైన వీరేశలింగం. అట్టి రచనల్ని చేయడానికి ప్రయత్నించాడు. అద్భుతమైన ప్రతిభతో బంధ, గర్భ, చిత్రకవిత్వాలను అల్లాడు.
క్లిష్టమైన ఛందోరీతుల్లో కూడ తన నైపుణ్యాన్ని నిరూపించాడు. పొన్నగంటి తెలగనార్యుడ్జీ, కూచిమంచి తిమ్మనను అనుసరించి వీరేశలింగం కూడా అచ్చ తెనుగులో రామాయణ మహాభారత కావ్యాలను వ్రాశాడు. ఓష్ఠ్య వర్ణాలను పరిహరిస్తూ, నిరోష్ఠ్య రచనలు) కూడా చేశాడు వచనం లేకుండా నిర్వచనంగా కొన్ని కావ్యాన్ని రచించాడు. అపూర్వమైన ఒక కావ్యాన్ని వ్రాయడానికి సంకల్పించి పై నియమాలన్నిటినీ పాటిస్తూ "శుద్ధాంధ్ర నిర్వచనం. నిరోష్ఠ్యనైషధం" అనే కావ్యాన్ని రచించాడు.

ముమ్ముందు నైతికవాది కానున్న వీరేశలింగం ఈ దశలో కొన్ని శృంగార పద్యాలను కూడా చెప్పాడు. ఆ కాలపు సాహిత్యాభిరుచులను బట్టి శృంగారం కానిది కవిత కానేరదు. ఈ దశలోనే వీరేశలింగాన్ని అశుకవిత్వం ఆకర్షించింది ఆశుకవికత్వం ఆంధ్రుల ప్రత్యేకత కాబోలు అది అష్టావధాన రూపంలోను, శతావధాన రూపంలోను ఉంటుంది. అష్టావధానంలో కవి ఏకకాలంలో ఆశుకవితతో ఎనిమిది అంశాలమీద తన బుద్ధిబలాన్ని ప్రదర్శించాలి. శతావధానంలో నూరుగురు పృచ్ఛకులడిగిన విషయాలపై వారడిగిన ఛందస్సులో వరుసగా ఒక్కొక్కపాదం చొప్పున చెప్పుతూ, నాలుగు అప్పుత్తులలో నూరు పద్యాలను పూర్తి చేయాలి. ఈ విధానం సాహిత్యగారడీ అయినప్పటికి కొందరు దీనిని సాహిత్య ప్రజ్ఞకు నిదర్శనంగా భావించడం చింతింపదగ్గ విషయం. వీరేశలింగం ఒకటి రెండు మారులు అష్టావధానాన్నిచేశాడు. కాని దానివల్ల తలనొప్పి రావడంచేత మానుకొన్నాడు.

పద్యాల్ని అల్లే అనేకులకన్న వీరేశలింగం ఎంతో మేలు కాబట్టి త్వరలోనే ఆయన ఒక కవిగా గుర్తింపబడడంలో ఆశ్చర్యం లేదు. మదరాసు నుండి వెలువడుతుండిన "ది పబ్లిక్ ఒపీనియన్" అన్న వార పత్రిక ఆయన ఉత్తరరామాయణాన్ని సమీక్షించింది. అందులోని "చక్కని పద్యాల"ను "ఔచిత్యాన్ని" అచ్చతెలుగులోని అభిరుచిని, కవి ప్రతిభను, "మృదుమధురశైలి'ని చాలా ప్రశంసించింది.

ప్రారంభదశలో తానుచేసిన ఈ కవితాభ్యాసాల్ని గూర్చి ఆయన ఎన్నడూ సిగ్గుపడలేదు. వాటి కర్బత్వాన్ని నిరసించలేదు కాలానుగుణంగా తాను వ్రాసిన కవిత బాగున్నదనే ఆయన భావించాడు. అయినప్పటికి లోలోపల కవిగ తన కృతుల్ని గురించి ఆయనకు అసంతృప్తి వుండేది వాగ్దేవతైన సరస్వతికి, దేవర్షి అయిన నారదునికి మధ్య సంవాదం జరిగినట్లు భావించి ఒక లఘుకావ్యాన్ని 1887వ సంవత్సరంలో వీరేశలింగం ప్రచురించాడు. శబ్దాడంబరం, పదవైచిత్రి,

కృత్రిమాలంకారాలు, పైపై నిగారింపులు, పూర్వకవుల భావాలనే పునరుద్ఘాటించడం మొదలైన రచనా విశేషాలు ఉత్తమకవిత కాజాలదని అందులో పేర్కొన్నాడు. ఈ మాటలు స్పెన్సర్ మహాకవి వ్రాసిన 'టియర్స్ ఆఫ్ ది మ్యూసెస్' అన్న కావ్యాన్ని గుర్తుకు తెస్తుంది. ఈ సంవాద రచనలోని చిత్తశుద్ధిని, ఆవేదనను, పరిశీలిస్తే అప్పటికి ఆయన ఉత్తమ కవితాత్మను. సాహిత్య తత్త్వాన్ని చక్కగా అర్థం చేసుకొన్నాడని వ్యక్తమౌతుంది ఈ నూతనావగాహనతో, దృక్పథంతో కవితను వ్రాయగల అవకాశం ఆయనకు తర్వాత తటస్థపడలేదు.

వీరేశలింగం సంప్రదాయిక పద్యరచనలే కాకుండ ప్రాచీన వచనశైలిలో కూడ అనేక రచనలు చేశాడు. వీటిని గురించి కొంత విపులంగ తరువాత చెప్పాలి గనుక ప్రస్తుతం పునర్జన్మకై అవస్థపడుతున్న నవీన వీరేశలింగం మీద దృష్టిని ప్రసరిద్దాం.

## పునర్జననం

మూడు అగ్రవర్ణాలకు చెందినవారు ద్విజన్ములని ఒక విశ్వాసం. గాయత్రీ మంత్రోపదేశంతో యజ్ఞోపవీతధారణతో వారికి రెండవ జన్మ సిద్ధిస్తుంది. బ్రాహ్మణ దంపతులకు పుట్టిన వీరేశలింగానికి ఏడవయేటనే ఉపనయనం జరిగింది.
రెండవ జన్మ ఎప్పుడు కలిగిందని ఎవరైనా ఆయన్ను ప్రశ్నించివుంటే అది తన ఎడవయేట జరిగిందని చెప్పివుండడు. తనకు పునర్జన్మ ఇరవయ్యోయేట లేదా ఇరవైఒకటోయేట సంభవించిందని సమాధానమిచ్చి వుంటాడు.

బాల్యంలో తనయీడు బాలురనేకులకున్న వీరేశలింగం ఎక్కువ నియమాలు పాటించిన "ఆచారపరుడు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం త్రిసంధ్యల్లో గాయత్రీ మంత్రాన్ని జపించేవాడు. పర్వదినాల్లో వెయ్యిమారులు జపించేవాడు. గోదావరిలో పవిత్రస్నానంచేసి, సూర్యాస్తమయ సమయంలో శివాలయాన్ని దర్శించేవాడు. దైవదర్శనార్థం సంప్రదాయానుసారంగా నొసటికి, భుజదండాలకు విబూదిపట్టెలు పట్టించేవాడు. శివరాత్రి పర్వదినాన ఉపవాసముండి జాగరణ చేసేవాడు. ఈ దశలో వేదాలను, మంత్రాలను జపించడం ఫలదాయకమనే గట్టి నమ్మకం వీరేశలింగానికి వుండేది. కఠిన నియమాలను ఆచరించి. జరామరణాలు లేకుండాచేసే సంజీవనీ ఔషధిని సాధించాలని ఉవ్విళ్ళూరేవాడు. అప్పట్లో ఋషులు, సిద్ధులు, దివ్యశక్తిసంపన్నులైన పురాణ పాత్రలు తనకు ఆదర్శపురుషులు. తన బాల్యస్నేహితుల్లో ముగ్గురికి హిమాలయాలకు వెళ్ళి అమానుష శక్తుల్ని పొందాలనే వాంఛను రేకెత్తించాడు. హిమాలయపర్వత యాత్రకు వాళ్ళు సంసిద్ధులైనారు. చివరి నిమిషంలో వీరేశలింగం పిరికితనంతో ఆగిపోయాడు. తమ నాయకుడైన వీరేశలింగం రాకున్నా, ధైర్యంతో వాళ్ళు ఎవ్వరికి చెప్పకుండా ప్రయాణమై వెళ్ళి నానా అవస్థలుపడి కొన్నాళ్ళకు తిరిగి వచ్చి ఇల్లు చేరుకొన్నారు.

ఈ సంప్రదాయబంధాలు వీరేశలింగంలో ఎప్పుడు సడలి ఆయన మరోవైపు మొగ్గాడన్నది . మనకు నిశ్చయంగా తెలియదు. ఆయన ఆలోచనల్లో విప్లవ బీజాలెప్పుడు మొలకెత్తినాయో కూడా తెలియదు. తనలో కలిగిన పరిణామాన్ని గురించి స్వీయచరిత్రలో ఆయన అధికంగా ప్రస్తావించలేదు. అయినా ఆయన జీవితంలో ఇదొక మార్పు ఈ గొప్ప మలుపు ఆయన జీవితాన్నేకాక ఆంధ్రదేశ చరిత్రనే మార్చింది. కేశవ చంద్రసేన్ ఉపన్యాసాల సంకలన గ్రంథాన్ని చదివినప్పుడు సాంప్రదాయకంగా పాటించే అనేక విశ్వాసాలను, ఆచారాలను గురించి తనలో సందేహాలు కలిగినట్లు స్వీయచరిత్రలో అక్కడక్కడ ఆయన చేసిన ప్రస్తావనలను బట్టి గ్రహింపవచ్చు. మచిలీపట్టణం నుండి క్రొత్తగా బదిలీ అయి వచ్చిన ఉపాధ్యాయుడు ఆత్మూరి లక్ష్మీనరసింహంగారితో కలిగిన పరిచయం వీరేశలింగానికి సేన్ గారి సిద్ధాంతాలను లోతుగా

పరిశీలించి తెలుసుకొనే అవకాశాన్ని కలిగించింది. పైగా బ్రహ్మసమాజ స్థాపకులైన రామమోహన్ రాయ్, దేవేంద్రనాథ్ మొదలైన బ్రహ్మసమాజ నాయకులు పునరుద్ధరించిన ఉపనిషత్తులలోని ఏకేశ్వరోపాసనను గురించి అవగాహనకు కూడా అవకాశం కలిగింది. బ్రహ్మసమాజ సంబంధమైన నూతన సిద్ధాంతాలచే ప్రభావితులైన కొందరు యువకులు, వీరేశలింగం తమలో తామీ విషయాలను చర్చించుకోడానికి రహస్యంగా కలుసుకొనేవారు ఈ రహస్య సమావేశాల విషయం తెలిసిన పెద్దలు కొందరు వీరిని పరిహసించేవారు. వీధుల్లో వీరిని చూచినప్పుడు. "మీటింగోళ్ళు వీళ్ళేనర్రో" అని అవహేళన చేసేవారు. అయినా ఈ రహస్య సమావేశాలు కొనసాగినాయి. తత్ఫలితంగా ఆధునికాంధ్ర పితామహుడుగా పరిణమించ బోయే వీరేశలింగం ఆవిర్భవించాడు. నూతన మార్గంలో ఒక్కసారి ముందంజ వేసిన వీరేశలింగానికి వెనక్కుతిరిగే ప్రసక్తిలేదు. "రెండడుగులు ముందుకు ఒక్కడుగు వెనక్కు అన్నది ఆయన ప్రవృత్తికి విరుద్ధం. గమ్యం చేరడానికి సుదూరం ప్రయాణించాలని, లక్ష్యసాధన కష్టసాధ్యమని, దారిలో ప్రతిఘటనలను ఎదుర్కోవాలని, ఈ ప్రపంచాన్నంతటిని ఎదిరించి తాను ఏకాకిగా నిలబడాలని తాను పోరాడవలసినది వ్యక్తులతో కాక వారిలో శతాబ్దాల తరబడి పేరుకొనివున్న మానసిక జడత్వంతోనని వీరేశలింగానికి మొదటే తెలుసు. ఆ క్షణం నుండి తనకు విశ్రాంతిగాని, వ్యవధిగాని ఉండదనికూడ ఆయనకు తెలుసు. 'ఈ అవగాహన ఆయన్నెంతమాత్రం అధైర్యపరచలేదు. పైగా ఈ పోరాటంలో దిగ్విజయాన్ని సాధించాలన్న పట్టుదలను పెంపొందించింది. అనేకరంగాల్లో ఏకకాలంలో పోరాటాన్ని ప్రారంభించి అకుంఠిత దీక్షతో ఆయన ముందుకు సాగాడు.

నూతన సాహిత్యసృష్టికి కారణం ఒక క్రొత్త నుడికారంకాదు. నవీన రచనా శిల్పంకాదు. ఒక అపూర్వమైన ప్రక్రియాకల్పనకూడాకాదు. సాహిత్యంలో ఇవన్నీ ముఖ్యాంశాలనడంలో సందేహంలేదు. నూతన సాహిత్య సృష్టిలో వీటికి ప్రాధాన్యమున్నది. అయితే నూతన సాహిత్యవిర్భావానికి మూలాధారమైన కారణాలు శక్తిమంతమైన దృష్టి, హృదయస్పందన, జీవిత తత్త్వావగాహన, ఇవి ఉన్నట్లయితే తక్కినవి సహజంగా, అప్రయత్నంగా అనుసరిస్తాయి. సంప్రదాయ శృంఖలాలను తెంపుకొన్న వీరేశలింగం ఒక నవీన జీవిత తత్త్వాన్ని కల్పించుకోగలిగాడు. అది నూతన వాఙ్మయ సృష్టికి (నిర్మాణానికి) దారితీసింది. స్వరూప స్వభావాల్లోను, ప్రయోజనంలోను ఆ వాఙ్మయం అపూర్వమైనది. ఇటువంటి నూతన వాఙ్మయ సృష్టికి ఆయన నవీన వచనరచనాశైలిని రూపొందించుకోవలసి వచ్చింది..

## గద్య బ్రహ్మ

ఇతర భారతీయ సాహిత్యాల్లోలాగానే తెలుగులో కూడ వచన రచన ఆధునిక కాలంలోనే స్వతంత్ర ప్రతిపత్తిని పొందింది. ప్రాచీనకాలంలో చంపూకావ్యాల్లో మాత్రం పద్యాలమధ్య అక్కడక్కడా గద్యం ఉండేది. చంపూరచనల్లో వర్ణనలకి సుదీర్ఘమైన పద్యభాగాలను కలపడానికి మాత్రమే వచన రచనను ఉపయోగించేవారు. అతికృత్రిమం. అనుప్రాసయుక్తం, అలంకారభరితమయిన యీ గద్యం సాధారణ భాషాశైలికి ఎంత భిన్నంగా మానవబుద్ధి కల్పించగలదో అంత భిన్నంగా వుండేది. అలంకార భూయిష్టంగ వ్రాయడమే ఈ వచన రచనోద్దేశం. కాని భావ వ్యక్తీకరణ కాదు. వచనానికి అంత నిమ్నస్థానాన్ని కల్పించినందువల్లనే ఛందోగ్రంథాలు, నిఘంటువులుకూడ పద్యరూపంలోనే వెలసినాయి. అలాగే చిత్రకళ, శిల్పం, సంగీత నృత్యశాస్త్రాలు, వైద్యాది శాస్త్రగ్రంధాలన్నీ ఛందోబద్ధంగానే వ్రాయబడ్డాయి.

ముద్రణ సౌకర్యాలు లేని కాలంలో వచన రచనకు అనుకూల పరిస్థితులు లేక పోవడం సహజమే. కావ్యాది గ్రంథాలకు ప్రతులు తయారు చేయడమన్నది చాలా వ్యయప్రయాసలతో కూడిన పని.

గ్రంథసేకరణ - సంపన్నులు మాత్రమే పాటించగల భోగం. ఇట్టి పరిస్థితుల్లో అనేకులు తాము నేర్చుకోదలచిన కావ్యాదుల్ని విధిగా కంఠస్థం చేసుకోవలసిందే. వచనం కన్న పద్యాన్ని ధారణ చేయడం సులభం. ఈ సౌలభ్యమే వచన రచన ఒక సాహిత్య ప్రక్రియ గాపురోగమించడానికి ప్రతిబంధకమయింది.

తెలుగుభాషను సాహిత్యరూపంలో సామాన్య రూపంలో సామాన్యుల అందుబాటులోనికి తేవడానికి ప్రప్రథమంగా ప్రయత్నించినవారు క్రైస్తవ మిషనరీలు, బ్రిటీషు ఉద్యోగులు, వాళ్ళే మదరాసులో మొట్టమొదట తెలుగు ముద్రణాలయాన్ని స్థాపించారు. సి.పి. బ్రౌన్ తన తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు ప్రథమముద్రణ పీఠికలో (1852) ఇలా పేర్కొన్నాడు:

"తెలుగు ముద్రణ తెలుగుదేశంలో 1806 ప్రాంతాల్లో ప్రారంభమైంది. కాని 1830 వరకు అభివృద్ధిని పొందలేదు. 1835 ప్రాంతాలలో మదరాసులో కొన్ని సంస్కృత శ్లోకాలు, తెలుగు పద్యాలు ముద్రితమయ్యాయి. ప్రస్తుతం దేశీయులు నిర్వహిస్తున్న ముద్రాక్షరశాలల్లో అనేక గ్రంథాలు ముద్రితమై, వెలుగులోకి వస్తున్నాయి. ఇంగ్లీషువారి యాజమాన్యంలోనివి మినహాయిస్తే అట్టి ముద్రాక్షరశాలలు సుమారు ఎనిమిది ఉన్నాయి." మొదటి తెలుగు పుస్తకం 1835లో ముద్రితమైనదనడంలో సి.పి. బ్రౌన్ బహుశా పొరపడి వుండవచ్చు. విలియం బ్రౌన్ సంకలించిన 'ఏ వకబులరీ ఆఫ్ జెంటూ అండ్ ఇంగ్లీష్' అనే నిఘంటువు 1818లోనే ప్రచురింపబడిందని మనకు తెలుసు. ఏ.డి. క్యాంబెల్ కూర్చిన 'ఏ డిక్షనరీ ఆఫ్ ది తెలుగూ లానే గ్వేజ్, కామన్లీ టెర్మ్ డ్ ది జెంటూ' అనే నిఘంటువు 1821లో ప్రకటింపబడింది.
ఇవి ద్విభాషా నిఘంటువులు. వీటితోపాటు లేదా ఇంకొంచెం ముందుగాని ఏదైనా ఒక తెలుగు పుస్తకం తప్పక ముద్రణ పొందివుండాలి. మొట్టమొదట ముద్రింపబడిన తెలుగు పుస్తకం బైబిలు అనువాదమై ఉండవచ్చు కూడా.

విదేశీయ మిషనరీలు, ప్రభుత్వోద్యోగులు తమ మాతృభాష కానట్టి తెలుగులో ఎక్కువ రచనలు చేయలేకపోయారు. వారు బైబిలుకు చేసిన వచన రూపానువాదాలు పాఠ్యపుస్తకాలంత శ్రేష్ఠమైనవికావు. వారు ప్రారంభించిన వచన రచనను వంగదేశంలోలాగా ఏ రామమోహన్ రాయో ఏ విద్యాసాగరో అనుసరించి ఉండినట్లయితే, తెలుగు వచన రచనకూడ అనతి కాలంలోనే అభివృద్ధిని పొంది ఉండేదే. ఈ దశలో దురదృష్టవశాత్తు తెలుగు సాహిత్య రంగంలో చిన్నయసూరి అడుగుపెట్టాడు. అతనిది సంకుచిత దృష్టి తిరోగామి పాండిత్యం. ఆదర్శప్రాయమైన వచనశైలిగల ఒక పుస్తకాన్ని రచించే ఉద్దేశంతో చిన్నయసూరి 'నీతి చంద్రిక'ను రచించాడు. పంచతంత్ర హితోపదేశాలలోని మొదటి రెండు భాగాల్ని ఆధారంగా చేసుకొని వ్రాయబడిన రచన యిది. తెలుగు వచనానికి సార్వకాలికమైన లక్షణాన్ని ఏర్పరచే అభిప్రాయంతో ఒక వ్యాకరణాన్ని కూడ తయారుచేశాడు. మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడు కావడంచేత అప్పుడాయనకున్న పలుకుబడి. పదవి కారణంగా నీతి చంద్రిక, బాలవ్యాకరణం రెండూ పాఠ్యపుస్తకాలుగా వ్యాప్తికి వచ్చాయి. ఈ రెండు పుస్తకాలు ఒక అర్ధ శతాబ్దికాలం తెలుగు వచన రచనాభివృద్ధిని నిరోధించాయి.

సమకాలికులు చిన్నయసూరిని తెలుగు గద్యరచనకు నన్నయవంటి వాడని ప్రస్తుతించారు. ఆయన దుష్ప్రభావం వల్ల కృత్రిమము పురాతన పదప్రయోగ భరితమూ, ఉచ్చారణ క్లిష్టమూ అయిన వచన రచన ప్రచారంలోకి వచ్చింది. అది ఉడకని గట్టి ముక్కలా, నిఘంటు నిరపేక్షంగా కొరుకుడు పడేది కాదు. చిన్నయసూరిని గ్రుడ్డిగా అనుకరించినవారిలో కొక్కొండ వేంకటరత్నం ప్రథముడు మరీ అంత అన్యాయంగా కాకపోయినా, వీరేశలింగం కూడ సూరిని అనుకరించిన వాడే ఒకే అనువాదానికి తాము పూనుకున్నామన్న విషయం పరస్పరం తెలియకనే కొక్కొండ, వీరేశలింగం ఇద్దరూ సంస్కృత పంచతంత్రంలో నాల్గవ భాగమైన విగ్రహ తంత్రాన్ని ఏక కాలంలో అనువదించారు. వీటిలో కొక్కొండ వేంకటరత్నం చేసిన అనువాదమే మొదట ముద్రితమైంది. ఆ గ్రంథాన్ని చూచిన తరువాత తన అనువాదమే మెరుగని

గ్రహించి, వీరేశలింగం తన గ్రంధాన్ని ప్రకటించాడు. ఇది వారిమధ్య వాగ్యుద్ధానికి దారితీసింది. ఈ వాగ్యుద్ధం నిమిత్తం కొక్కొండ వేంకటరత్నం తాను ప్రకటిస్తున్న ఆంధ్రభాషా సంజీవని పత్రికకు 'హాస్యవర్ధని' అన్న దానిని అనుబంధంగా చేర్చాడు. దీన్ని ప్రతి ఘటిస్తూ వీరేశలింగం తన ''వివేకవర్ధని' పత్రికలో 'హాస్య సంజీవని' ని ప్రత్యేక సంచికగా ప్రకటించాడు. ఈ పత్రికానుబంధాలను హాస్య ప్రధాన రచనలుగా పరిగణించినా, వీటిలో పరస్పర విద్వేషం, అవహేళన నిండివున్నాయి. ఈ ముసుగులో గుద్దులాటను త్వరలోనే విడిచిపెట్టి, బాహాటంగానే ఒకరి నొకరు తిట్టుకొన్నారు. వైయక్తిమైన యీ విద్వేషాలు ఎలా వున్నా ఉత్తమ వచన శైలి ఏది అన్న ప్రధానప్రశ్నపై పండితుల దృష్టిని మరల్చడానికిది సహకరించింది.

ఈ యిద్దరు రచయితల మధ్య 1874 లో ప్రారంభమైన వాగ్యుద్ధాన్ని పాతకలోకం చూసింది. ఈ వాగ్యుద్ధం కొన్ని మాసాలు కొనసాగింది. అంతిమ విజయం వీరేశలింగానికే దక్కింది. ఆయన అనువదించిన విగ్రహ తంత్రమే రెంటిలో ఉత్తమమైన రచనగా నిర్ణయింపబడింది. దాన్ని పాఠ్యపుస్తకంగా పెట్టారు ఆ పుస్తకంవల్ల వీరేశలింగానికి వెయ్యిరూపాయలు ఆదాయం వచ్చింది. ఇంత డబ్బును తన జీవితంలో ఆయన అంతకుముం దెప్పుడూ చూడలేదు. ఎదురు చూడని ఈ అదృష్టం ఆయనకు స్వేచ్ఛను, ఆత్మ విశ్వాసాన్ని ప్రసాదించింది. ఆ గ్రంథాదాయాన్ని తన చేతుల్లోకి తీసుకొన్నప్పుడు తెలుగు ఉపాధ్యాయ వృత్తికి, ప్రభుత్వోద్యోగానికి ఉద్వాసన చెప్పి రచయితగా తన సంపాదనతో సుఖంగా జీవించవచ్చునన్న ఆలోచన తనకు కలిగినట్లు వీరేశలింగం స్వీయ చరిత్రలో పేర్కొన్నాడు.

ఈ కాలంలోనే పండితుడైన వీరేశలింగం మరుగునపడి లక్ష్య సాధకుడైన వీరేశలింగం ముందుకొచ్చాడు భావ వ్యక్తీకరణ సాధనగా తన వచన రచన ఉపకరిస్తుందా అన్న సంశయం. ఈ క్రొత్త వీరేశలింగాన్ని పీడించింది. తనకు తానే 'భాషా ప్రయోజన మేమిటి?' అని ప్రశ్నించుకున్నాడు. ఈ ప్రశ్నకు సమాధానం కనుక్కోవడానికి ఆయన కెంతోకాలం పట్టలేదు. భాష యొక్క ముఖ్యప్రయోజనం భావవ్యక్తీకరణం రచనలో భాష ఎంత సరళంగా, ఎంత స్పష్టంగా వుంటే భావ వ్యక్తీకరణ అంత సూటిగా ఉంటుంది. ఇది ఆయన గుర్తించిన సత్యం.

ఆయన స్వీయ చరిత్ర చోటు చేసుకొన్న పై ప్రశ్న, దాని సమాధానం తెలుగు వాఙ్మయ చరిత్రలో ఒక మలుపును సూచిస్తాయి. తెలుగులో ఆధునిక రచన పుట్టిన తేదీని చెప్పమని ఎవరైనా అడిగితే భాషా ప్రయోజనాన్ని గూర్చి వీరేశలింగం తన్ను ప్రశ్నించుకొన్న రోజున అది పుట్టిందని తడుముకోకుండా చెప్పవచ్చు.

అంతవరకు తాను కృత్రిమంగా, పాతబడ్డ మాటలతో వ్రాస్తూ వచ్చిన వచనం నిష్ప్రయోజనమని గుర్తించి, దాన్ని సంపూర్ణంగా పరిత్యజించి, నూతన వచన సృష్టికి పూనుకొన్నాడు. నూతన మార్గగాములు విషయంలో లాగే ఆయన మార్గంలో కూడా ఒడుదుడుకులు ఎదురయ్యాయి.

భాష నుడికారం, స్వరూపం చెడనిరీతిలో పాత పద్ధతికి స్వస్తి చెప్పవలసి వచ్చింది. నిర్జీవ కృత్రిమత్వంనుండి నిష్ప్రయోజనమైన అగాధంనుండి దాన్ని తప్పించవలసి వచ్చింది. పేలవంకాని స్పష్టతను హైన్యంకాని పటిమను వచన రచనలో కల్పించవలసి వున్నది. పాత పదాలకే నూతన భావచ్ఛాయల్ని, ప్రాచీన జాతీయాలకే నూతనార్థాలను సమకూర్చవలసి వచ్చింది. అవసరాన్ని బట్టి క్రొత్త పదాలను కూడ కల్పించవలసి వచ్చింది.. ఒక్క మాటలో చెప్పాలంటే నూతన యుగావసరాలకు అనుగుణమైన ఒక నూతన భాషా సాధనాన్ని ఆయన నిర్మించవలసి వచ్చింది. ఇట్టి కష్టసాధ్యమైన కార్యానికి కంకణం కట్టుకొన్న వీరేశలింగం చాలవరకు కృతకృత్యుదయ్యాడు. నూతన వచన రచనాస్రష్టగా

ఆయన సాధించిన అద్భుత విజయాన్ని లోకం వెంటనే గుర్తించింది. ప్రశంసలకు పాత్రుడయ్యాడు. ఆయన రచించిన రెండు పుస్తకాలను 1878లో హిందూ పత్రిక (The Hindu) ఇలా సమీక్షించింది.

"దేశభాషల్లో ప్రయోజనకరమైన మంచి పుస్తకాలు లేవన్న అభియోగం ఇప్పటివరకున్నది. ఉన్నకొద్ది పుస్తకాలు సామాన్య పాఠకులకు సుబోధకాలు కావు. వాటిలోని శైలి చాల కృత్రిమం, కఠినం కాబట్టి అవి సామాన్యమైన తెలివి తేటలుగల విద్యార్థులకు అగమ్యగోచరంగ వున్నాయి. శబ్దాడంబరం నిమిత్తం భావాన్ని త్యాగం చేయడం. అన్నలోపం ప్రత్యేకంగా తెలుగు వాఙ్మయంలో అధికం. ఈ లోపం స్కూల్ బుక్ సొసైటీవారి ప్రచురణవల్ల కొంత సవరింపబడింది. అయితే యివి మరికొన్ని విషయాల్లో దోష భూయిష్టాలని మనకు తెలుసు. సరళతను సాధించే ఉద్దేశంతో అవి ప్రాథమిక భాషాలక్షణాలను కూడ పాటించకుండా వ్యాకరణ విరోధంగా కొన్నిమార్లు భాషనుడికారాన్నే ఉల్లంఘిస్తవి... అందుచేత కందుకూరి వీరేశలింగం పంతులుగారు. ఈ రెంటికి మధ్య మార్గాన్ని కనుగొనడం ముదావహం. ఆయన శైలి మనోహరం. నుడికార సహితం, దూరాన్వయరహితం. అది పేలవంగా, నిస్సారంగా, విసుగును. పుట్టించేది కాదు. స్కూల్ బుక్ సొసైటీ వారి ప్రచురణల్లో వెదకినా కనిపించని చక్కని ధార ఆయన రచనల్లో ఉన్నది... చిన్నయసూరి నీతిచంద్రికకు పూరణగా రచింపబడిన విగ్రహగ్రంథకర్త తన ప్రాచీన మార్గాన్ని వదిలించుకొని తెలుగు వాఙ్మయంలో క్రొత్తపుంతల్ని తొక్కుతాడనుకోలేదు. కనుక సమీక్షకు వచ్చిన రెండు పుస్తకాలు నూకు ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలిగించాయి. అప్పటికి యిప్పటికి దక్షిణాదిలో సద్విమర్శకు పేరుపొందిన హిందూ పత్రిక ఇంకా ఇలా పేర్కొన్నది:

"రానున్న కాలంలో దేశం వెనుతిరిగి చూచినప్పుడు అజ్ఞానులైన ప్రజల మధ్య, చైతన్యం లేని జనులమధ్య ఇంగ్లీషు భాషాచదువులు ప్రధానంగాను, దేశభాషా చదువులు పనికి దానివిగాను పరిగణింపబడే కాలంలో, ఇంగ్లీషు చదువులతో ప్రజ్ఞానవంతులైన స్వదేశీయుల మధ్య ఒంటరిగ నిలిచి ఆధునిక వాఙ్మయానికి పునాదులువేసి సమగ్రతను సామరస్యాన్ని వేసిన ఆ వ్యక్తిని దేశ ప్రజలు గర్వంతో స్మరించే కాలం ఆంధ్రవాఙ్మయ చరిత్రలో రాగలదని మేము భావిస్తున్నాం...

సంఘసంస్కారంలోలాగే, నూతన వచన రచనా సృష్టిలోనూ వీరేశలింగం 'దక్షిణదేశ ఈశ్వరచంద్ర విద్యాసాగర్' అయ్యాడు. ఈ రెండు రంగాల్లోను రామమోహన్ రాయవల్ల విద్యాసాగర్కు పని తేలికైనది. విద్యాసాగర్ కంటె ఎంతో కాలం ముందుగానే రామమోహన్ రాయ్ సతీసహగమన నిర్మూలనకు వంగదేశంలో పోరాడాడు. నవీన సాంఘిక మత సిద్ధాంతాల ప్రచారం నిమిత్తం బెంగాలీ భాషలో క్రొత్త వచనాన్ని రూపొందించాడు. కనుక విద్యాసాగర్ చేసింది రామమోహన్ రాయ్ ప్రారంభించినదానిని కొనసాగించడం మాత్రమే కాని వీరేశలింగం అపూర్వంగా ఆరంభించవలసి వచ్చింది. అయినప్పటికి ఆయన సాధించినవి తక్కువేమీ కావు. ప్రస్తుతానికి వీరేశలింగాన్ని నూతన వచన రచనా స్రష్ట అన్నంతవరకే పరిమిత మొనర్చుకొని రాగూరు ప్రవచించిన ఈ క్రింది ప్రశంసలో విద్యాసాగర్ స్థానంలో వీరేశలింగం పేరును, బెంగాలీ భాషకు బదులు తెలుగును పెట్టుకుంటే చక్కగా సరిపోతుంది.

"ఆధునిక బెంగాలీ వచన రచనా సృష్టికర్త విద్యాసాగర్. ఆయన కంటే ముందే బెంగాలీ వచనం సాహిత్య ప్రక్రియగా రూపొందిన మాట వాస్తవమే. అయితే బెంగాలీ భాషను కళాత్మకంగా ఉపయోగించడానికి నేర్చిన ప్రథమాచార్యుడు ఆయనే. ఆయనకు పూర్వం మనభాష క్రమశిక్షణలేని ప్రజాసమూహంలాగా రచయిత స్వాధీనంలో లేకుండా ఉండేది. దాన్ని ఆయన స్వాధీనపరచుకొని పదాల్ని క్రమంగా సమకూర్చి, వాటిని విభిన్న వర్గాలుగా వింగడించి, శబ్దధ్వనికి అర్థస్ఫూర్తిని సమన్వయపరచి, అనాయాసంగా పదాలు ప్రవహించేలా చేసి వాటి ప్రయోజనాన్ని ఇనుమడింప చేశాడు. విద్యాసాగర్ వేసిన బాటలో ఎందరో బెంగాలీ సాహిత్య సైన్యాధిపతు లిప్పుడు క్రమబద్ధమైన పదాల సైన్యాన్ని వినూత్న

విజ్ఞాన రంగాలలోకి విజయవంతంగ నడిపిస్తున్నారు. భాషను కళాకారుని స్వాధీనంలోకి తేవడానికి పాటుపడిన వ్యక్తికే ప్రప్రథమంగా ఈ నూతనరీతులు సృష్టించిన కీర్తిని ఆపాదించాలి."

తెలుగు వచనమిప్పుడు సుసంపన్నమైనదనడంలో సందేహం లేదు. ఇప్పుడదెంతో కాంతి వంతంగా, సొంపుగా, వైవిధ్యంతో ప్రౌఢంగా ఉన్నది. వీరేశలింగం
వచన రచనలోని గుణాలు సమత, ధార, స్పష్టత మాత్రమేనని తెలివితక్కువగా ఈసడించేవారు ఈ గొప్పమార్గదర్శి భుజస్కంధాలమీద తామెక్కివున్నామన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. విజ్ఞానశాస్త్రరంగంలో న్యూటన్ వంటి మేధావి తన పూర్వీకులకి తానెంత ఋణపడివున్నాడో అతివినయంగా ప్రశంసించాడు. "మహోన్నతులైనవారి భుజాల్ని అధిరోహించడంవల్లనే నేను డెస్కార్డ్ (Descartes) కన్న అధికంగా చూడగలిగాను" అని ఒకప్పుడాయన అన్నాడు.

## బహుముఖ సమరం

వీరేశలింగం రచనల ఆధిక్యాన్ని, సర్వతోముఖమైన వాటి ప్రభావాన్ని నిర్దుష్టంగా అంచనా వేయడానికి, సంఘసంస్కర్తగా ఆయన నిర్వహించిన కృషిని స్థూలంగానైనా తెలుసుకోవడం అవసరం. నిజానికి ఆయన సాహిత్యం, సంఘసంస్కరణ రెండూ పరస్పర పూరకాలు. ఆయనలోని సంఘసంస్కరణాసక్తి ఆయన రచనలకు వేడిని, వాడిని కలిగించి, కాంతిజ్వాలల్ని ప్రసరింపచేసింది. ఆయన కలానికున్న శక్తి నైపుణ్యాలు ఆయన సాంఘిక దురాచారాలమీద నడపిన దాడికి తీవ్రమైన చోదకశక్తిని ప్రసాదించాయి.

ప్రజాస్వామిక రాజ్యాంగం కలిగిన స్వతంత్ర భారతదేశంలో జన్మించిన వారికి 19వ శతాబ్దం చరమపాదంలో వీరేశలింగం ఎటువంటి బలవత్తర దుష్టశక్తుల్ని ఎదుర్కోవలసివచ్చిందో గ్రహించడం కొంతకష్టమే ప్రతి ఇంటిలో ఏమూలచూచినా ఒక భూతం, ప్రతివీధి మలుపులో ఒక భూతవైద్యుడు ఉండిన కాలమది ఆడవాళ్ళను చదివించడం అనే సాహసాన్ని బుద్ధిగలవాడెవ్వడూ చేసేవాడుకాదు. ఎందుచేతనంటే చదువుకొన్న భార్య రహస్యంగా ఉత్తరాలు వ్రాసి అక్రమంగా ప్రియుల్ని ఆకర్షించుకొంటుందనుకొనేవారు బాల్యవివాహాలు సర్వసాధారణం. తరచూ వంటి బిడ్డలకే పెండ్లిండ్లు చేసేవారు కొన్ని సమయాల్లో గర్భంలోవున్న బిడ్డలకు కూడ పెండ్లిండ్లు నిశ్చయించేవారు. వెలపాడి బాలవధువును కొనడం పరిపాటి మూడుకాళ్ళ ముసలికూడ దురదృష్టవంతురాలైన ఏ ఆడబిడ్డ తండ్రికైనా శుల్కమిచ్చి జంకూ గొంకూ లేకుండ ఆమెను రెండో భార్యగానో లేదా మూడో నాలుగో భార్యగానో స్వీకరించవచ్చు. మరి భర్తను పోగొట్టుకొన్న స్త్రీ ఎట్టి పరిస్థితుల్లోను పునర్వివాహం చేసుకోకూడదు యుక్త వయస్సుకురాని అమ్మాయిగాని లేదా చిట్టి పాపాయిగాని భర్తను పోగొట్టుకుంటే జీవితమంతా వైధవ్యాన్ని అనుభవించవలసిందే. పైగా గుండు చేయించుకొని, ఒక్కపొద్దులుచేస్తూ, నగానట్రాలేకుండ తెల్లచీర కట్టుకొని వుండవలసిందే పెండ్లిండ్ల దళార్లుగ జీవించడం గౌరవార్హం. ఉంపుడుగత్తెను ఉంచుకోవడం ప్రతిష్టకు నిదర్శనం. ఏ పండగైనా భోగంమేళం లేకుండా వుండదు. భిన్నకులాల మధ్య, ఒకే కులంలో భిన్నశాఖీయులమధ్య సహపంక్తి భోజనాలు నిషేధం. సముద్ర ప్రయాణమంటే సంఘంలో వెలినికోరి తెచ్చుకోవడమే సమాజంలో కొందర్ని తాకితే మైల నిరాటంకంగా లంచాల్సి యిచ్చిపుచ్చుకొనేవారు. లంచాలకు న్యాయాధిపతులు కూడ దాసులే. ఒక్కమాటలో చెప్పాలంటే దయాదక్షిణ్యాలు లేని, నీచమైన, వక్రమైన క్రూరమైన సమాజమని అన్నిటిలోను ద్వంద్వ విధానమే పెద్దలకు ఒక చట్టం, పేదలకు మరొక చట్టం. స్త్రీలకు ఒక నీతి, పురుషులకు మరొకనీతి ఆనాటి సమాజంలోని వాతావరణమంతా కలుషితమై, స్వతంత్రమైన ఆలోచనా సరళిని, మానవతాభావాల్ని అణచివేసింది. ఇలా దిగజారిపోయిన సంఘంలోని మొండితనాన్ని, మూర్ఖత్వాన్ని వీరేశలింగం ఎదుర్కోవలసి వచ్చింది.

వీరేశలింగం సంఘ సంస్కరణకు పూనుకోడానికి, వ్యక్తిగతమైన సంఘటనలు కాని, హృదయ విధారకానుభవాలు కాని కారణాలు కావు. రాజా రామమోహన్ రాయ్ విషయంలో చిన్ననాడు. ఆయనను చలింపచేసిన ఒక విషాద సంఘటనే క్రూరమైన సహగమన సంప్రదాయాన్ని ఆయన ప్రతి ఘటించడానికి దారితీసిందని చెప్పవచ్చు. అయన అన్న జగ్మోహన్ అకాలమరణాన్ని పొందినప్పుడు, అన్న భార్య ఆ చితిలోనే ఆత్మాహుతి చేసుకొన్నది. ఆమె నలా చేయమని ఎవ్వరూ ప్రేరేపించలేదు. బలవంతం చేయలేదు. వీడరాని అనుబంధమున్న భర్త మరణించిన తత్ క్షణమే తన తనువును కూడ చాలించాలని ఆమె సంకల్పించింది. అన్నదావు, వదిన సహగమనం, ఈ రెండు విషాద సంఘటనలు రామమోహన్ రాయ్ చేపట్టిన సతీ సహగమన నిర్మూలనోద్యమానికి ప్రధాన కారణాలని భావించవచ్చు.

విద్యాసాగర్ జీవితంలోను ఇటువంటి సంఘటనే ప్రేరకమైంది. ఆయన కలకత్తా సంస్కృత కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు తాను చాల అభిమానించి, గౌరవించే ఒక ఆచార్యుడు భార్య మరణిస్తే వెంటనే ఒక యువతిని ద్వితీయగా వివాహమాడినాడు. ద్వితీయ వివాహానంతరం ఆ వృద్ధాచార్యుడు దీర్ఘకాలం బ్రతకలేదు నిండు యౌవనంలోని ఆ రెండోభార్యకు అంటగట్టబడిన వైధవ్యం విద్యాసాగర్ మనస్సును కలచివేసింది. ఈ విషాద సంఘటనానంతరం ఆయన స్వగ్రామానికి వెళ్ళాడు. అక్కడ ఆయన తల్లి పొరుగింటి లోని ముక్కు పచ్చలారని అందమైన ఒక బాల వితంతువును చూపెట్టి "నీవు చదివిన శాస్త్రాలు ఈ అమాయకురాలిని వైధవ్యంనుండి రక్షించే మార్గాల్ని చూపలేవా?" అని రుద్ధకంఠంతో ప్రశ్నించింది.

వీరేశలింగం జీవితంలో వ్యక్తిపరంగా లేదా కుటుంబపరంగా ఇటువంటి విషాద సంఘటనలేవీ జరగలేదు. వీరేశలింగం కార్యరంగంలోకి దూకడానికి ఆనాటి యుగశక్తి, ఆయనకున్న సాంఘికన్యాయ దృష్టిమాత్రమే ప్రధాన కారణాలు. ఆయన సంస్కరణోద్యమంలో తన పూర్వులకన్న, తరువాత వచ్చిన వారికన్న అధికమైన పట్టుదలతో, దృఢసంకల్పంతో పోరాడాడు. ఆయన పోరాడిన రంగాలు, చేపట్టిన వుద్యమాలు అనేకం. ఏకేశ్వరోపాసన నుండి ఆధునిక విజ్ఞాన ప్రచారం వరకు ఉన్నాయి.

వీటిలో విగ్రహారాధనా నిరసన; భూతప్రేత పిశాచభయ నిర్మూలన, స్త్రీ విద్యా ప్రోత్సాహం, వితంతు పునర్వివాహాల ప్రచారం, మేజువాణీ నిషేధం, అస్పృశ్యుల ఉద్ధరణ, అగ్రవర్ణాలవారి డంబాచారాల దూషణ, అధికారులు లంచగొండితనాన్ని బట్టబయలు చేయడం మొదలైన కార్యాలెన్నో ఉన్నాయి. మొత్తం మీద కల్లాకపటం లేని న్యాయబద్ధమైన సమాజస్థాపన కోసం బహుముఖమైన పోరాటాన్ని వీరేశలింగం నిర్వహించా. డనడం గుర్తుంచుకోదగిన ముఖ్య విషయం.

తన యింట్లోనే మూఢవిశ్వాసాలను ఎదిరించడంతో వీరేశలింగం పోరాటం ప్రారంభమయింది. వీరేశలింగం ఇంటి ఆవరణలోని ఒక అరటి మొక్క బోదెలోనే పూచి గెలవేసింది. దాన్ని వెంటనే నరికివేయాలని లేకపోతే అది అనర్థదాయకమని ఇరుగు పొరుగు వారందరూ హెచ్చరించారు కాని ఆయన అరటిగెలను మొక్కలోనే పండనిచ్చి హాయిగా ఆరగించాడు. ఇంటిలో తేనెటీగలు పెట్టిన తేనెపట్టు కూడ కీడును కలిగిస్తుందని వెంటనే దాన్ని తీసివేయాలని అందరూ ఆయనకు సలహానిచ్చారు. ఆ తేనెటీగలు తేనె కూడబెట్టేదాక ఆగి, ఆ తేనెను కూడ చక్కగా ఆస్వాదించాడు. అమావాస్యరోజున ఏ కార్యాన్నయినా ఆరంభించడం అపాయకరమని వాళ్ళ అమ్మగారు ఏడ్చినా తాను కోరంగి పాఠశాల ప్రధానోపాధ్యాయ పదవిని అమావాస్యనాడే స్వీకరించాడు. ఈ విధంగా జీవితమంతా ప్రతి మూఢవిశ్వాసాన్ని లీలగా ప్రతిఘటించాడు. అలా ప్రతిఘటించిన ప్రతి సందర్భంలో తనకే మేలు కలిగింది. మదరాసులో నివసిస్తున్నప్పుడు. తన బండికి ఒక గుఱ్ఱం కావలసి వచ్చింది. తాను చూసిన ఒక గుఱ్ఱానికి సుడులున్నాయి.

అటువంటి సుడులున్న గుజ్జం యజమానికి హానికరమని ఎవ్వరూ దాన్ని కొనడానికి సాహసించలేదు. అయితే వీరేశలింగం దాన్ని చాల చౌక బేరానికి కొన్నాడు. ఒక రాత్రి. బండివాడు నిద్రపోయినా జన సమర్ధమైన వీధులగుండా, అపాయకరమైన మలుపులు తప్పిస్తూ లాగి బండిలోవున్న వీరేశలింగాన్ని సురక్షితంగా ఇల్లు చేర్చిన మంచి గుఱ్ఱమది.

మూఢ విశ్వాసాల తరువాత వీరేశలింగం భూతవైద్యుల్ని ప్రతిఘటించాడు. ఆయన తల్లికి మూర్ఛ రోగం అందుకు కారణం తన్ను పట్టిన దయ్యమని భావించిన తల్లి ఎందరో భూతవైద్యుల్ని సంప్రతించింది. వారందరూ వైద్యం పేరుతో అమెదగ్గర ఎంతో డబ్బు లాగేవాళ్ళు. ఆ భూతవైద్యుల్ని వీరేశలింగం గట్టిగా ఎదుర్కోసాగాడు. వారిలో ఒకడు మాత్రం గంజాయి త్రాగడానికి తగినంత డబ్బును ఇవ్వనప్పుడు చాల దురుసుగా ప్రవర్తించాడు. తన మంత్రాలతో వీరేశలింగం ప్రాణాల్ని బలికొంటానని బెదిరించాడు. కాని చివరకు తానే భయపడిపోయి జబ్బుతో చావు బ్రతుకుల్లో ఉండగా వీరేశలింగమే వాడిని కాపాడవలసి వచ్చింది. వాళ్ళ అమ్మతో విసుగు లేకుండా సహేతుకంగా వాదించి చివరకు ఆమెలోని పిశాచభయాన్ని పోగొట్టిన గొప్ప సంస్కర్త వీరేశలింగం మరణించటానికి రెండేళ్ళకు ముందే ఆమెకు దయ్యాలమీద పూర్తిగా నమ్మకం పోయింది.

కుమారుని దుఃఖసముద్రంలో ముంచి 1878 సెప్టెంబరు 22వ తేదీన ఆమె పరమపదించింది. సిగ్గు బిడియం లేకుండా బాహాటంగా జరుగుతున్న అక్రమ లైంగిక సంబంధాలను అరికట్టడం వీరేశలింగం ఎన్నుకొన్న మరొక రంగం. ఆ కాలంలో పురుష వ్యభిచారం సర్వసామాన్యమైన విషయం శక్తివున్నా లేకపోయినా ఉంపుడుగత్తెను ఉంచుకోవాలి. ఉంపుడుగత్తె లేనివానికి మగతనం లేనట్లే పరిగణించేవారు. ఇద్దరు, ముగ్గుర్ని ఉంచుకోవడం ఇంకా ఘరానా. న్యాయవాదులు, న్యాయాధిపతులు, వైద్యులు, అధికారులు, వ్యాపారులు ఒక్కరేమిటి అన్ని వర్గాలవారికి అన్ని వృత్తులవారికి వ్యభిచారం సర్వసాధారణ విషయమే.

ఉంపుడుగత్తెల ఇండ్లలోనే అధికారికమైన లావాదేవీలు చాలవరకు జరిగేవి. ఈ స్త్రీలందరూ దేవదాసీ కులానికి చెందినవారు. వాళ్ళు నాట్యకత్తెలవడంచేత రసికులు మేజువాణీలను ఆదరించేవారు ఈ బోగంమేళానికి ఆహుతులైన అతిథులు ఆ నాట్యకత్తెలకు డబ్బివ్వడం సంప్రదాయం ఈ సుంకాన్ని చెల్లించకుండా తప్పించుకోడానికి ప్రయత్నించేవాడిని రసికులైన అధికారులు, నీచంగా చూచేవారు. ఈ దురాచారాలు వేళ్ళూని స్థిరపడివున్నా, కొంతకాలానికి వీరేశలింగం ధాటికి నిలువలేక క్షీణింపసాగినాయి. ఆయన కొనసాగించిన యీ పోరాటం పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే వీరేశలింగం స్వీయచరిత్రను తప్పక చదవవలసిందే.

సంఘంలో వేశ్యావృత్తికి ఒక ప్రత్యేక కులాన్ని నిర్దేశించి ఉపయోగించడంలోని అమానుషత్వాన్ని వీరేశలింగం పూర్తిగా గుర్తించాడు. అయితే యితర సమస్యల పరిష్కారంలో మునిగిపోయిన వీరేశలింగానికి వేశ్యాసమస్యను పరిష్కరించడానికి సమయం లేకపోయింది. ఒకప్పుడు స్వగ్రామంలో వీరేశలింగం దంపతులు ఒక స్నేహితుని ఇంటికి వెళ్తుండగా ఒకడు తాను ఉంచుకొన్న దేవదాసిని కోపంతో జుట్టుపట్టి వీధిలోకి ఈడ్చి బాధిస్తుంటే, రక్తసిక్తమైన ఆమె ముఖాన్ని చూచాడు. ఈ ఘోరదృశ్యాన్ని చూచి కంపించిన రాజ్యలక్ష్మి భర్తతో నిర్భాగ్యులైన యీ పతితల్ని రక్షించడానికి మనమేమీ చేయలేమా? అని ప్రశ్నించింది. అపుడు వీరేశలింగం దీర్ఘంగా నిట్టూర్చి భార్యతో "ఇంకొక రంగంలో పోరాటాన్ని క్రొత్తగా ప్రారంభించడానికి మనం ముసలివాళ్ళమయ్యాము కదా!" అన్నాడు. ఆ తరువాత వీరేశలింగానికి సహచరుడు స్నేహితుడు అయిన సర్ రఘుపతి వెంకటరత్నం పాపకూపంలో తరాల తరబడి కూరకుపోయిన దేవదాసీలను రక్షించడానికి పూనుకొన్నాడు.

వీరేశలింగం తొలిరోజుల్లో ప్రతిఘటించిన మరొక దురాచారం అధికారులు లంచగొండితనం; వారి దుర్మార్గం. ఈ పోరాటాన్ని అసహాయశూరుడుగా ఎదుర్కొన్నాడు. ఈ ఉద్యమ ఫలితంగా ఒక మారు రాజమండ్రిలో అవినీతిపరుడైన జిల్లా మునసబును ప్రభుత్వం ఉద్యోగంనుండి తొలగిస్తే ఆ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆ మునసబుకు చేదోడువాదోడుగా నుండిన ఒక గవర్నమెంటు ప్లీడరు కూడా ఆత్మహత్య చేసుకొన్నారు. ఉద్యోగం నుండి తొలగించబడ్డ శిరస్తాదారుడు పిచ్చివాడయ్యాడు. రికార్డు కీపరు జైలు పాలయ్యాడు ఈ సంఘటన జరిగిన తరువాత కొన్ని సంవత్సరాల వరకు అవినీతిపరులైన ప్రభుత్వోద్యోగులకు వీరేశలింగం పేరు సింహస్వప్నంగా ఉండేది.

విద్యావిషయంలో స్త్రీలకు సమాన హక్కును గురించి, వితంతువులు పునర్వివాహాన్ని గురించి వీరేశలింగం నిర్వహించిన పోరాటమే సుదీర్ఘమైన మహోద్యమంగా కొనసాగింది. విధవా పునర్వివాహోద్యమం ఒక అద్భుత గాథ ఆ ఉద్యమ వివరాలను తరువాతి అధ్యాయంలో చెప్పుకుందాం. ప్రస్తుతం సంగ్రహంగా వీరేశలింగం స్త్రీ విద్యావిషయంలో సాగించిన పోరాటాన్ని తెలుసుకుందాం.

సొంతంగా ఆలోచించడానికి ఆరంభించినది మొదలు వీరేశలింగం స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. సమాజానికి అత్యప్రాయమైన స్త్రీకి విద్యను నిషేధించినంతకాలం సామాజిక వికాసాన్నిగూర్చి, -ప్రగతిని గూర్చి చెప్పే మాటలు నిరర్ధకమని, నిష్ప్రయోజమని వీరేశలింగం దృఢంగా విశ్వసించాడు. దీని నీచంగా చూచిననాటినుండి భారతదేశానికి పతనం ప్రారంభమైనదని నొక్కి చెప్పాడు. పత్రికల్లో ఆయన వ్రాసిన తొలి రచనలు కొన్ని ఈ సమస్యకు సంబంధించినవే. ఆ రోజుల్లో స్త్రీలకు విద్య అవసరమా కాదా అన్న అంశంపై ఆంధ్రభాషా సంజీవిని, పురుషార్ధ ప్రదాయిని అన్న రెండు పత్రికల్లో వాదోపవాదాలు తీవ్రంగా జరిగాయి.

వీరేశలింగం తన అకుంఠిత దీక్షతో ఆ వాగ్యుద్ధంలోకి దూకాడు. స్త్రీ విద్యావిషయంలోనే కాకుండా, ఇతరమైనవాటిలో కూడ వీరేశలింగానికి ప్రధాన ప్రత్యర్థి కొక్కొండ వేంకటరత్నం పంతులు. ఇది గమనింపదగ్గ విషయం.

తరువాత వీరేశలింగం స్వయంగా పత్రికలు ప్రారంభించినపుడు వాటిలో కూడా స్త్రీ విద్యావశ్యకతనుగూర్చి చక్కగా వివరించడమే కాకుండ స్త్రీ విద్యకు వ్యతిరేకులైనవారిని ఉద్దేశించి అనేక ప్రహసనాలను వ్యంగ్య రచనలను వ్రాసి ప్రకటించాడు. శ్రీ విద్యాద్వేషులకు, బుద్ధి గడపాలన్న అభిప్రాయంతో పురుషుల విద్యవలన కలిగే అనర్ధాలను వ్యంగ్యంగా ఉటంకిస్తూ వారి వాదాలను తలక్రిందులు చేశాడు. పత్రికలద్వారానే కాకుండా ఉపన్యాస వేదికలద్వారా కూడా తన కత్యంత ప్రీతిపాత్రమైన స్త్రీ విద్యను గురించి ప్రచారం చేశాడు.

ధవళేశ్వరంలో వీరేశలింగం ప్రధానోపాధ్యాయుడుగా ఉన్న కాలంలో ఆయన ప్రభావం సోకిన అభిమానులు, మిత్రులు కొందరు కలసి 1874 సెప్టెంబరులో ఒక బాలికా పాఠశాలను స్థాపించారు. బహుశా అదే ఆంధ్రదేశంలో మొట్టమొదటి బాలికల పాఠశాలనుకుంటాను. అప్పటివరకు దేవదాసీల పిల్లలకు వేశ్యావృత్తికి అవసరమైన సంగీత నాట్యాలను కామశాస్త్ర సూత్రాలను నేర్పించే విద్యాలయాలు తప్ప బాలికలకని ప్రత్యేక పాఠశాలలుండేవి కావు. ఏదేండ్ల తరువాత వీరేశలింగం రాజమహేంద్రవరంలో శ్రీ విద్యా వ్యాప్తికి మరొక విద్యాలయాన్ని స్థాపించడానికి కారకుడయ్యాడు. ఇంచుమించు ఈ కాలంలోనే ఆయన స్త్రీ జనోద్ధరణకు "సతీహితబోధిని" అన్న మాస పత్రికను ప్రారంభించాడు. ఆ పత్రిక

మూడేండ్లు మాత్రమే ప్రకటింపబడినా ఆ స్వల్పకాలంలోనే చరిత్రను సృష్టించింది. ప్రత్యేకంగా స్త్రీలకని ఉద్దేశింపబడిన నీతి పద్యాలు, ఆరోగ్యసూత్రాలు, స్వదేశీయుల్లో విదేశీయుల్లో సుప్రసిద్ధలైన మహిళామణుల జీవితరేఖాచిత్రాలు, సత్యవతి, చంద్రమతి వంటి పతివ్రతల కథలు మొదలైన అనేక రచనలను వరుసగా ఈ పత్రికలో ప్రచురించాడు.

స్త్రీ విద్య ఉద్యమాన్ని ప్రారంభించకముందే తన భార్య రాజ్యలక్ష్మికి స్వయంగా చదువు నేర్పించాడు. 1861లో కాపురానికి వచ్చినపుడు రాజ్యలక్ష్మికి చదువురాదు. స్వయంగా ఆమెకెంతో శ్రద్ధతో, నేర్పుతో చదువుచెప్పి శీఘ్రుకాలంలో ఆమెను విద్యావతిగా చేశాడు. పునర్వివాహానికి ఆయన సహాయాన్ని అర్థించి వచ్చే వితంతువులను అక్షరాస్యులను చేయడంలో ఆమె ఎంతో సహకరించేది. ఆమె కొన్ని సంకీర్తనలను కూడా రచించింది. అవి సాహిత్యశిల్పంతో కూడిన ప్రాఢరచనలు. కాకపోవచ్చు. కాని ఆ సంకీర్తనలు ఆమె భాషాపాటవాన్ని సూచిస్తాయి.

విద్యావేత్తగా వీరేశలింగం చేసిన సేవకేవలం స్త్రీ విద్యావ్యాప్తికి మాత్రమే పరిమితం కాలేదు, భారతదేశం పురోభివృద్ధి చెందాలంటే అక్షరాస్యత సార్వజనీనమై, సంఘంలోని అన్ని వర్గాల్లో విద్యవ్యాపించాలని ఆయనకు బాగా తెలుసు. అందుచేతనే ఆయన యాచించి లేదా అప్పుచేసి సేకరించిన డబ్బుతో ఆడవాళ్ళకు పగటి పాఠశాలని, కార్మికులకు రాత్రి పాఠశాలని ఇలా అనేక రకాల విద్యా సంస్థల్ని స్థాపించాడు.

ఎట్టి విద్య ఉత్తమమైనదన్న విషయంలో వీరేశలింగం అభిప్రాయాలు ఆకాలాన్ని మించిన ప్రగతిమార్గంలో ఉండేవి. స్వతంత్రంగా నిర్భయంగా ఆలోచింపచేయని విద్య, నైతిక విలువల్ని ప్రతిపాదించని విద్య, సామాజిక స్పృహను కలిగింపని విద్య, ఆదర్శాలను అందుకోవడానికి త్యాగశక్తిని ప్రసాదింపని విద్య అసలు విద్యకాదని ఆయన భావం. ఆయన ఉద్దేశంలో కళలను విస్మరించకుండా వృత్తివిద్యలకు మ్రొగ్గుచూపేది ఉత్తమమైన విద్య: తన అభిప్రాయాలను ఆచరణలో పెట్టడానికి వీరేశలింగం తాను స్థాపించిన వితంతు శరణాలయంలో కుట్టుపని నేర్పడానికి ఒకామెను చిత్రలేఖనాన్ని నేర్పడానికి మరొకరిని నియమించాడు. ఆయన భార్య వారికి సంగీతం నేర్పడానికి పూనుకొన్నగి ఆదిలో స్త్రీ విద్యకు ప్రజాభిప్రాయం సుముఖంగా లేనపుడు బాలికలకు ప్రత్యేకంగనే పాఠశాలను. ఏర్పాటుచేశాడు. బాలికలకు బోధించడానికి స్త్రీలే తగినవారని అనుభవాన్నిబట్టి తెలుసుకొని ఉపాధ్యాయ శిక్షణ పొందడానికి అనేక స్త్రీలను శిక్షణ కళాశాలల్లో చేర్పించాడు. స్త్రీ విద్యను ప్రతిఘటించడంలోని తీవ్రత తగ్గిన తరువాత బాలబాలికలు కలసి ఒకే పాఠశాలలో చదువుకుంటే ఎలా వుంటుందోనని సహవిద్యను ప్రవేశపెట్టాడు. రాజమహేంద్రవరంలో తాను స్థాపించిన ఉన్నత పాఠశాలలో బాలికలకు ప్రవేశం కల్పించినాడు. ఆంధ్రదేశంలో బాలురతోపాటు బాలికలకు కూడ ఉన్నత పాఠశాలల్లో ప్రవేశం కల్పించిన ప్రథముడు వీరేశలింగం. స్త్రీ పట్ల గౌరవభావాన్ని యువకులు పెంపొందించుకోడానికి సహవిద్యావిధానం అవసరమని ఆయన గ్రహించాడు.

స్త్రీ విద్యారంగంలోనే కాకుండా ఇతర విషయాల్లోను ఈశ్వర చంద్ర విద్యాసాగర్ను ఆదర్శంగా గ్రహించి వీరేశలింగం సర్వతోముఖ విద్యావ్యాప్తికి నిరంతరకృషిని చేశాడు. రాజమహేంద్ర వరంలో ఆస్తికోన్నత పాఠశాలను స్థాపించడానికి వీరేశలింగమే ప్రధానకారకుడు. ఆయన యందుగల గౌరవభావంతో ఈ విద్యాలయ భవనాలకు, తదితర సామగ్రికి డెబ్బైవేల రూపాయల భూరి విరాళాన్ని పిఠాపురం మహారాజావారు ఇచ్చారు, అంతేకాదు. ఆ విద్యాలయ కార్యనిర్వహక వర్గంవారిని ఒప్పించి దానికి 'వీరేశలింగం ఆస్తికోన్నత పాఠశాల' అని పేరు పెట్టించారు. ఈ పని రాజావారు వీరేశలింగానికి చెప్పకుండా చేశారు.

## ముందడుగు

విశాఖపట్టణవాసి, సుప్రసిద్ధ విద్వాంసుడు అయిన మహామహోపాధ్యాయ పరవస్తు వేంకటరంగాచార్యులు 1875లో వితంతు పునర్వివాహాన్ని సమర్థిస్తూ ఒక కరపత్రాన్ని ప్రకటించాడు. తెలుగులో అట్టి కరపత్రాలకు అదే మొదలు.. మద్రాసులోని కొక్కొండ వెంకటరత్నం పంతులు వీరేశలింగంతో తనకున్న పూర్వస్పర్థలను మరచి ఆయనకు ఆ కరపత్రాన్ని గూర్చి వ్రాశాడు. అందులో అధునాతన భావాలుకల వీరేశలింగంకూడా ఆ కరపత్రం అతివాదంతో విద్రోహకరంగావున్నట్లు భావించగలడని తెలిపాడు. గొప్ప నాటకకీర్తి గడింపనున్న ధర్మవరం కృష్ణమాచార్యులుకూడ బళ్లారినుండి ఆధోరణిలోనే వ్రాశాడు వీరేశలింగం వీరిద్దరకు సమాధానం వ్రాశాడా, వ్రాస్తే ఏమి వ్రాశాడన్నది మనకు తెలియదు.

రంగాచార్యులు కరపత్రప్రచురణకి పూర్వమే వీరేశలింగం బలవంతపు వైధవ్యంవల్లకలిగే కష్టనష్టాలను తత్ఫలితంగా సంభవించే బాధల్ని అవినీతినిగా గుర్తించి తీవ్రంగా ఆలోచించసాగాడు, రఘుపతి వెంకటరత్నం అన్నట్లు "ప్రతి ఆరుగురు హిందూస్త్రీలలో ఒక వితంతువు ఉండడం ఒక బ్రహ్మాండమైన సామాజిక సమస్య." వీరేశలింగానికి ఇదొక పెద్ద సవాలుగా తోచింది. అయితే దీన్ని ఎదుర్కోడానికి ఆయన కొంత సంశయించాడు తన సహచరులవలన కలిగిన అనుభవాలు కొన్ని ఆయనకు అంత సంతృప్తికరంగా, ప్రోత్సాహకరంగా తోచలేదు మాటల్లో కోటలు దాటినవాళ్ళు, ఆచరణ సమయంలో సంఘానికి భయపడి చెవుల పిల్లుల్లా తప్పించుకపోయారు. తనతోవున్న కొద్దిమంది అయినా ఆపద సమయంలో అండగా నిలుస్తారా? తొందరపాటు కార్యసాధనకు పిడుగుపాటు కాదా??

వీరేశలింగం ఇలా ఆలోచిస్తూ ఉండగా, మదరాసులో దివాన్ బహదూర్ ఆర్. రఘునాధరావు, పి. చెంగల్రావు మొదలైన పుర ప్రముఖులు కొందరు 1874లో ఒక వితంతు పునర్వివాహ సమాజాన్ని స్థాపించారు. వారు తన్ను సంప్రతిస్తారని వీరేశలింగం ఎంతో ఎదురుచూచాడు. కాని వారు నిర్లక్ష్యం చేశారు. ఈ సంఘటన వీరేశలింగాన్ని గాయపరచింది. అయినా తగిన సమయం కోసం నిరీక్షించాడు. మదరాసులో ఆర్భాటంతో ఆరంభమైన పునర్వివాహ సంస్థ పురిటిలోనే సంధికొట్టి, రెండేళ్లలో నామ రూపాలు లేకుండా పోయింది ధైర్య స్థైర్యాలతో తనకు అన్నివేళలా అండగా నిలబడే సహచరులు కనీసం ఆరుగురైనా లేకపోతే పోరాటానికి రంగంలో దిగకూడదని వీరేశలింగం గ్రహించాడు.

అట్టి సహచరులు ఆరేడుగురు ఉన్నట్లు 1878లో ఆయనకు నమ్మకం కుదిరింది. అయితే వారు నాయకత్వం వహించమని ఒత్తిడిచేసేవరకు ఆయన ఊరకున్నాడు. ఈ పని వారు ఆ సంవత్సరం సెప్టెంబరు మొదటివారంలో చేశారు. 1878 సెప్టెంబరు 8వ తేదీన వీరేశలింగం సంఘసంస్కరణ సమాజం స్థాపించాడు. ఆరోజే దక్షిణదేశంలో సంఘ సంస్కరణోద్యమం ముందడుగు వేసిన రోజు.

మనువు, గౌతముడు, పరాశరుడు, అపస్తంభుడు మొదలైనవారు చెప్పిన ప్రాచీన ధర్మశాస్త్రాలలో వీరేశలింగానికి నమ్మకంలేదు. ప్రతియుగంలో సరికొత్త సామాజిక నియమాలను, చట్టాలను నిర్మించుకోవాలన్నది ఆయన వాదన ప్రకృతి ధర్మాలకు మాత్రమే మార్పుండదు. మానవ సమాజపరమైనవి మారుతాయి. కాలానుగుణంగా సామాజిక మూల సిద్ధాంతాలను క్రమబద్ధమొనర్చే చట్టాలు రూపొందించుకోలేని సమాజం తప్పక మోడుబారి చైతన్య రహితమవుతుందని ఆయన భావన వితంతు పునర్వివాహానికి ప్రాచీన ధర్మశాస్త్రాలు కూడా సమ్మతిస్తున్నాయని నిరూపిస్తూ పూర్వపక్షం చేయలేని ప్రమాణాలను చూపించాలి... అలా చేస్తే తప్ప తనతో అనేకులు ఏకీభవించరని వీరేశలింగం గ్రహించాడు.

రంగాచార్యుల కరపత్రం ఈ విషయాన్ని విస్తరించి చూపలేదు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ మాత్రం ధర్మశాస్త్రాలను పుష్కలంగా ఉటంకించి వితంతు పునర్వివాహం శాస్త్ర సమ్మతమని చాటినట్లు తనకు తెలుసు కాని ఆ వివరాలు వెంటనే లభించక పోవడం వల్ల, పైగా అవి బెంగాలీ భాషలో ఉన్నందువల్ల తనకవి లభించలేదు. కాబట్టి అప్పటికి తన కందుబాటులో ఉన్న శాస్త్ర గ్రంథాల్లోని ప్రమాణాలనే వీరేశలింగం ప్రదర్శించవలసివచ్చింది.

అట్టి శాస్త్ర గ్రంధాల ఆధారంతో ఒక ఉపన్యాసాన్ని వ్రాసి 1879, ఆగస్ట్ 3వ తేదీన ఒక బహిరంగ సభలో చదివాడు. పూర్వాచార పరాయణుల మధ్య అదొక బాంబులా పేలి ఆంధ్రదేశమంతా ప్రతి ధ్వనించింది. ఈ ప్రతి ధ్వనులు పూర్తిగా సద్దు మణగకముందే, అక్టోబరు 12న రెండవ బాంబును విసిరాడు. పూర్వాచార పరాయణులైన కొక్కొండ వెంకటరత్నం, వేదం వేంకటరాయశాస్త్రి, దాసు శ్రీరాములు ఇంకా ఎందరో పండితులు. ఒక్కటై పూర్వపక్షపు ఫిరంగుల్ని పేల్చారు. దేశమంతా వాగ్యుద్ధం వ్యాపించింది.

తన వాదానికి బలాన్ని కూర్చే ప్రమాణాలను ఇంకా సేకరించే ఉద్దేశంతో కాశీ, బొంబాయి, కలకత్తాలలోని పుస్తక విక్రేతలకు ధర్మశాస్త్ర గ్రంథాలను పంపమని వీరేశలింగం ఉత్తరాలు వ్రాశాడు. వాటి పన్నిటిని చదువుకొని రాజమండ్రి, కాకినాడ, ఇంకా కొన్ని పట్టణాల్లో తన వాదానికి ఉపయుక్తమయ్యే శాస్త్రోక్త ప్రమాణాలతో బహిరంగ చర్చల్లో పాల్గొన్నాడు. వారంలో ఎదుర్కోలేని ప్రత్యర్థులు వీరేశలింగాన్ని బూతులు తిట్టారు. అల్లర్లకు దుండగాలకు పూనుకొన్నారు. ఈ ఉద్యమ యాత్రలో ఒకమారు రాజమండ్రిలో, మరొకమారు కాకినాడలో వీరేశలింగాన్ని కొట్టడానికి ప్రయత్నించారు. కొన్ని సంవత్సరాల తరువాత తాను మదరాసులో కూడ అటువంటి విపత్తునే ఎదుర్కోవలసి వచ్చింది. అట్టి క్లిష్ట పరిస్థితుల్లో తన విద్యార్థులే వీరేశలింగానికి అంగరక్షకులు. శిష్యుల సహకారమే లేకుంటే తాను సాధింపదలచిన లక్ష్యాలను విజయవంతంగా కొనసాగింపలేకపోయేవాడే. కాబట్టి విద్యార్థుల సహాయాన్ని స్వీయచరిత్రలో కృతజ్ఞతతో పేర్కొన్నాడు.

రెండేండ్లపాటు పత్రికల ద్వారా, ఉపన్యాస వేదికలనుండి వాదోపవాదాలతో కొనసాగించిన వితంతు పునర్వివాహోద్యమ లక్ష్యాలను ఆచరణలో చూపలేకపోతే, అవి నిరర్ధకమని వీరేశలింగం గ్రహించాడు. కొందరు వితంతువులు పునర్వివాహాన్ని అభిలషిస్తున్నారని, యువకులు కొందరు వితంతు వివాహానికి సంసిద్ధంగా ఉన్నారని కొన్ని వార్తలాయన చెవుల్లో పడ్డాయి అయితే వితంతు వివాహాలను జరపడానికి తగిన ఆర్థిక బలంలేదు. కాకినాడలోని సైదా రామకృష్ణయ్య తగిన ధన సహాయం చేయడానికి వాగ్దానం చేశాడు. ఈ 'పాప' కార్యం చేసినందుకు తర్వాత ఆయన ప్రాయశ్చిత్తం చేయించుకోవలసివచ్చింది. కొంత పిరికివాడయినా రామకృష్ణయ్య ఉత్తముడు. వితంతు వివాహ నిర్వహణకు అప్పుడప్పుడు ఆయన ముప్పైవేల రూపాయలవరకు పరోక్షంగా సహాయం చేశాడు.

వితంతు వివాహ నిర్వహణకు ధన సహాయం లభిస్తుంది అని తెలిసిన వెంటనే వీరేశలింగం, బాలవైధవ్యమనే సజీవ సమాధినుండి తన కుమార్తెను పునరుద్ధరించడానికి కోరుకొంటున్న ఒక తల్లికి దిట్టలైన తన అనుచరుల ద్వారా కబురు పంపాడు. ఆ దిట్టలు ఒకానొక మారుమూల కుగ్రామంలో మాటుమణిగివున్న ఆ అమ్మాయిని రాత్రికిరాత్రే ఎన్నో అడ్డంకుల్ని దాటుకొని, కొన్ని మైళ్ళదూరం నడచి సురక్షితంగా రాజమండ్రి చేర్చారు. కొంతకాలం క్రితమే భార్యను పోగొట్టుకొని విశాఖపట్టణంలో పోలీసు ఉద్యోగంలోవున్న వీరేశలింగం విద్యార్థి వరుడుగా. ఎన్నుకోబడ్డాడు. వితంతు వివాహాలు తక్కువ కులాల వారిలో మాత్రం సర్వ సమ్మతమే.
ఆంధ్రదేశంలో ప్రథమ వితంతూద్వాహం, ఒక ప్రక్క అపూర్వానందోత్సాహాలు వెల్లి విరుస్తుంటే ఇంకొక ప్రక్క తీవ్రమైన ప్రతిఘటన ప్రజ్వలిస్తూంటే 1881వ సంవత్సరం డిశంబరు 11వ తేదీన వీరేశలింగం గృహంలో జరిగింది. ఆ పెండ్లిని

ఆపుచేయడానికి ఆఖరి క్షణం వరకు ప్రయత్నాలు జరిగినాయి. సాహసవంతులైన ఛాందసులు ఆయన ఇంటిమీద దాడిచేయడానికి ప్రయత్నించారు. ముందు జాగ్రత్తతో వీధి మలుపుల్లో, ఇంటి దగ్గరలో కావలివున్న ఆయన విద్యార్థులు, పోలీసులు వాళ్ళను తరిమివేశారు. తమ ప్రయత్నాలన్నీ విఫలమైనాయనే ఉక్రోషంతో ప్రతిపక్షులు ఆనాడు ఇంచుమించు ముప్పై కుటుంబాలను వెలివేసి తృప్తిపడ్డారు.

అపూర్వమైన ఆ వివాహం మహావైభవంతో జరిగింది. పెండ్లికి మేళం వాయించేది క్షురకులు. ఆ పెళ్ళికి మేళతాళాలు లేకుండా చేయాలని ప్రతిపక్షులు మేళగాండ్లను ధనాశచూపి ఆ రోజు తమ క్షుర కర్మకు కుదుర్చుకొన్నారు. అలాగే వంట బ్రాహ్మణులను, నీళ్ళుపోసేవాళ్ళను ఎక్కువ డబ్బులు ఇస్తామని పనులిప్పిస్తామని, తక్కువ వడ్డీకి అప్పు ఇస్తామని చెప్పి తమ వైపు తిప్పుకొన్నారు. ఆనాటి ఆనందోత్సవంలో ఒక్క మేజువాణీ వీరేశలింగాన్ని బాధించింది. ఆయన అనుచరులు ఆ వివాహ మహోత్సవానికి భూరి విరాళమిచ్చిన రామకృష్ణయ్యగారి మద్దతుతో మేజువాణి లేకుంటే అసలది పెండ్లిలాగే ఉండదని వాదించారు. అయిష్టంగనే వీరేశలింగం. దానికి సమ్మతింపవలసివచ్చింది. కాని ఆ భోగంమేళం ఎక్కడా తన ఇంటి సమీపానికి రాకూడదని మాత్రం షరతు పెట్టాడు.

మొదటి వితంతు వివాహం జరిగిన నాలుగు రోజులకు రెండవ వితంతు వివాహం జరిగింది. అయితే మూడవది మాత్రం 1882న అక్టోబరు 22వ తారీఖున ఇంచుమించు. ఒక్క ఏడాది. తరువాతనే జరిగింది. మొదటి వివాహంలో ఎదుర్కొన్నట్లే యీ పెళ్ళిళ్ళను చేయడంలోను ఎన్నో అవాంతరాలను అడ్డుకోవలసి వచ్చింది. వధువు కానున్న వితంతువును పెద్దల కబంధ హస్తాలనుండి విడిపించడానికి 'విమోచన వ్యూహం పన్నవలసి వుండేది. ఇంచుమించు ఇరవై పెండ్లిండ్లు జరిపేవరకు ప్రతి పెళ్ళికి ఎత్తుకు పై ఎత్తువేసి శక్తియుక్తుల ప్రయోగబలం ప్రదర్శింపవలసి వచ్చేది; ఆ పిదప ఒకదాని తరువాత ఒకటి కొంత వ్యవధిలో జరగడం ఆనవాయితి అయింది. 1892వ సంవత్సరంలో తాత్కాలికంగా వీరేశలింగం మదరాసుకు తన కాపురాన్ని మార్చాడు. అప్పటికి ఇరవై తొమ్మిది వితంతు వివాహాలు జరిపించాడు. మరొక పది వివాహాలు మదరాసు పట్టణంలో వున్నపుడు జరిపాడు. ఆ తరువాత కొన్ని జరిగాయి. ఈ ఉద్యమం దేశమంతటా వ్యాపించాలని వీరేశలింగం - విజయనగరం, బళ్ళారి, గుంటూరు, బెంగుళూరు మొదలైన పట్టణాలలో తానే ముందు నిలచి కొన్ని పెండ్లిండ్లను. చేశాడు. కొన్ని తన స్నేహితుల ద్వారా జరిపించాడు. వితంతు వివాహాలను బలపరచడానికి మొదట మదరాసులోను తరువాత రాజమండ్రిలోను వితంతు శరణాలయాలను స్థాపించాడు. సంఘ సంస్కర్తగా వీరేశలింగం విజయాన్ని పొందడానికి అందరికన్న అధికంగా సహకరించింది. ఆయన అర్ధాంగి రాజ్యలక్ష్మి విగ్రహారాధనను నిరసిస్తూ సమకాలీన సమాజంతో నిరంతరం పోరాడుతున్న భర్తను ఆ రోజుల్లో అనుసరించడమన్నది అంత సులభమైన విషయం కాదు. ఆయనలో ప్రజ్వలిస్తున్న సాహసం కాని ఆయనకు తుష్టిని చేకూరుస్తున్న దీక్షగాని ఆమె ప్రవృత్తికి సహజం కావు. ఆమెది కొద్దిపాటి చదువే. పైగా సంప్రదాయ కుటుంబంలో పెరిగింది. గడపదాటని ఇల్లాలుగ వుండాలనే స్వభావమామెది. ఆమె పేరు ప్రతిష్టలు: కోరలేదు. అయినా భర్తచెప్పిన ప్రతి మాటను, చేసిన ప్రతిపనిని సమర్థిస్తూ, చిరునవ్వుతో ప్రోత్సహిస్తూ, ఆయనకు అండదండలుగా నిలిచింది.

ఒక విధంగా ఆమె మోయవలసిన భారం పెద్దది నిస్సహాయలైన బాలవితంతువులకు ఆశ్రయమివ్వడం ఆయనకు సులభమే. అయితే వారికి తిండిపెట్టి, కట్ట గుడ్డలిచ్చి తల్లిలాగ సంరక్షించవలసిన భారమెది సంఘం వెలివేస్తుందన్న భయంతో వంట బ్రాహ్మణులు తరచూ చెప్పకుండా నిలిచి పోయేవారు, ఇంటి పనులకు కూడా ఎవ్వరిమీద ఆధారపడడానికిలేదు. వివిధ ప్రదేశాలనుండి వచ్చిన వింత వ్యక్తులతో నిత్యం పెరిగే కుటుంబాన్ని ఆమె అసహాయంగా ఒక్క చేతిమీద నడపవలసి వచ్చేది. తమ ఆశ్రయాన్ని పొందిన వితంతువులందరూ విభిన్న ప్రవృత్తులున్నవారు. ఆత్మనింద చేసుకొనే ఒక్క వితంతువు చాలు విసిగించడానికి. అటువంటివాళ్ళ నెందరినో ఆమె భరించవలసివచ్చేది. వివాహాలు

చేసుకోడానికి వచ్చిన వితంతువులు గొంతెమ్మ కోర్కెలు కోరేవారు. పెళ్ళిచేసుకొని కాపురం పెట్టడానికి డబ్బు చాలదనేవారు. ప్రతినెల డబ్బు కావాలనేవారు. పురుళ్ళుపోసుకోడానికి అదనంగా డబ్బు ఆశించేవారు. ఎవరి సుభాలకయితే సర్వం త్యాగంచేసి అష్టకష్టాలు పడ్డారో వాళ్లే ఆ పుణ్యదంపతులపట్ల కృతఘ్నత చూపేవారు. పైగా దూషించేవాళ్లు.

రాజ్యలక్ష్మమ్మకన్న ఓర్పు, త్యాగబుద్ధి తక్కువ కలిగిన ఏ స్త్రీ అయినా భర్తతో సహకరించడానికి తటపటాయించి వుండేది. వీరేశలింగం ధైర్యశాలి. ఉదాత్తుడే కాని నిరాడంబరంగా మౌనంగా అన్ని విధాలా సహకరించిన రాజ్యలక్ష్మి ఆయనకున్న ధైర్యతమురాలు, ఔదార్యశీల.

## ఆధునిక తెలుగు పత్రికారచనకు మూలపురుషుడు

డేనియల్ డెఫోను గురించి డేంజరస్ ఎస్టేట్ అనేరచనలో ఫ్రాన్సిస్ విలియమ్స్ ఇలా వ్రాశాడు. 'ఆంగ్ల భాషలో ఆధునిక పత్రికారచనకు మూలపురుషుడైన ఏకైక వ్యక్తి ఎవరనే ప్రశ్నకు సమాధానంగా చెప్పదగిన విశిష్టవ్యక్తి డేనియల్ డెఫో నవలావాఙ్మయ పితామహుడెవడన్న ప్రశ్నకు కూడ సమాధానం అతడే.... అలాగే వీరేశలింగం కూడ ఆధునిక తెలుగు పత్రికా రచనకు, తెలుగునవలా వాఙ్మయానికి మూలపురుషుడుగా చెప్పదగిన విశిష్ట వ్యక్తి ఈ రెండే కాకుండా ఆయనలో మరికొన్ని వైశిష్ట్యాలున్నాయి. తెలుగులో ఆయన తొలి నాటకకర్త. ప్రహసన రచనకాద్యుడు జీవిత చరిత్రలు, స్వీయ చరిత్ర వ్రాసిన ప్రథముడు. తెలుగువాఙ్మయ చరిత్రకు శ్రీకారం చుట్టినవాడు విజ్ఞాన శాస్త్ర గ్రంథ రచనలో మార్గదర్శి, స్త్రీలకు బాలురకు ప్రత్యేక రచనలు చేసిన వారిలో మొదటివారు. వీరేశలింగానికీ, డెసోకు గల మరొక సామ్యం - ఇద్దరూ నిరలంకారమైన సరళ వచన రచననే ఆదరించారు. డెఫో చెప్పిన ఉత్తమశైలీ నిర్వచనంలోని ప్రతి పదాన్ని వీరేశలింగం ఆమోదించి. వుండేవాడే డెఫో అన్నాడు...

"*ఒక భాషలో ఉత్తమశైలి ఏదని ఎవరైనా అడిగితే అయిదువందల సామాన్యులున్న సభలో మాట్లాడినప్పుడు, మూఢులకు, పిచ్చివాళ్ళకు తప్ప మిగిలిన వారందరికీ అర్థమయ్యే శైలి ఉత్తమశైలి అని సమాధానం చెప్పుతాను.*"

ఇతర విషయాల్లో మాత్రం వారిద్దరూ ఉత్తర దక్షిణ ధ్రువాలు గూఢచారిగా పనిచేయడానికి కూడా ఏమాత్రం సంకోచింపని ప్రవృత్తిగలిగినవాడు డెఫో. జీవితంలో ఒక ఆదర్శం, తత్సంబంధమైన నిరంతర కృషి, గుణశీలాలు గలవ్యక్తి వీరేశలింగం. పత్రికారచయితగా ఆయనకు విలియం కోబెట్ (William Cobbet) యొక్క సాహసం, డబ్ల్యు టి.స్టడ్ (W.T Stead) కి గల ఉద్యమ రీక్ష, హెచ్ డబ్ల్యు మాసింగ్ లాం (H.W. Massinglam) కి గల నైతికార్జవం, జె.ఎ. స్పెన్టర్ (J.A. Spender) కి గల న్యాయబుద్ధి. సి.పి. స్కాట్ (C.P. Scol) కి గల కార్యనిమగ్నత, ఇతరుల జోక్యం పట్ల అసహనభావం ఉండేవి. లండన్ మానెక్టరు వంటి మహా పట్టణాలనుండి కాకుండా ఒక చిన్నపేట అయిన రాజమండ్రి నుండి పత్రికారచన సాగించాడు. పెట్టుబడి, యంత్రాంగం అతి స్వల్పం. ఈ పరిమిత పరిధిలోనే ప్రపంచంలో మహా ప్రభావాన్ని ప్రసరింపచేసిన పత్రికాసంపాదక మహాశయుల స్థాయిని అందుకొన్న వ్యక్తి వీరేశలింగం.

రెపో ప్రకటించిన రివ్యూ (Review) ఇంగ్లీషులో ప్రథమ పత్రిక కానట్లే తెలుగులో వీరేశలింగం స్థాపించిన వివేకవర్ధని కూడా మొదటి పత్రిక కాదు. ఆ గౌరవం 1835వ సంవత్సరంలో బళ్ళారి క్రైస్తవ సమాజం ప్రకటించిన 'సత్యదూత' అన్న మాస పత్రికకు చెందుతుందని కొందరు పరిశోధకుల అభిప్రాయం. అప్పటికి మదరాసులో తప్ప మరొకచోట తెలుగు ముద్రణాలయం. లేనందువల్ల సత్యదూత మదరాసులోనే ముద్రింపబడి ఉంటుందని అనుకోవాలి. ఆ తరువాత 'వృత్తాంతిని (1940), వర్తమాన తరంగిణి (1842) అన్న పత్రికలు వెలువడ్డాయి. అవి మదరాసు నుండి ప్రకటింపబడేవి. అవి ప్రధానంగా వార్తల్ని ప్రకటించే పత్రికలని వాటి పేర్లే తెలుపుతాయి. 1874వ సంవత్సరం అక్టోబరులో వివేకవర్ధని

అవతరించింది. అంతకు పూర్వమే హితవాది (1962) శ్రీ యక్షిణి (1863) సుజనరంజని (1864), తత్త్వబోధిని (1864), ఆంధ్రభాషా సంజీవని (1871), అని అనేక పత్రికలుండేవి. వివేకవర్ధని నాలుగు పుటలు పత్రిక, నెలకొకసారి వెలువడేది. పత్రికాధిపతి, సంపాదకుడు అయిన వీరేశలింగం. స్వీయచరిత్రలో 'అవి నాలుగు పెద్ద పుటలు' అని పేర్కొన్నాడు.

అప్పట్లో రాజమండ్రిలో ప్రభుత్వంవారి ముద్రణాలయ మొకటి తప్ప వేరే ముద్రణ సౌకర్యాలు లేవు. అందువల్ల మదరాసులో కొక్కొండ వేంకటరత్నం స్థాపించిన సంజీవని ముద్రణాలయంలో వివేకవర్ధని ముద్రితమయ్యేది. అక్కడ సకాలానికి పత్రికను ముద్రించి ఇవ్వలేక పోవడంవల్ల మదరాసులోనే శ్రీధర్ ప్రెస్ అన్న మరొక ముద్రణాలయానికి మార్చాడు. ఈ క్రొత్త ఏర్పాటుతో పాటు పత్రికను . వద్దెనిమిది పుటలకు పెంచాడు. దానిపైన అట్టనుకూడ చేర్చినాడు. ఆంధ్ర మహాభారతంలో సుప్రసిద్ధమైన క్రింది పద్యాన్ని తన పత్రికకు సూక్తిగా ఎన్నుకున్నాడు.

ఒరులేయవి యొనరించిన
నరవర! యప్రియము తన మనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పథముల కెల్లన్ (భార-శాంతి-5-220)

కన్ఫ్యూషియస్ ప్రబోధించిన నీతికూడ ఇటువంటిదే.

వీరేశలింగం వివేకవర్ధనిని ప్రారంభించే నాటికి ధవళేశ్వరంలో ఉపాధ్యాయుడు. ఒక పల్లెటూరి ఐడిపంతులు ఒక మాస పత్రికను నడపటమన్నది మహా సాహసకృత్యమే ఆత్మ విశ్వాసం, క్రొత్తగా కలిగిన చైతన్యం ఆయన్ను ముందుకు నడిపించినాయి. పత్రికా సంపాదకుడిగా ఆయనకు కలిగిన అనుభవాలు అంత చెప్పుకోదగ్గవి కావు విద్యార్థి దశలోనే వీరేశలింగం రచనలు ప్రారంభించాడనడంలో సందేహం లేదు. గోదావరీ విద్యా ప్రబోధిని, పురుషార్థ ప్రదాయిని, ఆంధ్రభాషా సంజీవని అనే పత్రికలకు ఆయన వ్రాసిన వ్యాసాలు రచనారంగంలో అభ్యాస ప్రాయాలు. వాటిలో కొన్ని తప్ప తక్కినవన్నీ సాహిత్యసంబంధి రచనలే. అంత విలువైనవి కావు. ఒక సంస్కర్త చేతులో పత్రిక వాడి, వేడి గల ఖడ్గమన్న సత్యాన్ని అప్పటికింకా ఆయన గుర్తించలేదు. వివేకవర్ధని పత్రిక ప్రచురణని ప్రారంభించినపుడు మహత్తరమైన లక్ష్యాలను సాధించాలన్న దూరదృష్టికూడ లేదు. నాల్గవ సంచికలోని సంపాదకీయంలో తన లక్ష్యాలను గూర్చి నసుగుతూ చెప్పుకొన్నాడు. తన కులాన్ని విద్యార్థతలను పేర్కొంటూ లోకానికి ఉపయోగకరమైన విద్యను విజ్ఞానాన్ని సరళమైన తెలుగులో అందివ్వడానికి సంఘంలో నైతిక స్థాయిని వృద్ధి చేయడానికి కృషి చేయగలనని చెప్పుకొన్నాడు. ఈ లక్ష్యాలను వచనంలో కాక, పద్యంలో వ్రాశాడు. దీన్నిబట్టి పత్రికల ప్రయోజనాన్ని గురించి వాటి ప్రచారశక్తిని గురించి ఆ దశలో ఆయనకు గొప్ప అభిప్రాయం లేదన్న విషయం స్పష్టమౌతుంది. అయినా అతి త్వరలోనే ఆయన దృక్పథం మారింది. సంఘదురాచారాలను దుమ్మెత్తిపోస్తూ వివేకవర్ధనిలో మొదట వెలువడ్డ విమర్శలు కొందరిని ఆకర్షించి ఆకట్టుకొన్నాయి. వారు తన నూతన సంస్కరణ సిద్ధాంతాలకు సుముఖులు కావడంతో సంస్కరణోద్యమానికి శంఖం పూరించాడు. తన సంస్కరణోద్యమం సాహసోపేతం, విప్లవాత్మకం, విస్తృతం. సాంఘిక దురాచారాల మీద, అక్రమాల మీద వీరేశలింగం ధ్వజమెత్తినప్పుడు వివేదనగల వారందరూ నీతి నిజాయితీ గల సమాజస్థాపనకు ఆయనకు మద్దతు ప్రకటించారు.

అప్పటినుండి కందుకూరి వారి ఉద్యమాలు. ఒకప్పుడు 'ది మైడన్ ఆఫ్ మాడర్న్ బాబిలోన్ అన్న పత్రికను తీవ్రంగా ఎదుర్కొన్న 'స్టడ్' అన్న మహాశయుని, అతని సంచలనాత్మక ఉద్యమాన్ని గుర్తు వేసేటటువంటి దీక్షతో, నిర్భయంతో నడచాయి.

చాటుమాటు ఎత్తి పొడుపులు, పరోక్ష అష్ట అన్యాపదేశాలు, వీరేశలింగం ప్రవృత్తికి విరుద్ధం. ఆయన వెన్నులో పొడవడు. ఆయన పోట బహిరంగమైంది. ఉగ్భండమైంది. తన విమర్శకు అర్హులు కాని వారిని విమర్శించలేదు. స్థానికుల మీద,

స్థానిక సమస్యల మీదనే దృష్టిని కేంద్రీకరించేవాడు సన్నిహితం కాని సమస్యల జోలికి వెళ్ళేవాడు కాదు స్థానికమైన ఒక అన్యాయాన్ని ఎదురొని న్యాయం కోసరం పోరాడి అక్రమాన్ని అరికట్టితే దాని ప్రభావం త్వరలో నాలుగువైపులా వ్యాపిస్తుంది. పత్రికలో స్థానికుల మీద దండయాత్ర చేస్తే కలిగే ప్రమాదం కూడా ఆయనకు బాగా తెలుసు. వివేక వర్ధని తొలి సంచికల్లో ఒకచోట ఆయన ఇలా వ్రాశాడు:

"లంచగొండితనాన్ని విమర్శిస్తే స్థానికోద్యోగులకు కోపం, వేశ్యాగమనాన్ని నిందిస్తే. ఊరిలోని విటవర్గానికి బాధ అర్ధం పర్ధం లేని మూఢాచారాల్ని ఖండిస్తే అజ్ఞానులు స్వార్ధపరులు గొంతు మీదికి వస్తారు. నీతిని పాటించకుండా మతాచారాలకు ప్రాధాన్యమివ్వడం కూడదంటే పూజార్లు, పురోహితులు పగ బడతారు. ఇందులో దశాంశమైన ఈ పత్రికద్వారా సాధించి చూపాలంటే అనేకుల ఆగ్రహావేశాలకు గురి కావలసి వుంది.."

ప్రమాదమని తెలిసికూడ ఆయన గొప్పవాళ్ళను బలవంతులను లక్ష్యపెట్టకుండా వాళ్ల అవినీతిని అక్రమాలను పత్రికలో ఘాటుగా విమర్శించాడు. తాను ప్రభుత్వోద్యోగి అయినా అన్యాయానికి అక్రమానికి పాల్పడిన బ్రిటిష్ ఉద్యోగుల్ని కూడా విమర్శించడంలో వీరేశలింగం వెనుకంజ వేయలేదు. ఒకసారి వివేక వర్ధనిలో తెల్లదొరలను దూయబట్టి నపుడు తన శ్రేయోభిలాషి, అయిన రామకృష్ణయ్య చాల ఆందోళనపడి ఇలా వ్రాశాడు ...

"మీ పత్రికలో పెద్ద పెద్ద వాళ్లను ఖండిస్తూ మీరు వ్రాసిన వ్యాసాల్ని చూస్తే నాకు చాల ఆందోళన కల్గుతుంది. ఇందువల్ల మీకు ఎప్పుడో ఒకప్పుడు ప్రమాదం తప్పదు. మీకు శత్రువులు ఎక్కువవుతున్నారు. గత సంచికలో మీరు పురపాలక సంఘాన్ని గురించి జాన్సన్ (Mr. Johnson) స్మిత్ (Mr Schmtd) దొరల్ని గురించి వ్రాసిన వివరాల్ని చదివి బాధపడ్డాను. ఆ వ్యాసంలో "ఎంతటి గొప్పవారైనా..." అన్నారు. మీరు న్యాయాధికారులతో, బట్టీలతో ఆ తగవు పెట్టుకోవడం మంచిది కాదని నా సలహా. అంధుల్ని అప్రమత్తుల్ని చెందదు. తాను చేస్తున్నదేమిటో తనకు బాగా తెలుసు, అలా చేయడంలో సంభవించే ఆపదలు కూడా ఆయనకు తెలుసు. నీతి నిజాయతీల కోసరం నిలిచి పోరాడలేని పిరికివాడు, అవకాశవాది పత్రికా సంపాదకత్వానికి అనర్హుడని ఆయన నమ్మకం. గుండె ధైర్యంలేనివారికి, స్తోత్రపాదాలు వల్లించేవారికి పత్రికా సంపాదకత్వం పనికిరాదు. త్రికరణ శుద్ధిగా పత్రికను నడపినపుడు అధ్యాయంగ, అక్రమంగా ప్రవర్తించే అధికారులు కోపానికి గురికావడం తప్పదు. పత్రికా సంపాదకత్వంలోని బాధ్యతలను గురించి ఆయన అభిప్రాయా లిటువంటివి గనుక కలిగే కష్టనష్టాలను లక్ష్యపెట్టకుండ విమర్శించడం కొనసాగించాడు. అందువల్లే కొన్ని సివిల్ కేసులు. క్రిమినల్ కేసులు, పరువు నష్టానికి దావాలు వీరేశలింగంమీద వచ్చి పడ్డాయి. అభియోగాలన్నింటి నుండి ఆయన నిరపరాధిగా బయటపడ్డాడు. కొన్ని దావాలు సుదీర్ఘకాలం పట్టడమే కాకుండ బాధను కూడ కలిగించాయి నిజానికి అదృష్టమే ఆయన్ను వరించి ఉండకపోతే కోర్టు వ్యాజ్యాలలో ఒక దానిలోనైనా ఆయన అష్టకష్టాలకు గురి అయివుండేవాడు. డిస్ట్రిక్ట్ మునసబుగారిమీద అతనికి తోడు దొంగలైన గవర్నమెంటు ప్లీడరుమీద మరిద్దరిమీద లంచగొండితనాన్ని నిరూపించడానికి, ప్లీడరుగారి ఇంటి ముందు చెత్తకుండీలో దొరికిన కాగితాల ముక్కలు వరప్రసాదమై వీరేశలింగాన్ని రక్షించాయి. చెత్తకుండీలో నుండి ఏరిన కాగితం ముక్కల్ని సరిగ్గా సరిపోయేటట్లు అతికించడానికి ఆయన అహోరాత్రులు శ్రమపడవలసి వచ్చింది. ఈ సంఘటన జరిగిన కొన్ని సంవత్సరాలకు "అమృతబజారు" పత్రికా సంపాదకుడైన 'మోతీలాల్ గోష్", "ది ట్రిబ్యూన్" పత్రికా సంపాదకుడైన "నాగేంద్రనాథ్ గుప్త" అనే సుప్రసిద్ధ పత్రికా సంపాదకులిద్దరు కూడా చెత్తబుట్టలోని కాగితాల సహాయంతో గొప్ప సంచలనాన్ని కలిగించే వార్తలను ప్రకటించగలిగారు. ఈ పాఠకుల అభిమానానికి పాత్రమై పెరుగుతున్న 'వివేకవర్ధనికి' ప్రత్యేక ముద్రణాలయం. అవసరమనిపించింది. ధవళేశ్వరంలో సంపాదకుని కార్యాలయం మదరాసులో ముద్రణ - ఈ రెంటికీ పొత్తు కుదరడం రానురానూ కష్టమైనది. కొందరు

మిత్రుల్ని వాటాదార్లనుగా చేర్చుకొని వీరేశలింగం 1875వ సంవత్సరం రాజమండ్రిలో సొంతంగా ఒక ముద్రణాలయాన్ని ఏర్పాటు చేయడానికి నిశ్చయించుకున్నాడు.
ముద్రణకు అవసరమైన పైపులు, యంత్రాలు తదితర సామగ్రికొనడానికి ఆ వేసవి సెలవుల్లో మదరాసు వెళ్ళాడు. ఆ ఆ రోజుల్లో రాజమండ్రి నుండి మదరాసుకు రైళ్ళులేవు. కాకినాడకు వెళ్ళి అక్కడనుండి ఓడ ప్రయాణం చేసి మదరాసుకు చేరుకోవాలి. వీరేశలింగానికి అదే మొదటి ఓడ ప్రయాణం. రాజధాని అయిన మదరాసును సందర్శించడంకూడ అదే మొదటిసారి. ఆయనకున్న ముందే ఆయన కీర్తి ప్రతిష్టలు మదరాసువరకు వ్యాపించాయి కాబట్టి ఆయన చెన్నపట్టణం చేరిన వెంటనే అభిమానులందరూ స్వాగత సమావేశాలు, విందులు ఏర్పాటు చేశారు. చాలమంది వివేకవర్ధని పత్రికకు వార్షిక చందాదారులయ్యారు.

రాజమండ్రిలో స్వకీయ ముద్రణాలయాన్ని ఏర్పాటు చేసుకొన్న తరువాత మాసపత్రిక అయిన వివేకవర్ధని మరికొంత పురోభివృద్ధిని పొందింది. అది 1876 జూలైనాటికి పక్షపత్రికగా మారింది. దానికి అనుబంధంగా ప్రతినెల 'హాస్య సంజీవని' వెలువడడం కూడ జరిగింది. కొక్కొండవారి హాస్యవర్ధనని ప్రతిఘటించడానికి హాస్య సంజీవని తరువాత అది ఛాందసుల్ని బూజు పట్టిన ఆచారాలను దులపడానికి చక్కని సాధనమైనది.

ఒక ఏడాది అయ్యేసరికి హాస్య సంజీవని అనుబంధంగా కాకుండ వివేకవర్ధనలో ఒక భాగంగా కలిసి వెలువడుతూ వచ్చింది. పత్రికలోని హాస్య సంజీవని కోసమే పాఠకులందరూ ఎదురు చూసేవారు. హాస్య సన్నివేశాలతో వ్యంగ్య చిత్రణలతో, ప్రహసనాలతో పరిహాసాలతో ర కవిత్వాలతో ఆ విభాగం నవ్వుల పువ్వులుగ ఉండేది వీరేశలింగం మిత్రులైన సహచరులు కొందరు ఇంగ్లీషులో వ్రాసిన వ్యాసాలతో ఒక ఇంగ్లీషు విభాగం కూడా వివేకవర్ధనిలో కొన్ని సంవత్సరాలు ప్రకటింపబడింది. కాని పాఠకలోకంలో దాని ప్రభావం అంత చెప్పుకో తగ్గిచెశారు. సహచరుల్లో ముగ్గురు ఆయనకు అత్యంత సన్నిహితులు, ముగ్గురూ ఆయన విద్యార్థుల్ యువకులైన వారితో తాను చేసిన చర్చలు బహుశా యువతరం వారి హృదయాన్ని తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఉండవచ్చు. తరచూ కలసి మెలసి కనుపించే యీ నలుగురికి కొందరు దుష్టచతుష్టయం అని పేరు పెట్టారు. ఈ పేరు వీరేశలింగానికి ముచ్చటగతోచింది. అందుకే దానిని గురించి స్వీయచరిత్రలో హాస్యంగా ప్రస్తావించాడు.

ఆర్థికంగా వివేకవర్ధని లాభాల్ని సంపాదించి పెట్టలేదు. అయినా దానివల్ల కలిగే కష్టాన్ని లెక్కపెట్టకుండ కొన్నేండ్లు నడిపాడు చివరకు దాన్ని వారపత్రికగ మార్చాడు. కాని యితర కార్యాలకు ఎక్కువ కాలాన్ని వినియోగించవలసి వచ్చింది. అందువల్ల వీరేశలింగం పత్రికా ప్రచురణకు తగినంత సమయాన్ని ప్రారంభ దశలోలాగ వినియోగించలేకపోయాడు పత్రిక కాలానికి వెలువడడం అరుదయింది. ఆఖరుకు 1890లో అది ఆగిపోయింది. వివేకవర్ధని పదిహేనేండ్లపాటు మాత్రమే నడచింది. ఈ స్వల్పకాలంలోనే ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొన్నది. అయినా అంతకు ముందు ఆ తర్వాత వెలసిన పత్రికల కన్నింటికన్న ఎంతో చరిత్రను వివేకవర్ధని సృష్టించింది. సర్. రఘుపతి వేంకటరత్నం అన్నట్లు:

'తన కాలంలో భారత జాతిని పునీతం చేయడానికి భగీరథుడు ప్రవహింపచేసిన గంగా ప్రవాహం వంటిది. వివేకవర్ధని, అది అజ్ఞానంతో నిర్వేదంతో, అంధకారంతో నిండిన సమాజ జీవిత రంగంలో ఆ మహనీయుడు ప్రసరింపజేసిన కాంతిరేఖ పాడిన సుప్రభాత గీతి.'

వీరేశలింగం నడపిన పత్రిక ఒక్క వివేకవర్ధని మాత్రమేకాదు. స్త్రీలకోసరం సతీహితబోధిని' అన్న పత్రికను ఆయన నడిపినట్లు ఇంతకుముందే చెప్పుకొన్నాం. ఈ పత్రికను 1883 నుండి మూడేండ్లపాటు ప్రచురించాడు. 1891లో

"సత్యసంవర్ధని" అనే పత్రికను ప్రారంభించాడు. 1905లో "సత్యవాదిని" వారపత్రికను క్రొత్తగా ప్రకటించాడు. ఈ పత్రికకూడ సింహగర్జన చేసింది, కాని దాని గర్జన వివేకవర్ధనిలా పెద్దది కాదు. అంత భయంకరమైనదీ కాదు.
తన సొంత పత్రికలను నడపడమే కాకుండ న్యాపతి సుబ్బారావుగారి "చింతామణి": ఆర్ వెంకట శివుడిగారి "జనాన్నా" పత్రికల ప్రచురణ కార్యంలో వీరేశలింగం సహకరించాడు.

స్థానిక సమస్యల పరిష్కారార్థం వీరేశలింగం తన పత్రికలను ఉపయోగించుకొన్నట్లు కనిపించినా పాతబడిన ఆచారాలనుండి మూఢ విశ్వాసాలనుండి సమాజాన్ని ఉద్ధరించడమే ఆయన నిజమైన లక్ష్యం ఆయన రచనలన్నింటిలో అంతర్వాహినిగ, హేతువాదం నవీన దృక్పథం గోచరిస్తుంది. సమాజంలోని దురాచారాలు, మూఢవిశ్వాసాలు అనే కలుపుమొక్కల్ని మొదట తీసి నిర్మూలిస్తేగాని, పైరెంటిలో ఏదీ ఎరగదన్న నమ్మకంతో తన పత్రికలను కొడవళ్ళుగ మార్చాడు. విచక్షలను పెంపొందించేది "వివేకవర్ధని". సత్యాన్ని ప్రబోధించేది "సత్యవాదిని". ఆయన దృష్టిలో యుక్తాయుక్త విచక్షణమే హేతువాదం, ప్రగతి, మానవత, శాస్త్రీయ దృష్టిగల ఆధునికత్వం సత్యంతో సమానం. పదేపదే ఆయన, తన్ను తన సహచరులను గూర్చి "నవనాగరీకులం" అని చెప్పుకొనేవారు. వివేక వర్ధని సంపాదకీయంలో ఆయన ఇలా వ్రాశాడు.

"ఆధునిక విజ్ఞానం ఒక దేవత లాంటిది. ఆ దేవతను పాశ్చాత్యులు మన దేశానికి తీసుకొచ్చారు. ఆ దేవత ఆధునిక విజ్ఞానజ్యోతిని తనచేతిలో పట్టుకొని తరతరాలుగా పేరుకొనిపోయిన అజ్ఞానాంధకారాల్ని తొలగిస్తూ వుంది. ఆ వెలుగుకు మూఢాచారాలనే దయ్యాల కాళ్ళకు బుద్ధి చెప్పుతున్నాయి. ప్రస్తుతం సత్యాసత్యాల మధ్య, విద్యావిద్యల మధ్య ప్రాతకొత్తల మధ్య పోరాటం జరుగుతున్నది. ఈ పోరాటంలో ఎవరూ తటస్థంగా వుండకూడదు. ఏదో ఒక పక్షంలో చేరాలి. బుద్ధిమంతులైనవారు ఏ పక్షంలో చేరాలో అంతిమ విజయం ఎవరిదో చెప్పనక్కరలేదు. ఈ సంగ్రామం సుదీర్ఘంగా సాగవచ్చు. తీవ్రంగా వుండవచ్చు. అయితే చివరికి జ్ఞానం, అజ్ఞానాన్ని, సత్యం అసత్యాన్ని తప్పక జయిస్తాయి."

## తెలుగు నవలా పితామహుడు

సాహిత్య ప్రక్రియల్లో కావ్యం ప్రాచీనం. నవల అర్వాచీనం, నీతి కథలు, అద్భుతకథలు వీరగాథలు, కాల్పనిక కథలు మొదలైన వాటికన్న భిన్నంగా నవల పరిణమించడానికి కొన్ని శతాబ్దాలకాలం పట్టింది. వీటి లక్షణాలు కొన్ని వున్నా నవలకు ఒక విలక్షణమైన రూపం. ఆత్మ వున్నాయి. సుదీర్ఘమయిన కథ నవలకాదు. కేవలం వచనరూపంలోని సాహస గాథకూడ నవలకాదు. అది వాస్తవికతకు సన్నిహితంగ ఊహాకల్పనకు కొంతదూరంగా ఉండేరచన.

నవల 17వ శతాబ్దంలో స్పెయిన్ దేశంలో, 18వ శతాబ్దిలో బ్రిటన్ దేశంలో, 19వ శతాబ్దిలో భారతదేశంలో మొట్టమొదట అవతరించినట్లు తెలుస్తున్నది. డాన్ 'క్విక్సోట్' అనే నవలను రచించిన 'సెర్వాంటీ' స్పానిష్ సాహిత్యంలో ప్రథమ నవలాకారుడు, పాశ్చాత్యదేశాల్లో ఇదే మొదటి నవల, రాబిన్సన్ క్రూసోను రచించిన డెఫో ఇంగ్లాండులో ప్రథమ నవలా రచయిత. దుర్గేశనందిని కర్త అయిన బంకీమ చంద్ర చటర్జీ ప్రథమ భారతీయ నవలాకారుడు.

ఈ విషయాలన్నీ అందరికి తెలిసినవే అయినా వీరేశలింగం రచించిన రాజశేఖర చరిత్ర నవలను పరిశీలించడానికి పై విషయాల్ని గుర్తు చేసుకోవలసి వచ్చింది.

1875వ సంవత్సరం 'బంగ దర్శన్' అనే సాహిత్యపత్రికలో, చటర్జీ దుర్గేశ నందినిని ధారావాహికగా ప్రచురించాడు. మూడేండ్ల తరువాత వీరేశలింగం వివేక వర్ధనిలో రాజశేఖర చరిత్ర అనే నవలను ధారావాహికగా ప్రకటించడానికి

ప్రారంభించారు. ఈ అల్పకాల వ్యవధిని బట్టి వీరేశలింగాన్ని భారతదేశంలో రెండవ నవలాకారుడిగా పరిగణింపవచ్చా? దీనికి మరికొంత పరిశోధన అవసరం. కాని తెలుగులో మాత్రం వీరేశలింగం తొలి నవలా కారుడవడం నిర్వివాదాంశం. తెలుగు నవలా పితా మహుదయిన వీరేశలింగం వంగ సాహిత్యంలో తొలి నవలాకారుడైన బంకించంద్ర చటర్జీకి ఏ మాత్రం ఋణపడలేదు. కారణం వీరేశలింగానికి వంగ భాషరాదు. 1875-1878 మధ్యకాలంలో దుర్గేశనందిని ఇంగ్లీషులోకిగాని ఏ ఇతర భారతీయ భాషల్లోకిగాని అనువదింపబడలేదు. చటర్జీకి బాగానే వీరేశలింగానికి కూడా ఇంగ్లీషు: నవలే ప్రేరకం. ఆనాడు పై రెండు నవలల ఆవిర్భావానికి దేశకాల పరిస్థితులు అనుకూలంగా ఉండినాయి.

నవలావిర్భవానికి మధ్య తరగతి ప్రజ కారణమంటూరు. స్వరూప స్వభావాల్లో నవల ప్రధానంగా మధ్య తరగతికి చెందిందే. అందుచేత మధ్య తరగతి ప్రజాస్వామిక శక్తులు ముందడుగు. వేసినపుడంతా నవలకూడ ఒక్కొక్క మెట్టే పైకి యెక్కి చివరకు ఈనాడు ప్రజాదరణలో అన్ని సాహిత్య ప్రక్రియల్ని మించినట్టి అగ్రస్థానాన్ని ఆక్రమించింది. 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో భారతదేశపు జమీందారీ వ్యవస్థ క్రమంగా క్షీణించడం, మధ్య తరగతి జనత తన శక్తిని, ఉనికిని, చారిత్రక పాత్రను గుర్తించుకొనడం జరిగింది. ఈ అనుకూల పరిస్థితులవల్ల భారతీయ నవలావతరణకు రంగస్థలం సిద్ధమైంది.

స్కాట్ రచించిన ఐవనో (Ivanhoe) అనే నవలలోని ఇతివృత్తాన్ని దుర్గేశనందినికి మూలంగ చటర్జీ గ్రహించాడు. అలాగే వీరేశలింగం గోల్డెస్మిత్ రచించిన "విజార్ ఆఫ్ వేక్ ఫీల్డ్" (Vicar of Wakefield) ను తన రాజశేఖరచరిత్ర నవలకు ఆధారంగా స్వీకరించారు. ఈ రచయిత లిద్దరూ రెండు ఆంగ్ల నవలలను ఆధారంగా ఎన్నుకోవడం ఆకారణంగా జరుగలేదు. స్కాట్ కున్నట్లే, చటర్జీకి కూడ మధ్యయుగాల్లోని ప్రభువులు, వారి భవనాలు అంటే ఓ విధమైన ఆరాధనా భావముండేది. స్కాట్లాగానే ఆయన కూడ మధ్యయుగపు జీవితాన్ని గొప్పగా, వైభవోపేతంగా భావించాడు. వయోవృద్ధుడయ్యేకొద్దీ చటర్జీ ప్రగతి భావాలను విడిచి హిందూ. మత పునరుద్ధరణను ప్రతిపాదించాడు. ఇటువంటి పాక్షిక దృక్పధమున్నవాడు కాబట్టి స్కాట్ నవల ఐవనోను చటర్జీ ఎన్నుకొని, ఒక దుర్గాధిపతి కుమార్తెను (దుర్గేశనందిని) కథానాయికగ చేసి నవలను వ్రాశాడు. చటర్జీలాగ వీరేశలింగం మన పూర్వవైభవానికి గర్వించలేదు.

ప్రాచీనమైన సాంఘిక వ్యవస్థకు, విలువలకు ఉప్పొంగి పోలేదు. అప్పుడే సంఘంలో ప్రాధాన్యం వహిస్తున్న మధ్యతరగతికి, ప్రజాస్వామిక భావాలకు, సమానత విధానాలకు ప్రతినిధిగ రూపొందిం వ్యక్తి వీరేశలింగం. అందువల్లనే "మధ్యతరగతి ప్రజల స్వాభిమానానికి, దారిద్ర్యానికి నాటక రూపము" అనదగిన "వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్" అనే నవల ఆయనను ఆకర్షించింది. గోల్డెక్మెల్ నవలను యధాతథంగా అనువదించాలనే వీరేశలింగం మొదట సంకల్పించాడు. కాని రెండు. మూడు ప్రకరణాలు అనువదించిన తరువాత ఆయనకు మూలంలోని విదేశీయ సాంఘిక జీవనచిత్రణను పాఠకులు ఆదరించక పోవచ్చునని సందేహం కలిగింది.

ఆ కాగితాలను చింపివేశాడు. రాజశేఖర చరిత్రను వ్రాయడానికి మొదలు పెట్టాడు. ఈ నవలలో గోల్డెన్మెత్ ప్రభావం నామమాత్రమే. వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ నుండి కొన్ని సన్నివేశాలను, నలుగురైదుగురు పాత్రలను మాత్రమే గ్రహించాడు. మిగిలిన కథా భాగమంతా వీరేశలింగం చేసిన స్వీయకల్పనే. ఆంగ్లసాహిత్య చరిత్ర గ్రంథానికి జంటకర్తలైన లెగోయి (Legouies) కాజమియా (Cazamiyan) వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ ఒక కుటుంబానికి, కుటుంబ జీవితానికి సంబంధించిన నవల అని అన్నారు. రాజశేఖర చరిత్రకూడ అటువంటిదే. అయితే ఇందులో చిత్రింపబడిన కుటుంబం అచ్చమైన ఆంధ్రుల మధ్యతరగతి కుటుంబం, గోదావరి కోనసీమ ప్రాంతానికి చెందిన కుటుంబ జీవనం. ఇదే ఆ రెండు నవలల మధ్యగల భేదం.

రాజశేఖర చరిత్రలోని ఇతివృత్తం కొంతవరకు సామాన్యమైంది. కొంత అనుకరణతో, కొంత కల్పనతో కూడిన యీ కథా ప్రణాళిక అంత పటిష్టమైందికాదు. ఒక సంఘటన నుండి మరొక సంఘటనకు దుముకుతూ అనేక ఉపాఖ్యానాలు చేర్చి జారు ముడి వేసినట్లుంటుంది. ప్రధానేతివృత్తం సౌష్టవం లోపించినట్లుంటుంది. మరికొన్ని లోపాలుకూడ వున్నాయి. ఇవన్నీ రచయిత వీరేశలింగం దృక్పథానికి ప్రవృత్తికి అనుగుణమైనవి. ఆయన ప్రధానంగా నైతికవాది, కళాదృష్టి తక్కువ. తనకు శిల్పదృష్టికన్న ప్రబోధదృష్టి ప్రబలం. సృజనశక్తికన్న, సందేశాత్మకత అధికం. కథానిర్వహణలో నీతిబోధకు ప్రాధాన్యమిచ్చి తృప్తి పడలేదు. తానే నిలిచి చాటినట్లు నీతిని చాటాడు. తన ఆదర్శాలను, ఆశయాలను ప్రచారం చేయాలన్న ఆసక్తితో పాత్రలద్వారా సందర్భరహితంగా తన అభిప్రాయాలను వెల్లడించాడు. గోల్డెస్మిత్ చేసినట్లు కథానాయకుడు ఉత్తమ పురుషములో కథను చెప్పివుంటే వీరేశలింగం నీతి బోధలు కొంత సహజంగా సహేతుకంగా ఉండేవే ఆయన కథాకథనం ప్రథమపురుషము బహువచనంలో జరిగినందువల్ల ధర్మప్రసంగాలు కృతకంగా కనిపిస్తాయి, విసుగును కలిగిస్తాయి.

అంతేకాకుండ నీతి బోధకుడుగా నవలలోని పాత్రలను ఉత్తమపాత్రలుగనో, అధమపాత్రలుగనో చిత్రించాడు. అందులో మంచి చెడ్డలు కలసిన పాత్రలు లేరు. ఆ ప్రాతలు పెద్దాపురం జమీందారులవంటి అత్యుత్తములు లేదా శోభనాద్రి రాజు, నీలాద్రిరాజు, నారాయణమూర్తిలాంటి మోసగాళ్ళు, పోకిరీలు, దగాకోరులు. నాయకుడైన రాజశేఖరుని పాత్రపట్ల ఏ సన్నివేశంలో కూడ మనకు సానుభూతి కలుగదు. కారణం అతని దురదృష్టాలన్నీ చాల వరకు స్వయంకృతాపు రాధాలు, వీరేశలింగంలాగ గోల్డ్స్మిత్ కూడ మంచిని, మానవప్రేమను ప్రోత్సహించినవారే. బ్రిటిష్ శిక్షాస్మృతిలోని ద్వంద్వ యుద్ధాలను, కఠినశిక్షలను మరికొన్నింటిని తన నవలలో గోల్డన్మిత్ విమర్శించాడు. ఖైదీలకు వసతులను కల్పించాలని, నిరుపేదలకు చేయూతనివ్వాలని పోషించాడు. ఆంగ్లసాహిత్య చరిత్రకారులైన లెగోయి (Legouies) కాజమియా (Cazamiyan) ల మాటల్లో చెప్పాలంటే "ఆయన రచనావేశం శిల్పంలో, ఔచిత్యంలో, నిండుదనంలో సమభావంలో, హాస్యంలో సర్వోత్కృష్టమైంది. అట్టి ఉత్తేజం చాలవరకు లేనందువల్లనే వీరేశలింగం రాజశేఖరచరిత్రలో ప్రబోధానికి, రచనాశిల్పానికి సమన్వయాన్ని సాధించ లేక పోయాడు.

గోల్డెస్మిత్తో సమానమైన సాహిత్యశిల్పశక్తి, రసదృష్టి లేకపోయినా, ఒక విషయంలో మాత్రం వీరేశలింగం అతనితో సరితూగగలదు. గోల్డెస్మితి లాగే వీరేశలింగంకూడ తన రచనలో స్వీయ జీవితానుభవాలను పుష్కలంగా ప్రతిబింబింపచేశాడు. ఇందుకు మూడు నిదర్శనాలు చూపవచ్చు.

బాల్యంలో విద్యాభ్యాసకాలంలో అరగౌరజ్ఞానమున్న ఉపాధ్యాయులవద్ద తానుపడ్డ అవస్థ ఒకటి. పేదరికంవలన తాననుభవించిన కష్టాలు రెండవది. మూడవది సంఘబహిష్కరణకు గురి అయినప్పుడు తాను అనుభవించిన బాధ.

నవలలో సామాజిక వాస్తవికతను సాధించడానికి వీరేశలింగం తన పరిచితులను, కుటుంబవ్యక్తులను ఆధారంగా గ్రహించి పాత్రల్ని చిత్రించాడు. అపాత్రదానాలతో ఆడంబరాలతో కుటుంబ సంపదనంతా దుబారా చేసిన వీరేశలింగం తాతగారికి ప్రతిబింబమైన పాత్ర నవలలో నాయకుడైన రాజశేఖరుడు. తన తాతగారికున్నట్టే రాజశేఖరానికి కూడ పొగడ్తమీద ప్రీతి, పేరు ప్రతిష్టలకు ప్రాకులాడతాడు. తాతగారికి మల్లేనే రాజశేఖరంలోను విచక్షణలేని విశ్వాసం. బేలతనం మొదలైన గుణాలు చోటుచేసుకున్నాయి. పురోహితులు, జ్యోతిష్యులు, వైద్యులు స్తోత్రపాఠకులు, యాచకులు మొదలైన పరాన్నభుక్కులు ఆయన పరివారం. వీరందరూ అప్రధాన పాత్రలుగ నవలలో నడయాడుతుంటారు. హిమాలయాల్లో

తపస్సుచేసి, అమానుషశక్తుల్ని పొందాలని ఇండ్లనుండి పారిపోయి, అష్టకష్టాలు పడి యింటికి తిరిగివచ్చిన వీరేశలింగం సహాధ్యాయుల్లో ఒకడు రాజశేఖరం అల్లుడిగ నవలలో దర్శనమిస్తాడు.
తన మంత్రశక్తులతో వీరేశలింగాన్ని నాశనంచేస్తానని బెదరించి, చివరకు తానే చావుబ్రతుకుల్లోపడ్డ భూతవైద్యుడు. రాజశేఖరం. బావమరిది పాత్రలో కనిపిస్తాడు.

వీరేశలింగం వర్ణనలు వాస్తవికతకు సన్నిహితంగా ఉంటాయి. వీరేశలింగాన్ని తీవ్రంగ నిర్విరామంగా ఖండించే సంప్రదాయవాది అయిన కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, పై సత్యాన్ని గ్రహించకపోవడంవల్ల ఓటమిని పొందవలసి వచ్చింది. నవలలోని రాజశేఖరుని గృహవర్ధనను విమర్శిస్తూ హిందూ వాస్తు శాస్త్రమర్యాదలననుసరించి బ్రహ్మయ్యశాస్త్రి అటువంటి ఇల్లు, ఉంచాడు. ఆ విమర్శకు సమాధానంగా వీరేశలింగం తమ పూర్వీకుల ఇంటిని.. వచ్చిచూడమని ఆ శాస్త్రిని ఆహ్వానించాడు.

ఇటువంటి వాస్తవికతే రాజశేఖర చరిత్రలోని ప్రత్యేకత నిజానికది ప్రథమశ్రేణికి చెందిన ఉత్తమ నవల కాకపోవచ్చు. కాని అదొక అద్భుతమైన సాంఘిక చరిత్ర 19వ శతాబ్దపు మధ్య కాలంలోని ఆంధ్రుల జీవితాన్ని యెంతో సజీవంగా చిత్రించింది. అయినప్పటికి చంద్రునిలో మచ్చలా అందులోను ఒక లోపం లేకపోలేదు. నవలలో పెద్దాపురం రాజాగారయిన కృష్ణ జగపతికి నేరస్థులకు శిక్ష విధించే అధికారమున్నట్లు వర్ణింపబడింది.

కాని 19వ శతాబ్దంలో అట్టి అధికారాలు జమీందారులకు లేవు. ఈ లోపాన్ని సూచించినపుడు రాజశేఖరం 17 వ శతాబ్దంలో నివసించినట్లు వీరేశలింగం సమర్థించాడు. కాని మన మీ విషయం పట్టించుకో నక్కరలేదు. నవల ముగింపులో చివరి వాక్యానికి ముందు వాక్యంలో ఈ విషయమున్నది. వీరేశలింగం ఆలోచించి దీన్ని తరువాత చేర్చి ఉండవచ్చు. రాజశేఖర చరిత్ర ప్రకటింపబడినపుడు పత్రికను ఆ నవలను ఆదరించాయి. పాఠకలోకం మాత్రం అనాదరించింది. మొదటి ముద్రణలో వెలువడ్డ వెయ్యి ప్రతులు అమ్ముడు పోవడానికి పెక్కేండ్లు పట్టింది. ఉత్తమ నవల కుండవలసిన లక్షణాలు కొన్ని లోపించడం దీనికొక కారణం. కావచ్చు. దుర్భరమైన సమకాలీన సామాజిక జీవితానికి దర్పణం పట్టడం మరొక కారణం. కావచ్చు. ఈ నవల తప్ప ఇతరమైన తన రచనలన్నీ అతి త్వరగ అమ్ముడు పోవడం.

వీరేశలింగానికి కొంత నిరుత్సాహాన్ని కలిగించింది. ఆయన మరల ఎప్పుడూ నవల వ్రాయడానికి పూనుకోలేదు. ఒకవేళ నవలా రచనను కొనసాగించి వుంటే వీరేశలింగం ప్రథమశ్రేణి భారతీయ నవలాకారుడుగ ప్రసిద్ధి కెక్కేవాడా అన్నది ఆసక్తి దాయకమైన ప్రశ్న. బహుశా అట్టి కీర్తికి అవకాశముండివుండదు. నవలా రచన ఆయన ప్రవృత్తి కాదు. ఆదర్శాలకు అంకితమైన వీరేశలింగం కళకొరకు తన లక్ష్యాలను త్యాగం చేయలేదు.

సాంఘిక చరిత్రగా రాజశేఖర చరిత్రకు స్వదేశంలో కన్న విదేశాలలో గుర్తింపు కలిగింది. దీనికి "ఫార్చ్యూన్స్ వీల్" అన్న పేరుతో ఇంగ్లీషు అనువాదం ప్రచురింపబడినప్పుడు పత్రికలు మెచ్చుకొన్నాయి. లండన్ నుండి వెలువడే టైమ్స్ పత్రిక "ది టైమ్స్" 1887 సెప్టెంబరు 30వ తేదీ సంచికలో ఇలా సమీక్షించింది.

"హైందవ నవలల్లో ఫార్చ్యూన్స్ వీల్ అన్నది ఇంచుమించు నిరుపమానమైనది. తద్రచయితమైన కె. వీరేశలింగం పండితులు దీక్షాపరుడైన సంఘసంస్కర్త అని, ఇంగ్లీషు విద్యను కొంత నేర్చి హిందువుల ఆలోచనాసరళిని, దృక్పథాన్ని పాఠకులకు పరిచయం. చేయడానికి ఇందలి కల్పిత కథను ఆధారంగా చేసుకొన్నాడని అనువాదకుడు తెలిపాడు. హిందువుల వర్ణాచారంవల్ల వారి జీవిత విధానం యూరోపియనులకు తెలియడం. కష్టం. ఇందలి కథ చాల

సామాన్యమైంది. యూరోపియనుల సాహిత్యదృష్టికి అంత గొప్ప రచనకాదు. అయితే హిందువుల కుటుంబజీవితం, వారి మతాచారాలు, పూజా విధానాలు, మూఢవిశ్వాసాలు, స్త్రీల పరిస్థితులు, వివాహ నిర్ణయంలో పెద్దలకే అధికారం మొదలైనవి చాలా చక్కగా, నిదర్శన పూర్వకంగా ఇందులో చిత్రింపబడి వున్నాయి. భారతీయుల సామాజిక జీవనస్థాయిని పెంపొందించాలనుకొన్న రచయిత. అభిప్రాయంతో ఏకీభవించే పాఠకుల నందరిని యీ పుస్తకం ముగ్ధుల్ని చేస్తుంది. దీనిని తెలుగునుండి అనువదించినవారు జె.ఆర్. హచిన్ సన్. మదరాసు రాజధాని విద్యా శాఖాధికారి అయిన జనరల్ మాక్ డొనాల్డ్ ఈ పుస్తకానికి వ్రాసిన పీఠికలో ప్రాశ్చాత్య పాఠకులు తప్పక చదవదగిన గ్రంథముని దాటివున్నాడు."

రాజశేఖర చరిత్ర కన్నడంలోకి కూడ అనువదించబడింది. కాలక్రమేణ తెలుగు పాఠకులు రాజశేఖర చరిత్ర రూపంలోవున్న సాంఘిక చరిత్రను గుణాన్ని, విలువను గుర్తించారు. కాబట్టి అది ఇప్పటికీ ముద్రణలను పొందుతూ వుంది. నీతి కథల రచనలో వీరేశలింగం సహజప్రతిభ వ్యక్తమౌతుంది. ఆయన ఊహించిన ఆదర్శగృహిణి కథే 'సత్యవతీ చరిత్ర" 1883లో ప్రచురించాడు. ఇది మహా విజయవంతమైన ప్రచురణ. దీనికి తమిళ, కన్నడ, ఇంగ్లీషు అనువాదాలు కూడా వెంట వెంటనే వెలువడ్డాయి. పాఠకులు ఈ పుస్తకాన్ని అధికంగ అభిమానించడం వల్ల అప్పట్లో అనేకులు తమ కుమార్తెలకు ''సత్యవతి' అని ఈ కథా నాయిక పేరును పెట్టారు. దీని తర్వాత చంద్రమతీ చరిత్ర, సత్య సంజీవని అనే మరిరెండు సుదీర్ఘమైన నీతికథలను రచించాడు మొదటిది పౌరాణిక గాథ. రెండవది వీరేశలింగం కల్పన. ఇది సత్యం ప్రాధాన్యాన్ని ప్రతిపాదించడానికి ఉద్దేశింపబడిన రచన.

యుగధర్మం తెలిసిన వీరేశలింగం సాహిత్యంలో రానున్న యుగం నవలా యుగమని గుర్తించినాడు. అందుచేత నవలలు వ్రాయగలిగిన వారి నందరిని నవలా రచనకు ప్రోత్సహించాడు. న్యాపతి సుబ్బారావుతో కలసి ప్రతి సంవత్సరం తెలుగులో వెలువడే ఉత్తమ నవలకు బహుమతిని ఏర్పాటు చేశాడు. ఈ బహుమతిని అనేకసార్లు పొందిన చిలకమర్తి లక్ష్మీనరసింహం తెలుగులో సుప్రసిద్ధ నవలా రచయితగా కీర్తికెక్కాడు.

## తొలి తెలుగు నాటకకర్త

సాహిత్య ప్రక్రియలలో నవలలాగ నాటకం అర్వాచీన మైందికాదు. అది ప్రాచీన ప్రక్రియ. నాటకం కన్న కావ్యమే ప్రాచీన తమమైంది. కావ్యాలవలె నాటకం కూడా మతాన్ని ఆలంబనంగ చేసుకొనే వికాసాన్ని పొందింది. వాస్తవానికి అతిప్రాచీనమైన కావ్యాలు, నాటకాలు మత సంబంధమైనవి. తొలిదశలో నాటకాలు కవితా రూపకాలే.

భారతీయ సంప్రదాయాన్ని బట్టి నాటకం దైవదత్తమని, వేదాలతో సన్నిహిత సంబంధమున్నదని. నాట్యశాస్త్రం పేర్కొన్నది. ఋగ్వేదంలోనే నాటక బీజాలున్నట్లు కొందరు భావిస్తారు. అందులోని ఆదికవలలైన యమ యముల సంవాదం ఒకనాటిక అని వారి సిద్ధాంతం భారతీయ నాటకం. వేదకాలమంత పురాతనమైందని అంగీకరించకపోయినా అశ్వహోషుని కాలం నాటికి నాటకరచ జరిగిందని నిశ్చయంగా చెప్పవచ్చు. అశ్వదోషుడు మహాకవి, మహాకావ్యకర్తల్లో ప్రథముడేకాదు. గొప్ప నాటకకర్తకూడా ఆ తరువాతి సంస్కృత నాటకకర్తలలో భాసుడు, ఖాళీదాసు, భవభూతి, హర్షుడు, భట్టనారాయణుడు, శూద్రకుడు విశ్వ విఖ్యాతిని పొందినవారు. ప్రాచీనకాలంలో భారతదేశంలో రచింపబడినన్ని నాటకాలు ఒక్క గ్రీసుదేశంలో తప్ప ఇంకేదేశంలోను. రచింపబడలేదు. సంస్కృతంలో ఇంత నాటక సంపరవున్నా ఇతర భారతీయ భాషల్లో నాటకాలు వ్రాయడానికి రచయితలకు ప్రేరణ కలగకపోవడం ఆశ్చర్యమే.

కారణాలు ఏమైనప్పటికీ ఒక్క సంస్కృతంలో తప్ప ఏ భారతీయ భాషలోను ఆధునిక కాలంవరకు నాటకాలు వెలువడలేదు. అయినా జానపద వీధి నాటకాలు, తాత్త్విక ప్రదర్శనలు కొన్ని ఉండేవి. అదే ఆంధ్రదేశంలో యక్షగానాలు, వీధినాటకాలు, కర్ణాటకలో బయలాట, కేరళలో కథాకళి, మహారాష్ట్రలో కీర్తన, లాలిత, గుజరాతులో భావై, వంగదేశంలో జాత్ర; ఆస్సాములో ఓజపలి; హిందీ ప్రాంతాలలో రామలీల కృష్ణలీల అనే పేర్లతో ప్రదర్శింపబడేవి. ఈ జానపదుల నాటకాలలో భరతుడు పేర్కొన్న దశరూపక లక్షణాలుకాని, అరిస్టోటల్ నిర్వచించిన నాటక లక్షణాలుకాని మచ్చుకైనా కనిపించవు. భారతీయ భాషలన్నింటిలో లాగ తెలుగులో కూడ పాశ్చాత్య సాహిత్య ప్రభావానంతరమే నాటక రచన జరిగింది.

తెలుగులో అనేక సాహిత్య ప్రక్రియలకు లాగ నాటక ప్రక్రియకు కూడ ఆద్యుడు వీరేశలింగమే. 1861లో మంజరీ మధుకరీయాన్ని ప్రచురించిన కోరాడ రామచంద్రశాస్త్రి తొలి తెలుగు నాటకకర్త అని కొందరివాదం. అయితే మంజరీ మధుకరీయంలో భారతీయ నాటక లక్షణాలుగానీ, పాశ్చాత్య నాటక లక్షణాలు గానీ లేవు. అందులో అంకవిభజన, రంగ విభజన లేదు. అసలది రంగ ప్రదర్శన యోగ్యమైంది కాదు. దానినొక నాటకమనడం ఒక భ్రమ మాత్రమే.

వీరేశలింగం రచించిన తొలినాటకం బ్రహ్మ వివాహం". అది ధారావాహికంగా 1876లో హాస్య సంజీవనిలో ప్రకటింపబడింది. బెంగాలీలో రామనారాయణ రచించిన "కులీనకుల సర్వస్వం" అనే నాటకంలాగే వీరేశలింగంగారి "బ్రహ్మ వివాహం" కూడా హాస్యభరిత సాంఘికనాటకం కులీనకుల సర్వస్వం బెంగాలీలో బహుశా ఉత్తమోత్తమమైన నాటకం.

మూడవ భార్య చనిపోతే మూడేండ్ల ముక్కు పచ్చలారని పసికందును వివాహం చేసుకున్న పెద్దయ్య బ్రహ్మ వివాహంలో ప్రధానపాత్ర డబ్బు కక్కుర్తితో వెయ్యి రూపాయలకు బాలవధువును అమ్మిన తల్లిదండ్రులు, స్వార్థంతో ఈ పెండ్లికుదిర్చిన పెండ్లిండ్ల పేరయ్యలు, పెద్దయ్యను ముస్పైయేండ్ల చిన్నవారుగా జాతకాధారాలు చూపిన దుర్బుద్ధి జ్యోతిష్యుడు ఈ నాటకంలోని కొన్ని ముఖ్యపాత్రలు తదితర పాత్రలుకూడ స్వార్థపరులు, అవినీతిపరులు, మానవత లేనివారు. వారిలో ఒక్కరికైన చెప్పుకోదగ్గ సుగుణమేదీ లేదు. ఆ రోజుల్లో ఈ నాటకం చాల ప్రసిద్ధి ప్రచారాలను పొందింది. ఈ నాటకం రచించిన రెండేండ్ల తర్వాత ఒకమారు వీరేశలింగం: మచిలీపట్టణం వెళ్ళినపుడు అక్కడొక బాలిక ఈ నాటకాన్ని ఒక అక్షరం పొల్లుపోకుండా. అప్పగించడం చూచి ఆయన ఆశ్చర్యపోయాడు ప్రేక్షక ప్రజలీ నాటకానికి "పెద్దయ్యగారి పెళ్ళి" అని ముచ్చటగా పేరుపెట్టారు. వంగదేశంలో కులీనకుల సర్వస్వ నాటకం బహు భార్యాత్వానికి గొడ్డలిపెట్టయిన దంటారు. అలాగే ఆంధ్రదేశంలో శతవృద్ధులు ముక్కు పచ్చలారని బాలికల్ని భార్యలుగా చేసుకొనే ఆచారానికి బ్రహ్మవివాహం గొడ్డలి పెట్టయింది.

బ్రహ్మ వివాహం తరువాత వీరేశలింగం "వ్యవహార ధర్మబోధిని" అన్న మరొక సాంఘిక నాటకాన్ని 1879లో ప్రచురించాడు. అదికూడ గొప్ప ప్రజాదరణను పొందింది. అభిమానులైన ప్రేక్షకులు ఆ నాటకానికి "ప్లీదరు నాటక" మని ముద్దు పేరుపెట్టారు. ఈ ముద్దు పేరును బట్టి న్యాయస్థానాలలోని అవినీతి యిందులోని యితివృత్తం అని గ్రహించవచ్చు. ఈ నాటకంలో ప్లీడర్ల నైతిక పతనమే కాకుండా ఇతర న్యాయస్థానోద్యోగుల దుండగాలు, వారి ప్రతివాదుల దుశ్చర్యలు చిత్రీకరింపబడ్డాయి వీరేశలింగంగారి విద్యార్థులు, మిత్రులు ఈ నాటకాన్ని ఒక స్థానిక పాఠశాలలో 1880లో జయప్రదంగా ప్రదర్శించారు. ఆంధ్రదేశంలో ఔత్సాహికులు, తదితరులు ప్రదర్శించిన తొలి ఆధునిక నాటకమిదే వివేకదీపిక వీరేశలింగం రచించిన మూడవ సాంఘిక నాటకం. అది అసమగ్ర రచన వితంతు వివాహం ఇందులోని

ఇతివృత్తం ఇందులో ప్రబోధం ప్రధానం. అందువల్ల ఇది నాటకం కాదేమోనన్న సందేహంతో వీరేశలింగం దీన్ని పూర్తిచేసి ఉండకపోవచ్చు.

ఆనాటి హిందూ సమాజం ఎంతటి నీచస్థితికి దిగజారినదంటే వీరేశలింగానికి అదొక పశువుల దొడ్డిలాగా కనిపించింది. సమాజాన్ని ఒక పశువుగ చిత్రిస్తూ మూడు నాటికలు రచించాడు. ఈ నాటకాల్లో జంతువులు మాంసాహారులైన పక్షులు, క్రూరులు, వంచకులైన మనుష్యులకు ప్రతీకలు ఆప్తమిత్రుడు, యువకుడు అయిన బసవరాజు గవర్రాజు ఆకస్మికంగా మణించినప్పుడు జరిగిన ఘోర సంఘటనలే యిట్టి నాటక రచనకు వీరేశలింగాన్ని ప్రేరేపించాయి. గవర్రాజు చేస్తున్న సంఘ సంస్కరణ కార్యాలకు అతని బంధువులు ప్రతికూలంగా ఉండేవారు. ఆయన మరణించినప్పుడు శవదహనానికి బంధువులెవ్వరూ తోడ్పడలేదు. ఈ పరిస్థితిని గుర్తించిన శవవాహకులు విపరీతమైన కూలి డబ్బు అడిగారు ఇట్టి అమానుషత్వానికి కుపితుడైన వీరేశలింగం. "తిర్యగ్విద్వాన్ మహాసభ" అన్న ఒక వ్యంగ్య నాటకాన్ని రెండు గంటల వ్యవధిలో రచించి. ముద్రించి, ప్రకటించి అందరికి పంచాడు. ఈ నాటకం, మూషికాసుర విజయం అన్న మరొకనాటకం ఆయన ఎదుర్కోవలసిన పరువు నష్టపుదావాలకు ప్రధానకారణాలయ్యాయి.

వీటి తరువాత వ్రాసిన నాటకాలకు "ప్రహసనాలు" అని ఆయనే పేరుపెట్టాడు. బ్రౌణ్య నిఘంటువు ప్రకారం "ఫార్స్ బర్లెక్సుక్యూ" అన్నవి ప్రహసనానికి ఇంగ్లీషు పర్యాయపదాలు. వీరేశలింగం రచించిన చిన్నవి పెద్దవి అయిన పద్నాలుగు ప్రహసనాలలో పది ప్రహసనాలు ఆంగ్లానుకరణలని అంటారు. ఇవిగాక సంభాషణా ప్రధానమైన లఘు నాటికల్ని, హాస్యప్రధానమైన సంభైయారింటిని ఆయన రచించాడు. వీటిని 'హాస్య సంజీవని" అన్న పేరుతో నాలుగు సంపుటాలుగా ప్రకటించాడు.

వీరేశలింగం హాస్యం సున్నితమైంది కాదు; సరసమైందీకాదు అది అవహేళన ప్రధానమైంది. ఆయనది ఎత్తిపొడిచే హాస్యం నవ్వుకన్న నిందే అధికం 'పంచ్' పత్రికతో విక్టోరియారాణి కాలపు హాస్య రూపంవేరు. ఈనాటి హాస్య రూపం వేరు. రాయలనాటి రామలింగ కవి . హాస్యం ఇప్పుడు కొంత మోటుగా కనిపిస్తుంది.

కాలానుగుణంగా హాస్య ధోరణులు మారుతుంటాయి. అందుకే మన కన్న వీరేశలింగం సమకాలికులు ఆయన ప్రహసనాలను, హాస్యాత్మక సంభాషణల్ని చదివి ఆనందించారనడంలో ఆశ్చర్యం లేదు.

ప్రధాన నాటకంలో గ్రాంధికభాషను, ప్రహసనాలలో వ్యావహారికభాషను వీరేశలింగం వాడాడు. ఈ విధంగా కొద్దిపాటి వ్యావహారిక భాషను సాహిత్య గ్రంథాలలో ప్రవేశ పెట్టిన అద్భుడు. వీరేశలింగమే రచనల్లో వ్యావహారిక భాషను ప్రవేశ పెట్టడంలో కూడా వీరేశలింగం మార్గదర్శి. సహజ సుందరమైన యీ వ్యావహారిక భాషే ఆయన సాంఘిక నాటకాలకు, ప్రహసనాలకు జీవాన్ని, జవాన్ని ప్రసాదించింది. స్థాలీపులాకంగా చూచి చెప్పేవారి అభిప్రాయాలకు భిన్నంగా ఆయన సంభాషణలు తెలుగు నుడికారంలో, జాతీయంతో, చమత్కారంతో చవులూరిస్తుంటవి.

రాజమండ్రిలో ఒక నాటక కంపెనీవాళ్ళు కోరితే 1885లో ప్రహ్లాద చరిత్రను ఒక నాటకంగా రచించాడు. వీరేశలింగం రచించిన తొలి పౌరాణిక నాటకమిదే, వెంటనే ముద్రితమైన ఈ అయిదంకాల నాటకాన్ని యెందుచేతనో ప్రదర్శించలేదు. భాగవతంలోని ప్రహ్లాద కథలాగే భారతంలోని కౌరవుల గోగ్రహం కథను కూడ ఒక నాటకంగా రూపొందించాడు. "దక్షిణ గోగ్రహణ" మన్న యీ నాటకంలో కూడ అయిదంకాలున్నాయి. ఈ రెండు నాటకాలు సంస్కృత నాటకసరణిని అనుసరించాయి. పాత్రల సంభాషణల్లో పద్యాలు కూడ వున్నాయి. కాని సమాస భూయిష్టమైన శబ్దాడంబర రచనలేదు.

గ్రాంథికమైనా శైలి సరళం సుబోధకం, ఈ రెండు నాటకాలే ఆ తరువాత తెలుగులో వెలువడ్డ పౌరాణిక నాటకాలకు ఒరవడి అయినాయి. ఈ రచనా విధానాన్నే మన పౌరాణిక నాటకాల్లో కర్తలు ఇప్పటికి పాటిస్తున్నారు.

1886లో మరల లచే నాటక కంపెనీవాళ్ళు శంకర కవి విరచిత హరిశ్చంద్రోపాఖ్యానాన్ని నాటకీకరించమని వీరేశలింగాన్ని కోరారు. రచనలో తనకున్న సహజమైన వేగంతో రెండువారాల్లో నాలుగంకాలను పూర్తిచేశాడు. రెండవ సారికూడ ఆ నాటక కంపెనివాళ్ళు. తమ మాట నిలబెట్టుకోక పోవడంవల్ల ఆ నాటకాన్ని ఆయన అప్పటికి అసమగ్రంగానే విడిచిపెట్టాడు. ఆ తరువాత కొంత కాలానికి కాకినాడలోని మరొక నాటక కంపెనీ ఆయన్ను బలవంతపెడితే అయిదో అంకాన్ని పూర్తిచేశాడు. ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ప్రదర్శన విజయవంతమైంది. బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్రీయ నాటకం వచ్చేంతవరకు ఈ హరిశ్చంద్ర నాటకమే ప్రజారంజకంగా ప్రదర్శింపబడుతూవుండేది. ధీరేశలింగం స్వతంత్ర నాటకాలన్నింటిలోకి యిదే ప్రసిద్ధమైంది.

తన ప్రహసనాలలో బాగా ఈ మూడు పౌరాణిక నాటకాల్లో కూడా వీరేశలింగం నీతిని ధారాళంగా ప్రత్యక్షంగా ప్రబోధించాడు. నాటక రచనలో నీత్యుపదేశం కూడదనే భావన ఆయనకు లేదు. పైగా ఆయనకు అదొక గర్వకారణం పౌరాణిక నాటకాలలో కూడా నీతిని బోధించే సన్నివేశాన్ని యేదీకూడ జారవిడుచుకోలేదని స్వీయ చరిత్రలో పేర్కొన్నాడు. విగ్రహారాధనను నిరసించి పురాణాలలోని కల్పనల్ని, అద్భుతాలని విశ్వసించని వీరేశలింగానికి పురాణ గాధలు నూతన హేతువాద విధానంలో వ్యాఖ్యానించే అవకాశం ఈ నాటకరచన వల్ల కలిగింది. గ్రీకు పురాణగాధలను నూతనంగా, అద్భుతంగా, వ్యాఖ్యానించిన 'యూజిన్ ఓ' నైల్', 'జీన్ అనోవిత్', "జీన్ గిరౌడ్" వంటి ఆధునిక నాటక కర్తలకులాగే వీరేశలింగం కూడ పురాణాలను అపూర్వ విధానంగా వ్యాఖ్యానించి వుండవచ్చు. అలా కాకుండ ఆయన గ్రహించిన పురాణ గాధల్లో ఇక్కడొక దెబ్బ అక్కడొక చురక అంటించి తృప్తిచెందడం విచారించదగ్గ విషయం.

కాళిదాసు, షేక్స్పియర్ నాటకాలను జీవితకాలమంతా వీరేశలింగం శ్రద్ధగా అధ్యయనం చేశాడు. ఈ నాటక కర్తల నాటకాలపట్ల ఆయనకుగల అభిమానం ఆరాధన ప్రాయమైనందువల్ల వారి ఉత్తమ నాటకాలను అనువదించాలనే కోరిక కలిగింది. 1875వ సంవత్సరంలోనే షేక్స్పియర్ రచించిన 'ది కామిడి ఆఫ్ యెరర్స్' అన్న నాటకాన్ని అనువదించడానికి ప్రారంభించి, రెండప అంకం మధ్యలోనే ఆపేశాడు. షేక్ స్పియర్ నాటకాలను యూరపియన్ భాషల్లోకి కూడ అనువదించడం కష్టమే, ఈ అనువాదాల్లో కొద్దిమంది మాత్రమే కృత కృత్యులయ్యారు. విభిన్నమైన సామాజిక వాతావరణంలో సంస్కృతితో పరిణమించి విలక్షణమైన నుడికారం, నిర్మాణంగల భారతీయ భాషల్లోకి షేక్స్పియర్ నాటకాలను అనువదించడం కష్టతరమైన కార్యం. 64 విషయాన్ని గ్రహించిన వీరేశలింగం చివరకు "ది కామెడి ఆఫ్ ఎరెర్స్" నాటకానువాదాన్ని విడిచి పెట్టవలసి వచ్చింది. కొన్నేండ్ల తరువాత యీ నాటకాన్ని ఆధారంగా చేసుకొని ఆంధ్రదేశ స్థితిగతులకు అనువుగా కథను, పాత్రలను మలచి "చమత్కార రత్నావళి" అన్న నాటకాన్ని ఆయన రచించాడు. రచన పూర్తయిన వెంటనే అది ప్రదర్శించబడింది.

సాధారణంగా ఓటమిని అంగీకరించని వీరేశలింగం షేక్స్పియర్ నాటకానువాదానికి రెండవసారి పూనుకున్నాడు. తెలుగు ద్విపదచ్ఛందస్సులో అనువదించడానికి ప్రారంభించినా మధ్యలో నిలిపివేయవలసివచ్చింది. చమత్కార రత్నావళి పద్ధతిలోనే ఇంగ్లీషు నాటకాలను అనువాదరూపంలో కాకుండ అనుసరణ పద్ధతిలో రచించాడు. షెరిడన్ రచించిన "ది డయన్న" "ది రైవల్స్" నాటకాలను, 'రాజమంజరి', 'కళ్యాణ కల్పవల్లి' అన్న నాటకాలుగా తెలుగులో రూపొందించాడు.

షేక్స్పియర్ నాటకాల యథానువాదంలో కృతకృత్యుడు కాని వీరేశలింగం, కాళిదాసు నాటకాలను అనువదించడంలో కృతార్థుడయ్యాడు. అభిజ్ఞాన శాకుంతల నాటకానువాదాన్ని 1876లో ప్రారంభించి, కొన్నేండ్లు అలాగే పెట్టి తరువాత 1883లో పూర్తి చేశాడు. వీరేశలింగానికి ముందు తర్వాత కూడా అభిజ్ఞాన శాకుంతలాన్ని అనేకులు తెలుగులోనికి అనువదించారు.

అవన్నీ వీరేశలింగం అనువాదం ముందు దిగదుడుపే. మూలనాటకంతో తాదాత్మ్యాన్ని పొంది ప్రతి వాక్యాన్ని అద్భుతంగా అనువదించాడు. చతుర్థాంకంలో శకుంతల కళ్యాక్రమాన్ని వీడేదృశ్యం కరుణరసపూరితమైంది. ఆ సన్నివేశంలో వీరేశలింగం రచన పరాకాష్టనందుకొన్నది. కణ్వమహర్షికి లాగే వీరేశలింగానికి యెందరో పెంపుడు కూతుళ్ళు. వాళ్ళందరూ వివాహమై అత్తవారింటికి తరలిపోయేటప్పుడు వీరేశలింగంకూడ ఇట్టి బాధనే అనుభవించి ఉండాలి. దీనిని అనువదించి యించుమించు ఎనభై యేండ్లయినా శాకుంతలాన్ని తెలుగు రంగస్థలంమీద ప్రదర్శించాలంటే ఇప్పటికి వీరేశలింగం అనువాదాన్నే గ్రహించడం గొప్ప విశేషం. కాళిదాసుని మాళవికాగ్నిమిత్రం, కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయం హర్షుని రత్నావళి ఆయన అనువదించిన ఇతర సంస్కృత నాటకాలు. ఇవి కూడ మంచి నాటకాలు. కాని ఇందులో ఏదీ శాకుంతలాన్ని మించలేదు.

వీరేశలింగం తొలి నాటకకర్త మాత్రమేకాదు. తొలి నాటక ప్రయోక్త కూడ. 18806 కొద్దిమంది ప్రేక్షకుల సమక్షంలో వ్యవహార ధర్మబోధిని అనే నాటకాన్ని ప్రదర్శించాడు. ఆ యేడాది చివరలోనో మరుసంవత్సర ప్రారంభంలోనో రెండు నాటకాలను ప్రదర్శించాడు. దేశాటనచేస్తూ నాటకాలు ప్రదర్శించే ధార్వాడ నాటక కంపెనివారు అప్పుడు రాజమండ్రికి వచ్చాడు. వాళ్లు తాత్కాలికంగా నిర్మించిన రంగస్థలాన్ని ఎత్తివేయడానికిముందే త్వరత్వరగా వీరేశలింగం "ది కామెడి ఆఫ్ ఎరర్స్" అన్న షేక్ స్పియర్ నాటకాన్ని. హర్షుని రత్నావళిని అనువదించి ఆ రంగస్థలం మీద ప్రదర్శింపచేశాడు. ప్రేక్షకుల ఆనందానికి అవధిలేకపోయింది. "నటవిటగాయకులు" అని నటులను, గాయకులను, విటులతో చేర్చి చెప్పే సమకాలీనుల ఈసడింపుతో వీరేశలింగం ఏకీభవించలేదు. నాటకప్రదర్శనాలకున్న విద్యాసాంస్కృతిక ప్రయోజనాలను విలువలను ఆయన చక్కగా గుర్తించాడు. అందువల్లనే యువకులకు వేషం కట్టి నాటకాలాడిస్తున్నాడనే నెపంతో కొందరు పెద్దలు ఆయన మీద కేసు పెడతామని బెదరించారు. ఆయన అదేమీ పట్టించుకోలేదు. కాని నాటకాల పిచ్చిలో పడి తన విద్యార్థులు చదువు నిర్లక్ష్యం చేస్తున్నారని తాను గ్రహించినప్పటి నుండి స్వయంగా నాటక ప్రదర్శనలకు దర్శకత్వం వహించలేదు. ఈ నిర్ణయం విచారకరం. నూతనాభిప్రాయాల వ్యక్తీకరణానికి, కళాత్మక ప్రదర్శనానికి రంగస్థలం శక్తిమంతమైన సాధనన్న అనుభవాన్ని ఆయన గుర్తించివుంటే తెలుగులో యింకా ఉత్తమ నాటకాలను ఆయన రచింపగలిగి వుండేవారు.

## అపూర్వమైన ఇతర రచనలు

వీరేశలింగం మరి ఆరు నూతన సాహిత్య ప్రక్రియలకు శ్రీకారం చుట్టాడు. వాటిలో ఒక్కొకు ప్రక్రియను గురించి ఒక్కొక్క ప్రకరణం ప్రత్యేకించి వ్రాయవచ్చు. కాని గ్రంథ విస్తరభీతివల్ల అన్నింటిని ఈ ఒక్క అధ్యాయంలోనే సంక్షిప్తంగా సమీక్షించడమైంది. తెలుగులో తొట్టతొలి వ్యంగ్య రచనలు వీరేశలింగం కలం నుండే వెలువడ్డాయి. మగవాళ్ళ ధంబాచారాన్ని పరిహసించడానికి మగువలకన్న మగవారు అధికుడన్న దురభిప్రాయాన్ని రుయ్యబట్టడానికి, సమాజంలో తన అధిక్యాన్ని సంరక్షించుకోడానికి పురుషుడు విధించిన చట్టాల్లోను ఆచారాల్లోను, వ్యవహార విధానాల్లోను ఉన్న అసమానతను ఎత్తిచూపడానికి, ఒక్కమాటలో చెప్పాలంటే మగవాళ్ళదే పైచేయిగా వున్న మానవలోకంలోని అన్యాయాన్ని, దుర్నీతిని వెల్లడించడానికి వీరేశలింగం "గలివెరి ట్రావెల్స్" అన్న ఆంగ్ల నవల ఆధారంగా "సత్యరాజ పూర్వ దేశయాత్రలు" అన్న పేర ఒక గ్రంథాన్ని రచించాడు. ఆయన కల్పించిన సత్యరాజాచార్య పాత్ర గలివర్కు ప్రతిరూపం. కాని తన యాత్రలో

సత్యరాజు సందర్శించిన మొదటి వింతదేశం. అంగుష్ట ప్రమాణ దేహులున్న దేశంకాదు. అజానుబాహువులున్న ఆడ మళయాళదేశం. ఆ దేశంలో మగరాయళ్ళైన స్త్రీలు పురుషుల మీద నిరంకుశమైన అధికారాన్ని చెలాయిస్తారు. తన ఆస్తిలో మగదొక వస్తువైనట్లు అతడు తనకు అమ్ముడుపోయిన బానిసలాగ, ఎదురుచెప్పకు తన ఆజ్ఞల్ని పాటించాలన్నట్లు ఆ దేశపు స్త్రీ భావిస్తుంది. భార్య కురూపి కావచ్చు. రోగినది. కావచ్చు. పిచ్చిది కావచ్చు.
అయినా భర్త ఆమెకు విడాకు లివ్వడానికి వీల్లేదు. ఆమె అహంకారి, గర్విష్టి ముక్కోపి కావచ్చు. భర్త మాత్రం ఆమెను విడువకూడదు. ఆమె కలహకంఠి, గయ్యాళి, జగడాలమారి అయినా కట్టుకొన్న మగడు ఆమెకు సర్వదా విధేయుడై విశ్వాసంతో పతిసేవ చేయాలి. అలా చేయని భర్తలకు ఇహపరాల్లేవు. ఆడ మళయాళంలో ప్రతీదీ పురుషాధిక్యమున్న మన మామూలు లోకానికి భిన్నంగా ఉంటుంది. చిరకాలంగా సంప్రదాయ రూపంగా రావడంవల్ల పురుష ప్రపంచంలోని అనర్థాలను, అన్యాయాలను అమానుష కృత్యాలను మనం విస్మరిస్తున్నాం.

సత్యరాజు ఆడ మళయాళం నుంచి రాక్షసావాసమైన లంకకు వెళ్తాడు. అయితే ఆ రాక్షసులు 'స్విఫ్ట్ తన ఇంగ్లీషు నవల్లో వర్ణించినట్టి వాళ్ళుకారు. మన హిందూ పురాణాల్లో వర్ణించబడినట్టివారు. వీరికి జ్యోతిషం మీద అపరిమితమైన నమ్మకం. జ్యోతిశ్శాస్త్రాన్ని సంప్రతించకుండ ఏ చిన్నపని చేయరు. వారి తెలివితేటలన్నీ శాస్త్రమునుకొనే జ్యోతిషం మీదనే ఆధారపడి ఉంటాయి. వారి తలల్లో మెదడు అనే పదార్థం శూన్యం. తమ మూఢనమ్మకాలపట్ల వారికి ప్రగాఢ విశ్వాసం. తమ గతాన్ని గూర్చి గొప్పలు చెప్పుకుంటారు.
ఒక్కమాటలో చెప్పాలంటే వాళ్ళ ప్రపంచం మన పురాణాల్లోలాగ అత్యద్భుత కల్పిత గాథలతో అసంభవాలతో కూడుకొన్న ఒక వింత ప్రపంచం.

గలివర్స్ ట్రావెల్స్ అన్న ఇంగ్లీషు నవలలో ఉన్నట్లు వీరేశలింగం సత్యరాజ పూర్వదేశయాత్రలలో మరి రెండు యాత్రలను కూడా వ్రాసివున్నట్లయితే ఆ నవలకు వైవిధ్యం నిండుదనం చేకూరి వుండేవి. అయినా ఆయన రచించినంతవరకు అదొక పిడుగుపాటులాంటి వ్యంగ్య రచన. గలివర్స్ ట్రావెల్స్ వున్నట్లు అంత వింతగా విడ్డూరంగా లేకపోయినా, సత్యరాజ పూర్వదేశ యాత్రలు చదివి ఆనందించదగ్గ నవల "స్విఫ్ట్" రచనలో సమాజంపట్ల విద్వేషం పగ కనిపిస్తవి.

సత్యరాజు వీరేశలింగం రచనలో అవిలేవు కాబట్టి అది చదివి ఆనందించదగ్గ రచన. సత్యరాజ పూర్వదేశయాత్రలు కన్నడం, ఇంగ్లీషు భాషల్లోకి అనువదింపబడింది. పూర్వదేశయాత్ర గ్రంథంలోని కట్టుకథల్ని నిజమని నమ్మిన అమాయకులైన పాఠకులు కొందరు సత్యరాజుగారి చిరునామాను తెలుపమని వీరేశలింగానికి ఉత్తరాలు వ్రాశారు.

వీరేశలింగం వ్రాసిన రెండవ వ్యంగ్యరచన "అభాగ్యోపాఖ్యానం" ఇది పద్యరచన. ఇంతకుముందే చెప్పినట్లు క్షీణయుగంలోని తెలుగు కవిత చాలవరకు శృంగారాత్మకం. అది అసభ్య శృంగారం. క్షీణయుగపు ప్రబంధకవుల అశ్లీల శృంగారాన్ని అవహేళన చేసే పద్యకావ్యం అభాగ్యోపాఖ్యానం. వీరేశలింగం తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టిన మరో రెండు నూతన ప్రక్రియలు జీవితచరిత్ర, స్వీయ చరిత్ర ఆయన ఏసుక్రీస్తు, రాజు రామమోహన్ రాయ్, విక్టోరియారాణి జీవితచరిత్రలను వ్రాయ సంకల్పించాడు. ఈ మూడింటిలో ఏసుక్రీస్తు జీవితచరిత్రను, విక్టోరియారాణి జీవితం చరిత్రను పూర్తి చేశాడు. రామమోహన్ రాయ్ చరిత్రను పూర్తిచేయలేకపోయాడు. ఆయన వ్రాసిన సంగ్రహ జీవితచరిత్రలు అనేకం. శంకరాచార్య మొదలు విద్యాసాగర్ వరకు, జోన్ ఆఫ్ ఆర్కు నుండి అనిబిసెంటు వరకు అనేకుల జీవితగాథల్ని రచించాడు. లెక్కబెడితే ఆయన రచించిన జీవితచరిత్రలు చాలా వున్నాయి. కాని వాటిలో జీవితచరిత్ర రచనాశిల్పం కొరవడింది. ఆ శిల్పం ఆయన అందుబాటులోకి రాలేదు. "లిట్టన్ స్ట్రాషే" చెప్పినట్లు "సాహిత్య ప్రక్రియలన్నింటిలో జీవితచరిత్ర అతి సున్నితమూ, ఆర్ద్రమూ అయిన రచన. ఏ దేశంలోగాని, ఏ కాలంలోగాని జీవిత చరిత్ర రచనలో

సిద్ధహస్తులైనవారు చాల తక్కువే". మరల షే మాటల్లో చెప్పాలంటే "మంచి జీవితాన్ని జీవించడం ఎంత కష్టమో, మరల జీవితచరిత్రను వ్రాయడం కూడా ఇంచుమించు అంత కష్టం". వీరేశలింగం మంచి జీవితాన్ని జీవించాడు. కాని మంచి జీవితచరిత్ర రచనల్ని వ్రాయలేకపోయాడు. అందుకు మనం ఆశ్చర్యపడనక్కరలేదు, "ఆంద్రే మోరిస్" చెప్పినట్లు,

"మంచి జీవితం కన్న మంచి జీవితచరిత్ర రచన చాల అరుదు" ఇంత క్లిష్టమైన ఈ ప్రక్రియకు వీరేశలింగం పూనుకొని మార్గదర్శకుడు కావడం నిజంగా అభినందించదగ్గ విషయం. ఇందులో ఆయన సాధించిన విజయం పరిమితమైనదయినా నిజంగా గణింపదగింది.

జీవితచరిత్ర రచనలో విఫలుడైన వీరేశలింగం స్వీయచరిత్ర రచనలో సఫలుడయ్యాడు. 'గిబ్బన్' స్వీయచరిత్రలాగే వీరేశలింగం స్వీయచరిత్ర కూడ రమ్యమైంది. ఈ రెండూ విలక్షణ మహిమాన్వితమైన రచనలు. తన జీవిత కథను చెప్పడంలో అతిశయోక్తులనుగాని, అతివిధేయతను గాని వీరేశలింగం ప్రదర్శించలేదు. ఎక్కడ న్యాయంగా తనకు ఘనతరావాలో అక్కడ దాన్ని చెప్పుకున్నాడు. తన అశక్తతను అపజయాలను కూడ చెప్పవలసినచోట ..దాచుకోకుండా చెప్పాడు. మానవపరిధిలోని ఏ విషయాన్నీ దాచలేదు. దేనికి మెరుగులు వెట్టలేదు. నిరుపేద కుటుంబంలో పుట్టి, విద్యాభ్యాసానికి పరిమిత అవకాశాలే వున్నా పెద్ద పరవులు పొందకపోయినా, శారీరకారోగ్యం లేకపోయినా తన జీవితాన్ని నిండుగా సార్థకంగా జీవించగలిగానన్న సంతృప్తిని ప్రదర్శించాడు. తనకున్న తొందరపాటు, అసహనం, కోపం అనేక రంగాలకు వ్యాప్తమైన తన శక్తియుక్తులు ఇంతకున్న మహత్తరమైన కార్యాలను సాధించడానికి అడ్డుపడినవన్న అసంతృప్తిని కూడా ఆయన స్వీయచరిత్రలో చూడవచ్చు. ఇతర రచనలలోలాగే స్వీయచరిత్ర రచనలోకూడా ఆయన త్రికరణశుద్ధి, యథార్థత, నిర్భీతి ప్రతిబింబితమై వున్నాయి. స్వీయచరిత్ర రచనకు మొదట ఆయన సుముఖుడు కాదు. కాని మిత్రుల ప్రోద్బలం వల్ల అంగీకరించవలసి వచ్చింది. అందులో తన జీవిత వృత్తాంతాన్నే కాకుండ సమకాలీన చరిత్రను కూడా సమకూర్చాడు. అదొక విశ్వాస ప్రధానమైన నిబంధన; మనోవికాసానికొక నివేదిక. ఆత్మసమర్పణక ఆహ్వానం.

తెనుగులో వాఙ్మయ చరిత్ర రచనా ప్రక్రియకు కూడ వీరేశలింగమే ఆద్యుడు. నాటక రచనకున్నట్లు ఈ రచనకు కూడా ఆయనకు పూర్వుకొకడున్నాడు. వీరేశలింగం వివేకవర్ధనిలో 1887వ సంవత్సరం తన ఆంధ్ర కవుల చరిత్రను వరుసగా ప్రచురించడానికి పూర్వమే పెద్దాపురం, నుండి గురజాడ శ్రీరామమూర్తి తెలుగు కవుల చరిత్రలను చిన్న చిన్న పుస్తకాలుగా ప్రకటించారు. ఆయన ప్రసిద్ధులైన తెలుగు కవులలో కొందరిని మాత్రమే ఎన్నుకున్నాడు. ఆ కవుల చరిత్రలోని విషయాలు పరిశోధనాపూర్వకమైన చారిత్రక సత్యాలుకావు. ఆయా కవులకు సంబంధించిన జనశ్రుతులు, కింవదంతులు, కట్టుకథలే ఆయన రచనకు ఆధారాలు కట్టుకథలతో కూడిన కవుల చరిత్రల్ని చూచిన వీరేశలింగానికి కోపం వచ్చింది. అట్టి రచన అపవిత్రకార్యంగా వీరేశలింగం భావించాడు. చారిత్రకాధారాలతో పరిశోధన ప్రమాణాలతో కూడిన తెలుగు కవులు చరిత్రను వ్రాయడానికి పూనుకొన్నాడు.

ఈనాడు మనకందుబాటులో వున్న శాసనాధారాలు నాణేలు తదితర చారిత్రకాధారాలు అప్పుడులేవు. లభించిన కొన్ని ఆధారాలను కూడా సమగ్రంగా పరిశీలించి, వింగడించి ప్రకటించినవారులేరు. అప్పటికి ఇంచుమించు అన్ని కావ్యాలు తాళపత్ర రూపంలోనే ఉండేవి. వాటిలో కొన్ని మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోను, తంజావూరు సరస్వతీ మహల్లోను, మరికొన్ని పండితుల ఇండ్లలోను ఉండేవి. తెలుగుకవుల చరిత్ర రచన దుష్కరమైనప్పటికీ వీరేశలింగం తనకు స్వాభావికమైన ఉత్సాహంతో ముందుకు కొనసాగాడు. విషయ సేకరణకు దేశాటనం చేశాడు. తాళపత్ర గ్రంథాలను అరువు తెచ్చుకొన్నాడు. అరువుగా కూడ తన అందుబాటులోనికి రాని సందర్భాల్లో వాటికి ప్రతులు వ్రాసుకొన్నాడు. కొన్ని డబ్బిచ్చికొన్నాడు. వస్తు ప్రదర్శనశాలలు దర్శించి శాసనాలకు ప్రతులు నాటీలచరిత్ర సంపాదించాడు. గ్రంథాలయాలలో

కొన్ని నెలలు గడపి వ్రాతప్రతుల్ని పరిశీలించి విషయాన్ని సేకరించాడు. వ్యయప్రయాసలను గణించక కవుల చరిత్ర రచనకు తాను సేకరించిన మూలాధారాలను వీరేశలింగం శాస్త్రీయంగా గాలించి చూశారు పరస్పర వ్యతిరేకమైన విషయాలను పరిశీలించి సత్యాన్ని ప్రకటించడానికి ప్రయత్నించారు. తన నిర్ణయాల బాగోగుల్ని పునఃపరిశీలన చేసి మొదట మూడు సంపుటాలుగా వెలువద్ద "ఆంధ్ర కవుల చరిత్ర"ను 1899లో ఏక సంపుటంగా ప్రచురించారు.

తెలుగులో అది కవియైన నన్నయ మొదలు గోపీనాథ వేంకటకవి వరకు మొత్తం 220 మంది కవుల జీవితచరిత్రలున్న గ్రంథ మిది. ఈ కవుల్లో కొందరు సుప్రసిద్ధులు. కొందరు సామాన్యులు. 11. 19 శతాబ్దాల మధ్యకాలంలో జీవించిన తెలుగు కవులకు సంబంధించిన అప్పటికి లభించిన చారిత్రక విషయాన్నంతా ఇందులో పొందుపరచాడు. ఈ కవుల చరిత్రలో సుమారు సగభాగాన్ని 1917లో వీరేశలింగం సవరించి, క్రొత్తపీఠికతో ప్రకటించాడు. ఆ తరువాత ఆయన మరణించడంవల్ల మిగిలిన సగభాగం ఆయన సవరింపుకు నోచుకోలేదు.

ఆయన రచనలో ముఖ్యంగా కవుల కాలనిర్ణయంలో కొన్ని తప్పని ఇప్పుడు మనకు తెలియవచ్చినప్పటికీ, ఆయన గ్రంథం మాత్రం ఈనాటికి ప్రామాణికమైనదే. తెలుగులో చారిత్రక పరిశోధనకది ఉన్నత ప్రమాణాల్ని కల్పించింది. కవుల జీవిత చరిత్రలను వ్రాయడానికే సంకల్పించినా నిజానికిది తెలుగు సాహిత్యచరిత్ర తన రచనలన్నింటిలో ఇది ఉత్తమమైనదని వీరేశలింగం అభిప్రాయం. ఈ రచనకు ఆయనపడిన ప్రయాసవలన అలా అనిపించి ఉండవచ్చు. ఇది ఆయన ఉత్తమరచన కాకపోయినా అమూల్యమైన రచన అని నిశ్చయంగా చెప్పవచ్చు.

ఆంధ్రకవుల చరిత్ర రచన కారణంగా కల్గిన మరొక లాభం ఇరవై ప్రాచీన కావ్యాలు పరిష్కరణతో ముద్రణ పొందడం. ఈ ప్రాచీన కావ్యాలకు అనేక తాళపత్ర ప్రతుల్ని సేకరించి, పాఠాంతరాల్ని గుర్తించి, శుద్ధపాఠాల్ని నిర్ణయించి, గ్రంథ పరిష్కరణ చేశాడు. ఈ ఇరవై కావ్యాలలో సగానికిపైగా ఆయన అన్వేషించి కనుగొన్నవే. పద్దెనిమిదింటిని ఆయనే మొదటి సారిగా ముద్రించాడు. మిగిలిన రెండు అంతకుపూర్వం ముద్రితమైనా, అపపాఠాలతో తప్పుల తడకలుగా ఉండినవి. వీరేశలింగానికి పూర్వులలో తెలుగుకావ్య పరిష్కరణకు ముద్రణను అధిక సంఖ్యలో చేసినవాడు. సి.పి. బ్రౌన్ ఒక్కడే.

విజ్ఞానశాస్త్రాధ్యయనం చేయని ఒక తెలుగు పండితుడు శాస్త్రగ్రంథ రచనకు పూనుకోవడం సాహసకార్యమే. ఇతర రచయితలెవరైనా ఈ పనికి పూనుకొని ఉంటే వీరేశలింగం శాస్త్రగ్రంథాల రచనను తలపెట్టి ఉండేవాడు కాదు. అట్టి రచయితలు ఆనాడు లేనందువల్ల తెలుగు వాఙ్మయంలోని ఈ లోపాన్ని కూడా ఆయనే పూరించవలసి వచ్చింది.

కొన్ని సంవత్సరాలు అధ్యయనం చేసి, వీరేశలింగం మానవ శరీర శాస్త్రానికి సంబంధించిన రెండు గ్రంథాలను ప్రకటించాడు. వీటిని సచిత్ర గ్రంథాలుగా ముద్రించడానికి ఎంతో డబ్బు ఖర్చుచేసి కలకత్తా నుండి, లండన్ నుండి చిత్రాలను తెప్పించారు. తెలుగులో వెలువద్ద శాస్త్రగ్రంథాలలో వీరేశలింగం గ్రంథాలే మొదటివి అన్న విషయాన్ని గుర్తుంచుకుంటే అవి ఉత్తమ గ్రంథాలే ఆయన రచించిన మానవశరీర శాస్త్రగ్రంథం అనేక సంవత్సరాలు పాఠ్యగ్రంథంగా ఉండేది. నాలుగైదు ప్రచురణలను కూడా పొందింది. ప్రతి ప్రచురణను కూడా ఆయన సవరిస్తూ ప్రకటించాడు. శాస్త్రగ్రంథాన్ని రచించాడు. ఆ తరువాత కొంతకాలానికి ఆయన మరొక అది అచ్చమైన జీవశాస్త్ర గ్రంథమని చెప్పలేంగాని అందులో అరవై స్తన్యజంతువుల శారీరక నిర్మాణం, వాటి అలవాట్లు, ప్రవర్తన వివరింపబడ్డాయి. భౌతిక శాస్త్రానికి, భూగోళ శాస్త్రానికి సంబంధించిన గ్రంథాల్ని కూడా ఆయన వ్రాయ సంకల్పించాడు. కాని పూర్తి చేయలేకపోయాడు.

తనంతకు తాను చేపట్టిన శాస్త్రగ్రంథ రచనాభారాన్ని ఆయనెంతో నిర్దుష్టంగా నిర్వహించాడు. పుట్టుకతో బ్రాహ్మణుడు, ఊపిరితిత్తులు, గుండె పనిచేసే విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోడానికి శాకాహారి అయిన వీరేశలింగం వెళ్ళి కసాయివాడు

చంపి, కోస్తున్న మేకను పరిశీలించాడు. మానవ శరీర నిర్మాణాన్ని తెలుసుకోవడానికి శవచ్ఛేదాన్ని చూడ్డానికివెళ్లి కళ్ళుతిరిగి పడిపోతే ఆ గది నుండి బయటకు తీసుకువచ్చారు. శరీర నిర్మాణాన్ని పరిశీలించే నిమిత్తం ఒక అస్తిపంజరాన్ని కొన్నాడు. ఆకాశంలోని నక్షత్ర మండలాలను చక్కగా చూడాలని మదరాసులోని ఖగోళ దర్శనకేంద్రాన్ని దర్శించాడు. ప్రాచీన భారతీయ విజ్ఞానశాస్త్రంతో పరిచయ మేర్పరచుకోడానికి అవసరమైన పారిభాషిక పదాలను గ్రహించడానికి ఆయన చరక, శుశ్రుత, భావమిశ్ర, శాలిహోత్ర, గర్గ, ఆర్యభట్ట, వరాహమిహిర ప్రభృతులు రచించిన ప్రాచీన సంస్కృత గ్రంథాలను చదివాడు.

మానవుని బుద్ధి వికాసానికి దోహదకారులైన నూతన విజ్ఞాన శాఖలను వీరేశలింగం ఆదరించాడు. పాశ్చాత్యదేశాలు సాధించిన నూతన విజ్ఞానాన్ని గ్రహిస్తేతప్ప భారతదేశానికి పురోభివృద్ధి కలగలేదని గ్రహించాడు. శాస్త్రాలలో మకుటప్రాయమైనదిగా వీరేశలింగం భావించిన ఖగోళశాస్త్రంలో ఆయనకు అధికమైన ఆసక్తి. ఖగోళశాస్త్రాన్ని జ్యోతిశ్శాస్త్రం నుంచి వేరుపరచాలన్న సంకల్పమే అందుకు కారణం ఆంధ్రదేశంలో నూతన శకానికి వైతాళికుడుగా ఈ ఏకైక వ్యక్తి చేసిన సేవను, పరిమితిలో కాకపోయినా ప్రభావంలో "డిడెరాట్", డి ఆలమ్బర్డీ, వాల్టెర్ అండ్ టర్ గట్ ఫ్రెంచి విజ్ఞాన సర్వస్వకర్తల కృషికి పోల్చవచ్చు.

తెలుగులో బాలసాహిత్యానికి శ్రీకారం చుట్టినవాడు కూడా వీరేశలింగమే. భూత వర్తమాన కాలాలకు భిన్నమైన ఉజ్జ్వల భవిష్యత్తును కోరి, పాటుపడిన వీరేశలింగానికి బాలల అభివృద్ధిలో శ్రద్ధాసక్తులు మెండు. ఈసఫ్ కథల్ని ఆధారంగా చేసుకొని పిల్లలకు "నీతి కథామంజరి"ని రచించి బొమ్మలతో రెండు భాగాలుగా ప్రకటించాడు. "నీతిదీపిక" అనే పేరుతో 101 నీతి పద్యాలున్న కావ్యాన్ని రచించాడు. బాలబాలికలకు కొన్ని పాఠ్యపుస్తకాలను కూడ రచించాడు.

ఆయన రచనల్లో మరికొన్ని ప్రధానమైన గ్రంథాల పేర్లయినా ప్రస్తావించాలి. వాటిలో సంగ్రహ వ్యాకరణము, అలంకార సంగ్రహము అనేవి లక్షణ గ్రంథాలు. మరి రెండు కూపర్ రచించిన జాన్ గిల్పిన్ గోల్డ్ స్మిత్ రచించిన ట్రావలర్ పద్యకావ్యాలకు అనువాదాలు. మరొకటి లాంబ్ రచించిన టేల్స్ ఫ్రమ్ షేక్ స్పియర్ గ్రంథానికి అనుకరణ విగ్రహతంత్ర అనువాదం తరువాత "సంధి'ని కూడ ఆంధ్రీకరించాడు.

వివిధ ప్రక్రియలో వీరేశలింగం రచించిన గ్రంథాల గుణగణాల్ని గూర్చి విమర్శలెలా ఉన్నా: ఆయన రచనలు రాశిలో, వైవిధ్యంలో, వ్యాప్తిలో అత్యంత ఆశ్చర్యజనకాలు, అపూర్వాలు అనదాన్ని ఎవ్వరూ కాదనలేదు. ఇంతకూ ఆయన తలపెట్టిన బహుముఖ కార్యక్రమాల్లో రచనావ్యాసంగ మన్నది ఒక భాగం మాత్రమే అన్న వాస్తవాన్ని మనం గుర్తుంచుకోవాలి...

## జీవిత చరమదశ: సన్మానాలు

వీరేశలింగం జీవితంలో అతిప్రముఖమైన ఘట్టం 1876-1897 మధ్యగల రెండు దశాబ్దాల కాలం తన జీవితాన్ని ప్రజాసేవకు వినియోగించాలన్న భావనతో ధవళేశ్వరంలో పాఠశాల ప్రధానోపాధ్యాయ పదవికి రాజీనామా ఇచ్చి, 1876వ సంవత్సరంలో వీరేశలింగం రాజమండ్రికి దావడం గుర్తుకు తెచ్చుకోవలసిన ఘట్టం. ఆ తరువాతి ఇరవై యేండ్లలో అపూర్వ గ్రంథ రచయితగా, సంఘ సంస్కర్తగా, అసమానమైన కృషిచేశాడు. అపహాస్యాలు అపవాదులు, ప్రతిఘటనలు, సంఘ బహిష్కరణలు, సాధింపులు సంభవించినప్పటికి క్రమంగా ఆయనకు పేరు ప్రతిష్టలు సిద్ధించాయి.

బెంగాలులో ఈశ్వరచంద్ర విద్యాసాగర్, శివనాథశాస్త్రి, హేమచంద్ర సర్కార్ మొదలైన ప్రముఖులు, బొంబాయిలో మహదేవ్ గోవిందరనడే, యన్.జి. చందవర్కార్, మహర్షి డి.కె. కార్వే మొదలైన మహనీయులు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన మతాధినేతలు. సంస్కర్తలు అందరూ వీరేశలింగం సంఘసేవా కార్యక్రమాన్ని ఆసక్తితో గుర్తించి హర్షించారు. వీరేశలింగంతో రనడే ఉత్తర ప్రత్యుత్తరాలు నిరాఘాటంగా జరిపేవాడు.
రాజమండ్రిలో మూడవ విధవాపునర్వివాహం జరిగినప్పుడు వీరేశలింగాన్ని గొప్పగా అభినందిస్తూ ఉత్తరం వ్రాశాడు. వీరేశలింగం కీర్తి విదేశాల్లో కూడ వ్యాపించింది. రాజా రామమోహన్ రాయ్ అభిమానులైన మిస్ కార్పెంటర్ అనే ఆవిడ రామమోహన రాయ్ శిరోజాన్ని వీరేశలింగానికి బహూకరించింది. మిస్ మ్యానింగ్ అనే ఆవిడ తన వీలునామాలో 50 పౌనులు వీరేశలింగానికి చెందేలాగ వ్రాసింది. ప్రభుత్వం కూడా ఆయన సేవను గుర్తించి 1893లో "రావ్ బహదూర్" బిరుదును ఇచ్చింది. ఆయన పుస్తకాలు బాగా అమ్ముడుపోయేవి. చాల పుస్తకాలు పాఠ్యగ్రంథాలుగా కూడ నిర్ణయింపబడ్డాయి. అందువల్ల ఆయనకు మంచి రాబడి వచ్చేది. ఆయన నవలలు, నాటకాలు, వ్యాసాలు, జీవిత చరిత్రలు, పాఠ్యగ్రంథాలు, ఉపన్యాసాలు ఇతర రచయితలకు ఆదర్శప్రాయమయ్యాయి. తిక్కన పద్యరచనవలె వీరేశలింగం గద్యరచన విలక్షణమైనదని -పండితలోకం గుర్తించి "గద్య తిక్కన" అనే బిరుదును ప్రసాదించింది.

ఇంతటి ఘనసన్మానాలను, సత్కారాలను పొందిన మరొక వ్యక్తి అయితే తాము సాధించిన పేరు ప్రతిష్టలతో సంతృప్తిని పొంది, విశ్రాంతిని కోరుకొని వుండేవాడు. అయితే వీరశలింగం అలాంటి వ్యక్తి కాదు. ఆయనకు సేవ అన్నది సర్వేశ్వరారాధన కళాశాలలో పాక ప్రవచన విధికి లోటు కల్గించకుండా, సంపాదకత్వాన్ని వహించి పత్రికా ప్రకటన నిర్వహిస్తూ తాను స్థాపించిన మూడు విద్యాసంస్థల వ్యవహారాలను కూడ చూచుకొనేవాడు. పైగా ఆయన అనేక గ్రంధాలను రచించాడు. 1878లో స్థాపించిన ప్రార్ధనా సమాజంలో వారంవారం ప్రసంగించేవాడు. సంఘ సంస్కరణ కార్యక్రమాలను నడిపించేవాడు. ప్రజాహితాన్ని కోరి న్యాయస్థానాలలో వ్యాజ్యమాడేవాడు. ఇలాంటి అనేక కార్యాల్ని నిర్వహిస్తున్నప్పటికీ తనకు సరిపోయినంత కార్యభారం లేనట్లు భావించేవాడు. ఆ కారణంగానే ఈ రెండు దశాబ్దాల కాలంలో పెక్కేండ్లు పురపాలక సంఘంలో తాలూకా బోర్డులో, జిల్లా బోర్డులో సభ్యుడుగ పనిచేశాడు. ఆ సంస్థల్లోని సభ్యత్వాన్ని అలంకారప్రాయంగా కాకుండా కార్యాసక్తితో స్వీకరించాడు. ప్రతి సమావేశానికి హాజరై వాటి కార్యక్రమాలలో పాల్గొనేవాడు. అధికారులు స్వదేశీయుడైనా. విదేశీయులైనా - తప్పులు చేస్తున్నారని తనకు తెలిసినపుడు బాహాటంగా వారిని ప్రతిఘటించే వాడు. కార్యభారాన్ని అధికం చేసుకోవడం, ఎంత క్లిష్టమైనా సాధించడం ఆయన జీవిత విధానం. జీతం నష్టంమీద రెండేండ్లు ఆయన 1897లో సెలవు పెట్టడం తన పనిని తగ్గించుకొనే ఉద్దేశంతో కానేకాదు. మదరాసుకు మకాం మార్చి ఇంకా తన కార్యక్రమాల పరిధిని పెంపొందించుకొనడానికే ఆయన అప్పుడు సెలవు పెట్టాడు తన రచనల నన్నింటిని సంపుటాలుగా ప్రచురించాలన్నది ప్రధానోద్దేశమైనా ఆయన మనస్సులో ఇతర కార్యక్రమాలెన్నో ఉండినవి. అవి తాత్కాలికమైనవి కావు, ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేయని మాట వాస్తవమే. అప్పటికాయన ప్రధాన తెలుగు

పండితుడు. ఆయనకు రాజమండ్రికి తిరిగివెళ్ళే ఉద్దేశమే ఉన్నట్లయితే అంతకుముందు మూడేండ్లనాడు మదరాసులో ఒక ఇంటిని కొని, అదనంగా ఖర్చుచేసి దానిని వాసయోగ్యంగా మరమ్మత్తులు చేయించి వుండేవాడుకాదు.. రాజమండ్రిలో వున్న ఇంటిని ఖాళీచేసి వచ్చి వుండేవాడు కాదు.

మదరాసులో పురసవాక్యంలోని స్వగృహంలో స్థిరపడిన వెంటనే ఆ యింటిలోనే ఒక భాగంలో చింతామణి ముద్రాక్షరశాలను స్థాపించి తన గ్రంథ సంపుటాలను ముద్రించడానికి పూనుకొన్నాడు. ఆ సంపుటా లన్నిటికి సంకలనకర్త, సంపాదకుడు, ప్రూఫులు దిద్దేవాడు అంతా ఆయనే. తా నొక్కడే అన్ని పనులను నిర్వహించి, నిరంతర పరిశ్రమచేసి రెండేండ్లలో 10 పెద్ద సంపుటాల్ని ప్రచురించాడు. రెండు భాగాల ఆంధ్రకవుల చరిత్రను, స్వీయచరిత్రను కూడా చేర్చుకుంటే ఆయన రచనలు అన్నీ దాదాపు 10 వేల పుటలుగల 12 సంపుటాలు.

మద్రాసులో స్వగృహంలో ఒక భాగంలో ముద్రణశాలను పెట్టినపుడే మరొక భాగంలో వితంతు శరణాలయాన్ని కూడ స్థాపించాడు, ఏడేండ్లలో పదిమంది వితంతువులకు పునర్వివాహం జరిపించాడు.

ఆ వితంతువులందరు ఆంధ్రదేశం నుండి వచ్చినవాళ్ళు. వాళ్ళు వీరేశలింగం సహాయాన్ని అర్థించిన క్షణం నుండి వారి పెండ్లి కుదిరేవరకు వారి సంరక్షణకు, పోషణకు, పెండ్లికి అయ్యే ఖర్చుల నన్నింటిని ఆయనే భరించేవాడు. మద్రాసు పుర ప్రముఖుల నుండి ఆయనకు లభించిన ఆర్థిక సహాయంకాని, మాట సాయంకాని చెప్పుకో దగ్గంత లేదు. పైగా వారి ఉదాసీనత తనలో నిరుత్సాహాన్ని కలిగించడానికి బదులు పట్టుదలను కార్యాసక్తిని ప్రేరేపించింది. దక్షిణభారత బ్రహ్మసమాజానికి, దక్షిణ భారత సంఘ సంస్కరణ సమాజానికి ఆయన నాయకత్వం వహించాడు. 1898వ సంవత్సరం మదరాసులో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సమావేశంలో అఖిల భారత సంఘసంస్కరణ సభకు రనడే ప్రతిపాదనతో వీరేశలింగం అధ్యక్షపదవిని అలంకరించాడు. ఆ తరువాత నాలుగేండ్లకు కాకినాడలో సమావేశమైన మదరాసు సంఘ సంస్కరణ సభకు కూడా ఆయనే అధ్యక్షుడు. ఆ మరుసంవత్సరం మదరాసులో జరిగిన అఖిలభారత ఆస్తిక సమావేశానికి కూడ ఆయననే అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ విధంగా వీరేశలింగం అనేక సంఘ సంస్కరణ సభలకు, ఆస్తిక సమావేశాలకు అధ్యక్షుడుగా వ్యవహరించాడు. తాను మదరాసులో ఉన్నపుడు శిథిలావస్థలో నున్న ఒక ఇల్లు స్థానిక బ్రహ్మసమాజ కేంద్రంగా ఉండేది. ఇంటికి కూడ సమాజంచారు సరిగా చెల్లించేవారు కారు. అపుడు వీరేశలింగం. తన డబ్బుతో ఒక మంచి భవనాన్ని నిర్మించి, బ్రహ్మసమాజానికి దానం చేశాడు. వీరేశలింగం మహా నిర్మాత అనటాన్ని ఆలంకారికంగానే కాకుండ వాచ్యార్థంలోను గ్రహించవచ్చు. ఆయన బాధ్యత వహించి నిర్మించిన భవనాలలో మదరాసు బ్రహ్మసమాజ భవనమొకటి. మదరాసుకు రావడానికి పూర్వం రాజమండ్రిలో చాలవరకు తన ధనాన్నే వెచ్చించి పురమందిరాన్నొక్కటిని నిర్మించాడు. బెంగుళూరులో కూడ అంతా తన డబ్బుతోటే ఒక ప్రార్థనా మందిరాన్ని కట్టాడు. ఇంతకుముందే చెప్పినట్లు పిఠాపురం మహారాజావారి ధనసహాయంతో రాజమండ్రిలో ఆస్తికోన్నత పాఠశాల కోసం ఒక పెద్దభవనాన్ని నిర్మించాడు. రాజమండ్రిలోనే ఒక వితంతు శరణాలయాన్ని, పతిత స్త్రీ రక్షణాలయాన్ని కూడ నిర్మించాడు. పురమందిరానికి ఒక భాగంగా ప్రార్థనామందిరా న్నొకటి, స్త్రీల ప్రార్థనా సమావేశానికి ప్రత్యేకించి ఒక మందిరాన్ని కూడ కట్టించాడు. భవననిర్మాణ మహనీయుడైన వీరేశలింగం ఉద్యానవన పోషకుడు కూడ ఆయన చరమదశలో వేసవికాలాన్ని బెంగుళూరులో గడపడానికి ఒక ఇంటిని కొని దాని ఆవరణలో అందమైన తోటను పెంచారు.

అదే సమయంలో రాజమండ్రిలో కూడ రాజ్యలక్ష్మీ వనమని ఒక పెద్ద తోటను అభివృద్ధి చేశాడు. సెలవుపెట్టి మదరాసులో ఉన్నపుడు ప్రెసిడెన్సీ కళాశాలలో ప్రధానాంధ్ర పండిత పదవిని అంగీకరిస్తారా అని అధికారులు అడిగారు. ఇది తాను

అనుకోలేదు. సెలవుకాలం ముగిసిన తరువాత తన నిర్ణయాన్ని తెలుపుతానన్నాడు. కాని అప్పటి ప్రభుత్వ విద్యాధికారి అయిన డంకన్ దొరగారు ఆయనను వెంటనే పనిలో చేరమని నిర్బంధించి కొక్కొండ వేంకటరత్నం పంతుల్ని ప్రెసిడెన్సీ కళాశాల నుండి రాజమండ్రి కళాశాలకు బదిలీ చేశాడు. ప్రెసిడెన్సీ కళాశాలలో తన నియామకానికి, తత్ఫలితంగా కొక్కొండవారి బదిలీకి వీరేశలింగం కారణం కాకపోయినా, జీవిత రంగంలో తన ప్రత్యర్ధయిన కొక్కొండవారు వీరేశలింగాన్ని.. అపార్థం చేసుకొన్నారు. రాజమండ్రిలోని సెంట్రలు జైలు ప్రక్కనే గోదావరి మహానవి. ప్రవహించేత 'గోదావరి స్నానం' అంటే జన వ్యవహారంలో జైలుశిక్ష అని అర్థం. రాజమండ్రి చేరినవెంటనే కొక్కొండ వేంకటరత్నం వీరేశలింగానికి 'నీ దయవల్ల నాకు గోదావరి స్నానం ప్రాప్తించింది" అని ఉత్తరం వ్రాశాడు.

ఆనాటి రాష్ట్ర విద్యాశాఖ వీరేశలింగాన్ని అనేక విధాల గౌరవించింది. పాఠ్యపుస్తక నిర్ణయ సంఘంలో సభ్యుడుగ, ద్రావిడ భాషా సంఘ సభ్యుడుగ, ప్రభుత్వోద్యోగులకు తెలుగు భాషా పరీక్షకుడుగ వీరేశలింగం నియమింపబడ్డాడు. మదరాసు విశ్వవిద్యాలయం కూడ ఆయనను సన్మానించింది. విశ్వవిద్యాలయ సభ్యుడుగా గౌరవించడమే కాకుండా, అనేక సంవత్సరాలు ఆయనను విశ్వవిద్యాలయంలో ప్రధాన తెలుగు పరీక్షకునిగా నియమించింది.

రాజమండ్రిలో లాగ తన సంఘ సంస్కరణ కార్యక్రమాలు అంత చురుకుగ జరగడం లేదన్న భావం తప్ప మదరాసు జీవితం వీరేశలింగానికి సంతృప్తికరంగానే ఉండింది. ఆయనకు రెండు చేతుల నిండా పనులున్నా, అందరూ ఆయనను గౌరవ భావంతోనే చూసినా మదరాసులో తాను ఒంటరి వాడన్నట్టు బాధపడ్డాడు. చిన్ననాటి సన్నివేశాలు, జీవితంలో తన కాళ్ళపై నిలువడానికి పడిన పాట్లు వ్యక్తిగ తాను సాధించిన ఘనకార్యాలు ఇలాంటి మరువలేని పూర్వస్మృతులెన్నో ఆయనలో రేగి స్వస్థలమైన రాజమండ్రికి వెళ్ళాలన్న కాంక్షను కలిగించాయి. కాబట్టి నిర్ణీత కాలానికన్న ఒక సంవత్సరం ముందే ఉద్యోగం నుండి విరమించడానికి ప్రభుత్వాన్ని అనుమతి కోరాడు. పై అధికారులకు అది ఇష్టం లేనందువల్ల అనుమతించడంలో కొంత ఆలస్యమైనా చివరకు వీరేశలింగం ఉద్యోగం నుంచి విరమించాడు. మదరాసులోని తన ఇంటిని ఇతరమైన ఆస్తినంతటిని అమ్మి తొమ్మిదినెలల తర్వాత నెలకు ఇరవై నాలుగు రూపాయల పింఛనుతో రాజమండ్రికి తిరిగివచ్చాడు.

1905వ సంత్సరారంభంలో రాజమండ్రి చేరుకున్న వీరేశలింగం తాను ముందు విడిచిపెట్టిన పనుల్ని మరల చేపట్టి పూర్తిచేయడానికి పూనుకొన్నాడు. కాని అదంత సులభంగా తోచలేదు. అప్పటికే ఆయన పాత స్నేహితుల్లో, సంఘ సంస్కరణ కార్యకలాపాలలో సహకరించిన యోధుల్లో కొందరు మరణించారు. కొందరు రాజమండ్రినుండి వెళ్ళిపోయారు. తాను రాజమండ్రిలో లేని ఆ ఏడేండ్ల కాలంలో కొందరు కొత్త వ్యక్తులు వచ్చిచేరినారు. విద్యార్థి బృందంతో సన్నిహిత సంబంధాలకు అవకాశం సన్నగిల్లింది. పైగా ఆయన అప్పటికి యాభయ్యోపడిలో పడ్డాడన్న విషయాన్ని కూడ మనం విస్మరించకూడదు. అయినప్పటికీ వీరేశలింగం రాజమండ్రి చేరిన వెంటనే తన కార్యకలాపాలను యథాప్రకారం నిర్వహించడానికి పునఃప్రారంభం చేశాడు.

ఆయనకున్న కార్యదీక్ష ఎట్టిదంటే రాజమండ్రికి వచ్చిన కొన్ని నెలలకే ఒక నూతన బాలికా పాఠశాలను, ఒక కొత్త వార పత్రికను, మరొక వితంతు శరణాలయాన్ని, ఒక పతిత స్త్రీ రక్షణాలయాన్ని, ఒక అనాథ శరణాలయాన్ని స్థాపించాడు. తాను ప్రారంభించిన యీ కార్యాలు రోజుల్లో తన మరణానంతరం నిర్విఘ్నంగా కొనసాగి నిమిత్తం 1905వ సంవత్సరం డిసెంబరు 12వ తేదీన 36 గురు సభ్యులతో 'హితకారిణి సమాజాన్ని స్థాపించాడు.

తన చరాస్తిని, స్థిరాస్థిని, తన రచనల ముద్రణ హక్కును తన గ్రంథాలయాన్ని, తన జీవిత బీమా పత్రాల్ని ఆ హితకారిణి. సమాజానికి నిధిగా అర్పించాడు. ఇలా విరాళంగా ఇచ్చిన ఆస్తి విలువ మొత్తం ఆ 1,500.- రూపాయలు. ఇందులో ప్రతిపైసాకూడ ఆయన చేసుటోడ్చి సంపాదించిందే ..తనకని జీవితంలో ఎన్నడూ ఆయన ధనసహాయాన్ని అర్థించలేదు. ఎటువంటి కానుకల్నీ స్వీకరింపలేదు. విజయనగరం మహారాజాగారు, పిఠాపురం రాజాగారు ఇస్తామన్న పెద్ద మొత్తాలను ఆయన తిరస్కరించాడు.

ఒక్కమారు మాత్రమే ఆయన విజయనగరం మహారాజాగారి అతిథిగా విశాఖపట్టణంలో ఉన్నారు. అప్పుడు మరునాటి దర్బారులో రాజాగారు ద్రవ్యరూపంగా తన్ను సత్కరించబోతున్నారని తెలుసుకొని తిరస్కరిస్తే రాజాగారు నొచ్చుకుంటారని, భావించి. వారికి తెలియకుండ ముందురోజే వీరేశలింగం రైలెక్కి రాజమండ్రి చేరుకున్నాడు.

చివ్రాంతిలేని కార్యభారంవల్ల వేసవి మండుటెండలవల్ల 1907వ సంవత్సరంలో వీరేశలింగం. నీరసించి జబ్బుపడ్డాడు. కొన్ని వారాలు ఆయన మంచం దిగలేదు. ఆ సమయంలో దేశపర్యటన చేస్తున్న శివనాధ శాస్త్రి రాజమండ్రిలో దిగి వీరేశలింగం అతిధ్యాన్ని స్వీకరించాడు. అపుడు కలకత్తాను సందర్శించాలన్న తన కోరికను శివనాథశాస్త్రికి తెలిపాడు. మరికొంతకాలం ఆ ప్రయాణాన్ని తలపెట్టవద్దని శాస్త్రి సలహా ఇచ్చారు.

ఏదైనా ఆలోచన కలిగినవెంటనే ఆచరణలో పెట్టడం వీరేశలింగం పద్ధతి కాబట్టి శాస్త్రిగారితోపాటు వీరేశలింగం సతీసమేతంగా ఏప్రిల్ నెలలో కలకత్తాకు ప్రయాణమయ్యాడు. భువనేశ్వరంలోదిగి, ఆ పరిసరప్రాంతాలలో చూడవలసిన స్థలాల నన్నిటిని చూచాడు. కలకత్తాలో ఆయన శాస్త్రిగారి ఇంట అతిథి. ఆ మహా పట్టణంలో వీరేశలింగానికి గొప్ప గౌరవ మర్యాదలు లభించాయి. శివనాథశాస్త్రిగారి నాయకత్వంలోని 'సాధారణ బ్రహ్మసమాజమే కాకుండ అది బ్రహ్మ సమాజంవారు, నబబిధాన్ సమాజంవారు. కూడ వీరేశలింగానికి స్వాగత సన్మానపత్రాలను సమర్పించారు. మిత్రులతో, అభిమానుల మధ్య ఒకవారం రోజులు గడపి, వీరేశలింగం తిరుగు ప్రయాణంచేస్తూ కటక్ పట్టణంలో దిగాడు. అక్కడ కూడ బహిరంగ సభల్లో ఆయనకు సన్మానాలు జరిగాయి. రాజమండ్రి చేరినవెంటనే ఆయన మరల తన భార్యతో బెంగుళూరు వెళ్ళి ఆ వేసవిని అక్కడ గడిపాడు. ఆయన బెంగళూరు వెళ్ళడం అదే మొదటిసారి. ఆ తరువాత కొన్నేండ్లు ప్రతి వేసవికాలాన్ని ఆయన బెంగళూరులోనే గడిపేవాడు. ఆయన కర్ణాటక ప్రాంతానికి మొదటిసారిగా వెళ్ళినప్పుడు మైసూరు, కోలారు, శివసముద్రం, మరికొన్ని ప్రదేశాలను సందర్శించాడు. వెళ్ళిన చోటెల్లా ఆయనకు ఘనసన్మానాలు జరిగాయి.

1909వ సంవత్సరంలో హితకారిణి సమాజానికి నిధి సేకరణ నిమిత్తం వీరేశలింగం దేశయాత్ర చేశాడు. ఈమారు సికిందరాబాదు, బొంబాయి, పునా, బళ్ళారి పట్టణాల్ని సతీసమేతంగా.. సందర్శించాడు. వెళ్ళిన చోటెల్లా వారికి ఘన స్వాగతం లభించింది. బొంబాయిలో వీరేశలింగం దంపతులు. నటరాజన్ గారి అతిధ్యాన్ని స్వీకరించారు. ఆయన 'ఇండియన్ సోషల్ రిఫార్మర్ అన్న సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు. బొంబాయిలో న్యాయాధిపతి చందవర్కార్ అధ్యక్షతను వీరేశలింగం దంపతులకు సన్మాన సభ ఏర్పాటయింది. అప్పట్లో కాశీనాథుని నాగేశ్వరరావుగారు కొంటాయిలో వుండేవారు. ఆయన నటరాజన్ గారితో కలసి హితకారిణి సమాజానికి 900 రూపాయల విరాళాన్ని పోగుచేసి యిచ్చారు. పూనాలో మహర్షి కార్వేగారి అతిథులుగా వున్నారు. మహర్షి నడుపుతున్న వితంతు శరణాలయం సందర్శించి అది నిర్వహింపబడే తీరును ఒక రోజంతా పరిశీలించి తెలుసుకున్నారు. రాజమండ్రినుండి బొంబాయికి ప్రయాణం చేస్తూ వీరేశలింగం దంపతులు ముందు సికిందరాబాదులో దిగినపుడు వీరేశలింగం దంపతుల్ని డాక్టర్ గోవిందరాజులు

నాయుడు, అతని సతీమణియైన శ్రీమతి సరోజినినాయుడు గౌరవపురస్సరంగ ఆదరించారు. ఆ సమయంలో శ్రీమతి సరోజిని నాయుడు అస్వస్థంగా ఉన్నారు.

తన బిడ్డలను దగ్గరకు పిలిచి వీరేశలింగాన్ని చూపి "ఈయన మీ తాతయ్య" అని పరిచయం చేసింది. ఆమె చేసుకొన్న వర్ణాంతర వివాహానికి వీరేశలింగం పౌరోహిత్యాన్ని. నిర్వహించినందువల్ల వీరేశలింగం అంటే ఆమెకు ప్రత్యేకాభిమానం. ఆ మరుసంవత్సరం వీరేశలింగం జీవితంలో అంధకారం అలముకొన్నది. ఆగస్టు 12వ తేదీ ఆయన భార్య నిద్రలోనే పరమపదించింది. ఆ రాత్రి ఆమె ఎప్పటిలాగే వెళ్ళి పడుకొన్నది. ఆమె ఆరోగ్యంగానే ఉంది. అయినా ఆమెకు మరణం అకస్మికంగా వచ్చింది. ఆమె ఆరోగ్యాన్ని గురించి వీరేశలింగానికి ఎటువంటి సంశయంలేదు. ఆయన నిద్ర లేచేవేళకు ముందుగనే లేవడం ఆమెకు అలవాటు. ఆ రోజు ఎందుకింకా లేవకుండ నిద్రపోతున్నదని కలవరపడ్డాడు. డాక్టరు వచ్చి పరీక్షించి ఆమె మరణించిందని చెప్పినపుడు వీరేశలింగం తన చెవులను తానే నమ్మలేకపోయాడు. ఆ రోజు తన డైరీలో ఇలా వ్రాశాడు: "ఒక వ్యక్తికి సంభవింపగల గొప్ప దురదృష్టం ఈ ఉదయం ఒంటి గంటకు నాకు సంభవించింది. నా ప్రియసతి రాజ్యలక్ష్మి గుండెపోటుతో వూపిరి విడిచింది. భగవంతుడామె ఆత్మకు శాంతినిచ్చుగాక."

భార్య మరణం తరువాత వీరేశలింగం మరల మామూలు మనిషి కాలేదు. ఆయనలో ఉత్సాహం: సన్నగిల్లింది. ప్రతిఘటించే శక్తి తగ్గిపోయింది. జీవితం మీద ఆసక్తి అడుగంటింది. రాజ్యలక్ష్మమ్మ మరణానంతరం ఆయన తొమ్మిదేండ్లు జీవించాడు. ఆ తొమ్మిదేండ్లను ఆయన ఆవేదనతో, దుఃఖంతో, నిస్పృహతో గడిపాడు. ఆమె తనకు అండగా ఉన్నపుడు ఎంతటి అపనిందనైనా, కష్టాన్నైనా, అపఖ్యాతినయినా ధైర్యంగా ఎదుర్కొనేవాడు. ఆమె లేకపోయేసరికి నిస్సహాయుడుగా, ఒంటరిగా, వెలివేయబడినట్లు భావించాడు. వృద్ధాప్యంలో కూడా ఆయన శత్రువుల సంఖ్య తగ్గలేదు. పైపెచ్చు అధికమైంది. వాళ్ళు ప్రతీకారాన్ని వాంఛించే నీచులు. ధర్మభీతి, న్యాయబుద్ధిలేనివారు, నీచమైనవారి ప్రవర్తన ప్రలాపాలు ఆయన చరమదశను చీకటిగా వేశాయి. శరీరంలో పూర్వపు పటుత్వం లేకున్నా కడవరకు వీరేశలింగం వారితో పోరాడుతూనే వచ్చాడు. బసవరాజు గపదరాజు తరువాత మిక్కిలి అప్పుడు సన్నిహితులైన దేశిరాజు విదరామయ్య 1909వ సంవత్సరంలో మరణించాడు. అతని మరణంతో వీరేశలింగం మరీ ఒంటరి వాడయ్యారు.

ప్రజా సేవకుడైన వీరేశలింగానికి మరణం ఆయన జీవితానికి తగ్గట్లే సంభవించింది. ఆఖరిక్షణంలో కూడా వ్రాస్తూ చేతిలో కలలతోనే పరమపదించాడు. 1919 వేసవిలో వీరేశలింగం. మద్రాసు వెళ్లాడు. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి అనే ఇంటింటి గ్రంథాలయ స్థాపకుడైన కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారి ఇంట్లో అతిథిగా వున్నాడు. లక్ష్మణరావుగారే వీరేశలింగాన్ని స్వీయచరిత్ర వ్రాయమని ప్రేరేపించింది. ఆయన ఆ స్వీయచరిత్రలో మూడవ భాగాన్ని బ్రూస్ ముగించమని వీరేశలింగాన్ని బలవంత పెట్టారు. మదరాసులో లక్ష్మణరావుగారి గృహమైన "వేదవిలావ్"లో ఉంటూ, వీరేశలింగం తాను పూర్వం విడిచిపెట్టిన ఘట్టం దగ్గరనుండి స్వీయచరిత్రను వ్రాయడానికి ప్రారంభించాడు. ఆయన చేతులు వణకుతుండేవి. చూపు మందగించింది. అయినప్పటికి కొద్దిరోజుల్లోనే ఆయన నలభైపుటలు వ్రాశాడు. మే 27వ తేదీ ఆయన 45వ పుట వ్రాస్తుండగా ఒక వ్యాసం మధ్యలో ఆయన చేతినుండి కలం జారిపడింది. ఆజన్మరచయిత అయిన వీరేశలింగానికి ఆఖరిక్షణంలో ఇలా జరగడం విచిత్రం. తనలోకయాత్ర ముగిసినట్లయన వెంటనే గ్రహించారు. ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించింది. ఆ సమయంలో లక్ష్మణరావుగారు ఇంట్లోలేదు. ఆయన మిత్రుడు డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ఆ ఇంట్లోనే క్రింది భాగంలో వున్నాడు. వీరేశలింగం ఆ యువకునికి కబురు చేశాడు. పూర్తిచేసిన స్వీయచరిత్ర పుటలను ఆయనకు అందించి ఆ డాక్టర్తో తన అంతిమ సందేశాన్ని యీ విధంగా చెప్పాడు.

"నా జీవితకాలంలో నేను తలపెట్టిన అనేక కార్యాలను పూర్తిచేయకుండానే వెళ్ళిపోతున్నాను. నేను అసంపూర్తిగ విడిచిన యీ పనిని, నా మిత్రులు సహచరులు, సంస్కార ప్రియులు కొనసాగిస్తారని ఆశిస్తున్నాను. మన ప్రజల్లో అధిక భాగం అజ్ఞానం మూఢ నమ్మకాల భారంతో క్రుంగిపోయి, జీవితంలోని మంచి వాటిని అనుభవించలేకున్నారు.

వారికి విద్యను, వికాసాన్ని, సంస్కృతిని, స్వాతంత్ర్యాన్ని, సమతను, న్యాయాన్ని సమకూర్చటం మీ విద్యుక్త ధర్మం. నోరూ వాయిలేని ప్రజా సమూహానికి మీ శక్తి కొద్దీ తోడ్పడమని మిమ్మను అర్థిస్తున్నాను. వేడుకొంటున్నాను."

కొన ఊపిరితో తన అంతిమ సందేశాన్ని చెప్పడం ముగించి ఊపిరి విడిచాడు. ఆ రోజుతో ఒక సుపోయోధుని జీవితం పరిసమాప్తమయింది. భారత మాత తన పుత్రుల్లో ఒక మహోదాత్తుని, ధైర్యశాలిని కోల్పోయింది.

## సాధించిన ఘనకార్యాలు

ప్రకృతి వీరేశలింగాన్ని అధికంగా కనికరించలేదు. కాయవృష్టిని, ఆరోగ్య సౌభాగ్యాన్ని, శాంత స్వభావాన్ని ఆయన కనుగ్రహింపలేదు. దైహికమైన అట్టి లోటుపాట్లను ఆయన అసాధారణమైన చిత్త స్థైర్యంతో అధిగమించి వాటిని అనుకూల శక్తులుగ మార్చుకోగలిగాడు. అదే ఆయన గొప్పతనం. తన కోపప్రవృత్తిని మూఢ విశ్వాసాలపట్ల, భయాలపట్ల, ప్రదర్శించాడు. ఉద్రసంతో నిద్రపట్టని రాత్రులను రచనా వ్యాసంగానికి ఉపయోగించుకున్నాడు.

ప్రతి విషయంలో తన ఇష్టమే జరగాలనే పట్టుదలను మహత్తర కార్యసాధనకు వినియోగించాడు. తనకు అన్యాయంగా, అక్రమంగా, అమానుషంగా తోచిన కార్యాలను నిర్మూలించడానికి తన ఉగ్రకోపాగ్ని జ్వాలల్లోనే తన ఆయుధాలకు పదును పెట్టాడు. మొత్తం మీద కార్య దీక్షాపరుడైన వీరేశలింగం తన మార్గంలోని ఆటంకాలను అవలీలగా తోసివేయగల భీమ పరాక్రముడై నిలిచాడు.

చూపరుల దృష్టిని ఆకర్షించే వేషధారణకాని, దృఢదేహంకాని ఆయనకు లేదు. రోగశీలమైన దుర్బల శరీరుడు. సామాన్యంగా పంచ, పొడుగు కోటు, తలపాగ ధరించేవాడు. చలికాలంలో మెడకు మఫ్లర్ను చుట్టుకొనేవాడు. మామూలు నూలుపంచె, నలిగి రంగు వెలసినకోటు, ఎగుడు దిగుడుగ చుట్టుకొన్న తలపాగ గల ఈ వ్యక్తిలో లోకులబాధల్ని తనవిగా చేసుకొన్న గంభీరమూర్తిని దర్శించవచ్చు.

ఆయన జీవితావసరాలు కొద్దిపాటివి. పొదుపుగా జీవించాడు. సొంతఖర్చుల విషయంలో ఇంచుమించు ఆయన్ను పిసినారి అనాలి. తోటల పెంపకంలోనే ఆయన కొంత దుబారా ఖర్చు చేశాడనవచ్చు. బెంగుళూరులో పెంచిన తోటలో అంతకన్న ముఖ్యంగా, తన భార్య పేర రాజమండ్రిలో స్థాపించిన తోటలో, ఆయన భారతదేశం నలుమూలల నుండి వ్యయప్రయాసలను లెక్కించకుండ చెట్ల మొక్కల్ని తెప్పించాడు. వాటిని తండ్రిలాగ పెంచి పోషించాడు. చివరి రోజుల్లో ప్రతిరోజూ గంటలకొద్దీ తోటలో లేత చిగుళ్ళను, పచ్చని ఆకుల్ని, అందమైన పూలని చూస్తూ గడిపేవాడు. నిత్య నూతనంగా నిత్య పరిమళంగా నవనవలాడే ఉద్యానవనాన్ని తాను కోరుకున్న ఆదర్శ సమాజానికి ప్రతీకగా ఆయన భావించి వుండవచ్చు.

వీరేశలింగం మహా కార్యకర్త. ప్రజల సొమ్ము విషయంలో అతి జాగ్రత్త వహించే వ్యక్తి - తనకిచ్చిన ప్రతి పైసాకు లెక్కలు చూపేవాడు. కొద్దిడబ్బుతో ఎక్కువ పనిని సాధించిపెట్టగల ఘటికుడు. క్రమశిక్షణలో ఆయనకు ఆయనే సాటి.

సోమరితనాన్ని, బద్ధకాన్ని సహించేవాడు. కాదు. ఏరోజు పని ఆరోజే పూర్తి చేయాలి, మరుసటిరోజుకు వాయిదా వేయడానికి సమ్మతించేవాడుకాదు. నైతిక అర్జవంలో, కార్యదక్షతలో ఆయన ప్రమాణాలు ఉన్నతమైనవి. కాబట్టి అట్టి ప్రమాణాలనే ఆయన సహకార్య కర్తలనుండికూడా ఎదురుచూచేవాడు. పూనాలో శ్రీమతి రమాబాయి రెనడె నడుపుతున్న వితంతు శరణాలయాన్ని కొండా వెంకటప్పయ్య దర్శించి, ఆ సంస్థను గొప్పగా మెచ్చుకొన్న సందర్భంలో ఆమె వీరేశలింగం కార్యనిర్వాహకత్వాన్ని గొప్పగ ప్రశంసించి "వీరేశలింగం పుట్టిన ఆంధ్రదేశం నుండి వచ్చిన మీరు మా సంస్థను ఇంతగ పొగడడం వింతగ వున్నది" అని కొండా వెంకటప్పయ్యను ఇంచుమించు మందలించింది.

"ఆదర్శం కాదు ఆచరణ" అన్నది వీరేశలింగం జీవితలక్ష్యం. ఆయనకు ఆదర్శాలు లేవనికాదు. ఆయనకుండిన ఒక ఆదర్శాన్ని ఉత్సాహంతో, పట్టుదలతో అనుసరించాడు. ఆచరణమీదే ఆయనదృష్టి ఆస్తికుడిగ తన ఇష్టదైవాన్ని ప్రార్థించేవాడు అయినా ఎవరూ కట్టించనన్ని ప్రార్థనామందిరాలను ఆయన తన జీవితకాలంలో నిర్మించాడు. ఆయనకు సుదీర్ఘ ప్రార్థనలంటే అసహనం ఒకమారు రాజమండ్రిలో ప్రార్థనా సమాజంలో ప్రార్థనాసమావేశం దీర్ఘకాలం కొనసాగుతుంటే చూచిచూచి చివరకాయన మంగళం పాడి ఆ సమావేశాన్ని అర్థాంతరంగ ముగించాడట ప్రతిఫలాపేక్షరహితంగ, త్రికరణశుద్ధితో చేసిన కార్యమే నిజమైన ప్రార్థన అని 'ఆయన నమ్మకం.

జీవితంపట్ల, సమాజ సమస్యలపట్ల ఆయనకు గల ఇట్టి అభిప్రాయాలే ఆయన సాహిత్య రచనలకు స్వరూపాన్ని, పరిధిని నిర్ణయించాయి. కేవలం తన భావవ్యక్తీకరణకని, తన కళాతృష్ణను తృప్తిపరచుకోవడానికని ఆయన రచనలు చేయలేదు. గొప్ప కార్యసాధకుడు కావాలనుకున్నాడు. కాబట్టే అందుకు అనుకూలమైన రచనలను ఆయన రచించాడు.

వాస్తవానికి రచనకూడ ఆయనకు ఒక విధమైన పనే. ఇంతకుముందే వివరించినట్లు ఆయన రచనకు పూనుకొన్నతొలి రోజుల్లోనే జీవితంపట్ల విస్ప నిష్కృష్టమైన అభిప్రాయాలను ఏర్పరచుకొన్నాడు. ఆ కారణంగానే ఆయన తన బాల్యదశలోని విశ్వాసాలకు, జీవిత విధానానికి స్వస్తి చెప్పవలసి వచ్చింది. సి. ఆర్. రెడ్డి అన్నట్లు..

"*ప్రారంభదశలో ఆయన తెనుగు రచనలను పండితుల ప్రౌఢశైలిలో రచించినా తరువాత సరళసుందరం, సలక్షణమైన వచన రచనలో సాగించాడు. శ్లేష, చిత్రకవితలతో, కృత్రిమాలంకార గారడీలతో నిండిన ప్రబంధరచనలను ఆరంభించి, తుదకు తెలుగులో నవలలు, ప్రహసనాలు, సాంఘిక నాటకాలు, విజ్ఞానశాస్త్రం, జీవితచరిత్రలు, స్వీయ చరిత్ర వంటి వివిధ సాహిత్య ప్రక్రియలకు స్రష్ట అయ్యాడు."*

వాస్తవానికి వీరేశలింగం రచనల్లో అధికభాగానికి ఈనాడు కాలదోషం పట్టింది. వాటికి ఆ కాలంలో వుండినట్టి ఆకర్షణ, నవీనత, ప్రభావం ఇప్పుడు లేవు. ఆవేశంతో త్వరత్వరగా రచించినందువల్ల వాటిలో కొన్ని లోపాలు లేకపోలేదు. తన వ్రాతల్ని ఆయన ఎప్పుడూ పునః. పరిశీలించేవాడుకాదు. మొదట చిత్తుప్రతిని, తరువాత సాపుప్రతిని వ్రాసే అలవాటు ఆయనకులేదు. ప్రతి పుటను వ్రాసి ముగించిన వెంటనే ఎటువంటి సవరణలు చేయకుండ ముద్రణకు ఇచ్చేవాడు. ఆయన ఇంటిలోనే క్రిందిభాగంలో ముద్రణాలయముండేది. తాను వ్రాసిన కాగితాలను వ్రాసినట్లు ఆ రంధ్రం ద్వారా క్రింద పనిచేస్తున్న ముద్రాపకుని ముందు పదేంగ పడవేసేవాడు. ఆయన రచనలు నిర్విరామంగా, పునఃపరిశీలించకుండా, సవరించాలన్న కలంపే లేకుండా వేగంగా రచింపబడినట్టివి. కాబట్టి వాటి గుణంలో వారిలో హెచ్చుతగ్గు లుండటం సహజం. ఈ విషయాన్ని వీరేశలింగం గుర్తించకపోలేదు. రచయితగా తన సాహిత్యసేవను గూర్చి స్వీయచరిత్రలో పేర్కొంటూ, ఒకవేళ రచనలకే అధిక సమయాన్ని తాను వెచ్చించివుంటే ఇంతకన్న ఉత్తమ గ్రంథాలను వ్రాసివుండవచ్చునన్నారు. ఆయన వ్రాసిన వాక్యాలివి...

*''నే నారంభించిన కాలమునందు తెలుఁగులో నిప్పటివలె వివిధములైన పుస్తకములు. లేవు వివిధము లేమి? ఇంచుమించుగా నేవిధమైనవియు వచన రూపమున లేవనియే చెప్పవచ్చును, అప్పుడన్నియు నూతన సృష్టి చేయవలెను. అందుచేత నప్పటి వారికి కష్టములెక్కువ; సౌలభ్యములు తక్కువ అయినను ప్రథమ ప్రయత్నము చెప్పుదును ప్రథమ ప్రయత్నములే అవి దోష బహుళములయందుల స్వాభావికము మనము. వృద్ధి పొందగలుగుట చేసిన తప్పులను బట్టియే కాబట్టి మొదట చేయఁబడిన నా. పుస్తకములను తరువాతి వారి గురుతర పుస్తక రచనకుఁ గొంత తోడుపడవచ్చును."*

*స్వీయచరిత్ర పుట 264 – (1936)*

వీరేశలింగం రచనలు సామాన్యమైనవని సృజనాత్మకమైనవి కావని యీనాటి సవ్యరచయితలు కొందరు విమర్శించినా నిజానికి ఆనాడు అస్తవ్యస్తంగా వున్న తెలుగు సాహిత్యక్షేత్రంలో అనేక నూతన మార్గాలను నిర్మించి, అనంతర రచయితలకు మార్గదర్శకుడైన మహనీయుడు. వీరేశలింగమేనన్న విషయాన్ని విస్మరించరాదు. రచయితగా, సంఘసంస్కర్తగా ఆయన అగ్రగామి.. డా॥ వి. రామకృష్ణారావుగారు వీరేశలింగాన్ని గురించి:

*"ప్రాణాంతకాలైన విషవృక్షాల్ని పడగొట్టడం, పొదల్ని తుప్పల్ని కాల్చివేయడం, క్రూరమృగాన్ని వేటాడడం, విషసర్పాలను నాశనం చేయడం, దాటరాని కొండల్లో బాటలు వేయడం, ముండ్ల కంపల్ని పెరికివేయడం అన్నవి ఆయన సమాజపరంగా నిర్వహించిన, సాధించిన ఘన కార్యాలు" అని ప్రశంసించారు.*

సృజనాత్మక రచయిత అయిన వీరేశలింగం ఆవేగం, ఆవేశం, ఉద్రేకం ఆయన రచనలోని కొన్ని లోపాలకు కారణం కావచ్చు. కాని ఆ ఆవేశ ఆవేగాలే ఉద్యమనాయకుడైన వీరేశలింగానికి సాధనమైన ఆయుధాలు. ఉద్యమకర్తకు సవాలుచేసి బందించేది, ప్రోత్సహించి పురికొల్పి రెచ్చగొట్టేది. అప్రమత్తంగా సర్వసిద్ధంగా వుండే కలం అవసరం. భావవ్యక్తీకరణలో సున్నితానికై సౌందర్యానికై అది వెనకాదరాదు. వాడి ఖడ్గంలాగ అది ఖండించాలి. కొట్టడానికి గాయపరచడానికి సిద్ధపడాలి. అవసరమయితే అది మొండితలలను బద్దలుచేసే సమ్మెలుగా వుండాలి. ఈ లక్షణాలన్నీ వీరేశలింగం కలానికి వున్నవి. అందువల్లనే వీరేశలింగం సమాధిపై సుత్తితో కూడిన ఖడ్గాన్ని చిహ్నంగా చిత్రిస్తే సముచితంగ వుంటుందని కట్టమంచి రామలింగారెడ్డి సలహా చెప్పారు.

సమకాలీన మహాసంస్కర్తలైన విద్యాసాగర్, రెనడేలవలే వీరేశలింగం రాజకీయాలపట్ల మితవాది. ఆయన దేశభక్తుడు. రాజకీయ స్వాతంత్ర్యాన్ని ప్రగాఢంగా వాంఛించాడు. కాని బ్రిటీషువాళ్ళ సంపర్కం భారతీయులను ప్రభావితం చేసి భారతీయుల చిత్తవికాసానికి దోహదకారి అయినదని. దృఢవిశ్వాసం స్తంభించిపోయిన సంస్కృతీ నాగరికతను గూర్చి హేతుబద్ధంగ ఆలోచించడానికి అది ప్రేరకమైనదని ఆయన వాదన. రాజకీయ స్వాతంత్ర్యం వల్ల కలిగే మేళ్ళను సంపూర్ణంగ అనుభవించాలి. అంటే దానికన్న ముందు సాంఘిక, మత, విద్యావిధానాల్లో సంస్కరణలు రావాలని వీరేశలింగం నొక్కిచెప్పాడు. ఆయన దృష్టిలో అజ్ఞానంలో, మూఢవిశ్వాసాలలో తల మునకలైన ప్రజలు తమకొరకు తాము వికాస ప్రధానమైన ప్రభుత్వాన్ని స్థాపించుకొని నడవలేరు. అన్ని రంగాలలో పురోభివృద్ధిని సాధించలేదు. ఒక కార్యకర్తకు ఆయన వ్రాసిన క్రింది ఉత్తరంలో ఆయన రాజకీయ అభిప్రాయాలు సువిధిత మవుతాయి.

*"రాజకీయాలను నేను ప్రతిఘటిస్తున్నట్లు మీరందరూ భావిస్తున్నారు. మత, సాంఘిక రంగాలలో వలెనే రాజకీయరంగంలోను నేను స్వేచ్ఛను కాంక్షిస్తున్నాను. మన మతాన్ని, మన సాంఘిక పరిస్థితులను సంస్కరించు*

*కోసంతవరకు రాజకీయ స్వాతంత్ర్య ఫలితాలను మనం అనుభవించలేము. సంఘ సేవకులుగానే మనం గొప్ప దేశ సేవను చేయవచ్చు."*

అఖిల భారతజాతీయ కాంగ్రెసు తొలి సభ్యులలో వీరేశలింగం ఒకడు. ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్నప్పటికి మద్రాసు మహాపట్టణంలో ప్రప్రథమంగ 1887లో జరిగిన అఖిలభారత జాతీయ కాంగ్రెసు సమావేశాలలో ఆయన ప్రతినిధిగా పాల్గొన్నాడు. అంతకు క్రితం రెండేళ్ళకుముందే రాజమండ్రిలో కాంగ్రెసుపార్టీ ఉద్దేశాలను లక్ష్యాలను గూర్చి ఆయన ప్రత్యేకంగా ఉపన్యసించాడు కూడ. ఆ ఉపన్యాసంలో చెప్పినదంతా ఆయన ఆచరించాడు. ఆ ఉపన్యాసాన్ని తన గ్రంధావళిలో చేర్చాడు.

కర్జన్ ప్రభువు నిరంకుశంగ వంగరాష్ట్రాన్ని విభజించినపుడు దేశాన్నంతటిని ఉద్రూతలూగించిన వందేమాతరం ఉద్యమాన్ని వీరేశలింగం అభిమానించలేకపోయాడు. "స్వాతంత్ర్యం ముందు, ఆ తరువాత తక్కినవి" అని నినాదాలు చేసేవారితో ఆయన వ్యతిరేకించాడు. ఆ కారణంగా ఆయన ప్రజల అభిమానాన్ని కొంత పోగొట్టుకొన్నాడు. ముఖ్యంగా వందేమాతరం ఉద్యమకాలంలో విప్లవభావాల్ని రేపిన బిపిన్ చంద్రపాల్ ఆంధ్రరాష్ట్రాన్ని పర్యటించిన సమయంలోను, ఆ తరువాత కూడ వీరేశలింగం. పట్ల ప్రజలు దురభిమానాన్ని వ్యక్తం చేశారు. 1907లో బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి. దర్శించినపుడు ఆయన ఉద్రేకపూరిత ఉపన్యాసాలను విన్న కొందరు యువకులు వీరేశలింగాన్ని పిరికివాడని పరిహసించారు. ఈ మాటలు ఆయన్ను అధికంగా బాధించాయి. ఆయన మరేతిట్టునైనా సహించేవాడు. కాని పెరికివాడు' అన్న మాటను మాత్రం సహించలేకపోయాడు.

తన గుణాలలో నిర్భయభావ మొకటని ఆయన తరచు చెప్పుకోవటం కద్దు. కాబట్టి పెరికివాడు 1. ఇతరులు తన్ను వ్యవహరించడం వీరేశలింగాన్ని పాలకాలం వేధించింది. అయినా అది రాజకీయ దృక్పధాన్ని మార్చలేదు. జనసామాన్యంలో మెప్పును పొందడానికి దిగజార్చలేదు. పైగా ద్విగుణీకృతోత్సాహంతో, పట్టుదలతో తానెన్నుకున్న లక్ష్యసాధనను కొనసాగించాడు. ఆత్మవంచన లేకుండ తాను నమ్మిన జీవితధ్యేయాన్ని త్రికరణశుద్ధిగ ధైర్యంగ సాధించి నందువల్లనే వీరేశలింగం యుగపురుషుడయ్యాడు. కట్టమంచి రామలింగారెడ్డి వ్రాసినట్లు:

*"అన్ని విధాలా ఆధునిక కాలంలో మహనీయుడనదగిన వ్యక్తి వీరేశలింగం. ఆయన వ్యక్తిగత చరిత్రలో ఒక యుగావిర్భావం ఇమిడి వున్నది. అనేకులు తాము జీవిస్తున్న శకాన్ని ప్రభావితం చేయకుండానే జీవిస్తారు. వారు వెలుగు నివ్వరు. ఉన్న వెలుగును గ్రహించరు, మార్పు, పురోగమనమన్నది లేకపోతే జీవితం స్తంభించి, ఏవగింపును కలిగిస్తుంది. అట్టి ఫలప్రదమైన తత్త్వాన్ని నూతనోత్తేజాన్ని ప్రసరించేవాడే నాయకుడు. వీరేశలింగం ఈ శక నిర్మాత గనుక ఈ నూతన శకానికి ఆయన ప్రతిబింబం ఆధునిక యుగంలో వెలసిన మహనీయులలో వీరేశలింగం ఒకడు కనుక ఆయన యుగకర్త కాగలిగాడు. యుగలక్షణాలను దర్శించి ఆ లక్షణాలతో ఆవహింపబడినవారే యుగ . సృష్టికర్త కాగలదు. "*

కట్టమంచివారు చెప్పినదానికన్న ఒక అడుగు ముందుకు వస్తే మనం ఆంధ్రదేశంలో వీరేశలింగం కేవలం "యుగనిర్మాతల్లో ఒకడు" కాదుగాని, ఆయన్నే ఏకైక మహానిర్మాతగా పరిగణిస్తాము. రాజా రామమోహన రాయ్, "భారతీయులలో మొదటి ఆధునికుడు" అని రవీంద్రనాధ్ ఠాగూర్ చెప్పినట్లు వీరేశలింగం దక్షిణభారతంలో ప్రథమ

ఆధునికుడు. శత్రుభీకరుడుగ, అనేక వివాదరంగాలలో విజయుడుగ, స్వతంత్రభావాలకు మూలస్తంభంగ, సాహస కార్యాచరణుడుగ, ప్రగతిశీలుడుగ, మహారచయితగా, విద్యావేత్తగ సంఘ సంస్కర్తగ వీరేశలింగం మహామనీషి.

## ❀ వీరేశలింగం ప్రధాన రచనలు

- మార్కండేయ శతకము, గోపాల శతకము 1868-69 రసిక జన మనోరంజనము 1870-71
- శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము 1871 శుద్ధాంధ్ర ఉత్తర రామాయణము 1872
- నీతిచంద్రిక విగ్రహము (పంచ తంత్రము) 1874
- నీతి దీపిక (100 పద్యాల సంకలనము) 1875
- జాన్గిల్పిన్ (కూపర్ కవితా ఖండికకు అనువాదము) 1875
- సంగ్రహ వ్యాకరణము 1875
- కామెడీ ఆఫ్ ఎరర్స్ (షేక్స్పియర్ నాటకానికి అసమగ్ర పద్యానువాదం) 1875 అభాగ్యోపాఖ్యానము (వ్యంగ్య రచన) 1876.
- పదార్థ వివేదక శాస్త్రము (రసాయన శాస్త్రం: ప్రశ్నోత్తర రూపంలో) 1877-78. బ్రహ్మ వివాహము (సాంఘిక నాటకం) 1878
- నీతి చంద్రిక సంధి (పంచతంత్రానువాదం) 1878 శుద్ధాంధ్ర భారత సంగ్రహము 1879
- వ్యవహార ధర్మబోధిని (సాంఘిక నాటకం) 1879
- రత్నావళి (హరుని నాటకానికి అనువాదం) 1880 వివేక దీపిక (నాటకం) 1880.
- వెన్నీసు వర్తక చరిత్రము (షేక్స్పియర్ కృతమైన The Merchant of Venice నాటకానికి అసంపూర్ణ అనువాదం). 1880
- రాజశేఖర చరిత్ర (నవల) 1880
- చమత్కార రత్నావళి (The Comedy of Errors) అనే నాటకానికి వచనానుసరణం 1880
- సత్యవతీ చరిత్ర (నీతికథ) 1883

- శాకుంతలము (కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతల నాటకానువాదం) 1883
- చంద్రమతీ చరిత్రము (స్త్రీల కొరకు వచనంలో వ్రాసిన కథ) 1884.
- సత్యాద్రౌపదీ సంవాదము (సంవాదరూప పద్యకావ్యం) 1883
- శ్రీ నీతిదీపిక (బాలికా పాఠశాలల ఉపయోగార్థం కూర్చిన వందపద్యాల సంకలనం) 1884
- ప్రహ్లాద నాటకము (పౌరాణిక నాటకం) 1885
- ప్రబోధ చంద్రోదయము (కృష్ణమిశ్రుని నాటకానువాదం) 1885
- మాళవికాగ్ని మిత్రము (కాళిదాసుని నాటకానువాదం) 1885
- దక్షిణ గోగ్రహణము (పౌరాణిక నాటకం) 1885
- రాగమంజరి (షెరిడన్ రచించిన The Duenna నాటకానికి అనువాదం) 1885
- సత్యహరిశ్చంద్ర నాటకం (పౌరాణిక నాటకం) 1886
- దరఖాచార్య విలసనము (ప్రహసనం) 1886
- అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనము 1886
- సంగ్రహము 1886
- ఆంధ్రకవుల చరిత్రము 1887
- సత్యసంజీవని (నీతికథ) 1887
- శరీరశాస్త్రము సంగ్రహము 1888
- హాస్య సంజీవని - ప్రథమ భాగము (19 ప్రహసనాల సంకలనం) 1888
- దేహారోగ్య ధర్మబోధిని 1889
- సతీహిత బోధిని 1889

- తిర్యగ్విర్వాన్ మహాసభ 1889
- మహారణ్య పురాధిపత్యము (వ్యంగ్య రచన) 1889
- హాస్య సంజీవని - ద్వితీయ భాగము (17 ప్రహసనాల సంకలనం) 1891 సత్యరాజు పూర్వదేశ యాత్రలు - ప్రథమ భాగము (వ్యంగ్య రచన) 1891
- అలంకార సంగ్రహము 1892
- పధిక విలాసము (అలీవర్ గోల్డ్ స్మిత్ రచించిన The Traveller కవితకు అనువాదం) 1892 సత్యరాజ పూర్వదేశ యాత్రలు - ద్వితీయ భాగము 1893-94
- నీతి కథా మంజరి (ఈసఫ్ కథలు) 1893-94
- కల్యాణ కల్పవల్లి (షెరిడన్ రచించిన The Rivals నాటకానికి అనువాదం) 1894
- జ్యోతిశ్శాస్త్ర సంగ్రహము 1895
- సరస్వతీ నారద విలాపము (పద్య కావ్యం) 1895
- పత్నీహిత సూచని 1896
- లక్ష్మీ శనైశ్చర విలాసము 1896
- జంతు స్వభావ చరిత్రము 1896
- రాజారామమోహన్ రాయ్ చరిత్ర 1896

## కొన్ని పదాలు సంగ్రహ వివరణ

అఖిల భారత జాతీయ కాంగ్రెస్: 1885లో స్థాపించబడి దేశ స్వాతంత్రోద్యమాన్ని నడపిన సంస్థ 1947వ సంవత్సరం నుండి కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీగ ప్రసిద్ధి కెక్కినా ఆ తరువాత ఇది చీలిపోయింది.

ఆంధ్ర: ఆంధ్ర తెలుగు పదాలు జాతివాదిగా, దేశవాదిగా, భాషావాదిగా వ్యవహారంలో వున్న పర్యాయ పదాలు, ఆంధ్రజాతి అతిపురాతనమైంది. ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రజాతి ప్రశంసవుంది. తెలుగు ద్రావిడ భాషా

కుటుంబానికి చెందినట్టి భాష, భారతదేశంలోని 17 రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. విస్తీర్ణం 275280 చం: కి.మీ. 1961 లెక్కల ప్రకారం జనాభా 35,963,1147.

ఆపస్తంభుడు: ఆఫస్తంభ సూత్రాలకర్త అతని కాలం క్రీ.పూ. 600-200 మధ్యకాలమని మ్యాక్స్ మూలర్ అభిప్రాయం. ఆర్యభట్టు క్రీ.శ. 5వ శతాబ్దానికి చెందిన గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు, ఖగోళశాస్త్రజ్ఞుడు. ఆర్యభట్టీయమున్న ఇతని గ్రంథం అలభ్యమని భావించారుగాని, హెచ్. కెర్న్ (H. Kern) అన్న పరిశోధకుడు దాన్ని సేకరించి 1874వ సంవత్సరంలో Leyden పట్టణంలో ప్రచురించాడు.

ఉవన్ వృక్షం: జావా ద్వీపంలో పెరిగే ఒక చెట్టు, విషపూరితమైన దీని పాలను బాణాగ్రాలకు పూసి మారణాయుధాలుగా ఉపయోగిస్తారు. ఈ చెట్ల నీడ కూడా ప్రాణావహారి అని వినికిడి ఋషి తాపసి, సన్యాసీ, ఋషుల్లో ప్రముఖుడు, మహర్షి (ఋషి అంటే క్రాంతదర్శి అని అర్థం )

కణ్యుడు: శకుంతలను పెంచిన ఋషి

కర్జన్ (ప్రభువు) (1859-1925): 1898లో వైస్య, ఇండియా గవర్నర్ జనరల్ గా నియుక్తుడైన బ్రిటీష్ రాజకీయవేత్త 1905లో కిచెనర్ (Kitchener) ప్రభువుతో భేదాభిప్రాయాల వల్ల రాజీనామా చేశాడు. అధికార దర్పంతో గర్వి అయిన కర్జన్ ప్రభువును భారతీయులు ద్వేషించారు. ఇతడు 1905లో వంగ రాష్ట్రాన్ని రెండుగ విభజించారు. ఈ విభజనమే దేశంలో వందేమాతర ఉద్యమానికి దారితీసింది. ఇంగ్లాండు తిరిగి వెళ్లిన తరువాత ఉన్నత రాజకీయ పదవుల్ని నిర్వహించినా పెద్ద పేరు రాలేదు.

కర్ణాటక: కన్నర, కర్ణాటక పదాలు సమానార్థకాలు. ఈ రెండు పదాలు ఆంధ్ర శబ్దంబాగ జాతి, దేశ, భాషా వాచకాలు, దక్షిణ భారత దేశంలోని కర్ణాటక రాష్ట్రం కన్నడ ప్రజల రాష్ట్రం.

కవిత: భారతీయాలంకార శాస్త్రంలో కార్యకళను, కావ్యాన్ని తెలిపే పారిభాషిక పదం. కార్వే మహర్షి డి.కె, (1858-1962) ఇతడు గొప్ప విద్యావేత్త, సంఘ సంస్కర్త. పూర్తి పేరు దొందోకేశన కార్వే అయితే అభిమాను లాయనను మహర్షి అని పేర్కొనేవారు. ఈయన ఒక వితంతు శరణాలయాన్ని ఒక స్త్రీల కళాశాలను స్థాపించారు. ఈ కళాశాల ఆ తరువాత యస్.యస్.డి. తానె స్త్రీల విశ్వవిద్యాలయంగా రూపొందింది.

కాళిదాసు: సంస్కృత భాషలో నాటకాలను, కావ్యాలను రచించిన మహాకవి కాళిదాసు నాటకాలు, కావ్యాలు సంస్కృత వాఙ్మయంలో శిఖర ప్రాయాలు, ఆయన జననమరణ కాలాలు వివాదగ్రస్తాలు. కాని క్రీ.శ. 4-5 శతాబ్దుల మధ్య గుప్తుల కాలంలో నివసించినట్లు చరిత్రకారుల అభిప్రాయం. కాళిదాసు నాటకాలలో అభిజ్ఞాన తాకుంతలం, కావ్యాలలో మేఘసందేశం సుప్రసిద్ధాలు, ఉపలబ్ధమైన ఆయన కావ్యాలు, నాటకాలు ఇంగ్లీషులోనికి, ఇంకా అనేక భాషలలోనికి అనువదింపబడ్డాయి.

కావ్యం: పద్యంలో లేదా గద్యంలో లేదా గద్యపద్మ మిశ్రమంలో భావ ప్రధానంగా చేసిన రచన, దృశ్యప్రధానమైన కావ్యం దృశ్యకావ్యం పఠన ప్రధానమైంది శ్రవ్యకావ్యం. ఛందోబద్ధమైన రచనకు పద్యకావ్యమని, వచన రూపంలోని రచనకు 'గద్యకావ్య'మని, గద్యపద్యాత్మకమైన రచనకు 'చంపూకావ్య' మని ప్రసిద్ధ వ్యవహారం, ఇతి వృత్తభేదాన్ని బట్టి కావ్యాల్లో మరికొన్ని భేదాలున్నాయి.

కృష్ణమిత్రుడు: 11వ శతాబ్దికి చెందిన సంస్కృత నాటకకర్త, ప్రబోధ చంద్రోదయమనే ఆధ్యాత్మిక నాటకాన్ని రచించాడు.
కౌరవులు: హస్తినాపురాన్ని (ప్రస్తుతం మీరట్) పాలించిన ధృతరాష్ట్రుని వంద మంది కుమారులు.
దుర్యోధనుడు కౌరవుల్లో జ్యేష్ఠుడు, యువరాజు, జ్ఞాతులైన కౌరవ పాండవుల ప్రబల విరోధాన్ని అనుసరించే మహాభారతంలోని కథ నడుస్తుంది.

గద్యతిక్కన: బిరుదు వాచకం, పద్యరచనలో తిక్కన ఎంతటి ప్రముఖుడో, గద్యరచనలో అంతటి ప్రముఖుడైన రచయితకు

ఇచ్చే బిరుదు.
గర్గుడు: అధర్వణవేదంలో పేర్కొనబడిన ఋషి ఖగోళశాస్త్రజ్ఞుడు. క్రీస్తు శకారంభంలో కూర్చబడిన గర్గ సంహితలో గల్గుని సిద్ధాంతాలు క్రోడీకరింపబడివున్నాయి. గర్భకవిత్వం ఒక ఛందస్సులో వ్రాసిన పద్యంలో మరొక ఛందస్సుకు సంబంధించిన చిన్న పద్యాన్ని ఇమిడ్చి వ్రాసిన కవిత్వం.

గాయత్రి: సంస్కృత ఛందస్సులో ఒక వృత్తం. ఋగ్వేదంలో విశ్వామిత్రుడు గాయత్రీ ఛందస్సులో రచించిన ఒక మంత్రం. ఋగ్వేద మంత్రాలలో ఇది పవిత్రమైందని, బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యకులాల వటువులకు ఉపనయనమప్పుడీ మంత్రాన్ని ఉపదేశిస్తారు. సూర్యాభిముఖంగా, నదీజలాలలో నిలుచుండి త్రిసంధ్యల్లో ఈ మంత్రాన్ని జపించాలని నియమం

గోదావరి: దక్షిణాపథంలోని నదులన్నిటిలో పెద్ద నది. పొడవు 1498 కి.మీ. పశ్చిమ కనుమల్లో పుట్టి తూర్పు దిక్కు ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నది పొడవులో సగం (720 కి.మీ.) ఆంధ్రప్రదేశ్లో వ్యాపించింది. వీరేశలింగం జన్మస్థలమైన రాజమండ్రి గోదావరీ నదీతీరంలో వున్న ముఖ్యమైన పట్టణం.

గౌతముడు: ప్రాచీన ధర్మశాస్త్రకర్త. అతి ప్రామాణికమైన ఈ గ్రంథం ఒక వ్యక్తికృతం కాదని, గౌతమ వంశీయుల సమష్టి రచన అని పండితుల అభిప్రాయం.

గ్రాంధికం: సమకాలీనమైన పదజాలాన్ని, పదబంధాల్ని, నూతనమైన నుడికారాన్ని ప్రమాణంగా పరిగణించని భారతీయ భాషాశైలి. ఇది చాలావరకు పాతపడ్డ శైలి, కృతకం కూడాను.

చంద్రవార్కర్, యస్.సి. (1855-1923): ప్రముఖ న్యాయవాదిగా, ప్రఖ్యాత న్యాయమూర్తిగా, సమర్థుడైన రాజకీయవేత్తగా గొప్ప సంఘ సంస్కర్తగా అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడుగా బొంబాయి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడుగా, బొంబాయి విధాన సభాధ్యక్షుడుగా ప్రసిద్ధికెక్కిన మహనీయుడు.

చటర్జీ, బంకించంద్ర (1838-1894): సాంఘికమత విషయాలలో సంప్రదాయవాది. రాజకీయాలలో అతివాది. ప్రభుత్వోద్యోగి అయినప్పటికి తన నవలల ద్వారా, ఇతర రచనల మూలంగ బ్రిటీషు ప్రభుత్వంపై తిరుగుబాటు ధోరణిని ప్రకటించేవాడు. ప్రస్తుతం బెంగాలులో తప్ప ఇతర ప్రాంతాలలో అతని రచనలకంత ప్రచారం లేదు. అయితే భారతదేశంలో ప్రథమ నవలా రచయితగా ఒకప్పుడు భారతజాతి అంతటిపై అతని ప్రభావముండింది. "వందేమాతరం" అన్నపాట రచయితగ నేడతడు ప్రసిద్ధుడు.

చరకుడు: ప్రాచీన భారతీయ వైద్యుల్లో అగ్రగణ్యుడు. చరక సంహితకర్త. క్రీ.పూ. 6-వ శతాబ్దిలో జీవించినట్లు భారతీయ పండితుల అభిప్రాయం. సిల్వెన్లెవి (Sylvain Levi) అనే పండితు డితని కాలాన్ని క్రీ.శ. 2వ శతాబ్దిగ నిర్ణయించాడు.
చిత్రకవిత్వం భారతీయ భాషల్లో ఒకటి లేదా రెండక్షరాలతోనే నడపిన పద్య రచన..
చిత్రకవిత్వంలో యతి ప్రాసాది నియమాలు శ్లేష మొదలైన చమత్కారాలు కూడా వుంటాయి.

జమీందారు: ఒకప్పుడు స్వతంత్రుడైన పాలకుడిగా వుండి, బ్రిటీషు పరిపాలనలో అస్వతంత్రుడై ఒక ప్రాంతానికి అధికారిగా శిస్తు వసూలు చేసి బ్రిటీషు వారికి కప్పం చెల్లించే ప్రభువు.

జాగీరు: రాజులు, ప్రభువులు లేదా ప్రభుత్వం ఒక వ్యక్తికో లేదా ఒక కుటుంబానికో బహుమానంగా ఇచ్చిన కొన్ని గ్రామాల సముదాయం. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జాగీరు పద్ధతి రద్దుచేయబడింది.

టాగోర్, దేవేంద్రనాథ్ (1817-1905): రాజా రామమోహన్ రాయ్కు ప్రధాన శిష్యుడు.. అందరూ 'మహర్షి' అని గౌరవించేవారు. . రామమోహన్ రాయ్కు లాగే ఇతనికీ ఉపనిషత్తులే ప్రేరకశక్తిని ప్రసాదించాయి. బ్రహ్మ సమాజం రెండుమార్లు చీలిపోయినా విడిపోయినవారు కూడా ఇతన్ని గౌరవించేవారు. ఈయన మహాకవి రవీంద్రనాథ్ టాగోర్ తండ్రీ.

తాళపత్ర గ్రంధాలు: 19-వ శతాబ్దంలో మనదేశంలో గ్రంధముద్రణ ప్రవేశపెట్టడానికి పూర్వం, తెలుగు పుస్తకాల్ని వ్రాతకని తయారు చేసుకొన్న తాటాకుల మీద ఘంటంతో వ్రాసేవాళ్ళు.

తిక్కన: క్రీ.శ. 13వ శతాబ్దంలో వెలసిన మహాకవి. రాజనీతి దురంధరుడు. తెలుగు కవుల్లో అగ్రగణ్యుడు. కవిబ్రహ్మ బిరుదాంకితుడు. మహాభారతంలో నాల్గవ పర్వం నుండి చివరి పర్వం వరకు తెలుగులోనికి అనువదించాడు. తాను వేదాంతి కాదు. రాజనీతిజ్ఞుడు. కాబట్టి మహాభారతంలోని భగవద్గీతాభాగాన్ని అనువదించలేదు. రాజనీతికి, యుద్ధవర్ణనకు సంబంధించిన భారత కథాభాగాల్ని అత్యద్భుతంగా అనువదించాడు. తన ప్రభువైన మనుమసిద్ధి రాజును పొరుగురాజులు రాజ్యభ్రష్టుని. చేసినపుడు తిక్కన ఓరుగల్లు వెళ్ళి, కాకతీయ చక్రవర్తి అయిన గణపతి దేవుని సహాయాన్ని అర్థించి, సైన్యాన్ని తీసుకొనివచ్చి విరోధుల్ని ఓడించి మనుమసిద్ధికి రాజ్యాన్ని ఇప్పించాడు.

తిమ్మకవి, కూచిమంచి 'రసికజనమనోభిరామము' అనే అచ్చ తెలుగు ప్రబంధాన్ని రచించిన కవి.
తెలగనార్య, పొన్నికంటి యయాతి చరిత్ర అనే అచ్చ తెనుగు కావ్యకర్త. తన కావ్యాన్ని 16వ శతాబ్ది పూర్వార్ధంలో గోలుకొండను పరిపాలించిన ఇబ్రహీం ముల్క్ నవాబుకు అంకితమిచ్చాడు.

తెలాంగ్, కె.టి. (1850-1893): ప్రఖ్యాత న్యాయవాది, ప్రజల మన్ననలు పొందిన న్యాయాధిపతి సాంఘిక, రాజకీయ సంస్కరణలలో పాల్గొనేవాడు. దర్బారు రాజులు, ప్రభువులు దర్శనమిచ్చే సభాస్థలి.

దివాన్: స్వదేశ సంస్థానాధిపతులకు, జమీందార్లకు మంత్రిగా వ్యవహరించేవాడు. సంస్థానాలు, జమీందారీల రద్దుతోబాటు ఈ పదవికూడా తొలగిపోయింది.

దేవదాసి: భగవంతుని సేవకురాలని వాచ్యార్థం. దేవాలయాల్లో సంగీత నృత్య ప్రదర్శన దేవదాసీల వృత్తి.

జీవనాధారానికి మాన్యాలుండినా వేశ్యావృత్తితో కొంత గడించుకొనేవాళ్ళు. కొందరు దేవదాసీలు సంగీత నృత్య కళల్లో నిష్ణాతులై వుండేవారు. బాలికల్ని భగవదంకింతంగా దేవదాసీలుగా నిలిపే ఆచారం ఇపుడు చట్ట రీత్యా నిషేధింపబడింది.

ద్విపద ఛందస్సు: తెలుగు కవులు రూపొందించుకొన్న ఛందస్సు. ఇది సరళతకు సౌలభ్యానికి మేలైన ఛందస్సు, తెలుగులో జనప్రియాలైన అనేక రచనలు ద్విపద ఛందస్సులో వెలసినాయి.

ధోతి: సాధారణంగా హిందువుల్లో మగవాళ్ళు కట్టుకొనే వస్త్రం పది పండ్రెండు అడుగుల పొడవుతో సన్నని అంచుతోవున్న ధోతిని అలవాటును బట్టి చూడముచ్చటగా కట్టుకోవచ్చు. ఇది భారతదేశ వాతావరణానికి చాల అనువైన వస్త్రధారణ,

నన్నయ: లభించిన తెలుగు రచనల్లో నన్నయ భారతం ప్రాచీనమైంది. కాబట్టి నన్నయకు ఆదికవి అన్న ప్రసిద్ధి కలిగింది. అయినా నన్నయ పూర్వకవుల్ని పండితుల్ని కొందరిని పేర్కొనివున్నాడు. క్రీ.శ. 11-వ శతాబ్దివాడు. చాళుక్య చక్రవర్తి అయిన రాజరాజు నరేంద్రుని ఆస్థానకవి సంస్కృత భారతంలో కొంత భాగాన్ని ఆంధ్రీకరించినాడు. ఇతడు ఆదికవి అయినా కాకపోయినా మహాకవి అనడానికి సంశయం లేదు.

నాగేశ్వరరావు: కాశీనాథుని (1867-1938) దేశభక్తుడు. ప్రముఖ పత్రికా ప్రచురణకర్త: గొప్ప ప్రజాసేవకుడు. విద్యావర్తక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ఆయన అమోఘమైన కృషిచేసి ఆంధ్రుల పురోభివృద్ధికి అధికంగా పాటుపడ్డారు.

నార్పార్టీ: భోగంమేళం.

నాట్యశాస్త్రం: భారతీయ వాఙ్మయంలో అభినయానికి, రంగస్థలానికి సంబంధించి వెలువడిన .అతిప్రాచీనమైన శాస్త్ర గ్రంథం నాటకాలకు, నాటకరంగానికి సంబంధించిన వివరాలు ఇందు విపులంగా వున్నాయి. దీని రచన క్రీ.పూ. 2 వ శతాబ్ది నుండి క్రీస్తు తర్వాత 2-వ శతాబ్ది మధ్యకాలంలో జరిగి వుంటుందని భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ రచనకు ప్రమాణాన్ని అధికారాన్ని ఆపాదించడానికి భరతుడనే పురాణ పురుషునికి గ్రంథ కర్తృత్వాన్ని అంటగట్టారు.

పంచ తంత్రము: పశుపక్షుల్ని పాత్రలుగచేసి రాజనీతికి సంబంధించిన పంచ తంత్రాలను సంస్కృతంలో చెప్పిన కథలు అందువల్లనే "పంచ తంత్రము" అన్న పేరు దీనికి కలిగింది. ఫ్రాంక్లిన్ ఎడ్వర్టన్ (Franklin Edgerton) అన్నట్లు "ప్రపంచ సాహిత్యంలో హైందవ సాహిత్యానికి చెందిన మరే కావ్యమూ పంచ తంత్ర మంతటి ప్రముఖ పాత్రను వహించలేదు". జోహెన్నెస్ హెర్టేల్ (Johannes Hertel) పంచతంత్ర కర్తకాలం క్రీ.పూ. 2 వ శతాబ్దిగ నిర్ణయించాడు. కాని తదితర పండితులు ఆయన క్రీ.శ. 5వ శతాబ్ది వాడంటారు. క్రీ.శ. 6వ శతాబ్దినాటికే యిది పర్షియన్, హీబ్రూ సిరియన్, తర్కీ, గ్రీకు భాషల్లోకి అనువదింపబడింది. ఇప్పుడది యించుమించు ప్రపంచంలోని ప్రధాన భాషలన్నింటిలోకి తర్జుమా అయింది. ఇంగ్లీషులో డబ్ల్యు రైడర్ (W.Ryder) అనువాదం ఉత్తమోత్తమం.

పండితుడు (పండిట్): గొప్ప విద్యావంతుడని, అర్ధమున్నా, కాశ్మీరంలోని బ్రాహ్మలు లందరికీ, సంబోధన వాచకంగా పండిత శబ్దం ప్రయుక్తం, హిందీ ప్రాంతాల్లో పండిట్ అంటే వంటవారని వ్యవహారం.

పాండవులు: పాండు రాజు కుమారులైన ఐదుగురిని సామూహికంగా పేర్కొనే పదం పాండవులకు జ్ఞాతులైన కౌరవులకు కురుక్షేత్రంలో (ప్రస్తుతం ఢిల్లీ సమీపం) జరిగిన మహాయుద్ధం. భారతంలో వర్ణితం.

పరాశరుడు: క్రీ.శ. 1300 పూర్వం వెలసిన పరాశర స్మృతికి కర్త,

పాల్, బిపిన్ చంద్ర (1858-1932): మహావక్త. దేశభక్తుడు. అఖిల భారత జాతీయ కాంగ్రెసులోని తీవ్రవాదులకు నాయకులైన వారిలో పాల్ కూడ ఒకడు. ప్రౌఢ వయస్సులో పాల్లోని తీవ్రత తగ్గు ముఖం పట్టింది. ఆ తరువాత ఆయనపట్ల ప్రజాదరణ సన్నగిల్లింది.

పురాణాలు: హిందువుల ప్రాచీన కథల, గాథల చరిత్ర పద్దెనిమిది పురాణాలు, పద్దెనిమిది ఉపపురాణాలని లోకవ్యవహారం. నిజానికి ఉపపురాణాలు పద్దెనిమిదిని మించివున్నాయి. జన సామాన్యంలో హిందూమతానికి పురాణాలే ముఖ్యాధారం. విష్ణు పురాణాన్ని ఇంగ్లీషులోనికి అనువదిస్తూ ఆ గ్రంథానికి హెచ్ హెచ్. విల్సన్ (H.H. Wilson) వ్రాసిన ఉపోద్ఘాతమే పురాణాల స్వరూపాన్ని చక్కగా వివరించే రచన.

పైస: రూపాయికి దశాంశపద్ధతిలో నయాపైసలు ప్రవేశపెట్టడానికి ముందు చలామణిలో వున్న కనిష్ట నాణెం. తెలుగులో దమ్మిడీ అనేవాళ్ళు. అప్పట్లో రూపాయకి 192 దమ్మిడీలు.

ప్రబంధం: అష్టాదశాది వర్ణనలున్న పద్యకావ్యం. ఇందులో రాజులు రాణుల శృంగారానికి ప్రాధాన్యం, వేట, యుద్ధవర్ణన కూడ వర్ణితమై వుండాలి. ప్రబంధ రచనకున్న నియమాలవల్ల మహాకవి అయితే తప్ప సామాన్య కవుల చేతుల్లో ప్రబంధ రచన కృతకంగా కంటకప్రాయంగా తయారవుతుంది.

ప్రహ్లాదుడు: పురాణాల్లో ఒక పాత్ర. హిరణ్యకశివుడనే రాక్షస రాజపుత్రుడు. క్రూరుడైన తండ్రి మాటను ఉల్లంఘించి విష్ణువును ఆరాధిస్తాడు. భక్తుడైన ప్రహ్లాదుని రక్షించడానికి విష్ణువు నరసింహావతారమెత్తి క్రూరుడైన హిరణ్యకశిపుని సంహరిస్తాడు.

బంధకవిత్వం: పద్య రచనలో ఒక రకమైన సాముగరిడీ పద్యపాదాల్ని చక్రాకారం, సర్పాకారం మొదలైన రూపాల్లో ఇమిచ్చేలాగచేసే పద్య రచన.

బిసెంటు అని (1847-1933): గొప్ప సంఘ సంస్కర్తి, ఓటు హక్కులకు పోరాడిన అభ్యుదయవాది. దివ్యజ్ఞాన సమాజంలో ప్రముఖురాలు. జాతీయ, అంతర్జాతీయ రంగాలలో ప్రసిద్ధి పొందిన బ్రిటీష్ వనిత. ఈమె 1893 వ సంవత్సరంలో భారత దేశానికి వచ్చి ఈ దేశాన్నే తన మాతృదేశంగ భావించింది. మదరాసులో అధిక కాలం గడిపింది. శ్రోతల్ని మంత్ర ముగ్ధుల్ని చేసే గొప్ప ఉపన్యాసకులు, అద్భుతమైన కార్యనిర్వాహకురాలు, నిర్విరామంగా పాటుపడగల శక్తిమంతురాలు. భారతదేశ స్వాతంత్ర్యాన్ని సాధించే ఉద్దేశంతో 1916-వ సంవత్సరం ఇండియన్ హోమ్ రూల్ లీగ్ అన్న సంస్థను స్థాపించింది. ఈమె భారత దేశానికి చేసిన సేవ అపారం.

బ్రహ్మ సమాజం: 1828-వ సంవత్సరము రాజా రామమోహన్ రాయ్ హైందవ మత సంస్కరణోద్దేశంతో స్థాపించిన ఆస్తిక సమాజం. 1842-వ సంవత్సరం ఈ సమాజంలో సభ్యుడుగా చేరిన దేవేంద్రనాథ్ టాగోర్ దీనిని పటిష్టం చేశాడు.

ఒక శతాబ్దానికి పైగా భారతదేశాన్ని ఉత్తేజ పరచడంలో చారిత్రక పాత్ర వహించిన యీ సమాజం నేడు తన చైతన్యాన్ని చాలవరకు కోల్పోయింది.

భరతుడు: నాటకానికి మూలపురుషుడుగా చెప్పుకొనే పురాణపాత్ర ఇతడు నాటకాన్ని సృష్టించి నాట్యశాస్త్ర గ్రంథాన్ని రచించిన ఋషిగా ప్రసిద్ధుడు. _భావమిత్రుడు: 16-వ శతాబ్దంలో జీవించిన ఆయుర్వేద నిపుణుడు. ఈయన 400 మంది వైద్యుల్ని తర్ఫీదుచేశాడు. 'భావ ప్రకాశిక' అన్నది ఈయన రచించిన గొప్ప వైద్యశాస్త్ర గ్రంథం.

మంగళం: హిందువులు భగవదారాధనలో, సాంఘిక మతపరమైన కొన్ని ఆచారాల్లో చివర పాడే పాట.

మంత్రం: సందర్భాన్నిబట్టి భిన్నార్థాల్లో ప్రయోగించే సంస్కృత పదమిది. వాక్శక్తిని ఆధ్యాత్మిక బలాన్ని పొందడానికి నిర్ణీతమైన వాక్యం.

మనువు: ఋగ్వేదం ప్రకారం మానవజాతికి మూలపురుషుడు; తొలి యజ్ఞకర్త. హిందూ ధర్మశాస్త్రాలన్నింటిలో మనుధర్మశాస్త్రమే ప్రాచీనతమమని అంటారు. దీనికి మనుస్మృతి. అనికూడ నామాంతరం. ఆధునిక భాషాశాస్త్రవేత్తలు కొందరు మనుధర్మశాస్త్రం క్రీ.పూ. 500 నుండి క్రీ.శ. 200 మధ్యకాలానికి చెందినదనే అభిప్రాయాలను వెలిబుచ్చారు.

మహామహోపాధ్యాయ: మహా మహా ఉపాధ్యాయుడని దీని కర్థం. భారతీయ భాషా సాహిత్యాల్లో నిష్ణాతులైన పండితులకు కొన్ని విశ్వవిద్యాలయాలు ఇచ్చే బిరుదు.

మహాభాగవతం: భాగవత పురాణమని దీని నామాంతరం. దీన్ని భారత రామాయ హాసాలతో చేర్చి చెప్పే సంప్రదాయమున్నా ఆ రెండింటికి అర్వాచీనమైన రచన ఇది. క్రీ.శ. పదవ శతాబ్ది రచన. కృష్ణావతారానికి సంబంధించిన లీలలు, కథలు ఇందలి కథా వస్తువు,

మహాభారతం: సంస్కృతంలో రామాయణంతోపాటు మహోత్సవమైన ఇతిహాసం మహాభారతం. పాశ్చావు ఇతిహాసాలైన laid. Odyssey రెండింటిని చేర్చి చూస్తే పరిమాణంలో భారతం ఎనిమిదిరెట్లు పెద్దది. ఇతిహ్యాన్ని బట్టి మహాభారతకర్త వ్యాసుడనే మహర్షి దీని రచనాకాలం తెలియదు. క్రీ.పూ. 4వ శతాబ్దికి క్రీ.శ. తర్వాత శ శతాబ్దికి మధ్యకాలంలో, ప్రస్తుతం మనకు లభిస్తున్న సంస్కృత భారతం రూపొంది వుంటుందని పండితాభిప్రాయం (M. Winternitz) మునసబు చిన్న తరగతికి చెందిన న్యాయాధికారి,

మేజువాణి: అధమస్థాయికి చెందిన అసభ్య నాట్యం. సామాన్యంగా దీనిని దేవదాసీలు లేదా వేశ్యలు చేస్తారు. ఇట్టి దేవదాసీల గుంపును మేజువాణి లేక భోగం మేళం అంటారు.

యజ్ఞోపవీతం: బ్రాహ్మణుడుగా పుట్టిన వారికి జందెం ధరించే కర్మ జరిగిన తర్వాత 'ద్విజుడు' అవుతాడని హిందువుల నమ్మకం. బ్రాహ్మణ వటువులకే కాకుండ వైద్య, క్షత్రియ కులాల బాలురకు కూడ యజ్ఞోపవీతధారణ కలదు.

యము, యమి: ఋగ్వేదంలో పేర్కొన్న దేవతలు. కవలలైన అన్నా చెల్లెళ్లు. ఋగ్వేదంలోని ఒక ఋక్కు వీరిరువురి మధ్య జరిగిన సంభాషణ రూపంలో ఉన్నది. సోదరుడైన యముణ్ణి యమి ప్రేమిస్తుంది. అతడామెను నిరాకరిస్తాడు. యముడు మృత్యులోకాధిపతి.

రాజగోపాలాచారి, చక్రవర్తి (రాజాజి' 1879-1972): భారత జాతీయ నాయకులలో ఒకడు. గాంధీజీకి అత్యంత సన్నిహితుడు. మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగ రెండు పర్యాయాలు నియమితుడయ్యాడు. కేంద్ర ప్రభుత్వంలో హోం శాఖామంత్రిగ, బెంగాలు రాష్ట్ర గవర్నరుగా, భారతదేశపు గవర్నరు జనరల్ గా వ్యవహరించాడు. సూక్ష్మగ్రాహిత్వానికి, ధీశక్తికి, చతుర సంభాషణకు, వాడి వేడి రచనలకు ఆయన ప్రసిద్ధుడు. అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుండి రాజీనామా చేసి 1959 వ సం. లో "స్వతంత్ర పార్టీని స్థాపించాడు.

రామకృష్ణరావ్: డా॥ వి (1876-1939): సర్, రఘుపతి వేంకటరత్నం శిష్యుడు, వీరేశలింగం అభిమాని, కాకినాడ పి. ఆర్. కళాశాల ప్రిన్సిపాల్, ఇంగ్లీషు భాషలో మంచి పండితుడు. రామానారాయణ, తర్కరత్న (1822-1886): వంగభాషా నాటక కర్త. ఇతడు రచించిన 'కులినకులు సర్వస్వ' అన్నది బహుభార్యాత్వాన్ని గురించిన గొప్ప వ్యంగ్య నాటకం.

రామలింగారెడ్డి, డా॥ కట్టమంచి (1880-1951): పెక్కేండ్లు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడుగా వుండిన ప్రముఖ విద్యావేత్త. అడపా దడపా రాజకీయాలలో పాల్గొన్నాడు. చలోక్తులు, వాదంలో చతుర ప్రత్యుక్తులు ప్రదర్శించిన మహావక్త, ప్రఖ్యాత సాహిత్య విమర్శకుడు కూడ

రామాయణం: ఈ పదానికి 'రాముని సంచార'మని వాచ్యార్థం. భారతీయులకున్న రెండు. మహాకావ్యాలలో రామాయణం ఒకటి, రెండవది మహాభారతం. రాముని వనవాసం, ఆ తరువాత జరిగిన రాజ్యాభిషేకం రామాయణంలోని ప్రధాన కథ. సంస్కృత వాఙ్మయంలో ఆదికవిగా కొనియాడబడిన వాల్మీకి దీని కర్త దీని రచనాకాలం ఇదమిత్థమని చెప్పలేం "రామాయణంలో మూల కథాభాగం క్రీ.పూ. మూడవ శతాబ్దిలో వాల్మీకి రచించినట్లు, ఆ తర్వాత క్రీ.శ. రెండవ శతాబ్దం వరకు ఇతరులు కొంత -కొంత పెంచినట్లు చెప్పవచ్చు" అని M. Winternitz అభిప్రాయం.

రాముడు: రామాయణ కావ్యంలో కథానాయకుడు. కోసల రాజ్యాధిపతి అయిన దశరథరాజు కుమారుడు విష్ణువు దశావతారాల్లో ఏడవ అవతార పురుషుడుగా హిందువులకు ఆరాధ్య దైవం.

రాయ్, రాజా రామమోహన్ (1774-1838): ఆధునిక భారతదేశానికి పితామహు దనదగ్గ మహనీయుడు భావాలలో స్వాతంత్ర్యాన్ని, కార్యాల్లో సాహసాన్ని ప్రదర్శించి మనదేశంలో ఇంచుమించు ప్రతి సంస్కరణకు మూలపురుషుడైనాడు. విద్వాంసుడు, బహుభాషావేత్త, సాహిత్యరంగంలో వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలను వెలువ రించాడు. 1828 వ సంవత్సరంలో ఏకేశ్వరోపాసనను ప్రచారం చేయడానికి బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. ఇతడు సాధించిన మహత్తర సంస్కరణ సతీసహగమనాన్ని రద్దు చేయడం.

రావ్ బహదూర్: తమ పరిపాలన కాలంలో బ్రిటీషు ప్రభుత్వం వారు భారతీయులకు ప్రదానం చేసిన అనేక బిరుదులలో ఇది ఒకటి. కొన్ని బిరుదులు జాతులను కూడ సూచించేవి. ఉదాహరణకి ఈ బిరుదు గ్రహీత హిందువుడైతే 'రావ్

బహదూర్', మహమ్మదీయుడైతే "ఖాన్ బహదూర్" అని మార్చేవారు. భారతీయ రాజ్యాంగ చట్టం బిరుదులనన్నిటిని నిషేధించింది.

రెనడె, మహాదేవ్, గోవింద్ (1842-1901):- ప్రతి అభ్యుదయ కార్యక్రమంలో త్రికరణశుద్ధిగ నిరాడంబరంగ సేవచేసిన మనీషి, న్యాయాధిపతిగ వున్నప్పటికి, అఖిలభారత జాతీయ కాంగ్రెసును తెరవెనుక సూత్రధారిగ నడిపించిన నాయకుడు. ఇతని ఉత్తమ ప్రవర్తన ఆదర్శభావాలు అనేకుల్ని ఉత్తేజపరిచాయి. గాంధీజీకి గోఖలే రాజకీయ గురువు అయినట్లు రెనడె గోఖలేకి గురువు.

రెనడె, రమా, శ్రీమతి (1862-1924): తన 11-వ ఏట 32 ఏండ్ల మహాదేవ రెనడేను. పరిణయ మాడింది. అప్పటికే ఆయన విఖ్యాతుడు. బాధ్యతలను అర్థం చేసుకొని తదనుగుణంగ, సంఘ సంస్కరణ కార్యకలాపాలలో తన భర్తకు తోడ్పడింది. భర్త మరణానంతరం అతడు ప్రారంభించిన ఉత్తమ కార్యాల నన్నింటిని కొనసాగించింది. సరళమైన శైలిలో స్వీయ చరిత్రను రచించింది. అది ఉత్తేజకరమైన గ్రంథం.

లక్ష్మణరావు, కొమఱ్ఱాజు, వి. (1877-1923): ప్రజ్ఞావంతుడైన చారిత్రక పరిశోధకుడు. విజ్ఞాన గ్రంథ మండలిని స్థాపించి యెన్నో విజ్ఞానశాస్త్ర గ్రంథాలను, చారిత్రక గ్రంథాలను, జీవిత చరిత్రలను, సాహిత్య గ్రంధాలను ప్రకటించాడు. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని ప్రకటించడానికి పూనుకొని రెండు సంపుటాలను వెలువరించి, 3-వ సంపుటం వ్రాస్తూ అకాలమరణాన్ని పొందాడు.

లక్ష్మీకాంతం, బలిజేపల్లి (1881-1953): నాటకకర్త, నటుడు కూడా. ఇతని నాటకాల్లో "హరిశ్చంద్ర' ప్రజాభిమానాన్ని చూరగొన్న నాటకం. అది ప్రకటింపబడి ఇప్పటికి అర్ధశతాబ్దం దాటినా, ఈనాటికి దానిని రంగస్థలంలో ప్రదర్శిస్తే ప్రేక్షకులు గుంపులుగా వచ్చి చూస్తారు.

వంగదేశ విభజన: ఐక్య వంగరాష్ట్ర ప్రజల్లో పెంపొందుతున్న జాతీయతాభావాన్ని అణచివేసే ఉద్దేశంతో 1905-వ సంవత్సరం, అప్పటి వైస్రాయ్ అయిన కర్జన్ ప్రభువు వంగరాష్ట్రాన్ని రెండు విభిన్న రాష్ట్రాలుగా విభజించాడు. మహమ్మదీయులు అధిక సంఖ్యాకంగ ఉన్న బెంగాలు నొక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరిస్తే దానికి హిందువులు అధికసంఖ్యలో ఉన్న అస్సాం రాష్ట్రానికి మధ్య వైషమ్యాలను కల్పించవచ్చునని తలంచాడు. 1911-వ సంవత్సరంలో వంగదేశ విభజన రద్దుచేయబడింది. అయితే భారతదేశ విభజన సమయంలో (1947) ఈ వంగ రాష్ట్రాన్నే ఇండియా, పాకిస్తానుల మధ్య విభజించారు.

వందేమాతరం, వందేమాతరోద్యమం: 'వందేమాతరం' అంటే "తల్లీ! నీకు వందనం" అని అర్థం. బంకించంద్ర చటర్జీ "ఆనందమఠ" మన్న తన నవలలో వ్రాసిన పాటయిది. కర్జన్ ప్రభువు వంగరాష్ట్రాన్ని రెండుగా విభజించినపుడు, దానిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన జరిపిన జాతీయవాదులు. దేశభక్తులు ఈ పాటను శంఖారావంగ పాడనారంభించారు. అందుచేత ఆ ఉద్యమానికి "వందేమాతర ఉద్యమ" మని పేరు వచ్చింది. స్వతంత్రభారత జాతీయ గీతాలైన రెండింటిలో ఒకటి. వందేమాతరం, రెండవది రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన "జనగణమన" గీతం.

వరాహమిహిరుడు: క్రీ.శ. 5 వ శతాబ్ది ఉత్తరార్ధంలో జీవించిన బహుముఖ ప్రజ్ఞావంతుడైన శాస్త్రజ్ఞుడు. ఖగోళ వాతావరణ శాస్త్ర రంగాలలో ప్రముఖుడు.

వాలా: భారతదేశంలో వ్యక్తుల జన్మస్థలాన్ని లేదా వృత్తిని సూచించడానికి వారి పేర్లకు చేర్చే ప్రత్యయరూపం. ఉదా॥ ఢిల్లీవాలా 'ఢిల్లీవాడు', 'పోలీసువాలా' 'పోలీసు ఉద్యోగి, 'పూట్వాలా' పండ్లమ్మేవాడు.

విద్యాసాగర్, ఈశ్వరచంద్ర (1820-1891): రాజా రామమోహన్ రాయ్ తరువాత చెప్పదగ్గ గొప్ప సంఘసంస్కర్త, మహావిద్వాంసుడు, గొప్ప రచయిత, మార్గ దర్శకుడైన విద్యావేత్త. మానవతయే ఆయన మతం.

విష్ణువు: త్రిమూర్తులలో స్థితికి కారకుడైన దేవుడు. హిందువులు పూజించే దేవతల్లో విష్ణువుకే భక్తుల సంఖ్యాబలం ఎక్కువ ఇతడు దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు ఆయా యుగాల్లో అవతరిస్తాడని నమ్మకం. ఇప్పటికి తొమ్మిది మార్లు అవతరించాడని, పదవ అవతారంగా కల్కీరూపంలో అవతరిస్తారని పురాణాల కథనం.

వెంకటప్పయ్య, కొండా (1866-1949): ప్రఖ్యాత దేశభక్తుడు. జాతీయవాది. గాంధీజీ శిష్యులై నుంచి సంపాదనగల న్యాయవాద వృత్తికి ఉద్వాసన చెప్పి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నాడు. స్త్రీ విద్య, స్త్రీల సంక్షేమ కార్యక్రమాలపట్ల అధిక శ్రద్ధ వహించాడు.

వేంకటరత్నం, నర్ రఘుపతి (1862-1939): గొప్ప విద్యావేత్త, సంఘ సంస్కర్త. మత బోధకుడు వీరేశలింగానికి సమకాలికుడు, కాని వయస్సులో యువకుడు, అనుచరుడు. సమాజంలో అస్పృశ్యుల, పేదల, దేవదాసీల ఉద్ధరణకు ప్రత్యేకంగా పాటుపడ్డవాడు.

వేదాలు: హిందూమతానికి సంబంధించి అతిప్రాచీనమూ, అతి ప్రామాణికమూ అయిన పవిత్ర గ్రంథాలు. అవి అపౌరుషేయాలని నమ్మేవారున్నారు. ఇవి నాలుగు ఋగ్, సామ, యజుర్, అధర్వణ వేదాలు ఈ నాలుగింటిలో ఋగ్వేదం ప్రాచీనమైంది.

వేమన: మధ్యయుగాల్లో వెలసిన తెలుగుకవి యోగి. ఇతని జననకాలాది వివరాలు ఖచ్చితంగా తెలియవు విగ్రహారాధనకు విరోధి, కులభేదాల్ని దుయ్యబట్టినాడు. అధిక ప్రజాదరణ పొందిన తెలుగుకవి. ఐదువేలకు మించిన పద్యాలను నీతి, సమాజం, మతం, వేదాంతం, తత్త్వం మొదలైన వాటిని గురించి వేమన చెప్పాడని అంటారు. బహుశా వాటిలో సగమే వేమన కృతం కావచ్చు.

శంకరాచార్యులు: అద్వైత వేదాంతాన్ని ప్రతిపాదించిన ప్రముఖ తత్వవేత్త ఇతని కాలం బహుశః క్రీ.శ. 8వ శతాబ్ది కావచ్చు. ఇతడు స్థాపించిన మత పీఠాలు "శంకరాచార్య పీఠాలు"గా ప్రసిద్ధి గాంచాయి. ప్రస్తుతం ప్రధానమైన శంకరాచార్య పీఠపంచకాలే కాకుండ కొన్ని చిన్న పీఠాలు కూడ వ్యాప్తిలో వున్నాయి.

శకుంతల: కాళిదాసు రచించిన శాకుంతల నాటకంలో కథానాయిక. తల్లిదండ్రులైన మేనకా విశ్వామిత్రులు వదలిపెట్టిన బిడ్డ. కణ్వ మహర్షి ప్రేమతో పెంచిన బిడ్డ గాంధర్వ విధిలో రహస్యంగా దుష్యంతుని పెళ్లాడింది. రాజైన భర్తకూడ ఆమెను వదలిపెట్టాడు. అనేక కష్టనష్టాల తర్వాత భర్త సమాగమాన్ని పొందుతుంది. వీరి కుమారుడే భరతుడు. అతడు పాలించిన దేశమే భారతదేశం.

శాలిహోత్రుడు: ప్రాచీన భారతీయ పశువైద్య శాస్త్రానికి పితామహుడు అశ్వ సంరక్షణను గూర్చి ఆయన రచించిన గ్రంథానికి "శాలిహోత్ర శాస్త్రం" అని పేరు. అందులో కొంత గజశాస్త్ర భాగం కూడా కద్దు.

శాస్త్రం: విజ్ఞానం, కళ, న్యాయం మొదలైన వాటికి సంబంధించిన ప్రమాణ గ్రంథం. ధర్మశాస్త్రాలు అనేవి న్యాయపాలనకు సంబంధించిన చట్టాలు.

శాస్త్రి, శివనాధ్ (1847-1925): బ్రహ్మ సమాజంతో అత్యంత సన్నిహిత సంబంధం గల ప్రసిద్ధ సాంఘిక మత సంస్కృష్ట 1878లో తన నాయకుడైన కేశవ్ చంద్రతో విడిపోయి సాధారణ బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. బ్రహ్మ సమాజ చరిత్రతోపాటు అనేక గ్రంథాలను, కరపత్రాలను రచించినాడు.

శిరస్తదార్: రెవెన్యూ శాఖలో లేదా కోర్టులో ఒక ఉద్యోగి

శివరాత్రి: మాఘ మాసం (ఫిబ్రవరి మార్చి నెలల మధ్య) కృష్ణ పక్షంలో చతుర్దశి రాత్రి, శివభక్తులు ఆ రోజు పగలంతా ఉపవాసం, రాత్రంతా జాగరణ పాటిస్తారు.

శివుడు: మొదట అనార్యుడైన దేవుడు, త్రిమూర్తుల్ని భావించి నిర్ణయించినపుడు త్రిమూర్తుల్లో శివుడు ఒకడయ్యాడు. బ్రహ్మ సృష్టికారకుడు. విష్ణువు స్థితి కారకుడు. శివుడు లయకారుడు. శైవులు త్రిమూర్తులు కార్య విభజనను అంగీకరించరు. విష్ణు ప్రాధాన్యాన్ని కూడా ఒప్పుకోరు. వారికి శివుడే పరమదైవం. వారి దృష్టిలో త్రిమూర్తుల కార్యాల మూడింటిని నిర్వహించే సర్వేశ్వరుడు శివుడే. శివ శబ్దానికి శుభం, మంగళం అని అర్థం.

శైవులు: హిందువుల్లో ముఖ్యమైన రెండు శాఖల్లో ఒకశాఖకు చెందినవారు. వీరు శివారాధకులు, శ్లేష భారతీయ కవిత్వంలో రెండర్థాల చమత్కారమున్న కవిత, ద్వ్యర్థి రచన.

సతి: మరణించిన భర్తతో సహగమనం చేసే భార్య అని వాచ్యార్థం కాని అనేక సందర్భాలలో బలవంతంగా భర్త కాష్టంపై భార్యను కూడా దహించేవారు. కొన్ని సందర్భాల్లో చనిపోయిన భర్తతోపాటు సజీవ సమాధి చేయడం కూడా కద్దు. రాజా రామమోహన్ రాయ్ చేపట్టిన ఉద్యమ ఫలితంగ 1828లో అమానుషమైన ఈ ఆచారం చట్ట రీత్యా నిషేధింపబడింది. భారత దేశంలో ఈ ఆచారం అన్ని ప్రాంతాలకు అన్ని కులాలకు చెందింది. కాదు, నిమ్నజాతుల్లో ఈ ఆచారం లేదు.

సమాజం: సమూహం, గుంపు, సభ, సంఘం, సంస్థ,

సర్కార్, హేమచంద్ర: ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. సాధారణ బ్రహ్మ సమాజ ప్రచారకుడుగా దక్షిణ భారతదేశమంతా పర్యటించాడు. పాతికేళ్ళ క్రితం మరణించాడు.

సరోజినినాయుడు, శ్రీమతి (1879-1949): కవయిత్రి, దేశభక్తురాలు, మహావక్త, అర్థశతాబ్దం వరకు భారతదేశ రాజకీయాలకు ఉద్వేగాన్ని ఉల్లాసాన్ని కలిగించిన వ్యక్తి శ్రీమతి సరోజిని నాయుడు. అఖిలభారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలుగ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర గవర్నరుగ పదవులను నిర్వహించింది. డాక్టర్ గోవిందరాజులు నాయుడు గారిని వివాహం చేసుకున్నది. ఆమెది వంగ బ్రాహ్మణ వంశం. ఆయన బ్రాహ్మణేతరుడైన ఆంధ్రుడు. ఆ కాలంలో అరుదైన ఈ వర్ణాంతర, రాష్ట్రాంతర వివాహానికి వీరేశలింగం: పౌరోహిత్యం వహించారు.

సుశ్రుతుడు: భారతదేశంలో ప్రాచీనకాలంలో విలసిల్లిన గొప్ప శిష్ట వైద్యుడు. సుక్రుత ఈతంత్రం క్రీ.పూ. 6వ శతాబ్దంలో రచింపబడింది.

సూరన, పింగళి: క్రీ.శ. పదారవ శతాబ్ది ఉత్తరభాగంలో వెలసిన మహాకవి. ఇతడు రచించిన మూడు కృతుల్లో అమూలకమైన స్వతంత్ర కథకు, అపూర్వమైన పాత్రకల్పనకు కళాపూర్ణోదయం ప్రసిద్ధి పొందింది. ఇతని రాఘన పాండవీయ మనే ద్వ్యర్థికావ్యాన్ని ఒక రకంగా చదివితే రామాయణ కథ, మరొకరకంగా చదివితే భారత కథ స్ఫురిస్తుంది.

సేన్, కేశవ్ చంద్ర (1838-1884): బ్రహ్మసమాజానికి మూలస్తంభం వంటి వాడు. శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసే నక్షత్రానికి, ఆకట్టుకొనే వ్యక్తిత్వానికి సేన్ పేరుపొందినవాడు. తన గురువైన దేవేంద్రనాధ్ ఠాగూర్తో భేదాభిప్రాయాలు కలగడం వల్ల 'నబబిరాన్' అన్న శాఖను స్థాపించి బ్రహ్మసమాజంలో చీలికకు కారకుడయ్యాడు. శివనాథ శాస్త్రితో సహా తన అనుచరుల్లో కొందరు సేన్తో వ్యతిరేకించి సాధారణ బ్రహ్మ సమాజాన్ని స్థాపించినపుడు బ్రహ్మ సమాజంలో మరొక చీలిక ఏర్పడ్డది.

హరుడు: ప్రసిద్ధులైన భారతదేశ చక్రవర్తులలో చివరివాడు 7-వ శతాబ్దిలో వెలసినవారు. ఇతని ఆస్థాన కవియైన బాణుడు తన హర్ష చరిత్రలో ఈ మహారాజు కీర్తిని అభివర్ణించాడు. బాణుని వర్ణనల్లోని యధార్థాలకు, చీనా దేశయాత్రికుడైన హుయాన్ త్సాంగ్ రచన సాక్ష్యం మహాకవి, నాటకకర్త అయిన హరుడు రత్నావళి, ప్రియదర్శిక, నాగానందం అనే మూడు నాటకాలను రచించాడు.
హిందూ పత్రిక: మద్రాసు నుండి ఇంగ్లీషులో ప్రచురింపబడుతూ, అంతర్జాతీయ ప్రసిద్ధిపొందిన జాతీయ దిన పత్రిక 1878లో వారపత్రికగ ఆరంభమయి, 1883లో వారపత్రికగా మారి, 1889లో దినపత్రిక అయింది. ఈ పత్రికకు తొలి సంపాదకులైన జి. సుబ్రహ్మణ్య అయ్యరు, కస్తూరిరంగ అయ్యంగారలు వేసిన గట్టి పునాదులే, ఇది విజయవంతంగా నడవడానికి కారణం.


హితోపదేశం: ఇది సంస్కృతంలో కొన్ని కథల సంకలనం. దీనికి పూర్వం వెలసిన పంచ తంత్రమే హితోపదేశానికి ఆధారం. ఎ.ఎ. మ్యాక్ డొనల్ (A.A. Mac Donell) ఇలా అన్నాడు. "హితోపదేశకర్త ఎవరన్నది వివాదాస్పదం, ఇది 500 సంవత్సరాల క్రితం రచింపబడి వుంటుందని మాత్రమే చెప్పగలం అంతకుమించి దీని కాలాన్ని గురించి తెలియదు. క్రీ.శ. 1373లో లభించిన వ్రాతప్రతియే తెలిసినంతవరకు ప్రాచీనమైనది. హితోపదేశమంటే సముచితమైన సలహా అని అర్ధం.

# భారతీయ సాహిత్య నిర్మాతలు

# గురజాడ

**వి. ఆర్. నార్ల**

అనువాదం: కేతు విశ్వనాథ రెడ్డి



సమర్పితం
కృష్ణ కృపాలానీ కి
ప్రేమ, గౌరవంతో

కృతజ్ఞత

గురజాడ డైరీలనూ, నోటు పుస్తకాలనూ యిచ్చిన విశాలాంధ్ర ప్రచురణా లయం (విజయవాడ) వారికి
మొదటి నాలుగు అధ్యాయాల టైపు ప్రతిని చదివి, కొన్ని విలువైన సూచనలను అందజేసిన సి.యస్.ఆర్. శాస్త్రి (బొంబాయి) గారికి రాతప్రతి ప్రెస్ కాపీ సిద్ధం చేయడంలో తోడ్పడిన ఉస్మానియా విశ్వవిద్యాలయం (హైదరాబాదు) ఆంగ్ల భాషాచార్యులు డాక్టర్ ఐజాక్ సెక్విరా గారికీ

గురజాడ పద్యాలకూ, గేయాలకూ తాము చేసిన ఆంగ్లానువాదాలను పుల్లేఖించుకోడానికి అనుమతి నిచ్చిన శ్రీశ్రీ. ఆచంట జానకిరామ్ గార్లకూ, తాము చేసిన నాలుగు వాక్యాల అనువాదాన్ని ఉల్లేఖించుకోడానికి అనుమతి నిచ్చిన ఆర్. అప్పులస్వామి గారికి

నా గ్రంథ పరిసమాప్తి కోసం ఉదారమైన ఓర్పు వహించి నిరీక్షించిన సాహిత్య అకాదెమి (న్యూఢిల్లీ) కార్యదర్శులకూ

ప్రూఫులు చూసిన ప్రముఖ పాత్రికేయులూ, గ్రంథకర్త అయిన డి. ఆంజనేయులు గారికి గురజాడ రేఖాచిత్ర ప్రతిని వాడుకోడానికి అనుమతి నిచ్చిన అబ్బూరి గోపాలకృష్ణ గారికీ

నా రాతప్రతిని టైపుచేసి, మళ్ళీ మళ్ళీ టైపుచేసి, ఇతరత్రా చాలా విధాల తోడ్పడిన శ్రీ జి.యం. రాములుకూ

నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ముఖ పత్ర రచన: సత్యజిత్ రాయ్
ముఖరేఖా చిత్రం: అబ్బూరి గోపాలకృష్ణ (యూనిలీట్ సౌజన్యంతో)

## జీవన ద్వారం

### "మృత్యువు జీవనద్వారం"

పి.జె. బెయిలీ బాధ్యతలున్నందువల్ల మరి కొంతకాలం జీవించాలని ఆశపడ్డారు.

- 1915 నవంబరు 30వ తేదీ; రవి ఉదయాకాశాన్ని అధిరోహిస్తోంటే, ఒక కవి విజయనగరంలోని తమ ఇంట్లో అస్తమిస్తున్నాడు. గాలిలో శైత్యం - శీతాకాలపు తొలినాళ్ళ శైతల్యమూ, మీద పడబోతున్న మృత్యు శైతల్యమూ.!

తన పరిస్థితి యెంత తీవ్రంగా ఉండేదీ, గ్రాహ్యశక్తులు యెప్పటిలాగే అప్పుడు నిశితంగావున్న కవికి తెలుసు. ఆ మధ్యచేసిన తీవ్రమైన సుస్తీ నుంచీ ఆయన ఇంకా సరిగా కోలుకోనేలేదు. ఇప్పుడిది ముంచుకొచ్చిపడింది. ఏప్రిల్ నెలలో జీవన్మరణాల మధ్య ఊగిసలాడుతూ, తన 'హంసగీత'మని ఉద్దేశించిన దాన్ని ఆయన రచించారు. దానికి సార్థకమైన పేరు పెట్టారు - 'లంగరెత్తుము' అని, తన డాక్టర్ల గట్టి వైద్యమూ, ఇంట్లో వాళ్ళు కంటి పాపలా చూసుకొంటూ చేసిన సపర్యలూ, లేకపోయి ఉండినట్లయితే, అప్పుడే ఆయన లంగరెత్తి ఉండేవారు; తెలియని తీరాల్లోకి పయనించివుండేవారు.

ఇప్పుడు పుంజుకొనే జవసత్వాలు ఉడిగిపొయ్యాయి. ఎవరూ ఆయనను రక్షించలేరు. ఇక ఆయన అలసించడానికి లేదు. అయినా నిర్వర్తింపవలసిన బాధ్యత లెంత కష్టతరమైనప్పటికీ, వాటిని నెరవేర్చడంలో ఆయన అంతే చిత్తశుద్ధితో వ్యవహరించేవారు. ప్రవృత్తిలోని ఈ లక్షణమే ఇప్పటి ప్రమాదకరమైన పరిస్థితికి దోహదమైంది. 1897లో అర్ధాయుష్కుడుగా మరణించిన తమ ప్రభువూ, పోషకుడూ, అయిన విజయనగర మహారాజా ఆనంద గజపతి కిచ్చిన

మాటను నిలబెట్టుకోడానికి కోర్టు తగాదాల్లో పదిహేనేళ్ళు ఆయన గడపవలసి వచ్చింది. పుడుతూనే బీకి చీకిగా పుట్టి, ఎప్పుడూ అనారోగ్యానికి గురి అవుతున్న ఆయనను ఇన్నేళ్ళ బరువు బాధ్యతలూ మరింత కృంగదీశాయి. బిడ్డలులేని ఆనంద గజపతి దత్తపుత్రుడు విజయ రామరాజుకు వ్యతిరేకంగా జిల్లా కోర్టు తీర్పు వచ్చిన సందర్భంలో సైతం ఆయన చలించలేదు. ఆయనకున్నంత చిత్తశుద్ధి, విధేయతా, లేనివాడెవడైనా కంగుతిని ఉండేవాడు. హైకోర్టు తీర్పు అనుకూలంగా వచ్చే అవకాశాలు అంతగా లేవని తెలిసిపోతూనే, వివేకంతో ఆయన రాజీ చేయించారు. దాంతో వారసత్వం చెక్కుచెదరలేదు. కీర్తిశేషులైన మహారాజావారి కిచ్చిన మాట నిలబెట్టు కోవడంలో ఆ విధంగా ఆయన తలమునక లవుతూ, ప్రథమంగా సాహిత్య జీవి అయిన తాను, చేయాలనుకొన్న వాటిని తప్పనిసరై ఉపేక్షింప వలసివచ్చింది. తన నిజమైన ప్రతిభకూ, చైతన్యానికీ న్యాయం చేకూర్చలేకపోయానని ఇందుకాయన పరితపించారు. ఈ భావం వెన్నాడడం వల్లనే పదేపదే సాహిత్య కృషిని ఆయన చేపట్టేవారు. అంతలోనే ప్రతి తరుణంలోనూ ఆ కృషిని ఆయన వదలి వేయవలసి వచ్చింది. సాహిత్యం, పోటీ ప్రేమాభిమానాలను సయించని దురభిమానవతి అయిన అర్ధాంగి లాటిదని ఆయన గ్రహించి, విజయనగర సంస్థానం నుంచీ ఎప్పుడు పదవీ విరమణ చేద్దామా అని ఆత్రంతో ఎదురుచూస్తూ ఉండేవారు.

ఆయన కోరిక చివరకు నెరవేరింది. 1913 ఫిబ్రవరి 12వ తేదీనాడు సంస్థానాధికారులు ప్రత్యేకంగా తగిన జీవిత భృతినిచ్చి, పదవీ విరమణ చేయడానికి ఆయనకు అనుమతిని ఇచ్చారు. ఇతర విధాల కూడా వారు ఔదార్యం చూపించారు. గత ఎన్నో ఏండ్లుగా నామమాత్రం అద్దె చెల్లిస్తూ ఉంటున్న ఇంటిని, వారు ఆయనకు ఉచితంగా ఇచ్చివేశారు. దాన్ని బాగుచేసుకోడానికి కూడా తోడ్పడ్డారు. సొంత గ్రంథాగారాన్ని ఏర్పాటు చేసుకొనేందుకు, పాత ఇంటికి ఒక వాటాను కవి అదనంగా అమర్చుకొన్నారు. ఎన్నో ఏండ్లుగా ఆపేక్షతో సేకరించిన పుస్తకాల మధ్య కూర్చొని సాహిత్య పథకాలకు సంబంధించిన కృషిని కొనసాగించగలిగారు. ముందు ముందు ఉపయోగపడవచ్చునని, అపుడపుడు తనలో మెదిలో ఆలోచనలనూ, బహుముఖమైన తన అనుభవాలనూ, ఆయా ప్రదేశాలమీద కలిగిన తన అభిప్రాయాలనూ, జీవితమూ, సాహిత్యమూ గురించిన తన భావాలనూ, మానవునికీ, మానవ ప్రకృతికీ, మానవ భవిష్యత్తుకూ సంబంధించిన అవగాహనలనూ, నమోదు చేస్తూనే వస్తున్నారు. నైగనిగ్యంతో తనను ఆకట్టుకున్న ప్రతి చతురోక్తి మెరుపునూ, ప్రతి చమత్కారాన్నీ, ప్రతి వాజస్తుతినీ, ప్రతి వ్యంగ్యోక్తినీ, ఆకర్షణతో, వాడీవేడితో తనను ఆశ్చర్య చకితున్ని చేసిన వాడుక భాష యొక్క ప్రతి విలక్షణమైన అంశాన్నీ, నాజూకునూ, రాసిపెట్టుకుంటూనే ఉన్నారు. ఈ విధమైన సంపదతో ఆయన డైరీలూ, నోటు పుస్తకాలూ, నిండిపోయాయి. ఆ కారణం వల్లనే ఆయన శీఘ్రంగా, ఫలప్రదంగా పనిచేయగలిగారు. ఆయన ఊహలో పుట్టిన అనేక పాత్రలు తమ పాత్రల్ని నటించి, తమ ఆత్మల్ని వెల్లడించి, తమ భవితవ్యాలను సాధించవచ్చునని వెలికి ఉరకడానికి ఆరాటపడు తున్నాయి. దీనికి తోడు, కళింగ చరిత్రకోసం సమకూర్చుకున్న శాసనాది విషయ సంపద - ఎన్నో దశాబ్దాలుగా పెట్టెల్లో బంధింపబడింది - బయటకు ఎప్పుడు వద్దామా అని ఆవేదన పడుతోంది. ఇంతకంటే దయనీయమైంది. వాడుక భాష ఆక్రందన. వాడుక భాషను దానికి న్యాయంగా చెల్లవలసిన సాహిత్య సామ్రాజ్య సింహాసనం మీద అధిష్టింప జేయాలనే సంకల్పంతో యుద్ధం చేస్తున్న ఆయన, దాన్ని ఛాందస పండిత శత్రువులు నోరు నొక్కి నలిపి వెయ్యడానికి ఎలా వదిలివేస్తారు? అవును ఆయన చేయవలసింది ఎంతోవుంది. ఒక పదేళ్ళు లేదా కనీసం అయిదేళ్ళువున్నా, చాలా భాగం పూర్తిచేసి ఉండేవారు.

అది కుదరలేదు. మరీ తొందరగా మృత్యువు ఆయనను చుట్టుముడుతుంది. తనను చేరడానికి అది మెట్లెక్కివస్తోంటే దాని అడుగుల సవసవలు ఆయన వినగలుగుతున్నారు. ఏ క్షణంలో అయినా ఇప్పుడది ఆయనను కబళించవచ్చు. మృత్యువు దుర్వారమైంది. అయితే మృత్యువు వాత పడక ముందు, కడసారి జీవితానందం అనుభవించాలని ఆయనకు బుద్ధి పుట్టింది. పడక గది తలుపులు, కిటికీలు తెరవండి, యెండి వరుగయిపోయిన ఆయన ఒంటి మీదుండే యిజారూ, శాలవాలూ విప్పండి. మిలమిలలాడే సూర్యకిరణాలు ఆయనను ముద్దు పెట్టుకోనివ్వండి. చల్లటి పొద్దుటిగాలి ఆయనను

లాలించనివ్వండి. ఎవరో ఒకరు ఆయనకు ప్రీతి పాత్రమైన వైనునూ, కంకెడు తాంబూలాన్నీ తెండి; కవిగారి కుమారుడు కుటుంబ వైద్యుడి వైపు బిత్తరపోయి చూస్తాడు. దిగులుగానే వైద్యుడు అంగీకార సూచకంగా తల ఆడిస్తాడు. మద్యం తేవడమైంది. చివరి బొట్టు దాకా కవి దాన్ని ఖాళీ చేస్తారు. తాంబూళం కూడా తెచ్చి ఇవ్వడం జరిగింది. ఆనందంగా కవి దాన్ని నములుతారు. సంతోషంగా గడిపిన రోజుల వేలాది స్మృతులు ఆయనలో ఉన్నట్లుండి కదలాడుతాయి. పాలిపోయిన ఆయన ముఖం ఒక అలౌకికమైన కాంతితో కళకళలాడుతుంది. అన్ని బరువు బాధ్యతలూ, అన్ని ఆందోళనలూ కడకు తీవ్రమైన అస్వస్థత బాధలూ ఆయనకు దూరమవుతాయి. ఆయనలోని కొంటెతనం మళ్ళీ పుంజుకుంది. వైద్యునివైపు తిరిగి కొంటెచూపు చూస్తూ అంటారు కదా: "డాక్టరుగారూ! నేను బతికానా ఆహార విజ్ఞానం మీద పుస్తకం రాస్తాను. చాలాకాలం మీరెంతో గట్టిగా పథ్యం పెట్టి ఆ విషయం మీద నన్ను 'అథారిటీ' చేశారు". పరిహాసం ముగించారో లేదో, మృత్యువు లోపలికి అడుగుపెడుతుంది. స్థానిక పత్రికా విలేఖరులు దగ్గర్లోవుండే టెలిగ్రాపు ఆఫీసుకు వెళ్ళి తంతి ద్వారా దుఃఖవార్తను పంపుతారు: "కవి గురజాడ వేంకట అప్పారావు మరణించారు" అని.

అయితే నిజంగా ఆయన మరణించారా? లేదు. ఆయనకు మృత్యువు "జీవన ద్వారం", తద్వారా మరింత విస్తృతమైన, మరింత సత్యమైన, మరింత శక్తివంతమైన జీవితంలోకి నిష్క్రమించారు. జీవించివున్న రోజుల్లో తెలుగు సాహిత్యంలో అగ్రగామిగా ఆయన ప్రభావం అతిస్వల్పం. దాదాపు తృణప్రాయం. అభిమాని ఒకడువుంటే, అప్రతిష్టపాలు చేసేవాళ్ళు కొల్లలు కొల్లలు. మరీ తప్పులు పట్టని వాళ్ళు ఆయనను అధ్వాన్నమైన కవిత్వావగాహనా, అంతకంటే అధ్వాన్నమైన పాండిత్యమూ ఉండే మిడిమిడి కళాభిమాని అన్నారు. తక్కిన వాళ్ళు బూటకపు మనిషి అని ముద్రవేశారు. ఆయన గొప్ప నాటకం 'కన్యాశుల్కం' కూడా వాళ్ళ ఆక్షేపణల నుంచి పూర్తిగా తప్పించుకోలేదు. చతురోక్తి, చమత్కారమూ, శక్తి, చురుకుదనమూ అనే సుగుణాలు ఉన్నాయని ఒకవైపు ఒప్పుకుంటూనే, 'కన్యాశుల్కం'లోని అభిరుచినీ, నైతిక దృష్టినీ వాళ్ళు శంకించారు. సృజనాత్మక సాహిత్య భాషగా వాడుక భాష ఉండాలనే గురజాడ వాదం, ఆయన కవిత్వం కంటే, నాటకం కంటే కూడా వాళ్ళను ఒళ్ళు మండింపజేసింది. బజారు భాష, పొలాల భాష, ఫ్యాక్టరీల భాష, రోజువారీ బతుకులోని మొరటైన అడ్డదిడ్డపు భాష, అధిష్టాన దేవత, సాహిత్యాది సమస్త కళల మూర్తిమత్వమైన సరస్వతి ఆరాధనకు ఎలా అర్హమవుతుంది? అది అపస్వరాలతో ఆమె సున్నితమైన శ్రవణేంద్రియాలను కష్టపెట్టదా; ఆ పాడు పచ్చిపచ్చి మాటలతో అది ఆమె సుతిమెత్తని మనస్సును బాధపెట్టదా అని వాళ్ళు గర్జించారు. తాను అర్ధచదువు మనిషి కాబట్టి, అర్ధచదువుగాళ్ళ భాష అయిన వాడుక భాష తరపున పోరాడుతున్నాడని వాళ్ళ గట్టి నమ్మకం.

గురజాడపట్ల ఛాందస పండితుల ప్రచండ వ్యతిరేకత ఆశ్చర్యాన్ని కలిగించ నవసరంలేదు. ఎందుకంటే అన్నిట్లోనూ ఆయన వాళ్ళకు విరుద్ధమే. అయితే ఆయన జీవితకాలంలో కొద్దిమంది అభిమానులైనా, ఆయన అడుగుజాడల్లో ఎందుకు నడవటానికి సిద్ధపడలేదనేది ఎవరికైనా ఆశ్చర్యపరుస్తుంది. వాళ్ళెవరు కానీ వాడుక భాషలో నాటకాలు రాయలేదు. ఆయన ఆవిష్కరించిన కొత్త ఛందస్సులో గీతాలను రచించలేదు. తెలుగు సాహిత్యానికి ప్రప్రథమంగా ఆయన ప్రసాదించిన కథానికపట్ల తగిన శ్రద్ధనూ చూపలేదు. తన కాలానికంటే ఆయన చాలా ముందుండడమే దీనికి ఒక కారణం కావచ్చు. ఆయన రచనలు రాశిలో పెద్దగా లేకపోవడం రెండో కారణం కావచ్చు.

ఒక పూర్తినాటకం, రెండు అసంపూర్ణమైన నాటకాలు, అయిదు కథానికలు (అందులో ఒకటి ఆంగ్లంలో), ఒక చిన్న పద్య గేయ గుచ్ఛం, ఒక చిరు వ్యాస గుచ్ఛం అన్నీ దాదాపు అంతే. కన్యాశుల్కం, నీలగిరి పాటలు మినహాయిస్తే ఇతర రచనలు స్వల్పపరిమాణంలో ఉండేవి కూడా, ఆయన జీవితకాలంలో గ్రంథ రూపంలో వెలువడలేదు. వాడుక భాషలోనే రాయాలనే ఆయన పట్టుదల కారణంగా ఆనాటి ప్రముఖ పత్రికలు గురజాడ రచనలను ప్రచురించడానికి విముఖత చూపాయి.

మొత్తం రాయడమే అంత తక్కువగా ఉన్నప్పుడు, ఆ తక్కువగా రాసిన రచనలకు సైతం ' విస్తృతమైన ప్రచారం నిరాకరింపబడినప్పుడు ఆయన ప్రభావం తక్కువగా తప్ప మరొక రకంగా ఎలా ఉంటుంది? ఏమైనా, ఆయన మరణించిన చాలా కాలానికి తప్ప, గురజాడ ప్రభావం ఆదున జీవించివున్న రోజుల్లో సువ్యక్తం కాలేదనేది అనివార్యమైన సత్యం. ఆదిలో చిన్న ధారగా ఉండిన గురజాడ ప్రభావం ప్రారంభంలో నెమ్మదిగా, ఆ తర్వాత వేగంగా, పెరిగి పెద్దదై, రానురాను పరవళ్ళు తొక్కే ఒక మహా ప్రవాహంలాగా అయింది. ముప్పయిల నుంచీ, కొందరు వులిపి కట్టెలూ, పెడకట్టెలు తప్పిస్తే, తెలిసో తెలియకో ఆ మంత్ర ప్రభావం కిందికి రాని తెలుగు రచయిత అంటూలేడు. ఆధునిక తెలుగు రచయితలలో కెల్లా ఆయన అత్యధిక ప్రశంసనీయులు. చర్చనీయులు, ఆదర్శప్రాయులు. ఆయన వదలి పెట్టిపోయిన ప్రతి చిత్తునూ, సేకరించడం, పాఠాంతరాలను సరిచూడడం, పరిష్కరించడం, ప్రచురించడం జరుగుతోంది. ఆయనను మార్గదర్శకునిగా పేర్కొంటూ పద్యాలూ, పాటలూ, ప్రస్తుతులూ, విమర్శలూ, వ్యాసాలు, జీవిత చరిత్రలూ వెలువడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి పట్టణంలోనే కాకుండా, ఆంధ్రులుండే ప్రతి రాష్ట్రతర కేంద్రంలోనూ, గురజాడ శతజయంతి 1962లో ప్రేమతో, భక్తితో జరిగింది. తాము అభ్యుదయ రచయితలమని సగర్వంగా చెప్పుకొనే వాళ్ళు గురజాడమీద భక్తి పారవశ్యంతో తబ్బిబ్బై, ఆయనను తమ సాహిత్యారాధనలో కీలకమైన వ్యక్తిగా చేశారు. సాంప్రదాయవాదులు కూడా ఆయనను హేళనతో కొట్టి పారవేయడం మానుకున్నారు. అలాంటప్పుడు గురజాడ విషయంలో మృత్యువు జీవన ద్వారం కాదనటానికి ఎవరు సాహసిస్తారు!

## ఉల్లాస జీవి

'స్వాగతం నీకు ఉల్లాస జీవీ' - ఎ.బి. షెల్లీ

మేధావిగా, భాషా విజ్ఞానవేత్తగా, కవిగా, నాటక రచయితగా, అన్నిటికిమించి ఒక ద్రష్టగా గురజాడ అప్పారావు పంతులు తన కాలానికంటే ముందుండడమే కాదు; పుట్టడం కూడా ముందే. నెలలు నిండకుండానే, ఏడో నెలలో 1862 సెప్టెంబరు 21వ తేదీ ఆయన జన్మించారు. ' ఈ తొందరపాటుకు, ఈ వురవడికి ఆయన నిజంగానే అధికమూల్యం చెల్లింపవలసి వచ్చింది. వోల్టేర్ వృద్ధాప్యంలో "చాలా పీలగా ఎముకల గూడులా" "మనిషిలాగా కన్నా ఈకలు పీకిన కోడిలా" కన్పించేవాడట! అప్పారావు తన జీవితంలోని ఏ దశలోనూ అంతకంటే మెరుగ్గాలేరు. పసిబిడ్డగా ఉన్నప్పుడు గానీ, కుర్రవాడుగా ఉన్నప్పుడు కానీ, యువకుడుగా కూడా ఉన్నప్పుడు కానీ ఆయనిది దిట్టమైన ఆరోగ్యం కాదు. వయోజన జీవిత పర్యంతం ఆయన దాదాపు జబ్బు మనిషే,

మరణాంతకమైన జబ్బుకు ఏడెనిమిది నెలల ముందు తన శారీరక రుగ్మతలను గురించిన ఒక సుదీర్ఘమయిన నివేదికను, యావజ్జీవిత మిత్రుడూ, వివిధ సాహిత్య యుద్ధాలలో ధీర సహయోధుడూ అయిన గిడుగు వెంకట రామమూర్తికి అప్పారావు పంపారు. ఆ నివేదిక ప్రకారం జీవితపు చివరి క్షణాల్లో అప్పారావు బరువు 73 పౌండ్లకు మించిలేదు. ఇరవై యేండ్ల క్రితం ఆ బరువు కేవలం 81 పౌండ్లు, 84 పౌండ్ల మధ్య ఉండేది. అమిత అల్పకాయుడుగా, అమిత దుర్బలుడుగా ఉండడంవల్ల, వాతావరణంలో ఏ మార్పు వచ్చినా - ముఖ్యంగా శీత ఎక్కువ తలకిందులు చేసేది. అందువల్ల ఆయన నిరంతరం జాగ్రత్తగా ఉండవలసి వచ్చింది. ఇంట్లోనే ఉన్నప్పుడు సైతం, ఉన్ని దుస్తులు ఒక దానిమీద ఒకటి ధరించాలి. నడుస్తున్నా, గుర్రపు బండిలో షికారుకు వెళ్ళినా గాలి తగలకుండా గొడుగు పట్టుకోవాలి. పర్వత స్థావరాల్లో గడిపేటప్పుడు ఆయన మాటలోనే చెప్పాలంటే, తాను "షర్టుమీద షర్టు, కోటుమీద కోటు" వేసుకుంటారు. యెరాస్మస్ కూ, గోధకూ (ఇద్దరూ గురజాడకంటే ఎంతో గొప్ప ప్రతిభా సంపన్నులు, ప్రఖ్యాత వ్యక్తులు) కూడా చలిగాలులంటే బొత్తిగా పడేవి కాదని స్టీఫెన్ జింగ్ రాసింది మనకు తెలుసు.

యెరాస్మసను గురించి తెల్పుతూ జ్విగ్ ఇలా అంటారు: "చలిగాలి ఏమాత్రం తగిలినా పిప్పిపంటి మీద మంచుగడ్డ పెట్టినట్లు సున్నితమైన ఆయన శరీర తత్వం మీద పనిచేసేది". జర్మన్ మహాకవిని గురించి మనకు తెల్పుతారు కదా: "గోథ అరవయ్యోపడిలో లావుకావడం మొదలు పెట్టారు. చలిగాలులంటే కంపర మెత్తిపోయి, చలికాలంలో శరీరానికి శుభ్రమైన గాలి బొత్తిగా తగలకుండా జాగ్రత్తపడేవారు". అప్పారావు విషయం మరింత అన్యాయం. ఎనభైయేళ్ళు జీవించి, డెబ్బయి యేళ్ళ తర్వాత, ఆయన అత్యుత్తమ రచనలలో కొన్నిటిని రచించిన గోథలాకాదు;

అప్పారావు యాభై మూడవ యేట మరణించారు. తన జీవితకాలంలో అత్యధిక భాగం ప్రతి రుతువులోనూ, రాత్రింబవళ్ళు ఆయనే వర్ణించినట్లు "వాతావరణ పరిస్థితులను బట్టి శాలువానో, శాలువాలో, టోపీలో, కోటో, యిజార్లో" ఎంతో ప్రయాసపడి సర్దుకోవలసి వచ్చేది.

అంతమాత్రమే కాదు. ఆయన నరాలూ, పేగులూ మహాసున్నితమైనవి. ఆయన జీవితకాలంలో అధికభాగం అవి ఆయనను హింసించాయి. తర్వాత సన్నిహితమైన మిత్రుని దృష్టికి తేవడం కోసమే నివేదికను రాస్తున్నాడు కాబట్టి, అన్ని సంగతులూ మిత్రుని ముందుంచడానికి గురజాడ సందేహపడలేదు. కాబట్టే ఇలా రాస్తూ వెళ్ళారు:

"స్త్రీ సుఖం తర్వాత మనసు తీవ్రమైన భావోద్రేకానికి గురి అయ్యేది. నిద్రవచ్చేది కాదు. ఒక్కొక్కప్పుడు చంకలో నరాలు లాగేవి. నిద్రరాని జబ్బు ఉండేది. అయితే కాఫీ తాగడం మూర్ఖంగా కొనసాగించాను. కాలేజీలో లెక్చరరుగా ఉండేవాణ్ణి. ఎక్కువగా చదవడం అలవాటైంది. కేవలం యాంత్రికంగా ఏం చదివినా కూడా మనస్సు అలసిపొయ్యేది. నాలుగడుగుల (సైతం) నడవలేకపోయేవాణ్ణి".

అయినా, ఆయనమీద సమకాలికులకు మొత్తం మీద కలిగిన అభిప్రాయం ఏమిటంటే ఆయన ఎప్పుడూ ముక్కుతూ, మూల్గుతూవుండే రోగిష్టి మనిషి అనీ, దిగులు దిగులుగా కన్పించే మనిషీ అనీ కాదు; ఆయన ఆనందంగా పాటలు పాడే కోయిల, గంతులువేసే గుర్రం పిల్ల; తుళ్ళి తుళ్ళి పడేవారు. వసంత మధ్యంలోని ఉదయం అని. శరీరంపై ఆత్మశక్తి విజయానికి ఇది ఉదాహరణ. ఆయన ఆత్మశక్తి ఎంత ఉల్లాస పూరితమైనదంటే ప్రకృతిలోని అందాలన్నిటినీ ఆస్వాదించడానికీ, జీవితపు సంతోషాలన్నిటినీ చవి చూడటానికీ, మానవజాతి కళలన్నిటిలోనూ ఆనందించడానికీ, ఏదీ ఆయనను అడ్డుకోలేదు. ఎంత జబ్బుగావున్నా, చమత్కార సన్నివేశంలో కడుపుబ్బ నవ్వకుండా మానరు. తన కష్టాలూ కడగండ్లు తడిసి మోపెడైనా, వినోదాత్మకమైన పరిహాసమో, చతురోక్తో, అతికినట్లు మాటకు మాటో, విసరకుండా ఉండరు. వెల్లువ వచ్చిన నదిలా, ప్రతి అవరోధాన్ని ఆయన ఆత్మశక్తి ముంచెత్తుతుంది.

అటువంటి ఒక అవరోధం, చిన్ననాటి పేదరికం. నిజమే, మానం కాపాడుకోడానికి చింపిరి గుడ్డలు కట్టుకొని ఏదో గుడిసెలో ఆయన పెరగలేదు. పస్తులు ఉండలేదు.
కానీ పుట్టినప్పుడూ, ఆ తర్వాత చాలా యేళ్ళూ, ఆయన తల్లిదండ్రులు దారిద్ర్యరేఖకు పెద్దగా మించిలేరు. ఈ దశ అంతటా ఆయన తండ్రి వెంకట రామదాసు విజయనగర సంస్థానంలో ఉద్యోగం చేస్తున్నా, ఒక పేష్కారు మాత్రమే ఈ క్రింది స్థాయి రెవెన్యూ ఉద్యోగి అన్నమాట. ఆయన తండ్రి పరిమితాదాయం కారణం కావచ్చు తండ్రి ఉద్యోగం చేసే కుమరాం అనే పల్లెటూళ్ళో బడిగానీ, ప్రైవేటు ట్యూటరుగానీ లేకపోవడం నిస్సందేహంగా కారణమే - అప్పారావు బాల్యంలో జన్మస్థలమైన

రాయవరంలో - కొంత స్థితిపరులైన తాతగారింట్లో గడపవలసి వచ్చింది. ఇక్కడే ఆయన తన తొలి పాఠాలను నేర్చుకొన్నారు. తొలి చిలిపి పనులు చేశారు. తొలినాటి స్నేహాలు చేసుకొన్నారు. ఉల్లాసంగా గడిపారు.

ఐతే వెంటనే రంగం మారింది. రామదాసు ఏళ్ళతరబడి మితవ్యయం చేస్తూ ఆదాచేసి గులివిందాడలో యిల్లూ, కొంత పొలమూ, కొనుక్కోగలిగారు. అక్కడ ఆయన కుటుంబం స్థిరపడింది. అందువల్ల అప్పారావు గులివిందాడలో వొక ప్రైవేటు ట్యూటరు దగ్గర చదువుకొన సాగించడానికి రాయవరం వదలవలసి వచ్చింది. ఆ ట్యూటరు గురజాడకు తెలుగు, సంస్కృతం, ఆంగ్లం బోధించారు. మంచి పండితుడు కావడంవల్ల ఆ ట్యూటరు అప్పారావులో భాషలపట్ల అభిమానాన్ని రేకెత్తించగలిగారు. ఏళ్ళు గడిచాక, ఆ అభిమానం గాఢమైన ప్రేమావేశంగా రూపొందింది.

రెండేండ్లు గడిచాయో లేదో మళ్ళీ రంగం మారింది. రామదాసు బదిలీ అయిన చీపురుపల్లి గులివిందాడలా కాదు, చిన్న పట్టణం. అక్కడ ఒక ప్రాథమిక పాఠశాల ఉంది. అప్పారావును ఆ పాఠశాలలో చేర్చారు. పాఠశాలలోని పిల్లలందరి లోనూ, ఆయన అత్యంత అల్పకాయుడు. బాగా తెలివిగలవాడు. అతి చిలిపి కుర్రవాడు. తరగతి గదిలో కూర్చొని రహస్యంగా తమ ఉపాధ్యాయుల వ్యంగ్య రేఖా చిత్రాలను గీసేవాడు. తరగతి బయట చక్కగా వాళ్ళ విలక్షణ స్వభావాలను అనుకరించేవాడు. వారాంతాల్లో ఎగిరేవాడు వీధుల్లో కుప్పిగంతులేసేవాడు; పొలాలు చక్కర్లు కొట్టేవారు. నాన్న వూళ్ళో లేనప్పుడు, ఇంకాస్త దూరం పోయేవాడు. పండ్ల తోటల మీద చేసే దాడులకు నాయకత్వం వహించేవాడు. ఆనందకోలాహంతో వర్షఋతువు తొలివానల్లో పరుగులు తీసేవాడు. వాన నీళ్ళకు కాలువలు కడతాడు. నీళ్ళు నిండి పారేటట్లు కాలువలకు అడ్డుకట్ట లేస్తాడు. నీళ్ళను లొంగదీసుకున్నందుకు మురిసిపోతాడు. దేశదిమ్మరులు, ఎరుకలవాళ్ళు, గారడీవాళ్ళు, దొమ్మరివాళ్ళు, సాధువులు, బైరాగులు, జంగాలు తదితర సంచార భిక్షుకుల అద్భుతమైన రంగు రంగుల వింత దుస్తులంటే మురిసిపోతాడు. వాళ్ళ ఆడే . యెలుగొడ్లన్నా, డూడూ బసవన్నలన్నా, చక్కటి శిక్షణ ఇచ్చిన చిలకలు, కుక్కలు, తులన్నా, ఆకర్షితుడవుతాడు. జానపద గేయాలను, వీరగాథలను పరవశించి వింటాడు.

వీధి భాగవతులు ఆడే వీధి నాటకాలను కానీ, తోలుబొమ్మలాటలోళ్ళ తోలుబొమ్మలాటను కానీ, సాధారణంగా ఆయన చూడకుండా విడచి పెట్టేవాడుకాదు. తోలుబొమ్మలాటలంటే ముచ్చటపడి, తోలుకు బదులు కాగితాన్ని ఉపయోగించి సొంత పద్ధతిలో ఆటబొమ్మల్ని తయారుచేస్తాడు. ఆస్తుల హద్దూ పద్దూలేని వినోదం కోసం తన బొమ్మలాటల్ని ప్రదర్శించేవాడు. చూడడానికి పాఠాలంటే బొత్తిగా శ్రద్ధ చూపేవాడు కాదు. అయినా పాఠశాలలో ఆయన అగ్రశ్రేణి విద్యార్థి. తెలివితేటలు చూచి ఒక స్థానిక స్కూళ్ళ ఇన్స్ పెక్టరు ఆయన విషయంలో ప్రేమాభిమానాలను, శ్రద్ధాసక్తులను చూపాడు. పరీక్షలకు ఆయత్తం చేశాడు. పదోయేటనో, పదకొండో యేటనో ప్రశంసనీయంగా ప్రాథమిక విద్యను ఆయన పూర్తిచేశాడు. ఇప్పుడు పైచదువుకు వెళ్ళదగినచోటు విజయనగరమే.

రామదాసుకు కొడుకంటే శ్రద్ధ. మొదటి బిడ్డ తనకంటే మంచి చదువు చదువుకోవాలి. కుర్రవానిలో కుశాగ్రబుద్ధీ, విద్యపట్ల ఆసక్తి, సూదంటు రాయిలాంటి గ్రహణశక్తి ఉన్న లక్షణాలు అప్పటికే వెళ్ళడయ్యాయి. నిజానికి వయసుకు మించిన తెలివిపరుడు. విజయనగరమంటూ పంపగలిగితే తప్పకుండ వంశానికి వన్నె తెస్తాడు. పసివాడు ఒక కొత్త పట్టణంలో తన గొడవ తాను పడేటట్లు ఎలా వదిలిపెట్టాలి? విజయనగరంలో చదువుకయ్యే ఖర్చులు భరించడమే కుటుంబానికి తలకుమించిన పని. మరి ఎలా కుర్రవాడికి మరో వసతి కల్పించడం? ఇబ్బందులు దుర్గమంగా కన్పిస్తున్నాయి. అయితే కొన్నాళ్ళు మాత్రమే.

విజయనగర సంస్థానం దివాను పి.జగన్నాథరావు నిజాయితీకి, కార్యదక్షతకూ పేరుపడ్డాడు. జాలిగుండె మనిషి కూడా. ఇటీవల సంస్థానం అధికారుల సంక్షేమం పట్ల శ్రద్ధాసక్తులు కనపరుస్తున్నాడు.

సంస్థానానికి చెందిన పాఠశాలల్లో పిల్లలకు ట్యూషన్ ఫీజు మినహాయించడం ద్వారా కొందరు పేద అధికారులకు ఆయన తోడ్పడ్డాడు. ప్రత్యేకంగా కొందరి విషయంలో - ఇతర ఖర్చుల నిమిత్తం చిన్న చిన్న మొత్తాలను మంజూరు చేశాడు కూడా. "ఇతరుల కిచ్చింది నాకు తప్పకుండా అందుతుంది" అని రామదాసు అనుకున్నాడు. దివానుకు తన అభ్యర్థన తెలుకోవడం కోసం ఆశపడి విజయనగరం ప్రయాణం అయ్యాడు.

రామదాసు ఆత వ్యర్థం కాలేదు. అయితే ఆయన అభ్యర్థనను మన్నిస్తూ దివాను వెంటనే వేసిన ఉత్తరువువల్ల సమస్య కొంతవరకే పరిష్కారమైంది. భోజన సదుపాయాన్నీ, వసతి సదుపాయాన్ని ఇంకా చూడవలసి ఉంది. విజయనగరంలో రామదాసుకున్న అనేక బంధువుల్లో ఎవరైనా తన సాయానికి వస్తారా? రెండేళ్ళపాటు ఎవరైనా తమ ఇంట్లో కుర్రవాణ్ణి ఉంచుకొంటారా? "అప్పటికి నా ఆదాయం పెరగవచ్చు, లేదా మా అబ్బాయి తన చురుకైన బుద్ధితో, దేదీప్యమానమైన తెలివి తేటలతో ఒక ఉదారుడైన పోషకుని దృష్టికి రావచ్చు", అని అనుకున్నాడు. అదృష్టవశాత్తు తాను కలిసిన మొదటి బంధువే సాయపడ్డానికి ఇష్టపడడమేకాదు, ఆతురత చూపాడు కూడా.

ఈలోగా, ఇంట్లో కూర్చుని అప్పారావు ఎన్నడూ లేంది వ్యాకులంగా ఉన్నారు. పేదరికం దాని వెంబడి వుండే తలవంపుల ఆలోచనలవల్ల జీవితంలో మొట్టమొదటిసారి అస్పష్టంగా కలత చెందివుండవచ్చు. ఇది కేవలం ఊహ కాదు. ఆయన నోటు పుస్తకాలు ధ్రువపరచిన సంగతే. చాలా యేళ్ళ తర్వాత అందులో రాసుకున్నది ఈ విధంగా ఉంది: "పేదరికం ఒక అవమానమని నేను భావించిన రోజులున్నాయి".

తరచుగా వయసులో చిన్నవాళ్ళే పెద్దవాళ్ళ కంటే పేదరికాన్ని అతితీవ్రమైన విషయంగా పరిగణిస్తారు. పేదవాళ్ళు దానితో తంటాలుపడడం నేర్చుకొని పేదరికపు వికృత ముఖాన్ని చాలా తక్కువగా గుర్తిస్తారు.

త్వరలోనే అప్పారావు ఉల్లాస వ్యక్తి ఆయన వ్యాకులతను జయించింది. ఉత్సాహంతో తండ్రి వెంట విజయనగరం తరలివెళ్ళారు. - పట్టణం సమీపిస్తూనే ప్రప్రథమంగా చూసిన మొదటి చూపుకే వొళ్ళు జలదరించింది. కళ్ళు మెరిసాయి. ముఖం విప్పారింది. నీలపు కొండలు ఆనుకొని నీలాకాశం కింద తళతళ మెరుస్తూ భవిష్యతోషకుని స్థావరం. భవిష్యద్విజయరంగ స్థలం మౌనసంజ్ఞ చేశాయి, "అప్పారావు సమున్నత భవితవ్యం కోసం".

## చంచల జ్వాల

"ఆత్మ సహజంగా జ్వలనశీలమయితే చంచల జ్వాల సహితం వెలుగులు విరజిమ్మవచ్చు" -జార్జి సాంతీ అనీ

విజయనగరంలో అప్పారావు గడిపిన తొలినాళ్ళ భోగట్టా విశ్వసనీయంగా లభ్యంకాలేదు. ఎప్పటిలాగే చురుకుదనంతో, ఉల్లాసంతో తరగతిమీద తరగతి పూర్తిచేస్తూ వెళ్ళారు. ఆయన చిలిపితనం వదల్లేదు. ఆయన పిల్లచేష్టల్లో అన్నిట్లోనూ తోడూ, పురికొల్పేవాడూ మరెవరో కాదు, సాక్షాత్తు గిడుగు వేంకట రామమూర్తె. ఆయనకు ఇతర సావాసగాళ్ళు కూడా ఉన్నారు. ఐతే వాళ్ళలో ఎవరూ గిడుగు వెంకట రామమూర్తి అంత ఆప్తులూ, ఆత్మీయులూ, సన్నిహితులూ కారు. రెండు వేరువేరు గ్రామాల నుంచీ ఇద్దరు జి.వి.లూ ఒకే ఏడాది ఒకే బడిలో, ఒకే తరగతిలో చేరడానికి విజయనగరం వెళ్ళారు. ఇద్దరి స్వభావాల్లోనూ ఉండే పోలికలవల్ల ఒకరికొకరు దగ్గరయ్యారు. జీవితంలో ఆ తర్వాత వాళ్ళ దారులు వేరయ్యాయి, కలిశాయి, మళ్ళీ వేరయ్యాయి. వాళ్ళ అదృష్టాలు నిలకడగాలేవు. ఐనా వాళ్ళ బంధం తెగిపోలేదు.

ఒక విధంగా మృత్యువుకూడా వాళ్ళను విడదీయలేకపోయింది. అప్పారావు అకాల మరణం చెందడంతో, రామమూర్తి వాడుక భాషను సాహిత్యంలో వాడాలనే ఇద్దరి ఉద్యమాన్ని రెట్టింపు ఉత్సాహంతో, నాలుగింతలు దీక్షతో కొనసాగించారు.

రామమూర్తి స్నేహాన్ని సంపాదించడంలో అప్పారావు అదృష్టవంతుడు. ఐతే, మహారాజా కళాశాల ప్రిన్సిపాలు చంద్రశేఖరశాస్త్రి దృష్టిలో పడడంతో ఆయన ఇంకా అదృష్టవంతుడయ్యారు. చంద్రశేఖర శాస్త్రి పాత తరానికి చెందిన అపురూప వ్యక్తిత్వమున్న విద్యావేత్త. రాయవేలూరులో జన్మించారు. ఆంగ్లంలో, సంస్కృతంలో మంచి పండితుడు. విజయనగరానికి వలసవచ్చారు. కేవలం బ్రతుకు తెరువుకోసం గాక, తన ఆశయ సాఫల్యం కోసం. ఆధునిక విద్య విముక్తి ప్రదాయికమైందన్న దాంట్లో ఆయనకు ప్రగాఢ విశ్వాసముండేది. ఆధునిక విద్య సత్వరంగా వ్యాప్తి చెందకుండా, అజ్ఞానం, పేదరికం, అంధవిశ్వాసాలు, బానిసత్వం, సోమరితనం వీటి ఊబిలోంచీ భారతదేశం బయటపడలేదని ఆయన సముచితంగా విశ్వసించారు. కాబట్టి ఆయన దృష్టిలో విద్యార్థులంటే కేవలం తెల్లచొక్కా ఉద్యోగాల కోసం, డిగ్రీలకు యెగబడేవాళ్ళు మాత్రమే అనికాదు; వాళ్ళు భావి ప్రపంచ వైతాళికులు; ఒక నూతన సమాజ నిర్మాతలు, ఒక నూతన జాతి నిర్మాతలు; ఆయన వాళ్ళనె ఎంతగానో ప్రేమించారు; తన ఉన్నతాశయాలను వాళ్ళలో ఉద్దీపింపజేయడానికి ప్రయత్నించారు. ఆయనకంటూ శక్తివుండివుంటే విజయనగరం లోని ప్రతి పేద విద్యార్థినీ సంతోషంగా తమ ఇంట్లో సాకి సంరక్షణ చేసి ఉండేవారు. ఆ శక్తి లేనందువల్ల, చాలా తెలివైన వాళ్ళ మధ్యనుంచీ ప్రతిభావంతులైన వాళ్ళను ఎన్నుకొనేవాళ్ళు. అటువంటి విద్యార్థులు ఎప్పుడూ ఆరుమంది కంటే తక్కువ ఉండేవాళ్ళు కాదు. వాళ్ళకు భోజన సౌకర్యాలు, బట్టలు చక్కగా అమర్చేవారు. సొంత పిల్లలకూ, వాళ్ళకూ మధ్య ఎలాంటి భేదమూ లేకుండా చూసుకొనేవారు.

విజయనగరం వచ్చాక రెండు మూడేళ్ళకు బడిలో మంచి మార్కులు రావడంతో, అప్పారావుకు శాస్త్రిగారింట్లో స్థానం లభించింది. అచిరకాలంలోనే శాస్త్రి తల్లిగారికి ఎంత దగ్గరి వాడయ్యాడంటే, ఆమె అప్పారావును తన చిన్నకొడుకులాగా చూసేది. శాస్త్రినీ, శాస్త్రి తల్లిగారినీ అప్పారావు గొప్పగా అభిమానించారు, భక్తితో చూశారు. నిజానికి శాస్త్రి ఆయనకు పితృసమానుడు. శాస్త్రి అంటే అప్పారావుకు ఎంతటి అత్యున్నతమైన గౌరవమంటే, భవిష్యత్పోషకుడైన ఆనంద గజపతి శాస్త్రిగారికంటే కిందే అని ఒకప్పుడనుకున్నారు. శాస్త్రి జీవించి ఉన్నంత కాలమూ మహారాజావారిని దర్శనం చేసుకోడానికి కూడా అయిష్టపడేవారు. అప్పారావు నోటుపుస్తకాల్లో ఇలా రాస్తారు." ఎప్పుడుపడితే అప్పుడు ఆయనను నేను చూడగలిగేవాణ్ణి. ఐతే కీర్తిశేషులైన ప్రిన్సిపల్ గారు బతికివుండగా, మహారాజా వారిని చూడాలని నాకు అంతగా అనిపించలేదు. ఆయనతో పోలిస్తే మహారాజావారు ఎందుకూ కొరగారని అనుకునేవాణ్ణి".

రానురాను మహారాజావారిని గురించి ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకున్నది, ప్రేమించడం, గౌరవించడం నేర్చుకున్నదీ నిజమేననుకోండి. ఐతే మహారాజావారి పట్ల ఆయన భావాలు ఏనాడైనా భక్తి స్థాయికి చేరుకున్నాయా అనేది చర్చనీయం.

వ్యక్తిత్వం రూపుదిద్దుకొంటున్న దశలో చంద్రశేఖరశాస్త్రి ప్రభావం కిందికి అంత ప్రత్యక్షంగా, అంత విస్తృతంగా రావడం నిజంగా అప్పారావు మహాద్భాగ్యం. ఆ మహాభాగ్యమే ఆయనలో గాఢమైన పుస్తక ప్రియత్వాన్ని కలిగించింది, తృప్తి ఎరుగని జ్ఞానదాహం రగిలించింది; ఆయన దృక్పథం విశాలం కావడానికి, ప్రతిస్పందన శక్తుల్ని నిశితం చేసుకోడానికీ, ఆదర్శవాదిగా, మానవతావాదిగా పెంపొందడానికి తోడ్పడింది. శాస్త్రిని ఆదర్శంగా ఉంచుకొనే ఉత్సాహంలో చేతికి అందినదల్లా ఆత్రంగా చదువుతున్నారు. భాషల పై, ముఖ్యంగా ఆంగ్ల సంస్కృత భాషలపై రానురాను స్థిమితంగా అధికమైన ప్రావీణ్యాన్ని సమకూర్చుకుంటున్నారు.

అధ్యాపకుడుగా జీవిత సాఫల్యం పొందాలని నిరంతరం కలలు కంటున్నారు. అప్పుడప్పుడూ వాళ్ళ నాన్న జేబు ఖర్చుల కోసం ఇచ్చే డబ్బులతో గంటస్తంభం దగ్గర అమ్మే పనికిరాని కాగితాల గుట్టల్లో కంటికి ఆనిన సెకండ్ హ్యాండ్ పుస్తకాలను కొని ఒక చిన్న గ్రంథ భాండారాన్ని సమకూర్చుకోవడానికి ప్రారంభించారు. ఆ విధంగా కారుచౌకగా కొన్న అనేక గ్రంథాల్లో . ఒకటి బన్యన్ రాసిన పిల్గ్రిమ్స్ ప్రోగ్రెస్. సంపూర్ణంగా ముగ్ధుడై, దాన్ని ఒకటి రెండుమార్లు కాదు, వరసగా నాలుగుమార్లు చదివారు. తెలుగు వాడుక భాషకోసం పోరాడే భావి యోధుని అంతరాంతరాల్లో అది గాఢంగా నాటిందా? నాటింది అనుకోవచ్చా? బన్యన్ భాషను ఆనాటి వాడుక భాషగా సౌతీ అభివర్ణించలేదా?

అప్పారావు మెట్రిక్యులేషన్ ఖచ్చితంగా ఎప్పుడు ఉత్తీర్ణులయ్యారు? 1880లో అనీ, 1882లో అనీ రెండు సంవత్సరాలు పేర్కొనబడ్డాయి. మొదటిదే సబబుగా కన్పిస్తుంది. ఏమైనా అది చాలా స్వల్ప విషయం. పరీక్షల్లో ఎంత బాగా రాశాడంటే ఆయనకు ప్రథమ శ్రేణి వచ్చింది. అంతకంటే ముఖ్యమైందీ, విలువైందీ - 1882లో కవిగా ఆయన ఆకస్మికమైన, ఆశ్చర్యకరమైన ఆవిర్భావం. సందేహం లేదు. అది క్షణికావిర్భావమే. అయినప్పటికీ తర్వాత కాలంలో ఆయన విజయానికి అది మొట్టమొదటి మసక వెలుతురు. ప్రథమ పురోభివృద్ధి సూచకం; ఆనంద భవిష్యత్సూచన, అంతవరకు ఆయన ప్రబలమైన కోరిక అధ్యాపకుడు కావడం. ఐతే ఆయన లోచనలను కవిత్వం వైపు ఏది తిప్పినట్లు?

కొన్నేళ్ళ తర్వాత తమ్ముడు శ్యామలరావు అన్నతో కలసి చదవడానికి విజయనగరం వచ్చాడు. అతడు కూడా ప్రజ్ఞావంతుడైన కుర్రవాడు. చిలిపితనం అసలేలేదు. అత్యంత గంభీరుడు, పఠనశీలి, చిన్ననాటి నుండీ ఏదో రోజు తానొక కవి కావాలి అని కలలు కన్నాడు. అతడేమైనా అప్పారావులో నిద్రాణంగావున్న కవిని మేల్కొలిపాడా? అతనుకాదు. ఏ విధంగా నయితేనేం అగ్రశ్రేణి కవిగా చివరకు ఆవిర్భవించారు.

ఆంగ్లంలో అప్పారావు రాసిన మొదటి పద్యం 'ఓడ్ టు ది కకూ'. స్థానిక పత్రికలో ప్రచురితమవుతూనే నలువురూ ప్రశంసించారు. నిజానికి రోజుల తరబడి, పట్టణంలో పద్యప్రశంసే. శాస్త్రి తన శిష్యున్ని చూసి గర్వపడ్డారు. ఆనందగజపతి ఆస్థాన సదస్యుల్లో ఒకరు పద్యాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. అప్పటి ఉత్తర సర్కారు జిల్లాల స్కూళ్ళ ఇన్ స్పెక్టరు మన్రో దాన్ని గురించి చాలా గొప్పగా అభిప్రాయపడ్డారు. యువ కవిని అభినందించారు. అప్పారావుకు భవిష్యత్తు ఉంటుందని ప్రతి ఒక్కరూ భావించారు.

కానీ, అప్పారావు కవితాజ్వాల అమిత చంచలంగా ఉంది. ప్రథమ ప్రజ్వలనానికీ, రెండవ ప్రజ్వలనానికీ మధ్య ఒక ఏడాది విరామం ఉంది. రెండవ ప్రజ్వలనానికీ, తదనంతరం . ప్రజ్వలనాలకూ మధ్య చాలా ఏళ్ళు ఎంతగా అణగి ఉందంటే దానినుంచీ పొగాలేదు, మంటాలేదు. ఇది కాస్త చిత్రమే, 1883లో రచించిన మలి ఆంగ్ల పద్యకావ్యం 'సారంగధర' ప్రథమ రచన కంటే మరింత ఆదరాన్ని పొందింది. విస్తారమైన ప్రశంసలను అందుకొంది. శంభు చంద్ర ముఖర్జీ (1839-1894) వంటి ప్రఖ్యాత పత్రికా రచయిత దానికి ముగ్ధుడై వెంటనే ఆయనను “నా ప్రియమైన యువ కవీ” అంటూ ప్రీతితో సంబోధించడం ప్రారంభించారు.

ముఖర్జీ ఈనాడు దాదాపు విస్మృతులు. కానీ ఆ రోజుల్లో భారతదేశంలోని ప్రధాన సంపాదకుల్లో ఒకరు. “గౌడదేశపు రాజైన ఆదిశూరుడు తన ప్రజలకు ధర్మమూ, మతమూ నేర్పడానికీ కన్యాకుబ్జం నుంచి పిలిపించిన” ఐదుగురు బ్రాహ్మణుల్లో ఒకడైన శ్రీహర్షుని వంశానికి చెందిన ముప్పయి నాల్గవ తరంవారు ముఖర్జీ. ఆయన 1839లో, బెంగుళూరులో జన్మించారు. నైష్ఠికులైన తల్లిదండ్రులకు ఒకే కొడుకైన ఆయన చదువు చిన్నప్పుడు సవ్యంగా సాగలేదు. కానీ, అదృష్టవశాత్తు, హిందూ మెట్రోపాలిటన్ కళాశాల మొదటి ప్రిన్సిపాలైన కెప్టన్ డి.యన్. రిచర్డ్సన్ ఆయన చదువు ముగింపు దశల్లో మార్గదర్శకుడయ్యాడు. పిన్నవయసులోనే ఆయన పత్రికా రచనను స్వీకరించారు. క్రిష్టో ద్వా తో కలసి "కలకత్తా మంత్లీ మాగజైన్" పత్రికకు సహ సంస్థాపకుడయ్యారు. దానికి పురిట్లోనే సంధి కొట్టాక 'మార్నింగ్ పేట్రియట్”తోనూ, దాని ప్రఖ్యాత యజమానీ, ప్రఖ్యాత సంపాదకుడూ అయిన హరీష్ చంద్రముఖర్జీతోనూ, సంబంధం కలిగిన కారణంగా, జాతీయ అంతర్జాతీయ వ్యవహారాలపై సమర్థుడైన నిశిత వ్యాఖ్యాతగా అమిత ప్రజ్ఞావంతుడైన సాహిత్య విమర్శకుడుగా, ఆంగ్లభాషా పాండిత్య విషయంలో ఆంగ్లేయులతోనే పోటీపడగలిగిన వ్యక్తిగా వెలుగులోకి వచ్చారు. కానీ చపలచిత్తుడు కావడంవల్ల, పత్రికా రచనను దృఢంగా అంటి పెట్టుకోలేదు. అప్పుడప్పుడు దాన్ని దాదాపు వదలివేసేవారు. ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ప్రధానోపాధ్యాయుడుగా, తాలూక్దార్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా, ఒక భారతీయ మహారాజుగారికి దివానుగా, మరొకరికి కార్యదర్శిగా, మధ్యమధ్య కొన్నేళ్ళు ఉద్యోగాలు చేశారు. న్యాయశాస్త్రంతో కొన్నాళ్ళు ఆడుకున్నారు. చాలా యేళ్ళు హోమియోపతిని అభిమానించారు. కానీ, ఆయన మొదటి అభిమాన విషయమూ, చివరి అభిమాన విషయమూ పత్రికా రచనే. 1872లో 'ముఖర్జీ మాగజైన్' సొంతంగా ప్రారంభించారు. 1882లో కొత్తగా ఆరంభించిన వారపత్రిక 'రీస్ అండ్ రయ్యత్'తో దాన్ని సంలీనం చేశారు. దాని ఉజ్జ్వల దశలో బెంగాలులోని ప్రఖ్యాత వ్యక్తులు సర్వులేకాదు తదితర రాష్ట్రాల వాళ్ళు కూడా దాని అనునిత్య పాఠకవర్గంలో గణించ దగ్గవాళ్ళే. అప్పటి రాజ్యపాలకులు మినహాయింపుకాదు. వైస్రాయి తర్వాత వైస్రాయి, పత్రికలో వారం వారం ఆయన రాసేది చదువుతున్నారు. ఒకప్పుడు ప్రశంసాపూర్వకంగా, మరొక్కప్పుడూ చికాకుపడుతూ,

శంభు చంద్ర ముఖర్జీలాంటి సంపాదకుడు దగ్గర చేర్చుకోవడం కన్నా, ఆశీర్వదించడం కన్నా, భుజం తట్టడంకన్నా యువకుడైన అప్పారావుకు కోరతగింది ఏముంటుంది? అప్పారావు 'సారంగధర'ను జి. వెంకటరామయ్య తన పత్రిక 'ఇండియన్ లీజర్ అవర్'లో ప్రముఖంగా ప్రచురించాక, ఆ ప్రతిని విజయనగరం నుంచి పంపితే ముఖర్జీ ఎంతగా సంబరపడ్డారంటే, దాన్ని తన 'రీస్ అండ్ రయ్యత్'లో పునర్ముద్రించుకొన్నారు. కావ్యం నిర్దుష్టమైందని కాదు; దాంట్లో కవికి మంచి భవిష్యత్తును దర్శించారు. కాబట్టే వెంకటరామయ్యకు ఉత్తరం రాస్తూ ఆయన ఇలా అన్నారు:

“అతని పద్యంలో చాలా లోపాలున్నమాట నిజమే. ఐతే అతనిలో సరుకుంది. ముందుకు వెళ్ళనీండి. అతని పేరుకూ, పుట్టుకకూ, చదువుకూ, వ్యాపకాలకు సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవాలని నాకుందనేది చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను”.

అప్పారావే స్వయంగా ఆ వివరాలను అందించారు. అనతికాలంలో నయోధికుడైన సంపాదకుడు యువకవికి మరొక పితృసమానుడయ్యారు. వాళ్ళిద్దరి మధ్యా ఉత్తరాలు షుమారుగా నడిచాయి. దురదృష్టవశాత్తు నాలుగు మాత్రమే, ముఖర్జీ అప్పారావుకు రాసిన ఆ నాలుగు లభ్యమవుతున్నాయి. ఎఫ్. హెచ్. స్క్రయిన్ రాసిన ముఖర్జీ జీవిత చరిత్రలో వాటిని ప్రచురించడం జరిగింది. కొందరు అప్పారావును ఎంతగా ప్రోత్సహించారో మరికొందరు అంతగా నిరుత్సాహపరిచినట్లు 1883 సెప్టెంబరు 17వ తేదీ రాసిన మొదటి లేఖలోనే స్పష్టమౌతుంది. ముఖర్జీ రాస్తారు కదా:

“నువ్వు పొందిన నిరుత్సాహాలు ప్రత్యేకమైనవేమీ కావు. ప్రతిభ కానీ, మౌలికతగానీ వున్న ప్రతి రచయితా, తప్పనిసరగా ప్రతి కవీ వాటికీ గురికావలసిందే. నీ బాధలకు ఆశ్చర్యపడవలసిన కారణమేలేదు. ఏ దేశంలో అయినా మంచి సాహిత్యాన్ని అవగాహన చేసుకున్న వాళ్ళు మరీ స్వల్పం. యూరప్ లోని కవుల స్థితిని పరికించు, భారతదేశంలో పరిస్థితి దారుణం. విద్యావంతు లయినప్పటికీ ఆంగ్లో ఇండియన్లు పాండిత్యంగానీ, విచక్షణగానీ, ఉన్నవర్గం కాదు. దేశీయుల సంగతి గురించి ఏమంటాం? దేశీయ రచయిత ఒక ప్రత్యేకమైన ఇబ్బందిలో ఉన్నాడు. దేశీయులు సాధారణంగా యూరోపియన్ల అంచనాకోసం ఆగుతారు. దేశీయులలో సమర్థులు సైతం తమ అభిప్రాయాన్ని ముందుగా చెప్పడానికి వెనుకాడతారు. దేశీయుడు యూరోపియన్ భాషలో కవిత్వం జోలికి పోవడం దుడుకు తనమన్నది నిజమే. కానీ యూరోపియన్లు దానిని దుడుకుతనంగా కూడా కాకుండా, తుంటరి తనంగా పరిగణించడానికి సుముఖంగా ఉంటారు. నల్లతోలు వచనం రాయడంతో సంతృప్తి చెందకుండా ఛందస్సుతో ఆడుకునేంత వరకు వెళ్ళడం అంటేనే వాళ్ళకు గంగవెర్రు లెత్తుతుంది. సారంగధరలో నువ్వు ప్రయత్నించే ఆధునిక నిర్యమక పద్యం (బ్లాంక్వర్స్) ప్రసిద్ధంకాదు. పోప్ అంత్యప్రాసల గలగలలు ఇంకా మనుషుల బుర్రల్లో ఉన్నాయి. అవే నిజమైన కవిత్వంగా చలామణి అవుతున్నాయి. అయినా లెక్కపెట్టవద్దు. నిరుత్సాహపడవద్దు”. చిత్తశుద్ధితో ఇచ్చిన ఈ విజ్ఞతాయుతమైన సలహాను అప్పారావు ఎందుకు పాటించలేదు? ఆయన మళ్ళీ శ్రద్ధగా కవిత్వం రాయబూనుకోడానికి ముందు రెండు దశాబ్దాల దీర్ఘకాలం ఎందుకు గడిచింది? ఈ కాలంలోగానీ, మరే కాలంలోగానీ ఆయనకు ఆత్మవిశ్వాసం కొరవడలేదు. సులభంగా నిరుత్సాహపడే మనిషి కూడా కాదు. అయినా అంతస్సత్వం దిట్టమైంది. . కాబట్టి కవిగా ఆయన దీర్ఘమౌనానికి ఒక కారణమే కన్పిస్తుంది. ఆయన కవితా జ్వాల చంచలమైంది. కానీ, ఎప్పుడో ఒకనాడు అది వెలుగులు విరజిమ్ముతుంది, దేదీప్యమానంగా కూడా; ఆయన ఆత్మ సహజంగా జ్వలనశీలం కదా!

## మార్పులూ, అవకాశాలూ

'ఈ మర్త్యజీవితపు అన్ని మార్పులూ, అన్ని అవకాశాలూ' సాధారణ ప్రార్థనల గ్రంథం

అప్పారావు జీవితంలో 1882కూ 1897కూ మధ్యవున్న ఒకటిన్నర దశాబ్దపు కాలం ఎన్నో మార్పులతోనూ, అవకాశాలతోనూ నిండివుంది. ఆ దశ ప్రారంభంలో ఆయన అనేక ఘనకార్యాలు సాధించగలడన్న ఆశలు కలిగించే ఉత్సాహవంతుడైన యువకుడు, దశాంతంలో కొన్ని ఘనకార్యాలు అప్పటికే సాధించిన పరిణత వ్యక్తి. ఆయన చిలిపితనం స్థానంలో సరసత్వం వచ్చింది; కొంటెతనం పోయి చతురోక్తులు వచ్చాయి, యెగతాళి హాస్య ప్రియత్వంగా మారింది. జీవితంలోని సుఖాలతోపాటు కష్టాలు అనుభవించినా ఆయన ఇంకా నవ్వేశక్తిని కోల్పోలేదు. కానీ, ఆయన నవ్వు ఇప్పుడు పగలబడి నవ్వడం కాదు. ఆ నవ్వు హద్దులోవుంది, అణచి పెట్టబడి కూడా ఉంది. తరచుగా దాని వెనుక కన్నీటి చప్పుడు వినిపిస్తుంది. కొన్ని గట్టి ఎదురు దెబ్బలు తిన్నప్పటికీ ఆయన ఇంకా కలలుగనే శక్తిని కోల్పోలేదు. అయితే ఇప్పటి కలలు ఆచరణ దూరమైనవి కావు. కొంత ఆశాభంగం పొందినప్పటికీ, ఆయన ఇంకా జీవితాన్ని ప్రేమించే శక్తిని కోల్పోలేదు; అయితే పరమానందభరితమైన క్షణాల్లో కూడా జీవితంలోని అనేక కష్టాలు, ఎన్నెన్నో దుఃఖాలు ఆయన స్పృహలో

ఉన్నాయి. ఏ దృష్టితో చూసినా, ఈ పదిహేనేళ్ళు ఆయన వ్యక్తిత్వపు రూపురేఖలనూ, ఆయన అంతస్సారాన్నీ, ఆయన శక్తినీ, ఆయన దృక్పథాన్ని దిద్దితీర్చడంలో నిర్ణయాత్మకమైనవి.

చిత్రమేమిటంటే ఈ కీలకమైన దశలోని మొదటి మూడేళ్ళు విద్యావిషయకంగా దాదాపు చెప్పుకోదగ్గవికావు. మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రశంసనీయంగా ఉత్తీర్ణుడైనందువల్ల ఆయనకు ఉపకారవేతనం లభించింది. కానీ, యఫ్.ఏ. పరీక్షలో అక్కడి కక్కడికి దేక గలిగాడు. దాంతో ఉపకారవేతనం పోయింది. ఏడాదిపాటు ఆయన చదువు ఆగిపోవలసివచ్చింది. ఆయన తండ్రి రామదాసుకు ఈలోగా రెండు ప్రమోషన్లు వచ్చాయి - మొదటిది జలాంతర ఎస్టేటుకు అమీనుగా, రెండవది శృంగవరపు కోటకు సర్కిల్ సుపీరియర్ గా, తన చిత్తశుద్ధివల్లా, సామర్థ్యం వల్లా ఆయన మహారాజావారి విశ్వాసం చూరగొన్నారు. అందువల్ల ఆయన ప్రాంతానికి చెందిన కొన్ని ప్రత్యేక సమస్యల గురించి ఆయనను మహారాజావారు అప్పుడప్పుడు సంప్రదిస్తూ, కొన్ని ప్రత్యేక కర్తవ్యాలను కూడా ఆయనకు అప్పగించేవారు. ప్రతి ప్రమోషన్లోనూ ఆయన జీతం పెరిగింది.

ఆయన పొలం నుంచీ కూడా ఇప్పుడు కాస్త ఎక్కువ ఆదాయం వస్తోంది. కానీ కుటుంబం పెరగడంతో ఖర్చులు కూడా పెరిగాయి. అందువల్ల తన అలక్ష్యం వల్ల ఉపకార వేతనం పోగొట్టుకున్న పెద్ద కొడుకు, చదువు మానుకొని ఉద్యోగం చూసుకోవాలని ఆయన పట్టుబట్టారు. మార్గాంతరం లేనందువల్ల అప్పారావు స్థానిక ఉన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయ పదవి ఖాళీగా ఉంటే, దానికోసం అర్జీ పెట్టుకొన్నారు. చంద్రశేఖర శాస్త్రి సహకారంతో ఆ పదవి ఆయనకు సులభంగానే వచ్చింది.

ఇంతకుముందే చెప్పినట్లు, ఉపాధ్యాయుడు కావాలనేది అప్పారావు గాఢమైన ఆకాంక్ష. అది ఆయన మొట్టమొదటి ఆకాంక్ష కూడా. ఆయన ఇతర కోరికలు:  డిప్టికలెక్టరు ఆఫీసులో హెడ్ క్లర్కు కావాలనేదీ, లాయరు కావాలనేదీ, జడ్జ్ కావాలనేదీ. ఇవి అంత స్థిరమైన కోరికలు కావు; అంత గాఢమైన కోరికలు కావు. జడ్జి కావాలనే కోరికను ఆయన ఒకసారి చిలిపి రూపంలో వ్యక్తీకరించారు. తన యెనిమిదో యేట ఆయన ఒకసారి తాతగారి వూరికి వెళ్ళారు.

తాతగారు రాయవరంలోని జిల్లా మునసబు కోర్టులో శిరస్తదారు. ఒకరోజు సాయంకాలం, కోర్టు ముగిశాక అప్పారావు అటూ ఇటూ తిరుగుతూ, జ గది తలవాకిలి దగ్గరకు వెళ్ళి, తలుపుమీద సుద్ద ముక్కతో పెద్ద అక్షరాలలో "జి.వి. అప్పారావు, బి.ఏ., బి.ఎల్., జిల్లా మునసబు" అని రాశారు. మరునాటి ఉదయం గట్టిగా మందలించేందుకు ఆయనను జడ్జి ఎదుటికి లాక్కొచ్చారు.

"నువ్వు జనని మోసపు ప్రకటన చేసినందుకు నిన్ను శిక్షించవచ్చు" అన్నారు జడ్జి. వయసుకు మించిన కోరికతో అప్పారావు సమాధానించారు కదా!

"కాదు సార్. నాది మోసం ప్రకటన కాదు. అది నా కోరిక మాత్రమే".
కుర్రవాని చురుకైన జవాబుతో మనసులో కలిగిన ఇబ్బందిని దాచుకోడానికి జడ్జి కాస్తా అనాలోచితంగా అన్నారు:  "సరే, సరే, నీకోరికను కోర్టు తలవాకిలి తలుపుమీదే వెల్లడించాలా? పక్కన గోడమీద రాయవచ్చు కదా?"
అప్పారావు ఒప్పుకోలేదు. "అయితే సార్, నేను బొగ్గుతో రాయలేదు. సుద్దముక్కతో రాశాను. వెల్లవేసిన గోడమీద తెల్లని సుద్ద ముక్కతో రాయడం తెలివి తక్కువ కదా!" అన్నారు.

కుర్రవాని పొగరుబోతు తనానికి కఠిన శిక్షపడుతుందని అప్పారావు తాతగారు భయంతో వణకిపోతున్నారు. కానీ, కుర్రవాని చురుకుదనమూ, ధైర్యమూ జడ్జిని ఆకట్టుకొన్నాయి. "నీ కోరిక ఏదో ఒకరోజు నెరవేరుగాక" అని ఆయన కుర్రవాణ్ని ఆశీర్వదించారు. కానీ ఆ రోజు రానేలేదు. దానికి బదులు మరో రోజు వచ్చింది, అప్పారావు ఉపాధ్యాయుడుగా పాఠాలు చెప్పవలసిన రోజు మరీ త్వరగా వచ్చింది.

గాఢమైన ఆకాంక్ష తీరడం సర్వదా సంతోషదాయకం కాదు. ముఖ్యంగా వయసుకూ, సామర్థ్యానికి మించిన బరువైన బాధ్యతలు దానివెంట వచ్చినప్పుడు ఒక్కొక్కప్పుడు అది పూర్తిగా ఆయాసకరం కాకపోయినా, చాలా ఇబ్బందికరంగా ఉండవచ్చు. అప్పారావుకు కలిగిన స్థితి అలాంటిదే. తదనంతర కాలంలో ఆయన కళాశాలలో పాఠాలు చెప్పవలసి వచ్చినప్పుడు, అప్పటి ఆయన మనస్థితికి అది సరిపోయింది. కాబట్టి ఆ పని చాలా హాయిగా ఉండింది.

కానీ, ఉన్నత పాఠశాలలో మొదట చేసిన అధ్యాపకత్వం ఆయనను పూర్తిగా క్రుంగదీసింది. ఒళ్ళు చెయ్యని కుర్రవానిలా కనిపించే అప్పారావు తమ తరగతిలోని చిలిపి విద్యార్థులను మందలించడం ద్వారా అదుపు చేయడంగానీ, కొట్టడానికి పూనుకోడంగానీ చేతకాలేదు. అందువల్ల, కొంత విసుగుతో, కొంత నిస్పృహతో మూడు నాలుగు నెలల లోపల ఆయన ఆ ఉద్యోగాన్ని వదలి పెట్టవలసివచ్చింది.

కొడుకు నిర్వ్యాపారి కావడం చూసి రామదాసు మనసు మార్చుకోక తప్పలేదు. అయితే అప్పారావు మళ్ళీ కళాశాలలో చేరడానికి గడువు మీరిపోయింది. కాబట్టి ఆయన మళ్ళీ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం దాకా ఆగవలసి వచ్చింది. ఆయనకు ఇటీవల కలిగిన అపజయాలనూ, అవమానాలనూ, పరిగణిస్తే, కళాశాలలో మళ్ళీ చేరిన తర్వాత ఆయన తన పాఠ్య గ్రంథాల అధ్యయానికి సంపూర్ణంగా అంకితం కావలసి వచ్చింది. కానీ ఆయన మొండి, రకరకాల ఇతర పుస్తకాల పట్ల ఆయన ఏవగింపు ఎంత తీవ్రంగా ఉండేదంటే, 1886లో మొదటిసారి బి.ఏ., పరీక్షకు కూర్చున్నప్పుడు ఆయన ఉత్తీర్ణుడు కాలేదు. ఆయన తండ్రి తీవ్రమైన ఆశాభంగానికి లోనయ్యారు. కానీ రెండో ప్రయత్నంలో కొడుకు ఆంగ్లంలో ప్రథమ శ్రేణిలో ఆధిక్యతతో ఉత్తీర్ణుడైనప్పుడు తండ్రి ఎంతో సంతోషించారు.

పరీక్ష ఫలితాలు వెలువడక మునుపే, చంద్రశేఖరశాస్త్రి చొరవవల్ల అప్పారావు మహారాజావారి కళాశాలలో ఎనిమిదో అసిస్టెంటు లెక్చరరుగా నియమితులయ్యారు. కానీ, నెలకు 25 రూపాయల ముష్టి జీతం వచ్చే ఆ ఉద్యోగంలో చేరడం ఆయనకు ఇష్టం లేదు. న్యాయవాది కావాలనే తన కోరిక నెరవేరే మార్గం యేదైనా ఉందా అని అప్పుడు ఆలోచించారు. 1885లో ఆయనకు వివాహం అయింది. సంపన్నుడైన మామగారు ఏమైనా సాయం చేస్తారేమో అని పరోక్షంగా వివరించారు. శక్తివుండీ మామగారు సాయం చేయదలచుకోలేదు.

అప్పటికీ, మహారాజావారి కళాశాలలో ఎనిమిదో అసిస్టెంట్ లెక్చరరుగా చేరడానికి అప్పారావు ఇష్టపడలేదు. "నెలకు 25 రూపాయల జీతంతో నేనూ, నా భార్యా ఎలా బతగ్గలం" అని ఆయన తీవ్రంగా ఆలోచించారు. "ప్రభుత్వోద్యోగంలో ఎందుకు చేరకూడదు? డిప్యూటీ కలెక్టరు ఆఫీసులో హెడ్ క్లర్క్ కావడం అనేకమైన నా కోర్కెల్లో ఒకటి కదా? అది అంత హీనమైన ప్రారంభ ఉద్యోగం కాదు. పైవాళ్ళను తృప్తిపరిస్తే, త్వరగా పైకి వెళ్ళే అవకాశాలు సైతం ఉన్నాయి". అలా ఆలోచించి ఆయన ఆ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టి సులభంగానే సంపాయించారు కూడా. లెక్చరర్ ఉద్యోగం నుంచీ లీవ్ తీసుకొని హెడ్ క్లర్కుగా చేరారు. తనలాంటి ఇతర గుమస్తాల మీదనే అయినా ఇప్పుడు తానొక హెద్దు. ఈ భావం కొద్ది

వారాలపాటు ఆయనను ఉత్సాహపరిచింది. కానీ, ప్రభుత్వ కార్యాలయంలోని దుమ్ముపట్టిన ఫైళ్ళతోనూ, నీరసమైన దైనందిన కార్యక్రమంతోనూ ఆయన త్వరలోనే అలసిపొయ్యారు. విముక్తి కోసం ఆయన తపించారు.

అప్పారావు కోరకుండానే, స్కూళ్ళ ఇన్స్ పెక్టర్ నాగోజీరావు ఆయన తరపున చొరవ తీసుకున్నారు. అలాగే చంద్రశేఖరశాస్త్రి కూడా. ఇద్దరూ కలిసి అప్పారావు ప్రజ్ఞాపాటవాలు బూజుపట్టిన ప్రభుత్వ కార్యాలయంలో దుర్వ్యయం కాకూడదని ఆనందగజపతి వద్ద విన్నవించుకొన్నారు. వాళ్ళు 1887లో విజయదశమి రోజు అప్పారావుని మహారాజావారి దర్బారుకు తీసుకువెళ్ళారు. మొట్టమొదటిసారి మహారాజావారిని చూసినప్పుడు అప్పారావుకు ఆయనను గురించి గొప్ప అభిప్రాయం కలిగింది. అదనుచూసి శాస్త్రి, నాగోజీరావు, అప్పారావును మహారాజావారికి పరిచయం చేశారు. అప్పారావుతో మహారాజావారు "మా కాలేజీకి మీ అవసరం వుంది. ప్రభుత్వ వుద్యోగం వదిలేసి మీరు తిరిగి మావద్దకు రాకూడదూ?" అని అన్నారు. కళాశాలలో మళ్లీ చేరమని తనను ఆహ్వానించిన అనుగ్రహపూర్వకమైన ఆ పద్ధతికి అప్పారావు పరవశులై తడబడుతూ మహారాజావారికి యెలాగో కృతజ్ఞతలు గొణిగారు.

సంస్థాన పరిపాలనలో జరిగే మామూలు జాప్యాల తర్వాత, నా అసిస్టెంట్ లెక్చరర్ గా నెలకు వంద రూపాయలు జీతంమీద ఆయనకు ఒక కొత్త నియామకపు టుత్తరవు అందింది. ప్రతి సాయంకాలం మహారాజావారికి ఆనాటి పత్రికలు చదివి వినిపించేందుకు అదనంగా 25 రూపాయలు యీయ చూపారు.

లెక్చరర్గా అప్పారావు రాణించారు. ఆయన ఆంగ్ల సంస్కృతాలతోపాటు, గ్రీకు చరిత్ర, రోమన్ చరిత్రకూడా బోధించారు. ప్రతిరోజూ ఆనాటి పాఠాలు చెప్పడం కోసం ముందుగానే యింటివద్ద చదివి సిద్ధమై వెళ్ళేవారు. మద్రాసు, బెంగుళూర్లలోని ప్రసిద్ధ అధ్యాపకుల పద్ధతులను ఆయనకు అధ్యయనంచేసి, నిత్యం తనను తాను మెరుగు పరచుకున్నారు. ఆయనకు అపారమైన దుఃఖం కల్గిస్తూ, చంద్రశేఖరశాస్త్రి 1888 లో మరణించారు. శాస్త్రిలాగే ఆంగ్ల సంస్కృతాల్లో ప్రముఖ పండితుడైన కె. రామానుజాచార్యులు ఆయన స్థానంలో ప్రవేశించారు. కొత్త ప్రిన్సిపలు కూడా అప్పారావుపట్ల దయగా వుండేవారు. 1891 లో ఆయనకు మూడో అసిస్టెంట్ లెక్చరర్గా ప్రమోషన్ వచ్చింది. నెలజీతం వందా యిరవై అయిదుకు పెరిగింది. బి. ఏ. తరగతులకు కూడా బోధింపసాగారు.

ఆయన భార్య అప్పల నరసమ్మ సరళ స్వభావం కలది, సాదామనిషి, కానీ అభిమానవతి, మహా ఆచార పరురాలు. ఆమెతో ఆయనకు కుటుంబ జీవితం హాయిగా వుండింది. యెన్నో యేళ్ళ తర్వాత ఆయన కలకత్తాలో ఒక బాలికా పాఠశాలకు వెళ్ళిచూశారు. అక్కడి పాఠశాలల్లో సంస్కృత శ్లోకాల బోధనవుంది. ముఖ్యంగా పతిభక్తిని నొక్కిచెప్పే శ్లోకాలబోధన, పాకశాస్త్రం ఆచరణాత్మకంగా కూడా అక్కడ బోధించేవాళ్ళు. యివన్నీ చూసి, తననోటు పుస్తకాల్లో ఆయన యిలా రాసుకున్నారు:

"చిన్నప్పుడు నాభార్య అలాంటి బడికి వెళ్ళివుంటే బావుండేది. శ్లోకాలయితే ఆమెకు వందలకొద్దీవచ్చు. మీ బళ్ళనూ పాఠాలు నేర్చుకోకుండానే దివ్యంగా వంటచేస్తుంది. పూజలంటే మహాయిష్టం, ముఖ్యంగా బాగా డబ్బు ఖర్చు అయ్యేవి. ఆమె పరిపూర్ణమైన ఆదర్శమహిళ, బాలికా పాఠశాలలో చాలా మంచి టీచరవుతుంది. ఆమెకు ఒళ్ళంతా ఆచార పరత్వం వున్నా, వళ్ళించే శ్లోకాలన్నీ కూడా ఆమెకు పతిభక్తి మీద విశ్వాసాన్ని కల్గించలేవు. అంతేకాక తన మొగుడు ప్రపంచంలో కెల్లా గొప్ప అవివేకి అనీ, అడుగడుగునా అతనికి కర్తవ్య బోధచేయవలసి వుంటుందని ఆమె నమ్మకం. తన మొగుడు తనకు కుక్కిన పేనులా విధేయుడుగా వుండాలని ఆమె విశ్వాసం. స్త్రీలను గౌరవించాలని విద్యావంతులయిన మన యువకుల అబల సహాయాసక్తి, అలాంటి చెత్తకు సంబంధించిన వాగుడు విన్న తర్వాత (యీ పాఠశాలలో ) పతిభక్తి పాఠాలు వినడం

మనసుకు హాయిగా వుంది." యీ పరిహాసపు పలచని ముసుగు చాటున ఆయనకు భార్యపట్ల గల గాఢమయిన అనురాగమూ, అచ్చమైన మెచ్చుకోలూ కన్పిస్తాయి. కుటుంబ బాధ్యతలన్నిటినుంచీ ఆమె ఆయనకు విముక్తి కలిగించి, తానే సంసారం నిర్వహిస్తుంది. దీంతో ఆయనకు పౌర జీవితంలో పాల్గొనే తీరిక లభిస్తుంది. ఆయన ఒక మునిసిపల్ వార్డులో పన్నుల చెల్లింపుదారుల సంఘానికి అధ్యక్షుడవుతారు. మునిసిపల్ కౌన్సిల్లో సభ్యుడవుతారు. విజయనగరం డిబేటింగ్ సొసైటీ కార్యకలాపాల్లో గాఢమైన ఆసక్తి కనబరుస్తారు. త్వరలో చురుకైన ఉపాధ్యక్షులుగా దానికి నాయకత్వం వహిస్తారు. జాతీయవాదుల సభల్లో ఉపన్యసిస్తారు. 'తెలుగు హార్ప్' అనే స్థానిక పత్రికలో వ్యాసాలు, అడపాదడపా సంపాదకీయాలు రాస్తారు. యింకా వ్యవహారాల్లో పాల్గొంటారు. ఆయన చదరంగమూ, టెన్నిసూ ఆడతారు. సైకిల్ తొక్కడం నేర్చుకుంటారు. నాటకాలకూ, పాట కచేరీలకూ వెళతారు. విస్తృతంగా ప్రయాణం చేస్తారు. ఆయన జీవితం ఆనందమయమయింది. యిద్దరు పిల్లలు 1887 లో కూతురూ, 1890 లో కొడుకూ కలగడంతో ఆయనకు మహాసంతోషం కలుగుతుంది.

ఆయనకు దుఃఖాలు లేకపోలేదు. ఆయనకు ఆరోగ్యం తరచు చెడిపోతుంది. దాంతో చేస్తున్నపని పక్కన పెట్టవలసివస్తుంది. కానీ కాస్త షుమారుగావుండా, అగిపోయిన పనిని మళ్లీ మళ్లీ చేపడతారు. ఆయనకు పనిదైవారాధన. అంతకంటే యెక్కువే కూడా. యెందుకంటే, "పనిదాని పాటికదే పరమగమ్యం" అని ఆయన భావం. నోటు పుస్తకాల్లోని ఆయన మాటలే యివి: "నాకు పనిమీద గొప్ప విశ్వాసంవుంది. యెగుమారుకు బాటను నిర్మిస్తుంది పని. యెవళ్ళ ప్రశంస మనం కోరుతామో, వాళ్ళ మనస్సులో మనమీద నమ్మకం కలిగించే సాధనం పని. సోమరితనంలోకి దిగజారిపోతూ, జీవితంలో ముందుకు పోలేనందుకు ఏడ్చే వాళ్ళమీద నాకు సానుభూతి లేదు. - నాకు పని ఒక అలవాటు, దానిపాటి కదే పరమ గమ్మం".

తనెంతో ప్రేమించిన తమ్ముడు శ్యామలరావు హఠాన్మరణం ఆయనకు యింకా యెక్కువ దుఃఖం కలిగించింది. అప్పారావుకన్నా వయసుకుమించిన తెలివిపరుడయిన శ్యామలరావు, విద్యార్థిగా తను సాధించిన ప్రశంసనీయమైన విజయాల ద్వారా గొప్ప ఆశలు రేపుతాడు. పండ్రెండవ యేటనే అతను కవిత్వం రాయడం మొదలు పెడతాడు. పిన్న వయసులోనే అనర్గలమైన వక్తగా గుర్తింపు పొందుతాడు. 1887 లో మద్రాసులో భారత జాతీయ కాంగ్రెస్ మూడో మహాసభ జరిగిన తర్వాత అతడు 'ది హిందూ' పత్రికలో 'లైన్స్ టు ఆలన్ హ్యూమ్' 'గ్రీటుంగ్స్ టు నార్టన్ అండ్ బెనర్జీ' అనే రచనలు ప్రచురిస్తాడు. అవి చిన్ని సంచలనాన్ని కల్గిస్తాయి. కానీ శంభు చంద్ర ముఖర్జీ అభిప్రాయంలో యీ రెండు గేయాలు కానీ, శ్యామలరావు యితర రచనలుగానీ పెద్ద విలువైనవి కావు. తన అభిప్రాయం కోరి నప్పుడు శ్యామలరావుకు ముఖర్జీ నిర్మొహమాటంగా చెబుతారు: "నీ రచనలు - నాకు పంపిన రచనలు నేను చదివినమేరకు, కవిత్వం కావు. అవి మంచి పద్యాలు కూడా కావు. ఒకోసారి పద్యాలేకావు' శ్యామలరావు అంతంత మాత్రం కవే అయినా పౌరవ్యక్తిగా రాణించి వుండవచ్చు. కానీ, మద్రాసులో లా కాలేజీలో చదువుతూవున్న సమయంలో జబ్బుపడి యిరవై అయిదోయేడు వచ్చీ రాక ముందే 1892 లో మరణిస్తాడు. అతని మరణం అప్పారావుగారికి యెంత ప్రచండమయిన అదురుపాటు కలిగిస్తుందంటే కొన్ని నెలలపాటు ఆయన యెందుకూ పనికి రాకుండా పోతారు. యితర విషాదాలూ, దుఃఖాలూ పేరుకుంటాయి. తన పోషణకిందవున్న పెద్ద బావ మరిది చెడుమార్గాలు పడతాడు. అతను తాగుడుకు అలవాటుపడి, వేశ్యను వుంచుకొని, పోలీసులతో యిబ్బందిపడి, ఆత్మహత్య చేసుకొంటాడు. కుటుంబ గౌరవానికి ఆ భ్రష్టునివల్ల కలిగిన తీవ్రమైన అఘాతంతో అతని తల్లిదండ్రులు అకాల మరణం పొందుతారు.

1892 కూ 1897 కూ మధ్య యీ ముసురుతున్న చీకట్లలో అప్పారావు కున్న రెండే రెండు కాంతి రేఖలు, ఆనంద గజపతిపట్ల పెరుగుతున్న ఆయన అనుబంధమూ, తన అత్యుత్తమ రచన అయిన 'కన్యాశుల్కం' రాయడమూ, ప్రదర్శించడమూ, ప్రచురించడమూ. యీ ఘటనలు ఆయన జీవితంలో అసాధారణమయిన ప్రాముఖ్యం గలవి కాబట్టి వాటికి ప్రత్యేక ప్రకరణాలు అవసరం.

## నే నిచ్చానంటే ఆత్మార్పణమే చేసుకుంటా

"ఇదిగో గమనించండి,
నేను వుపన్యాసాలివ్వను, ముష్టి యివ్వను; నేనిచ్చానంటే నన్ను నేనే అర్పించుకొంటా." వాల్ట్ విట్మన్

మొదట చాలా అయిష్టంగా, తర్వాత కాస్తా వెనుకాడుతూ, ఆ తర్వాత ధారాళంగా, అరమరలు లేకుండా, అప్పారావు ఆనంద గజపతికి తన్ను తాను అర్పించుకున్నాడు. ప్రపంచమంతటికీ, ఆనంద గజపతి 'మోహన రాకుమాడు', ఆయనకు అన్నీ వున్నాయి.

అభిజాత్యమూ, ఆకట్టు . కొనే మూర్తీ, డీవీ, విస్తారమయిన సంస్కృతీ టెన్నిలో, క్రికెట్ లో మంచి ఆటగాడు; సంగీతంలో, చిత్రలేఖనంలో కుశలురు. గుర్రపుస్వారీలో మేటి. ఆయన చెప్పుకోదగిన బహుభాషావేత్త - మాతృభాష అయిన తెలుగుగాక, సంస్కృతం, పార్శీ, ఉర్దూ, అరబిక్, ఇంగ్లీషులాంటి ఏడెనిమిది భాషల్లో ఆయనకు ప్రావీణ్యముంది. వంగభాష కూడా బాగావచ్చు. బహుభాషావేత్త మామూలుగా చేసేటట్లే, ఆయన తెలుగులోకి అనువదించిన సంస్కృత గ్రంథాల్లో ఒకటి 'లఘు కౌముది' అనే ఒక వ్యాకరణ గ్రంథం. సంస్కృతాన్ని పోషించడానికి ఆయన 'విజయనగరం సంస్కృత గ్రంథమాల' స్థాపించారు. దాని ప్రధాన లక్ష్యం అలభ్యమైన సంస్కృత గ్రంథాలను చౌకగా వునర్ముద్రించడం.

ఆనంద గజపతి ఆసక్తులు భాషా విజ్ఞానానికి పరిమితం కాలేదు. ఆయనకు సాహిత్యంమీద ప్రీతి, అది ప్రాచీనమయినా సరే, ఆధునిక మయినా సరే. సాహిత్య శాఖల్లో ఆయనకు ఎక్కువగా ప్రీతిపాత్రమైనవి కవిత్వం, నాటకం. ఉర్దూ, పార్శీ కవిగా రాణించాలని ఆయన ఆశించారు.

కానీ సాధించిందల్లా 'రషీది' అనే కలం పేరుతో రాసిన సద్గుణరహితమూ అసుపూర్ణమూ అయిన కొద్దిపాటి రచనలు. ముసుగు లేకుండా చెప్పాలంటే, కవిత్వం గురించి ఆయన భావాలు కాస్తా పురాతనమైనవీ, మొరటువీ. ఆయన "గాఢంగా మెచ్చుకున్నది వూహాప్రధానమూ, వుపేక్షాపూరితమూ అయిన ప్రేమ కవిత్వమూ, మధువు కవిత్వమూ." "అంతేకాక, మొత్తంమీద ఆయన "సాహిత్య అంచనా "లలో సర్వవిషయ సమాదరణ లేదు. మేధాశక్తిని చాటే రచనలు ఆయనకు మహా యిష్టం.

ఆనంద గజపతి అధ్యయనం చేసిన భిన్నవిషయాల్లో తర్కమూ, తత్వశాస్త్రమూ, కూడా వున్నాయి. తత్వవేత్తలలోకెల్లా జె. ఎస్. మిల్ "అతనికి బాగా నచ్చిన వాడు" స్తన శల్యపరీక్షచేసే ఖండితమైన తర్కమూ, తత్వశాస్త్రమూ ఆయనకు మహా యిష్టం కాబట్టి. కానీ, మిల్ జీవితంలో, చింతనలో వుండే అంతరార్థాలన్నీ ఆయన సంపూర్ణంగా గ్రహించి వుండజాలరు. కళా, సాహిత్యాభిమానిగా పేరుప్రతిష్టలున్న సంస్థానాధీశునికి తగినట్లుగా ఆనంద గజపతి, ప్రజ్ఞావంతులైన కవిపండిత కళాకారుల బృందాన్ని విజయనగరంలో తమచుట్టూ చేర్చుకున్నారు. వాళ్ళలో మరీ ప్రసిద్ధులు సంస్కృత పండితుడైన కాశీనాధశాస్త్రీ, కవీ, భాగవతారూ అయిన నారాయణదాసూ, వైణిక విద్వాంసుడైన వెంకటరమణ దాసూ. యిక పోతే వేశ్యలను కూడాయేరి తెచ్చిన కొంతమందిని ఆయన పోషించాడనుకోండి. బహుశా భారతదేశంలో యే సంస్థానంలో కూడా లేనంత సమ్మోహన కరమైనవాళ్ళను. యీ ప్రకరణ లోనే తర్వాత వాళ్ళ విషయానికి మనం రావలసివుంటుంది.

ఆనంద గజపతి పేరు దానధర్మాలకు దాదాపు మారుపేరు - రాజవంశీకుల్లో కూడా అరుదైన ఔదార్యంతో ఆయన పాత్రులైన వ్యక్తులకు సాయం చేశారు. సంస్థలకు యింకా యెక్కువ కూడా చేశారు.

ఆనంద గజపతి వుదాత్త వ్యక్తిత్వంలోని యీ అంశానికి సురేంద్రనాథ బెనర్జీ "రూపొందుతున్నజాతి" అనే తన ఆత్మకథలో దాదాపు మూడు పుటలు కేటాయించారు. బెనర్జీ యిలా అంటారు: "భూకోయిలాస్ రాజులు ఆయన అనువంశిక మిత్రులు. వాళ్లు డబ్బు యిబ్బందుల్లో వున్నారు. వాళ్లకు ఆయన గణనీయమైన ఆర్థిక సహాయం చేశారు. ఒక ఆంగ్ల వ్యాపార సంస్థకు కూడా ఆయన ఆలాగే సాయం చేశారు. ఆయన వుదారమైన అభిమానాలకు జాతీ, రంగూ, మతమూ అడ్డురాలేదు. మద్రాసులోగానీ, బెంగాల్ లోగానీ, సంయుక్త రాష్ట్రాల్లో కానీ, ప్రజాహిత వుద్యమాలకూ, సంస్థలకూ ఆయన వుదార పోషకులు. నిజానికి నిర్మాణ నిధికి ఆయన రెండువేల రూపాయలు విరాళం యివ్వవచ్చునని సురేంద్రనాథ బెనర్జీ ఆశిస్తే, ఆయన 15 వేల రూపాయలు యిచ్చారు. అది భవన నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చులో మూడొంతులు . మాముల్లర్ 'రుగ్వేదం' పరిష్కరింపబడిన రెండో కూర్పు ప్రచురణ కోసం మొత్తం ఖర్చు ఆయనే యిచ్చారు. మన ప్రాంతందాకా వస్తే 'ది హిందూ' దినపత్రిక తొలినాళ్ల గడ్డుకాలంలో ఆర్థిక సహాయం అవసర మయినప్పుడల్లా ఆయన మీద ఆధారపడేది.

లౌకికం తెలిసిన వాడూ, మహాసంపన్నుడూ అయిన తమ తండ్రి మూడవ విజయరామ గణపతి అనంతరం, 1871 లో మహారాజు అయిన ఆనంద గజపతి, అప్పుల్లో తలమునకలు కావడానికి యెంతో కాలంపట్టలేదు. "మాకు తలకుమించిన అప్పులున్నాయి. నీకులేవు" అని మహారాజా వారు తనతో అన్నది ఒక్కసారి కాదని అప్పారావు రాసుకున్నారు. ఆ మాట పై వ్యాఖ్యానంగా "నేను కటిక దరిద్రుణ్ణని మహారాజావారికి తెలియదు". అని అయన నోటుపుస్తకాల్లో రాసుకున్నప్పుడు, ఆయన ముఖం యెలా ముడుచుకు పోయి వుంటుందో మనం సులభంగా వూహించుకోవచ్చు.

భారతదేశంలోని చిన్నా పెద్దా సాధారణ సంస్థానాధిపతులతో పోలిస్తే ఆనంద గజపతి గౌరవార్హులు. అయినా, తమ వర్గానికుండే బలహీనతలలో కొన్నిటినుండి ఆయన పూర్తిగా దూరం కాలేదు. ఆయనకు "చిన్నప్పటి సంపర్కాలవల్లా, ఆశ్రితుల ముఖస్తుతుల వల్లా సంగీతం, గుర్రపుస్వారీలాంటి ఒకటి రెండు విద్యల్లో కలిగిన నైపుణ్యంతో బలపడిన యితరులను మించి పోవాలనే తపనవల్లా వర్ధిల్లిన సహజమైన అహంకారం" వుండేది.

ఆయనకు మరొక 'తపన' సయితం వుండేది. అది తన జమీందారీకి రాజసంస్థాపన స్థాయి సంపాదించు కోవాలనేది. బ్రిటిషు కాలంలో భారత దేశంలో 585 రాజసంస్థానా లుండేవి. అవి ఒకవైపున (1931 జనాభా లెక్కల ప్రకారం) పద్నాలుగు మిలియన్ల జనాభాతో పరుచుకొని వున్న హైదరాబాదు మొదలుకొని, మరోవైపు 29 మంది జీవులు మాత్రమేవున్న నలుసులాంటి బిల్బరీ వరకూ వున్నాయి. వాటిని "రాజ్యాలు" అనడం అసంబద్ధం. లీ వార్నర్ "భారతదేశ రక్షిత రాజులు" అనే గ్రంథంలో యిలా రాశారు. "భారత దేశాంతర్భాగంలోని యే సంస్థానానికీ, యింటా బయటా సంపూర్ణ సర్వసత్తాక లక్షణాలు లేవు. యెందుకంటె దేనికీ యుద్ధం ప్రకటించడానికైనా, శాంతి ప్రకటించడానికైనా, అధికారం లేదు. యితర సంస్థానాలలో సంప్రదింపులు జరిపే హక్కులేదు".... ఆంతరంగిక పరిపాలనలో సయితం, కీలక విషయా లన్నిటిలోనూ బ్రిటిషు రెసిడెంటుదే చివరిమాట. నిజానికి క్రియలో అతనే సర్వాధికారి. కొచ్చిన్ సంస్థానం కాదు. కానీ బ్రిటిషు రెసిడెంటు కర్నల్ మెకాలె సామ్రాజ్యవాద దురహంకారంతో కొచ్చిన్ పరిపాలకునికి వర్తమానం యిలా పంపగలిగాడు: "రెసిడెంట్ కొచ్చిన్ దగ్గరకు వచ్చినప్పుడు కొచ్చిన్ రాజా ఆయనను దర్శనం చేసుకొనే వీలుచేసుకుంటాడని తెలిస్తే రెసిడెంట్ సంతోషిస్తారు".

ఆనంద గజపతికి యివన్నీ తెలుసు. యింకా యెక్కవే తెలుసు. అయినా, వంశగర్వం మూలంగా ఆయన సంస్థాన స్థాయిని పొందేందుకు తమ జమీందారీకి వుండే హక్కుల్ని నిరూపించే నిమిత్తం ఎన్నోయేళ్లు, యెంతో డబ్బు వ్యర్థం చేశారు.

పురాణాలలోని సూర్యవంశ స్థాపకుని నుండీ తనదాకా తమవంశ వృక్షాన్ని నిరూపించే వ్యర్థ ప్రయత్నంలో ఆయన "కృష్ణ విజయము" 'ఉషాభ్యుదయము' 'విష్ణుభక్తి సుధాకరము' అనే మధ్యయుగాల వుత్తరార్థానికి చెందిన ప్రబంధాల నుండీ రాజవంశ వృక్షాలను తెలియచేసే పద్యాలు యేరడానికి పండితులను నియమించారు. ఈస్టిండియా కంపెనీనాటి దుమ్ము పట్టిన పాత రికార్డులను ఆయన స్వయంగా తవ్వి 'సంధి' అనే బృహద్గ్రంథాన్ని తయారు చేశారు. 1794 లో పద్మనాభ యుద్ధంలో రెండవ విజయరామ గజపతి మరణించాక, ఆ మృతవీరుని కొడుకుకూ, మనమనికీ బ్రిటిషు వాళ్లు అన్యాయంచేసి, క్రమక్రమంగా వాళ్ల భూభాగాన్నీ, బిరుదలనూ తగ్గించివేశారని ఆ బృహద్గ్రంథంలో ఆయన రుజువు పరచడానికి ప్రయత్నించారు. తమ వాదాన్ని యింకా బలపరచుకొనేందుకు ఆయన విజయనగర వంశచరిత్ర రాయడానికి ఒక పథకం ప్రారంభించారు. అనారోగ్యం దృష్ట్యా, దుర్బలమవుతున్న కంఠం దృష్ట్యా, లెక్చరర్ వుద్యోగం మానుకోమని, 1896 లో డాక్టర్లు అప్పారావుకు సలహా యిచ్చారు. దాంతో ఆనంద గజపతి ఆయనను సంస్థాన శాసన పరిశోధకుడుగా నియమించి, ఆ చరిత్రకోసం సమాచారం సేకరించే పనేకాక, దాన్ని రాసేపనికూడా ఆయనకే అప్పగించారు. అది సులభమైన బాధ్యత యేమీకాదు. కానీ కార్యరంగంలో, పనిలో మార్పు వచ్చినందుకు, సంతోషిస్తూ అప్పారావు ప్రత్యేకంగా విజయనగర చరిత్రకూ, మొత్తం మీద కళింగ చరిత్రకూ కొంత సంబంధంవుండే పాత శాసనాల ప్రతులూ తీసుకోడానికి మద్రాసు, బెంగుళూరు, బెజవాడ, గుంటూరు, శ్రీకాకులం, త్రిపూర్ మొదలైన చోట్లకు ప్రయాణాలు చేశారు. శాసనప్రతులే కాక, కర్నల్ మెకంజీచేత సేకరింపబడి, మద్రాసు ప్రాచ్య లిఖితపత్ర భాండాగారంలో భద్రపరచబడిన స్థానిక చరిత్రలనుండీ తనపనికి సంబంధించిన సమాచారం కూడా ఆయన సమకూర్చు కున్నారు. ఆ చరిత్రరచన ఆరంభించడానికి తగినంత సమాచారం రెండేళ్లలో సమకూరింది. కానీ, ఈలోగా మహా రాజావారు ఒక దుర్ఘటనలో మరణించారు. అంటే ఆ పథకం శాశ్వతంగా వదలి వేయడం కాదు, అనుకున్నా అది నిరవధికంగా వాయిదాపడింది.

తాను కేవలం హిజ్ హైనెస్ అని పిలుచుకోవడానికో, ఫిరంగుల వందనం అందుకోవడానికో గాక, తన ప్రాచీన రాజవంశ ప్రతిష్ఠను పునరుద్ధరించుకోడానికి న్యాయమైన పోరాటం చేస్తున్నట్లు, ఆనందగజపతి భావించిన మాట నిజమే. కానీ, అప్పారావు మనఃప్రవృత్తినిబట్టి చూస్తే, మహారాజావారు నిజంగా అంతవిలువలేని దానికోసం అపేక్షిస్తున్నట్లు ఆయనకు అనిపించి వుండాలి. ఐతే ఈ విషయంలో మహారాజావారి తపన స్వచ్ఛమైందని ఆయన అంగీకరించారు. మహారాజావారి మరణం తర్వాత, ఆయన తన నోటుపుస్తకాల్లో రాసుకున్నది యిది:

"రాజువంశ గతచరిత్రను సింహావలోకనం చేస్తే, ఆయన రక్తనాళాల్లో యోధులవంశరక్తం ప్రవహిస్తోంది. ఆవేశాలను అణచివేసే పాశ్చాత్య సంస్కృతి ప్రభావమూ, తత్వశాస్త్ర ప్రభావమూ ఆయన మీదవున్నా, అనుభూతులను అధిగమించే నిమిత్తం ఆయన పొందిన శిక్షణ ప్రభావం కూడా వున్నా, ఆయన తీవ్ర స్వభావుడు. అలాంటి మహారాజావారు యీ ప్రాంతాల్లో యెవరి అధికారస్థాపన విషయంలో యీ స్థితికి దించినందుకు, బాధపడకుండా వుండలేరు. ప్రత్యేక హక్కులు కావాలని అడిగేందుకు ఆయనకు అభిమానం అడ్డువచ్చింది. ప్రభుత్వోద్యోగులతో ఆయన హేతుపూర్వకంగా పోరాడుతూ వచ్చారు. వాళ్ళేమో ఆయన వాదాలను నిరాధారమైనవిగా పరిగణించి, నిర్దాక్షిణ్యంగా ఆయనను అణగదొక్కి పెట్టారు. తన భావాలను ముందుంచడంలో అనుచితంగా ప్రవర్తించినట్లు గానీ, అసంతృప్తి వెల్లడించినట్లుగానీ తనమీదకు ఆరోపణ రాకుండా, తన విధేయతను ఆయన సమృద్ధిగా ప్రకటించారు. యేమైనా అది స్వచ్ఛమైన అనుభూతి; ఆయన స్వభావంలో అంతర్నిహితమైన రుజుత్వాన్ని బట్టి చూస్తే, దాన్ని సందేహించేందుకు అవకాశమే లేదు."

ఆనందగజపతి బలహీనతల్లో, అనాలోచిత వ్యవహారాల్లో అప్పారావును నిజంగా బాధించింది, రామస్వామితో ఆయన సంబంధం. మహారాజావారి అంతస్తుకు చిహ్నంగా వారి కొలువులో మనోజ్ఞ వేశ్యాబృంద ఉన్నట్లు అప్పారావుకు

తెలుసుననడంలో సందేహం లేదు. కానీ వాళ్ళు మహారాజావారి సుఖం కోసం కాక, వాళ్ళ అతిథుల సుఖం కోసం అని ఆయన అనుకున్నారు. విజయనగరంలో 1897 జనవరి 2వ తేదీ తన డైరీలో "మహారాజా హోల్కార్ ఆగమం" అని ఆయన రాసుకున్నారు. మూడు రోజుల తర్వాత "హోల్కార్ మహారాజా రాజభవనం నుండీ ముగ్గురు వేశ్యల్ని తీసుకువెళ్ళి, వాళ్ళను గోదావరి (రైల్వే స్టేషన్) నుంచీ వెనక్కి పంపారు" అని డైరీలో ఉంది. 29 తేదీనాడు "ఆ దేవకాంతల కోసం మహారాజా హోల్కార్ తంతి ఇచ్చారు" అని మూడవ ఆరోపం. ఇతర సంస్థానాధీశ్వరుల కంటే కొట్టవచ్చినంత తేడాలో తమ మహారాజువారు "అద్భుతమైన ఆత్మనిగ్రహం" గల ఆదర్శ సద్గుణ సంపన్నులని అప్పారావు విశ్వసించారు. మహారాజావారు ఒక మారు అప్పారావుతో "ధర్మపత్నితో తప్ప ఇతరులతో కామ వ్యాపారం ఎప్పుడో వదిలా"నని చెప్పడంతో ఆ విశ్వాసం బలపడింది. అది నిజం కాదని రుజువైనప్పుడు మహారాజావారిని గురించి చాలా యేళ్ళుగా అప్పారావు తన మనస్సులో నిర్మించుకొన్న అద్భుత చిత్రం వెయ్యి ముక్కలైంది.

ఆనందగజపతి భార్య వనజకుమారీదేవి జయపురం రాజకుటుంబానికి దగ్గర బంధువు. ఆనందగజపతితో ఆమె వైవాహిక జీవితం పరమ సంతోషమయంగా ఉండింది. కానీ, అది అతి శీఘ్రంగా, అతి ఆకస్మికంగా ముగిసింది. ఆమె 1896లో నిస్సంతుగా మరణించారు. ఆ క్రూరమైన దెబ్బతో ఆనందగజపతి జీవితం పెడదోవ పడుతుంది. అప్పటి నుంచీ, చాలామంది స్త్రీలు ఆయన జీవితంలో ప్రవేశిస్తారు. వాళ్ళలో ఒకామె "అప్స్.యన్" తాను ప్రేమించే భార్యతో పోలిక గల యువతి కన్పిస్తే ఆమె మీద ఇష్టం మొదలౌతుంది అని అప్పారావు అంటారు. ఇంక, రెండో ఆమె నారాయణస్వామి, మూడో ఆమె వెంకటస్వామి. ఇంకా కొందరు 'స్వాములు' ఉండివుండవచ్చు. ఏమైనా, ఇది మాత్రం నిశ్చయం. ఆనందగజపతిని అందరికన్నా ఎక్కువగా మోహ వివశుని చేసిన వ్యక్తి రామస్వామి. నిజానికి ఆయన ఆమెపట్ల ఎంత మోహ వివశుడయ్యారంటే, ఆమెను పెళ్ళి చేసుకునేందుకు నిశ్చయించుకున్నారు.

ఆనందగజపతి స్త్రీలో కోరింది నాజూకుతనంతో కూడిన సౌందర్యమూ, సుసంస్కృత బుద్ధితో కూడిన సాహచర్యమూ. అప్పారావు రాసి పెట్టుకున్న సూక్తుల్లో ఒకటి. "అందం బలప్రయోగం చేయని రాజు". మరొకటి హెచ్చరిస్తుంది కదా: "అందం తొందరగా కంటికి పాతబడిపోతుంది.

సౌశీల్యానికి మాత్రమే ఎప్పుడు నశించని ఆకర్షణ ఉంది". మూడు ఇలా ఉద్ఘాటిస్తుంది: "స్త్రీ శరీరాన్ని పొందడంలోగానీ, సొంతం చేసుకోవడంలో గానీ, గొప్పదనం లేదు, వళ్ళయినా మనస్సును పొందారు. అలాంటి రుచులు, విశ్వాసాలు గలవారు పెట్టి, ఆనందగజపతి రామస్వామికీ, వెంకటస్వామికి శిక్షణ ఇచ్చే బాధ్యతను తానే తీసుకున్నారు. కానీ త్వరలోనే "అతనికి తన బాధను అమలు పరచడంలో అశ్రదా వాటికి అనుగుణంగా నడచుకోడంలో నిరంతర వైఫల్యాలు ఎదురైనప్పుడు, ఆశావాది అయిన ఉపాధ్యాయునికి కలిగే ఆత్రమూ, అసహ్యమూ కలగడం మొదలైనట్లు కనిపిస్తుంది. ఈ "ఆత్రమూ, అసహ్యమూ - బహుశా వీటి మూలంగానే ఆయన రామస్వామిని అప్పారావు గురుత్వం కింద ఉంచారు. ఆ పని చేసేటప్పుడు ఆయన "మా అమ్మగారికీ, మా అక్కరికీ మీమీద అచంచలమైన విశ్వాసం ఉంది" అని చెప్పారు. అప్పారావును సంకట పరిస్థితిలో పెడుతున్నట్లు ఆయనకు తెలుసు. అందువల్ల ఆయన మళ్ళీ ఇలా అన్నారు:

"మీకు నేను చాలా రుణపడి ఉన్నాను. నా కండలు కోసి ఇచ్చినా ఆ రుణం తీరదు. ఉదాత్తమైన ఆశయాలనూ ఉద్దేశాలనూ లోకం గ్రహించదు. ఆయన ఆ పిల్లను ప్రేమిస్తున్నాడు, కాబట్టి ఆమె దగ్గరకు పోతున్నాడనో, ఆమె ద్వారా స్వలాభం పొందగోరుతున్నాడని, రాజావారి అనుగ్రహం సంపాదించగోరుతున్నాడనో అనగల అజ్ఞానులూ, మూర్ఖులూ చేసే దుర్వ్యాఖ్యానాలకు గురి అవుతూ మీరు అధైర్యపడలేదు".

ఈ కొత్త పరిస్థితికి అప్పారావు ఎలా ప్రతిస్పందించారు? ఈ విషయంపై మనం ఊహించవలసిన అవసరంలేదు. ఆయనే తన నోటుపుస్తకాల్లోని ఒక సుదీర్ఘ ఆరోపంలో తన సంక్షుభిత మనస్సును స్పష్టంగా మనకు వివరిస్తారు. దానిలోని మరీ ముఖ్యమైన కొద్ది భాగాలు ఇవి:
"నేను రామస్వామి బాధ్యత చూస్తున్నాను. కొద్ది సంవత్సరాల కాలం, నా అభిప్రాయాల్లో ఎంత మార్పు తెచ్చింది! మహారాజావారు మొదట రామస్వామిని తెచ్చుకున్నప్పుడు, ఆ విషయం విని నేనెంతో విచారపడ్డాను. మహారాజావారి గత జీవితం గురించి నా కుండే అభిప్రాయాన్ని బట్టి అలాటి విషయం జరుగుతుందని నేను ఊహించలేదు. అయితే ఆయన పూర్వజీవితం గరించి నాకు తెలిసింది చాలా తక్కువ. కాబట్టి అది నాకు విచారకరమైన ఆశ్చర్యంగా, గొప్ప ఆశ్చర్యంగా ఉండింది. బాధపడ్డానని చెబితేచాలు.

అంత మంచితనమూ, సామర్థ్యమూ, గొప్ప భవిష్యత్తూ ఉండే మా మహారాజావారు ఒక్క దెబ్బతో తమ అవకాశాలన్నిటినీ పేల్చివేసినందుకు నా స్వాభిమానం దెబ్బతింది... తర్వాత తర్వాత వార్తల ద్వారా కొన్ని ఘటనలు నాకు తెలిసినప్పుడు, అవి పాతబడ్డ విషయాలుగా నాకు అనిపించ లేదు. తద్భిన్నంగా నాదుఃఖం పెరిగింది. - తర్వాత నాకు మహారాజావారితో మరింత సన్నిహిత పరిచయం కలిగింది. రామస్వామితో కూడా నా పరిచయం పెరిగింది. రామస్వామిలోని మంచి గుణాలు గ్రహించాను. కానీ, చెడ్డగుణాలు అంతకంటే యెక్కువగావున్నాయి. చివరకు ఆమె బాధ్యత నాకు అప్పగించ బడింది. లేదా, అలా జరుగుతుందని వూహించి, ముందుగా నేనే ఆమె బాధ్యతను తీసుకొన్నానని అనవచ్చు. నా అభిప్రాయాల్లో మరొక మలుపు. గత ఆరేళ్ళలో నా పర్యాలోచనా శక్తి, జీవిత పరిజ్ఞానమూ పెరిగాయి. నా . అయిష్టమూ, ద్వేషమూ దురభిప్రాయమూ వగైరాలను అణచుకోవడమూ, సానుభూతి చూపడమూ నేర్చుకొన్నాను. సానుభూతి అనేది సాహిత్య జీవికి విధిగా వుండవలసిన గుణం."

అప్పారావు జాజ్వలమానమైన సానుభూతిని కూడా రామస్వామి తరచుగా బెదరగొట్టేది. అయితే, ఆనందగజపతి పట్ల ఆయన ప్రేమ, విధేయతలు ఎలాంటివంటే, వాల్ట్ విట్మ లాగే ఆయన కూడా ఇలా అనివుండవచ్చు:

## నూత నాగంతకుడు

"వుల్లాస నూత నాగంతకుడా! విన్నాను, నీ వాక్కు విన్నాను, ఆనందపడ్డాను." - వర్డ్స్ వర్త్

ఎప్పుడో ఒకసారి అప్పారావు నాటకకర్తగా ఆవిర్భవించేవారే. ఆయన ప్రతిభలో నాటకీయ స్వభావం బలంగా ఉండేది. ఆంగ్లంలో కవిత్వం రాయడానికి ఆయన చేసిన మొదటి ప్రముఖ ప్రయత్నం 'సారంగధర'. దాని ఇతివృత్తమూ, సన్నివేశ కల్పనా రెండూ నాటకీయంగా ఉన్నాయి. ఆయన కవితల్లో రెండు మూడు ఛందోబద్ధమైన నాటకీయ దృశ్యాలు, ఆయన కథలన్నిటికీ నాటకీయమైన ప్రారంభాలూ, ముగింపులూ ఉన్నాయి. ఇక ఆయన డైరీల్లోనూ, నోటు పుస్తకాల్లోనూ, ఇతర సంగతులతోపాటు నాటకాల కోసం దృశ్య వివరాలూ, ఏదో ఒక రోజు తన నాటకాల్లో పాత్రలుగా ప్రవేశించ గలిగిన స్త్రీ పురుషుల వర్ణనలూ, హాస్యపూరిత సన్నివేశాల మీద సంక్షిప్తంగా రాసుకున్న వివరాలూ, నటులమీదా, నటనమీదా, నాటకకర్తల మీదా, నాటక దర్శకుల మీదా, వ్యాఖ్యానాలూ ఉన్నాయి. నోటుపుస్తకాల్లో అలాంటి ఆరోపాలన్నిటికీ 'ఎం.ఒ. అనే గుర్తుంది. ' అంటే నా సొంత ఆలోచనలూ, అభిప్రాయాలూ, వ్యాఖ్యలు అని అర్థం, అనే వివరణ గుర్తుపక్క ఉంది. జాగరూకమైన ఆయన కంటినీ, అప్రమత్తమైన మనస్సునూ యేదీ తప్పించుకోలేదు. 'మానసికమైన ఇబ్బంది' అనే శీర్షిక కింద ఆయన రాసుకున్న అభిప్రాయాలు ఇవి:

“అపరాధ భావంవల్లనో, తక్కువ స్థాయి వల్లనో, భయం వల్లనో, ఎదుటి వ్యక్తి మీద గౌరవం వల్లనో సంభాషణ సమయంలో మనుషులకు ఆత్మవిశ్వాసం లేనప్పుడు పెన్సిలు, పేనా లాంటి యేదో ఒక వస్తువును చేతబట్టుకొని వాళ్ళు అటూయిటూ ఆడిస్తారు, (దానివల్ల వాళ్ళకు ఆలోచించుకోడానికీ, భయం కలిగించే పనినుంచి, తమ మెదడు చెప్పే ప్రతికూలాభిప్రాయం నుంచి తప్పుకోవడానికి వ్యవధి లభిస్తుంది.

అలాంటి కారణం లేకుండానే బహుశా ప్రధానంగా ఆత్మవిశ్వాసం లేకపోవడం మూలంగా కొంతమందికి ముక్కు నలుపుకోవడమూ, వేళ్ళు విరుచుకోవడమూ లాంటి సాధారణ స్వభావం ఉంటుంది”.

మానవజీవిత విషాద హాస్యనాటకం గురించి మరింత ఖచ్చితమైన అవగాహన ఉండే అప్పారావు, హాస్య సన్నివేశాలమీద తన నోటుపుస్తకాల్లో కొద్ది దాఖలాలు రాసుకున్నారు. మూడు రకాల బడాయి మాటలను ఆయన గుర్తిస్తారు: (1) ప్రతివాణ్ణి, ప్రతిదాన్నీ తేలికగా మాట్లాడడం (2) బడాయిలో మరొకరిని మించిపోవడం (3) తమ పూర్వీకుల గురించి గొప్పలు చెప్పుకోవడం. ఈ మూడు రకాల కింద మాదిరి బడాయి మాటలను, పదబంధాలను, వాస్తవ జీవితంనుంచీ ఆయన ఉల్లేఖిస్తారు. 'ఎం. ఒ' అనే గుర్తు ఉండేవాటిలో అన్నిటికన్నా పెద్దది “భట్రాజుగారి అబ్బాయి స్వభావం గురించి" రాసుకున్నది. అప్పారావు సృష్టించిన అత్యంత ప్రసిద్ధమైన పాత్రల్లో ఒకరైన గిరీశం, ఈ ' భట్రాజుగారి అబ్బాయి' యొక్క మరింత జీవవంతమైన, మరింత లజ్జారహితమైన, మరింత ఆకర్షణీయమైన కవల సోదరుడే అని గుర్తించడానికి మన ఊహాశక్తిని శ్రమ పెట్టనక్కరలేదు.

అప్పారావు సాహిత్యాధ్యయనంలో కూడా అదే శ్రద్ధ, అదే ఉత్సాహమూ ఉన్నాయి. ఆయన సాహిత్యాన్ని చదువుకునేది విజయనగరం మహారాజా కళాశాలలో ఆంగ్లోపన్యాసకులైనందువల్లనే కాదు. దానికి ఆయనకు స్వయంగా ఆసక్తి - వ్యామోహం అనదగినంత ఆసక్తి - ఉన్నందువల్ల కూడా. నిజానికి 1896లో కళాశాలలో ఉద్యోగం వదలి పెట్టాక ఆయన సాహిత్యాన్ని మరింత శ్రద్ధగా అధ్యయనం చేస్తారు. మద్రాసులో మహారాజావారి రాజభవనం అడ్మిరాలీలో ఆయన తరచు, చాలా రోజుల తరబడి ఉండేవారు. అనారోగ్యం నుంచి కోలుకోడానికి, కొంతవరకు విజయనగర రాజచరిత్ర మీద పరిశోధన చేయడానికి ఆయన అలా ఉండేవారు. అక్కడ గుట్టలు గుట్టలు పుస్తకాలూ, పత్రికలూ ఆయనకు అందుబాటులో ఉండేవి. ఆయన ప్రధాన అధ్యయన విషయం చరిత్ర అనీ, తర్వాతివి నాటకమూ, నాటక రంగస్థలమూ అనీ ఆయన డైరీలలోని ఆరోపాలబట్టి తెలుస్తుంది. ఆ సంవత్సరాల్లో ఆయన చదివిన వాటిలో నాటకాలూ, నాటక విమర్శలూ, నాటకకర్త జీవిత చరిత్రలూ కాకుండా 'విదేశనటులూ, ఆంగ్ల నాటకమూ' అనే విషయం మీద 'కార్న్ హిల్ మేగజైన్' లోని వ్యాసాలు - 'ఒక నాటక రచయిత బాధలు, 'చైనాలో నాటకరంగం', 'ఫ్రాన్స్ లో షేక్స్ పియర్', 'ఆహార్యమూ, పాత్రా', 'నాటకాల సెన్సార్ షిప్', 'మోలియర్ కు పూర్వం పారిస్ నాటక రంగం', 'షేక్స్ పియర్ విషాద నాటకాలు రాసింది ఎందుకు? 'ఫాస్టూ తోలుబొమ్మలాట కథానాయకుడూ' వగైరా - ఉన్నాయి. నాటకం పట్లా, నాటకరంగం పట్లో ఇంత యిష్టం, ఇంత వ్యామోహం ఉంది కాబట్టి అప్పారావు నాటకకర్తగా మొట్టమొదటి ప్రయత్నంలో ఆయన సాధించిన ఆధునికత.

తెలుగు ఆధునిక నాటక రచయితల్లో అప్పారావు ప్రథములు కారు. అయితే ఆయన కంటే ముందున్న అయిదారు మంది విషయంలో ఆధునికత అనే విశేషణం వాళ్ళ మనసులకంటే, వాళ్ళ కాలానికే ఎక్కువ వర్తిస్తుంది. పెద్ద మినహాయింపు వీరేశలింగం (1848-1919). కానీ, ఆయనకు కూడా ఆధునిక తత్వం అప్పారావుకు ఒంటబట్టినంతగా పట్టలేదు. దీనికొక ముఖ్యకారణం వీరేశలింగం గ్రంథ పఠనం అప్పారావు పఠన మంత విస్తృతమూ, వైవిధ్యపూరితమూ కాకపోవడం.

ఆ కారణం వల్ల ప్రపంచ భావనలోని సరికొత్త ధోరణులతో, మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే, ప్రపంచ నాటకంలో, నాటకరంగంలో వచ్చిన అత్యాధునిక పరిణామాలతో ఆయన పరిచయం అంత సమకాలికం కాకపోవడం కూడా.

ఐతే అప్పారావుకు సైతం, తన కాలంతో పాటు నడవాలనే పట్టుదలవున్నా, ఆయన హెన్రిక్ ఇబ్సెన్ (1828-1906), జామ్స్ జర్న్ జాన్సన్ (1832-1910), అగస్ట్ స్ట్రిండ్ బెర్గ్ (1849-1912), క్రిస్టియన్ ఫ్రెడరిక్ హెబ్బెల్ (1813-1863), ఒట్టో లుడ్విగ్ (1813-1865), హెర్మెన్ సూడర్మన్ (1857-1928), అంతన్ చే హోవ్ (1860-1904) - ఆధునిక నాటకాన్ని సృష్టించిన ప్రముఖ ఐరోపీయ నాటకకర్తలలో ఈ ఏడుగురినీ గుర్తించ లేకపోయారు. గుర్తించలేకపోవడానికి కారణం స్పష్టంగానే తెలుస్తోంది. తక్కిన వాళ్ళ సంగతి యెందుకు గానీ, మహోన్నతులైన యీ యేడుగరిలో అగ్రగణ్యుడైన ఇబ్సెన్, విదేశాలలో గుర్తింపు పొందడానికి యెంతో కాలం యెదురు చూడవలసి వచ్చింది. యింగ్లండులో ఆయనను మొదట అలక్ష్యం చేశారు. తర్వాత ద్వేషించారు, యేవగించు కున్నారు, అభిశంసించారు. ఆయన నాటకాలు రాయడం ఆరంభించాక ముప్పైయేళ్ళకు లండన్లో ఒక నాటకం ప్రదర్శింపబడింది - అదికూడా మాటినీగా ఒకేసారి; అది 1880లో. ఆయన మరొక నాటకం 1891 లో మాత్రమే ప్రదర్శింపబడింది. ఆ మధ్యకాలంలో ఆయన నాటకాలు ఆంగ్లంలోకి అనూదితమై, ప్రచురితమైన మాట వాస్తవమే. కానీ ప్రతి కొత్త దాని మీదా అంతకు ముందు దానిమీద కంటే విషం గక్కడం జరిగింది; “తన నాటకాలనబడే వాటిలో నిర్మాణం లేకపోవడం అటుంచి, వుద్దేశ పూర్వకంగా మానవ జీవితంలోని మరీ మురికి మూలలనుంచీ, అత్యంత నీచమైన మూలలనుంచీ, చివరకు అత్యంత దుస్సహమైన మూలలనుంచి కూడా తన యితివృత్తాలను తీసుకునేనాటక కర్త” అంటూ ఇబ్సెన్ ను ఒక విమర్శకుడు దుయ్యబట్టాడు. మరొక విమర్శకుడు ఇబ్సెన్ రాసిన ఒక నాటకాన్ని “మూతలేని మురుగు కాలవ” అంటూ యేవగింపుతో కొట్టి పారేశాడు. విలియం ఆర్చర్, బెర్నార్డ్ షా ప్రభావకంగా యిరవై యేళ్ళపాటు ఇబ్సెన్ ను వెనుక వేసుక వచ్చిన తర్వాతనే యింగ్లండు ఆయనను మహా నాటకకర్తగా గుర్తించింది. జాన్సన్, స్ట్రిండ్ బెర్గ్, చేహోవ్ మొదలైన వాళ్ళకు కూడా యిరవయ్యో శతాబ్ది ప్రారంభం నుంచీ మాత్రమే ప్రపంచ ప్రఖ్యాతి లభించింది.

అప్పారావు 'కన్యాశుల్కం' యెంత ఆధునిక నాటకమంటే వుదాహరణకు ఇబ్సెన్ సమాజస్తంభాలు అనే నాటకమంత. దీని నిర్మాణం ఇబ్సెన్ నాటక నిర్మాణం అంత తీర్చినట్టుగా, నిపుణంగాలేదు కానీ, దాని ఆధునిక తత్వం దీనికి ఉంది. 'కన్యాశుల్కం' ప్రథమ ప్రదర్శన కాలం 1892 లో లేదా దానికి ఒకటి రెండేళ్ళు ముందు. ఆ నాటకం రాయడానికి గురుజాడకు వుత్తేజమిచ్చింది ఇబ్సెన్ గానీ, చేహోవ్ గానీ మరొక ప్రముఖనాటక కర్తగానీ కాకపోతే మరెవరై వుండవచ్చు? ఆయనకు కావలసిన పూర్తి ఉత్తేజం ఆయనలోనే కలిగింది అనే సిద్ధాంతం వాదానికి నిలవదు. అత్యంత మౌలికమైన రచయితలు కూడా యేదో ఒక మేరకు, యెంతకొద్ది మేరకైనా, తను పూర్వీకులకు తప్పనిసరి ఋణపడి ఉంటారు. అయితే మరి అప్పారావు యెవరికి ఋణపడి ఉండవచ్చు?

అల్లార్థిస్ నికోవ్ 'పందొమ్మిదో శతాబ్ది చివరిభాగపు నాటక చరిత్ర, 1850-1900 చదివితే, ఆధునిక నాటకకర్తల్లో ఒకరైన విలియం రాబర్ట్ సన్ (1819-1871) వల్ల అప్పారావు ఎంతో ప్రభావితుడైనట్లు మనం గట్టిగా ఊహింపవచ్చు. రాబర్ట్ సన్ ప్రవేశపెట్టిన రెండు ముఖ్యమైన కొత్తరీతులు: ప్రేక్షకులు తమ సొంత విషయాలను నాటకరంగం మధ్యకు తీసుకువెళ్ళేటట్లు చేయడం, అచ్చం “తమ సొంత ఇళ్ళలో వినే భాషలోనే వాటిని తేల్చుకోవడం”. అతని -ఘనవిజయం 'సమాజం' (1865), అతని అత్యుత్తమ హాస్యనాటకం 'కులం' (1867), ఆంగ్లనాటకం, నాటకరంగం - వీటిపై ప్రామాణికుడైన ఒక రచయిత ప్రకా00 'కులం' రచన ద్వారా రాబర్టన్ “ఆధునిక నాటక వైతాళికుడ"య్యాడు.

గురజాడ విజయనగరంలో 'కులం' ప్రదర్శన చూసినట్లు ఆయన 1897 డైరీలో ఉంది. ఆ నాటికి చాలాకాలం కిందటే ఆయన ఆ నాటకం చదివి ఉండాలి. రాబర్టన్ వెనువెంటనే వచ్చిన సర్ విలియం యస్. గిల్బర్ట్ (1836-1911), సర్ ఆర్థర్ పినేరో (1855-1934) హెన్రీ ఆర్థర్ జోన్స్ (1851-1929) లాంటి వాళ్ళ నాటకాలు కూడా ఆయన వివేచనా పూర్వకంగా చదివి ఉండాలి. ఆయన డైరీల్లో వాళ్ళు కనిపిస్తారు.

రాబర్ట్ లా అప్పారావు సైతం ఒక సమకాలిక సమస్యను తన ఇతివృత్తంగా స్వీకరిస్తారు. రాబర్ట్ లాగే ఆయనకూడా మన ఇళ్ళల్లో మాట్లాడుకునే భాషలాంటి భాషనే ఉపయోగిస్తారు.

మరొక పోలిక: ఇద్దరూ తమ నాటకాల్లో అభిజాత్యపు భేషజాల బూటకాన్ని బట్టబయలు చేస్తారు. పుట్టుకనుబట్టి బ్రాహ్మలైన వాళ్ళను అప్పారావు దుయ్యబడితే, రాబర్ట్సన్ అంతస్తువల్లా, మనః ప్రవత్తివల్లా బ్రాహ్మలైన వర్గస్పృహపూరితులైన ఆంగ్లేయులపై విరుచుక పడతారు. నిశిత దృష్టివుండే ఒక రచయిత అన్నట్లు "బ్రాహ్మల్లో సుప్రతిష్ఠితమైన శాసనాల ముసుగులో ఉండేదీ, ఘనమైన ఆర్యజాతి అత్యంత పాశ్చాత్య ప్రతినిధుల్లో శాసనాలకంటే తక్కువ శక్తిమంతం కాని దురభిప్రాయం ద్వారా ఏర్పడిందీ" అయిన సామాజిక అంతస్తులను రాబర్ట్ సన్ ' కులం' చర్చిస్తుంది.

సంస్కృత నాటకాలు ప్రదర్శించడానికి ఆనందగజపతి స్థాపించిన నాటక సంస్థ 'జగన్నాథ విలాసినీ సభ 1892లో 'కన్యాశుల్కం' మొదటిసారి ప్రదర్శించింది. ఆ సంస్థ ఎప్పుడైనా ఒక పర్యాయం తెలుగు నాటకాలు సైతం ప్రదర్శించిందన్నమాట! తన నాటకం రిహార్సళ్ళకు అప్పారావు హాజరయ్యారు. అయివుంటే, నాటకం నిర్మాణం ఎంత వదులొదులుగా, అసౌష్ఠవంగా ఉన్నదీ ఆయన ఎందుకు గమనించలేదు? పరామర్శించడానికి ఇవి ఆసక్తికరమైన ప్రశ్నలు. అదేమైనా 'కన్యాశుల్కం' తన స్థానిక వాతావరణం ద్వారా, సజీవపాత్రల ద్వారా, కడుపుబ్బ నవ్వించే హాస్యం ద్వారా మొదటి రాత్రి ప్రేక్షకుల హృదయాలను చూరగొంటుంది. అయినా, ఏ కారణాల వల్లనో గానీ దాని ప్రచురణ 1897 దాకా జరగలేదు. ఆనందగజపతి కిచ్చిన అంకితంలోగానీ, ఆంగ్లంలో రాసిన ముందుమాటలోగానీ 1897 మేలో సంభవించిన మహారాజావారి మరణ ప్రస్తావన లేదు. దీన్నిబట్టి, మహారాజావారు సజీవులై ఉండగానే పుస్తక ముద్రణ పూర్తి అయిందని మనం అనుమానించవలసి ఉంది. 1897 జనవరి 21 నాటి ఒక పత్రికలో ఆ పుస్తకం మీద విమర్శవుంది కాబట్టి, రమారమి జనవరి మొదటివారంలో గానీ రెండోవారంలో గానీ దాని ముద్రణ పూర్తి అయిందని దాదాపు నిశ్చయంగా చెప్పవచ్చు. పుస్తకాన్ని పత్రికలకు పంపినప్పుడు మంచి సమీక్షలు వచ్చాయి. "తెలుగు నాటక రచనలో, ఆ మాటకొస్తే మొత్తం తెలుగు గ్రంథ రచనలోనే ఇది సాహసోపేతమైన కొత్త మలుపు" అని 'ది పీపుల్స్ ఫ్రండ్స్' రాసింది. ఇది "ప్రకృతికి అద్దం పడుంది" అని 'ది వీక్లీ రెవ్యూ' రాసింది. ఇది "చమత్కార హాస్యభరితమై కాలానుగుణంగా ఉంది" అని 'ది దినమణి' అభిప్రాయపడింది. నాటకం గురించి బహుశా అన్నిటికంటే శ్రేష్ఠమైన అంచనా ఇచ్చింది 'ది తెలుగుహార్స్'. ఇతర విషయాలతో పాటు ఆ సమీక్ష ఇలా ఉంది: "ఈ నాటకంలో చాలా ఘటనలూ, హాస్యమూ ఉండడమే గాకుండా మన పాత నాటకాల్లో తరచుగా దేని అభావం కొట్టవచ్చినట్లు కన్పిస్తుందో, ఆ అత్యవసర అంశమైన పాత్ర చిత్రణ సైతం ఉంది". 'ది చింతామణి' ఆశీఃపూర్వక ధోరణిలో తన సమీక్షను ఇలా ముగించింది: "ప్రజల కందరికీ సుబోధకంగా ఉన్న ఈ గ్రంథం దేశమంతా' వ్యాపించి, సంఘ సంస్కరణకు తోడ్పడుగాక!".

నాటకానికి ప్రేక్షకుల నుంచీ, పాఠకుల నుంచి వచ్చిన ప్రశంసలు అప్పారావుకు అమిత సంతోషం కలిగించి ఉండాలి. కానీ, ఆ సంతోషం ఎంతో కాలం లేదు. కొద్ది సంవత్సరాల తర్వాత, దాన్ని తిరగ రాయకపోయినా, సంస్కరించడం అవసరం అని ఆయనకు అన్పిస్తుంది. దానిలో ఆయనకు కన్పించే లోపాలు సాధారణ ప్రజల దృష్టిని తప్పించుకుంటాయి.

“ఉల్లాస నూతనాగంతుకుని” కంఠం వింటున్నామని వాళ్ళు సంతోషిస్తారు. అప్పటి నుంచి ఆయన పేరు “గురజాడ అప్పారావు పంతులు బి.ఏ., కాదు, పొడుగు పేరు లేని మోహనమైన పేరు 'గురజాడ'.

## నిట్టూర్పుల వంతెనపై

*“వెనిస్ లో నిల్చున్నా, నిట్టూర్పుల వంతెనపై ఇటు రాజప్రసాదం, అటు కారాగారం - బైరన్*

గురజాడ కూడా అలాగే నిల్చున్నారు. కానీ ఈ తేడాతో, ఆయన నిల్చున్న నిట్టూర్పుల వంతెన వెనిలో లేదు, విజయనగరంలో ఉంది; ఆయన నిలబడవలసి వచ్చింది కొద్ది క్షణాలు కాదు, అనేక ఆయాసకరమైన సంవత్సరాలు. అదంతా ఆకస్మికంగా విషాదకరంగా ప్రారంభమైంది. యశోదీప్తమైన సాహిత్య జీవితం గురజాడకు సరిగ్గా మొదలవుతున్న తరుణంలో ఆనందగజపతి ఒక దుర్ఘటనలో మరణించారు. ఆ విషాద ఘటనలో గురజాడ ఎంతగా అదరిపోయారంటే, ఎంతగా దాదాపు కొయ్యబారిపోయారంటే, 1897 మే 23 నాటి తన డైరీలో ఆయన “మహారాజావారు తెల్లవారు జామున 3 గంటలకు గతించారు” అనే కఠోర వాస్తవాన్ని మాత్రమే రాసుకోగలిగారు. కొద్ది రోజుల తర్వాత కూడా ఆ దుర్ఘటనను వర్ణించేటప్పుడు, దుఃఖం దుర్భరమై ఆయన వాక్యం మధ్యలో ఆపేస్తారు. ఆయన నోటుపుస్తకాల్లో, హెచ్.హెచ్ అని గుర్తుపెట్టబడ్డ ఆరోపం భారమూ, దుఃఖభరితమూ అయిన నిట్టూర్పులా ధ్వనిస్తుంది: “అయ్యో! ఇకముందు నేను ఎవరి మాటలూ, చేతలూ నమోదు చేయాలి”,

“వెలగాడ కొండమీదికి (వనభోజనార్థం) వెళ్ళేటప్పుడు, నేను చేసిన ఏర్పాట్లకు మహారాజావారు సంతృప్తి ప్రకటించారు. కొండమీద ఉన్నప్పుడుకూడా, చాలా ఆనందమయమైన రోజులు అవి. మంచి గాలి, అందమైన ప్రకృతి దృశ్యాలూ, సంతోషదాయకమైన సహచర బృందం, రాజోచితమైన అనుగ్రహం. 'దుబారా మనుషులు నాకు నచ్చరు' అన్నారు మహారాజావారు. ఒక్క పూరట - నాకు తెలిసి నేను మహారాజావారికి అప్రతిష్ఠ తేలేదు”. మేము తిరిగి రావలసిన రోజున, ఏనుగుల మీదా, పల్లకీల్లోనూ, కాలినడకనా అందరినీ పంపించాక, మహారాజావారూ, కె.యన్., నేనూ మిగిలాము. మహారాజావారు అప్పుడే స్నానం చేసి ఉన్నారు. ఉత్తరం నుండి పెద్ద ఎర్రగాలి రావడం నాకు కన్పించింది. మహారాజా వారితో ఈ విషయం చెప్పి, గాలి దుమారం ఆగిపోయిందాకా ఒక అరగంట సేపు ఆగుదామని విన్నవించుకున్నాను. 'అయితే ముందు మీరు పంపించివేసిన వాళ్ళ మాట ఏమిటి?' అన్నారు మహారాజావారు. నేను: అప్పుడు మనకు గాలిదుమారం కన్పించలేదు మహారాజా! మ.రా: ' పోనీలే, మనం వెళ్తాం'

మహారాజావారు ముందు వరండాలోకి వచ్చి, తమ గుర్రాన్ని తెమ్మన్నారు. ఎర్రగాలి వీచ సాగినప్పుడు మహారాజావారు కాసేపు ఆలోచిస్తూ నిలబడి నాతో అన్నారు కదా: 'అవును ఇప్పుడు స్వారి చేయడం ధైర్య మనిపించుకోదు. మూర్ఖత్వమవుతుంది.

నేను నడిచివెళ్తాను. గుర్రాన్ని నా వెనక పంపించు'. మహారాజావారు అలా కొండ దిగి వెళ్లిపోయారు. వారి వెంట నరసింగరాజు కూడా వెళ్లారు. కొంతదూరం వెళ్ళాక మహారాజావారు గుర్రాన్ని ఎక్కి దౌడు తీసినట్లుంది - ఏనుగులమీద వెళ్ళేవాళ్ళను కలుసుకొని, వాళ్లకేదైనా సాయం చేయవచ్చనే ఉద్దేశంతో. పెద్దజల్లు పడింది. మహారాజావారూ, ఆయన బృందంలోని సర్వులూ తడిసి ముద్దయ్యారు. కొండ మీద నేను మహారాజావారి గురించి చాలా ఆందోళన పడ్డాను. తొందర తొందరగా అల్పాహారం ముగించి పల్లకీలో కొండ దిగి వెళ్ళాను. మహారాజావారూ, ఆ బృందమూ అక్కడ ఆగారు. మహారాజావారు మావటి వానితో మేడ మీదున్నారు. ఎ.ఆర్., రెక్ పోట్లాడుకుంటున్నారు. మహారాజావారు వాళ్ళను మార్చి మార్చి అనునయిస్తూ ఉన్నారు. పోట్లాట ఆపడానికి నేను జోక్యం కలిగించుకున్నప్పుడు 'బలిష్ఠుడు' అని మహారాజావారు అన్నారు".

అదురుపాటువల్ల, దుఃఖంవల్లా గురజాడ ఈ కథనంలో అతి ముఖ్యమైన విషయం ఒకటి మరచిపోయారు. గాలిదుమారంలో గుర్రం మీద దౌడు తీసేటప్పుడు ఆనందగజపతి గుర్రంతో సహా కిందపడ్డారు. ఆయనకు రొమ్ముకు దెబ్బ తగిలింది. దెబ్బవల్ల జ్వరం వచ్చింది. నాల్గోరోజు ఆయన మరణించారు.

దుఃఖభరితమైన ఆ సంవత్సరం ముగిసినప్పుడు గురజాడ సంక్షుభిత హృదయం బావురుమంటుంది:
"ఇది నాకు విపత్కరమైన సంవత్సరం. మే 23 తెల్లవారుజామున విజయనగరం మహారాజావారు - నేనెంతో ప్రేమించిన - తండ్రికన్నా, తల్లికన్నా, భార్యకన్నా, బిడ్డలకన్నా ఎక్కువగా ప్రేమించిన - మహారాజావారు మరణించారు. నిష్కల్మషమైన మంచితనం ద్వారా, నిష్కపటమైన దయద్వారా, దైవసన్నిభమైన రుజుత్వం ద్వారా, వారి స్వభావమూ, వ్యక్తిత్వమూ అత్యంత పరిణత మనస్సుల నుండి నిస్వార్థమైన విధేయతను చూరగొనేవి. మా జీవితాలు వారి జీవితంతో పెనవేసుక పోయాయి. వారికోసం నేను ఏదైనా చేసేవాణ్ణి ఆజ్ఞాపించింది ఏదైనాసరే. ఒక గొప్ప వెలుగు ప్రపంచం నుండి నిష్క్రమించింది".

నిస్సంశయంగా ఇది మితిమీరిన పొగడ్తే. తన దుఃఖతీవ్రత తగ్గిన తర్వాత, గురజాడ ఆనందగజపతిని గురించి మరింత స్థిమితమూ, మరింత సముచితమూ అయిన అంచనా వేయగలిగారు. ఆయన అమలుపరచని సాహిత్య పథకాల్లో మహారాజావారి జీవితచరిత్ర సైతం ఉండివుండవచ్చు. ఆయన నోటుపుస్తకాల్లో హెచ్. హెచ్. అని గుర్తు పెట్టబడిన ఒక ఆరోపం - స్పష్టంగా ఇరవయ్యో శతాబ్దం ప్రారంభమైన కొన్నాళ్ళ తర్వాత రాసింది ఉంది: ఇలా

"ప్రశ్న సహజంగా తల ఎత్తుతుంది: ఆనందరాజు జీవితచరిత్ర ఎలా అవసరం? వీరుడుగా కానీ, రాజనీతిజ్ఞుడుగా కానీ, రచయితగా కానీ, సంస్కర్తగా కానీ ఆయన చరిత్రను సృష్టించారా? లేదు. ఆయన చరిత్రను సృష్టించలేదు. చరిత్రను, రాజకీయ చరిత్రను సృష్టించడానికి హిందువులలో ఎవరికోతప్ప అవకాశం లేదు. ఆనందరాజు సాహిత్య ప్రయత్నాలు ఎప్పుడైనా ఒకసారి రాసిన పద్యాలకూ, అసంపూర్ణ దుర్గ్రాహ్య తాత్విక చర్చకు పరిమితమయ్యాయి. ప్రతికూల పరిస్థితుల్లో ఆయన సంతరించుకున్న అద్భుతమైన వ్యక్తిత్వం వల్లనే ఆయన ప్రపంచదృష్టికి అర్హుడు. ఆయన పాత ప్రపంచానికీ, కొత్త ప్రపంచానికీ మధ్య ఉండే లంకె; హిందూ మహమ్మదీయ క్రైస్తవ నాగరకతలకు ప్రతినిధి. ఆనాటి భారతదేశానికి అంతకంటే సంపూర్ణంగా ప్రాతినిధ్యం వహించగల మరొక మనిషి గత శతాబ్దిలో ఉండడం సందేహం".

అది ఆనంద గజపతి జీవితచరిత్ర అయినా, మరొక సాహిత్య రచన అయినా, దాన్ని నిట్టూర్పుతో గురజాడ దాదాపు దశాబ్దంపాటు పక్కపెట్టవలసి వచ్చింది. 1897కూ, 1906కూ మధ్య ఆయన రాయగలిగింది 1901లో భాగవతుల లక్ష్మీనారాయణశాస్త్రి రాసిన 'శ్రీరామ విజయం' అనే సంస్కృత నాటకానికి ముందుమాటా, జి.సి.వి. శ్రీనివాసాచార్య రాసిన 'హరిశ్చంద్ర' అనే ఆంగ్ల నాటకానికి ఉపోద్ఘాతమూ. ఆ ఇద్దరూ ఆయనకు విజయనగరం మిత్రులు. ఆయన రాసినవి రెండూ చిన్నవే, అవి ఒకేసారి మౌలికమూ, ఆధునికమూ అయిన ఆయన చైతన్యాన్ని స్పష్టంగా తెలియచేస్తాయి. ఆ చైతన్యాన్ని సృజనాత్మకంగా వినియోగించే ముందు మామూలుగా రాజస్థాన జీవితంలో ముడిపడివుంటే క్షుద్రమైన అసూయలనూ, బడాయిలనూ, కుహకాలనూ, కుతంత్రాలనూ, ఇంకా అసహ్యకరమైన అలాంటి ఇతర లక్షణాలనూ ఎదుర్కోవలసి ఉండింది. తరచుగా ఆ లక్షణాలు రాజు మరణించిన వెంటనే మరీ అసహ్యంగా ఉంటాయి. తర్వాత తర్వాత విధేయుడూ సమర్థుడూ అయిన ఉద్యోగిగా గురజాడ రుజువు చేసుకోగలిగినప్పుడు 'పెద్ద వ్యాజ్యం' అనబడే దానితోసహా, సంస్థానానికి సంబంధించిన దాదాపు అన్ని పెద్ద సమస్యలతో ఆయన వ్యవహరించవలసి వచ్చింది.

తన ఉత్తరాధికారిగా ఎవరినన్నా కొడుకుగా దత్తు తీసుకోవడానికి ఆనందగజపతి తన మరణానికి ముందు తల్లి అలక రాజేశ్వరీదేవికి అధికారం ఇచ్చారు. ఆమె తన మేనల్లుడు చిట్టిబాబును దత్తత తీసుకుంది. దత్తు సమయంలో అబ్బాయికి విజయరామ గజపతిరాజు అని పేరు మార్చారు. అతని మైనారిటీ కాలంలో సంస్థాన నిర్వహణ బ్రిటీష్ అధికార్లకు

అప్పగించబడింది. కానీ, అలక రాజేశ్వరీదేవి, ఆమె వితంతు కుమార్తె అప్పలకొండయాంబా (ఆమెనే రీవా మహారాణి అనికూడా అంటారు) మైనరైన కుర్రవాని ప్రయోజనాలను అతిశ్రద్ధగా రక్షిస్తున్నారు. బరువైన ఈ కర్తవ్యంలో గురజాడ అలక రాజేశ్వరీదేవికీ, ఆమె మరణానంతరం అప్పలకొండయాంబకూ తీసుకున్న దత్తత చెల్లదని మహారాజావారి దగ్గరి దాయాదులు దావా వేశారు. 'పెద్ద వ్యాజ్యం' అనే దాని మూలకారణం ఇదే. రెండు పక్షాల వాళ్ళూ మద్రాసుకూ, కలకత్తాకు చెందిన ప్రముఖ న్యాయవాదులను పెట్టుకున్నారు. మనకు కావలసింది చివరకు ఇరుపక్షాలకూ 1913లో రాజీ కుదిరిందన్న విషయం; విజయరామ గజపతికి సంస్థానం దక్కింది. కీర్తిశేషుడైన ఆనందగజపతికి ఇది చాలా నచ్చిన విషయమని గురజాడ విశ్వసించారు. అందువల్ల ఆయనకు ఏదో సాధించానన్న తృప్తి లభించింది. కానీ అదే సమయంలో ఆయన అసంతృప్తికి గురికాకుండా ఉండలేకపోయారు ఆ కాలంలో సగ భాగానికి పైగా, ముఖ్యంగా 1897కూ 1906కూ మధ్య ఆయన తన సాహిత్య కృషిని వదలి పెట్టవలసి వచ్చింది కాబట్టి.

''పెద్ద వ్యాజ్యం' సాగిన రోజుల్లో కాస్త అవినీతిపరుడైన మనిషి ఎవడైనా చచ్చినంత డబ్బు సంపాయించ గలిగేవాడు. నిజానికి విజయరామ గజపతి దత్తతను వ్యతిరేకించేవాళ్ళు గురజాడను తమవైపుకు తిప్పుకోడానికి ఒక రోజు అర్ధరాత్రి సమయంలో ఆయనకు పెద్ద మొత్తం లంచం ఇవ్వజూపారు. దానికి గురజాడ ప్రతిస్పందన అచ్చం ఆయన స్వభావానికి అనుకూలంగా ఉంది: 'బాబులారా! మీకు తెలుసుకదా నేను అజీర్ణరోగిని. ఒక తెల్కెడు అన్నం అరిగించుకోవడం నాకు కష్టం. గోనెడు కరుకు రూపాయల్ని ఎలా అరిగించుకోను?' అన్నారు ఆయన. మరొక సందర్భంలో కూడా ఆయన అలాంటి నిజాయితీనే ప్రదర్శించారు. కాస్మంద రాకూర్ హెబ్ ఒకరాత్రి విలువలైన కానుకలతో గురజాడ దగ్గరకు వెళ్ళి, తన కూతురు లలితకుమారీదేవికి విజయరామ గజపతితో వివాహం కుదిర్చేందుకు గురజాడ సహాయం అభ్యర్థించారు. పెండ్లి సంబంధం కుదిరించడం తనకు చేతకాదని గురజాడ చెప్పుకున్నారు. ఠాకూర్ సాహెబ్ చాలా దిగులుపడి, తన కూతురును గంగానదిలో తోసేస్తానని అన్నారు. గాబరా కల్గించే ఆ సన్నివేశం నుంచి బయటపడే మార్గం తోచక గురజాడ మరునాటి ఉదయం ఆ కానుకలన్నీ తీసుకొని, అలక రాజేశ్వరీదేవి దగ్గరకు వెళ్ళి, క్రితం రాత్రి జరిగిందంతా ఆమెకు తెలియచేశారు. అందరికీ సంతోషకరంగా పెళ్ళి సంబంధం అంగీకరింపబడింది. 1898లో కాశీలో పెళ్ళి జరిగింది.

ఆ కాలంలో రెండు కుటుంబ ఘటనలు జరిగాయి. ఒకటి సంతోషకరమైందీ, మరొకటి విషాదకరమైందీ. 1902లో గురజాడకు రెండో కూతురు పుట్టింది. 1905లో ఆయన తండ్రి రామదాసు ఎద్దులబండ్లో వంక దాటేటప్పుడు జరిగిన ప్రమాదంలో మరణించారు. ఈ రెండు ఘటనలనూ సంకేతాలు గ్రహింపవచ్చు. జీవితం అంతా నిట్టూర్పులమయం కాదు. అది అంతా చిరునవ్వుల మయమూ కాదు. జీవిత వస్త్రంలో సుఖదుఃఖాలు పడుగు పేకలు. గురజాడ జీవిత వస్త్రంలో మసక రంగులకంటే నిండురంగులే ఎక్కువ. ఎంత పెద్ద దెబ్బ తగిలినా, బాధాకరమైన దాని మొదటి తాకిడి నుంచి తేరుకున్న తర్వాత, ఆయన అపహాస్యం జేయగలిగేవారు. అంతేకాక, ఆయనకు జీవితంపట్ల మమత, ప్రపంచంపట్ల ప్రేమ, అనునిత్యం ఆశలు రేపుతూ అందకుండాపోయే విశ్వపరమార్థం పట్లా, సృష్టి రహస్యంపట్ల మోహం.

అందువల్ల ఆయన సంస్థానానికి సంబంధించిన ప్రాపంచిక వ్యవహారాలతోపాటు క్షుద్రమైన వ్యవహారాలనుకూడా, నిర్వహించవలసి వచ్చినప్పటికీ, తన సాహిత్య ప్రేరణలను మరీ ఎక్కువకాలం పూర్తిగా అణచి పెట్టలేకపోయారు. ఆయన వేసవికాలంలో ఏటేటా నీలగిరి కొండలకు వెళ్ళడం 1903లో మొదలైంది. ఆ నీలగిరుల అలౌకిక సౌందర్యం ఆయనలోని కవిని తిరిగి మేల్కొల్పి పాటలు పాడేటట్లు చేసింది. దానితో నిట్టూర్పుల వంతెన అవతలిగట్టుకు - నవ్వులూ, పరిహాసమూ, వ్యంగ్యమూ, సర్వవ్యాపకమైన ప్రేమా ఉండేగట్టుకు - ఆయన దాటడం ఆరంభమైంది.

## జగతి సమస్తం ఆయన బాధ్యత

### "జగతి సమస్తం నా బాధ్యతగా చూస్తాను"- జాన్ వెస్లీ

తెలుగులో కవిగా గురజాడ మొదటి రచన 'నీలగిరి పాటలు'. 1907లో మద్రాసులో ప్రచురితమైన ఆ పుస్తకం - దాన్లో ఆ ఆరుపాటలే కాకుండా, వాటి ఆంగ్ల అనువాదాలూ, సంగీతపు గుర్తులు కూడా ఉన్నాయి. చాలా చిన్న పుస్తకం. "హర్ హైనెస్ విజయనగరం మహారాజకుమారికా సాహెబా శ్రీ అప్పలకొండయాంబ సుధోగడ్ (రీవా సంస్థానం) మహారాణి మేరకు రచింపబడిన" ఆ పాటలు 'మోహనరాకుమారిని ప్రియమైన స్మృతికి' అంకితం ఇవ్వబడ్డాయి. ఈ పాటల్లో 'గురజాడ తన జీవితంలో మొదటిసారిగా, చివరిసారిగా కూడా, ఏక కాలంలోనే పదబంధ నిర్మాణ వ్యామోహంలో, ప్రణయావేశంలో మునిగిపోయారు' అని బుర్రా వెంకటప్పయగారు అంటారు. తుది ఫలితాన్ని బట్టి చూస్తే, రెండు ఆవేశాలూ అంత వేడిలేనివే అయి ఉండాలి. కాల్చి, చీల్చి, పిచ్చెక్కించే ప్రేమ అందామా అంటే పాటల్లో దాని పోలకువే లేదు. ఇక పదబంధాల విషయానికి వస్తే మనకు కనిపించేవన్నీ అరిగిపోయినవీ, బూజుపట్టినవీ; స్మరణీయమైన పదబంధంగానీ, నుడికారం కానీ ఒక్కటి సైతం లేదు. గురజాడ జీవితంలో 'నీలగిరి పాటల' ప్రాముఖ్యమల్లా ఆయన మనస్సును మళ్లీ సాహిత్యం వైపు మళ్ళించడం, న్యాయవాదుల నుంచీ, న్యాయస్థానాల నుంచి లభించిన తీరికలోని ప్రతిక్షణాన్నీ సాహిత్యానికి అర్పించడం.

నిష్కర్షగా చెప్పడానికి ఆయన డైరీలూ, నోటుపుస్తకాలూ మనకు తోడ్పడవు, కానీ ఏళ్ళు గడిచేకొద్దీ గురజాడ ప్రపంచ దృక్పథంలో మార్పు వస్తూవుండినట్లు గట్టిగా చెప్పవచ్చు. 1883లో గురజాడ మనస్సు ఇంకా లేతగా, అత్యంత గ్రహణశీలంగా ఉన్నప్పుడు శంభుచంద్ర ముఖర్జీ ఆయనకు చక్కని సలహా ఇచ్చారు: 'నీలో కొన్ని శక్తులున్నాయి సాధన ద్వారా వాటిని మెరుగు పరచుకో" అని. ఇంకా ఇలా అన్నారు:

"చదువు, పర్యాలోచించు. కవిత్వం మాత్రమేకాదు, అన్నిరకాల పుస్తకాలూ చదువు. అన్నిటికీమించి గమనించు. గమనించు మనిషినీ, ప్రకృతినీ, మనిషి పనులనూ, ప్రకృతి పనులనూ. అవకాశం దొరికితే దేశం తిరుగు. లేదా నీ దగ్గరి పరిసరాల్లోనే తిరుగు. మారుమూల పల్లెల్లోకీ, అడవుల్లోకీ, కొండల్లోకీ వెళ్ళు. సముద్రతీరానికి వెళ్ళు. సూర్యుణ్ణి గమనించు. మబ్బుల్నీ, తుపానుల్నీ గమనించు; సూర్యకిరణాల్నీ, మంచు బిందువుల్నీ గమనించు; ఆకాశంలో నక్షత్రాల్ని గమనించు; పురాతన సముద్రంలోని అలల్ని గమనించు; జలపాతాల్నీ, సెలయేళ్ళనూ గమనించు. దివ్యమానవాకారంలోని అందమైన దాన్నీ, అందహీనమైనదాన్నీ గుర్తించడం మర్చిపోవద్దు. చివరి విషయం హృదయస్పందనల్ని గమనించు - నీవీ ఇతరులవీ వాటి బలాబలాలు తూకం వెయ్యి. ఈ విషయం మీద ఇతరులేం చెప్పిందీ జ్ఞాపకం పెట్టుకో. కానీ, ఎప్పుడూ ఇతరులపై ఆధారపడవద్దు. నీ ఆత్మను విశ్వసించు; నీ శక్తులకు స్వేచ్ఛనివ్వు".

ఆనందగజపతి హఠాన్మరణం అనే తీవ్రాఘాతమూ ఆ మరణం మూలంగా ఏర్పడ్డ 'పెద్ద వ్యాజ్యమూ' రచయితగా గురజాడకు ఆటంకాలైనా - మనిషిగా ఆయన పెరగడానికి తోడ్పడ్డాయి. 'పెద్ద వ్యాజ్యం' కాక, న్యాయస్థానాల్లో ఇంకా చాలా చిన్న పోరాటాలు చేయవలసివచ్చింది. ఆ పోరాటాల కోసం ఆయన ఎన్నోచోట్లకు - దగ్గర చోట్లకు, దూరం చోట్లకు ప్రయాణం చెయ్యవలసి వచ్చింది; ఎంతో మందిని కలుసుకో వచ్చింది - గొప్పవాళ్ళనూ, తక్కువ వాళ్లనూ, ఎన్నో సమస్యలను కొన్ని సున్నితమైనవీ, కొన్ని కష్టమైనవీ, తక్కినవి భయంకరమైనవీ - ఎదుర్కోవలసి వచ్చింది. ఈ అన్నిటి మూలంగా ఆయన చదివారు. చదివారంటే మామూలు అర్థంలో కాదు, అంతకంటే విస్తృతార్థంలో "ఆయనెంతో చదివారు. ఇంకా ఎంతో చూశారు. నేర్చుకొన్నారు జీవితం నుంచీ మానవాళి మూలప్రతినే పరిశీలించారు"

జాన్వెస్లీ (1703-1791) లాగే గురజాడ మానవాళిని పరిశీలించి దాని మూల ప్రతిని పరిశీలించి, సమస్త జగతిని తన బాధ్యతగా చూడడం నేర్చుకున్నారు. కానీ ఒక మౌలిక భేదం ఉంది. వేస్లీది క్రైస్తవ ప్రపంచం, గురజాడది మానవ ప్రపంచం. సమస్త కుల మత భేదాలకూ అతీతమైంది, సమస్త జాతీయ హద్దులనూ అధిగమించేది. తత్త్వవేత్తల్లో వోల్టేర్ (1694-1778) కామ్రే (1798-1857), మిల్ (1806-1873), కవుల్లో వర్డ్స్ వర్త్ (1770-1850), షెల్లీ (1792-1822), బైరన్ (1788-1824); నాటక కర్తల్లో ఇబ్సెన్, షా-వీళ్లు గురజాడ మనస్సును తీర్చిదిద్దిన ఆధునిక యుగ ప్రముఖుల్లో కొందరని చెప్పవచ్చు. పందొమ్మిదో శతాబ్ది చివరి పాదానికీ, యిరవయ్యో శతాబ్ది మొదటి దశాబ్దానికి ఆయన చాలా దూరం పయనించారు. రాబర్ట్ సన్, గిల్బర్గ్, పినేరో మొదలైన వాళ్ల సాహచర్యం వదలి ఇబ్సెన్, చేహొవ్, షా లాంటి మహోన్నతుల వెంటా, నూతన యుగానికి చెందిన ఇతర ప్రతిభాశాలుర వెంటా సమంగా ఆయన నడవసాగారు.

గురజాడను గురించి రాసిన రచయితలు లక్ష్మీనారాయణ శాస్త్రిగారి 'శ్రీరామ విజయం' అనే గ్రంథానికి గురజాడ ముందు మాటను ప్రాసంగికంగా మాత్రమే ప్రస్తావిస్తారు. అంతకు మించిన పరిశీలనకు అది అర్హమైంది. 'ప్రాచీనుల గురించి గప్పాలు కొట్టడం' అని తన నోటు పుస్తకాల్లో దేన్ని అన్నారో దాన్ని గురించి ఆ ముందు మాటలో గురజాడ తమాషా వ్యంగ్యంతో రాస్తారు. ఈ కింది భాగం ఒక అచ్చమైన ఉదాహరణ:

"భూమిపైన కొత్తదేమీ లేదనే నమ్మకం నైష్ఠిక హిందువుల్లో విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. సృజనలు ఈనాటి మరుగుజ్జుల కండ్లకు యెంత అద్భుతంగా కన్పించేవైనా, భావాలు చూడ్డానికి ఎంత కొత్తవిగా కన్పించినా, ఆ నైష్ఠికుల అభిప్రాయంలో అవన్నీ ప్రాచీనులకు తెలిసినవే. కాబట్టి రాముడు కళ్ళెత్తి చూసి 'పొగలేని రైలు ఇంజన్లలాగా నిర్భయంగా నడుస్తున్న వాళ్ళెవరు' అని ఆశ్చర్యపడితే అందులో కాలవ్యత్యయం యేమీ లేదు."

మొత్తం ఆ ముందు మాట అంతా ఇలా తమాషా వ్యంగ్యధోరణిలోనే ఉంది. అంతా వుల్లేఖించడం సాధ్యం కాదు కాబట్టి మరొక భాగం మాత్రం ఇస్తాను.

"దైవజ్ఞులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో సైన్యం ఆకాశగమనం ప్రారంభిస్తుంది. అప్పుడు హనుమంతుడు రాముని ఒక వింత వరం కోరతాడు రాజకుమారు లిద్దరినీ తన భుజాలమీద ఎక్కించుకొని సముద్రం దాటించడానికి అనుమతి ఇవ్వమని. కానీ, రామునికి ఆ మహావీరుణ్ణి మామూలు వాహనంలాగా ఉపయోగించడం సుతరామూ నచ్చదు. అతని కోరికను కాదనడంకూడా రామునికి ఇష్టం లేదు. సకల శుభాశుభ కర్మల్లోనూ ఆయుధం క్షత్రియునికి ప్రతినిధిగా గుర్తింపబడుతుంది. కాబట్టి రాముడు తన ఆయుధాన్ని లంకకు మోసుకుపోవడానికి హనుమంతుని కిచ్చి, ఆ సందిగ్ధ స్థితినుంచి బయటపడతాడు. సాహసోపేతుడైన వాయునందనుకి తృప్తి కలగదు. ఆ మొరటువీరుడు అక్కడ గుమికూడిన సేనాధిపతులతోసహా పర్వతాన్ని నెత్తిమీద పెట్టుకుని మోసుకపోతాడు. మానుష యువరాజును పర్వతం కదలడం గమనించి కొంతమంది సేనానాయకులు భయపడతారు. ఎంతో ఆందోళనతో అంతకంటే తక్కువ కాని పాండిత్యంతో దాని కారణాన్ని చర్చిస్తారు. కొద్ది సేపట్లో వాళ్ళు సూర్యుని సమీపిస్తారు. సూర్య కిరణాలు దుర్భరమౌతాయి. సూర్యుని సమీపంలో వున్నప్పటికీ కొంతవరకు మతి చెడకుండా వున్న జాంబవంతుడు విశ్వపటం చూసి, తాము సూర్యునికి రెండున్నర మైళ్ళ దూరంలో మాత్రమే వున్నట్లు చెబుతాడు. భయంతో వానర నాయకుల గుండెలు నీరు కాబోతుంటే, హనుమంతుడు తటాలున కిందికి దిగి పర్వతాన్ని లంక తీరంలో నిలుపుతాడు. కాబట్టి, సింహళంలోని ఒకానొక కొండ భూగర్భ పరిణామాల వల్ల యేర్పడలేదనీ కోతి చేష్టలవల్ల అక్కడ చేరిందనీ ఆధునిక భూగర్భ శాస్త్రజ్ఞులు గమనించాలి.".
ఇక్కడ బీజ రూపంలో కనిపించేది కొన్నేళ్ల తర్వాత ఇలా పాడిన కవే.

"వెనక చూసిన కార్యమేమోయి?
మంచి గతమున కొంచెమే నోయి
మందగించక ముందు అడుగేయి
వెనకపడితే వెనకే నోయి!"

కన్యాశుల్కం రాయడానికి ఆనందగజపతి ప్రేరణ ఇస్తే, 'నీలగిరి పాటలు' అప్పలకొండయాంబ 'ఆజ్ఞ మేరకు రచింపబడ్డాయి' కాబట్టి గురజాడ తన స్వీయ ప్రేరణతో యేళ్ళమీదట మెల్లమెల్లగా రూపుదాల్చిన తన సొంత ప్రపంచ దృక్పథానికి అనుగుణంగా చేసిన మొదటి రచన 'కొండుభట్టీయం' అని చెప్పవచ్చు. 1906లో ఆయన ఆ నాటకం పూర్తిచేశారు. కానీ దాని రాత ప్రతి ఎక్కడో పెట్టి పోగొట్టుకున్నారు. కొన్నేళ్ళ తర్వాత ఆయన మొదటి రెండు అంకాలు మళ్లీ రాసిన మాట నిజమే. కానీ ప్రథమోత్తేజం అప్పటికి చాలావరకు క్షీణించింది. అయినా మనకు మిగిలిన ఆ శేషభాగాన్ని బట్టి అతి స్పష్టంగా అర్థమయ్యేది, ఇక్కడొక చిన్న సంస్కరణా, అక్కడొక స్వల్ప రాజకీయ పురోగతి సాధించడంలో ఆయనకు ఇక యేమాత్రం ఆసక్తి లేదనీ, స్వభావంలో మరింత మౌలికమూ, పరిధిలో మరింత విస్తృతమూ అయిన మార్పులో ఆయనకు ఆసక్తి ఉండిందనీ. సమాజ విమర్శకుని స్థితి నుంచీ మతవిమర్శకుని స్థితికి ఆయన మారారు. ఆయన లక్ష్యం ఇప్పుడు నూతన సమాజంలో నూతన మానవుని రూపకల్పన, మరొకవిధంగా చెప్పాలంటే, ఇప్పుడు ఆయన సంస్కర్తకాదు, విప్లవకారుడు. విప్లవకారుడుగా ఆయన ప్రాచీన కాలానికి చెందిన లూసియన్ కూ, ఆధునిక కాలానికి చెందిన వోల్టేర్ కూ సమానుడు. ఇద్దరూ చమత్కారం, అపహాస్యం, వ్యంగ్యం తమ ప్రధాన ఆయుధాలుగా వాడారు.

## జీవిత మంత విశాలం

### "అది జీవిత మంత విశాలం, అంత రెండింతలు సహజం" - లెవీస్ కరోల్

'కన్యాశుల్కం' రెండో కూర్పుకు రాసిన ముందు మాటల్లో గురజాడ ఇలా అంటారు: "స్వల్పమైన మార్పులతో నాటకాన్ని పునర్ముద్రించాలని మొదట అనుకున్నాను. కానీ నా మిత్రుడు శ్రీ యస్. శ్రీనివాస అయ్యంగార్ సూచనతో నేను దాన్ని తిరగ రాశాను; అతని సాహిత్య అంచనాలపట్ల నాకు చాలా గౌరవముంది. ప్రస్తుత రూపంలో ఇది దాదాపు కొత్త రచన". ప్రధానంగా ప్రముఖ న్యాయవాదీ, కాంగ్రెస్ రాజకీయవాది అయిన శ్రీనివాస అయ్యంగార్ సాహిత్య అంచనాలపట్ల గురజాడ గౌరవం ఎంత నిష్కపటమైనప్పటికీ, అదొక్కటే 'కన్యాశుల్కం'ను "దాదాపు కొత్త రచనగా మార్చేట్లు గురజాడను ప్రేరేపించి ఉండదు. ఆయన ఆ పని చేయడానికి అంతకంటే ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. మొదటి విషయం ఆ నాటకం తిరగరాసిన 1909 నాటికి ఆయన ప్రపంచ నాటక సాహిత్యధ్యయనం మరింత విస్తృతమూ, గంభీరమూ అయింది. రెండోది, ఆనాటికి మానవ స్వభావం గురించి ఆయనకు మరింత నిశ్చయమూ, సమగ్రమూ అయిన అవగాహన ఏర్పడింది. మూడోది, ఆయన ప్రపంచ దృక్పథంలో స్పష్టమైన మార్పు వచ్చింది. నాల్గోది, వాడుక భాష ఉపయోగించడంలో ఆయనకు మరింత ఎక్కువ ప్రావీణ్యం అలవడింది. చివరిది, నాగరిక తదితర వర్గాలన్నిట్లో తనకెంతో మెప్పును సంపాదిస్తూ ఉండిన తన సొంత బాణీ హాస్యాన్ని మరింత విస్తృతంగా వాడాలని ఆయన భావించారు. ఏమైనా, సవరణ తర్వాత రూపొందింది. పరిమాణం బాగా పెరిగిన నాటకమూ, "దాదాపు కొత్త రచన" అయిన నాటకమూ మాత్రమే కాదు - అంతకంటే ఎక్కువ. మొదటి రూపంలో మామూలు తరహా రచన కాకపోయినా సగటు రచనల కంటే ఒకటి రెండుమెట్లు మాత్రమే పైన వున్న ఆధునిక మహాకావ్యంగా పరిణమించింది.

'కన్యాశుల్కం' మొదటి కూర్పులో అయిదు అంకాలున్నాయి. రెండో కూర్పులో వాటి సంఖ్య ఏడుకు పెరిగింది. . రంగాల సంఖ్య రెండింటిలోనూ దాదాపు ఒకటే, అయితే రెండో కూర్పు పరిమాణం రెండింతలు. పాత పాత్రలు కొన్నింటిని విడిచి

పెట్టడం జరిగింది; కొన్ని కొత్తవి ప్రవేశించాయి. కొన్ని పాత పాత్రలు అరుదైన సమ్మోహనశక్తి, చురుకుదనమూ ఉండే కొత్త వ్యక్తిత్వాలు సంతరించుకున్నాయి. అలాంటి ఒక పాత్రను గురించి స్వయంగా గురజాడే ఇలా అంటారు: "మొదటి కూర్పులో మధురవాణి నీరసమైన మట్టిముద్ద. ఇప్పుడామెకు సర్వాంగ సౌష్ఠవం సమకూరింది. ఆమె నన్నే సమ్మోహితున్ని చేస్తోంది." ఇంకా ఇతర మార్పులు కూడా ఉన్నాయి. అన్నీ కలిసేటప్పటికీ, వాటి ఫలితంగా నాటకం ధోరణీ, నడకా మారిపోయి, అది అనన్య సాధ్యమైన కళాఖండంగా తయారైంది. అయితే రెండు పాఠాల్లో వున్న సామాన్య లక్షణం నాటక నిర్మాణం చక్కగా లేక పోవడం ఎందుకు? ఆయన రాసిన కావ్యాల్లో, కథల్లో సమనిష్పత్తి, అంగాంగ సంయోగమూ, సమతూకమూ ఖచ్చితంగా గుర్తించగల నిపుణ నిర్మాత హస్తం కన్పిస్తుంది. నాటకాలు రాసేప్పుడు ఈ చేతిలోని మంత్ర దండం ఏమైంది? అంతకంటే కూడా చిక్కయిన సమస్య: అది నిర్మాణ సౌష్ఠవం ఉండే నాటకాల యుగం. ఫ్రాన్సుకు చెందిన సార్దూ (1831-1908) స్క్రైబ్ (1791-1861), ఇంగ్లండుకు చెందిన జోన్స్, పినేరో రెండో రకం నాటక కర్తలే అయినా, ఇతివృత్తాన్ని వాస్తవికంగా చిత్రించదలచుకుంటే, ఉండే రంగస్థల పరిమితులను దృష్టిలో పెట్టుకుంటే, నాటకాన్ని చక్కగా పొందికగా నిర్మించడం ఎలాగో నిరూపించారు. నిర్మాణ సౌష్ఠవం ఉండే చాలా నాటకాలు రెండో రకంవి. అయినంత మాత్రాన నిర్మాణ సౌష్ఠవం లేని నాటకాలకే గొప్పతనం అబ్బుతుందని చెప్పలేం. ప్రపంచ ప్రముఖ నాటక కర్తల్లో ఇద్దరిని మాత్రమే పేర్కొనాలంటే - ఇబ్సెన్, చేహొవ్ తమ నాటకాల నిర్మాణంలో కౌశల్యం చూపారు. ఈ విషయాలు గురజాడకు తెలియకుండా ఉండవు. బెర్నార్డ్ షా రాసిన 'నాటకాభిప్రాయాలూ, వ్యాసాలూ' అనే సొంత పుస్తకం లోపలి టైటిల్ పేజీలో గురజాడ రాసుకున్న దీర్ఘారోపాన్నిబట్టి తెలుస్తుంది: ఆయన మాటల్లోనే ఒక సమస్య ఇది: 'వివరణలు ఇవ్వకుండా నాటకారంభంలో కథనూ, పాత్రలనూ ప్రవేశ పెట్టడం ఎలా?" సమస్యను అలా ముందుంచి, దాన్ని పరిష్కరించడానికి ఆయన ఎనిమిది మార్గాలు చెబుతారు. నిజానికి, నాటక శిల్పంలో తన నైపుణ్యం గురించి ఆయనకు ఎంత ధీమా ఉండిందంటే, అదే బెర్నార్డ్ షా పుస్తకంలో మరోచోట మార్జిన్లో ఆయన ఇలా రాసుకున్నారు: "నేను నాటకం రాసేప్పుడు ఏ విధమైన నాటకశాలకైనా తగినట్లు రాస్తాను."

అయినా, కన్యాశుల్కంలో దాని రెండు పాఠాల్లో నిర్మాణం వదులొదులుగా, గమనం యెగుడు దిగుడుగా, పాత్రల ప్రవేశ నిష్క్రమణలు అస్తవ్యస్తంగా వున్నాయి. నాటకంలోని ఈ లోపాలకూ, ఇంకా ఇతర లోపాలకూ రెండు ముఖ్యమైన కారణాలున్నాయి. గురజాడ సృష్టించిన పాత్రలు, అవి చిన్నవైనా, పెద్దవైనా, ఎంతో జీవశక్తితో తొణికిసలాడుతూ, నాటకాన్ని తమ వెంట ఈడ్చుకపోతాయి. నాటకంలో చిట్టచివరి మాటలు గిరీశం అనేవి, ' డామిట్, కథ అడ్డం తిరిగింది' తాను బాగా ఆలోచించి వేసిన పథకాలు విఫలమైనప్పుడు గిరీశానికి కలిగిన చికాకును వ్యక్తం చేయడమేకాక, తన మానస సంతానం తనను చెవిపట్టుకొని లాక్కుపోయినప్పుడు గురజాడకు కలిగిన చీదరను కూడా ఆ మాటలు వ్యక్తం చేయవచ్చు. రెండో కారణం చూద్దాం. షేక్ స్పియర్ నాటకాలూ, ఎలిజబెత్ కాలానికి చెందిన ఇతర రచయితల నాటకాలూ, చాలా ఏళ్లపాటు కళాశాల విద్యార్థులకు బోధించిన తర్వాత గురజాడ వాటి ప్రభావానికి అమితంగా లోబడి వుండాలి. ఎలిజబెత్ కాలానికి చెందిన నాటకం ఎక్కువగా ఆడంబరపూరిత దృశ్యం, పటాటోపపూరిత ప్రచ్ఛన్న పాత్రల ఉత్సవం, వాస్తవిక నాటకం కాదు 'సహజవాద నాటకమూ కాదు." మద్రాసు విశ్వవిద్యాలయం తన విద్యార్థులకు పరిచయంచేసే ఏకైక శిల్పమైన ఎలిజబెత్ కాలం శిల్పాన్ని గురజాడ వదలించు కోలేక పోయారు. తత్ఫలితంగా ప్రదర్శించడానికి దాదాపు అసాధ్యమైన నాటకాన్ని ఆయన తయారుచేశారు' అని సి.ఆర్. రెడ్డి అనడం యెంతైనా సబబే. ఆయన ఇంకా ఇలా అనడం కూడా సబబే.

'రంగాలు చిన్నవి, లెక్కలేనన్ని. వాటిని ప్రదర్శించడానికి తగినన్ని తెరలూ వగైరాగానీ, శుభ్రంగా, దుర్భరమైన శ్రమలేకుండా ఆ పని చేయడానికి తగినంతమంది మనుషులుగానీ, ఏ మానవ సంస్థకూ ఉండడం అసాధ్యం. పేజీలకు

పేజీలు కథ దేకుతూపోతుంది. అనిమిషులు మాత్రమే దాన్ని ప్రదర్శించగలరు లేదా ఆ ప్రదర్శనను చివరి దాకా చూడగలరు లేదా దేవతల్లాంటి ఓర్పుండే మన అమాయికమైన పల్లెటూరి జనమైనా కావాలి. కొన్ని భాగాలు విడదీస్తే నటించడానికి అద్భుతంగా ఉన్నప్పటికీ, అది చదువుకోతగ్గ నాటకం. కొన్ని భాగాలు ఏరి ప్రదర్శిస్తే, ఉత్తేజకరమైన ఫలితం ఉంటుంది. కానీ ఏమీ వదలకుండా ప్రదర్శించాలని ఎవరైనా పట్టుబడితే, మొత్తం నాటకానికి తద్విరుద్ధమైన ఫలితం ఉంటుంది. ఎప్పుడు ఎక్కడ ఆపవలసిందీ అప్పారావుకు తెలియదు. ఈ బలహీనత ఆయన ఉపన్యాసాల్లో కూడా కన్పించేది. ఒకసారి సెనేట్ హవుస్లో అనంతంగా సాగిన రాతప్రతిని ఆయన చదువుతూ పోవడం నాకు గుర్తుంది. ఆయన పక్కవున్నవాళ్ళు మొదట నైతికంగా, ఆ తర్వాత శారీరకంగా ఆయనమీద ఒత్తిడి తేవలసి వచ్చింది. - ప్రపంచ వ్యవహారాల్లో క్రమం ఇదే కదా! ఆయన ఈ నాటకం రానేప్పుడు సహృదయులూ, దృఢసంకల్పులూ అయిన మిత్రులు ఆయన పక్కన లేక పోవడం విచారకరం."

గురజాడ పాత్రలు నాటకాన్ని తమవెంట ఈడ్చుక పోవడంతోపాటు దాని ప్రధాన ప్రయోజనాన్ని భంగపరుస్తాయి. మొదటి కూర్పుకు రాసిన ముందు మాటను బట్టి ఆయన ఆ నాటకం రాసింది. బ్రాహ్మల్లో వ్యాపించి ఉండిన శుల్క వివాహాల సాంఘిక దురాచారాన్ని ఎదుర్కొడానికి, రెండు మూడేళ్ల వయస్సు సయితంలేని ఆడపిల్లలకు వాళ్ళ తల్లిదండ్రులు ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తామంటే వాళ్ళకు అమ్మివేసేవాళ్ళు. పెళ్ళికొడుకు ఎంత ముసలివాడైతే అంతమంచిది. అతను అందరికంటే ఎక్కువ డబ్బు ఇస్తానంటాడు కాబట్టి అతను కాటికి కాళ్లు చాపుకునివుంటే మరీ మంచి వరుడు అతను గుటుక్కునుంటే అతని యావదాస్తినీ సంగ్రహించు కోడానికి మంచి అవకాశం లభిస్తుంది. కాబట్టి ఆ దురాచారం ఎంత ప్రబలంగా, ఎంత **లజ్జే** ఉందంటే, పందొమ్మిది నందల ఎనభైలలో, మూడేళ్ల కాలంలో ఒక్క విజయనగరం జిల్లాలోనే 1034 మంది ఆడపిల్లలు పెళ్ళిళ్ళ సంతలో అమ్మకమయ్యారు. వాళ్ళలో 'తొంభై తొమ్మిదిమంది పిల్లలకు అయిదేళ్ళ వయసులో, పెళ్ళి అయింది. నలభై నలుగురికి నాలుగేళ్ళ వయసులో, ముగ్గిరికి యేడాది వయసులో ఈ చివరి పనికూనలకు తలకు మూడువందలా యాభై రూపాయలనుంచీ నాలుగు వందల దాకా ధర పలికింది. విడ్డూరం అన్పించవచ్చు కానీ ఒకోసారి కడుపులో వున్న పిల్లలకు కూడా బేరాలు సాగాయి; ఆనంద గజపతి లాగే గురజాడ కూడా 'ఈ దారుణమైన స్థితి సమాజానికి అవమానం, అలాంటి ఆచారాలను బట్టబయలుచేసి, ఉన్నత ప్రమాణంగల నైతిక భావాలను ప్రచారం చేయడం కంటే ఉన్నత ప్రయోజనం సాహిత్యానికి ఉండజాలదు' అని అనుకున్నారు. ఇదంతా నిర్వివాదంగా నిజమే అయినా, మహా ప్రశంసనీయమే అయినా 'కన్యా శుల్కం' మొదటి కూర్పులో కూడా కన్యాశుల్కం సమస్య అంతంత మాత్రంగానే ముందుకు రాగలుగుతుంది. రెండో కూర్పులో కూడా ఇంకా వెనక్కు పోతుంది. నిజానికి 'కన్యాశుల్కం' సంఘ సంస్కరణకు తోడ్పటానికి బదులు దాన్ని అపహాస్యం చేస్తోందని వాదించే ప్రతికూల విమర్శకులు సయితం లేకపోలేదు. ఈ విమర్శ దుడుకుగా, మితిమీరిందిగా వున్నా, దీనిలో కొంత నిజం వుందని ఒప్పుకోవాలి. క్రూరమైన, దాదాపు అమానుషమైన సాంఘిక దురాచారంలో పోరాడడం లక్ష్యమైనప్పుడు విధిగా దుడ్డు కర్ర ఉపయోగించాలి. దానికి బదులు గురజాడ ఉపయోగించేది చీపురు (నిజానికి నాటకం రెండో రంగంలో చీపురు ఉపయోగించడం సయితం ఉంది.) నాటకంలో అనేక పాత్రల్లో రెండు మూడు తప్ప అన్నీ చిన్నవీ, పెద్దవీ, అబద్ధాల కోరులు, దురాశాపరులు, అల్పబుద్ధులు, అమ్ముడు బోయేవాళ్ళు కామాంధులు - ఒక్క మాటలో చెప్పాలంటే ద్వేషించదగిన మంద. కానీ, వాళ్లమీద మనకు ద్వేషం కలుగదు. సి.ఆర్.రెడ్డి అన్నట్లు, గురజాడ

కన్యాశుల్కం' "జీవితంతో, మానవత్వంతో మెరిసిపోతోంది. దాన్లో ఉంచే స్త్రీ పురుషులు సకలాకర్షణలతో, దయా గుణాలతో వ్యవహరిస్తారు. సంప్రదాయానికీ, మమితకూ, అంధ విశ్వాసానికి చెందిన చింత గుణాలూ, క్రౌర్యాలూ, వెలుగు నీడలూ, పవిత్రతలూ, బాపట్యాలూ అతిగహనంగా పరస్పరం తలపడతాయి. చివరి విషయం, మన రచయిత అతి దివ్య సద్గుణం ఆయన పాత్రలు నమూనాలు కాదు, వ్యక్తులు" చిత్రంగా, నాటకంలోని ఒకే ఒక వ్యక్తి మంచి పాత్ర సౌజన్యారావు ఒక నమూనాకు అనుగుణంగా ఉన్నాడు, నీతిపరుని నమూనాకు అతను కన్యాశుల్కం'లో జిల్లా అతి మంచి మనిషి అతి నీరసమైన పాత్ర మధురవాణి అతని ప్రభావం కిందికి వచ్చిన క్షణంలోనే ధరించరాని పవిత్రమూర్తిగా మారుతుంది. మహాయుక్తి పరులైన దుష్టులనూ, కష్టులనూ తన కొంగున ముడివేసుకొంటూ మనుషులు మతులు పోగొట్టే మనోహరమైన మధురవాణి సౌజన్యారావుకు విన్నమమైన శిష్యురాలిగా మారి, పవిత్ర పారాయణకోసం . భగవద్గీత ప్రతిని అతనివద్దనుంచీ బహుమతిగా తీసుకొనే మధురవాణి కంటే ఎంతో సజీవమైన పాత్ర, పరివర్తన మరీ ఉట్టిపాటుగా, బొత్తిగా అనవసరంగా ఉంది కొత్త అవతారం ఎత్తేట్లు చేయగల బాధాకరమైన అనుభవం ఆమెకేమీ కలుగలేదు.

వ్యక్తిగా, రచయితగా గురజాడ కుండే విలక్షణగుణం హాస్యదృష్టి నిండైన హాస్యదృష్టి ఆయనకు పుట్టుకతో వచ్చింది. జీవిత పరిస్థితులు దానికి పదును పెట్టాయి. ఆధునిక చైతన్యమూ, ఆధునిక విద్యా ఉన్న ఆ మధ్య తరగతి మనిషి వేగంగా నశించిపోతున్న భూస్వామ్య సామాజిక వ్యవస్థకు అండదండ తివ్వడానికి తన జీవితమంతా అర్పించవలసి వచ్చింది. ఆనంద గజపతిపట్ల ప్రేమవల్లా, విధేయత వల్లా ఆయన అది చేశారు. కానీ లోలోపల బాధపడ్డారు. బాధను వారించడానికి ఆయన తన హాస్యదృష్టిని రక్షాకవచంగా వాడుకోవలసి వచ్చింది. వయస్సు పైబడే కొద్దీ ఎంత నిరంతరాయంగా ఆయన దాన్ని వాడుకున్నారంటే, దాదాపు ప్రతి సన్నివేశంలోనూ ఆయనకు హాస్యం కనబడసాగింది. చివరకు హాస్య శక్తిమీద ఎంత నమ్మకం కుదిరిందంటే ఆయన నోటు పుస్తకాల్లోని చివరి ఆరోపాల్లో ఒకటి ఇలా ఉంది "నేను ఎంత హాస్యభరితంగా ఉన్నానో అంత ప్రచండంగా ఉంటాను" హాస్య విధ్వంసక శక్తిపై తనకుండే నమ్మకాన్ని నొక్కి చెప్పడానికి కాబోలు ఆయన ఈ మాటలు తన మామూలుకు భిన్నమైన పెద్ద అక్షరాల్లో రాశారు. ఈ నమ్మకం కొంతవరకు అనుచితమైంది. ఆయన తన హాస్య దృష్టిని ఎక్కువగా ఉపయోగించింది 'కన్యాశుల్కం'లో కానీ, దౌర్భాగ్యమైన కన్యాశుల్క దురాచారం మీద దాని ప్రభావం ఏ దశలోనైనా ప్రచండంగా ఉండినట్టు మనం చెప్పలేం కన్మీతుల స్థానంలో ఇప్పుడు వరశుట్యం ఉంది. ఇది అగ్రకులాలన్నిట్లోనూ వ్యాప్తిలో ఉన్న దురాచారం. విరక్షణా యుతంగా ఉపయోగిస్తే హాస్యం ప్రచండంగా ఉండగలరు హాస్యాన్ని గురజాద సర్మోజనితంగా వాడగలరు. దేదీప్యమానంగా కూడా వాడగలరు, కానీ విచక్షణా యుతంగా వాడడం ఆయనకు చేతకాదు. అందువల్ల తరచుగా ఆయన నవ్వువెనక నిస్సంశయంగా తారాదే కన్నీళ్లు అరుదుగా మన దృష్టికి వస్తాయి. అసలు దృష్టి కంటూవస్తే,

మౌళికంగా గురకు సమస్యమీద కంటే మనుషులమీద, ఆసక్తి అధికం. మనిషిగా ఆయన ప్రేమించారు. విద్యావంతుడా, నిరక్షరుడా అనేదానితో, నీతిపరుడా, అవినీతిపరుడా అనేదానితో నిమిత్తం లేకుండా ఆయన మనిషిని ప్రేమించారు. నిజానికి మొదటి రకం మనుషుల కంటే రెండో రకం మనుషులనే ఆయన చాలా ఎక్కువగా ప్రేమించారు. తన

జీవితమంతా ఆయన "పై తరగతి జీవితం' అనబడే దాన్ని సన్నిహితంగా పరిశీలించారు. మర్యాద ముసుగు చాటున కున్న జీవితం వెకిలి చేష్టలూ, పాపిష్టి చర్యలూ, క్రూర కర్మలూ ఆయనకు సుపరిచితాలు. "పై తరగతి జీవితం'తో కలిగిన ఈ పరిచయంవల్ల కింది తరగతి జీవితం'గా అందరూ. ఏవగించుకొనే దానిపట్ల ఆయనకు సానుభూతి ఏర్పడింది. ఒక దృష్టిలో చూస్తే, సంస్కరణోద్యమ నాటకంగా 'కన్యాశుల్యం' విఫలం కావటానికి ఇది తోడ్పడింది. మరొక దృష్టితో చూస్తే. నాటకం 'దుర్నిరోధకమైన సమ్మోహక శక్తికీ, అజరామరమైన ఆసక్తికీ ఇదే కారణం. నాటకం నిజంగా జీవితమంత విశాలం, అంత రెండింతలు సహజం.!

## వున్నత వైఫల్యాలు

"హీనసాఫల్యం హద్దులను ఎంతదూరం దాటిపోతుంది ఉన్నత వైఫల్యం" -సర్ లెవిన్ మారిస్

గురజాడ 'కన్యాశుల్కం' 'రాసేప్పుడు "ఆయన పక్కన సహృదయ మిత్రులు లేకపోవడం విచారకరం" అని సి.ఆర్. రెడ్డి అనడం తప్పు. అది నిజంకాదు. గురజాడ పక్కన ముని సుబ్రహ్మణ్యం అనే యువ మిత్రుడు ఉన్నాడు. ఒక స్మృతి వ్యాసంలో ఆ మిత్రుడు ఇలా రాశాడు.

*1905లో నాకు ఆయన (గురజాడ యాదృచ్ఛికంగా పరిచయమయ్యారు. అప్పుడు విజయనగరంలోని మహారాజా కళాశాలలో పేద విద్యార్థినైన నేను నా చదువుకోసం ఆయన సహాయం అర్థిస్తూ ఉండేవాన్ని, మెలమెల్లగా, నాకు తెలియకుండానే నేను ఉదయమూ, సాయంత్రమూ ఆయన బల్లవద్దనో, ఆయన గ్రంథాగారంలోనే చేరి, ఆయన చేస్తున్న రకరకాల సాహిత్య కృషిలో జోక్యం కల్గించుకునే వాణ్ణి. 1909లో నేను కళాశాలలో డిగ్రీ పుచ్చుకొని, విజయనగరం వదలి, సొంత జిల్లా నెల్లూరు జిల్లాలో, ఆ తర్వాత కాకినాడలో టీచరుగా స్థిరపడ్డప్పుడు సాహిత్య కృషికి అంతరాయం కలిగి దాన్ని ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా కొనసాగింపవలసి వచ్చింది."

'కన్యాశుల్కం' రెండో కూర్పుకోసం తిరగరాసేప్పుడు గురజాడ, దాని ప్రూపులను అప్పుడు నెల్లూరులో ఉన్న సుబ్రహ్మణ్యానికి దిద్దుబాట్ల కోసం, అభిప్రాయార్థం పంపేట్లు మద్రాసులోని ముద్రాపకులతో ఏర్పాటుచేశారు. మొదట ధైర్యంచాలక అభిప్రాయాలు తెల్పడానికి సుబ్రహ్మణ్యం నిరాకరించాడు. కానీ, తర్వాత గురజాడ పదేపదే ఒత్తిడి చేయడంతో "నాటకం నీతి బోధకంగా లేదనీ, మధురవాణి (ఒకవేశ్య), మీనాక్షి (ఒక బాల్య వితంతువు) కన్పించే రంగాలు ఆదర్శవంతంగా లేవనీ, నాటకం యువతీ యువకుల మీద దుష్ప్రభావం కలిగించవచ్చు. కాబట్టి ప్రదర్శన యోగ్యం కాదనీ" అభిప్రాయం తెల్పాడు. ఈ ఔత్సాహికమైన దాడిని గురజాడ సమర్థంగా ఎదుర్కొన్న మాట నిజమే. అయితే దురదృష్టవశాత్తు ఆయన అంతటితో ఆగలేదు. ఆ యువ విమర్శకుని సంతోషపరచడానికి ఆయన మధురవాణి స్వరూప స్వభావాలు మార్చి అతనికి ఇలా ఉత్తరం రాశారు: "అలా ఆమెను చివరి అంకంలో సంస్కరించాను.

ఇక నీకు పేరీ ఉండదు" దీన్నిబట్టి తెలుస్తుంది. సృజనాత్మక రచయిత పక్కన ఎవరూ ఉండకూడదనీ, కళా దేవతతో అతనికుండే ప్రత్యక్ష సంబంధానికి ఎవరూ భంగం కల్గించకూడదనీ, సృజనాత్మక రచయిత పక్కనుండే మనిషి సహృదయ మిత్రుడు కాజాలడు, మరణాంతకమైన శత్రువే అవుతాడు. 'కన్యాశుల్కం' చివరి అంకంలో పాత్ర చిత్రణలో జరిగిన వికృతీ కరణలకు సుబ్రహ్మణ్యాన్ని నిందించ వలసివస్తే, అతను మనకు చేసిన ఉపకారానికి మెచ్చుకోవలసి వస్తుందికూడా. అతని ప్రమేయం లేకపోతే, గురజాడ ఆలోచనాశీలిగా, రచయితగా తన విశ్వాసాలను ఇలా కంఠోక్తిగా ప్రకటించి ఉండకపోవచ్చు. గురజాడను సక్రమంగా అర్థం చేసుకోడంలో వాటికుండే ప్రాముఖ్యాన్ని బట్టి, 1909 మే 21న ఉదక మండలంలోని యెక్ హిల్ హౌస్నంచీ ఆయన సుబ్రహ్మణ్యానికి రాసిన సుదీర్ఘమైన లేఖనుంచీ కొన్ని భాగాలు ఇక్కడ ఉల్లేఖించడమైంది:

*"నిజమే - మీనాక్షి కన్పించే రంగాలు మరీ ఆదర్శవంతంగా లేవు. ఒక విషయం - నేను అనవాయితీలు వుటంకించగలను. మొదటిది, షేక్స్పియర్ రాసిన 'నాల్గో హెన్రీ' 'అయిదో హెన్రీ' 'మెర్రీవైవ్స్' అనే నాటకాల్లో డాక్టర్ షీట్, మైన్ హోస్టెస్ డేమ్ అనే పాత్రలు సర్ జాన్ ఫాల్ స్టాఫ్ కలిపి మహా ఆసక్తి దాయకమైన బృందం. వాళ్లలో ఎవరూ ఆదర్శవంతులు కాకపోగా, పతితుడైన ఫాల్స్టాఫ్, వేశ్యాగృహంలో కంపు వాతావరణంలో బతికే ఫాలా స్టావ్, షేక్స్పియర్ హాస్యానికి పరాకాష్ఠ హోస్టెస్ కన్నా డాల్ కన్నా మధురవాణి ఎంతో మేలు.*

*"నాకు సరిగా జ్ఞాపకం ఉంటే, ఓట్వే "రాసిన 'వెనిస్ జర్వ్ డ్' అన్న నాటకంలో నిజంగా అసహ్యకరమైన రంగం ఒకటివుంది పెద్ద ప్రభుత్వోద్యోగి వేశ్య దగ్గర - అవమానకరంగా ప్రవర్తించే రంగం".*

*"కళ్లలో ఆదర్శీకరణ జరిగినప్పటికీ, వాస్తవిక రచనలో మన నైతిక దృష్టికి నచ్చని అంశాలు కొన్ని రాకతప్పదు. కొంతవరకు నైతిక అభిశంసన మనుషుల చిత్త వృత్తిపై ఆధారపడుతుంది."*

"కవితా న్యాయం ఒకప్పుడున్నట్లు ఇప్పుడు లేదు. నేను జీవితాన్ని చిత్రిస్తాను. చిత్రించడంలో కళాగతమైన ఆదర్శీకరణ ఉంటుందనుకో, కళ నాకు యజమాని అయినా, సమాజంపట్ల నాకు బాధ్యత ఉంది. కాబట్టి పాఠకుడు నన్నొక ప్రశ్న అడగవచ్చు. నేను అవినీతిని ఆకర్షవంతంగా చేశానా? లేదనే అనుకుంటున్నాం.

నేను జీవితంలో అడుకోవడం లేదని నీకు కన్పిస్తుంది. దానిపట్ల నా వైఖరి గురుతరమైంది. నవ్వులు చిందే పుస్తకంలో ఇది కష్టమైన విషయం. "సానిపిల్లలోని మానవత్వాన్ని మరువవద్దు. ఆమె కష్టసుఖాలు నీ, నా కష్టసుఖాల్లాగే గురుతరమైనవి. వ్యభిచరించే భార్యలూ, స్త్రీలోలులైన భర్తలూ, మన సమాజం నిండావున్నారు. వాళ్లు సానిపిల్లకంటే ఎలా నయం? నినిపిల్లలో మోసం లేదు - ఆమె తన వృత్తిని మరుగుపరచడం లేదనే అర్థంలో. ఆమె ఏ వివాహబంధాన్నీ భగ్నం చేయడం లేదు."

"జపాన్లో ఉన్నత వంశీకులు పెళ్ళాడే గైషాలను గురించి ఏమంటావు? గ్రీసుకు చెందిన అస్పాసియా నీకు తెలుసుకదా? లాండర్" రచనలు చదువు. ఆ రెండు దేశాలూ చరిత్రలో పేరు తెచ్చుకున్నాయి.

గురజాడ మనస్సు ఎంత విముక్తమైందో, ఆయన మానవత్వం ఎంత విశాలమైందో ఇంతవరకు ఉల్లేఖించిన భాగాలు తెలుపుతాయి. ఇక కిందవచ్చేది ఆయన తనకాలం కంటే ఎంతో ముందుండినట్లు రుజువు పరుస్తుంది.

"మానవ విజ్ఞానం అధ్యయనం వల్ల సామాజిక భావాలను సవరించుకో వలసిన అవసరం ఏర్పడింది. వాస్తవాలను దాటవేయడంవల్ల లాభంలేదు. లైంగిక బంధానికి అంత విలువ ఇవ్వడంలో అర్థమేముంది? సామాజిక పరిణామ చరిత్రలో వివాహ వ్యవస్థ ప్రాముఖ్యాన్ని నేను తగ్గిస్తున్నాననుకోవద్దు. గత రెండు శతాబ్దాల్లో మానవజాతి జ్ఞానం ఎంతో పురోగమించింది. ఆలోచన పరులైన మనుషులు పాతభావాలనూ, పాత ఆదర్శాలనూ పరీక్షించడం ప్రారంభించారు. వివాహ వ్యవస్థ పురోగతికి తోడ్పడివుంటే, వివాహ బంధం అవిచ్ఛేద్యమైనదనే భావం అసంఖ్యాకమైన విషాదాలకు కారణమైందనే విషయం కూడా మరచి పోకూడదు.".

"కథ ఇంకా ముగిసి పోలేదు. ఆంగ్లేయుల్లో పెళ్ళి అనేది లౌకికమైన ఒప్పంద మయింది. షెల్లీ, జార్జి ఇలియట్ దాన్ని నిరాకరించారు. "ఆధునిక మహిళ మానవచరిత్రను తిరగరాస్తుంది".

అన్న గురజాడ మాట దాదాపు భావికాలజ్ఞతలా ధ్వనిస్తుంది. ఆయన మాటలు నిజమయ్యాయి. ప్రతిచోటా స్త్రీ తన హక్కుల కోసం పోరాడింది. చాలా వందేళ్ళు గడవక ముందే మేరకు వాటిని సాధించింది. మానవకృషికి సంబంధించిన ప్రతి రంగంలోకి ఆమె తోసుకొని వచ్చింది. అధికారమూ, ప్రతిష్ఠా ఉండేకొన్ని అత్యున్నత స్థానాలు ఆమె అలంకరించింది. నిజమే. ఆమె కొన్ని దిశల్లో ఇంకా పురోగమించ వలసివుంది, కొన్ని అవిజిత దుర్గాల్లో ఇంకా | తన జెండా ఎగుర వేయవలసి ఉంది. ఆ పని చేయడానికి "ఆధునిక మహిళ మానవ చరిత్రన తిరగరాస్తుంది" అని ఆమె కోసం గురజాడ సృష్టించిన నినాదం కంటే ఉత్తేజకరమైన వివాదం ఏముంటుంది? గురజాడ ఉత్తరం దాని చివర పేరాగ్రాఫులో మహత్తరమైన శిఖరాలకు చేరుకుంటుందని చెప్పవచ్చు:

*"వాస్తవాలను దాట వేయవద్దని నా కోరిక కత్తితీసుకొని లోతుగా కోసి పరిశీలించు ఆరాధించదగ్గ నిజమైన ప్రేమ మానవ ప్రేమే. ఆయన కాలానికి సహజపరిమితుల్లో యేసుక్రీస్తు బోధించింది లేదా బోధించాడని అనుకునేది అదే. కవితా కల్పనగా షెల్లీ బోధించింది అదే సజీవ మతంగా బుద్ధుడు బోధించింది అదే. బౌద్ధ మతాన్ని రూపుమాపినప్పుడు భారతదేశం మత రీత్యా ఆత్మహత్య చేసుకుంది."*

ఈ మహనీయ దృక్పథముండే ఈ మహనీయవ్యక్తి తాను పోగొట్టుకున్న కొండు భట్టీయం' నాటకాన్ని 1910లో తిరగ రాయడానికి పూనుకుంది.

మొదట మూడు అంకాలు మాత్రమే ఆయన అలా మళ్లీ రాయగలగడం విచారకరమైన విషయం ఆ మూడు అంకాలు ఆయన వదలిపెట్టి పోయినట్టు ప్రచురింపబడక పోవడం అంతకంటే విచారకరమైన విషయం. ఆయన కొడుకు ఆ నాటకం మొట్టమొదటి వారంలో కొంత భాగం దొరికిందంటూ, 1939లో ఆ రెండు పాఠాల అతుకుల బొంత అయిన ఒక పాఠాన్ని ప్రచురించారు. దాన్ని గురించి మనం. చెప్పవలసిందల్లా అది 'కన్యాశుల్యానికి నిస్సారమైన అనుకరణ సయితం కాదు. నీరసమైన ప్రతిధ్వని సయితం కాదు.

రెండు నాటకాలకూ కొన్ని స్థూలమైన పోలికలు వున్నమాట నిజమే. ప్రాచీన గ్రీసు దేశానికి చెందిన లూసియన్కు ఇటు తత్వశాస్త్రంలోనూ, అటు వేశ్యల్లోనూ ఆసక్తి ఉండేది. గురజాడలో కూడా అలాంటి ఆసక్తుల సమ్మేళనం ఉండేది. విజయనగరం సంస్థానంలోని రామస్వామి, వెంకటస్వామి, నారాయణస్వామి మొదలైన 'స్వాముల' ద్వారా ఆయనకు భారతదేశ గణికతో పరిచయం ఏర్పడింది. ప్రపంచ సాహిత్యం ప్రపంచ చరిత్రల అధ్యయనం ద్వారా ఆయనకు గ్రీసుదేశపు హెరాతో, జపాన్ దేశపు దైషాతో పరిచయం కలిగింది. లూసియన్ రాసిన 'వేశ్యా సంభాషణలు' ఆయన చదివి ఉంటారని వూహించవచ్చు. లూసియన్, వోల్టేర్, గురజాడలను తులనాత్మకంగా పరిశీలిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆ ముగ్గురి మధ్య చాలా పోలికలున్నాయి. అయితే లూసియన్లో పీడితులపట్ల, దళితులపట్లా కరుణలేదు. ఇదంతా అప్రస్తుతం కొండు భట్టీయం' విషయానికి తిరిగి వద్దాం. ఇక్కడ మధురవాణి స్థానంలో మంజువాణి కన్పిస్తుంది. గిరీశం కూడా దర్శన మిస్తాడు. కానీ కాస్త భిన్నమైన అవతారంలో కొత్త అవతారం పాత దానికంటే మేలైందో, పాడైందో చెప్పడానికి తగినంత సమాచారంలేదు. స్త్రీలోలురు పుష్కలంగా ఉన్నారు. అయినా 'కన్యాశుల్కానికి దీనికి భేదం కొండుభట్టీయ సమకాలిక సమాజంమీద, మతంమీద సూటిగా దాడిచేస్తుంది.

గురజాడ సాంఘిక, మత సంస్కరణను గట్టిగా కోరేవారు. నిజానికి సర్వమతాలు పోయి.. వాటి స్థానంలో మానవతా వాదంవస్తే ఆయన ఆహ్వానించేవారు. అగస్ట మ్టే (1798-1857)లో ఆయనకు నచ్చింది, అతని మానవతా వాదం. ఆయనకు నచ్చినది అతను దానికి పూసిన మతం రంగు. కాబట్టి కొందరన్నట్లు, గురజాడ సాంఘిక, మత సంస్కరణను అపహాస్యం చేశారనడం తప్పు. ఆయన అవహాస్యం చేసింది. సంస్కరణకు సంబంధించిన నటనను మతాన్ని నీచత్వానికీ, వంచనకూ మునుగుగా ఉపయోగించుకునే వాళ్ళను ఆయన ఏవగించుకున్నారు. మత సాంఘిక సంస్కరణ పేరుతో ఒక బహిక లాభం పొందదానికి ప్రయత్నించే వాళ్ళను ఆయన ద్వేషించారు. అలాంటి వంచకులను అపహాస్యం చేయడంలో ఆయనకుండిన అత్యుత్సాహం వల్ల సమస్త సంస్కరణకూ ఆయన వ్యతిరేకి అనే అభిప్రాయం. కొంతమందిలో కలిగిన మాట వాస్తవమే. నిజానికి ఆయన కోరింది సంస్కరణను మించింది. సమస్త మానవాళీ నూతన శిఖరాలు అధిరోహించేట్లు, నూతన విషయాలు సాధించేట్లు మన ఆలోచనా విధానంలో, మన జీవిత విధానంలో మార్పు రావాలని ఆయన అభిలాషించారు.

ఆయన రెండో అసంపూర్ణ నాటకమైన 'బిల్హణీయం' ప్రయోజనం పైదాని కన్నా పరిమితం.. వాడుక భాష సాంఘిక హాస్యనాటకాలు రాయడానికే కాక, కాల్పనిక నాటకాలూ, చారిత్రక నాటకాలూ రాయడానికి ఉపయోగపడుతుందని

వాడుక భాషా వ్యతిరేకులకు రుజువుచేసే నిమిత్తం ఆయన దాన్ని రాశారు. ఆయన ఎన్నుకున్న ఇతివృత్తం కాల్పనికమూ, చారిత్రకమూ కూడా - దాని చారిత్రకత కొంత సందేహాస్పదమైనా, ఆ నాటకం మొదటి అంకాన్ని 1910లో, రెండో అంకాన్ని 1911లో ఒక పత్రికలో ఆయన ప్రచురించారు. తర్వాత దాన్ని ఎందుకు ఆయన కొనసాగించలేదో మనకు తెలియదు. రాజకన్యతో బిల్హణకవి ప్రేమకు సంబంధించిన పాత కథలకూ ఈ ప్రచురిత ఖండానికీ మధ్య చాలా భేదంవుంది. రాజాస్థానం బాహ్య ఠీవి చాటున తమ వికృత రూపాలను దాచుకున్నా క్షుద్రవైరాలనూ, కుయుక్తులనూ, అసూయలనూ, ఇతర నైచ్యాలనూ నిర్దాక్షిణ్యంగా చిత్రించడంలో నాటకం ప్రారంభమవుతుంది. ప్రాసంగికంగా మతం మీదా, ఛాందన పాండిత్యం మీద కొన్ని చురకలుకూడా ఉన్నాయి.

శిల్ప విషయంలో ఈ రెండు నాటకాల్లో ఏదీ 'కన్యాశుల్కం' కంటే మెరుగైంది కాదు. రంగాలు మరీ చిన్నవిగా, యెగుడు దిగుడుగా ఉన్నాయి. షేక్ స్పియర్ ప్రభావమూ, రాబర్ట్సన్ ప్రభావమూ రెండూ కన్పిస్తాయి. 'నాల్గో హెన్రీ'లో అదృశ్యమై 'మెర్రీవైన్స్ ఆఫ్ విండర్స్'లో మళ్లీ కన్పించే షేక్స్పియర్ పాత్ర ఫాల్స్టాఫ్ లా, ఫాప్కు ప్రతి రూపమైన గిరీశం 'కొండు భట్టీయం'లో మళ్ళీ కన్పిస్తాడు. ఆంగ్ల నాటక రంగంమీద రాబర్టుసన్ ప్రభావం ప్రబలంగా ఉన్నప్పుడు, రంగస్థలం మీద నిజమైన గుర్రపుబండిని ప్రదర్శించారు. గురజాడ తన వంతుకు కొండు భట్టియంలో నిజమైన రైలుబండిని ఇంజన్తో, పెట్టెలతో సహా ప్రవేశ పెడతారు! అంతకన్నా ముఖ్యంగా గమనించ దగింది నాటకం పేరుకు కారణమైన కొండుభట్టు మహానీచులైన కొందరు బ్రాహ్మల మీద ప్రచండమైన దాడి చేయడానికి ఉపయోగింపబడడం అతను తార్పుడుగాడు.. 'తను 'భూసురుడు' కాబట్టి, తనకు యే పాపమూ అంటదని వాదిస్తారు. 'కన్యాశుల్కం' విషయంలో లాగే ఈ అసంపూర్ణ నాటకాల్లోని పాత్రల్లో అత్యధిక భాగానికి వాస్తవ జీవితంలో మూలాలున్నాయి. కానీ అగ్రశ్రేణి సృజనాత్మక రచయిత లందరికీ తెలిసినట్లే. జీవితాన్ని సాహిత్యంతో మేళవించడం ఎలాగో గురజాడకు తెలుసు. ఆయన నోటు పుస్తకాల్లో 'ఎం.ఓ' అని గుర్తుపెట్టిన అంశం ఒకటివుంది. అది ఇది "రచయిత తన పాత్రల నన్నిటినీ జీవితం నుంచి తీసుకోడు, తనకు తెలియకుండానే మునుపటి కవులు కల్పితపాత్రల గుణాలు కొన్ని దిగుమతి చేసుకుంటాడు."

ఖచ్చితమైన నాటక విమర్శక ప్రమాణాలతో చూస్తే కొండు భట్టీయం' 'విల్హణీయం' వైఫల్యాలు, . కానీ హీన సాఫల్యం హద్దులను దాటిపోయే ఉన్నత వైఫల్యాలు..

## 'పుట్టుకతో కథకుడు'

"నా కెన్నో పర్యాయాలు అనిపించింది కవిలాగే కథకుడు పుడతాడని" - సర్ రిచర్డ్ స్టీల్

గురజాడ పుట్టుకతో, తెలుగు సాహిత్యంలో కథకుడు జన్మించాడు. మనకు అంతకు ముందే నీతి కథా, పుక్కిటి కథా, వీరగాథా, కట్టుకథా ఉన్నమాట నిజమే, కానీ కథానికలేదు. కొంతవరకు దాని వస్తువు మూలంగా, ముఖ్యంగా శిల్పం మూలంగా కథానిక ఇతర కథల కంటే భిన్నంగా ఉంటుంది.
దాని ప్రారంభం పాఠకులను ఆకట్టుకొనేట్లుగా ముగింపు ఆశ్చర్యకరంగా ఉండాలి. మధ్యలో ఎక్కడా అది దారి తప్పి సందుల్లోకీ గొందుల్లోకి వెళ్ళకూడదు. ఒక జీవిత శకలాన్ని సంక్షిప్తంగా, కళ్లెదుట నిల్చినట్లుగా చిత్రించడానికి అది ప్రయత్నించాలి. మహాప్రతిభావంతుడైన రచయిత ఈ నియమాలనూ, సంప్రదాయాలనూ అన్నింటినీ ఉల్లంఘించవచ్చు. కానీ ప్రతిభావంతులు అరుదు.

గురజాడ డైరీల్లోనూ, నోటుపుస్తకాల్లోనూ కనీసం వంద కథానికలకు ముడి సరుకు ఉంది. కానీ, ఆయన రాయగలిగిందల్లా తెలుగులో నాలుగూ, ఆంగ్లంలో 'సంస్కర్ణ హృదయం' అనేదీ ఒకటి మాత్రమే. సంస్కర్త హృదయం అన్నిటికన్నా పెద్దది. దాని ఇతివృత్తం గురజాడ మనసును అధికంగా ఆక్రమించిన సంఘసంస్కరణ. దాని ప్రధానపాత్ర ఉదాత్త వ్యక్తిత్వమూ, సుసంస్కారమూ ఉన్న ప్రొఫెసరు రంగనాథ అయ్యర్ అతనికి కొండుభట్టీయంలోని పిరికి సంస్కర్తలతో గానీ, బడాయి సంస్కర్తలతో గానీ పోలిక లేదు. అతను మరొక గిరీశం కానేకాదు. యవ్వనమూ, సౌందర్యమూ ఉంది, మహా ప్రవీణురాలైన సరళ అనే సానిపిల్లను ఆ అసహ్యమైన వృత్తి నుంచి రక్షించాలనే అతని కోరిక నిష్కపటమైంది. కానీ అతనికి తెలియకుండానే అతనిలో ఆమెపట్ల అభిమానం మొలకెత్తి, మెల మెల్లగా అది కోరికగా అభివృద్ధి చెందుతుంది. ఒకరోజు ఆమె వీణ వాయిస్తుండగా, అతను హఠాత్తుగా ఆవేశంతో ఆమెను ముద్దు పెట్టుకుంటాడు.

మరుక్షణంలోనే అతను తన జీవితాదర్శాలను తానే ఉల్లంఘించినట్లు గుర్తించి, కళాశాలలో తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్ళిపోతాడు ఎక్కడికో ఎవరికీ తెలియదు. ఈ కథానిక సోమర్సెట్ మామ్ (1874-1965) రాసిన వర్షం అనే కథను గుర్తుకుతెస్తుంది. కానీ ఇది దానికి అనుసరణ కాదు. మామకు ఆ కథను గురించిన ఆలోచన 1916లో వచ్చినట్లు దాన్ని 1920లో రాసినట్లు తనే తెల్పారు. గురజాడ 1915లోనే మరణించారు.

గురజాడ తెలుగులో రాసిన కథల్లో రెండు సంస్కర్త హృదయం' కన్నా చాలా విధాల శ్రేష్టమైనవి. అవి చిన్నవి. వాటికి నాటకీయమైన ప్రారంభమూ, ఆశ్చర్యాన్ని గొలిపే ముగింపూ ఉన్నాయి. అవి నేరుగా అసలు విషయంలోకి వస్తాయి. వాటిలో అనవసరమైన తళుకుల్లేవు, అనవసరమైన మాట ఒక్కటికూడా లేదు. వాటిలో వున్న లోపమల్లా, ఆయన వాడుక. కేవలం బలంవల్ల దొర్గిన కొన్ని పురాతన తెలుగు పదాలూ, పదబంధాలూ 'మీ పేరేమిటి' అనే కథకు

నివ్వెరపాటు కలిగించే ప్రారంభం ఉంది. 'దేవుడు చేసిన మనుషుల్లారా మనుషులు చేసిన దేవుల్లారా మీ పేరేమిటి?' అనే ప్రశ్నతో కథ మొదలవుతుంది. మరొక కథ 'తలుపు తలుపు' అనే అజ్ఞానతో మొదలవుతుంది. తలుపు తెరుస్తూనే మనం కథామధ్యంలోకి అడుగు పెడతాం!

ఆశ్చర్యం కల్గించే ఈ శిల్ప చాతుర్యమేకాక, ఇతివృత్తాలను ఎన్నుకోవడంలో కూడా గురజాడ. పరిణత నైపుణ్యం ప్రదర్శిస్తారు. ఆయన ఇతర రచనలకున్నట్లే, కథలకు కూడా ఉదాత్తమైన ప్రయోజనం ఉంది. ఒక కథ మత విద్వేషాలకు సంబంధించింది. మరొకటి మతశాఖా కలహాలకు సంబంధించింది.
రెంటిలో మొదటిదానిపేరు 'పెద్ద మసీదు' దాన్ని బుల్లి కథానిక అనవచ్చు. సుమారు అయిదువందల పదాలు మాత్రమే ఉండే ఆ కథ యే ప్రపంచం ఉత్తమ కథానికా సంకలనంలోనైనా చేరదగింది. గురజాడను గురించి రాసిన పలువురు రచయితలు దాన్ని అసంపూర్తి రచనగా పేర్కొన్నారు. వాళ్ళది పూర్తిగా తప్పు, అది సంపూర్ణమైన కథ. దానికి మరొక వాక్యం కలిపితే, మరొక మాట కలిపినా కూడా నాటకీయమైన దాని పతాక సన్నివేశులం అంతా దెబ్బతింటుంది. ఒక బ్రాహ్మణ పండితుడు చాలా యేళ్ళు కాశీలో గడిపిన తర్వాత శిష్యునితో కూడా స్వగ్రామానికి తిరిగివస్తాడు. ఊరి పొలిమేరల్లో ఉండగానే, కన్పించవలసిన పురాతన దేవాలయ గోపురం కన్పించకపోయేసరికి అతనికి ఎంతో దిగులు కలుగుతుంది. దాని స్థానంలో మసీదుగోపురాలు కన్పిస్తాయి. పండితుడు వచ్చినదారి వెళ్ళాలనుకుంటాడు. కానీ, మనసు మార్చుకోమని శిష్యుడు నచ్చచెబుతాడు. దేవాలయం స్థానంలో మసీదు ఎలా ఎప్పుడు ఏర్పడింది తెలుసుకునే నిమిత్తం, ఇద్దరూ కలిసి నేరుగా మసీదువద్దకు వెళతారు. వాళ్ళ ప్రశ్నలకు ఇమాం జవాబులు ముక్తసరిగా, బండగా ఉంటాయి. అయినా గుడి సమీపంలో ఉంది తన దగ్గరి బంధువులు ఏమైందీ తెలుసుకోవాలనే తాపత్రయంలో ఆ పండితుడు వాళ్ళను గురించి అడుగుతాడు. దాంతో ఆ ఇమాం ఆ పండితుని మేనల్లుడే అని తెలుస్తుంది. మరుక్షణంలోనే ఇద్దరూ ప్రేమపూర్వకంగా కౌగలించుకుంటారు! దీన్ని అసంపూర్తి కథ అనడం వెర్రితనం కాదా? అంతేకాదు గురజాడ పరిణత నైపుణ్యానికి అపచారం గారా! సకల కాలాలకు వర్తించే సందేశం, మతంకంటే రక్తసంబంధం బలీయమైందనే సందేశంతో అసాధారణమైన మానవ హృదయాసక్తి ఉండే కథను ఆయన కేవలం సుమారు ఐదువందల పదాల్లో కుదించారు!

దీనికన్నా చాలా పెద్దదైన ఇంత శక్తిమంతం కాని కథ 'మీ పేరేమిటి?' అనేది. అది వైష్ణవ శైవశాఖలు తమతమ ఆధిక్యాన్ని రుజువుపరచుకోడానికి చేసే వాదాలు బూటకమనిపిస్తుంది. ఆ వాదాలు వెనుక ఉండే స్వార్థాన్నీ, జిత్తులనూ బట్టబయలు చేస్తుంది. వేరు వేరు పేర్లున్నా భావంతుడు ఒకటే అయితే యెన్నెన్నో పేర్లు గల ఈ అనేక దేవతలను కట్టగట్టి తగల పెట్టాలనీ, అప్పుడు ఆ ఏకైక భగవంతుని అందరూ సమైక్యంగా ఆరాధించ వచ్చుననీ కథ ముగిస్తుంది. తక్కిన రెండు కథల్లో ఒకటి యుక్తిపరురాలైన ఒక భార్య చుట్టూ అల్లబడింది. ఆమె ఒక యుక్తవన్ని తప్పుదారిలో పోతున్న భర్తను అదరగొట్టి దారిలోకి తెస్తుంది. మరొక కథ అనుమానించే ముసలి మొగుడికి ముడి పెట్టబడిన పడుచు భార్యకు సంబంధించింది. ఈ కథల్లో కూడా మెచ్చుకో తగ్గ గుణాలున్నాయి. అయితే నిశ్చయంగా ఇవి తక్కువ స్థాయికి చెందినవే.

గురజాడ రాసిన అయిదు కథలనూ విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, అలాంటివి కనీసం యాభై అయినా ఆయన రాసివుంటే బావుండునని మన కనిపిస్తుంది. 'కన్యాశుల్కం' ఒక్కటే ఆయన బృహద్రచన కావడానికి శారీరక దౌర్బల్యమే కారణం కావచ్చు. ఆ 'కన్యాశుల్కం' కూడా నిజానికి అనేకమైన చిన్నచిన్న ముక్కల సమాహారమేతప్ప అది ఒక యేకీకృత సజీవ సమస్తంకాదు. ఆ నాటకాన్ని వందసార్లుకు పైగా ప్రదర్శించిన అబ్బూరి రామకృష్ణారావు దాన్ని, సులభంగా పద్దెదు యేకాంకికలుగా విభజించ వచ్చునంటారు. ఆయన మాటను సులభంగా కాదనడానికి లేదు. తాను యెన్నుకున్న రచనాప్రక్రియ చిన్నదయ్యేకొద్దీ గురజాడ ప్రతిభ వికసిస్తుందన్న మాట! ఆయన కథలకంటే ఎక్కువగా, అన్నీ చిన్నవే అయిన ఆయన కావ్యాలూ, పాటలూ ఈ అభిప్రాయాన్ని ధ్రువపరుస్తాయి.

## దండగా కూర్చిన మంచిముత్యాలు

"ఆయనే ఒకచోట చేర్చింది చెల్లాచెదురుగా ఉన్న మాటల్ని - ఆయనే మంచి ముత్యాల్ని తొలిచి దండగా కూర్చింది"-పిల్చే

పైన వుల్లేఖించిన పిల్సే ఎవరు? అతన్ని పిల్పియ్ అనికూడా అంటారు. బిర్పెల్ అనే మరోపేరు సయితం అతనికి ఉంది. మనలో చాలా మందికి ఆశ్చర్యం కలగవచ్చు గానీ పశ్చిమాసియాలో ఈ మూడు పేర్లతో చలామణి అయ్యే అత నెవరో కాదు, 'పంచతంత్రం' రాసిన భారతీయుడే. విద్యాపతి అతని బిరుదనామం. పిల్చే, పిల్పాయ్, బిక్పాల్ అనేవి ఆ బిరుదనామ రూపాలు. ఆ ప్రాచీన కాలానికి చెందిన విద్యాపతిలాగా గురజాడ కూడా చెల్లా చెదరుగా ఉన్న పదాలను ఒకచోట చేర్చారు. సరాలుగా కూర్చడానికి 'మంచి ముత్యాలను తొలిచారు. ఎంత అద్భుతంగా వున్నాయి ఆ సరాలు! అవి సాధించిన అద్భుతం ఒక్క అవి తెలుగు కవిత్వాన్ని మధ్య యుగం నుంచీ ఆధునిక యుగంలోకి తెచ్చాయి. చందన.. పండిత బృందాల దగ్గరనుంచీ సామాన్య ప్రజల దగ్గరకు తెచ్చాయి, రుచీపచీలేని నీరస స్థితినుంది నవనవోన్మేషము, పరిమళ భరితమూ అయిన స్థితికి తెచ్చాయి.

మనం ఇంతకుముందే గమనించినట్లు, తెలుగు కవిత్వంలో గురజాడ మొదటి ప్రయత్నం ఆశాభంగం కలిగించింది. ఆయన రచించిన 'నీలగిరి పాటలు' ఆయన నిర్విమర్శకాభిమానులు ప్రశంసించినా, అవి ఆయనలాంటి నూతన పథ నిర్దేశకుని యోగ్యతకు తగినవి కావు. పద గుంఫనంలో గానీ, వస్తువులో గానీ, అలంకారంలో గానీ లేశ మాత్రం కొత్తదనం కూడా వాటిలో కన్పించదు. కాబట్టి అచ్చమైన ఉత్తేజం కలిగే సమయం వచ్చేంతవరకు ఆయన ఆగవలసి వచ్చింది. ఆ సమయం అనతి కాలంలోనే వచ్చింది. యాదృచ్ఛికంగా విన్న ఒక జానపదం గీతం యొక్క మనోహరమైన లయ ఆయనను నిలువునా వుర్రూత లూగించింది. దాని మంత్ర కట్టులో ఇలా ప్రకటించారు:

" గుత్తునా ముత్యాల సరములు  
కూర్చుకొని తేటైన మాటలు,  
కొత్తపాతల మేలు కలయిక,  
బొమ్మెరుంగులు బొమ్మగా"

ఆ ప్రకటనతో రెండు వస్తువులు జన్మించాయని చెప్పవచ్చు. ఒక కొత్త ఛందస్సూ, ఒక కొత్త కవితా సంప్రదాయమూ, కొత్త ఛందస్సుకు గురజాడ ముత్యాల సరాలు అని పేరు. పెట్టారు. సాహసోపేతమైన తన కొత్త ఛందస్సుకు పాత కాపులనుంచీ గట్టి ప్రతిఘటన ఎదురవుతుందని ఆయనకు ముందే తెలుసు. ప్రతిఘటన పట్ల తిరస్కారం వెల్లడించారు

"మెచ్చనంటా నీవు; నీవిక

మెచ్చకుంటే మించి పాయను,
కొయ్యబొమ్మలె మెచ్చు కళ్ళకు
కోమలుల సొరెక్కువా?

ఉత్తేజితుడైన అచ్చమైన కవి గురజాడ సుదూర భవిష్యత్తులోకి దృష్టి సారించి ఇలా ప్రకటిస్తారు.

"చూడు మనుమును మేటివారల
మాట లనియెడు మంత్ర మహిమను
జాతి బంధములన్న గొలుసులు
జారి సంపద లబ్బెడున్
యెల్ల లోకము నొక్క ఇల్లై,
వర్ణభేదము లెల్ల కల్లై
మేలు మెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియ
మతము లన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును,
అంత స్వర్గ సుఖంబు లన్నియు
యవని విలసిల్లున్

ఆచంట అన్నట్లు, ఈ పాదాల్లో గురజాడ 'నానాజాతి సమితి భావాలనూ, అట్లాంటిక్ చార్టర్ భావాలనూ, ఐక్యరాజ్యసమితి భావాలనూ కొన్ని దశాబ్దాలు ముందుగా ప్రకటించారు. ఆయన తన తెలుగును ప్రేమిస్తారు. కానీ ఆ ప్రేమ యితర భాషలను కూడా కలుపుకుంటుంది. యెందుకంటే, ఇతర జంతువులనుంచీ మానవుని మొదట వేరుపరచింది భాషే ఆయన తన దేశాన్ని ప్రేమిస్తారు. కానీ ఆ ప్రేమ ఇతర దేశాలను వెలివేయదు. కారణం, అన్ని దేశాలూ ఏక ప్రపంచ మౌతాయి. అందువల్ల దేశభక్తి మీద ఉత్తేజకరమైన గేయం రాసినప్పుడు కూడా ఆయన భారతదేశ చరిత్రనూ, భౌగోళిక పరిస్థితులనూ ప్రస్తావించరు. భూగర్భ విషయాన్నీ జాతులనూ ప్రస్తావించరు, వృక్ష సంపదనూ, జంతు సంపదనూ ప్రస్తావించరు. కేవలం మనిషిగా మనిషిని ప్రస్తావిస్తారు. ఆ మనిషి భారత జాతికిచెందినా సరే, మరేజాతికి చెందినా సరే. అంతేకాదు, దారితప్పిన దేశభక్తులను ఆయన ఇలా మందలిస్తారు కూడా.

"దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్"

ఒక్కొక్క 'ముత్యాల సరం' పూర్తి అయ్యేకొద్దీ తాను సృష్టించిన ఛందస్సు మీద గురజాడకు ఆధిపత్యం లభించింది. దాని అనంతమైన అవకాశాలను ఆయన పూర్తిగా వినియోగించు కున్నారు. అది ఒకోసారి మలయమారుతంలా మెల్లగా ప్రసరించేట్లు, ఒకోసారి దూరాన వున్న సెలయేటిలాగా గలగల మని మర్మరించేట్లు, ఒకోసారి ఉదయాకాశంలా గులాబి రంగులు ధరించేట్లూ, ఒక్కోసారీ వర్షాకాలం కారుమబ్బుల్లాగా సుళ్ళు తిరిగేట్లూ ఒకోసారీ శరశ్చంద్రికా కిరణాల్లా సుకుమారంగా చుంబించేట్లు చేస్తారు. ఆయన ఏమిచేసినా ఎప్పుడూ తన గాంభీర్యంతో, ఉదాత్తతతో, తన సౌందర్యంతో, శక్తితో, అది మనల్ని సమ్మోహన పరుస్తుంది. ఇదంతా, ఇంకా ఎక్కువగా కూడా, కేవలం సుమారు డజను కవితా ఖండికల్లో ఆయన సాధిస్తారు. అన్నిటికన్నా పెద్ద ఖండికలో సయితం నాలుగువందల పాదాలకంటే తక్కువే ఉన్నాయి. ఎగతాళి చేస్తూ మేళమాడుతూ, నవ్వుతూ, వెలుగులుచియ్యే గురజాడకు బదులు ఈ ఖండికల్లో గంభీరుడూ. ప్రశాంతుడూ అయిన గురజాడ కన్పిస్తారు. ఆయన ఉపదేశం ఇవ్వరు. వీరాధిపతిలాగా ధర్మసూక్తులు వల్లించరు.

ఛాందస పండితునిలా కూడా ప్రవర్తించరు. ఆయన బుల్లి బుల్లి మాటలకు రెక్కలు తొడుగుతారు వాటిని మానవతావాద సందేశహరులుగా తీరుస్తారు.

పేదరికం లేని ప్రపంచం, భయం తెలీని ప్రపంచం, మూఢ విశ్వాస ప్రవర్తన లేని సమాజం ఇవి ఆ వాదం పునాదులు మతాలూ, మత శాఖలూ, గణాలూ, జాతులు, కులాలు, వర్గాలూ మానవతావాదానికి అడ్డుపడితే వాటిని పూడ్చి పారవేయ వలసిందే, దేవతలైనా సరే దారిని అడ్డగిస్తే వాళ్ళను నెట్టి పారవేయవలసిందే.
మానవుడు వివేకం వల్లా, జ్ఞానం వల్లా.. ప్రేమ వల్లా, కరుణ వల్లా, విజ్ఞత వల్లా నడిపింపబడుతూ, మరింత సంపూర్ణము, పుదాత్తమూ, అర్ధవంతమూ అయిన జీవితాన్ని అన్వేషిస్తూ ముందుకు సాగాలి. గురజాడ ఊహించే భవిష్యత్తులో

"చెట్టపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడవ వలెనోయ్.
అన్న దమ్ములవలెను జాతులు
మతము లన్నీ మెలగ వలెనోయ్;

మతం వేరైతేను యేమోయి
మనసు నొకటై మనుషులుంటే
జాతమన్నది లేచి పెరిగి
లోకమున రాణించునోయి!

దేశమనియెడి దొడ్డ వృక్షము
ప్రేమలను పూలెత్తవలెనోయ్
నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్!".

గురజాడ నాటకీయతలో, తాత్వికతలో ప్రతిభాశీలి కాబట్టి, కథన కవితలో ఆయన అత్యుత్తమంగా రాణిస్తారు. ఆయన 'కన్యక', 'పూర్ణమ్మ' మనకు కళ్ళనీళ్ళు తెప్పించేంత విషాదభరితంగా ఉన్నాయి. కామాతురుడైన రాజు చేతిలో మైల పడకుండా కన్యక మరణమే కోరుకుంటుంది. ఆత్మహత్య చేసుకునే ముందు ఆ మానవరూప పశువుతో ఆమె ఇలా అంటుంది:

"పట్టమేలే రాజు అయితే
రాజునేలే దైవ ముండదా?"

కుందనపు బొమ్మలాంటి పూర్ణమ్మను ఆశపోతైన తండ్రి ఆమె తాత కాదగినంత వయసుండే ముసలోని కిచ్చి పెళ్లి చేసినప్పుడు ఆమె గ్రామ దేవాలయ పుష్కరిణిలో పడి ఆత్మహత్య చేసుకుంటుంది. అలా దుర్మరణం చెందినప్పుడు

"కన్నుల కాంతుల కలవల చేరెను
మేలిమి జేరెను మేని పసల్

హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ"

పూర్తిగా మరో రకానికి చెందిన కథా కావ్యం 'లవణరాజు కల' 'యోగ వాసిష్టం'లోని ఒక ఘట్టంపై ఆధారపడ్డ ఆ కథ గురజాడ చేతుల్లో కొత్త అర్థం సంతరించుకొని, కొత్త సందేశం అందిస్తుంది. మానవాళి సమానతకూ గౌరవానికి చెందిన సందేశం. కలలో లవణరాజు ఒక మాల కన్యను ప్రేమించి పెళ్ళాడాలను కుంటాడు. కులభేదం కారణంగా ఆమె అతన్ని వారించబోతే, అతను ఇలా అంటాడు:

"మంచి చెడ్డలు మనుజు లందున,
యెంచి చూడగా, రెండే కులములు
మంచి యన్నది, మాలయైతే
"మాలనే, అగుదున్" -

'లవణరాజు కల'తో పోలిస్తే, గురజాడ రాసిన 'దామన్ ప్రీతియన్' చాలా అసంతృప్తికరంగా ఉంది. డామన్, ప్రీతియన్ అనే ఇద్దరు గ్రీకులకు సంబంధించిన రోమన్ గాథను కొన్ని మార్పులతో గురజాడ అనుసరించారు. ఆదర్శప్రాయమైన మిత్రులు కాబట్టి, ఆ ఇద్దరూ ఒకరికోసం ఒకరు సంతోషంగా చావడానికి సిద్ధమౌతారు. పిలియన్ భార్య కూడా అలాగే ఆదర్శప్రాయమైంది అయినట్లు గురజాడ చిత్రిస్తారు. తన భర్తప్రాణం కాపాడడానికి ఆమె తన ప్రాణం ఇస్తానంటుంది. ఆ మైత్రి ఆ ప్రేమ ఉదాత్తత చూసి సిరక్యూస్ రాజు డయోనిసియస్ ఆ మిత్రుల్లో ఒకరికి అంతకుముందు విధించిన ఉరిశిక్ష రద్దు చేస్తాడు. విషాదాంతం కాబోయే కథ సుఖాంతంగా మారుతుంది. కథలో ఇమిడివున్న అనేకావకాశాలను గురజాడ సంపూర్ణంగా వినియోగించుకోలేక పోయారు. ఉత్తేజం సూటిగా కలక్కపోవడం వల్ల మరికొన్ని సందర్భాల్లోలాగే, ఇక్కడ కూడా ఆయన ప్రతిభ సంపూర్ణంగా వికసించదు. ఇక, సాంప్రదాయిక కవులను అనుసరించినప్పుడు ఆయన సగటు కవుల కన్న యేమీ మిన్నకారు. తాను వాడుక భాషా, సరళమైన ఛందస్సూ వాడడం పాండిత్య లోపంపల్ల కాదని రుజువు చేయడానికి ఆయన సాంప్రదాయక ఛందస్సూ, పాతబడ్డ భాషలో 'సుభద్ర' రచిస్తే, అది మరీ చప్పుగా తయారైంది. దాన్ని మధ్యలోనే ఆపెయ్యడానికి కారణం తనకే వెగటు కలగడం కావచ్చు.

ఆంగ్ల ప్రభావం మూలంగా మన రచయితల్లో ఆంగ్లంలో ఆలోచించి, ఆ భావాలను తమ మాతృభాషలోకి అనువదిస్తుంటారు. గురజాడ డైరీల్లో ఒకచోట ఇలావుంది. ఆయన 1914 జనవరిలో కలకత్తాకు వెళ్ళినప్పుడు "రవీంద్రుని వంగభాష ఆంగ్ల నుడికారంలో ఉంటుంది. అందువల్లే ఆయనకు పేరు రాలేదు" అని హరిప్రసాద్ శాస్త్రి అన్నాడట. ఆ వాటికి, అంటే రవీంద్రునికి నోబెల్ బహుమతి రాకపూర్వం, ఆయన కవిత్వానికి, ఆ మాటకొస్తే ఆయన వచనానికి సయితం బెంగాలీల్లో ముఖ్యంగా పండితుల్లో, ఛాందస్సుల్లో పేరురాలేదు. కానీ, రవీంద్రుని సంగభాషమీద హరిప్రసాద్ అంచనా సరైందోకాదో మనకు తెలియదు. అదేమైనా, యెంత రంధ్రాన్వేషులు కూడా గురజాడకు తెలుగు నుడికారం మీద ఉండే ఆధిపత్యాన్ని తప్పులు బట్టలేదు. ఆయన రచనలోని అసస్య సాధ్యమైన సమ్మోహన శక్తికి అజరామరమైన ప్రశస్తికి కారణం ఆధిపత్యమే. నిజానికి, తెలుగుభాషకు యెన్నో కొత్తపద బంధాలను, నుడికారాలనూ

సృష్టించి ఇచ్చిన ఘనత కూడా ఆయనకు దక్కింది. ఆయన స్పర్శ తగిలితే, మామూలు పదాలు కూడా కొత్త అర్థచ్ఛాయలనూ, కొత్త రాగస్వరాలనూ సంతరించుకుంటాయి. వర్డ్స్ వర్త్ ను గురించి రాస్తూ, రచయితకు 'అచంచలమైన విశ్వాస పునరుత్పాదకశక్తి' ఉంటే తప్ప అతను సాహిత్యాన్ని కొత్తదారిలో నడపించలేదని లూయీ కజామేన్ అంటాడు... "కవితోత్తేజాన్ని, భాషనూ సమూలంగా పునర్నవం చేయడానికీ, నిరంకుశ సంప్రదాయాన్ని ధ్వంసం చేసి మంత్రకట్టును ఛేదించడానికి గరిష్టమైన నైతిక ధైర్యం" అవసరమని కూడా అతనంటాడు.

ఈ 'అచంచల విశ్వాసం' మానవతావాదం తప్ప మరేదీ కాజాలదు. ఆయన నైతిక ధైర్యం 'మనిషి' అనే పేరుండే ఒక గేయంలో నిర్ద్వంద్వంగా ప్రకటిస్తారు. మనిషి మలచిన రాళ్ళకు దైవశక్తులున్నాయని భ్రమపడ్డం, వాటిని పూజించడమంటే ప్రాణంలేని రాళ్లస్థాయికి దిగడమే అనీ, కొండల్లో కోనల్లో దేవునికోసం వెదకడం నిరర్థకమనీ, మానవసేవే అసలైనముక్తి మార్గమనీ, ఇక అసాధారణమైన విశ్వాసం, అసాధారణమైన నైతికధైర్యం ఉండే కవి మాత్రమే ఆరు దశాబ్దాల క్రితం ఇలా రాసిఉండగలడు - తోడి మానవుల్ని కాక, రాళ్ళనూ, చెట్లనూ, పాములనూ, చతుష్పాదులనూ దేవతలుగా యెంచే మనషులమధ్య జీవిస్తూ...

## యాస సర్వం కవిత్వం

"యాస సర్వం రూపకం, రూపకమంతా కవిత్వం" - జి.కె. చెస్టర్ సన్

చెవిటి వాళ్ళకు వినబడాలంటే, బిగ్గరగా అరవాలి. ఆ చెవుడు తెచ్చిపెట్టుకున్నదైతే మరింత బిగ్గరగా అరవాలి. వ్యావహారిక తెలుగు ఉద్యమ వ్యాప్తికోసం, గురజాడ తన వయోజన జీవితమంతా చేయవలసి వచ్చింది సరిగ్గా ఇదే. ఈనాడు యాసమాటగా ఉన్నదే రేపు ప్రామాణిక ప్రయోగం అవుతుందనీ, ఎల్లుండి వాడుక దప్పిన మాట అవుతుందనీ సముచితంగా ఆలోచించే ఏ మనిషికైనా విశ్వాసం కల్గించడానికి ఏ సజీవ వర్ధమాన భాషా చరిత్రకైనా పైపైన పరిశీలిస్తే చాలు. ఇది అవిచ్ఛిన్న ప్రక్రియ, ఇది రక్త ప్రసరణ లాంటిది. ఈ ప్రసరణాన్ని ఆపడం అంటే, మృత్యువును లేదా అంతకన్నా ఘోరమైన పక్షవాతాన్ని కొని తెచ్చుకోవడమే. భాషా శాస్త్ర నిపుణుడూ, గొప్ప రచయితా అయిన లోగన్ పియర్సల్ స్మిత్ (1865-1946) ఆ విషయం మీద చెప్పింది.

"రచయిత తన భాషను తాను సృష్టించుకోలేదు. సమాజం సమకూర్చిన దాన్నే అతను స్వీకరించాలి. అనుభూతి ప్రేరకమూ, అలంకార భూయిష్టమూ అయిన భాషకోసం అతను చేసే అన్వేషణలో సహజంగా అతను తాము కళాకారులం అని తెలియకుండానే తరతరాల ప్రజా కళాకారులు సృష్టించిన సంపన్మయ సజీవ భాషను ఆశ్రయిస్తాడు.

అక్కడ అతనికి శక్తిమంతమూ, సజీవమూ అయిన భాష లభిస్తుంది. అలంకారమయం, వ్యంగవిలసితం జీవితమంటే ఉత్సాహ సంతోషభరితం. అది ఈ గుణాలు రచయితకు అమూల్యమైనవి. ఈ ఉత్సాహం, ఈ కుతూహలం సహృదయమైన. ఏవగింపునూ, హాస్యపూరితమైన తిట్లనూ, వ్యక్తం చేసే వందలాది మాటల్లో, పదబంధాల్లో రూపు గట్టుకొని ఉంటుంది. ఆశ్చర్యాన్నీ, అబ్బురపాటునూ విస్మయాన్నీ తెలియజేసే పదాల్లో రూపుదాల్చి ఉంటుంది. వాటి దుర్వారమైన ఉత్సాహం మూలం, బండశక్తి మూలంగా వాటికుండే కేళీ విలాసం మూలంగా ఎన్నో కింది తరగతి పదాలు మన డ్రాయింగు రూముల్లోకి ప్రవేశిస్తాయి. అయితే ప్రజాభాషలో మరొక గుణం సైతం ఉంది. అదే ఊహాశక్తి, కవిత్వమూ, సాహిత్యకారునికి ఇది ఇంకా విలువైంది కూడా. సంగీతకారులకు కార్మికుల గుడిసెల్లో అనియతంగా

వికసించిన మనోజ్ఞ జానపద సంగీతం కన్పించినట్లు, ఆ గుడిసెల్లోనే అలాగే మనోజ్ఞ జానపద కవిత్వం కన్పిస్తుంది. ఊహ సంపన్నమైన భాష, సంగీతంలాగే ప్రజాజీవితం గుండెకాయ నుంచి పుట్టింది. అది పుట్టిన గడ్డలాగే చైతన్యవంతమైంది"..

.జి.కె. చెస్టన్ (1874-1936) కూడా ఇదే అంటాడు. కానీ, తన సొంత పద్ధతిలో అంటాడు. సూత్రప్రాయంగా చెప్పడం, విషమాలంకారాల్లో మాట్లాడ్డం, ముళ్ళువేయడం అతనికి మోజు.

అందుకోసం అతను యాస ఇంకొక్క అడుగువేస్తే కవిత్వం అవుతుందని నవ్వులాటగా అంటాడు. కవిత్వం అన్నప్పుడు నాటకము, నవల, కథానికా, వ్యాసమూ, నిజానికి ఏనాడో చచ్చి ఇంకా సాహిత్యంగా చలామణి కావడానికి ప్రయత్నించేది తప్ప ప్రతి సాహిత్య ప్రక్రియా అతని మనసులో ఉందని మనం విశ్వసించవచ్చు. చాసర్ నాటినుంచీ షేక్స్పియర్ నాటికీ, షేక్స్పియర్ నాటి నుంచీ షెల్లీ నాటికీ, షెల్లీ నాటి నుంచీ ఎలియట్ నాటికీ ఆంగ్లభాష మారింది. మారడానికి దాని సంసిద్ధతే, అది ప్రపంచభాషగా అభివృద్ధి కావడానికి దోహదమైంది. మార్పు జీవలక్షణం. ఇది మనిషికి ఎంతగా వర్తిస్తుందో, మనిషి భాషకు కూడా అంతగానే వర్తిస్తుంది. భాషకు సంబంధించి దీన్నే 'భాషానిశ్రేణి' అని లోగన్ పియర్సల్ స్మిత్ అనడం. మెట్లు ఎక్కడం ద్వారా మాత్రమే అది మారగలదు:

"మనకు... కనీసం నాల్గురకాల ఆంగ్లం ఉంది. ప్రతి రకానికి ప్రత్యేకమైన పద సముదాయం ఉంది. నేలమీద నుంచీ కవిత్వపు ఎత్తులదాకా ఉన్న ఈ భాషాని శ్రేణిని పరిశీలిస్తే కిందిమెట్టు ప్రజాభాష, పామరభాష అనే నేలకు ఆనించి ఉంటుంది. కారణం మన యాసమాటలూ, వాడుక పదాలూ దాదాపు అన్నీ ప్రజల నుంచీ వచ్చినవే. వాటిలో చాల పదాలు మాండలికాలు. సన్నిహితుల సంభాషణలో అవి సులభంగా ప్రవేశిస్తాయి. క్రీడాకారులు అశ్వశిక్షకుల నుంచీ, యజమానులు శ్రామికుల దగ్గర నుంచీ, పిల్లలు సేవకుల దగ్గరనుంచీ నేర్చుకొంటారు. గుర్రపు శాలల నుంచీ, తోటల నుంచీ అవి డ్రాయింగు రూముల్లోకి ప్రాకుతాయి. విద్యావంతులూ, విద్యావిహీనులూ అరమరికలు లేకుండా కలసి మాట్లాడుకునేప్పుడు ప్రజాభాషలో తాజాగావుంటే కొత్త పదాలు విద్యాధిక వర్గాల పదజాలంలో చేరతాయి. ఈ పదాలు పడికట్టు మాటలనుంచీ. పచ్చిగా, యాప నుంచీ వచ్చినా, మాండలికం నుంచీ వచ్చినా మొదట పామర భాషా పదాలుగా పరిగణింపబడి, శిష్యుల నాజూకు చెవులను అదరగొడతాయి. త్వరలో వాటికి జల్లెడ పట్టడం జరుగుతుంది. యాస మాటలు సాధారణంగా వస్తువులను నిర్వచించడానికి కాక, వాటిని గురించి ఏదైనా హాస్యంగా చెప్పేందుకు సృష్టించబడతాయి. కాబట్టి తప్పనిసరిగా తమ యాప స్వభావాన్ని నిలుపుకుంటాయి. అన్నమైన, ఉపయోగకరమైన నిర్వచనాలుగా ఉండే మాండలిక పదాలు కొద్ది కొద్దిగా తమ సామర సాంగత్యాలను పోగొట్టుకుంటాయి.

భాషానిశ్రేణిలోని కింది మెట్లమీద స్థిరంగా అతుక్కున్న తర్వాత అవి ఒక్కొక్క మెట్టే పైకి వెళతాయి. వాటిని మొదట సంభాషణలో, తర్వాత పరిచితులకు రాసే ఉత్తరాల్లో ఆ తర్వాత సులభవచనంలో వాడతారు. వాటిలో కొన్నైనా అత్యున్నత కవితా పదజాలంలోకి ప్రవేశిస్తాయి".

ఇదంగా ఆంగ్లానికే కాదు, అన్ని భాషలకూ వర్తిస్తుంది. అవి సజీవంగా ఉండాలనీ, అభివృద్ధి చెందాలనీ అనుకుంటే, తెలుగు సజీవంగా ఉండాలనీ, అభివృద్ధి చెందాలనీ గురజాడ గాఢంగా ఆవేశపూరితంగా అభిలషించారు. వాడుక భాష అని ఆయన దేన్ని అన్నారో దాన్ని, ప్రచారం చేయడానికి ఆయన ఉద్యమం నడిపారు. దాన్ని ఉద్యమం అనడం కంటే పవిత్రయుద్ధం అనడం బావుంటుంది. ఈ పవిత్ర యుద్ధంలో ఆయనకు అత్యంత సన్నిహితమైన, అత్యంత స్థిరమైన పొత్తుదారుడు ఆయన చిన్ననాటి నేస్తం గిడుగు వేంకటరామమూర్తి వాళ్ళకు అప్పుడప్పుడు అండదండగా నిలిచిన వాళ్ళు కొద్దిమంది ఉన్నారు.

వాళ్లలో మరీ ప్రసిద్ధుల్లో ఇద్దరు విశాఖపట్టణం ప్రాంతం పాఠశాలల ఇన్స్పెక్టర్ జె.ఎ.యేట్స్, విశాఖపట్నంలోని ఎ.వి.యన్ కళాశాల ప్రిన్సిపల్ పి.టి. శ్రీనివాస అయ్యంగారు. వీళ్ళకు ఎదురుగా మోహరించింది. పండితులతో పండిత పోషకులతో ఛాందస పండితులతో వాళ్ళ శిష్యులతో ఏర్పడిన మొత్తం అక్షౌహిణులు. వాళ్ళ నాయకులు జయంతి రామయ్య, వేదం వెంకటరాయశాస్త్రి, కొక్కండ వెంకటరత్నం, కందుకూరి వీరేశలింగం వంటి కాకలు దీరిన యోధులు; చిత్రంగా సి.ఆర్.రెడ్డి కూడా అది సుదీర్ఘమైన పోరాటం, సడలుబాటులేని పోరాటం, ఎన్నో రెట్లు.. బలంవుండే శత్రువులతో పోరాటం, అయినా, గురజాడ ఎప్పుడూ తొణకలేదు. ఒక్క అంగుళం సైతం వెనకడుగు వేయలేదు. ఆయనకు తెలుసు వివేచనశక్తి తన పక్కన వుందనీ, చారిత్రక శక్తులు తనకు అండగా ఉన్నాయనీ.

'కన్యాశుల్కం' మొదటి కూర్పు ప్రచురణలో గురజాడ వాడుక భాష తరపున పవిత్రయుద్ధం ఆరంభించాడు. 1897లో అచ్చయిన ఆ నాటకానికి రాసిన ముందు మాటల్లో ఆయన అన్నారు కదా:

"గ్రామ్యభాష అని తప్పుడు పేరు పెట్టినదాన్ని వాడడం వల్ల సాహిత్య రచనా గౌరవానికి భంగం వాటిల్లుతుందని అనే వాళ్ళున్నారు. భాషల నాణ్యాన్నీ, ప్రయోజనాన్ని నిర్ణయించడానికి సనాతన భాషా సాంప్రదాయానికి సంబంధించిన వైయాకరణుల చాపల్యాల కంటే మేలైన ప్రమాణాలు భాషాశాస్త్ర పురోగతివల్ల యేర్పడ్డ ఈ రోజుల్లో, ఆ విమర్శను మనం ఖాతరుచేయనక్కరలేదు. గణాల మీదా, యతిప్రాసల మీదా ఆధారపడినా, పద్యరచనా పద్ధతికి అవసరమైనందువల్ల తెలుగు సాహిత్య భాషలో అనేక వ్యాకరణ రూపాలూ, అసౌకర్యమైనంత విస్తార సంఖ్యలో పాతబడిన పదాలూ, ఇష్టారాజ్యంగా కుదించిన పదాలూ, సాగదీసిన పదాలూ ఉన్నాయి. ఎన్నంటే అన్ని సంస్కృత పదాలను ప్రవేశపెట్టే హద్దులేని స్వేచ్ఛను కవులు ఆత్రంగా వినియోగించుకొని, నిఘంటువుల సాయంతో చిత్రవిచిత్రమైన సమాస కల్పనలో ఒళ్ళుమరిచి తెలుగు సాహిత్య మాండలికాన్ని చచ్చినదాన్నే మళ్ళీ చంపారు. భాషా సంస్కరణ సమస్యను వివరించడానికి ఇది సందర్భం కాదు. కానీ ఇంతమాత్రం చెప్పవచ్చు. తెలుగు సాహిత్య మాండలికానికి గొప్ప నాగరికతా ప్రదాతగా చేయాలనుకుంటే దాన్లో నుంచి అనవసరమైన మాటలనూ సంస్కృత శబ్దాలను తొలగించి దాన్ని వ్యవహార మాండలికానికి సన్నిహితం చేసి, అందులోని పదాలతో సుసంపన్నం చేయాలి. తెలుగుదేశంలోని వివిధ ప్రాంతాల్లో మామూలుగా మాట్లాడే తెలుగులో మాండలిక భేదం పెద్దగా లేదు. కాబట్టి సమర్థులైన రచయితలు పూనుకోవాలేగానీ, ఒక కొత్త, ఉమ్మడి సాహిత్య మాండలిక భాషను సులభంగా నెలకొల్పవచ్చు".

దీన్ని గురజాడ యుద్ధ ప్రకటనగా పండితులూ, ఛాందస పండితులూ గ్రహించలేదు. సాంఘిక హాస్య నాటకానికి వాడుకభాష అత్యంత వుచితమైనందువల్లనే ఆయన వీరేశలింగంలా, వెంకటరాయ శాస్త్రిలా ఆ భాషను వాడారని వాళ్లనుకున్నారు. కురువృద్ధులు 'కన్యాశుల్కం' మొదటి కూర్పు మీద దాడిచేసి, దాన్ని చీల్చి చెండాడక పోవడానికి అదే ప్రధాన కారణమని మనం భావించాలి. కానీ, 1909లో ఆ నాటకం రెండోకూర్పు వెలువడేటప్పటికి, రాసేది సాంఘిక నాటకమైనా, కావ్యమైనా, తాత్త్విక గ్రంథమైనా, ఏదైనా వాడుకభాషకు సాహిత్య స్థాయి కల్పించడానికి గురజాడ పోరాడుతున్నాడని స్పష్టమైంది. దీంతో ప్రగతి నిరోధక శక్తులు మేల్కొని శివాలెత్తి కయ్యానికి కత్తులు దూశాయి. నిజానికి అంతకంటే భిన్నంగా జరుగుతుందని మనం ఊహించలేము. ప్రామాణిక తెలుగు అని వాళ్ళు అనే దానిలో వాళ్ల స్వార్థం ఇమిడివుంది. అది జీవితం నుంచి ఎంతగా వేరుపడిందంటే, అందులో కొంతైనా పాండిత్యం సంపాయించడానికి దాన్ని ఏళ్లతరబడి అధ్యయనం చేయాలి. అగ్రవర్గాలు మాత్రమే ఆ పని చేయగలవు. అందువల్ల ప్రజలు నిరక్షరులుగా ఉంచడానికి వాళ్ళ మనస్సులను సమర్థంగా అదుపు చేయడానికి ఆ వర్గాల చేతుల్లో అది మంచి సాధనంగా ఉండగలదు.

అమెరికాకు చెందిన లియొనార్డ్ బ్లూమ్ ఫీల్డ్ అనే భారతీయ అధ్యయనవేత్త గాఢమైన సంస్కృత భాషాభిమాని. పాణిని వ్యాకరణం మీద ఆయనకు ఎంత గౌరవమంటే, “మానవ మేధస్సు సృష్టించిన మహోన్నత నిర్మాణాల్లో అది ఒకటి” అని దాన్ని ఆయన అభివర్ణించారు. “ఈనాటి వరకూ" యే భాషకూ అంత నిర్దుష్టమైన వ్యాకరణం లేదని ఆయన అభిప్రాయం. ఆ మహా నిర్దుష్టమైన, మహా కఠినమైన, క్లిష్టమైన వ్యాకరణం మూలంగా సంస్కృతం “కాలక్రమంలో బ్రాహ్మణ భారతదేశానికంతటికీ అధికార భాషా, సాహిత్య భాషా” అయింది. తన పవిత్ర యుద్ధం ప్రారంభించడంలో గురజాడ లక్ష్యం సంస్కృతం లాగే తెలుగు కూడా అగ్రవర్గాల చేతుల్లో దోపిడీ సాధనం కాకుండా నివారించడం. ఈ విషయంలో తన కుండే భయాన్ని ఆయన 'కన్యాశుల్కం' రెండో కూర్పుకు రాసిన ముందుమాటలో స్పష్టంగా వ్యక్తం చేశారు. ఆయన మాటలే చూడండి:

“నా దృష్టిలో తెలుగు సాహిత్య మాండలికం తెలుగు వాళ్ల మీద సంప్రదాయం విధించిన పెద్ద గుదిబండ. సంకెళ్ళను ప్రేమించే వాళ్ళు దాన్ని ఆరాధించనీయండి. నాకు కావలసింది నా దేశ భాష, సజీవమైన తెలుగుభాష. ప్రాచ్య ప్రపంచపు ఇటాలియన్‌గా పేరు పొందిన భాష. ఈ భాషలో మన కష్టసుఖాలు వెళ్ళబోసుకోవడానికి మనం ఎవళ్లమూ సిగ్గుపడం. కానీ దీనిలో బాగా రాయడానికి మనలో కొందరు సిగ్గుపడతారు. దేశభాషలో రచించే సాహిత్యం రైతులకు దగ్గరగా ఉంటుంది. భారతదేశంలోని ఆంగ్లేయులకు దగ్గరగా ఉంటుంది. దానికుండే అవకాశాలు అపారమైనవి”.

గురజాడ రాసిన సుమారు డజను వ్యాసాల్లో దాదాపు సగం సాహిత్య భాషకూ, వాడుక భాషకూ సంబంధించినవి. గొప్ప పాండిత్యం మీద ఆధారపడిన ఈ వ్యాసాల్లో, చమత్కారమూ, హాస్యమూ, ఎగతాళీ ఉన్నాయి. శత్రువుల మీద బలంగా దెబ్బ తీసినప్పటికీ వీటిలో కోపమూ, ద్వేషమూ లేవు. తిట్లతో వెకిలిగా రాసిన ఆకాశ రామన్నకు ఆయన ఎంత హాస్యంగా నవ్వు పుట్టించేటట్లు జవాబిచ్చినాడంటే, ఈనాడు కూడా అది మనకు కడుపు చెక్కలయ్యేట్లు నవ్వు పుట్టిస్తుంది. మొత్తం వ్యాసాల్లో కల్లా ఇది ఉత్తమమైందనీ, మార్క్ ట్వెయిన్ కూడా గర్వించదగినంత శ్రేష్టమైందనీ చెప్పవచ్చు.

మద్రాసు విశ్వవిద్యాలయంలో ఫెలోగా ఉండటమే గాక ఇతర విధాల కూడా తన జీవితం చివరి దశాబ్దంలో గురజాడకు ఆ విశ్వవిద్యాలయంలో సన్నిహిత సంబంధం ఏర్పడింది. దీనిద్వారా ఆయనకు శత్రు శిబిరంలోనే పోరాటం చేయడానికి వీలు కలిగింది. తన సహయోధుడైన గిడుగు వేంకటరామమూర్తికి 1913లో రావు సాహెబ్ బిరుదు లభించినప్పుడు గురజాడ అమితానందం పొంది సంవత్సరారంభ దినాన తన డైరీలో ఇలా రాసుకున్నారు: 'రామమూర్తి రావు సాహెబ్

కావడం చాల సంతోషకరం. ఆనరబుల్ (మోచర్ల) రామచంద్రరావు కాస్మో పాలిటన్ క్లబ్బు నుంచి ఫోన్ చేసి, ఇది మన ఉద్యమానికి విజయం అన్నారు".

ఆ ఇద్దరు యోధులకు రెండు పర్యాయాలు విజయం లభించినట్లు కనిపించింది. యస్.యస్.యల్.సి. పరీక్ష రెండో భాగంలో ఇంగ్లీషులో ఇచ్చే ఖండికను అనువాదం చేసేటప్పుడు విద్యార్థులు పాత తెలుగును కానీ కొత్త తెలుగును కానీ, దేన్నయినా వాడవచ్చునని 1912లో యమ్.యన్.యల్... బోర్డు సెక్రటరీ నర్క్యులర్ జారీ చేశారు. ఇది పాక్షిక విజయం మాత్రమే. ఇదంగా ప్రతివశక్తుల దుర్గంలో ఇది మంచి గండి కొట్టింది. తర్వాత ముందడుగును జి.వి. సీతాపతి జా వర్ణించారు.

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్ నక్షన్ కోరనందువల్ల ఎఫ్. ఎ బి.ఎ. విద్యార్థుల వ్యాన రచనలో, అనువాదంలో వాడుక భాష వావడానికి అనుమతి ఇవ్వడం మంచిదో కాడో మద్రాసు విశ్వవిద్యాలయం మశీలించ వలసి వుంది.
ఈ వివాదం దృష్ట్యా యే విధానం ఇవరించంచవలసిందే సూచించడానికి విశ్వ విద్యాలయం తెలుగు అనువాదు వానరచన కమిటీని నియమించింది. కమిటీలో పాత తెలుగుకు ప్రాతినిధ్యం వహించడానికి చలుగురు సభ్యులు, కొత్త తెలుగుకు ప్రాతినిధ్యం వహించడానికి నలుగురు సభ్యులు వున్నారు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజికి చెందిన ప్రొ॥ యం. రంగారని అధ్యక్షులుగా నియమించారు. అధ్యక్షుని నిరాయక ఓటు సహాయంతో గ్రంథాలలో వవసాగించే రూపాలను, మాట్లాడేటప్పుడు వుపయోగించే రూపాలనూ రెంటిని ఇంటర్మీడియెట్ వ్యాసరచనలో ప్రమాణంగా గుర్తించవచ్చు అని కొత్త తెలుగుకు అనుకూలంగా తీర్మానం చేయడమయింది."

యుక్తితో కూడిన కుతంత్రాన్ని వినియోగించుకొని తద్వారా రాయలసీమ నుంచీ కో ఆప్ట్ చేసుకోండిన పద్యల సహాయంతో ప్రతివశక్తులపై కమిటీ సిఫారసును తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. పరిస్థితిని సానుకూలం చేసుకోడానికి గురజాడ ధైర్యంగా ప్రయత్నం చేస్తూ వాడూ నటిచుతో కూడిన బృహత్తుమైన డిసెంట్ వత్రం రాశారు. కానీ అది వుపయోగ పడలేదు. కొత్త తెలుగు అనేవాన్ని అంగీకరించడం యిప్పుడు సాధ్యం కాదు' అని మద్రాసు విశ్వవిద్యాలయం ప్రకటించవలసి వచ్చింది.

ఆ ప్రకటనలో యిప్పుడు అనేది కొన్ని సందర్భాల్లో చివరి యాభైలచాకా మరికొన్ని సందర్భాల్లో కొండల దాకా కొనసాగిందంటే దాని కత్యంత ముఖ్యమైన కారణం ఆంధ్ర దేశంలోని విశ్వ విద్యాలకు విద్యమీద పి.ఆర్. రెడ్డికి వుండే ప్రబలమైన ప్రభావమే. ఆయన సాంఘిక ఇక రంగాల్లో తీవ్రవాది. రాజకీయ రంగంలో వుదారవాది. సాహిత్య రంగంలో ముందు చూస్తున్న వ్యక్తి కాని భాష విషయం వచ్చేటప్పటికి కరడు గట్టిన యథాస్థితి వాది. వాడుక భాషను మెడల వ్యతిరేకించిన వీరేశలింగం తన మరణానికి సంవత్సరం ముందు ఆ భాషకు అనుకూలంగా మారారు. కానీ, ఎ.ఆర్. రెడ్డి యే దశలోనూ మారలేదు. ఆయన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో వున్నత విద్య అభ్యసించి పార్టరీ ట్రైపోగ్లో ప్రథమ శ్రేణి పొందారనే విషయం పరిగణనలోకి తీసుకుంటే, వాడుక భాషపట్ల ఆయన యావజ్జీవిత వ్యతిరేకత దృష్టి దోషంవల్ల యేర్పడింది అని అనుకోవాలి. యేదో ఒక విషయంపట్ల దృష్టి దోషంలేని దెవరికి? యమై రామయ్యులు రెడ్లూ వ్యతిరేకించి నప్పటికీ వాడుక భాష విజయం పొంది యిద్దరు మహా దీర్ఘకరుల జీవిత కృషికి సాఫల్యం చేకూర్చింది. తెలుగు భాషా గగనతలంలో వాళ్లు రెండు ధ్రువ నక్షత్రాల్లా శాశ్వతంగా ప్రకాశిస్తారు.

## బంగారు లోకాలు

## "యెంతో పయనించా బంగారు లోకాల్లో" - కీట్స్

గురజాడ డైరీల్లో, నోటుపుస్తకాల్లో యెంత విస్తారమైన ప్రపంచం, యెంత వైవిధ్య పూరితమైన లోకం మనకు కన్పిస్తుందని? అవి అసంపూర్ణంగా వున్నా, వాటిని సరిగ్గా భద్రపరచక పోయిన వాటిలో మనకు రక రకాల మనుషులు రెండురవుతారు, రక రకాల భావాలు కన్పిస్తాయి. రకరకాల దృశ్యాలు, ధ్వనులూ, వాసనలు ప్రత్యక్షమవుతాయి; స్వప్నాలూ అతీంద్రయ దృశ్యాలు కన్పిస్తాయి. రాకుమారులు, రాకుమార్తెలు తగుల్తారు. వాళ్ళతోపాటు నిరుపేదలు సయితం, పడుపుకత్తెలూ, వాళ్ల పోషకులు మన కంటబడతారు - వాళ్ల చుట్టు తిరిగే తార్పుడు కత్తెలతో సహా. వంటవాడు, పనిమనిషి, ఆంతరంగిక పరిచారకుడు, మావటీలు, కసువు జిమ్మేవాడు, యెవరూ తప్పిపోరు, వంగివంగి సలాములు జేసే రాజా తుదు, ముఖస్తుతి పరాయణుడైన కవి, భీషణ పండితుడు, లంచగొండి వుద్యో, పొగరు బుర్రా సాహెబ్, ఆడంబర పరుడైన సైన్యాధికారి, పటాటోపం గవర్నరు - సర్వులూ మన కళ్ళముందు కవాతు చేస్తూ దర్శనమిస్తారు.

డైరీలుగానీ, నోటు పుస్కరాలుగానీ సంపూర్తిగా లేవు, డైరీలు 1889 నుంచీ మాత్రమే లభ్యమయ్యాయి. అవి కూడా 1907-1913 మధ్యలేవు. నోటు పుస్తకాల్లో తేదీలు మృగ్యం, వాటిలో కొన్ని నష్టమయ్యాయేమో చెప్పలేము. అసంఖ్యాకమైన ఆయన వుత్తర ప్రత్యుత్తరాల్లో మనకు మిగిలింది అణుమాత్రం, ఆయన సొంతపుస్తకాలు చెల్లా చెదురయ్యాయి. అందువల్ల పుస్తకాల మార్జిన్లలో ఆయన రాసుకున్న విస్తారమైన వ్యాఖ్యలు మనకు లభ్యంకావు. అంతకంటే విదారకరం యింతవరకు భద్రపరచబడ్డ సమాచారానికైనా సరిగ్గా ప్రతులు రాయడం, పరిష్కరించడం, ప్రచురించడం జరుగలేదు. అంతా ఆంగ్లంలోనే, యెక్కడో ఒక మాట లేదా ఒపబంధం లేదా ఒక వాక్యం తెలుగులో ఉనం తొణికిసలాడే గురజాడ మూర్తిని అచ్చంగా, సమగ్రంగా దర్శించాలంటే, ఆయనెంతటివాడో గ్రహించాలంటే, ప్రచురితమైన రచనలకన్నా ఆయన డైరీలు, నోటు పుస్తకాలు, లేఖలూ యెక్కువ వుపయోగం, ఆయన చురుకుగా పృందారక రచనలు చేసిన కాలం చాలా తక్కువ - 1907 - 1915 మధ్యకాలం మాత్రమే. ఆ తొమిధేళ్ళ స్వల్ప కాలంలో ఆయన మనకు యిచ్చిపోయింది తన మనసులో పథకం చేసుకున్న దాంట్లో అల్పభాగం మాత్రమే. వివిధ బ్రహ్మాండ పథకాలనేకం వేసుకున్నట్లు ఆయన చైరీలు, నోటు పుస్తకాలూ, వుత్తరాలూ తిరుగులేని సాక్ష్యం చెబుతున్నాయి.

గురజాడ కున్నంత గ్రంథ పరిచయం ఆనాటి తెలుగు రచయితల్లో యెవరికీ లేదు. భారతీయ సాహిత్యంలో గానీ, ప్రపంచ సాహిత్యంలో గానీ ముఖ్యమైనదేదీ ఆయన దృష్టిని తప్పించుకోలేదు. రవీంద్రనాథ్ టాగూరు (1861-1941)ను అయన కలుసుకున్నారు, చర్చలు జరిపారు; వుత్తరప్రత్యుత్తరాలు నడిపారు. జాతీయ జీవనంలోని ప్రముఖులతో గురజాడ సంపర్కం పెట్టుకున్నారు. హరిప్రసాద్ శాస్త్రితో, అశుతోష్ ముఖర్జీతో, గురుదాస్ బెనర్జీతో, బెంగాల్ లోని యితర ప్రముఖ రచయితలతో, ఆలోచన శీలురతో ఆయనకు మైత్రీ సంబంధాలున్నాయి. ఆంధ్ర కర్నాటక తమిళనాడులోని భాషా శాస్త్రజ్ఞులతో, శాసన పరిశోధకులతో, పురాతత్వ శాస్త్రవేత్తలతో, విద్యావేత్తలతో, నాటక రచయితలతో ఆయనకున్న సంబంధాలు యెంతో సన్నిహితమైనవి. ఆయనకు ఆసక్తివున్న విషయాలు మరీ విస్తారం. వ్యవసాయం మొదలుకొని జ్యోతిశ్శాస్త్రం దాకా, అభినయం మొదలుకొని చరిత్ర దాకా, ఆయన మనోరంగం ప్రవేశించని విషయం లేదు. జీవితాన్ని అర్థం చేసుకోడానికే గాక, జీవితాన్ని వ్యాఖ్యానించడానికీ, దానికి అందాలు చేకూర్చడానికీ, ఒక కొత్త ప్రమాణాన్ని సమకూర్చడానికీ, ఒక్క మాటలో చెప్పాలంటే, జీవితాన్ని మరింత సుఖప్రదమూ, సృజనాత్మకమూ, అర్థవంతమూ చేయడానికి తృప్తి యెరగని ఆయన తృష్ణ యెలాంటిదంటే చిట్టి పొట్టి రచనలూ, గల్పికలూ, కథానికలూ, నవలలూ, నవలికలూ, నాటకాలూ, నాటికలూ, జీవిత చరిత్రలూ, దేశ చరిత్రలూ, విమర్శా రాయడానికి ఆయన పథకాలు

వేసుకొన్నారు. ఈ విస్తారమైన రచనలకు కావలసిన వివరాలన్నీ ఆయన తన డైరీల్లో, నోటు పుస్తకాల్లో గుర్తు పెట్టుకున్నారు. కాస్తా ఆరోగ్యమూ, మరికాస్తా ఆయుస్సూ లభించి వుంటే, ఆయన మనకు మరింత విస్తారమైన, మరింత సంపన్నమైన, మరింత దేదీప్యమానమైన ఆస్తి ఇచ్చి వెళ్ళేవారు.

కవిగా, నాటక రచయితగా, కథానికా రచయితగా, వ్యాస రచయితగా తన స్థానం అమర రచయితల మధ్యవుందని గురజాడ పుష్కలంగా రుజువు చేసుకున్నారు. ఆయన నవలలు రాసివుంటే, ఆ రంగంలో సయితం అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పి వుండేవారని డైరీల్లో, నోటు పుస్తకాల్లో వున్న కొన్ని ఆరోపాలబట్టి చెప్పవచ్చు. 1895 మే 2వ తేదీనాటి ఆయన డైరీలో చాలా అర్థవంతమైన వ్యాఖ్య ఒకటుంది: "రెయ్ నాల్స్ నవలలు సిగ్గుచేటు" అని ఈ వ్యాఖ్య పూర్తి ప్రాముఖ్యం తెలుసుకోవాలంటే మరాఠీ, హిందీలాంటి కొన్ని భారతీయ భాషల్లోని తొలి నవలా కారులంతా క్షుద్రవేశ పూరితమైన కథలు రాసే చౌకబారు రచయితగా, తన దేశంలో దాదాపు బొత్తిగా నాంనిశానీ లేని వాడూ అయిన జి.డబ్ల్యు. యం. రెయ్ నాల్డ్స్ నుంచి వుత్తేజం పొందారనే విషయం చెప్పవలసి వుంటుందేమో! సర్వాల్టర్ స్కాట్ (1771-1982) ను ఆదర్శంగా తీసుకోడానికి కూడా గురజాడకు తీవ్రమైన సందేహాలున్నాయి.

బంకిం చంద్ర చటర్జీ రాసిన కొన్ని చారిత్రక నవలల మీద గురజాడ విమర్శనాత్మకమైన అంచనాలను బట్టి యీమాట చెప్పవచ్చు. ఇది నిరాధారమైన వూహకాదు. ఆయన రాయ తల పెట్టిన ఒక నవలకోసం ఒక క్రమం లేకుండా ఆంగ్లంలో రాసుకున్న నోట్సు ఆయన వదలిపోయిన అప్రచురిత పత్రాల్లో వుంది. ఆ నవలలలో భోగంపడుచు కథానాయిక. ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకున్న ఆదర్శవాది కథానాయకుడు. ఆ నవలలోని అనేక పాత్రల్లో ఒక మత గురువూ, ఒక ప్రొఫెసరూ వున్నారు. నవలకు నిండుతనం యివ్వడానికి గిరీశం సయితం వున్నాడు. ఈ అందరితో ఆ నవలకు ఆధునిక మహాకావ్యం కాగల లక్షణాలన్నీ వున్నాయి.

చరిత్రకారుడుగా కూడా గురజాడ తప్పకుండా పేరు తెచ్చుకొని వుండేవాడు. కళింగ చరిత్రకోసం ఆయన చేసిన పరిశోధన విస్తృతమైందీ, అతిశ్రద్ధాయుతమైంది. భారతదేశంలో లభించే సమాచారమంతా సేకరించిన తర్వాత ఆయన పారీస్ పబ్లిక్ లైబ్రరీలో అదనపు సమాచారమేమైనా దొరకుతుందేమోనని ఫ్రాన్సుకు వుత్తరం రాశాడు. పారీస్ విశ్వ విద్యాలయంలోని ఒక . ప్రొఫెసరుకు కూడా రాశారు. నిజానికి 'కళింగదేశ చరిత్రను' ప్రచురించ బోతున్నట్లు విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ప్రకటించింది. కానీ, గురజాడ ఖచ్చితంగా గ్రాంథిక భాషలో రాయాలని ఆ సంస్థ ప్రధాన సంపాదకుడు పట్టుబట్టాడు. అలాంటి వుత్తరువులకు లోబడడం యిష్టంలేక గురజాడ తన గ్రంథ రచన మానుకున్నారు. దాదాపు ఆ కాలంలో ముని సుబ్రహ్మణ్యానికి రాసిన జాబులో ఆయన వాడుక భాష మీద తనకున్న విశ్వాసాన్ని పునరుద్ఘాటించారు:

“నా వుద్యమం ప్రజల వుద్యమం. సంస్కార వంతుల అభిప్రాయం నాకు అండగావుంది. విషయం అర్థం చేసుకోలేని వాళ్ళు నాకు వ్యతిరేకంగా నిలబడితే నేను లెక్క చెయ్యను. వాళ్ళు మారినా, భాషకేమీ మేలు జరుగదు. వాళ్లు యెంతో కృత్రిమమైన పాత గ్రాంథిక భాషకు యే ఆశాలేకుండా అంటి పెట్టుకొని వున్నారు. నీలాంటి యువకులు శిష్ట వ్యవహారిక భాషలో మంచి రచనా సంప్రదాయం సృష్టించాలని నా కోరిక.”

గురజాడ ఆసక్తి ప్రజల భాషపట్ల మాత్రమే కాదు. తన తరం, రాబోయే తరాల జీవితానికీ, యోచనకూ సంబంధించిన ప్రతి మౌళిక సమస్యపట్ల ఆయనకు ఆసక్తి వుండేది. 1901 ఆగష్టు 9 నాడు తన డైరీలో ఆయన రాసుకున్న సుదీర్ఘ ఆరోపంలో కొంతభాగం యిది:

"తూర్పు యూరప్ లోని ఒక జాతిని గురించి ఫ్రీమన్ " అన్నట్లు మన వాళ్ళను గురించి నేనిలా అనవచ్చు. సామరస్యం సాధ్యం కాని విభేదాలున్న రెండు నాగరికతలను నేటి తరంవాళ్లు ప్రత్యక్షంగా చూస్తున్నారు. అందులో ఒకటి పురాతనమైందీ, రాజీపడనిదీ: కానీ తన స్వీయ సంకుచితత్త్వం మూలంగా, తన ప్రతినిధుల హీన సామాజిక స్థానం కారణంగా ఆ ప్రతినిధులు పరాయి విశ్వాసాల, పరాయి పద్ధతుల వెల్లువను చురుకుగా యెదిరించడానికి అశక్తులు. మరొక నాగరికత ప్రగతి మూలంగా, స్వేచ్ఛ మూలంగా బలీయమైంది, వివేచన శక్తిమీద ఆధారపడినందువల్ల దుర్వారమైంది.

"పాశ్చాత్య నాగరికత విశ్వాసాలను ధ్వంసం చేసేది. స్వేచ్ఛను వుపకారంగా చేసే సామాజిక ప్రగతీ, సర్దుబాటూ లేకుండా స్వేచ్ఛను నేర్పే ఆ నాగరికత అసంగతాలకూ, తప్పులకూ, సాకులకూ తప్పకుండా దారితీస్తుంది. ఈ ధోరణితో సమర్థంగా పోరాడడం ఈనాటి విద్యా సమస్యల్లో కెల్లా ప్రముఖం-"గురజాడ డైరీల్లో, నోటు పుస్తకాల్లో లేదా ఆయన లేఖల్లో యిలాంటి భాగం ఇదొక్కటే కాదు. సమకాలిక ప్రాముఖ్యముండి, ఇంతకంటే నిశితమైనవీ, గాఢ పరిశీలనాత్మకమైనవీ డజన్ల కొద్దీ చాలా కాలం వున్నాయి.

చిన్న చిన్న బంగారుముద్దలు సయితం సమృద్ధిగా వున్నాయి: "మద్యం మనిషిలో స్నేహభావమూ, ఔదార్యమూ కల్గిస్తుంది." అనేది ఒకటి. "ప్రకృతి సిద్ధమైన వస్తువులకూ, స్మృతులకూ, వ్యక్తులకు అజ్ఞాతాంశం ఆకర్షణనూ, ఆసక్తినీ, సమ్మోహక శక్తిని ప్రసాదిస్తుంది." అనేది మరొకటి. "ఒక మనిషిని ఒకప్పుడు పైకెత్తి, మరొకప్పుడు నిర్లక్ష్యం చేయడం అనే పొరపాటు చేయకు" అని మూడోది హెచ్చరిస్తుంది. రచయితలకు ప్రత్యేకాసక్తి వుండేది నాల్గోది. ఇలా, భారతదేశంలోని మామూలు పండితునికి అనేక శాస్త్రాల్లో వరకు అనుకరించడానికీ, అనువదించడానికి మాత్రమే అవకాశం వుంది. తర్వాతది యిలా చెబుతుంది. "దుష్టవాంఛలనుంచీ విముక్తి పొందితే అద్భుతశక్తి లభిస్తుంది." ఆరోది యీ డైరీలోని పెళుసుబారిన కాగితాల్లోంచీ మిలమిల లాడుతుంది. మరొకటి ఒక వ్యక్తిగతమైన రేఖలోని ఆత్మీయతల మధ్యనుంచీ తళతళ మంటూ మన దృష్టిని ఆకర్షిస్తుంది. ఇవన్నీ చదువుతూపోతే "బంగారు లోకాలు" ద్వారా పయనిస్తున్న భావం మనకు కలుగుతుంది.

## కాంతి రేఖ

### "అవనీతలం పొడవునా కాంతిరేఖ" - టెన్నిసన్

భారతదేశంలో బాగా దుర్వినియోగమయ్యే మాటల్లో ఒకటి "పునరుజ్జీవన యుగ మానవుడు" ఎపునరుజ్జీవనం" మాటకున్న సరైన అర్థంలో, పూర్తి అర్థంలో మనమింకా పునరుజ్జీవనాన్ని సాధింపవలసి వుంది. యూరప్లో పునరుజ్జీవనానికి చెందిన మసక వెలుగులు పద్నాలుగో శతాబ్ది మధ్యలో ప్రారంభమై, పదారో శతాబ్ది అంతానికల్లా దేదీప్యమానంగా ప్రకాశించాయి. మనదేశంలో కూడా పంతొమ్మిదో శతాబ్ది వుత్తరార్థంలో పునరుజ్జీవనానికి చెందిన మసక వెలుగులు ప్రారంభమైన మాట నిజమే. కానీ, అవి యింకా మసక వెలుగులుగానే వున్నాయి. కాలం గడిచేకొద్దీ వాటి ప్రకాశం పెరగడానికి బదులు తరగిపోతోంది. ఈ వాస్తవం యెంత చేదుగా వున్నా, దీన్ని అంగీకరించక పోవడమంటే, పునరుజ్జీవన మనే మాట మనకు అర్థం కాలేదని ఒప్పుకోవడమే.

పునరుజ్జీవనం అంటే గతంతో పూర్తిగా తెగదెంపులు చేసుకోవడం యిది మొట్టమొదటిది. తర్వాతిది కొత్త చైతన్యం, కొత్త నైతిక నియమావళి • పునరుజ్జీవనంలో యిమిడి వున్నాయి. జీవితానికి, ఆలోచనకూ, ఆచరణకూ, కీలకమైన స్థానంలో భగవంతుడు పోయి మనిషి ప్రవేశించడం కూడా పునరుజ్జీవనంలో ఇమిడివుంది. ఇక్కడొక చిల్లర సంస్కరణగా, అక్కడొక బుల్లి మార్పు చేయడం కాక, సమాజాన్నంతటినీ తలకిందులు చేయడం కూడా అందులో ఇమిడి వుంది. ఒక విధంగా సాధించిన దానికంటే, సాధించదలచుకున్న దానికి యెక్కువ విలువ వుంటుంది. యూరపన్ను గురించి చెబుతూ,
విల్ డూ రాంట్ ఇలా అంటాడు:

“పునరుజ్జీవన మానవుడు సాధించింది యేమైనా, అత నెప్పుడూ చలనశీలిగా, అసంతృప్తుడుగా, అవరోధాల పట్ల చిరచిర లాడుతూ దివ్యమానవుడుగా ఉండాలని తహతహ పడుతూవున్నాడు - ఆలోచనలో సాహసమూ, క్రియలో అసందిగ్ధతా, పలుకులో పటుత్వమూ, కళల్లో నైపుణ్యమూ, సాహిత్యంలో, తత్వశాస్త్రంలో అభినివేశమూ ఉండి, యీ మానవుడు అటు అంతఃపుర కాంతలతోనైనా, ఇటు సమరాంగణంలో సైనికులతోనైనా కలసి మెలసి పోగలిగేవాడు." మన పునరుజ్జీవనం మందకొడిగా మొదలైనా ఇలాంటి వాళు ఎంత మంది జన్మించారు? యెక్కడో ఒకచోట ఒకరు యెక్కడో మరోచోట మరొకరు అంతే. అలా పుట్టిన ప్రతి మనిషికీ ప్రతి కక్షిగా ప్రతి చోటా లక్షమంది పునరుద్ధరణ వాదులూ, అంధకార ప్రియులూ ఉద్భవిస్తున్నారు. గురజాడ జీవితమూ, రచనలూ విచక్షణాయుతంగా పరిశీలిస్తే, ఒకటి విశదమవుతుంది: ఆయన వ్యంగ్యాస్త్రాలు కుహనా పునరుజ్జీవన వ్యక్తులమీద దాడి చేస్తే అచ్చమైన పునరుజ్జీవనం వైపు మనం అచంచలంగా, సత్వరంగా పురోగమించాలని ఆయన గాఢంగా వాంఛించారు. సుబ్రహ్మణ్యానికి ఆయన ఇలా రాశారు:
“నిజమే పాజటివిస్టు తత్వవేత్త కామే మానవతావాదాన్ని ఒక మతంగా విస్తృత పరిచాడు. నేను దాన్ని సరిగ్గా ఆయన చూసినట్లే చూడను. మతాలు గందరగోళమైనవి. ఆచరణ యోగ్యంకానివి. మానవ ప్రేమ సరళమైన నియమం. అది మనిషికి అమితానందం కల్గిస్తుంది. 'ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును - ' స్వర్గంలో, ఈ లోకంలో," ఇది భగవంతుని నిరాకరించడం కాదు. నిజమే కానీ ఇది నిశ్చయంగా మతాలను నిరాకరించడం, మానవాకారానికి చెందిన భగవంతున్ని సయితం నిరాకరించడం. ఇంకా ముందుకు కూడా వెళ్ళి, గురజాడ భారతీయ తత్త్వశాస్త్రంలో ప్రముఖశాఖ అయిన బాదారాయణుడు మొదలుకొని అద్వైత వేదాంతాన్ని నిశ్చయంగా తిరస్కరించారు. శంకరాచార్యుడు మొదలుకొని సర్వేపల్లి రాధాకృష్ణ వరకు, రెండు వేల యేళ్లకు పైగా, అది మానవుడు రూపొందించిన అత్యంత వున్నతమూ, సత్యమూ, స్వచ్ఛమూ అయిన తత్వశాస్త్రమని దాని అనుచరులు వాదిస్తున్నారు. గురజాడ ఈ వాదాన్ని నిరాకరిస్తూ, తన నోటు పుస్తకాల్లో, సుదీర్ఘంగా రాసుకున్నారు. అందులో నుంచీ కొన్ని భాగాలు ఇవి:

“అద్వైతం యెండమావి మాత్రమే: (గురజాడ రచనలో ఈ వాక్యం తెలుగులోనే వుంది. తక్కిందంతా ఆంగ్లం). ఈ లోకంలోని మనుషులకు లోకమహాప్రవాహం యెవరి జీవిత గమనంవల్ల ఉప్పొంగుతుందో ఆ మనుషులకు - అది అందరానిది. ఈ ప్రవాహం మహా కల్లోలంగా ఉన్నందువల్ల దీని ఉపరితలం మీద పారమార్థిక సత్యం ప్రతిబింబింప జాలదు. మనం సాధ్యమైనంత స్వచ్ఛంగా ఉండి ప్రతిబింబిస్తే పారమార్థిక సత్యం యొక్క ఛాయా మాత్రం గుర్తు ఎక్కడో ఒక నక్షత్రం, రంగులీనే ఒక మేఘం లభింపవచ్చు. అంతుకుమించి మనం ఆశించలేం. ప్రపంచం యొక్క అచ్చమైన తత్వం స్వార్థత్యాగంలో పరోపకారంలో ఉంది. స్వార్థ త్యాగానికి దారి తీయగల ప్రేరణ ప్రేమను మించింది ఉందా? మానవాత్మ పూసిన అత్యంత ఉజ్వలమైన పుష్పం ప్రేమ. వెర్రి ప్రేమకాదు, వ్యామోహం కాదు, అందమైన ఆత్మల సౌందర్యాన్ని, స్ఫటిక స్వచ్ఛతనూ మెచ్చుకోవడం; పరోపకారమూ, దయా, శాంతీ, నిశ్చలత్వమూ, మనోహరమైన రూపురేఖల ద్వారా తొణికిసలాడే సౌందర్యం. మంచితనమే దైవం; మంచితనాన్ని ప్రేమించడం దైవ ప్రేమను వ్యక్తం చేసే సూటిదారి, ఆత్మచెడును విసర్జించి సచ్ఛీలాన్ని అలవరచుకొని, అభివృద్ధి చేసుకొనే కొద్ది దైవత్వాన్ని సమీపిస్తుంది; దైవాంశం అవుతుంది. ఆంగ్లకవి ఇలా అన్నాడు "అతని ప్రార్థనే శ్రేష్ఠమైంది... వగైరా". ఆచరణ దీని గీటురాయి. ఆచరణీయమైన ఈ తత్వశాస్త్రం లేకుంటే మనుషులు తమకు తెలీని అర్థ ప్రాముఖ్యాలున్న సిద్ధాంతాల్లో పడి కొట్టుకు

పోతారు. వేదాంతం పేరుతో మన దేశంలో ఎంత, వంచన ఎంత మూరత్వం సాగుతుందో! అందువల్లే 'వేదాంతి వస్తున్నాడు, చెంబూ ముంతా జాగ్రత్త రోయ్' అనేది సామెతగా రూపొందింది"
స్త్రీ పురుష సంబంధాల గురించీ, ఆ నీతుల గురించీ గురజాడకుండే భావాలు అచ్చమైన మతం గురించీ, అచ్చమైన తత్త్వశాస్త్రం గురించీ, ఆయనకున్న అవగాహనకన్నా కూడా తీవ్రమైనవి. స్త్రీ పురుషులను వేరు వేరు విధంగా విమర్శించే ద్వంద్వ ప్రమాణాలను ఆయన తప్పుపట్టాడు. సుబ్రహ్మణ్యానికి రాసిన ఒక ఉత్తరంలో ఇలా అన్నారు:

"నీ చుట్టూవున్న వైవాహిత జీవితాన్ని అధ్యయనం చెయ్యి. బీదవాళ్ళయిన భర్తల గురించీ, కురూపి భర్తల గురించీ, దుష్టభర్తల గురించీ, దుర్భర భర్తల గురించి భార్యలు ఏమనుకుంటారో ఊహించడానికి ప్రయత్నించు. దుష్టభార్యలు, కురూపి భార్యలూ మొదలైన వాళ్ళ సంగతేమిటని నీవడగవచ్చు. కానీ, వాళ్లు బానిసలు. మననుంచి వాళ్ళు ఆశించే పవిత్రతకన్నా ఎక్కువ పవిత్రతను మనం వాళ్ల నుంచీ ఆశిస్తున్నాం. భేదానికి మూలం అదే. పవిత్రులు కాని పురుషులందర్నీ నీవు తీవ్రంగా . అసహ్యించుకుంటావనుకో. నీ మిత్రుల్లో నీ కెంతమంది మిగులుతారో చెప్పు - " స్త్రీ పురుష సంబంధాల్లో తమ నియమ రాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నట్లు అపార్థం కలగకుండా గురజాడ ఇంకా ఇలా రాశారు:"పవిత్రత అనే భావాన్ని నేను మెచ్చుకుంటాను. కానీ ఖచ్చితంగా ఈ భావ స్వభావ మేమిటి? ఇది ఎక్కడ పుట్టింది? ఎలా అమల్లో ఉంది?
పవిత్రత అనేదాని మూలమేమిటి? స్త్రీ పురుష సంబంధాల గురించి ఇప్పుడున్న సామాజిక నియమాలు మనం అందుకోనంత ఎత్తు నుంచాయి. నియమోల్లంఘనలు అధిక సంఖ్యలో ఉన్నాయి.

మనం మనకే సత్యాన్ని తెలియజెప్పుకోవలసిన సమయం ఆసన్నమైంది. అపవిత్రులైన వివాహిత స్త్రీ పురుషులను పడుపు కత్తెల్లాగే అసహ్యించు కోవాలని నీవంటావు. నీవు క్షుణ్ణంగా ఆలోచించి, భేదం గుర్తించడానికి ప్రయత్నించ లేవా? విమర్శ శీలమైన నీ బుద్ధి తప్పకుండా భేదాలను వెంటనే గుర్తించగలదు. ఒక విషయం పడుపుకత్తె నిష్కపటి. తన వృత్తి ధర్మంలో నిష్కపటి. ఆ ఒక్క అంశాన్ని నేను విడదీసి చూస్తున్నాను". భారతదేశంలో పుట్టిన కొద్దిమంది అచ్చమైన పునరుజ్జీవన వ్యక్తుల్లో ఒకరుగా గురజాడను గణించవచ్చునని పైమాటలు స్పష్టం చేస్తాయి. ఈ రకం వ్యక్తి ఇతరులకన్నా భిన్నంగా ఉన్నతంగా ఉంటాడు. "ఇలాంటి వ్యక్తికున్న గుణాలు (14, 15, 16 శతాబ్దులనాటి యూరప్ లో) రెండు కేంద్ర బిందువులను ఆశ్రయించుకొని ఉన్నాయి. బౌద్ధిక సాహసమూ, నైతిక సాహసమూ" అని విల్ దూరాంట్ అంటూ ఇలా వివరిస్తాడు. "నిశితమూ, జాగరూకమూ, సర్వతోముఖ ప్రజ్ఞాన్వితమూ అయిన మనస్సు ప్రతి భావానికి, ప్రతి భావానికీ చలించేది, సౌందర్యానికి స్పందించేదీ, కీర్తి కాంక్ష ఉండేదీ అయిన మనస్సు ఆతత్వ పర్యవసానాలను లెక్కచేయని వ్యక్తి వాదమున్న మనస్సు; తన నిద్రాణ శక్తులన్నిటినీ అభివృద్ధి చేసుకోడానికి పూనుకొన్న మనస్సు, సగర్వమైన తత్వం, క్రైస్తవ నమ్రతను అసహ్యించుకొనేది, బలహీనతనూ, పిరికితనాన్నీ యేవగించుకునేది; ఆనవాయితీలనూ, నీతులను, నిషేధాలనూ, పీఠాధిపతులనూ, ఒకోసారి భగవంతుల్ని సైతం నిరాకరించేది. 'క్రైస్తవ నమ్రత" అనే మాటలకు బదులు "హిందూ వేదాంతం" అంటే ఇక ఏ మార్పు లేకుండా ఈ భాగం గురజాడకు సంపూర్ణంగా, సముచితంగా వర్తిస్తుంది. ఆయన భారతదేశానికి పరిమితమై ఆలోచించ లేదు. ఆంధ్ర దేశానికి అసలే పరిమితం కాలేదు; మొత్తం ప్రపంచాన్ని గురించి ఆలోచించారు. ఆయన కోరిన "పాతకొత్తల మేలు కలయిక" దీనిలోనుంచీ కొంతా, దానిలో నుంచీ కొంతా తీసుకొని రూపొందించిన కొత్త మిశ్రమం కాదు; అది సజీవ నూత్నసృష్టి. క్రమ పద్ధతి వున్న సమగ్ర తత్వశాస్త్రాన్ని ఆయన రూపొందించలేదు. కానీ, భగవంతునికి బదులు మానవుడు కీలకాంశంగా ఉండేదీ, పరలోకం పట్లగాక, ఇహలోకం పట్ల ఆసక్తి ఉండేది అయిన ఒక తత్వశాస్త్రాన్ని స్పష్టంగా మనసులో ఊహించుకున్నారు. నూతన మానవుని గురించీ, నూతన నీతిశాస్త్రాన్ని గురించి ఆయన కలలుగన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆయన మార్పుకోరారు, నఖశిఖ పర్యంతమైన మార్పు, అందులోనూ సమూలమైన మార్పు.

గురజాడకు వయసులో పెద్దవాడైన సమకాలికుడు వీరేశలింగం. ఆయన కూడా మార్పు కోరారు, గురజాడ కోరినంత గాఢంగా కోరారు. కానీ, కొన్ని విషయాల్లో ఆయన జీవితమూ, ఆలోచనా గురజాడ కన్నా మౌలికంగా భిన్నమైనవి. ఆ ఇద్దరిలో చిన్నవారు ఎక్కువ విద్యావంతులు; ఎక్కువ ప్రౌఢులు. వీరేశలింగం కన్నా ఆయన గ్రంథపరిచయం విస్తారమైంది. ఆయన గ్రహణశక్తి నిశితమైంది. ఆయన సృజనాత్మక శక్తులు నిస్సందేహంగా గొప్పవి. వీరేశలింగంలాగా ఆయన కరకు నీతివాది కాదు. అందువల్ల ఆయన మానవ బలహీనతలను చాలావరకు మన్నించారు. ఇది దౌర్బల్యమనుకుంటే, ఈ దౌర్బల్యమే ఆయన సానుభూతిని విస్తృతపరచి ఆయనను ఉత్తమ రచయితగా తీర్చింది. వీరేశలింగానికి ఆగ్రహావేశాలు కల్గించే సన్నివేశాల్లో గురజాడ నవ్వి, హాస్యమాడారు. వాళ్ళ చిత్తవృత్తుల్లోని భేదంవల్ల, అంతకన్నా ముఖ్యంగా మానవుని పట్లా, భగవంతుని పట్లా వాళ్ల వైఖరుల్లో వున్న భేదం వల్ల, ఆ పథనిర్దేశకు లిద్దరి మధ్య సయోధ్య లేకపోయింది. ఇద్దరూ ఆధునికతా ప్రియులే. కానీ వీరేశలింగం ఉదారవాది, గురజాడ తీవ్రవాది. వాళ్ళ రాజకీయాభిమానాల్లో కూడా ఇదే కనిపిస్తుంది. ఆంగ్ల విద్య విమోచనాత్మక ప్రభావం మీద, బ్రిటీష్ పరిపాలనా ఉపకారాత్మక స్వభావం మీద ఇద్దరికీ సమానంగా విశ్వాసమున్నా, వీరేశలింగం భారత జాతీయ కాంగ్రెస్లోని మితవాద పక్షాన్ని సమర్థిస్తే, గురజాడ అతివాద పక్షాన్ని అభిమానించారు.
దీన్నిబట్టి వీరేశలింగంగారిది జడబుద్ధి అనుకుంటే, ఆయనకు స్పష్టంగా అన్యాయం చేయడమౌతుంది. కాలంతోపాటు మారే ప్రశంసనీయమైన సామర్థ్యం ఆయన కుండేది. చనిపోయే కొన్నాళ్ళకుముందు ఆయన జంధ్యం తీసిపడేశారు, కొన్ని నెలలకు ముందు సజీవ భాష అయిన వాడుక తెలుగు మీదగల నిషేధం పోవాలనీ అభిప్రాయానికి వచ్చారు.

సజీవమైన భావాలను వ్యక్తం చేయడానికి ఆ భాషే సమర్థమైందనే నమ్మకం ఆయనకు కుదిరింది. వీరేశలింగం గురించీ తనకున్న గతాభిప్రాయాన్ని మార్చుకొని, ఆయన గొప్ప యోధుడనీ, మాన్యుడైన నాయకుడనీ, గురజాడ ఆయనకు జోహార్లు అర్పిస్తూ 1911 జనవరి 12 నాటి డైరీలో రాసుకున్నట్లు గురజాడ శిష్యుడు బుర్రా శేషగిరిరావు ఉల్లేఖించారు. ఆ ఏడాది డైరీని మరెవరూ చూడనూ లేదు. ఉల్లేఖించనూ లేదు. అందువల్ల శేషగిరిరావు మీద నమ్మకంతోనే ఆ మాటను అంగీకరించాలి. నిశ్చయంగా నమోదైంది పండితుడుగా, రచయితగా, సమాజ నాయకుడుగా అర్థం చేసుకోవచ్చు. మొత్తం మీద గురజాడ ఇరాస్మలాంటి వాడు కాగా, వీరేశలింగం లూథర్ లాంటివాడు. గురజాడకు భిన్నంగా వీరేశలింగం కార్యవాది. అందువల్ల ఆయన ఒక్కొక్క అడుగు ముందుకు యోగ్యమో, ఏది కాదో ఆయన పరిగణించవలసి ఉండింది, పోవలసివుండింది. ఏది ఆచరణ నాయకుడు అనుచరుల కన్నా మరీ ఎక్కువగా ముందుకుపోతే అతను ఒంటరిగాడై దాదాపు ఏమీ సాధించలేడనే విషయం ఆయన గుర్తుంచుకోవలసి వచ్చింది. దీనికి భిన్నంగా గురజాడ ప్రధానంగా స్వాప్నికుడు. ఆయన కలలు దూరాతి దూరంలోని దిగంతాలను సైతం దాటి పోగలిగేవి. స్వాప్నికుడు రెక్కలు కట్టుకొని విహరించగలడు. కార్యవాది బురదలో, రొంపిలో కాళ్ళీడ్చుకుంటూ దారిపొడవునా పోరాటం చేస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ సాగవలసి వుంటుంది.

గురజాడ సారభూతంగా స్వాప్నికుడు కాబట్టి, ఆయన సాహిత్య రచన పరిమాణంలో కొంచెమే అయినా, వీరేశలింగం రచనల కంటే కళాత్మకమైంది. చిరస్థాయి అయింది. దాని ప్రభావం పెరుగుతోంది; ఇంకా పెరుగుతొంది. మనకు గురజాడ నిర్దేశించిన గమ్యాలను చేరుకోవాలంటే మనమింకా అనేక యోజనాలు ప్రయాణించవలసివుంది. ఆ గమ్యాలను మనం చేరుకున్న దాకా ఆయన మనకు దారి చూపిస్తూ, స్నేహపూరిత పరిహాసాలతో దీర్ఘ ప్రయాణంలో సేదతీరుస్తూ...

అనుబంధం:

# సుసంచిత గ్రంథ సూచి

## గురజాడ తెలుగు రచనలు


1 కన్యాశుల్కం, మొదటి కూర్పు: టీకాటిప్పణితో బంగోరె. పునర్ముద్రణ, మద్రాసు,1969.
2 నీలగిరి పాటలు, మద్రాసు, 1907.
3 కన్యాశుల్కం, పరిష్కృతమైన కూర్పు, మద్రాసు, 1909.
4 కన్యాశుల్కం, సంగ్రహ కూర్పు: వి.ఆర్. నార్ల, విజయవాడ,1976.
5 ఆణిముత్యాలు, విజయవాడ, 1959.
6 హండే అనంతపురం, చరిత్ర, సంపాదకుడు: జి.వి. అప్పారావు, మద్రాసు, 1920.
7 ముత్యాల సరాలు, విజయవాడ, 1955.
8 కొండు భట్టీయం: బిల్హణీయం, విజయవాడ, 1954
9 వ్యాస చంద్రిక, విజయవాడ, 1953.


## గురజాడ ఆంగ్ల రచనలు.


1 డిసెంట్ పత్రం, మద్రాసు, 1914.
2 శ్రీరామ విజయ పీఠిక, బొంబాయి, 1901
3 హరిశ్చంద్ర పీఠిక, ది మార్టీర్ ఆఫ్ ట్రూత్, మద్రాసు, 1887


## అనువాదాలు


1 కన్యాశుల్కం (ఆంగ్లానువాదం) అనువాదకులు: యస్.యన్. జయంతి, హైదరాబాద్, 1964.
2 కన్యాశుల్కం (కన్నడానువాదం) అనువాదకులు: కె. క్రిష్ణయ్యంగార్, 1927.
3 కన్యాశుల్కం (రష్యన్ అనువాదం) అనువాదకులు: జడ్.యన్. పెత్రుని షేవా, 1962.
4 కన్యాశుల్కం (తమిళ అనువాదం) అనువాదకులు: ముదునూరు జగన్నాథరాజు, 1964.


## గురజాడపై ఆంగ్ల రచనలు


1 మహాకవి గురజాడ అప్పారావు, రచయిత: జి.వి. సీతాపతి, హైదరాబాద్, 1978.
2 ది గురజాడ సూవెనీర్: సంపాదకులు: దేవులపల్లి రామానుజరావు, హైదరాబాద్, 1962.
3 యూనిలిట్, హోమేజ్ టు గురజాడ, సంపాదకులు: అబ్బూరి రామకృష్ణారావు, సికిందరాబాద్, 1963.
4 ఆన్ యిండియన్ జర్నలిస్ట్ (శంభుచంద్ర ముఖర్జీ) రచయిత: హెచ్.యల్. స్క్రీన్.


## గురజాడపై తెలుగు రచనలు


1 మహాకవి, మహాపురుషుడు గురజాడ అప్పారావు, రచయిత: సెట్టి ఈశ్వరరావు, బెజవాడ, 1945.
2 అడుగుజాడ గురజాడ, రచయిత: శ్రీశ్రీ, విజయవాడ, 1959.
3 గురజాడ వెలుగుజాడ, రచయిత: కె.వి. రమణారెడ్డి, విజయవాడ, 1964.
4 మహోదయం, రచయిత: కె.వి. రమణారెడ్డి, విజయవాడ, 1969.
5 గురజాడ శతవార్షిక జయంతి సంచిక, సంపాదకులు: దేవులపల్లి రామానుజరావు, హైదరాబాద్, 1962.
6 పరిశోధన, శ్రీ గురజాడ అప్పారావు స్మారక సంచిక, సంపాదకులు: తిరుమల రామచంద్ర, మద్రాసు, 1956.

7 మహాకవి గురజాడ శతజయంతి ఉత్సవ సంచిక, ఖమ్మం, 1963.

## తెలుగూ ఆంగ్లమూ కలిసినవి

1 మహాకవి గురజాడ సెంటినరీ సూవనీర్, సంపాదకులు: కె. ఈశ్వరదత్ తదితరులు, ఢిల్లీ, 1963.

2 గురజాడ కమ్మెమొరేటివ్ వాల్యూమ్, సంపాదకులు: యం. చలపతిరావు, ఢిల్లీ, 1976.

3 గురజాడ శతజయంతి వార్షిక సంచిక, వాల్తేరు, 1963.

## NOTES AND REFERENCES

1 ఆయన జీవిత చరిత్రకారులు కొంతమంది ఈ తేదీని అంగీకరించలేదు. 1861 నవంబరు 30 అని వాదించారు.

2 1897 జనవరి 5వ తేదీనాడు ఆయన దినచర్య పుస్తకంలో ఒక అంశం వుంది. "విజయనగరంలో పాతికేండ్లు". ఈ తేదీ నుంచి వెనక్కి మళ్ళీ చూస్తే, విజయనగరానికి 1872 జనవరి 5వ తేదీ బయలుదేరినట్లు వూహించగలం.

3 డాక్టర్ జి.వి. సీతాపతి ప్రకారం యాభై రూపాయలు. మొదట యిరవై అయిదువుండి ఆ తర్వాత యాభైకి పెరిగి వుండవచ్చు.

4 మరొక విధంగా చెబితే తప్ప, యీ ప్రకరణంలోని వుల్లేఖన చిహ్నాల మధ్య వుండే భాగాలు ఆంగ్లంలో వుండీ యిప్పటికీ అప్రచురితంగా వున్న అప్పారావు డైరీలోనివీ, నోటు పుస్తకాలలోనివీ,

5 యిది మగపేరులాగా వున్నా, వాస్తవంగా ఆడపేరే.

6 M.O.: My own Reflections, Observations and remarks,

7.ఆనందగజపతిని గురించి రాసిన వాటికి హెచ్. హెచ్. అని గుర్తువుంది.(H.H. His Highness సంగ్రహ రూపం, అను.)

8 జర్మన్ తత్వశాస్త్ర పరిభాష వెల్టన్ లో పూంగ్ కు ఇది దగ్గరి పదం. పూర్తి సంతృప్తికరమైంది. విశ్వానికి జీవితానికి సంబంధించిన ఒకరి తత్వ సంపూర్ణతను కానీ, భావ సమగ్రతను కానీ ఇది ఇముడ్చుకుంటుంది.

9 గురజాడ రంగాలను గుర్తు పెట్టడంలో కాస్తా అజాగ్రత్తగా వుంటారు. అందువల్ల రెండు కూర్పుల్లో దేశ్లోనైనా మొత్తం రంగాల సంఖ్యను గురించిన అంచనాలు 32 కూ 35 కూ మధ్యవున్నాయి. 1918లో బెంగుళూరులో యిచ్చిన ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో నాటకం' అన్న వుపన్యాసంలో రెడ్డిగా రన్నట్లు వాటి సంఖ్య 150 అనడం పచ్చి అతిశయోక్తి,

10 'కన్యాశుల్కం' రెండో పొరానికే ఈ ప్రస్తావన,

11 థామస్ ఓట్వే (1652-1685) నాటకాలు స్వయంగా రాయడమేకాకుండా, రాసైన్, మోలియర్ల నాటకాలను ఆంగ్లంలోకి అనుసరించాడు. అతని ఉత్తమ రచన 'వెనిస్ ప్రిజర్వ్డ్'. అందులో షాహౌరీని అంటానియోగా అతను హాస్యంగా చిత్రించాడు.

12 వాల్టర్ శావేజ్ లాండర్ (1775-1864) అతని అనేక రచనల్లో 'పెరిక్లీస్ అండ్ అస్పాసియా' ఒకటి. కానీ, ప్రధానంగా అతన్ని గుర్తుకు తెచ్చుకొనేది అయిదు సంపుటాల 'వూహా సంభాషణలు' రచయితగా.

13 మనిషి చేసిన రాయిరప్పకి
మహిమ కలదని సాగి మొక్కుచు
మనుషులంటే రాయి రప్ప కున్న కనిష్ఠం,
గాను చూసావేల బేలా?

దేవుడెవడో దాగెనంటూ
కొండ కోనల వెతుకులాడే

కన్ను తెరిచిన కానబడదో
మనిషి మాత్రుడి యందు లేడో!
యెరిగి కోరిన కరిగి ఈడో ముక్తి"
(మనిషి గేయంలోంచి)



14 యీ. ఫ్రీమన్ 'సిసిలీ చరిత్ర' రాసిన ఎడ్వర్డ్ అగస్టస్ ఫ్రీమన్ కావచ్చా?

# జగన్నాటకం

(గీతాలు: గేయాలు)

## పరిచయం

కవిగా నన్ను మీకు ఈ గేయసంపుటి పరిచయం చెయ్యాలి.

అట్టి సంపుటిని మీకు పరిచయం చేయడానికి నే నెవరిని?

నార్ల వెంకటేశ్వరరావు

### వెన్నెల

ఇందు వెన్నెల అందు వెన్నెల
అందములు చిందించు వెన్నెల
ఇగురు వెన్నెల తొగరు వెన్నెల
జగములను రగిలించు వెన్నెల
లేత వెన్నెల పూత వెన్నెల
కైతలను కదలించు వెన్నెల
వగల వెన్నెల తొగల వెన్నెల
నగములను నవ్వించు వెన్నెల
తెరల వెన్నెల కెరలు వెన్నెల
కెరటముల క్రీడించు వెన్నెల
ఇంపు వెన్నెల సొంపు వెన్నెల
జొంపముల కంపించు వెన్నెల
పిండి వెన్నెల వెండి వెన్నెల
గుండెలను పండించు వెన్నెల
పాల వెన్నెల పూల వెన్నెల
కాలమును కరగించు వెన్నెల
తేనె వెన్నెల సోన వెన్నెల
మానవుని మంత్రించు వెన్నెల

### ఓ మానవా!

చిత్రం, బహుచిత్రం! చిత్రాతివిచిత్రం!!
ఆరని, చల్లారని ఆసల, పేరాసల
మిడిమంటలలోనే వడిగా, వడివడిగా
శలభానికివలెనే కలకాలం పరుగులు!
చిత్రం, బహుచిత్రం! చిత్రాతివిచిత్రం!!
అందని, రూపొందని ఆదర,
ప్రేమాదర విభవవ్యోమాలకు
విడిగా, విడివిడిగా సంపాతికి వలెనే
సతత మ్మీ పయనం!
చిత్రం, బహుచిత్రం!
చిత్రాతివిచిత్రం!!
పొంగుల, వేరంగుల గంగను,
స్వర్గంగను ఉర్వికి కొనితేగా ఓహో!
ఓహోహో!! భగీరథుని కెనగా
జిగీష చూపించుట!
చిత్రం, బహుచిత్రం! చిత్రాతివిచిత్రం!!
సృష్టికి ప్రతిసృష్టిని వృష్టిగ కల్పించగ
ఔహిత్యము తోడుత ఔరా! ఔరౌరా!!
గాధేయుని కెనగా పాధేయము నొడ్డుట!
చిత్రం, బహుచిత్రం! చిత్రాతివిచిత్రం!!

### వర్షరాత్రి

నీలి సంద్రం, నిండు సంద్రం,
స్తబ్ధతీరం, నిశ్శబ్దపారం
అలతి మేఘం అలఘు మేఘం,
కాల మేఘం, ఆభీల మేఘం
కుంభ వర్షం, క్రూర వర్షం,
ఘోరపాతం, ఝుంకార వాతం
పూర్ణ వాతం, ఘూర్ణ వాతం,
శీతవర్షం, నిర్హత వర్షం
శూన్యలోకం, సుప్తఘుకం,
అంధకారం, గాఢాంధకారం
పొంగు సంద్రం, పొర్లు సంద్రం,
మ్రోగు తీరం, మార్మ్రోగు పారం

## కన్నెలు

మింటమెరిసే కొంటె చుక్కలు
కవులు చెప్పే కన్నెలైతేకన్ను
గీరుటె తెన్ను వాటికి,

వెక్కిరింతలె వెల్గు వాటికి
తెల్లబోయే మల్లె మొగ్గలు
కవులు చెప్పే కన్నెలైతే

తగని సిగ్గుల తెగులు వాటికి,
నిశనుదాటని మిసిమి వాటికి
నింగి త్రుళ్ళే నీలిమబ్బులు

కవులు చెప్పే కన్నెలైతే –
విరియబోసిన కురులు వాటికి,
వల్ల మాలిన వగలు వాటికి

కొలను వెల్గుల కలువపువ్వులు
కవులు చెప్పే కన్నెలైతేనీటి నీడల
నిక్కు వాటికి, మేటినవ్వుల గోటు వాటికి

కొమ్మదాగే కోయిలమ్మలు
కవులు చెప్పే కన్నెలైతే
వన్నెచిన్నెలు సున్న వాటికి
గుండెకోతలు మెండు వాటికి

## శైశవ హృదయం

"చంపంగ నేలరా చలిచీమ నీవు?
చెడుగు నీ కది యేమి చేసెరా తండ్రి
"అమ్మోయి! మరిగల్తే
ఆ చీమ నన్ను కరిచింది
గట్టిగా కరచింది రేపు!"
"కాకమ్మ తెచ్చింది గారెతుం పొకటి,
తిరిగి తెమ్మంటేను తేలేను, బాబు!"
చేరింది చూరులో చిన్నారిపిచిక,
అడగవే అదికూడ అప్పచ్చి తెచ్చు!"
"బొగ్గు గీతలు - అయ్యో –
ముగ్గు పూతలును మురి కేలరా
నీకు ముఖము నిండుగను?"

"బొగ్గుగీతలు కావె - బుగ్గమీసాలు,
ముగ్గుపూతలు కావె - ముసలి గడ్డాలు!"

"బేడకా సిచ్చినా యేడుపా నీకు?
ఆగడాలకు నీకు హద్దు లేదాయె!"

"పాడు డబ్బిది నాకు బేడకా సొద్దు
మోగాలి జేబులో ముక్కాని తేవె!"
"కాగితాలకు పెద్ద కరువొచ్చె, బాబు!
పిచ్చిగీతలు నీవు పెట్టంగరాదు!"
"గీత లేమియు కావు, రాతలే నమ్మ!
చందమామకు పెద్ద జాబు రాశాను!"
"ఎన్ని చెప్పిన నీదు తెన్నులే నీకు;
పడవలుంటే చాలు పవలంత నీకు!"
"పడవనే పంపితే బావయ్య రాడ?
అక్కయ్య పెట్టదా చక్కెరల్ నాకు?"
"జేబునిండుగ ఎన్ని చేర్చినాగాని
"గోలికాయల నీకు చాలనే లేద?"
"చందమామకు - అమ్మ - ఎందుకై
తేను గోలికాయల అన్ని కొండ నిండుగను?" -
"చూడగా మబ్బుల చోద్యంబుగాను
వింతేమి కలదోయి వెర్రినాగన్న?"
"ఆడునా దేవుండు ఆట లన్నియును?
కట్టునా అంతంత గాలిపటాలు!"

## ఆగస్టు - 15

కూటికి గుడ్డకు లోటులు
తప్పక లెక్కకు మించిన

చిక్కులో వున్నా, రేపటి చింతలు
రేయిని నిద్రను దూరము చేయగ

భారముగా మన బ్రతుకులె వున్నా;
గతులే లేవని గుండెలు గుబగుబ



కొట్టుకులాడే సమయము లున్నా,
చంచల మందక మంచిని, చెడ్డను
మదిలో నించక తరచగ నీకే
తప్పక - అన్నా! తేట తెల్లముగ
తెలియును సుమ్మీ!దేశపు
దాస్యము తీరిన దినమే,
స్వరాజ్యభాగ్యము బడసిన దినమే
జగతిని మన మొక జాతిగ
మన్నన గాంచిన
దినమే కమనీయమ్మగు.
పర్వదినమని సర్వవిధముల
స్మరణీయంబగు స్వర్ణదినమని
స్వరాజ్య సంపద సద్వినియోగము
కాగల దక్షత కరవై పోతే
నిందను మనమే
అందరి మధ్యను పంచుకొనుటయె
భావ్యం అన్నా!

మన లోపంబులు, మన పాపంబులు
స్మరణము చేయక, మందమతులమై
రాజువు నీవే, రాజ్యము నీదే
కలసికట్టుగా,మలచినట్టుగా
భావికి మెట్టులు రీవిగ పెట్టుము!
రాజువు నీవే, రాజ్యము నీదే
పూనినట్టుగా, తేనె పట్టుగా
సమతాసౌధము చక్కగ కట్టుము!
హెచ్చు తగ్గులను మచ్చమాపనీ
నడుము కట్టగా నిడుములు తొలగును!
కరువు కాటకము తరిమివేయ నీ
హలము పట్టగా కలుములు కలుగును!
ధ్యేయము మరవక, న్యాయము తప్పని
పరదాస్యమ్మును బాపిన దివ్య ది
నమ్మును తిట్టిన నాశము జాతికి.
తప్పదు, తప్పదు, తప్పదు అన్నా!
వందలాదిగ వత్సరములలో
మేరువు పగిదిని పేరుకుపోయిన
పీడలు, చీడలు, కీడులు, గోడులు
తొందరగా నెటొ తొలగును అన్నా!
నిండుగ నదిలో నీరము లుంటే
పండునే అన్నా!
పంటలన్నియు చేలకు వాటిని
చేర్చిన మీదట
రేయిం బవలును రెక్కల కష్టము
చేసిన వానికె చెందును అన్నా!
బంగరు పంటలు భాగ్యపు రాశులు
కాల్వలు తీయక
కష్టము చేయక స్వరాజ్య నదియును
సత్ఫల మివ్వదు
కర్మభూమినే, ఘర్మవారినే
పెరుగును - అన్నా!
సిరిసంపత్తులు! కొండల మందక
తందరలాడక పందెపు
గుఱ్ఱము పగిదిని ముందుకు సాగుము,
సాగుము సాగుము - అన్నా!
దూరపు చూపులు, భారపు నడకలు
కావలె నన్నా కామితసిద్ధికి ,
సమష్టిలక్ష్యము, సౌభ్రాతృత్యము
ముఖ్యం బన్నా సౌఖ్యవ్యాప్తికి!
పథమును మెట్టిన కథయే మారును!
అప్పుడె-అన్నా! అందరు జనులకు
కలుగును సౌఖ్యము!వెలుగును శాంతులు!!
నూతన జగతిని నూతన సంఘము
స్థాపనచేయగ స్వరాజ్య మున్నది:
రేపటివారికి రేయిని పగలుగ
మహితాత్ముడవై మార్చుము - అన్నా!
సార్థక మప్పుడే స్వరాజ్య సిద్ధికి!
ధన్యము, ధన్యము, ధన్యం బప్పుడే
పౌరుల జన్మము!! (1952)

## ఆవల

ముద్దుపాప నిద్దురలో
తొంగిచూచి దోగాడే
చిరునవ్వుల కెరటమ్ముల
కావల నేమున్నదొ!

అరమోడ్పుల అక్షులలో
ప్రభాకోచి ప్రభవింపగ సాగే
పటుయోగనిష్ఠ
కావల నేమున్నదొ!

నీలాభ్రము, నీలాద్రుల
కమ్మని బిగికౌగిలిలో
కరగే శీకరసీమల
కావల నేమున్నదొ!
రావరీ ప్రభాతాల
త్యహ పరివర్తనలే
కమౌ కాలోదధి
కావల నేమున్నదొ!

వినుమో నా కల్లోల మనోవీధుల నూపే
భీతావహ వాతావరణము
కావల నేమున్నదొ!

## గరిక

పిరికి పిరికి ఓ గరికా!
పిచ్చితల్లివే గరికా!!
ఒదిగి ఒదిగి - నేల కదిసి కదిసి,
గాలి బెదరి చెదరి,-ఏల బెదరెదవే?
పిరికి పిరికి ఓ గరికా!
పిచ్చితల్లివే గరికా!! పెరుగు పెరుగు
కొసలు కొరికి కొరికి పసులు
కరము కరము విసుగు పరచునటే?
అలయ నలయ,సొదలు తొలగునటే?
తలకి తలకి, నిదుర కలగి కలగి,
మదిని అలయ నలయ,
సొదలు తొలగునటే
పిరికి పిరికి ఓ గరికా!
పిచ్చితల్లివే గరికా!!
తడవ తడవ వెతలు పడక పడక,
గతులు చెడక చెడక, బ్రతుకు గడచునటే?

పిరికి పిరికి ఓ గరికా!
పిచ్చితల్లివే గరికా!!
పెరిగి పెరిగి, పిరికి పిరికి ఓ గరికా!
పిచ్చితల్లివే గరికా!!

ఏలొ తరిగి తరిగి, ఎటకొ సురిగి సురిగి,
ఎల్ల రరుగుదురే!
పిరికి పిరికి ఓ గరికా
పిచ్చితల్లివే గరికా!

నలిగి నలిగి, గరిమ తొలగి తొలగి,.
మరల చెలగి చెలగి, వరల గలవుగదే!
పిరికి పిరికి ఓ గరికా!
పిచ్చితల్లివే గరికా!!

## నామధేయ మేదైనా...

అశ్వినో, భరణో,
అనూరాధో;
నామధేయ మేదైనా
నక్షత్రాలే అన్నీ
నవ్వి, నవ్వించడానికి,
దవ్వునుంచి కవ్వించడానికి;
నింగి పందిరిపై వలె
నీ గుండెలో బొండు మల్లెలు
దండిగా పండించడానికి,
కాటుక చీకటిలో
కోటీర మణిదీపా లొక
కోటి వెలిగించడానికి!
పుష్యమో, పునర్వసో,
పూర్వాభాద్రో
నామధేయ మేదైనా
నక్షత్రాలే అన్నీ
నింగి దిక్కులో
పొంగిపోగలవానికి!!

## సాఫల్యం

చీరచెంగున
చేరినప్పుడే
సరిగపోగుకు
సౌరులైనా, తీరులైనా!
కంఠసీమను
కదిసినప్పుడే
రత్నమాలకు
రంగులైనా, పొంగులైనా!
వేణి పై అర
విచ్చినప్పుడే
సన్నజాజికి
వన్నెలైనా, చిన్నెలైనా!
అరుణరాగము
అమరినప్పుడే
కొండకొనలకు
కులుకులైనా, పులకలైనా!
వెలుగు రిక్కలు
విరిసినప్పుడే
అంబరానికి
హారమైనా, హర్షమైనా!
మావికొమ్మల మసలినప్పుడే
కోకిలమ్మకు కూతలైనా, కైతలైనా!
శిల్పిచేతికి చిక్కి నప్పుడే
చలువరాతికి చలనమైనా, చెలువమైనా!
కవుల ఊహలు కదిపినప్పుడే
తేట మాటకు తేనెలైనా, సోనలైనా!
బ్రతుకులోతులు వెతకినప్పుడే
దృక్పథాలకు దీప్తులైనా, వ్యాప్తులైనా!

కలల తీపుల కరగినప్పుడే
అయిన బరువురాత్రికి
గరువమైనా, పరువమైనా!
పరుల సేవల పండినప్పుడే
జీవితానికి చేవలైనా, తావులైనా!
పల్లెపల్లెను తరచు మదిని
మోసు చెల్లినప్పుడే
నాదు పాటకు
మోదమైనా, మూల్యమైనా!

## ప్రకృతి

రంగు రంగు అంబరం
చెంగు చెంగు సంబరం
పూయదా ధృగంతరం
పొంగదా హృదంతరం

## స్వగతం

లేదు నాకు శాంతి, సుఖము లేదు నిత్య
ఘోషల గలుగు పాదోధి, క్రూర తరణి
త ప్త సైకత స్థలి వివిక్త జనవాటి
శిధిల గృహము - నా హృది
లేదు చింత సిరుల
నోలలాడ; కోరను భోగజాలమేమి;
ప్రేమదారిద్ర్య మెరుగదు; ధామ మొప్పు
పుత్రపుత్రీప్రియాలాపపూర్ణ దివ్య
సీమగాగ; పరుల దృష్టి జీవితమ్ము
బహుజయప్రదమ్ము; దహించు పాపకీల
శిఖలు గుప్తమై లేవు హృత్సీమ – *అయిన*

గ్రాలులోన సంకుల మహాభీలమైన
వెలితి; బ్రతుకునే అది చాల వెక్కిరించు
వికటముగ నవ్వి చూపట్టు నికటముననె
జీవిత విశిష్ట లక్ష్యము; చేరబోవ
దూరమౌను; విసువు జెంద వేరు లక్ష్య
మేదియో చీరు; వెన్నాడ నెంతొ త్రిప్పి
మాయలేడియౌను తరచు మదిని మోసు
లెత్తు కాంతులీనుచు చిత్రలీలగా
నంత భావపుంజము; పుట్టినంత గిట్టు
గాని, వేయదు మారాకునైన -ఏవొ

సుధామధురమోహనంపు నాదములు
తొంద రించు నెద; గొంతుకను సవరింప
నొక్క తేనెపాటైన పెగలదు తెంపులేని

తపన; ఫలితమ్ము పూజ్యము; దారుణమ్ము
నిదుర కౌగిలిలోనైన కదలి, కనలి, కుమిలి
పీడించు నొక బాధ గొప్ప కృషియె తప్ప
సాధించినది ఇంతదనుక కొంచె మైన లేదు;
పోయె వయసు; మరలి రాదు;
పిలుపు రాకమునుపె నాదు కలలపంట
పండునో, లేదా.

## మధురకీలలు

అల్ల నింగిని తెల్ల మబ్బుల
పకపకలు వికవికలు
కావి యెండను రావి యాకుల
మిలమిలలు తళతళలు
పిల్లతెమ్మెర మల్లె మొగ్గల
గుసగుసలు మిసమిసలు
గడుసు కీరము, గండు కోయిల
గబగబలు గుబగుబలు
బడుల గంటల, గుడుల గంటల
గణగణలు ధణధణలు
పికిలిపిట్టల, పిచ్చుకమ్మల
పిలవిలలు కిలకిలలు
పాలబుగ్గల పాప నవ్వుల
నిగనిగలు ధగధగలు.
హృదయసీమల మధురకీలల
భగభగలు భుగభుగలు

## కాక సప్తకం



అనగనగ ఒక కాకి, ఆరింద ఆ కాకి
తెల్ల తెల్ల వారకనె తేటగా లేచింది;
"కాక, కాకా" యనుచు లోకాన్ని లేపింది;
ఇల్లిల్లు చుట్టింది, ఎంగిళ్ళు మెక్కింది;
గుట్టుమట్టుగ తిరిగి గూటిలో చేరింది!
అనగనగ ఒక కాకి ఆరింద ఆ కాకి
కలదండి ఒక కాకి, గజదొంగ ఆ కాకి
పిల్లలకు దాపులో చల్లగా చేరింది:
ఒక గంతు వేసింది. ఒక్కింత జరిగింది;
మలిగంతు వేసింది, మరికొంత జరిగింది;
తాయమ్ము తన్నింది,తా నెగిరిపోయింది!
కలదండి ఒక కాకి, గజదొంగ ఆ కాకి
వచ్చింది. ఒక కాకి, వయ్యారి ఆ కాకి
తక్కుతూ తారుతూ దిక్కులను చూచింది;
ముక్కు దువ్వెనకాగ ముస్తాబు చేసింది;
మెడ సుంత వంచింది, మెల్లగా కూసింది;
ఎందుకొ లేచింది,ఎగిరెగిరి పోయింది!
వచ్చింది ఒక కాకి, వయ్యారి ఆ కాకి
వాలింది ఒక కాకి, వగలాడి ఆ కాకి
ముత్తయిదు వటు ముందు ముద్దుగా కూర్చుంది;
పలుకరిస్తున్నట్లు పలుమార్లు కూసింది;
చనువుగా వంటింటి చాయలకు చేరింది;
చేతితో విదలింప చెంగునే పోయింది!
వాలింది ఒక కాకి, వగలాడి ఆ కాకి
చేరింది. ఒక కాకి, చెల్లాయి ఆ కాకి
చిరుగజ్జికాళ్లతో చిందులను తొక్కింది;
మెరసిపోయే కళ్ల మురిపెమ్ము చూపింది;
కన్నవారింటిలో కలరూపు తెల్పింది;

అన్నవచ్చే వార్త అందించి పోయింది!
చేరింది ఒక కాకి, చెల్లాయి ఆ కాకి
అయ్యయ్యొ ఒక కాకి, గయ్యాళి ఆ కాకి
కారణములేకనే వైరమ్ము పూనింది;
కారాలు, మిరియాలు కలగలిపి నూరింది;
కవ్వించి కవ్వించి కయ్యమ్ములాడింది;
తరుముకుంటూ వచ్చి తల దన్నిపోయింది!
అయ్యయ్యొ ఒక కాకి, గయ్యాళి ఆ కాకి
రచ్చలో ఒక కాకి, రాకాసి ఆ కాకి
ఆరబోసిన పిండి తేరగా బొక్కింది;
నెత్తిబుట్టల వారి నిలువునా దోచింది;

ఇనుపముక్కును పెట్టి ఎద్దులను పొడిచింది;
కొట్టి కారాడంగ తిట్టుతూ పోయింది!
రచ్చలో ఒక కాకి, రాకాసి ఆ కాకి.

## ద్వంద్వాతీతం



వెలుగు వెనుకనె యిరులు
ఇరుల వెనుకనే వెలుగు అటు చూడు!
ఉదయసంధ్యాశోభ!
ఎండలోనే వాన, వానలోనే
యెండ ఇటు తిరుగు!
ఇంద్రచాపం సొబగు!
బ్రతుకు వెన్నంటి మృతి,
మృతినీడనే బ్రతుకువినవోయి!
పురిటింటి కేరింత!

## సాగరరాజు

రాజా! ఓహో! సాగరరాజా!!
హోరను ఘోషల తీరని బాధలు
ఇంతగ గుండెలు నెందుల కోయీ?
రాజా! ఓహో! సాగరరాజా!!



ఘోషలు జాగృతి, ఘోషలె నిద్రను:
ఘోరము లేవో భారము లౌనా?!
రాజా! ఓహో! సాగరరాజా!
జంటను కానని ఒంటరి బ్రతుకున
మంటలు లేవగ కంటకపడుదువె?
రాజా! ఓహో! సాగరరాజా!!
వచ్చుచు, పోవుచు వెచ్చని నెత్తురు చిందే
సూర్యుడు చీదరపరచునె?
రాజా! ఓహో! సాగరరాజా!!
ఆడుచు తరగల హాస్యముచేసే
తుంటరి చంద్రుడు తొట్రిలజేయునె?!
రాజా! ఓహో సాగరరాజా!!
మెడలో మాలగ మెరసే చుక్కలు
చేతికి చిక్కక చిక్కులు వెట్టునె?!
రాజా! ఓహో! సాగరరాజా!!
చెరిగిన లక్ష్యమొ, కరగిన కలలో
కలతలు వెట్టునె కలకాలంబును?!
రాజా! ఓహో! సాగరరాజా!!
చేరగ తీరము చిందరలౌ
నీ భంగము లన్నియు భగ్నపు టాశలె?!
రాజా! ఓహో! సాగరరాజా!!
నదీనదమ్ములు నానాసీమల
దురితము జెప్పగ దుఃఖము వచ్చునె?
రాజా! ఓహో! సాగరరాజా!!
దివిలో మేఘుడు భువిపై దైన్యము
కవియై తెల్పగ కలగునె గుండెలు?
రాజా! ఓహో! సాగరరాజా!!
అనేక యుగాల అనాథకోటుల

అశ్రువులా నీ అపార జలములు?!
రాజా! ఓహో! సాగరరాజా!!
మ్రింగకు శోకము, పొంగును కోపము;
కోపము పొంగిన క్రుంగదె లోకము?
రాజా! ఓహో! సాగరరాజా!!

## మూకభాష

లజ్జతో లోలాక్షి పజ్జకే రాక,
మునిపంట వ్రేలితో మోము వంచంగ,
చెలి జేరబొమ్మలి తెలియజెప్పంగ
విరిసింది పెదవుల దరహాసరేఖ!

పంతాన పద్మాక్షి చెంతకే రాక,
పెదవులు కంపింప పెడమోము పెట్ట,
చెలియల్క క్షణమని తెలియజెప్పంగ
మెరసింది కబరిలో విరజాజి దండ



కలహించి కామాక్షి కన్నీరు నింప,
అతివపక్షమె చేరి ప్రతి యశ్రుకణము
“ఏమైన గానిమ్ము - ఎగ్గు నీ" దనుచు
సణిగింది జరజర జారి చెక్కిలను;

కన్నవారింటికి కమలాక్షి కదల,
రివ్వుగాలికి పైట రెపరెపలాడి
“అడుగే ముందుకుగాని, ఆత్మ కా” దనుచు
పలికింది మరిమరి బాస చేయుచును!!

భారం

భారమురా! భారమురా! ప్రేమా
ధారములేని బ్రతుకు భారమురా!
మానవతే మటుమాయంబైతే
మనుగడయే బాధాపూరమురా!
భారమురా! భారమురా! ప్రేమా
ధారములేని బ్రతుకు భారమురా!
భారమురా! భారమురా! ప్రేమా
ధారములేని బ్రతుకు భారమురా!
బహిరంతర సంఘర్షణ శకమే
గహనాంతర కారాగారమురా!
భారమురా! భారమురా! ప్రేమా
ధారములేని బ్రతుకు భారమురా!
విషసుందరనటనామయ జగమే
అసురాత్మక పారావారమురా!
అనురాగము కానరాని గృహమే
శనిదేవత శయ్యాగారమురా!
భారమురా! భారమురా! ప్రేమా
ధారములేని బ్రతుకు భారమురా!
సమభావము శూన్యమైన నరులే
యమదూతల స్కంధావారమురా!
భారమురా! భారమురా! ప్రేమా
ధారములేని బ్రతుకు భారమురా!



## మూడు పువ్వులు: ఆరు కాయలు

తీగలు సాగిన తీరులు ఇంతే, ఇందే



గుండెలు విరిసిన పండుగ సంతత మిలకే, కలకే!
కాయలు ముగ్గిన గరిమము క్షణమే, తృణమే
బ్రతుకులు పండిన పరువము స్థిరముగ భువికే, దివికే
ప్రేమలు ప్రాకిన వెల్లులు నిండుగ మహికే, మదికే!
పూవులు పూచిన తావులు కొంతే, సుంతే -



## ఆశా సందేశం

పిచ్చుకా! పిచ్చుకా! ఓ పిచ్చుకమ్మ!
ఒంటిగా నుంటివా ఓ పిచ్చుకమ్మ?
జంట యేమాయెనే ఓ పిచ్చుకమ్మ?
ఏ వూరు, ఏ సీమ ఓ పిచ్చుకమ్మ!
ఏగెనే నీ జోడు ఓ పిచ్చుకమ్మ?
ఏలనే యెడబాటు ఓ పిచ్చుకమ్మ?
ఎందుకే తడబాటు ఓ పిచ్చుకమ్మ?
నవ్వించి, నమ్మించి ఓ పిచ్చుకమ్మ?
నాథుండు వెళ్లినా ఓ పిచ్చుకమ్మ?
లాలించి, సోలించి ఓ పిచ్చుకమ్మ!
బాలుండు వెళ్లినా ఓ పిచ్చుకమ్మ?
కవ్వించి, కలహించి ఓ పిచ్చుకమ్మ!
కాంతుండు వెళ్లినా ఓ పిచ్చుకమ్మ?
కాటుకలు కరగంగ ఓ పిచ్చుకమ్మ!
కన్నీటి కాల్వలు ఓ పిచ్చుకమ్మ!
ఏలనే బేలగా ఓ పిచ్చుకమ్మ?
చాలు నీ నిట్టూర్పు లో పిచ్చుకమ్మ?
వెన్న మనసులవాడు ఓ పిచ్చుకమ్మ?
ఎన్నాళ్లు రాకుండు నో పిచ్చుకమ్మ?
మొలక నవ్వులవాడు ఓ పిచ్చుకమ్మ?
అలుక కలకాలమా ఓ పిచ్చుకమ్మ?
వస్తాడు వగకాడు ఓ పిచ్చుకమ్మ!
వచ్చి, వలపిస్తాడు ఓ పిచ్చుకమ్మ!
తెస్తాడు తేనెలను ఓ పిచ్చుకమ్మ!
తెచ్చి, తేలిస్తాడు. ఓ పిచ్చుకమ్మ!
ఇస్తాడు ముద్దులను ఓ పిచ్చుకమ్మ?
ఇచ్చి లాలిస్తాడు ఓ పిచ్చుకమ్మ!
పువ్వులను చుడతాడు ఓ పిచ్చుకమ్మ!
పువ్వులకు రాణివే ఓ పిచ్చుకమ్మ!
మేడలను కడతాడు ఓ పిచ్చుకమ్మ!
'మేడలకు వెలుగువే ఓ పిచ్చుకమ్మ!
కవనాలు చెబుతాడు ఓ పిచ్చుకమ్మ!
కవనాల నిగ్గువే ఓ పిచ్చుకమ్మ!
మత్తుమందులు చల్లి ఓ పిచ్చుకమ్మ!
మచ్చికలు చేయునే ఓ పిచ్చుకమ్మ!
అరచేతిలో స్వర్గ మో పిచ్చుకమ్మ!
అంతలోనే చూపు నో పిచ్చుకమ్మ!
మగవారి మాయ లివి ఓ పిచ్చుకమ్మ!
మగువ! నీ వెరుగవే ఓ పిచ్చుకమ్మ?
ఆలితో కలహమ్ము లో పిచ్చుకమ్మ
అరనిముసమే కాదె ఓ పిచ్చుకమ్మ!
చందమామను మబ్బు లో పిచ్చుకమ్మ
ఎందాక దాచునే ఓ పిచ్చుకమ్మ?
బాలసూర్యుని మంచు ఓ పిచ్చుకమ్మ
బంధించి విడువదా ఓ పిచ్చుకమ్మ!
కన్నీరు పోనాడి ఓ పిచ్చుకమ్మ
పన్నీట మునుగవే ఓ పిచ్చుకమ్మ!
వలవంత విడనాడి ఓ పిచ్చుకమ్మ
వలువ సింగారించుమో పిచ్చుకమ్మ!
కురులు చక్కగ దువ్వి ఓ పిచ్చుకమ్మ
విరులు వెలయించవే ఓ పిచ్చుకమ్మ!
కళ్ల కాటుక దిద్ది ఓ పిచ్చుకమ్మ
కస్తూరి తీర్చవే ఓ పిచ్చుకమ్మ!
కర్పూరమాలతో ఓ పిచ్చుకమ్మ!
కలకన్నె కావమ్మ ఓ పిచ్చుకమ్మ!
కిలకిలా నవ్వుతూ ఓ పిచ్చుకమ్మ
తలు పింక కాయవే ఓ పిచ్చుకమ్మ!

ఓరగా నిలుచుండి ఓ పిచ్చుకమ్మ
కోరికలు కొమరొంద ఓ పిచ్చుకమ్మ
ఎదురుతెన్నులు చూడు మో పిచ్చుకమ్మ!
ఎదురు చూచుటలోనే ఓ పిచ్చుకమ్మ
ఎంతైన మోదమ్ము ఓ పిచ్చుకమ్మ!
కాసు కాదే బ్రతుకు ఓ పిచ్చుకమ్మ!
ఆశతోనే కాదె ఓ పిచ్చుకమ్మ
అమృతమథనము నాడు ఓ పిచ్చుకమ్మ?
ఆశతోనే కాదె ఓ పిచ్చుకమ్మ!
అక్షమ్ముపై విశ్వ మో పిచ్చుకమ్మ
అక్షయమ్ముగ దిరుగు నో పిచ్చుకమ్మ?
మింటి చుక్కలలోన ఓ పిచ్చుకమ్మ
మినుకుమినుకను ఆశ ఓ పిచ్చుకమ్మ!
తరగనురుగులలోన ఓ పిచ్చుకమ్మ
తళుకాడునే ఆశ ఓ పిచ్చుకమ్మ!
శిశిరమ్ములోనైన ఓ పిచ్చుకమ్మ
శిథిలమ్ము కా దాశ ఓ పిచ్చుకమ్మ!
త్రొచుపడగల నీడ నో పిచ్చుకమ్మ
తారసిల్లును ఆశ ఓ పిచ్చుకమ్మ!
అగ్నిపర్వతశిఖల నో పిచ్చుకమ్మ
ఆశ లాస్యము చేయు నో పిచ్చుకమ్మ!
నైరాశ్యమందైన ఓ పిచ్చుకమ్మ
తారాడునే ఆశ ఓ పిచ్చుకమ్మ!
ఆశయే లోకమ్ము ఓ పిచ్చుకమ్మ!
ఆశయే నాకమ్ము ఓ పిచ్చుకమ్మ!
ఆశతో వర్ధిల్లు మో పిచ్చుకమ్మ!!
ఆశీస్సు నీకమ్మ ఓ పిచ్చుకమ్మ!!!

## కోకిలమా!

"కోకో కోకో కోకిలమా!!



చిగురుల చాటున చెలగుచు, మెలగుచు చిక్కగ పాడే కోకిలమా!
తోపుల సందున దోగుచు, దాగుచు ఏపుగ పాడే కోకిలమా!
"కోకో -కోకో కోకిలమా!!
మాటల కందని తేటల తేనెలు ఊటలు కట్టే కోకిలమా!
పాటల కందని బాటల కవితను ధాటిగ నడిపే కోకిలమా!
"కోకో కోకో" కోకిలమా!!
చూపుల కందని సురలోకాలకు రూపులు దిద్దే కోకిలమా!
ఊహల కందని మోహనమూర్తికి ఊపిరి పోసే కోకిలమా!
"కోకో -కోకో కోకిలమా!!
మూలము తెలియని కాలావధులకు గాలము వేసే కోకిలమా!
మృత్యువు నెరుగని సత్యము నేదో మేదిని కిచ్చే కోకిలమా!
"కోకో కోకో కోకిలమా!!



## కవితా సామ్రాజ్యం

ఎవ రోహో! ఎవ రోహో! నా
కెదురు నిలుచువా రెవ రోహో!!
మాటల దివిటీలే పోటరి యీటెలుగా
దీటులేని నా పోరాటము చీకటి పై!
ఎవ రోహో! ఎవ రోహో! నా

కెదురు నిలుచువా రెవ రోహో!!
ఊహలు నా బంటులు, ఉపమలె సామంతులు;
కవితాసమ్రాట్టును, కప్పము రాసిక్యము!
ఎవ రోహో! ఎవ రోహో! నా
కెదురు నిలుచువా రెవ రోహో!!
వ్యోమమె నా ఛత్రము, భువియే సింహపీఠి;
నా యుగధర్మమ్మే నాదౌ రాజముద్ర!
ఎవ రోహో! ఎవ రోహో! నా
కెదురు నిలుచువా రెవ రోహో!!
ధ్వని నా పట్టమహిషి, ధామమౌ దిగంతము;
విభాత ప్రభలు నా ప్రేమల రోచిస్సులు!
ఎవ రోహో! ఎవ రోహో! నా
కెదురు నిలుచువా రెవ రోహో!!
కలలకు నాథుండను; విలువల నిర్ణేతను!
విశ్వమె నా వాటిక; విహరించ వెడలితి!
ఎవ రోహో! ఎవ రోహో! నా
కెదురు నిలుచువా రెవ రోహో!!
అందమ్ములు పంచుట, ఆనందము నించుట
నా రాజధర్మమై రారాజుగ చెల్లెద!
ఎవ రోహో! ఎవ రోహో! నా
కెదురు నిలుచువా రెవ రోహో!!

## నరుని బ్రతుకు

తిరిగి వచ్చు వాసరం, తిరిగి తెచ్చు వేసరం;
తిరిగి తిరిగి సంగరం, నరుని బ్రతుకు బొంగరం!
పోయె నొక్క వత్సరం, పోని డొక్క మత్సరం:
నురుగుగ్రక్కు నిర్దరం, నరుని బ్రతుకు జర్జరం!
ఒకనికంట కాతరం, ఒకనియెంట పోతరం:
అరుదు సుమ్ము నిబ్బరం, నరుని బ్రతుకు బర్బరం!

## నల్ల మబ్బులు

చెన్ను దరిగిన మిన్నులో నవి
తెన్నుగానక చిన్న వోయిన
వన్నెయేనుగు గున్నలా?
ఆటపట్టుల మేటి దాహము
గాటమై, కడుచేటు తేగా
నీటి కోసము ఏటికై-
గురుతు నెరుగని తెరువులో బడి
సరగుసరగున అరయగా నతి
బరువుగా నవి పరుగులా?
చెన్నుదరిగిన మిన్నులో నవి
తెన్నుగానక చిన్నవోయిన
వన్నెయేనుగు గున్నలా?

## పాఠాంతరం

ప్రభావిహీన నభములో నవి
ఇభములా? దారుణమ్ముగ
దాహమై, జల ధారకై
స్వచ్ఛ శీతల స్వర్ణ దీ సిత
వాహినీ తటము జేరగ దారికై అది
దైన్యమా? ప్రభావిహీన
నభములో నవి ఇభములా?

## పదలౌల్యం

గుయ్యారం! అయ్యో! చీకటి బుయ్యారం!!
బుయ్యారం పెంజీకటి ఉయ్యాలల సయ్యాటలలో.
అయ్యారే! నెయ్యాలకు, తియ్యాలకు
వియ్యాలకు, కయ్యాలకు గయ్యాళి గత్తరకు
చెయ్యూచుచు తయ్యారయ్యే దయ్యాల పెంజడల వయ్యారం!
గుయ్యారం! చీకటి బుయ్యారం!!
నుయ్యో, గొయ్యో తెలియని
బుయ్యారంలో కుయ్యో! మొర్రో!
దయ్యాల పెంజడల వయ్యారం!!

## నవ్వులు



నవ్వులె సృష్టికి నాందీవచనము!

నిజ మిది సకియా! నిజ మిది సఖుడా!!
అణువులు కూడగ, ఆకృతు లేర్పడ
దెసదెస నవ్వులు, ముసిముసి నవ్వులు
ప్రణవము పుట్టగ, ప్రాణులు కదలగ
ఇలనిల నవ్వులు, కిలకిల నవ్వులు
నవ్వులె సృష్టికి నాందీవచనము!
నిజ మిది సకియా! నిజ మిది సఖుడా!!
ఆమని విచ్చగ, ఆశలు రెచ్చగ
పకపక నవ్వులు, ప్రగతుల నవ్వులు
ప్రేమలు నిండగ, సీమలు పండుగ
కలకల నవ్వులు కవితల నవ్వులు
నవ్వులె సృష్టికి నాందీవచనము!
నిజ మిది సకియా! నిజ మిది సఖుడా!!
నవ్వులె సకియా! నభముల వెలుగులు!
నవ్వులె సఖుడా! నందనవనములు!!
పొడిచే పొద్దుకు పుత్తడి నవ్వులు:
ఇల కెల్లను మే ల్కొలుపుల నవ్వులు
వెన్నెలరేనికి పున్నమి నవ్వులు:
కలలను కదిపే కమ్మని నవ్వులు
నవ్వులె సకియా! నభముల వెలుగులు!
నవ్వులె సఖుడా! నందనవనములు!!
మబ్బుల అంచుల సిబ్బితి నవ్వులు:
దాగుడుమూతల మీగడ నవ్వులు
రేయికి జడలో రిక్కల నవ్వులు:
గుసగుసలాడే గుత్తుల నవ్వులు
నవ్వులె సకియా! నభముల వెలుగులు!
నవ్వులె సఖుడా! నందనవనములు!!
ఇంద్రధనుస్సున ఇంపుల నవ్వులు:
వంపులు తిరిగే సొంపుల నవ్వులు
తరగల నురుగుల తళతళ నవ్వులు:
ఊయల లూగే ఛాయల నవ్వులు
నవ్వులె సకియా! నభముల వెలుగులు!
నవ్వులె సఖుడా! నందనవనములు!!
మల్లియపొదలో కొల్లలు నవ్వులు:
చక్కిలిగింతల చిక్కని నవ్వులు
వల్లకిపాటకు పల్లవి నవ్వులు:
దిక్కులు నిండే చక్కెర నవ్వులు
నవ్వులె సకియా! నభముల వెలుగులు!
నవ్వులె సఖుడా! నందనవనములు!!
నవ్వులతోటల పువ్వులు కోయగ
రావే సకియా! రారా సఖుడా!!



తల్లుల కళ్ళను చల్లని నవ్వులు:
చల్లని వెన్నెల జల్లుల నవ్వులు
తండ్రుల గుండెల తరుగని నవ్వులు:
తరుగని ప్రేమల తనిపే నవ్వులు:
పిల్లల పెదవుల వెల్లువ నవ్వులు:
వెల్లువ డోలల వెల్లుల నవ్వులు
నవ్వులతోటల పువ్వులు కోయగ
రావే సకియా! రారా సఖుడా!!
జవ్వని సిగ్గుల మువ్వల నవ్వులు:
మువ్వలు మ్రోతల రవ్వల నవ్వులు!
యువకుని నడకల నవకపు నవ్వులు:
నవకపు శక్తుల నాట్యపు నవ్వులు తరుణీ
తరుణుల తలపుల నవ్వులు:
తలపుల మధువులు చిలికే నవ్వులు
నవ్వులతోటల పువ్వులు కోయగ
రావే సకియా! రారా సఖుడా!!
నవ్వులతోటల నాగులు తిరుగును!
భద్రము సకియా! భద్రము సఖుడా!!
అల్లరి పెట్టే అవ్వల నవ్వులు;
తప్పులు వెదకే తాతల నవ్వులు.
ఆరడి పెట్టే అత్తల నవ్వులు;
పెదవిని విరిచే వదినెల నవ్వులు
నవ్వులతోటల నాగులు తిరుగును!
భద్రము సకియా! భద్రము సఖుడా!!
చెక్కిట వేలిడు టెక్కుల నవ్వులు;
నిక్కము దాచే టక్కరి నవ్వులు
చేతుల చాటున చిలిపిగ నవ్వులు;
వేరొక నెపమున విసముల నవ్వులు

నవ్వులతోటల నాగులు తిరుగును!
భద్రము సకియా! భద్రము సఖుడా!!
లోకువ చేసే కాకుల నవ్వులు;
పేరులు పెట్టే పీసుల నవ్వులు





ఎక్కులు చెప్పే కుక్కల నవ్వులు;
వినయం మిక్కిలి నక్కల నవ్వులు
నవ్వులతోటల నాగులు తిరుగును!
భద్రము సకియా! భద్రము సఖుడా!!
అక్కరకోసం కొక్కెర నవ్వులు;
అక్కను పెంచిన రక్కసి నవ్వులు
"హూహూ హోహో
హుమాయి నవ్వులు;
"హీహీ - హేహే"
హిడింబి నవ్వులు
నవ్వులతోటల నాగులు తిరుగును!
భద్రము సకియా! భద్రము సఖుడా!!
స్వచ్ఛపు నవ్వులె స్వర్గము సకియా!
స్వర్ణ యుగమ్ముల శంఖము సఖుడా!!
కల్లల నెరుగని చల్లని నవ్వున
కరగదె రోసము విరుగదె ద్వేషము?
తేనెలు చిందే సోనల నవ్వున
చెరుగవె చింతలు? పెరుగవె ప్రేమలు?
స్వచ్ఛపు నవ్వులె స్వర్గము సకియా!
స్వర్ణ యుగమ్ముల శంఖము సఖుడా!!
కన్నుల నవ్వుకు క్రమ్మిన నీళ్ళును
నాట్యము చేయును నాకము సకియా!
క్రూరపు విధికిని కోరలు తీసే
మెలకువ నవ్వుకే తెలియును సఖుడా!
స్వచ్ఛపు నవ్వులె స్వర్గము సకియా!
స్వర్ణ యుగమ్ముల శంఖము సఖుడా!!
విబుధుడు గ్రీసున విషమును గ్రోలుచు
పరపిన నవ్వులు తరుగవు సకియా!
సిలువను చిందిన విలువల నవ్వులు
మాయక నిలుచును మహిలో సఖుడా!
స్వచ్ఛపు నవ్వులె స్వర్గము సకియా!
స్వర్ణ యుగమ్ముల శంఖము సఖుడా!!
శాంతిని కురిసిన శాక్యుని నవ్వులు
నిఖిలజగమ్ములు నిండును సకియా!
నవ్వుల తాతయె నాయకుడై మన
దేశపు దాస్యము తీర్చెను సఖుడా!
స్వచ్ఛపు నవ్వులె స్వర్గము సకియా!
స్వర్ణ యుగమ్ముల శంఖము సఖుడా!!

## ఒకనాడు...

ఒకనాడు, ఒకనాడు ఒకనాటి ఉదయాన
ఒక రైతు పొల మేగ ఒక జాము చెమ టోడ్చి
"మెక మొండు కలదమ్మ సకలమ్ము కబళింప
ఒక కంట కనిపెట్టు మిక" నంచు ప్రణమిల్ల,

తలయూచి వరిచేను "వల దోయి భయ మింక,
దయజూతు" నని పల్కె తళుకాడ కనుదోయి!
ఒకనాడు, ఒకనాడు ఒకనాటి నడిరేయి
ఒక పెద్ద ఋణదాత "ఒక రోజె కలదోయి
తనఖాకు గడు వింక శనిగాని తొలగించి,
గనిగడ్డ హరియింతు నని కీడు మదినెంచ,
ఇకిలించి ఒక ఘూక "మికనేల తడ" వంచు
కనుమూయు చిఋపులు గబళించె దయమాలి!!

## మబ్బుకన్నె

ఏమి లోపం మబ్బుకన్నెకు?
ఏల శోకం మేఘబాలకు?
కన్నుమరుగై మిన్ను తెరపై
కరగిపోయిన, తరిగిపోయిన,
పుటకగురుతే చిటిలిపోవగ

కటిక నేలకు రాలిపోయిన
ఏమి లోపం మబ్బుకన్నెకు?
ఏల శోకం మేఘబాలకు?
సంజతల్లులు సరిగచీరల
సారె కావడి పంప లేదా?
ముద్దుచేతుల మందపవనుడు
ముంగురులు సరిదిద్దలేదా?
ఏమి లోపం మబ్బుకన్నెకు?
ఏల శోకం మేఘబాలకు?
మెచ్చి మెరుపులు, వచ్చి వేణికి
కుచ్చుసవరం కూర్చలేదా?
తీర్చలేదా బాలచంద్రుడు
తీరుగా సితగంధతిలకము?
ఏమి లోపం మబ్బుకన్నెకు?
ఏల శోకం మేఘబాలకు?
కొల్లకొల్లలు మింటిచుక్కలు
మల్లెలై జడ విరియలేదా?
కన్నుచెదరే పూలపాలకి
మిన్నురాజే యెత్తలేదా?
ఏమి లోపం మబ్బుకన్నెకు?
ఏల శోకం మేఘబాలకు?
పిడుగుపిండులు దిక్కు లదరగ
పెద్ద భేరీ వెయ్యలేదా?
నెమలిగుంపులు విమలఫణుతుల
నృత్యకేళిని నెరపలేదా?
ఏమి లోపం మబ్బుకన్నెకు?
ఏల శోకం మేఘబాలకు?
కరగిపోయిన, సురిగిపోయిన,
కటికనేలకు రాలిపోయిన
కడలినాథుని చేరబోదా?
కన్నెచెరలను వీడబోదా?
ఏమి లోపం మబ్బుకన్నెకు?
ఏల శోకం మేఘబాలకు?

## కవితా!

సుందరాంగివని, ఇందురేఖవని ఎందరు
వలచిరొ, ఎందరు కొలిచిరి అందరాని ఓ కవితా!
అందరాని ఆనందరాశిపై ఎందరి వినతులు,
ఎందరి ప్రణతులు అందుకొంటివో కవితా!
యుగయుగాలకే ఉషోదేవివై నగాగ్రములపై
నర్తన చేయుచు ధగధగలాడిన కవితా!
భాషభాష కొక వేషభూషతో, భాషహద్దులను
రోసిన జిగితో భాసించిన ఓ కవితా!
జాతి జాతి కొక రీతిరీతితో, జాతీయమ్ముల
స్వాతివానతో ఖ్యాతిగన్న ఓ కవితా!
వేళవేళ కొక మేకర్తవై, వ్యాళకన్యలే
మేలుమే లనగ హేలచూపు ఓ కవితా!
కావ్యకావ్యమున నవ్యరూపవై, దివ్యసత్యముల
ధృతిని చాటగల భవ్యచరిత ఓ కవితా!
పలుకుపలుకులో కులుకు లొప్పగా ఇలాతలము
పై కళామధువులను చిలుకరించు ఓ కవితా!
వంద యజ్ఞముల ప్రణవనాదమున, వంద జన్మముల
బృందగానమున తొందరించు ఓ కవితా!
వేయి స్వప్నముల వేలాశాలల, వేయి లక్ష్యముల
వీణతంత్రుల హాయిగొలుపు ఓ కవితా!
లక్ష భావనల నిక్షేపముగా లక్ష యామినుల
నక్షయమ్ముగా భిక్ష పెట్టు ఓ కవితా!
కోటి కామనల తోటమాలిగా, కోటి ఆమనుల
మేటిపంటగా సాటిలేని ఓ కవితా!
ప్రమోదకలితా! ప్రసాదభరితా! సమానరహితా!
స్వధర్మసహితా! •! నమామి! ఓహో! కవితా!!
కలలలో రేయి కరగుచుండగా శిలలలో శివము
వెలయుచుండగా మొలకలెత్తు ఓ కవితా!
ఇలను చీకటులు తొలగుచుండగా, పిలుపులై
బ్రతుకు పిలుచుచుండగా కొలువుదీర్చు ఓ కవితా!
పుడమి లేజిగురు తొడుగుచుండగా ఎడదలో
వరద పొడుచుచుండగా వెడలబారు ఓ కవితా!
ఇనుడు సంభ్రమున మునుగు తావులో, కనులు
వెలుగుకై కనలు తావులో జననమందు ఓ కవితా!
గంగాయమునలు కలియు తావులో , నింగి
నేలలు పెనంగు తావులో తొంగలించు ఓ కవితా!
పొంగుకడలి నుప్పొంగు తరగపై రంగవల్లులై

పొంగు నురుగులో తొంగిచూచు ఓ కవితా!
చిందువెన్నెల మరందకుంజముల నందనమ్ములో
అందచందముల విందుచేయు ఓ కవితా!
రాలుచుక్కలో, ప్రేలువెల్గులో, సోలురేయిలో
లీలలీలగా జాలువారు ఓ కవితా!
వానమబ్బులో, చేనుదుబ్బులో ఈను
పైరులో సోనసోనలై తేనెలూరు ఓ కవితా!
కొండకోనలో, నిండు కొలకులో, ఎండమంపులో,
ఏటివంపులో పండియుండు ఓ కవితా!
జల్లువానలో, వానవిల్లులో, నల్లకలువలో,
కలువకళ్ళలో వెల్లివిరియు ఓ కవితా!
మించుతళుకులో, తళుకుమంచులో, అంచకులుకులో,
పలుకుకుంచెలో పొంచిచూచు ఓ కవితా!
చిన్నిపూవులో, కన్నెవలపులో, కన్నకడుపులో,
మిన్నువాకలో కన్నువిప్పు ఓ కవితా!
దోరపండులో, కేరుచిల్కలో, ఓరచూపులో,
మీరు సిగ్గులో తారసిల్లు ఓ కవితా!
లేగగంతులో, లేడిపరుగులో, మూగగొంతులో,
రేగునూహలో వేగిరించు ఓ కవితా!
గాలిపూవులో, జోలపాటలో, చీలుదారిలో,
తూలు బ్రతుకులో పూలుపూయు ఓ కవితా!
హిమాద్రిగళితా! సమీరదళితా! సుమాగ్రచలితా!
సుగంధవలితా! నమామి! ఓహో! కవితా!!
పొడిమాటకు పుప్పొడినద్దుటలో తడిగుండెకు
పుత్తడిహత్తుటలో వడిచూపెడి ఓ కవితా!
తడబడు నుడులకు బడి పెట్టుటలో, విడివడు
గొంతున గుడి కట్టుటలో వడుపుచూపు ఓ కవితా!
జడివానల దూకుడు చూపుటలో, గడియారపు
తాకిడి నాపుటలో గడుసుదనపు ఓ కవితా.!
శిశిరగర్భమున చిగిరించుటలో అశనిగర్జనల
వసియించుటలో కుశలవైన ఓ కవితా!
మధుమాసమ్ముల మంజులత్వమును, సుధాస్రవంతుల
సుందరత్వమును పదిలపరచు ఓ కవితా!
పరభృతానికే సరళగీతులను శరద్రాత్రికే
తరళరీతులను గరపనేర్చు ఓ కవితా!
ఆశ నిస్పృహల ఆవేగములో, హాసదుఃఖముల
ఆవర్తములో మోసులెత్తు ఓ కవితా!
శాంతిక్షోభల సంశ్లేషములో, కాంతి తమస్సుల
గాంధర్వములో గొంతువిప్పు ఓ కవితా!
ప్రణయవిరహముల వక్రఖేలలో, జననమరణముల
చక్రడోలలో తొణకుచుండు ఓ కవితా!
సుప్తి జాగృతుల లిప్తావధిలో, జ్ఞప్తి విస్మృతుల
తప్తాంబుధిలో వ్యాప్తినందు ఓ కవితా!
వ్యక్తావ్యక్తత రక్తిమమ్ములో,
తికమాధురీసికసీమలో శక్తిచూపు ఓ కవితా!
నష్టజాతకుని అష్టకష్టములు, భ్రష్టనరుని
సంక్లిష్టభావములు స్పష్టపరచు ఓ కవితా!
సృష్టిలో ప్రేమవృష్టిరీతులకు, వ్యష్టిలో
మహారిష్టభీతులకు ద్రష్టవైన ఓ కవితా!
క్రూరసంఘముల కోర వంచగా, ధారుణీరిపుల
త్రాడు తెంచగా పోరు సలుపు ఓ కవితా!
రుద్రభూమిపై భద్రకుంభమును, క్షుద్రజీవి
పై అద్రిశృంగమును ముద్రవేయు ఓ కవితా!
వేదఋక్కులో విశ్వశ్రేయము, స్వాదుగీతిలో
నాదబ్రహ్మము పాదుకొలుపు ఓ కవితా!
గోళగతులతో తాళసప్తకము, కాలరతులతో
గాన రభము మేళమించు ఓ కవితా!
అణువులోనే విశ్వాంతరాళమును; కణములోనె
ఉభిరాస్తులను వణకజేయు ఓ కవితా!
జరామృతులనే పరాభవించుచు పురాపుణ్యముల
పరాకాష్ఠనౌ సురాంగనా! ఓ కవితా!!
సమాజజనితా! జనాళివినుతా! మేయమహితా!
అమోఘచరితా! నమామి! ఓహో కవితా!!

## జీవితగీత

కేరింతలు, గిరిగింతలు, చిట్టిదాని చిలిపి
చేష్ట తుళ్ళింతలు జీవితసౌభాగ్యానికి
శ్రీకరస్వాగత మౌనా?
ఔను! ఔను! నిజమౌను!!

గిలిగింతలు, కికురింతలు, చిన్నెలాడి
చిరునవ్వుల కొసరింతలు జీవిత ప్రాగల్భ్యానికి
జిలుగుల సాక్ష్యం బౌనా!
ఔను! ఔను! నిజమౌను!!
లాలింపులు, తేలింపులు, కన్నతల్లి
కళ్ళవెలుగు దీవింపులు జీవితసాఫల్యానికి
పావనహారతు లౌనా?
ఔను! ఔను! నిజమౌను!!
ఇగిరింతలు, చిగిరింతలు, కొమ్మకొమ్మ
కోమరించిన పూబిందెలు జీవితనిత్యత్వానికి
చెరుగని సూచన లౌనా?
ఔను! ఔను! నిజమేను!!

## నిద్రాదేవి

ఇంత బెదరేలనే నిదురా?
వింత వెలిగేలనే నిదురా?
ఇరులలో కనువిచ్చు చిఋమెరపుతీవలా,
సురకాంతకబరిలో వి రిదండతావిలా
దరిదాపులకు వచ్చి, తరితీపులను తెచ్చి
ఇంత బెదరేలనే నిదురా?
వింత వెలగేలనే నిదురా?
మూతవడ కన్నులను ముద్దులాడగబోయి,
చేతనమ్ములుదప్ప చెంత జేర్చగబోయి,
అడుగు వెనుకకువేయ, ఆశోపహతుజేయ
ఇంత బెదరేలనే నిదురా?
వింత వెలగేలనే నిదురా?
గగనవీధుల వచ్చి, బిగికౌగిటను గ్రుచ్చి,
చిగిరించు చంద్రికల చిత్రలోకము జేర్చి,
కామితమ్ముల గూర్చు కలల దేల్చగ నేర్చి
ఇంత బెదరేలనే నిదురా?
వింత వెలిగేలనే నిదురా?
స్వర్గమర్త్యమ్ములకు స్వర్ణ సేతువు కట్టి,
సంక్షుభిత జీవులకు శాంతిభిక్షను పెట్టి
రంజించు భామవై రక్షించు దేవికై
అరవిందమధురోష్ఠ, దరహాసరేఖగా,
వరదాయినీనేత్ర శరదిందులేఖగా లాలించి,
పాలించి సోలింల జాలియు
ఇంత బెదరేలనే నిదురా?
వింత వెలిగేలనే నిదురా?

## నరజన్మ

దిక్కుల పర్వగ రెక్కలు లేవని
బిక్క మొగమ్మును పెట్టగ నేలా? చుక్క దారులనె
చొచ్చుకుపోయే ఉక్కుమగంటిమి ఊహలు లేవా?
చక్కగ వెలిగే రిక్కను కానని
అక్కరమాలిన అలమట లేలా? దిక్కు దిక్కులకు
దీప్తుల నిచ్చే పెక్కు హొరంగుల ప్రేమలు లేవా?
రెక్కలు తొడిగిన రిక్కవు నీవే!
చిక్కదనమ్ముల సీధువు నీదే!! రిక్కకు వెల్లుల రెక్కవు
నీవే! చక్కదనమ్ముల జన్మము నీదే!!

## జగన్నాటకం

చీకటి వెల్గులు, ఆకలి తృప్తులు
అలలై లేచును, కలలై పూచును
మిన్నులలో, కన్నులలో
ఎండలు వానలు, ఈసులు ప్రేమలు
జడలై పెనగును, సుడులై తిరుగును
కొండలలో, గుండెలలో
లోక మలోకము, శోక మశోకము
కనులై విచ్చును, ధ్వనులై రెచ్చును
బాటలలో, బ్రతుకులలో
సత్యమసత్యము, నిత్య మనిత్యము
హలమై దున్నును, పొలమై పండును
జగములలో, యుగములలో

## పిలుపు

రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! రావోయి! రత్నదీపాకరా!!
నీవె బ్రతుకని యెంచి, నీ పుంతలో పొంచి
కోటికోర్కెల రేయి కొసరుసిగ్గుల మించు
రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! రావోయి! రత్నదీపాకరా!!
నీ తెన్నులను కాచి, నీ చెన్నులను దోచి
కోటికన్నుల మిన్ను మేటినవ్వులు పూచు
రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! రావోయి! రత్నదీపాకరా!!
నీ సౌరులను మెచ్చి, నిన్ను కౌగిట గ్రుచ్చి
కోటిచేతుల కడలి కూర్మి నూయల లూచు
రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! రావోయి! రత్నదీపాకరా!!
నీతొ పందెము కట్టి, నిన్ను చెంగున పట్టి
కోటి జిలుగుల మబ్బు కులుకులను చూపెట్టు
రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! రావోయి! రత్నదీపాకరా!!
నిను మామగా దలచి, నీ రాకకై వేచి
కోటి ముద్దుల పాప ఆటలాడగ బిలుచు
రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! రావోయి! రత్నదీపాకరా!!
పాలకడవను వంచి, ప్రాణికోటికి పంచి
కోటి గుండెలలోన చోటు సంపాదించ
రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! 'రావోయి! రత్నదీపాకరా!!
గతి వేరులేనట్టి కడగొట్టు పూరింట కోటి
ప్రేమలతోడ కోరి దీపము పెట్ట
రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! రావోయి! రత్నదీపాకరా!!
కలగన్న పాపాన గాసిలితి లోకాన
కోటితంత్రుల వీణ మీటగా నాలోన
రావోయి! రావోయి! రాకాసుధాకరా!
రావోయి! రావోయి! రత్నదీపాకరా!!

## ఆధిక్యం

ఒక్కెడ తిమిరము, ఒక్కెడ వెలుతురు:
చిక్కన మాత్రము చిందీచిందని చిరునవ్వదె!
మెద డొక దిక్కున, ఎద యొక దిక్కున,
గరిమము మాత్రము జారీజారని కన్నీటిదె!
అయ్యది సత్యము, ఇయ్య దసత్యము:
స్నిగ్ధత మాత్రము పలికీపలకని శిల్పానిదె!
జడ మొక చెంపను, జవ మొక చెంపను:
విజయము మాత్రము కూడీకూడని బీజానిదే!
అయ్యది నిత్యము ఇయ్య దనిత్యము:
భవ్యత మాత్రము కట్టీకట్టని బంధానిదె!
బ్రతు కొక వైపున మృతి యొక వైపున
సఫలత మాత్రము కరగీకరగని స్వప్నానిదె!
అజాండ మావల, అణు వీవలగా:
పూర్ణత మాత్రము విచ్చీవిచ్చని పుష్పానిదె!

## సభ్యనరుడు

ఓయి! ఓయి!మానవా! పచ్చి
బోయి వోయి మానవా!!
లేదు చేత విల్లు నేడు, లేదు విషపుబాణమైన; తినవు
పచ్చిమాంస మిపుడు, వినవు పులుల గర్జనమ్ము!
చార లింక చెరుగవేల? కోర లింక పెరుగునేల?
ఓయి! ఓయి!మానవా! పచ్చి
బోయి వోయి మానవా!!
కొట్టినావు అడవు లన్ని పట్టినావు హలము చేత;
మిన్నుముట్టు నగరు నీది, కన్నుకుట్టు సిరులు నీవి,
దారు లింక కొట్టనేల? దైత్యపథము మెట్టనేల?
ఓయి! ఓయి!మానవా! పచ్చి
బోయి వోయి మానవా
విద్య లెంతొ విస్తరించే, విస్తరించే శాస్త్రపరిధి;
నిశితమయ్యె నీదు బుద్ధి, విశదమయ్యె సృష్టిరీతి:
చేదు లింక విరుగ వేల! ఖేద మింక తరుగ దేల?

ఓయి! ఓయి!మానవా! పచ్చి
బోయి వోయి మానవా!!
నదులు నిలుచు నీదు సేవ, చదల నేలు శక్తి నీది;
శంప నీకు చరణదాసి, శరణు జొచ్చె అణువుకూడ:
జంకు లేల యెదదలోన? బొంకు లేల బ్రతుకులోన?
ఓయి! ఓయి!మానవా! పచ్చి
బోయి వోయి మానవా!!
కలవు నీకు దేగకళ్ళు, కలవు నేదు పాముచెవులు;.
ఈదగలవు చేపవోలె, ఎగురగలవు పులుగువోలె,
నరునివోలె బ్రతుకలేవె? పరులు మేలు కోరలేవె?
ఓయి! ఓయి!మానవా! పచ్చి
బోయి వోయి మానవా!!

## "కొక్కొరొకో!"

"కొక్కొరొకో! కొక్కొరొకో!"
చీకటి గుండెలు చెదరిపోవగా
వేకువ పెట్టిన వెలుగుకేకలా
"కొక్కొరొకో! కొక్కొరొకో!"
జడప్రవృత్తులు గడగడ లాడగ
వడిగా దూసిన వాడిబాకులా
"కొక్కొరొకో! కొక్కొరొకో!"
సద్దుల నెరుగని పొద్దుల కడుపున
నిద్దుర నుడిగిన పెద్ద తరగలా
"కొక్కొరొకో! కొక్కొరొకో!"
తెల్లవారెనని పల్లెహవేలికి
వెల్లడి చేసే వెండిగంటలా
"కొక్కొరొకో! కొక్కొరొకో!"

## కవికి....

మాటలే కవికి ఆటలు, గుండెల మీటలు
పాటలే కవికి బాటలు, భావికి కోటలు
నీడలే కవికి ఓడలు, బ్రతుకుల ఊడలు
వెల్లులే కవికి జిల్లులు, బంగురు పులులు
అందమే కవికి పందెము, జీవిత కందము
నాదమే కవికి మోదము, మూడవ వేదము
గానమే కవికి పానము, పుష్పక యానము
లోకమే కవికి నాకము, అనుభవ పాకము
వలపులే కవికి గెలుపులు, రేపటి పిలుపులు
న్యాయమే కవికి ధ్యేయము, సురాధి పత్యము
తత్వమే కవికి స్వత్వము,
సదాశి వత్వము.

## ఇల్లాలు

ఘల్లు ఘల్లు నూపురం
మల్లెపూల గోపురం
ఉల్లమందు శ్రీపురం
చల్లనైన కాపురం

## నవోదయం

చీకటి తెర తొలగునులే!
ఇక నీ
వాకిట సిరి వెలుగునులే!!
రే పన్నది వచ్చునులే
ఆపన్నుల మెచ్చునులే
కన్నుల తడి నొత్తునులే
చిన్నగ నొడి కెత్తునులే
చీకటి తెర తొలగునులే!
ఇక నీ
వాకిట సిరి వెలుగునులే!!

చిత్తము చిగు రొత్తునులే
ఎత్తుగ ధ్వజ మెత్తునులే
సత్యము పురి విప్పునులే
నృత్యము ధర నొప్పునులే
చీకటి తెర తొలగునులే!
ఇక నీ
వాకిట సిరి వెలుగునులే!!
కత్తికి చెద పట్టునులే
క్రౌర్యము తుదముట్టునులే
ఆశలు తల లెత్తునులే
ఆర్తులు పరువెత్తునులే
చీకటి తెర తొలగునులే!
ఇక నీ
వాకిట సిరి వెలుగునులే!!
నవశకమే విరియునులే
నవ్యాభ్రము కురియునులే
న్యాయం బిల నిలుచునులే
నవజీవము పిలుచునులే
చీకటి తెర తొలగునులే!
ఇక నీ
వాకిట సిరి వెలుగునులే!!

## ప్రశ్న

ఎందుకో, ఎందుకొ?
ఇంతగ
తొందర లెందుకొ?
దళములు విచ్చగ
త్వరగా తానొక పూవై
తనరగ లేదని
తపనము జెందే మొగ్గకు
దక్కే పెన్నిధి తలచగ నేమిటో?
ధర రాలుటెగా! రెక్కలు
ఎందుకొ, ఎందుకొ?
ఇంతగ
తొందర లెందుకొ?

నీరదసుందర నిభృత
స్వప్నము నీరై నిర్ఝరమై,
నా నిధనత బాపగ లేదని
నిరతము చింతిల
నిలిచే దేమిటి నిజముల
నీరసమేగా?
ఎందుకొ, ఎందుకో?
ఇంతగ
తొందర లెందుకో?
పరుగులు వెట్టుచు,
నురుగులు క్రక్కుచు, రేపును
చరచర, బిరబిర
తరుముక పోవగ, నేటికి
బరువుగ నొడిలో వొరిగే
దేమిటో? నిన్నె సురుగుటె కాదా!
ఎందుకొ, ఎందుకొ?
ఇంతగ
తొందర లెందుకొ?

## నే మరణిస్తే

... నే మరణిస్తే...
రాస్తాయండీ, రాస్తాయి
కొన్ని పత్రికలైనా
ప్రముఖుం డొక్కడు
పరలోకానికి
పయనించాడని
నే మరణిస్తే...
అంటారండీ,
అంటారు నేడు
తెలుగుజాతికే
తీరని నష్టం
వాటిల్లిందని
నోటిమాటగా -
నే మరణిస్తే...
చేస్తారండీ, చేస్తారు,

పెక్కు ఆంధ్రసభల
నా ఆత్మశాంతికై
తడయక తెగ
బా రెడు' తీర్మానం
నే మరణిస్తే...
వస్తాయి సుమా!
వస్తాయి, కొన్ని
ప్రకటనలైనా
ప్రజాకోటి నా
స్మారకచిహ్నం స్థాపించాలని
నే మరణిస్తే...
రాను, నిజంగా
రాను సోదెలో
కైనా గిర్రున
అయిదారు నెలలు
తిరగకముందే
తెలుగుగడ్డపై
నే మరణిస్తే...
ఏ నా పాటో,
ఏ యెదలోనో
చిక్కని చీకటి
చీల్చగ పెట్టిన
దీపము మాత్రమె
దీటుగ నిలుచును
నే మరణిస్తే .....

## నవభారతం

ఆవహించిం దావహించింది
ఆదిశక్తి మహాశక్తి పరాశక్తి
ప్రజాశక్తి అఖిల భారతాన్నే
ఆవహించిం దావహించింది!
శరభ! శరభ! అ
శ్శరభ! శరభ!!
అణువణువున ఆవేగం!
అజాండమందే ప్రచండోద్వేగం!
కలత నిద్రలో ఉలికిపడుతున్నది ఆదికిరి!
లాలసత్వంనుంచి
తూలుతున్నది సురపురి!
కులగిరు లొక్కుమ్మడిగా చలించిపోతున్నవి!
ఈదురుగాలిలో ఇగురాకు వలె
చలించిపోతున్నది ఇలాతలం!
శరభ! శరభ! అ
శ్శరభ! శరభ!!
సివ మెత్తినట్టు దివికంట రివ్వున
పొంగిపోతున్నది గంగాభవాని!
త్రివేణిలో త్రిలోక భీకర తీవ్రవర్తాల్!
తపతిలో తప్తకాసారాల్!
నర్మద నడకలలో నిజ
ధర్మం తప్పిన ఔద్ధత్యం!
గౌతమి అఖండ గర్భంలో ఆ
విర్భవించె బడబానలం!
కృష్ణాస్రవంతిలో ఉష్ణోద్వేగం!
తుంగభద్ర మహోత్తుంగ
పెన్నానదికి వెన్నులో పెద్దశూల!
కావేరిని కప్పుతున్నవి
ఘనాఘనాలు, తామ్రపర్ణిని
ధరాధరాలు! ఆవహించింది
ఆదిశక్తి, మహాశక్తి,
ఆవహించింది పరాశక్తి,
ప్రజాశక్తి అఖిలభారతాన్నే
ఆవహించిం దావహించింది!
అదిగో! అల్లదిగో!
ఇంద్రప్రస్థంపై ఇసుక
తుపాను ప్రయాగలో
ప్రళయ ప్రభంజనం!
భంగమ్ములపై నెత్తురుజీరలు!
ఆగ్రాపై మహోగ్ర ధారాపాతం!
అవంతిపై అశనిపాతం!
గౌహతిలో ఘన భూకంపం
పూనా నడినె త్తిని పొడిచింది

తోకచుక్క! పాట్నాలో
పట్టపగలే చుక్కలు
అయోధ్యలో భయోత్పాతం!
కాశీ దశాశ్వమేధ ఘట్టంలో
కాకులగోల! ఉదయపూర్
రాణ్మందిరాల ఉలూకాల
మహోత్సవం!
నాగపూర్ నడివీథిలో నక్కల కూతలు!
కోణార్కలో కుక్కల యేడ్పులు!
శరభ! శరభ! అ
శ్శరభ! శరభ!!
కాళీఘట్టం మహాకాళి కంఠీరవ గర్జన!
కాశీ అన్నపూర్ణ కరగృహీత కలశానికి కంపం!
కంచి కామాక్షి మణి కంధరంలో రుధిరగంధం!
మధుర మీనాక్షి మందస్మిత
వదనంలో మహాగ్లాని!
కనకదుర్గ కలువ కంటిలో ఎఱ్ఱనిమంట!
విశ్వేశ్వరు దీర్ఘ నిశ్వాసంలో వడగాడ్పులు!
భీమేశ్వరు విశాలఫాలంలో భ్రుకుటీ విక్షేపం!
భద్రాచల రామ భద్రుని గర్భాలయంలో భైరవ ఘీంకారం!
శరభ! శరభ! అ
శ్శరభ! శరభ!!
ఇటు చూచిన, అటు చూచిన,
ఎటు చూచిన చిటపట మంటలతో
పెటిలిపోతున్నవి కటికి గుండెలు!
ఇటు నటు ఎటు చూచిన
ఫెళఫెళ ఫెళ ఫెళ విరిగిపోతున్నవి
పిరికి బ్రతుకుల పెళుచు కొమ్మలు!
పుట్టకీట్లతో కదులుతున్నవి
పూర్వపు విశ్వాసాల్!
నిట్టనిలువునా కూలుతున్నవి
నిన్నటి విలువలు! నట్టే
కలుస్తున్నవి గుట్టలుగా, మిట్టలుగా
నెట్టువడిన నైచ్యాలన్నీ!
శరభ! శరభ! అ
శ్శరభ! శరభ!!

విలయంబని ప్రళయంబని
వలవల వలవల విలపిస్తున్నారు –
కలలకు దూరమ్మై, చలనానికి శత్రువులై,
శిలలై, ఖలులై చావలేక
బ్రతుకుతున్న చచ్చుపీన్గులు!!
విలయంబని, ప్రళయంబని
కలలకు నోచని, కదలిక నెరుగని
శిల లెంతగ, ఖలు లెంతగ
విలపించిన విలయం కాదిది,
నవజీవన చలనం! ప్రళయం
కాదిది, ప్రజాయుగ ప్రాదుర్భావం!!
అదిగో! అల్లదిగో!!
గడగడ వడంకుతున్నది
వింధ్యాగ్రంపై నవయుగ
సంధ్యారాగం మిలమిల
మెరుస్తున్నది హిమాచలం
పై మహేంద్రచాపం! ప్రాక్పశ్చిమ
పర్వతాలలో ప్రభవిస్తున్నది ప్రజాశకం!
కన్యాకుమారికే కల్గుతున్నది
కళ్యాణం పై మక్కువ! విరించి
విరచిస్తున్నాడు వి నూత్న కావ్యాల్!
వల్లకాడు సయితం పల్లవిస్తున్నది!
పూస్తున్నవి కొత్త కొత్త పువ్వులు
పాత సామ్రాజ్యాల సమాధులపై!
శరభ! శరభ! అ
శరభ! శరభ!!
రాజులు తరాజులై తరలిపోయారు!
జమీందార్లు, జాగీర్దార్లు, మాల్
జార్లు మటుమాయ మయ్యారు!
ప్రజకే జరిగింది పట్టాభిషేకం!
చాతుర్వర్ణమ్ ఇనుప చట్రం సడలిపోతున్నది!
కులతత్వ పిశాచం తొలగి పోతున్నది!
పరశురామునికి జరుగుతున్నది
మరొకసారి పరాభవం! శంబుకుని
క్షమాభిక్ష అర్థిస్తున్నాడు అయోధ్యారాముడు!

మనువు నడుస్తున్నాడు మరింత వెనక్కు!
మానవుడు వెడుతున్నాడు
మహావేగంతో ముందుకు!!
ఎక్కలేదు కుబేరు డిక నరవాహనాన్ని!
నక్క జిత్తులతో నా కేశుం డికమీదట
స్వారాజ్యాన్ని సంరక్షించుకో లేదు!
వేళ తప్పకుండ వేడి వేడిగా
పంచభక్ష్య పరమాన్నాల్ తేరగా
వడ్డించనందుకు దుర్వాసుం డికమీదట
పెట్టలేదు సుమీ పిచ్చిశాపాల్!
హతుడయ్యు జితుడు కాలేదు గాంధీజీ!
పతితులైన వారు వెతకినా కనబడని
మంచిరోజు మన మందరం
చూడబోతున్నాం! స్వాతంత్ర్యం
సంతర్పణ జరుగుతున్నది!
సమతా సమారాధన సాగుతున్నది!
సోషలిజం వేద సూక్తమై చెల్లబోతున్నది!
సౌహార్దం, సౌభ్రాత్రం నేల
నాల్గు చెరగుల నెలకొనబోతున్నవి!
శరభ! శరభ! అ
శరభ! శరభ!!
వందలాది భగీరథులు ఊసరక్షేత్రాలను
ఉద్యానాలుగా చేస్తున్నారు!
వేలకొలది విశ్వకర్ములు
మహారణ్యాలను మయసభలుగా
మార్చుతున్నారు! ధనంజయులు,
ధన్వంతరులు, ధర్మవ్యాధులు
బాసటగా నిలుస్తున్నారు భారత
ప్రజానీకానికి పంచవర్ష ప్రణాళికలలో
బయల్పడుతున్నవి భావి భారత భాగ్యరేఖలు!
పల్లెపల్లెకు ప్రాకుతున్నవి
వెల్గు తీగలు! సీమసీమలో
చిందుతున్నది నవచైతన్యం!
సింద్రీ, పెరంబూర్, చిత్తరంజన్
కొత్తగ, ఉవ్వెత్తుగ వెలసిన
మన కోవెల లోయ్!
నంగల్, హీరాకుడ్, నాగార్జునసాగర్
ఆర్తిని బాపే, అర్థము లిచ్చే
నవ తీర్థము లోయ్! నేటికి, ఈ
ముంగిటలో బంగరు ముగ్గులు!
నేటికి, ఈ నాటికి మన దేశంలో
చిందెడి దివ్యత్వం:
కను మదిగో! నవభారత
మహోదయం!! విను మదిగో!
నవయుగ శంఖారావం!!! (1957)

## "నవ్వకే! నవ్వకే!"



నవ్వకే! నవ్వకే! నొవ్వజేయగ మమ్ము
నవ్వకే నక్షత్రమా!
అంతరిక్షమునందు
వింతసాక్షిగనిలిచి
నవ్వకే! నవ్వకే! నొవ్వజేయగ మమ్ము
నవ్వకే నక్షత్రమా!
త్రుటిపాటి సిరులకే
త్రుళ్లు బ్రతుకులు మావి;
పొగరు మా నడకలకు
పొగ లెగయు మా తల్లి
మము జూచి, మముగన్న
మా భూదేవి జూచి
నవ్వకే! నవ్వకే! నొవ్వజేయగ మమ్ము
నవ్వకే నక్షత్రమా!
కుటిల విద్వేషాల కటికబ్రతుకులు మావి;
మా పాపపంకాల మలినమౌ మా తల్లి
మము జూచి మముగన్న
మా భూదేవి జూచి!
నవ్వకే! నొవ్వజేయగ మమ్ము
నవ్వకే నవ్వకే నక్షత్రమా!
నిండు చీకటిలోనే

పండునవ్వులు నీకు
చీకుచింతలనైన స్నిగ్ధహాసపు
విద్య నేర్పకుండగ మాకు
నింగిపై కూర్చుండి!
నవ్వకే! నొవ్వజేయుగ మమ్ము
నక్షత్రమా! నవ్వకే నవ్వకే

## చిరశత్రువు



నరునికి నరుడే చిరశత్రువురా!
అందము చిందెడి, అర్థము లిచ్చెడి అవనీతలమున
నరునికి నరుడే చిరశత్రువురా!
స్వార్థము పెంచిన, స్పర్థలు తెచ్చిన సంఘర్షణంతో
నరునికి నరుడే చిరశత్రువురా!
మతముల పేరిట చితులను పేర్చెడి
మౌఢ్యము కతమున
నరునికి నరుడే చిరశత్రువురా!
నిన్నటి నీతులు, మొన్నటి నియతులు
నేటిని బలిగొన.
నరునికి నరుడే చిరశత్రువురా!
ప్రేమము గల్గియు, క్షేమము గోరియు
పట్టెడు మెతుకులకే తామసవశమున
అల్లాడే దీనుల
నరునికి నరుడే చిరశత్రువురా!
ఇల్లు చేరునేమో ! సభ్యత హెచ్చియు,
సంస్కృతి పెరిగియు పిచ్చివూహ లేవో!
నరునికి నరుడే చిరశత్రువురా!
రాతికె మమతుంటే
శాప మదేమో రెచ్చిపోవు నాలో.

## పిచ్చి వూహలు

పిచ్చివూహ లేవో
రెచ్చిపోవు నాలో!
కత్తికె కన్నుంటే
నెత్తురు చూడగనే
ఒళ్లు తిరిగి ఉర్వికి
ఘల్లున పడునేమో!



రూకకె నోరుంటే
రెచ్చిపోవు నాలో!
వాక్యుల చిత్తముతో
"కొంపలు నా పేరిట
కూల్చకు" మను నేమో!
పిచ్చివూహ లేవో
రెచ్చిపోవు నాలో!
పిచ్చివూహ లేవో
నాలో!రెచ్చిపోవు
గోడకె చెవులుంటే
మేడల బ్రతుకులలో
గుట్టుమట్టు లెన్నిటి
రట్టుకు తేగలదో!
పిచ్చివూహ లేవో
రెచ్చిపోవు నాలో!
మాణిక్యాలై మన
మాగాణుల బడునో!
రాతికే నమతుంటే
నాతిగ మలచగనే
తరుణశిల్పి
యెదపై ఒరిగిపోవు నేమో!
పిచ్చివూహ లేవో
పిచ్చివూహ లేవో
రెచ్చిపోవు నాలో!
కలకే బలముంటే
విలువలు తలక్రిందై
కవి కోరే స్వర్గము
భువికే దిగునేమో!

పిచ్చివూహ లేవో
నింగి జల్లె డైతే
రంగుల చుక్క లెన్ని
ఆకాశపు టంచులు
దాటిదాటి ఏ మధు
వాటిక చేరుదునో!
నాకే రెక్కలున్న
పిచ్చివూహ లేవో
రెచ్చిపోవు నాలో!

## గోమాత



గోమాతా!
నీ సుధాధారే సృష్టికి భిక్ష!
గోలక్ష్మీ!
నీ కడుపుపంటే
పృథ్వికి రక్ష;
గోదేవీ!
నీ జీవితమ్మే
కృపార్ద్రవీక్ష!

## నిశీథిని

ఓ నిశీథినీ!
ఓ మహాయోగినీ!
అశేషకరుణా విలాసినీ!
జీవితంపు వేనవేల వెతలతోడ విసిగిపోయి,
శ్రాంతికై ప్రతియొక దివసాంతమందు
పరితపించు చరాచర ప్రాణికోటి
నక్కున గదించి, నీ మృదులాతి మృదుల
నీ హస్త డోలికలందు నుయ్యాల లూచి,
నిద్రపుచ్చి, శతసహస్ర నేత్రతతిని
ప్రేమతో విప్పి, వేకువ వేళవరకు
రెప్పనైన వాల్చక తల్లిరీతి బ్రోచు
విమలచరిత వయ్యు, అదేమి విధివిపాక
మమ్మ జరతోడ, మృతితోడ, అనృతవాక్కు
తోడ, అజ్ఞానకూపమ్ముతోడ పోల్చి
నిన్ను నిరసించుచుందును నిత్య మీ
కృతఘ్ను లోకమ్ము! రాకాసుధాకరాంశు
కలిత లావణ్యరాశీ! మృదుల దృగంచలా!
సుహాసినీ! జారచోరగణములకు
నీవు ప్రీతిపాత్రవనుచు, నిను పిశాచ
బృందమే కొల్చునంచు, ఆభీల దైత్య
వర్గమే నిన్ను మనసార వలచునంచు
నిరసనగ పల్కువారిలో నీ మహా గ
భీర నిశ్శబ్దతాపూర్ణ విమలచిత్త
వృత్తిపట్ల అకారణ భీతు లేవా
దాగి, మూగి యుండుననుట తథ్య మమ్మ
కారుచీకటి తెరలతో కన్ను కప్పి
గ్రుడ్డితనమ్ముల తెత్తువనుచు కోపగించు
కొనెడువారు కాన రదేమొ కోటికోట్ల
యోజనమ్ముల దూరాన తేజరిల్లు
దివ్యలోకాలనైన మా దృష్టిపథము
నందు నిల్పగల్లెడి విశిష్టాతిరేక
శక్తి నీకె కల దటంచు

## ఉన్నారా?

వచ్చీరానీ మాటలు వి
చ్చివిచ్చని పూవులు
నచ్చనివా రున్నారా?

మది మెచ్చనివా రున్నారా?



చెరిగీ చెరగని పొద్దుల,
 దరిసీదరియని వొద్దుల
కరగనివా రున్నారా?
మై మరవనివా రున్నారా?

ఊరీఊరని తేనెకు
ఆరీఆరని ఆశను
చేరనివా రున్నారా?
నో రూరనివా రున్నారా?
చిక్కిచిక్కని పండుకు,
దక్కదక్కని ప్రేమకు
మొక్కనివా రున్నారా?
కై పెక్కనివా రున్నారా?

చీలీచీలని దారుల
వాలీవాలని వయసుల
తూలనివా రున్నారా?
యెద కాలనివా రున్నారా?

చేరీచేరని మేరల
 తేరీ తేరని కలకై
పోరనివా రున్నారా?
వే సారనివా రున్నారా?

## "ధనమూల మిదం జగత్"

నిట్టూర్పుకు, బిట్టూర్పుకు
కట్టెదవా కాసులతో విలు వెంతో?
కన్నీటికి, మున్నీటికి
వెదకెదవా వినియోగా లేవేవో?




చిరునవ్వుకు చెంగల్వకు
పేర్కొందువె మార్కెటు ధర ఏమాత్రమొ?
కవనానికి, హవనానికి
పెట్టెదవా చిట్టా ఆవర్జాలను?
తరగల పై, నురుగుల పై పంచెదవా
వాటాదార్లకు లాభం?
లేసంజను వాసంతిని వాడెదవా
వడ్డీ వ్యాపారానికి?

## సిగ్గేల నేలా?

సిగ్గేల నేలా? లోలో
బెగ్గేల నేలా?
శశవిషాణమును
సాధించుటకై
కాళ్ళకు బలపము
కట్టినందులకు
సిగ్గేల నేలా?



వేసట నెరుగక
వెదకిన వస్తువు
కలికముకైనను
కనబడలేదని
బెగ్గేల నేలా?
అపురూపానికి
అలమట చెందక
 నరుడు నరుడుగా
పెరుగనేర్చునా?
సిగ్గేల నేలా? లోలో
 బెగ్గేల నేలా?
గగనపుష్పమును
గాలించుటలో.
కాలము నంతయు
గడపినందులకు
సిగ్గేల నేలా?
 అలసి సొలసినా,
కలయ వెదకినా
కోరినదానిని
ఆరయలేదని
బెగ్గేల నేలా?

అందనిదానికి
అఱ్ఱులు సాచక
నరుడు నరుడుగా
పెరుగ నేర్చునా?
సిగ్గిల నేలా? లోలో
బెగ్గిల నేలా?
పరుసవేదికై
పరిశోధించుచు
దేశదేశములు
తిరిగినందులకు
సిగ్గిల నేలా?
ఎక్కడ తిరిగిన,
తగ వెదకిన
పరుసవేదియే
దొరకలేదనుచు
పగటి కలలతో
పాలనురుగుతో
గాలి మేడలను
కట్టినందులకు
సిగ్గలనేలా?
నింగిచివరలో
లంగరువేయక
నరుడు నరుడుగా
పెరుగ నేర్చునా?
బెగ్గిల నేలా?
మిసిమి వేకువల
పసిడిని కోరక
నరుడు నరుడుగా
పెరుగనేర్చునా?
బెగ్గిల నేలా?
కట్టిన మేడలు
కట్టినంతనే
నేలమట్టముగ
కూలినందులకు
బెగ్గిల నేలా!
సిగ్గిల నేలా? లోలో?
వెలుగు నీడల
వియ్యమందున
చిందు నోయీ
చిద్విలాసం!
సిగ్గిల నేలా? లోలో
బెగ్గిల నేలా?

## విశ్వరూపం

నిజానిజముల నెయ్యమందున
పందు నోయీ బ్రహ్మకల్పం!



తెలుపు నలుపుల వలపులందున
ఆడు నోయీ ఆదిసత్యం!
చావుబ్రతుకుల సఖ్యమందున
చెలగు నోయీ సృష్టిమర్మం!
రేయి పవళుల తీయమందున
వెలుగు నోయీ విశ్వరూపం!

## మంటలు

మంటలు! మంటలు! మంటలు! మంటలు!!
పొయ్యి పొయ్యిలో పోటిపోటి మంటలు!
కొలిమి కొలిమిలో కొరకొర మంటలు!
నెగడి నెగడిలో నిగనిగ మంటలు!
మంటలు! మంటలు! మంటలు! మంటలు!!
రవ్వల జిమ్మే రవరవ మంటలు!



మిన్నుల కెగసే మిలమిల మంటలు!
చీలిన నాల్కల చిటపట మంటలు!
మంటలు! మంటలు! మంటలు! మంటలు!!
పొగలను లేపే భగభగ మంటలు!
సెగలను కక్కే భుగభుగ మంటలు!
జగములు నిండే ధగధగ మంటలు!
మంటలు! మంటలు! మంటలు! మంటలు!!
అడవి నడిమిలో, కడలి కడుపులో,
కొండ చరియలో, గుండె మడతలో,
మింటి వంపులో, కంటి లోతులో
మంటలు! మంటలు! మంటలు! మంటలు!!
వెల్గుల, జిల్గుల వెచ్చని మంటలు!
చిందుల, విందుల అందపు మంటలు!
చేరని తీరం చిత్రపు మంటలు!
మంటలు! మంటలు!



మంటలు! మంటలు!!
జాతి భేదముల ఘాతల మంటలు!
యుద్ధ భయమ్ముల ఉద్ధతి మంటలు!
అణ్వస్త్రమ్ముల ఆహుతి మంటలు!!
మంటలు! మంటలు!
మంటలు! మంటలు!!

## స్తోమత

వినగలవానికి  వినిపించునురా
వినువీధులలో  వీణారావం!
కనగలవానికి  కనిపించునురా
మునిమాపులలో  పినాకినృత్యం!
చవిగలవానిని   కవియించునురా
చంచల నేత్రాంచల  మృదుహాసం!
ఎదగలవానిని  కదలించునురా
మూకవేదనల శోకావేగం!
కలగనువానిని కులికించునురా
ఇలాతలము పై వెలయని సత్యం!
పసగలవానిని పలికించునురా
ఊహల కందని ఉదాత్తలోకం!

## జంట స్వరాలు

కాసుకైనా, వాసికైనా
దాసుడైతే గాసిరా!
నక్క దగ్గర, కుక్కదగ్గర
నిక్క మాడిన చిక్కురా!

ఇచ్చుకున్నా, పుచ్చుకున్నా
చచ్చులుంటే రొచ్చురా!
తోడులేనిది, జోడులేనిది.
వేడుకైనా పీడరా!

కష్టమైనా, నష్టమైనా
ఇష్టమైనది యింపురా!
చాటుమాటకు, పోటుమాటకు
కోటలైనా క్రుంగురా!
అందమున్నా, చందమున్నా
పొందు లేనిది పోలిరా!
కుంటిదైనా, గ్రుడ్డిదైనా
అంటియున్నది ఆలిరా!



సిద్ధుడైనా, బుద్ధుడైనా
క్రుద్ధుడైతే కోతిరా!

జీవుడైనా, దేవుడైనా
చేవ తగ్గిన చావురా!

## వర్షం

వర్షం వర్షం వర్షం
చిటచిట, తటతట, జొటజాట,
ఇటనట వర్షం వర్షం
వర్షం వర్షం గలగల, జలజల, పలపల, ఇలనిల
వర్షం వర్షం వర్షం వర్షం
దడదడ, బడబడ, గడగడ, ఎడనెడ వర్షం వర్షం
వర్షం వర్షం
తళతళ మెరుపుల, ఫెళఫెళ పిడుగుల
వర్షం వర్షం



వర్షం వర్షం
గబగబ గాలుల,
దబదబ కుండల
వర్షం వర్షం వర్షం వర్షం
గిరులకు మెరుగుల,
ఝరులకు పరుగుల వర్షం వర్షం.
వర్షం వర్షం తరులకు పులకల,
గరికల మొలకల వర్షం వర్షం
వర్షం వర్షం చిందుల వాగులు,



సందడి నాగులు వర్షం వర్షం
వర్షం వర్షం పొంగుల యేరులు,
బంగరు తేరులు వర్షం వర్షం
వర్షం వర్షం
త్రుళ్ళిన చెరువులు. తెళ్ళిన కరవులు
వర్షం వర్షం వర్షం
పొర్లిన దొరువులు, తగ్గిన బరువులు



వర్షం వర్షం వర్షం వర్షం
కర్షకలోకం కలలకు కర్షం
వర్షం వర్షం వర్షం వర్షం
తీరిన తర్షం, మీరిన హర్షం వర్షం వర్షం

## ఊరూ, పేరూ

(గేయ కావ్యం)



ఊరే లేదు; ఊరుకు నోరే లేదు:
దారిని పోయేవారిని
మన దే వూ?" రని అడగకపోతే!
ఊరే లేదు; ఊరుకు సౌరే లేదు:
వరుసలు, వావులు వెదకుచు,
ఏవో సరసము లాడకపోతే!
ఊరే లేదు; ఊరుకు జోరే లేదు:
పెళ్ళికి, పేరంటానికి మావూరు
వీధులు ఫెళ ఫెళ లాడకపోతే!
ఊరే లేదు; ఊరుకు దారే లేదు:
ఆపద వేళల పూర్వపు పెరము
లన్నియు వుంచుకపోతే!
ఊరే లేదు; ఊరుకు పేరే లేదు:
ఇంకొక వూ రేదైనను,
దానికి వంకల నెన్నకపోతే!

## మఱ్రిచెట్టు




మా వూరు మధ్యలో మఱ్రి చెట్టుండు
మఱ్రి కొమ్మల నుండు ఎఱ్ర యెఱ్రని పండ్లు
ఆ పండ్లు తినుటకై అందాల పులుగులు
మూక మూకగ వచ్చి మురిపించుచుండు
మా వూరుమధ్యలో మఱ్రి చెట్టుండు
మఱ్రి యూడలు కొన్ని మధ్యలో వ్రేలు
ఆ యూడలు తూగు టుయ్యాల కాగ
పిల్ల జెల్లల నవ్వు వినిపించుచుండు
మా వూరు మధ్యలో మఱ్రి చెట్టుండు
మఱ్రియాకులు కోయ కుఱ్రవా డెక్కు
ఆ కుఱ్ర కోసిన ఆకులను కుట్ట
ఆ పూట కొక పైస అగపించుచుండు
మా వూరుమధ్యలో మఱ్రి చెట్టుండు
మఱ్రి నీడలలోన మా వూరు కొలువుండు
ఆ కొలువు కూటాన అన్నింటిపై చర్చ
కొద్ది గొప్పలు లేక కొనసాగుచుండు

## వసంతం

వలపులు చిందగ వచ్చె నదే
అలరు పసందుల ఆమని లేమ
పచ్చని చీరతో, పచ్చని రైకతొ
పచ్చిక బాటల వచ్చె నదే
కుచ్చుల జడలో విచ్చిన పూలతొ
అచ్చెరు వొందగ ఆమని లేమ
వలపులు చిందగ వచ్చె నదే
అలరు పసందుల ఆమని లేమ
తక్కుచు, తారుచు, తావుల జిమ్ముచు
పక్కున నవ్వుచు వచ్చె నదే
దిక్కుల నన్నిటి సొక్కుల జేయుచు
అక్కడ మొప్పగ ఆమని లేమ
వలపులు చిందగ వచ్చె నదే
అలరు పసందుల ఆమని లేమ.
తేటుల గొంతుతొ చీటికి మాటికి
పాటలు పాడుచు వచ్చె నదే
తోటల నీడల నీటుగ, గోటుగ
ఆటల నాడుచు ఆమని లేమ
వలపులు చిందగ వచ్చె నదే
అలరు పసందుల ఆమని లేమ

మాయని ప్రేమల తీయని తేనెలు
పాయలు కట్టగ వచ్చెనదే కోయిల
"కో" యన "కోకో" యనుచును
హాయిని తొల్పుచు ఆమని లేమ
వలపులు చిందగ వచ్చె నదే
అలరు పసందుల ఆమని లేమ

## గ్రీష్మం

ఎండ లెండ లెండలూ మండు టెండలూ
తీగ లాకు లెండిపోవ, వాగు వంక లింకిపోవ
ఎండ లెండ లెండలూ మండుటెండలూ
పచ్చగడ్డి భగ్గుమనగ, పక్షిగూళ్లు మాటుమణగ
ఎండ లెండ లెండలూ
మండుటెండలూ
చెరువు మోము చిన్నవోవ;
చేప గుండె చెదరిపోవ
ఎండ లెండ లెండలూ
మండుటెండలూ
నదులనోరు పిడచకట్ట.
చదలజడల చిచ్చుపుట్ట
ఎండ లెండ లెండలూ
మండు టెండలూ
ఎండమావు లాడుచుండ
బండరాళ్లి ప్రేలుచుండ
ఎండ లెండ లెండలూ
మండు టెండలూ
చేలు నెర్రె లిచ్చుచుండ,
తేలు, నెర్రి వచ్చుచుండ
ఎండ లెండ లెండలూ
మండు టెండలూ
చెవుల గాడ్పు కొట్టుచుండ,
చెమట కాల్వ కట్టుచుండ
ఎండ లెండ లెండలూ
మండు టెండలూ
"ముంజె" లన్న కేక రాగ,
బొండమన్న కోర్కె రేగ
ఎండ లెండ లెండలూ
మండు టెండలూ
మావి యొకటి మురిసిపోవ,
మల్లి యొకటి మెరసిపోవ
ఎండ లెండ లెండలూ, మండు టెండలూ

## వర్షర్తువు

తడవ కొక్క తీరుగా
పడును వాన జోరుగా
ఏరువాక సాగగా
ఏగుదెంచు జాలుగా!
ఆకుమడులు పోయగా
ఆదరించు జాయగా!
తడవ కొక్క తీరుగా
పడును వాన జోరుగా
దుక్కి దున్ను చుండగా
చక్కవచ్చు సన్నగా.
నాట్లు వేయుచుండగా
నాట్యమాడు భామగా
తడవ కొక్క తీరుగా
పడును వాన జోరుగా
కఱ్ఱ చేయుచుండగా
కనికరించు మెండుగా!
కలుపు తీయుచుండగా
చెలిమి చూపు నిండుగా!
తడవ కొక్క తీరుగా
పడును వాన జోరుగా
పొట్టమీద నుండగా
పొంత నిలుచు నండగా!
కంకివేయు చుండగా
కదలిపోవు చల్లగా!
తడవ కొక్క తీరుగా
పడును వాన జోరుగా
మెట్టపైర్లు పండగా
చెట్ట వట్టు దిట్టగా!
చెట్టు చేమ పొంగగా
చెంతజేరు ముద్దుగా!
తడవ కొక్క తీరుగా
పడును వాన జోరుగా
ఉరుము మెరుపు తోడుగా
చెరువు దొరువు నింపుగా!
కరువు పరుగు లెత్తగా
తరుముకొనుచు పోవుగా!
తడవ కొక్క తీరుగా
పడును వాన జోరుగా
కేకి పురిని విప్పగా
వాక లగుచు వచ్చుగా!
రైతు భక్తి యొక్కగా

ప్రీతి దీవ నిచ్చుగా!
తీరుగా పడును వాన జోరుగా
తడవ కొక్క

శరత్తు……

వెన్నెల కాలం, వరి
వెన్నుల కాలం
వన్నెల, చిన్నెల విరి
కన్నెల కాలం
కండెల కాలం,నీ
రెండల కాలం
బెండలు, బీరలు తెగ
పండిన కాలం
జున్నుల కాలం, తరి
వెన్నల కాలం
గిన్నెల నిండుగ పెరు
గన్నపు కాలం
చల్లని కాలం, సిరి
కొల్లల కాలం
తెల్లని మబ్బుల లే
మల్లెల కాలం
చిరు మంచుల కాలం
కంచెకు పూతల సరి
గంచుల కాలం
అంచల కాలం,
చెందుల కాలం, కల
కందల కాలం
దండలు కట్టిన ఒక
మండలి కాలం
మిరపల కాలం, చిరు
మెరపుల కాలం
అరవిరి గుమ్మడి కను
గిరుపుల కాలం
కలువల కాలం, తెలి
వలువల కాలం
కిలకిలలా డెడు పలు
పులుగుల కాలం
పంటల కాలం, పన
జంటల కాలం
పంట వలంతికి జే
గంటల కాలం
వెన్నెల కాలం, ఎద
క్రొన్నన కాలం
అన్నుల మిన్నకు సరి
వన్నెల కాలం

జీవితం

కొందరి జీవిత మేమో
అందము చిందునురా
కన్నులు తెరిచే విరిలా!
మిన్నుల మెరిసే గిరిలా!
కొందరి జీవిత మేమో
విందుకు పిలుచునురా
ప్రీతిని చూపే నుడిలా!
భీతుల నుడిపే గుడిలా!
చిందులు తొక్కునురా
కొందరి జీవిత మేమో
గలగల పారే లా!
వలపులు మీరే హృదిలా!
కొందరి జీవిత మేమో
పందిరి కెక్కునురా
ఎండను కుడికే లతలా!
గుండెలు కలిపే జతలా!
కొందరి జీవిత మేమో
సందడి చేయునురా
ఆటల కురికే బడిలా!
ధాటిగ కురిసే జడిలా!
కొందరి జీవిత మేమో



పందెము లోడ్డునురా

హద్దును నరికే కవిలా!

ప్రొద్దును తరిమే రవిలా!

కొందరి జీవిత మేమో

తొందర పెట్టునురా

దొరికీ దొరకని గనిలా!

తొలగీ తొలగని శనిలా!

కొందరి జీవిత మేమో

గొందులు పట్టునురా

దొంగకు దొరికిన సిరిలా!

ఇంగిత మెరుగని కరిలా!

కొందరి జీవిత మేమో

నిందలు మోయునురా

పెనిమిటి మెచ్చని సతిలా!

జనులకు నచ్చని యతిలా!

కొందరి జీవిత మేమో

మందను కలియునురా



దారిని పొర్లే శిలలా!

పోరున దొర్లే తలలా!

కొందరి జీవిత మేమో

చిందర వోవునురా

ఒడ్డున విరిగిన అలలా!

అడ్డము తిరిగిన కలలా!

కొందరి జీవిత మేమో

కొండల పరచునురా

ఆశకు పేర్చిన చితిలా!

ఆర్తికి కూర్చిన ప్రతిలా!